ఆర్షవిద్యా తరంగిణి

# బ్రహ్మసూత్రములు-చతుస్సూత్రీ

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# BRAHMA SUTRAS - chatussutri



అశరీరతా హి మోక్షః - సశరీరతా హి సంసారః

**తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

First Edition -Sankara Jayanthi, 6th May 2022
1000 copies

Title - Brahma Sutras – Chatussutri
Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP - Sri S Rajendra Kumar 98661 15622

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 350

# బ్రహ్మయజ్ఞం

**శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽ_దేయమ్। శ్రియాదేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్॥** – తైత్తిరీయం.

ఈ వేదవాక్యాలకు ధీటుగా నిలిచారు **శ్రీ గొంగాళ వేంకట రమణమూర్తిగారు, వారి సహధర్మచారిణి సుజాతగారు.** శ్రీ రమణమూర్తిగారు మొట్టమొదటిసారిగా మా ఆన్‌లైన్ క్లాసులో పరిచయమై, బ్రహ్మసూత్రములు బోధ వింటున్న తొలిరోజుల్లోనే ఈ బ్రహ్మయజ్ఞానికి తను ఆర్థికసహాయాన్ని అందిస్తానని చెప్పి వారి సహృదయాన్ని మాకు చవి చూపించారు.

**శ్రీ రమణమూర్తిగారు** వివిధ కంపెనీల్లో 38 సంవత్సరాలు బాధ్యతలను నిర్వర్తించి, ఉద్యోగవిరమణ అనంతరం జీవనప్రయాణాన్ని వానప్రస్థాశ్రమదిశగా మలుచుకుని, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని గురువులు, **బ్రహ్మశ్రీ బొందు చంద్రశేఖరం ఆచార్యులను** తమ ఆధ్యాత్మిక గురువర్యులుగా చేసుకుని వారి వద్ద 2012 నుండి బ్రహ్మవిద్య నేర్చుకుంటున్నారు. వేదాంత గ్రంథాలు చదువుతూ, ఆధ్యాత్మిక ప్రవచనాలు వింటూ జీవనాన్ని ఆనందంగా, ప్రశాంతంగా కొనసాగిస్తున్నారు.

కరోనా విజృంభిస్తున్న సమయంలో అమెరికాలో తాము ఉన్నా, ఆర్షవిద్యా తరంగిణి నిర్వహిస్తున్న భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు ఇత్యాది ఆన్‌లైన్ తరగతులు తమ ఆధ్యాత్మిక పురోగతికి మరింత దోహదం చేస్తున్నాయని హర్షాన్ని వెలిబుచ్చారు. వారికొక అమ్మాయి, అబ్బాయి. అమ్మాయి కుటుంబం వర్జీనియాలోను, అబ్బాయి కుటుంబం న్యూజెర్సీలోను ఉంటున్నారు.

**బ్రహ్మసూత్రములు (చతుస్సూత్రీ)** గ్రంథప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి బృహత్తరంగా సహకరించారు **శ్రీ గొంగాళ వేంకట రమణమూర్తిగారు, వారి సతీమణి సుజాతగారు.** వీరికి, వీరితోపాటు వీరి కుటుంబసభ్యులందరికీ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, వైదికజీవనాన్ని ఇవ్వాలని, ఈ దంపతులు సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, అందుకు ఆధ్యాత్మిక చింతనను మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 3 |
| 2. | మోక్షధామ కవాటము | 5 |
| 3. | పరమార్థానంద స్వామీజీ ప్రత్యేకత | 7 |
| 4. | ఇదేమైనా బ్రహ్మవిద్యా? | 10 |
| 5. | ఇన్నాళ్ళకు నా ఆకాంక్ష సఫలీకృతమైంది! | 13 |
| 6. | బ్రహ్మసూత్రములు –చతుస్సూత్రీ – ఉపోద్ఘాతము | 17 |
| 7. | పన్నెండు దర్శనములు – ముఖ్యమైన అంశములు | 29 |
| 8. | దశశాంతి మంత్రములు | 31 |
| 9. | బ్రహ్మసూత్రముల విహంగవీక్షణము | 51 |
| 10. | విహంగవీక్షణము – ముఖ్యమైన అంశములు | 67 |
| 11. | అధ్యాస భాష్యమ్ | 70 |
| 12. | అధ్యాస భాష్యమ్ – ముఖ్యమైన అంశములు | 105 |
| 13. | సూత్రము 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా | 111 |
| 14. | సూత్రము 1 – ముఖ్యమైన అంశములు | 156 |
| 15. | సూత్రము 2 – జన్మాద్యస్య యతః | 164 |
| 16. | సూత్రము 2 – ముఖ్యమైన అంశములు | 216 |
| 17. | సూత్రము 3 – శాస్త్రయోనిత్వాత్ | 223 |
| 18. | సూత్రము 3 – ముఖ్యమైన అంశములు | 242 |
| 19. | సూత్రము 4 – తత్తు సమన్వయాత్ | 246 |
| 20. | సూత్రము 4 – ముఖ్యమైన అంశములు | 332 |

# మోక్షధామ కవాటము

శ్రీ కె.వి. రాఘవరావు–రాజ్యశ్రీ దంపతులు నాకు 13–01–2022వ తేదీన పంపిన "బ్రహ్మసూత్రములు" (చతుస్సూత్రీ) ప్రతిని నేనే 24–01–2022వ తేదీన ఆనందంగా అందుకున్నాను. దీనికి నేను ముందుమాటను వ్రాస్తానని వారితో ఫోనులో చెప్పిన మాట నిజమే! ఐతే ముందువెనుకలు, కుడిఎడమలు, పైభాగము–దిగువభాగములు లేని "బ్రహ్మము" గూర్చి "ముందుమాట"ను వ్రాయడమేమిటి? అనే సందేహము నన్నావరించింది. అయితే సందేహనివృత్తిని చేయునదే వేదాంతము కదా! అందువల్ల ముందుమాటను వ్రాయుటకు ఉపక్రమించితిని. ఒక భవనము పైకి వెళ్ళుటకు నిచ్చెన అవసరమే! భవనముయొక్క పైభాగమును చేరుకున్న తర్వాత నిచ్చెనతో అవసరము లేదు. అదే విధముగా మన ఆధ్యాత్మిక జీవిత ప్రయాణము మన జీవితలక్ష్యము చేఱుకొనునంతవరకు సాగుచూనే యుండవలయును. గంగానదియొక్క ప్రవాహప్రయాణము గంగాసాగరమును చేఱుకొనునంతవరకు సాగుచూనే యుండును కదా!

పరమపూజ్య శ్రీ స్వామి పరమార్థానందజీ ప్రవచనములను ఆధారంగా చేసుకొని శ్రీ రాఘవరావు–రాజ్యశ్రీ దంపతులు "చతుస్సూత్రీ"ని తెలుగులో వ్రాయడం జరిగింది. అంటే పరబ్రహ్మముయొక్క పరమార్థమును తెలిసికొన్న తర్వాతనే వ్రాయడం జరిగింది. అట్లైనచో "చతుస్సూత్రీ"లో కొఱతగాని, లోపముగాని, దోషముగాని ఏముంటుంది? నిజానికి "చతుస్సూత్రీ" మోక్షధామమునకు కవాటము వంటిది. ఏల? జగద్గురు శ్రీ శంకరాచార్యుల వారు స్వయముగా తెలుగుభాషలో ఈ "చతుస్సూత్రీ" భాష్యమును వ్రాసినారా? ఏమి? అని తోచుచున్నదీ గ్రంథమును పఠించినవారికి. దీనిని నేను పూర్తిగా పఠించిన తర్వాతనే ఈ ముందుమాటను "మోక్షధామ కవాటము" అను శీర్షికతో వ్రాయుటకు సాహసించితిని. "**అశరీరతా హి మోక్షః – సశరీరతా హి సంసారః**" అనునది ఈ చతుస్సూత్రీయొక్క సారాంశము.

ఈ చతుస్సూత్రీలో అచ్చటచ్చట కొన్ని హాస్యపూరితములగు వృత్తాంతములు చొప్పించబడుటచే చదువరులకు నవ్వు పుట్టించి "హ–హా–హ–హా" యనునట్లొనర్చి హృదయమును రంజింపజేయుటయే గాక, నిగూఢములైన ఆధ్యాత్మిక

తత్త్వరహస్యములను ప్రస్ఫురింపజేయును. ఇట్లు "చతుస్సూత్రీ" యొక్క ప్రకాశము చతుర్దిశలలో వెలుగొందుచుండును. ఎవరికి? దీనిని నిష్ఠతో పఠించి సవ్యముగా అర్థమొనర్చుకొన్నవారికి. ఇందు నిమిత్తమై ఎవరైనను కేవలము జీవితసంరక్షణకై ఏదో ఒక వృత్తినవలంబించుచు, శేషించిన సమయమునంతటిని మానవజీవిత లక్ష్యమను మోక్షమును పొందుటకు మాత్రమే వినియోగింపవలసి యుండును. ఇట్లొనర్చుటకై జీవితపరమార్థము నెఱిగిన గురుదేవుని దరిజేరవలసియుండును.

మీ హస్తములయందున్న ఈ గ్రంథమును ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు, ప్రతి భగవద్భక్తుడు, ప్రతి ఆత్మజిజ్ఞాసువు, ప్రతి ముముక్షువు అవశ్యముగా పఠింపవలసియున్నది. ఈ గ్రంథరచనచే శ్రీ రాఘవరావు–రాజ్యశ్రీ దంపతులు ప్రస్థానత్రయమును పూర్తిచేసి తమ జీవితములను సార్థకమొనర్చుకొనిరి. ఇట్టి పుణ్యదంపతులపై శ్రీ సద్గురు శివానందస్వాముల వారి దివ్యానుగ్రహము, శ్రీ సద్గురు దయానందస్వాముల వారి దివ్యాశీస్సులు, శ్రీ సద్గురు పరమార్థానందస్వాముల వారి దివ్యకృప ఎల్లవేళలలో నిండుగా వర్షింపబడుటకై నేను ఆ పరబ్రహ్మమును హృదయ పూర్వకముగా ప్రార్థించుచున్నాను.

**ఓం తత్ సత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఇట్లు
**స్వామి హంసానంద**
**దివ్యజీవన సంఘము**
**ఋషీకేశ్**

**04-02-2022**
**శుక్రవారము**

# పరమార్థానంద స్వామీజీ ప్రత్యేకత

అభ్యసించారు వేదాంతవిద్యను మూడు వత్సరాలు సాందీపనిలో
బోధించారు తిరిగి సంస్కృతంలో కూడా అటువంటి మరొక కోర్సులో
కొనియాడారు పూజ్యస్వామీజీని దయానందరూపం మదాచార్యమీదేగా
స్తుతించారు గురువైన చిన్మయానంద స్వామిని ఆచార్య దేవోభవగా
కురిపిస్తూనే ఉన్నారు అద్వైతామృతవర్షిణిని చెన్నైలో నాలుగు దశాబ్దాలుగా
ఖ్యాతిపొందారు దిగదిగంతాలలో అద్వైతగురువుగా తనదైన ప్రత్యేక శైలిలో
నిలిచారు శాస్త్రానికి ప్రతీకగా శాస్త్రమే ఆయన ఊపిరిగా చేసుకుని

**– అనన్య గురువు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ, స్వామి పరమార్థానందజీ.**

పరమార్థానంద స్వామీజీ కేరళలో పట్టభద్రులై, సాందీపని సాధనాలయంలో మూడు సంవత్సరాల కోర్సును 1976–79 వరకూ అభ్యసించారు. ఆ కోర్సును తీర్చిదిద్ది, ఎందరో ముముక్షువులకు మోక్షాన్ని ప్రసాదించిన గురుదేవులు దయానంద స్వామీజీ అన్నా, చిన్మయానంద స్వామీజీ అన్నా ఎనలేని గౌరవాభిమానాలు ఉన్నాయి.

ఆ స్ఫూర్తితో తను నేర్చుకున్న విద్యను నలుగురికీ పంచాలనే దీక్షతో చెన్నైలో అద్వైత వేదాంతబోధను చేపట్టారు. తర్వాత 1984లో సన్న్యాసదీక్షను తీసుకున్నారు.

'శ్రీ స్వామి పరమార్థానందజీవద్ద శాస్త్రశ్రవణం నాకు వరతుల్యం. ఆర్షవిద్యా గురుకులం కోయంబత్తూరులో, నేను చదువుకుంటున్న రోజులలో స్వామీజీ మాకు అతిథి ఆచార్యులుగా విచ్చేసేవారు. అప్పుడు స్వామీజీ ప్రత్యక్ష సన్నిధిలో శ్రీ విద్యారణ్య విరచిత వేదాంత పంచదశీ ఆంగ్లంలో, ఈశావాస్యోపనిషత్తు మూల ప్రవచనం ప్రప్రథమంగా సంస్కృతభాషలో వినే అవకాశం లభించింది. నా స్మృతిపథంలో ఇది ఒక మరుపురాని ఘట్టం,' అంటున్నారు స్వామినీ ఆత్మలీనానంద సరస్వతీజీ.

వేదాంత విద్యార్థి సంఘ ట్రస్ట్‌ను స్థాపించి, తద్వారా చెన్నై నగరంలో గత నాలుగు దశాబ్దాలుగా నిరాటంకంగా, నిర్విరామంగా, అలుపెరుగకుండా అద్వైతబోధను ఆంగ్లంలో చేస్తూనే ఉన్నారు.

భగవద్గీతను, ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రములను, అనేక ప్రకరణ గ్రంథాలను ఒకసారి కాదు, రెండు మూడుసార్లు బోధిస్తూనే ఉన్నారు. అద్వైత వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలు, సమర్థవంతమైన గురువు దగ్గర శ్రవణం చేయాలి అని పదేపదే చెబుతారు. అలా ఒక క్రమపద్ధతిలో అద్వైత వేదాంతాన్ని బోధించుకు వస్తున్నారు. ముందు అద్వైత వేదాంత పరిచయం, తత్త్వబోధ బోధించి, భగవద్గీత బోధించి, దశ ఉపనిషత్తులను (ఉపనిషత్తుల బోధకు కూడా ఒక వరుసక్రమం ఉంది) బోధించి, మొత్తం 555 బ్రహ్మసూత్రములనూ బోధించారు.

ఒక్కొక్కటీ పూర్తికావటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. భగవద్గీత సంవత్సరం పొడుగునా ఎక్కడో ఒకచోట చెబుతూనే ఉంటారు. అది ప్రతి ఒక్కరికీ చేరాలనే ఆయన ఆశయం. భగవద్గీత మూలం ముందు బోధించి, ఉపనిషత్తులూ, బ్రహ్మసూత్రములూ అయ్యాక, భగవద్గీత భాష్యం బోధించారు. భగవద్గీత మూలం డిగ్రీ అయితే, ఉపనిషత్తులు పి.జీ. అయితే, బ్రహ్మసూత్రాలు పి.హెచ్.డీ. అనీ, భగవద్గీత భాష్యం పోస్ట్ డాక్టరల్ రిసెర్చనీ అంటారు స్వామీజీ.

ఉపనిషత్తులను కూడా మూడు స్థాయిల్లో బోధిస్తారు. ఉపనిషత్తుల మూలం చెప్పాక, ఆయా ఉపనిషత్తుల భాష్యం చెప్పారు. మూడవస్థాయిని అనుభూతి ప్రకాశిక అంటారు. విద్యారణ్యులవారు ఉపనిషత్తులకు వ్రాసిన భాష్యాలు అవి. ఆ అనుభూతి ప్రకాశికను శంకరభాష్యంతో పోలుస్తూ చెబుతారు. ఇవికాక ఆయన బోధించిన, బోధిస్తున్న ప్రకరణ గ్రంథాలు, తక్కిన వేదాంత గ్రంథాలు ఎన్నో! వాటిలో కొన్ని – ఆత్మబోధ, వేదాంత పంచదశి, నైష్కర్మ్యసిద్ధి, విచారసాగరం, వివేకచూడామణి, ఉపదేశసాహస్రి, రామగీత, ఉద్ధవగీత.

ఇంత చేస్తున్నా చాలా నిగర్వి, నిరాడంబరజీవి. సోషల్ మీడియాకి రావటానికి సుతరామూ ఇష్టపడరు. ఆయన నలభై సంవత్సరాలుగా బోధిస్తూ వస్తున్న ఎన్నో ప్రసంగాలను శాస్త్రప్రకాశికలో వేనవేల సీ.డీ.ల ద్వారా పొందుపరిచి, ప్రపంచంలో ఏ మారుమూల మీరున్నా కూడా క్షణంలో మీరు కొనుక్కునేలా శాస్త్రప్రకాశిక ఏప్‌ను ఏర్పరిచిన వారి సేవ అమోఘం. చెన్నైలో ఉన్న వారి కార్యాలయానికి వెళ్ళి, అక్కడున్న వేదాంతభాండారాన్ని చూస్తే రెండు కళ్ళు చాలవు. శాస్త్రప్రకాశిక ఏప్‌ను డౌనులోడ్ చేసుకుని మీకు కావలిసిన ఆడియో ఫైల్స్‌కు డబ్బు కడితే, చిటికెలో ఆడియో ఫైల్స్ మీ ఫోనులో వచ్చి చేరుతాయి.

ఇది ఒక అమోఘమైన సేవ అయితే కోయంబత్తూరులో ఉన్న ఆర్షఅవినాష్ బృందం చేస్తున్న సేవ మరొక అద్భుతమైన సేవ. అందులో ఒక బృందం (పదిమంది దాకా ఉంటారు) స్వామీజీ చేసిన బోధను యథాతథంగా, పుస్తక రూపంలో, ఆంగ్లంలో, క్లాస్‌నోట్స్ రూపంలో వేలకొద్దీ పుటలతో ఒక వెబ్‌సైట్‌లో పెట్టారు. దాన్ని కనుగొన్న రోజున నా ఆనందం వర్ణనాతీతం.

Veni vidi vici - I came, I saw, I conquered

నేను వచ్చాను, నేను చూశాను, నేను విజయం పొందాను. అక్షరసత్యం! బోధను ప్రత్యక్షంగా వినలేకపోయినా, సీ.డీ.లు కొనుక్కోలేకపోయినా, ఆన్‌లైన్లో వారు పెట్టినవి డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. ఆ వెబ్‌సైట్ పేరు https://arshaavinash.in/

స్వామీజీ చెన్నైలో, వివిధ ప్రాంతాల్లో, వివిధ సమయాల్లో, వివిధ గ్రంథాలను బోధిస్తున్నారని చూశాము. వారంలో నాలుగురోజులు ఎనిమిది క్లాసులు తీసుకుంటారు. ఈ రోజుల్లో బోధిస్తున్నవి – భగవద్గీత, ఉద్ధవగీత, పంచదశి, గీతాపారాయణం, ధ్యానం, విచారసాగరం, మాండూక్య భాష్యం. వాటి వివరాలు వేదాంత విద్యార్థి సంఘ్ వెబ్‌సైట్‌లోకి https://www.yogamalika.org వెళితే దొరుకుతాయి. వారి Email: mantraglobus@gmail.com. స్వామీజీ బోధను మూడు స్థాయిల్లో నేర్చుకునేలా ఒక కోర్సును తయారుచేశారు. అదికూడా శాస్త్రప్రకాశికలో, క్యాటలాగ్‌తోపాటు దొరుకుతుంది.

ఇన్ని రకాలుగా స్వామీజీ బోధ మనందరకూ అందుబాటులో ఉన్నందుకు మనం ఎంతో అదృష్టవంతులం. ఆయన బోధ ఆంగ్లంలో ఉంటుందని భయపడనవసరం లేదు. చాలా తేలికగా అర్థమయ్యే భాషలో, మనం ఆయన బోధ వింటూ నోట్సు రాసుకునేంత నిదానంగా చెబుతారు. ఒక్కొక్క విషయాన్ని ముందు పాయింట్లుగా చెప్పి, మళ్ళీ విడమర్చి చెబుతూ, మళ్ళీ సారాంశాన్ని చెబుతూ ఒక గ్రంథం చెప్పటం ముగిసేసరికి మన మనస్సులో అది హత్తుకు పోయేలా చేస్తారు. అంతేకాదు, అందులో మనం పరీక్ష రాసి, డిస్టింక్షన్‌తో పాసవకపోతే అడగండి!

అందువల్ల ఈ తెలుగు అనువాదాల దగ్గరే ఆగిపోకుండా, మీరంతా సాక్షాత్తూ పరమార్థానంద స్వామీజీనుంచి జాలువారిన బోధను ఆస్వాదించి మీ జీవిత పరమార్థాన్ని పొందుతారని ఆశిస్తున్నాము. **– మద్దూరి రాజ్యశ్రీ**

# ఇదేమైనా బ్రహ్మవిద్యా?

**మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥**

అనన్యగురువు బోధిస్తే, మనం వద్దనుకున్నా బోధ అర్థమయిపోతుందని స్వామీజీ చెప్పిన మాట ఆయనకి అక్షరాలా సరిపోతుంది. మావారు రాఘవరావు గారు, నేనూ చిన్మయా మిషన్‌లో జరిగే భగవద్గీత బోధలకు, ఉపనిషత్ బోధలకూ వెళుతుండేవారము. ఆ రోజులలో దైవసంకల్పంలా శ్రీ హంసానంద స్వామీజీ నుంచి మావారికి పోస్ట్‌లో బ్రహ్మసూత్రములు గ్రంథం వచ్చింది. దాన్ని ఆయన ఆసాంతం చదివి, ఇంకా బ్రహ్మసూత్రాల లోతులు కొలవాలని నెట్‌లో వెతికితే, పరమార్థానంద స్వామీజీ చేసిన 389 తరగతుల ఆడియో దొరికింది.

పంచభక్ష్య పరమాన్నం తిన్నంత మురిసిపోయి, వాటిని శ్రద్ధగా రోజూ వినటం మొదలుపెట్టాము. అంత జటిలమైన అంశాన్ని అంత సుస్పష్టంగా ఇంగ్లీషులో క్లాసులో విద్యార్థులకు బోధించినట్టుగా ఉండేసరికి ఎలాగో పట్టుకుని, ఆయన ఫోను నెంబరు సంపాదించాము. వెంటనే మేము స్వామీజీకి ఫోన్ చేశాము.

స్వామీజీ ఆశ్రమం ఎక్కడ ఉందో చెబితే, వచ్చి అక్కడ నెలరోజులు ఉండి ప్రత్యక్షంగా ఆయన బోధలను వింటామని చెబితే, మేం ఆశ్చర్యపోయేలా ఆశ్రమమేమీ లేదనీ, తానొక్కరే ఉంటానని, కాకపోతే చెన్నైలో పొద్దున్న, సాయంకాలం వివిధ ప్రాంతాలలో బోధ చేస్తాననీ చెప్పారు. వెంటనే ఇద్దరం చెన్నై వెళ్ళి అక్కడ చాలారోజులు ఉండి వారి బోధలను తనివితీరా విన్నాము. అంతేకాకుండా అడపాదడపా వెళుతూనే ఉంటాము.

అలా వెళ్ళిన ఒకసారి నేను బ్రహ్మసూత్రములు (చతుస్సూత్రీ)లోని మొదటి సూత్రాన్ని స్వామీజీ చెప్పిన అంశాలన్నింటినీ పొందుపరుస్తూ ఒక వ్యాసంగా ఇంగ్లీషులోనే రాసి స్వామీజీకి చూపించాను. (నేను ఇంగ్లీషు లెక్చరర్‌ను అవటం నాకు తోడ్పడింది). స్వామీజీ అది శ్రద్ధగా చదివి బాగుందని మెచ్చుకున్నారు. మాకు తెలుగుభక్తిపేజీస్ (www.telugubhakti.com) అని ఒక వెబ్‌సైట్ ఉందనీ, అందులో పెట్టవచ్చా అని అడిగితే, పెట్టమని అంగీకారం తెలిపారు. స్వామీజీ

ఇచ్చిన ప్రోత్సాహంతో మళ్ళీ ఈ చతుస్సూత్రీని స్వామీజీ చెప్పినంత వివరంగానూ ఇంగ్లీషులో రాసి మా వెబ్‌సైట్‌లో పెట్టాము.

ఇదేమైనా బ్రహ్మవిద్యా? ఈ నానుడి బాగా ప్రచారంలో ఉంది. బ్రహ్మవిద్యనేర్చుకోవటం చాలా కష్టమనీ, అందులోనూ బ్రహ్మసూత్రములు ఇంకా చాలా కష్టమని అందరూ అంటారు. పి.హెచ్.డి. స్థాయి అని స్వామీజీ కూడా అంటారు. కాని మంచి గైడ్ దొరికితే, పి.హెచ్.డి. ఎంత సులువుగా చేయవచ్చో స్వామీజీ మనకు గురువుగా దొరికితే అంతకన్నా సులువుగా ఆకళింపు చేసుకోవచ్చు.

బ్రహ్మసూత్రములను న్యాయప్రస్థానం అంటారు. అందులో అనేక వాదోపవాదాలు ఉంటాయి. వేదపూర్వభాగాన్ని నమ్మేవారిని పూర్వమీమాంసకులనీ, పూర్వపక్షులనీ అంటారు; అద్వైత వేదాంతాన్ని పాటించే వారిని సిద్ధాంతి అంటారు. బ్రహ్మసూత్రములను వ్యాసాచార్యులవారు రచించారు, దానికి భాష్యం శంకరాచార్యులవారు రచించారు. దానికి ఉపనిషత్తుల్లోని అనేక వాక్యాలను ఉటంకిస్తారు.

అందువల్ల బ్రహ్మసూత్రములలో ఒక విషయం చర్చిస్తున్నప్పుడు అది ఉపనిషత్తు వాక్యం అవవచ్చు; వ్యాసాచార్యులవారి సూత్రం కావచ్చు; శంకరులవారి భాష్యం కావచ్చు; పూర్వమీమాంసకుల వాదన (అందులో మళ్ళీ అనేక దార్శనికులు ఉన్నారు) కావచ్చు. వీరిలో ఎవరు చెప్పారో అంత తేలిగ్గా తెలియదు. స్వామీజీ, 'ఎవరు చెప్పారు?' అని ప్రత్యేకించి అడిగి, మరీమరీ వారి వాదనను వినిపించేవారు. ముఖ్యంగా సిద్ధాంతి జవాబు చెప్పేటప్పుడు, మీకు ప్రశ్న అర్థం కాకపోతే, ఆ జవాబుని ఆస్వాదించలేరు అని చెప్పి ముందు క్లాసులో గంటసేపు ప్రశ్నను విడమర్చి చెప్పినా, మళ్ళీ దాన్ని వివరించేవారు. శంకరాచార్యులవారు పూర్వపక్షుల వాదనను వినిపించేటప్పుడు, అంతా వారి పక్షంగా చెప్పి, వారిదే సబబు అనిపించేలా చెప్పి, వారి వాదనను కూకటివేళ్ళతో సహా పెకళించివేస్తారు. దీన్ని **సాలంకృత శిరచ్ఛేద న్యాయం** అంటారు అని చెప్పేవారు స్వామీజీ.

ఇవికాక, మనకి రాగల సందేహాలను ప్రవేశపెడుతూ, వాటికి సమాధానాలు చెబుతూండేవారు. ఇక్కడ మీకు సందేహం రావాలి; రాకపోతే నేను మీకు కలుగజేస్తాను అని చెప్పి మరీ ఆ సందేహాన్నీ, దానికి జవాబునీ కూడా విడమర్చి చెబుతారు. ఒక్కోచోట మీరు ఆనందిస్తున్నారా, నేను చాలా ఆనందిస్తున్నాను

అని తన్మయత్వంగా చెబుతారు. అసలు ఆమాటకొస్తే బ్రహ్మసూత్రములు బోధ ఆరంభంలోనే ఇలా చెబుతారు 'నిజానికి బ్రహ్మసూత్రములు నేర్చుకోకపోయినా ఫర్వాలేదు. నా ఆనందంకోసం నేను చెబుతున్నాను.'

నాకు బ్రహ్మసూత్రముల్లో మూడవ అధ్యాయంలో కొన్ని నచ్చాయనీ, అవి మా సత్సంగ్ సభ్యులకు బోధ చేయవచ్చా అనీ స్వామీజీని నేను అడిగాను. స్వామీజీ ముందు చతుస్సూత్రీ చెప్పాక, తర్వాత ఏది కావాలంటే అది చెప్పమన్నారు. ఇప్పుడు కోవిడ్‌వలన మేం M.S.Teamsలో ఆన్‌లైన్ క్లాసులు మొదలుపెట్టాము. అవి ఓం ప్రథమంగా నేను బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీతో ఆరంభించాను. సత్సంగ్ సభ్యులు దాన్ని తేలికగా అందుకున్నారు. స్వామీజీ చెప్పినట్టు వారికన్నా ముందు నేను చాలా ఆనందాన్ని పొందేదాన్ని. అందులో ఘట్టాలు చిన్న కోర్టు సీన్స్‌లాగా ఉంటాయి. ప్రతి క్లాసు అయ్యాక, గడచినక్లాసు పాఠం సత్సంగ్ సభ్యుల్లో ఒకరు రీకాప్ చేసేవారు. వాదనలు ఉన్నచోట ఇద్దరు, దాని ముందు వివరణ ఉంటే, కొండొకచో సూత్రధారిని కూడా ప్రవేశపెట్టి ముగ్గురు నాటకీయంగా చెప్పేవారు. దానిని ప్రతి ఒక్కరూ బాగా ఇష్టపడేవారు; దానివల్ల బాగా అర్థమయిందనేవారు. సత్సంగ్ సభ్యులు ఆన్‌లైన్‌లో వేదాంతం శ్రవణం చేస్తున్నారు. మర్నాడు ఆడియోలో మరికొంతమంది వినేవారు.

నాలుగవ సూత్రమునకు ఉన్న వాదోపవాదాలను 21 ప్రశ్నలు, జవాబులుగా చేసి, ముగ్గురు సూత్రధారులను ప్రవేశపెట్టి, మొత్తం 45మంది సభ్యులతో గంటపైన చెప్పించాము. అది వారందరికీ ఒక మరుపురాని, మరువలేని అనుభవం.

భగవద్గీతను మూడు షట్కములుగా తెలుగులో ప్రచురించి, స్వామీజీచే ఆవిష్కరణ చేయించే సమయంలో, 'ఇలా భగవద్గీతను పుస్తకరూపంలో ప్రచురించిన ఘనత మీకే దక్కింది,' అని మా దంపతులను స్వామీజీ మనసారా అభినందించారు. ఈ బ్రహ్మసూత్రములు (తక్కిన మా ప్రచురణలు)యొక్క సాఫ్ట్‌కాపీ www.telugubhakti.com లో చూడవచ్చు. మా M.S.Teams classని ఆర్షవిద్యా తరంగిణి పేరిట యూట్యూబ్‌లో కూడా చూడవచ్చు. ఇలా మేము బోధించి, యూట్యూబ్‌లో వినిపించి, స్వామీజీ బోధనలను పుస్తకాలరూపంలో అందజేయగలిగేలా చేసిన, మన గురువులు పరమార్థానంద స్వామీజీ అపార కరుణాకటాక్షాలకు ప్రణమిల్లుతున్నాము. **–మద్దూరి రాజ్యశ్రీ**

# ఇన్నాళ్ళకు నా ఆకాంక్ష సఫలీకృతమైంది!

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్**

**అస్మదాచార్యపర్యంతం వందే గురుపరంపరామ్**

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన పూజ్యశ్రీ స్వామి పరమార్థానందజీకి శ్రద్ధాభక్తి పురస్కార పూర్వకమైన ప్రణామములర్పిస్తూ, స్వామివారు ఆంగ్లంలో ప్రసంగాలు చేసిన బ్రహ్మసూత్రములు (చతుస్సూత్రీ)యొక్క తెలుగు అనువాదంపై నాలుగు మాటలు ఆనందంగా చెప్పబూనుకున్నాను.

ఆర్షవిద్యా ఆచార్య పరంపరలో శ్రీ స్వామి పరమార్థానందజీ శ్రేష్ఠులు, జగద్విఖ్యాతులు. వారు చెన్నపట్టణంలో గత 45 సంవత్సరాలుగా అనేక ఉపనిషత్తులను, ఆచార్యుల వారి ప్రకరణగ్రంథాలను, భగవద్గీతను పలుచోట్ల ప్రసంగాలు చేస్తూ వస్తున్నారు. వారి సేవ అమోఘం. స్వామీజీయొక్క వస్తునిష్ఠ, సమన్వయ దృష్టి, విద్వత్తు, ప్రతిభ, శైలి చాలా అద్భుతంగా ఉంటుంది. ఏ విషయం చెప్పినా కూడా చాలా నిదానంగా, దృష్టాంతాలతో, సామాన్యులకు కూడా అర్థమయ్యే పదప్రయోగంతో హృదయానికి హత్తుకునేలా వివరించటంలో వారికి వారే సాటి. దశోపనిషత్తులు మూలం, భాష్యాలు కూడా అనేకసార్లు బోధించారు. మొదటిసారి వినలేనివారికి రెండోసారి వినటానికి ఉపయుక్తంగా ఉంటుంది.

నేను చెన్నైవాసినవటంవల్ల వారివద్ద శాస్త్రశ్రవణం నాకు వరతుల్యం. స్వామీజీ ఇచ్చిన సలహాలు, సూచనలు నాకు మార్గదర్శకంగా ఎప్పటికీ ఉంటాయి. నాకు ఏదైనా సందేహం కలిగితే, స్వామీజీ దగ్గరికి వెళ్ళి నివృత్తి చేసుకుంటుంటాను. నేను చిన్నవయస్సులోనే వేదాంతగ్రంథాలు చదువుతూ వస్తున్నా కూడా కొన్ని సందేహాలు అలా నిలిచిపోయాయి. స్వామీజీ ప్రసంగాలు వినటం ఆరంభించాక, స్వామీజీ అనుగ్రహంతో నా సందేహాలన్నీ పటాపంచలు అయ్యాయి. వేదాంతశాస్త్రంమీద ఒక పట్టు వచ్చినట్టుగా తెలుస్తోంది.

అసలు మనం ప్రత్యేకించి ఆయనను సందేహాలు అడగనవసరంలేదు కూడా. ఆయన బోధలోనే ఎవరికైనా ఈ సందేహం రావచ్చు అని ఆయనే దాన్ని చెప్పి,

దానికి జవాబు చాలా స్పష్టంగా చెబుతారు. ఉపనిషత్తులతోపాటు తత్త్వబోధ, వివేకచూడామణి, వేదాంతపంచదశిలాంటి ఎన్నో ప్రకరణ గ్రంథాలను, రామగీత, ఉద్ధవగీత, అష్టావక్రగీత కూడా బోధిస్తుంటారు. ఏది బోధించినా అన్నింటిలోనూ అద్వైతసారాంశాన్ని తీసుకువచ్చే ప్రతిభ వారిది.

స్వామీజీ ఇంకొక ప్రత్యేకత – ఒక్కొక్క శ్లోకాన్ని సంపూర్ణంగా, వ్యాకరణంతో సహా చెబుతారు. ఏ గ్రంథం బోధించినా దానికి ముందుగా ఉపోద్ఘాతం చెప్పి, మళ్ళీ చివర్లో దాని సారాంశం చెబుతారు. అప్పుడు అందులో ముఖ్యమైన శ్లోకాలను కూడా పేర్కొంటారు. వారి క్లాసు మిస్సయితే సిడీలో వినటానికి వీలుగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు వచ్చిన కరోనా విపత్తు సందర్భంగా ఆన్‌లైన్లో మాండూక్యోపనిషత్తు, విచారసాగరము, ఉద్ధవగీత బోధిస్తున్నారు. అవికాక అనుభూతి ప్రకాశిక అని విద్యారణ్యులవారి గ్రంథాలు కూడా మళ్ళీ చెబుతున్నారు. ఇలా ఎంతో అమోఘమైన సేవ చేస్తున్నారు.

వివరంగా వేదాంత శ్రవణం చేయాలనుకునేవారికి స్వామి పరమార్థానందజీ దగ్గర కూర్చుని వింటేనే సంపూర్ణత కలుగుతుందని చెప్పటంలో అతిశయోక్తి లేదు. వేసవికాలంలో తప్ప సంవత్సరం పొడుగూతా చెన్నైనగరంలో అనేకచోట్ల బోధ చేస్తూంటారు. ప్రతి ఒక్క శ్లోకానికి ప్రతిపదార్థము, సమన్వయము, తాత్పర్యము, భాష్యము, వ్యాకరణాలను జోడించి, తనదైన శైలిలో హాస్యం కూడా మేళవించి, గృహస్థ శిష్యులకు అర్థమయ్యేరీతిలో చెప్పటంలో నిష్ణాతులు స్వామీజీ.

నాకు చాలాసార్లు స్వామీజీ బోధను తెలుగులో ఎవరూ అనువదించటం లేదు; తెలుగు శిష్యులు ఎవరూ ఆయనకు లేరేమో అనిపించేది. నా భావాలను స్వామీజీతో కూడా వెలిబుచ్చేవాడిని. 'స్వామీజీ, మీ ప్రసంగాలన్నీ గాలిలో వెళ్ళిపోతున్నాయి. ఎవరూ వాటిని పుస్తకరూపంలో తెలుగులో గాని, ఇంగ్లీషులో గాని రాయటం లేదు.' స్వామీజీ చిరునవ్వులు చిందించేవారు తప్ప ఏమీ అనేవారు కాదు. తర్వాత ఆర్ష అవినాష్ బృందం ఇంగ్లీషులో స్వామీజీ బోధలను యధాతథంగా పి.డి.ఎఫ్. ఫైల్స్‌ను అందిస్తున్నారు. అది చూసి మురిసిపోయాను కాని ఒక తెలుగువానిగా మన తేటతెనుగులో స్వామీజీ బోధ వస్తే మన తెలుగువారికి ఎంత భాగ్యమో అనుకుంటుండేవాడిని. ఎప్పటికన్నా ఆయన గ్రంథాలు తెలుగులో వస్తాయి అనిపించేది.

రెండు సంవత్సరాల క్రిందట పరిచయమయిన శ్రీమతి రాజ్యశ్రీ–శ్రీ రాఘవరావు దంపతులు పూజ్యశ్రీ స్వామీజీయొక్క ప్రస్థానత్రయ బోధను వారియొక్క బ్రహ్మాభ్యాస నిదిధ్యాసన జీవనంలో జిజ్ఞాసువులకు శాస్త్రాన్ని బోధించటమే కాక, అమూల్యమైన బోధను తెలుగులోకి అనువదించి, పుస్తకరూపంలో తెలుగువారికి అందించే బృహత్ గురుసేవలో తత్పరులై తరిస్తున్నారని తెలిసింది. వారి ఉపనిషత్తులు, భగవద్గీతను అందుకున్నప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. స్వామీజీ బోధను ప్రత్యక్షంగా ఆంగ్లంలో వినటంవల్ల వీరు స్వామీజీ బోధకు ఎంతవరకు న్యాయం చేసారో చూడాలనే కుతూహలంతో చదవటం మొదలుపెట్టాను.

కాని అది చదువుతుంటే, స్వామీజీ ముందు కూర్చుని ఆయన చేస్తున్న ఆంగ్లబోధను ప్రత్యక్షంగా వింటున్నట్టే అనిపించింది. ఉన్నదున్నట్లు చెబుతున్నాను. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. చక్కగా, సులభమైన, తేటతెలుగులో అందరికీ అర్థమయ్యేలా, యథాతథంగా, ఉన్నదున్నట్లుగా, మార్పులు చేర్పులు లేకుండా, అనవసరమైనవి చొప్పించకుండా రాసిన ప్రతిభకు నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

పది ఉపనిషత్తులు, భజగోవిందం, అద్వైత వేదాంత పరిచయం, దృక్‌దృశ్య వివేకం, వేదాంతజీవన విధానం ప్రచురించారు. అవికాక భగవద్గీత మూడు షట్కాలలో ప్రచురించారు. స్వామీజీ బోధననుసరించి **బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీ** ఇప్పుడు తెలుగులో ప్రచురించబోతున్నారు. బ్రహ్మసూత్రములను బోధించటమే చాలా కష్టం. ఆ బోధను మన స్వామీజీ మాత్రమే చేయగలరు. ఆయన ప్రతిభ అమోఘం. స్వామీజీ బాగా అర్థమయ్యేరీతిలో, చాలా సులభంగా చెప్పారు. దానికి న్యాయం చేకూర్చారు రాఘవరావు–రాజ్యశ్రీ దంపతులు. అలాగే వీరు కూడా సులభమైన రీతిలో, స్పష్టంగా, విపులంగా, చాకచక్యంగా అనువదించారు. ఇది చాలా గొప్ప సేవ. ఇలా చేయాలంటే దీనికి చాలా ప్రజ్ఞ కావాలి. కాని వారికి ఇది చైల్డ్‌ప్లే లాగా చాలా ఆశువుగా ఉంది. వారు ఏదైనా అతి సులభంగా రాయగలరని నాకు అర్థమయింది.

అంతకుముందెప్పుడో నేను బ్రహ్మసూత్రములను విని ఆనందించాను. ఇప్పుడు మళ్ళీ దాని లోతులు తెలుసుకుని, దాన్ని అనుభవించి, ఆస్వాదించేలా చేశారు ఈ దంపతులు. వీరిని పోల్‌స్టార్ అనవచ్చు. స్వామీజీ హైదరాబాద్

రాలేకపోయినా, వారి తరపున, వారి ఆశీస్సులతోనూ, వారి శక్తితోనూ, వారి అనుగ్రహంతోనూ, తెలుగువారికి ఎంతో సేవ చేస్తున్నారు. ఇది ఒక బృహత్ గురుసేవ. ఇందులో తత్పరులై ఈ దంపతులు తరిస్తున్నారు.

ఇప్పుడు ఈ ప్రణాళికలో భాగంగా వెలువడిన **బ్రహ్మసూత్రములు –చతుస్సూత్రీ** మీ చేతిలో ఉంది. ఆ దంపతులకు శ్రీ దక్షిణామూర్తి అనుగ్రహాన్ని కోరుతున్నాను.

**బాల సుబ్రహ్మణ్యం**

రిటైర్డు కెమిస్ట్రీ ప్రొఫెసర్

పాండిచ్చేరీ ఇంజనీరింగ్ కాలేజీ

# బ్రహ్మసూత్రములు -చతుస్సూత్రీ
# ఉపోద్ఘాతము

బ్రహ్మసూత్రములు వ్యాసాచార్యులచే (బాదరాయణులచే) విరచితమైన ఆధ్యాత్మగ్రంథము. సూత్రం అంటే ఎంతో అద్భుతమైన అర్థాన్ని చిన్నివాక్యంలో పొందుపరుచుకున్నది అని అర్థం.

555 బ్రహ్మసూత్రములు ఉన్నాయి. ఈ సూత్రములు బ్రహ్మ గురించి చెబుతాయి కాబట్టి వీటిని బ్రహ్మసూత్రములు అంటారు.

మన సాంప్రదాయంలో జ్ఞానబోధ శ్రుతిప్రధానంగా జరిగింది కాని వ్రాతపూర్వకంగా జరగలేదు. గురుశిష్య పరంపరగా అందజేయబడింది. అంటే గురువు చెప్పింది శిష్యుడు విని నేర్చుకుని, తన శిష్యులకు అతను గురువుగా బోధ చేస్తాడు. అందువల్ల మన ప్రధానశాస్త్రాలు అయిన వేదాలను శ్రుతులు అని కూడా అంటారు. వేదాలను తేలికగా గుర్తుంచుకోవటంకోసం, రెండు మార్గాలను చూస్తాము.

1. సూత్రం రూపంలో పొందుపరచటం. ఎన్నో పుటలలో చెప్పే అంశాలను చిన్న సూత్రంలాగా చెబుతారు. అలా మన లౌకిక విద్యలో కూడా చిన్న సూత్రాలు ఉన్నాయి. అందరికీ తెలిసినది $E=MC^2$. అలాగే తెలుగు ఛందస్సు గుర్తుంచుకోవటానికి **యమాతారాజభానస(లగం)** నేర్చుకున్నాము.

2. పద్యరూపంలో పొందుపరచటం. రామాయణం కథ గుర్తుంచుకోవాలంటే చాలా కష్టం. అందువల్ల అది తేలికగా గుర్తుంచుకోవటానికి పద్యాలుగా, పాటలుగా మలచారు.

బ్రహ్మసూత్రములలో మొత్తం వేదాంతసారాన్ని 555 సూత్రములలో పొందుపరిచారు వ్యాసాచార్యులు. వాటిని ఒక పుస్తకంలో రాస్తే పట్టుమని పది పేజీలు కూడా ఉండవు. కాని ఒక్క సూత్రాన్ని వివరించటానికి గట్టిగా పది పేజీలు కూడా చాలవు. బ్రహ్మసూత్రములలో మొదటి నాలుగు సూత్రములు చాలా ముఖ్యమైనవి. వాటిని **చతుస్సూత్రీ** అంటారు. వాటిని వివరించటానికే ఎన్నో గ్రంథాలు రాసినవారు ఉన్నారు.

బ్రహ్మసూత్రములు ఉద్గంథ్రంలో వ్యాసాచార్యులు మూడు గురుతరమైన బాధ్యతలను చేపట్టారు.

**1 ఉపనిషత్ మంత్రాల విశ్లేషణ –** ఎన్నో ఉపనిషత్తులు ఉన్నా, వాటిలో పది ఉపనిషత్తులు ముఖ్యమైనవి. వాటిని గుర్తుంచు కోవటానికి కూడా చిన్న శ్లోకం ఉంది. అది –

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

ఈ పది ఉపనిషత్తుల్లోని ముఖ్యమైన మంత్రాలను తీసుకుని వాటిని లోతుగా విశ్లేషించి, వాటిద్వారా వేదాంతసారాన్ని ఒకచోట పొందుపరిచారు. అందువల్ల బ్రహ్మసూత్రములు వ్యాసాచార్యులవారి స్వంతదర్శనం కాదు. తక్కిన దర్శనాలు చూస్తే, ఆ దర్శనాలను ఆయా ఋషులు దర్శించారు. ఉదాహరణకు సాంఖ్యదర్శనాన్ని కపిలముని దర్శించారు. కాని ఉత్తరమీమాంస దర్శనాన్ని వ్యాసాచార్యులు స్వంతంగా దర్శించలేదు. ఉపనిషత్తులో పొందుపరచిన వాటిని ఏర్చి, కూర్చి, తద్వారా ఉపనిషత్తులు బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తున్నాయని సహేతుకంగా నిరూపించారు. వేదాంతసారాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాஉపరః**

**2. పరమత ఖండన –** మనకు 12 దర్శనాలు ఉన్నాయి. ఆయా దార్శనికులు మన ఉపనిషత్తుల్లోని మంత్రాలను తప్పు పడుతుంటారు. వాళ్ళెవరూ వ్యాసాచార్యులు నిరూపించిన అద్వైతాన్ని ఒప్పుకోరు. వారి వాదనను ఖండిస్తూ, అద్వైతాన్ని నిలబెట్టాలి. ఆ బృహత్కార్యాన్ని ఇందులో చూస్తాము. అంటే ఖండమండనం చేస్తారు.

**3. పరమత దోషాలు –** ముందు వారి ఆక్షేపణలు వింటూ, దానికి జవాబులు చెబుతూ వస్తారు. తర్వాత వారి దర్శనాల్లో ఉన్న దోషాలను ఎత్తి చూపుతారు. అంటే జవాబు చెప్పుకునే స్థాయినుంచి ప్రశ్నించే స్థాయికి వస్తారు. వారు మన అద్వైతసిద్ధాంతంలో అనేక దోషాలు ఉన్నాయంటారు కాని, వారి సిద్ధాంతంలోనే అనేక లొసుగులు ఉంటే, వారికి మనను ప్రశ్నించే హక్కు ఎక్కడుంది?

**బ్రహ్మసూత్రములను నేర్చుకునే అర్హత –**

1. **తార్కికబుద్ధి ఉన్న వ్యక్తికి అర్హత ఉంది–** ఉపనిషత్తులు నేర్చుకోవాలంటే సూక్ష్మబుద్ధి ఉండాలని చూశాము. ఎందుకంటే బ్రహ్మజ్ఞానం మనం నేర్చుకునే లౌకికవిద్య కాదు. లౌకికవిద్య ఆబ్జెక్టు గురించి నేర్పిస్తే, బ్రహ్మజ్ఞానం ఆ ఆబ్జెక్టు గురించి నేర్చుకునే సబ్జెక్టు గురించి నేర్పిస్తుంది. నువ్వే ఆ బ్రహ్మవు అంటుంది. అది నేర్చుకోవటానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి.

ఇంక బ్రహ్మసూత్రముల దగ్గరికి వచ్చేసరికి సూక్ష్మబుద్ధికి తర్కం తోడై ఉండాలి. ఇందులో తీవ్రమైన వాదోపవాదాలు ఉంటాయి. పూర్వమీమాంసకుడు చేసిన వాదన చాలా నిజమనిపిస్తుంది. అద్వైతసిద్ధాంతి అంటే వ్యాసాచార్యులు దాన్ని ఖండించలేరు అనుకుంటాము. కాని ఆ వాదనను కూకటివేళ్ళతో సహా పెకళించి వేస్తారు మన సిద్ధాంతి.

దీన్ని **సాలంకృత శిరచ్ఛేద న్యాయం** అంటారు. అంటే ఉరితీసే వ్యక్తికి చక్కగా స్నానం చేయించి, మంచి బట్టలు తొడిగించి, నీటుగా గడ్డం గీయించి తర్వాత ఉరి తీస్తారు. అంటే బాగా అలకరించి, అప్పుడు ఉరి తీస్తారు. అలాగే ఉంటాయి ఈ వాదనలు కూడా. పూర్వపక్షి వాదనను చాలా వివరంగా చెప్పి, దానిలో పడిపోయే ముందు, దాన్ని ఖండించి వేస్తారు. ఆ తతంగంలో ఒక్కొక్క వాక్యాన్ని లోతుగా విశ్లేషిస్తారు. ఒక్కోసారి ఒక్కొక్క పదాన్ని లోతుగా విశ్లేషిస్తారు. దానికి వ్యాకరణం, మీమాంస, తర్కం జోడిస్తారు. ఇవన్నీ అర్థం చేసుకునే తరుణంలో చాలా తికమకపడతాము. దాన్ని తట్టుకుని నిలబడాలి.

ఆ వాదోపవాదాలను చూస్తూ, విచారణ చేస్తూ, హర్షింపగల(బ్రహ్మ జ్ఞానంలో) తర్కప్రధానమైన బుద్ధి లేకపోతే ఈ బ్రహ్మసూత్రములు చాలా నిస్సారంగా అనిపిస్తాయి.

2. **ఉపనిషత్తుల జ్ఞానం ఉన్న వ్యక్తికి అర్హత ఉంది–** ముందే చూసినట్టుగా ముఖ్యమైన పది ఉపనిషత్తులు అధ్యయనం చేసి ఉండాలి. ఎందుకంటే వాటిలోంచి వ్యాసాచార్యులు కొన్ని ముఖ్యమైన మంత్రాలను విశ్లేషిస్తారు. ఉదాహరణకు బృహదారణ్యకోపనిషత్తులో ఒకచోట ఆకాశం అంటే ఈశ్వరుడని వివరిస్తాము. అక్కడ ఆకాశాన్ని ఈశ్వరుడు అని ఎందుకంటామో చెప్పము. కాని ఇక్కడ చాలా వాదోపవాదనల తర్వాత ఆకాశం=ఈశ్వరుడు అని

నిరూపించబడుతుంది. ఆ సందర్భం తెలియకపోతే ఆ వాదనను అంతగా ఆస్వాదించలేరు. పది ఉపనిషత్తులూ కాకపోయినా ఆరు ఉపనిషత్తులు అయినా నేర్చుకుంటే ఉపనిషత్తుల సారం అర్థమై, దీన్ని చదివి ఆనందించ గలుగుతారు. మంత్రాలు బాగా గుర్తుంటే, ఇంకా బాగా ఈ గ్రంథాన్ని అర్థం చేసుకోగలరు.

వేదాంతబోధకు వచ్చిన శిష్యుడు బ్రహ్మసూత్రములు నేర్చుకుని తీరాలా?

అవసరం లేదు. భగవద్గీత, కనీసం ఆరు ఉపనిషత్తులు నేర్చుకుంటే, అది కూడా ఒక సమర్థవంతమైన గురువు దగ్గర నేర్చుకుంటే చాలు. వాటిద్వారా బ్రహ్మజ్ఞానం పొంది, మోక్షం పొందవచ్చు. ఎందుకంటే సమర్థవంతమైన గురువు చేసే బోధ బ్రహ్మసూత్రములను ఆధారం చేసుకుని ఉంటుంది. అంటే వాటిని అధ్యయనం చేస్తే బ్రహ్మసూత్రములను కూడా పరోక్షంగా అధ్యయనం చేసినట్టే. అందువల్ల ఏ కారణంవల్లనైనా బ్రహ్మసూత్రములను నేర్చుకోలేకపోతే బాధ పడనవసరం లేదు.

బ్రహ్మసూత్రములు జ్ఞానానికి అవసరం లేకపోతే, నేర్చుకోవటం ఎందుకు?

మన అద్వైతవేదాంతాన్ని బోధించే ప్రాథమిక గ్రంథాలు మూడు ఉన్నాయి. వాటిని ప్రస్థానత్రయం అంటారు. ప్రస్థాన అంటే ప్రాథమిక గ్రంథం; త్రయం అంటే మూడు. అలా మూడు గ్రంథాలు ఉన్నాయి. అవి –

1. శ్రుతి ప్రస్థానం – ఉపనిషత్తులు (ముఖ్యంగా పది)
2. స్మృతి ప్రస్థానం – భగవద్గీత
3. న్యాయ ప్రస్థానం – బ్రహ్మసూత్రములు (ముఖ్యంగా చతుస్సూత్రీ)

న్యాయం అంటే తర్కం. అందువల్ల మన అద్వైతవేదాంతాన్ని కూలంకషంగా నేర్చుకోవాలంటే మూడు గ్రంథాలనూ నేర్చుకోవాలి. అద్వైత వేదాంతాన్ని బోధ చేయాలన్నా కూడా నేర్చుకోవాలి. అప్పుడు గురువుకు సంపూర్ణజ్ఞానం కలుగుతుంది.

బ్రహ్మసూత్రములు ఎలా నేర్చుకోవాలి?

దీన్ని సూత్రంగా నేర్చుకుంటే ఏమీ అర్థం కాదు. దాని భాష్యం ద్వారా నేర్చుకోవాలి. దానికి అనేక భాష్యాలు ఉన్నాయి. అందులో శంకరభాష్యం ముఖ్యమైనది. మనం శంకరభాష్యంద్వారా బ్రహ్మసూత్రాలు నేర్చుకోబోతున్నాము.

**దర్శనాలు –**

**ఆహారనిద్రాభయ మైథునం చ**
**సామాన్యమేతత్ పశుభిః నరాణామ్**
**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః**
**బుద్ధ్యా విహీనః పశుభిః సమానః॥**

ఇది మనిషియొక్క గొప్పతనం గురించి చెబుతుంది. మనిషికీ, జంతువుకూ మధ్య నాలుగు అంశాలు సమానంగా ఉన్నాయి. అవి ఆహారం, నిద్ర, భయం, మైథునం. కాని మనిషి వీటికన్నా ఎందుకు గొప్పవాడు అంటే మనిషి బుద్ధిజీవి. మనిషి కనుక ఈ బుద్ధిని ఉపయోగించుకోకుండా, జీవితం యాంత్రికంగా గడిపేస్తే, మనిషికీ, పశువుకూ మధ్య భేదం ఉండదు.

బుద్ధివల్ల మనిషి జగత్తుతో వ్యవహారం నడపగలుగుతున్నాడు, తనకు జరిగిన అనుభవాలను విశ్లేషించుకుని, వాటినిబట్టి తన గురించి, జగత్తు గురించి కొన్ని నిర్ణయాలు తీసుకోగలుగుతాడు. అంతేకాక, తనకు కొన్ని లక్ష్యాలు ఏర్పరచుకుని, వాటిని సాధించటంకోసం ప్రయత్నిస్తాడు.

ప్రతి మనిషికీ అలా కొన్ని లక్ష్యాలు, గమ్యాలు, వాటిని సాధించే మార్గాలు ఉంటాయి. కాని కొంతమంది మాత్రం మానవజీవితం గురించి, మానవాళికుండాల్సిన లక్ష్యాల గురించి, వాటిని సాధించే మార్గాల గురించి ఆలోచిస్తారు. వారి ఆలోచనాతీరు తక్కినవారికన్నా భిన్నంగా ఉంటుంది. అంటే మామూలు మనిషి తనకైన అనుభవాలనుబట్టి కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటాడు. తనకు ఎదురుదెబ్బలు తగిలినప్పుడల్లా ఆ అభిప్రాయాలు మారిపోతుంటాయి. ఒక్కోసారి అవి మొదటి అభిప్రాయానికి వ్యతిరేకంగా కూడా ఉంటాయి.

కాని కొంతమంది నిరంతరం కొన్ని అంశాలను అధ్యయనం చేసి, వాటిని లోతుగా విశ్లేషించి, కొన్ని అభిప్రాయాలకు వస్తారు. అలా లోతుగా ఆలోచించేవారు ఆరు అంశాలను అధ్యయనం చేయాలి. అవి – జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, బంధం, ముక్తి, సాధన.

1. **జీవుడు** – నేనెవరు?
2. **జగత్తు** – జగత్తు అంటే ఏమిటి?

3. **ఈశ్వరుడు** – ఈ రెండింటి సృష్టికర్త ఎవరు?
4. **బంధం** – ఎందుకు మనిషి ఈ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు?
5. **ముక్తి** – దీనినుంచి బయటపడే మార్గం ఏమిటి?
6. **సాధన** – బంధంనుంచి ముక్తి పొందాలంటే ఏం సాధన చేయాలి?

ఈ అంశాలను లోతుగా విశ్లేషించి, ఒక సిద్ధాంతానికి రావాలి. ఆ సిద్ధాంతం మారనిదిగా ఉండాలి. అడుగడుక్కీ మారితే అది సిద్ధాంతం కాదు. ఇలాంటి సిద్ధాంతాన్ని ఏర్పరచిన వారిని **దార్శనికులు** అంటారు. వారు కనుగొన్న సిద్ధాంతాన్ని **దర్శనం** అంటారు. ఈ దార్శనికులు లేదా ఆచార్యులు వారి దర్శనాన్ని వారి శిష్యుల ద్వారా, గ్రంథాల ద్వారా, భాష్యాల ద్వారా ప్రచారం చేస్తారు.

మన భారతీయ సంస్కృతిలో మనకు పన్నెండు దర్శనాలు ఉన్నాయి. వాటిలో ఆరు నాస్తిక దర్శనాలు, ఆరు ఆస్తికదర్శనాలు. వీటి మధ్య ఉన్న భేదం ఏమిటి? నాస్తిక దర్శనం అంటే వేదాన్ని నమ్మదు ఈ దర్శనం. **వేదప్రమాణం న అస్తి** అంటారు. వారి సిద్ధాంతం ప్రత్యక్షప్రమాణం, అనుమానప్రమాణాలమీద ఆధారపడి ఉంటుంది. మామూలుగా మనం దేవుణ్ణి నమ్మనివారిని నాస్తికులు అనుకుంటాము కాని నిజానికి వేదాన్ని నమ్మనివారిని నాస్తికులు అంటారు. అలాగే ఆస్తికులు అంటే వేదాన్ని నమ్మేవారు. **వేదప్రమాణం అస్తి** అంటారు వీరు. వీటిని వివరంగా చూద్దాము.

**నాస్తిక దర్శనాలు**

ఇవి ఆరు. అవి చార్వాక దర్శనం, జైన దర్శనం, నాలుగు బౌద్ధదర్శనాలు.

1. **చార్వాక దర్శనం–** నిజానికి ఈ దర్శనాన్ని చార్వాకుడు దర్శించలేదు, కాని ఆయన ప్రచారం చేశాడు. దీన్ని బోధించినది దేవగురువైన బృహస్పతి. దీన్ని రాక్షసులను తప్పుదోవ పట్టించటానికి ఆయన బోధించాడు. ఆయన ప్రథమ శిష్యుడు చార్వాకుడు. ఈ సిద్ధాంతంలో వేదాన్ని నమ్మరు కాబట్టి వేదం చెప్పే పునర్జన్మ, స్వర్గం, నరకం, ధర్మం, ఆత్మ, అనాత్మలను నమ్మరు.

వీరు కేవలం ఇంద్రియ సుఖాలనే నమ్ముతారు. దీన్ని ఇంగ్లీషులో **మెటీరియలిజమ్** అంటారు. ఎపిక్యూరస్ అనే ఆంగ్ల సిద్ధాంతి ఈట్, డ్రింక్ అండ్ బి మెర్రీ అనేవాడు. ఇంచుమించు అలాంటిదే ఇది కూడా.

**యావత్ జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్**
**భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః**

జీవించి ఉన్నన్నాళ్ళూ సుఖంగా జీవించు అంటాడు. ఎలా జీవించాలి అంటే, అప్పు చేసైనా నెయ్యి తాగు అంటాడు. అంటే నేతితో చేసిన పిండివంటలు తిని ఆనందించాలన్న మాట. అప్పు చేసి పప్పు కూడు అంటాడు. అప్పెలా తీరుస్తావు అంటే, 'అది నా సమస్య కాదు, అప్పిచ్చిన వాడి సమస్య!' అంటాడు. తెలివైనవాడైతే అతనే నానుంచి రాబట్టుకుంటాడు అని అతని ఉద్దేశం. అలా చేస్తే పాపం అంటదా, నరకానికి పోవా అంటే, 'శరీరం కాలిపోయాక, అది నరకానికి వెళ్ళటం, తిరిగిరావటం ప్రశ్న ఎక్కడుంది?' అంటాడు.

స్థూలశరీరం కాలిపోతే, సూక్ష్మశరీరం, కారణశరీరాలు ఉన్నాయి కదా. అంటే 'వాటిని ఎవరు చూశారు? అవేవీ లేవు. ఆత్మ అంటూ ఏమీ లేదు,' అంటాడు. శాస్త్రం చెప్పింది కదా అంటే, అతను అసలు శాస్త్రాన్ని నమ్మితే కదా, శాస్త్రంలోని మాటలు నమ్మటానికి. ఈ చార్వాకదర్శనంలో శాస్త్రాన్నే కాదు అనుమాన ప్రమాణాన్ని కూడా నమ్మరు. అనుమాన ప్రమాణం అంటే తర్కప్రధానమైనది. అందువల్ల ఇతను ప్రత్యక్ష ప్రమాణవాది.

చార్వాకదర్శనం ఇది. చారు అంటే అందమైనది, వాక్కు అంటే మాట. అంటే అతని మాటలు చాలా అందంగా, తీయగా ఉండి, ఎదుటివారిని తేలికగా బుట్టలో వేసుకుంటాయి.

ఈ దర్శనాన్ని బ్రహ్మసూత్రముల్లో చర్చించరు. ఎందుకంటే ఇది చాలా ప్రాథమికంగానూ, ప్రాకృతంగానూ ఉంటుంది. మనిషి బుద్ధిజీవి అని చూశాము కదా. వీరు బుద్ధిని ఉపయోగించనప్పుడు, వీరితో వాదించి ప్రయోజనం లేదు.

2. **జైనదర్శనం–** ఈ జైనదర్శనాన్ని ఇరవయినలుగురు ఆచార్యులు చేశారు. వారిని తీర్థంకరులు అంటారు. మొదటి ఆచార్యుణ్ణి ఋషభదేవుడు అని, చివరి ఆచార్యుణ్ణి వర్ధమాన మహావీరుడు అనీ అంటారు. వర్ధమాన మహావీరునికి ఇంకొకపేరు ఉంది. అది జినః. జినః అంటే జయం.

**జయతు ఇతి జినః**

తనను తాను జయించినవాడు అంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉన్నవాడు. అతను ఈ దర్శనాన్ని బాగా ప్రచారం చేశాడు కాబట్టి జినః అనే అతని పేరునుంచి జైనదర్శనం అనే పేరు వచ్చింది.

ఇక్కడ్నుంచి ఈ దార్శనికుల బోధల వివరాలు ఇప్పుడు చూడము. ఎందుకంటే వ్యాసాచార్యులే వాటిని వివరంగా విశ్లేషిస్తారు. అప్పుడు చూద్దాము.

జైనమతంలో కూడా రెండు మతాలు ఉన్నాయి. వారిని శ్వేతంబర జైనులు, దిగంబర జైనులు అంటారు. శ్వేతంబరులు తెల్లవస్త్రాలు ధరిస్తే, దిగంబరులు వస్త్రాలు ధరించరు. అలా వీరిలో రెండు మతాలు ఉన్నా కూడా, రెండింటి సిద్ధాంతం ఒక్కటే. అందువల్ల మనం ఒక దర్శనం కిందే తీసుకుంటాము.

3. **బౌద్ధదర్శనం** – పేరులోనే ఉంది. బుద్ధభగవానుడు దర్శించిన బౌద్ధమతం. రాజకుమారుడైన సిద్ధార్థుడు కొన్ని ప్రశ్నల అన్వేషణలో రాజభోగాలను, పత్నీపుత్రులను వదిలివెళ్ళి, తపస్సు చేసి, జ్ఞానం పొందాడు. అందువల్ల బుద్ధుడు అయ్యాడు.

బుద్ధభగవానుడు ఒక క్రమపద్ధతిలో తన సిద్ధాంతాన్ని బోధించలేదు. తనను ప్రశ్నలు అడిగినవారికి ఇచ్చిన జవాబులలో ఆయన సిద్ధాంతాన్ని చెప్పించారు. అందువల్ల మొదట్లో బౌద్ధమతం గురించిన మతగ్రంథము లేదు. తర్వాత ఆయన అనుయాయులుగా అనేకమంది శిష్యులు చేరారు. వారిలో అశోకుడువంటి రాజులు కూడా ఉన్నారు.

అటువంటి ఒక రాజు, ఒక సభను ఏర్పాటు చేసి, బౌద్ధమత పండితులను సమావేశపరిచి, బుద్ధభగవానుడు చేసిన బోధను క్రోడీకరించమని కోరాడు. ఆ సభవల్ల వెలిశాయి మూడు పుస్తకాలు. వాటిని **త్రిపిటకము** అంటారు. పిటకము అంటే బుట్ట, త్రి అంటే మూడు. అవి సుత్త పిటకము, అభిధమ్మ పిటకము, వినయ పిటకము.

| | | |
|---|---|---|
| సుత్త పిటకము | – | బుద్ధుడు చెప్పిన సూత్రములు |
| అభిధమ్మ పిటకము | – | బుద్ధుడు చెప్పిన వాక్యాల ఆధారంగా ఏర్పడిన సిద్ధాంతము |
| వినయ పిటకము | – | ఆచార్యులు, బౌద్ధమతస్థులు పాటించాల్సిన నియమాలు. |

తర్వాత అనేకమంది ఈ మూడు ప్రాథమిక గ్రంథాలను విశ్లేషించి, వాటి మీద భాష్యాలు రాయటం మొదలుపెట్టారు. ఆ క్రమంలో వారిలో అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. అవి బౌద్ధమతాన్ని నాలుగుగా చీల్చాయి. అవి–

1. **సౌత్రాంత్రిక దర్శనం** – సుత్తపిటకము ఆధారంగా చేసుకుని వచ్చింది ఈ మతం.
2. **వైభాషిక దర్శనం** – అభిధమ్మపిటకము ఆధారంగా చేసుకుని వచ్చింది ఈ మతము. దానిమీద చేసిన భాష్యాన్ని విభాష అంటారు. అందువల్ల ఇది వైభాషిక మతం అయింది.

ఈ రెండింటినీ కలిపి హీనయాన మతం అంటారు.

3. **యోగాచార దర్శనం** – యోగానికి, ఆచారానికి ప్రాముఖ్యతనివ్వటంవల్ల దీనికి యోగాచారమతం అని పేరు వచ్చింది.
4. **మాధ్యమిక దర్శనం** – ఇది బుద్ధభగవానుడు బోధించిన అసలు బోధ ఆధారంగా ఏర్పడింది. అది మధ్యే మార్గంగా ఉంటుంది కాబట్టి మాధ్యమిక మతం అంటారు.

ఈ రెండింటినీ కలిపి మహాయాన మతం అంటారు.

ఈ విధంగా మనకు ఆరు నాస్తిక దర్శనాలు ఉన్నాయి. అవి చార్వాక దర్శనం, జైన దర్శనం, సౌత్రాంత్రిక బౌద్ధ దర్శనం, వైభాషిక బౌద్ధదర్శనం, యోగాచార బౌద్ధ దర్శనం, మాధ్యమిక బౌద్ధ దర్శనం. వీటిలో మొదటిది వదిలేసి, తక్కిన ఐదింటినీ బ్రహ్మసూత్రముల్లో ఖండించారు వ్యాసాచార్యులు.

**ఆస్తిక దర్శనాలు–** ఇవి కూడా ఆరు.

1. సాంఖ్య దర్శనం – కపిల ముని – సాంఖ్యసూత్రాణి
2. యోగదర్శనం – పతంజలి ఋషి– యోగసూత్రాణి
3. న్యాయదర్శనం – గౌతమ ఋషి – న్యాయసూత్రాణి
4. వైశేషికదర్శనం – కణాద ఋషి – వైశేషికసూత్రాణి
5. పూర్వమీమాంసాదర్శనం – జైమినీ ఋషి – పూర్వమీమాంసాసూత్రాణి
6. ఉత్తరమీమాంసాదర్శనం – వ్యాసాచార్యులు – ఉత్తరమీమాంసాసూత్రాణి

ఈ ఆరు దర్శనాల్లోనూ సమానంగా ఉన్న అంశం– అన్నీ వేదాన్ని ప్రమాణంగా స్వీకరిస్తాయి. అందువల్లనే వాటిని ఆస్తిక దర్శనాలు అన్నారు. కాని ఆశ్చర్యం ఏమిటంటే, అన్నీ వేదాన్ని ప్రమాణంగా నమ్మినా కూడా, వారిలో కొందరు ఈశ్వరుణ్ణి నమ్మరు. వారు సాంఖ్య, వైశేషిక, పూర్వమీమాంసకులు. వేదాన్ని నమ్మటంవరకూ వారు ఆస్తికులే, కాని భగవంతుని విషయానికి వచ్చేసరికి వారు నాస్తికులు. అందువల్ల వారిని ఆస్తిక–నాస్తికులు అంటారు కొందరు.

ఈ ఆరు దర్శనాల్లోనూ మొదటి నాలుగు దర్శనాలూ అంటే సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక దర్శనాలు వేదాన్ని ప్రమాణంగా నమ్మినా కూడా, వీరికి, తక్కిన ఇద్దరికీ చిన్న భేదం ఉంది. ఏమిటది?

ఎక్కడైనా వేదమా, తర్కమా అన్న విభేదం వస్తే వీరు తర్కానికే పెద్దపీట వేస్తారు. వేదాన్ని పూర్తిగా కాదనరు కాని, వేదం రెండవస్థానానికి వెళ్ళిపోతుంది. అందువల్ల శంకరాచార్యులు ఈ నలుగురినీ తార్కికులు అంటారు. నిజానికి నాస్తికులు కూడా తర్కానికే ప్రాధాన్యత ఇస్తారు. అయితే వారికీ, వీరికీ మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? నాస్తికులు నాస్తికతార్కికులు; ఈ నలుగురు ఆస్తికులూ ఆస్తికతార్కికులు.

ఈ నలుగురికీ తర్కం ప్రధానం, వేదం అప్రధానం అవుతుంది. ఇప్పుడు పూర్వమీమాంసకులనూ, ఉత్తరమీమాంసకులనూ తీసుకుంటే వారిద్దరికీ సమానంగా ఉన్న అంశం – తర్కానికీ, వేదానికీ మధ్య భేదం వస్తే, ఇద్దరూ కూడా వేదానికి పెద్దపీట వేస్తారు; తర్కానికి రెండవ స్థానాన్ని ఇస్తారు. వీరికి తర్కం ప్రధానం కాదు. తర్కం వేదాన్ని అర్థం చేసుకోవటానికి లేదా వేదం చెప్పినదానికి అవునని నిరూపించటానికి మాత్రమే వాడతారు.

అయితే వీరిరువురి మధ్య ఉన్న భేదం ఏమిటి? ఆ పేర్లే సూచిస్తున్నాయి. పూర్వమీమాంసా వేదపూర్వభాగానికి ప్రాముఖ్యతనిస్తే, ఉత్తరమీమాంసా వేద ఉత్తరభాగానికి ప్రాముఖ్యతనిస్తాయి. వేదంలో రెండు భాగాలున్నాయి – పూర్వభాగం, ఉత్తరభాగం. పూర్వభాగంలో కర్మకాండ, ఉపాసన కాండ వస్తాయి. రెండింటినీ కలిపి పూర్వభాగాన్ని కర్మకాండ అంటారు. వేద ఉత్తరభాగాన్ని అంతభాగం అని కూడా అంటారు. అందులో ఉపనిషత్తులు ఉంటాయి. అవి

ఆత్మజ్ఞానాన్ని లేదా బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తాయి. అందువల్ల ఉత్తరభాగాన్ని వేదాంతం, ఉపనిషత్తు, జ్ఞానకాండ అని కూడా అంటారు.

ఇప్పుడు పూర్వమీమాంసకులు వేద పూర్వభాగానికి ప్రాముఖ్యతనిస్తారు అంటే కర్మ, ఉపాసనలు చెయ్యాలి అంటారు. జ్ఞానానికి అంతగా విలువనివ్వరు. ఉత్తర మీమాంసకులు కర్మ, ఉపాసనలకు అంతగా విలువనివ్వరు, జ్ఞానమే ముఖ్యం అంటారు. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని నొక్కిచెబుతారు. ఉత్తర మీమాంసకులది అద్వైత వేదాంతం అంటారు. అద్వైతంలో కర్మ, ఉపాసనల దగ్గరే ఆగిపోకూడదు, జ్ఞానానికి రావాలి అంటారు.

ఎక్కడ్నుంచి ఎక్కడికి వచ్చామో చూశారా? ఆరుగురేమో అసలు వేదాన్నే నమ్మరు; ఇంకొక ఆరుగురు వేదాన్ని నమ్మినా, వారిలో ముగ్గురు వేదంలో చెప్పిన ఈశ్వరుణ్ణి నమ్మరు; నలుగురు వేదం అప్రధానం, తర్కం ప్రధానం అంటారు; చివరి ఇద్దరిలో ఒకరు వేదపూర్వభాగం ప్రధానం, వేద అంతభాగం అప్రధానం అంటారు; ఇంకొకరు వేద అంతభాగం ప్రధానం, వేదపూర్వభాగం అప్రధానం అంటారు. మనం ఈ చివరి దార్శనికులకు చెందుతాము. మనది అద్వైత వేదాంతం అంటారు. నిర్గుణబ్రహ్మ గురించి నేర్చుకుంటాము.

కాని అన్ని దర్శనాల్లోనూ సమానంగా ఉన్న అంశం అన్నింటిలోనూ వారి మతాన్ని సూత్రరూపంలో రచించారు వారి ఆచార్యులు. ఆ విధంగా మనకు సాంఖ్యసూత్రాణి, యోగసూత్రాణి, న్యాయసూత్రాణి, వైశేషికసూత్రాణి, పూర్వమీమాంసాసూత్రాణి, ఉత్తరమీమాంసాసూత్రాణి ఉన్నాయి.

సూత్రాణి అంటే సూత్రములు. వ్యవహారిక భాషలో సూత్రాలు. సూత్రం అంటే ఎంతో లోతైన అర్థాన్ని చిన్ని వాక్యంలో పొందుపరచటం అని చూశాము. ఈ ఉత్తరమీమాంసా సూత్రాణికే అనేక పేర్లు ఉన్నాయి. అవి –

| | |
|---|---|
| బ్రహ్మసూత్రాణి | – బ్రహ్మ గురించి చెప్పే సూత్రములు |
| వేదాంతసూత్రాణి | – వేద అంతభాగం గురించి చెప్పే సూత్రములు |
| శారీరకసూత్రాణి | – శరీరంలో ఉండే ఆత్మ గురించి చెప్పే సూత్రములు |
| వ్యాససూత్రాణి | – వ్యాసమహర్షి రచించిన సూత్రములు |
| బాదరాయణసూత్రాణి | – బదరీవనంలో ఉన్న వ్యాసమహర్షి రచించిన సూత్రములు. |

మనం వాడే పేరు బ్రహ్మసూత్రాణి లేదా బ్రహ్మసూత్రములు. సూత్రం అంటే చాలా చిన్నవాక్యంగా ఉంటుంది కాబట్టి దాన్ని అర్థం చేసుకోవటం కష్టం. ఒక్కోసారి వాక్యం పూర్తి అవదు కూడా; ఒక్కోసారి ఒకటో, రెండో పదాలు మాత్రమే ఉంటాయి. అవేమిటో అర్థం కాదు మనంతట మనం ప్రయత్నిస్తే. అందువల్ల ఈ బ్రహ్మసూత్రములను విశ్లేషిస్తూ అనేక భాష్యాలు వచ్చాయి. ఇవి కూడా రకరకాలుగా ఉన్నాయి. వాక్యం అతి చిన్నదిగా ఉండటంవల్ల అర్థం ఒక్కోసారి స్పష్టంగా ఉండదు. రచయిత ఏం చెబుదామనుకున్నాడో తెలియదు, అడగటానికి ఆయన మనకు అందుబాటులో లేదు.

ఈ సూత్రములు ఉపనిషత్తులనుంచి వచ్చినవి కదా, పోనీ ఆ ఉపనిషత్తులకే వెళ్ళి ఆ సందేహమేదో తీర్చుకుందామంటే, అక్కడే మనకి బోలెడు సందేహాలు వస్తాయి. వేదంలో ద్వైతం, అద్వైతాల రెండింటి గురించీ సమానంగా వస్తుంది. అందువల్ల వేదం అద్వైతం బోధిస్తోందా, ద్వైతం బోధిస్తోందా తెలియదు. దాన్ని రకరకాలుగా విశ్లేషిస్తూ రకరకాల భాష్యాలు వచ్చాయి.

బ్రహ్మసూత్రములకే పది భాష్యాల పైనే వచ్చాయి. అన్నింటికీ మూలం ఒక్కటే– బ్రహ్మసూత్రములు; దానికి ఆధారమైన ఉపనిషత్తులు. కాని వారి సిద్ధాంతం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వీటిలో మూడు చాలా ప్రసిద్ధి చెందినవి. అవి –

| | | |
|---|---|---|
| 1. అద్వైతం | – శారీరక మీమాంసాభాష్యం | – శ్రీ శంకరభగవత్పాదులు |
| 2. విశిష్టాద్వైతం | – శ్రీభాష్యం | – శ్రీ మద్రామానుజాచార్యులు |
| 3. ద్వైతం | – అనుభాష్యం | – శ్రీ మధ్వాచార్యులు |

మనం నేర్చుకునేది శ్రీ శంకరభగవత్పాదుల భాష్యం ఆధారంగా ఉంటుంది. బ్రహ్మసూత్రములను శారీరకసూత్రాణి అని కూడా అంటారని చూశాము కాబట్టి శంకరులవారి భాష్యాన్ని శారీరక మీమాంసాభాష్యం అంటారు. దీన్ని నిర్విశేష అద్వైతం అని కూడా అంటారు. అంటే నిర్గుణబ్రహ్మ గురించి చెబుతుంది. శంకరాచార్యుల భాష్యమే చాలా గొప్పది, శ్రేష్ఠమైనది. దాన్ని మాగ్నమ్ ఓపస్ అంటారు. ఆయన భాష్యానికి మళ్ళీ ఉపభాష్యాలు, ఆ ఉపభాష్యాలకు ఉపభాష్యాలు వచ్చాయి. ఆ విధంగా మన శాస్త్రం అనంత సాగరంలాంటిది. అందువల్ల కనీసం శంకరభాష్యంలోంచి నేర్చుకుంటే కొంతమేరకు విజయవంతమవుతాము.

***

# పన్నెండు దర్శనములు - ముఖ్యమైన అంశములు

నాస్తిక దర్శనాలు - వేదాన్ని నమ్మరు

| **దర్శనం** | **దార్శనికుడు** |
| --- | --- |
| 1. చార్వాక దర్శనం | చార్వాకుడు |
| 2. జైనదర్శనం | ఋషభదేవుడు- వర్ధమానమహావీరుడు(జినః) |

దిగంబరులు, శ్వేతాంబరులు

| | |
| --- | --- |
| బౌద్ధదర్శనం | బుద్ధుడు |

సుత్తపిటకము,అభిధమ్మపిటకము,వినయపిటకము

| | |
| --- | --- |
| 3.సౌత్రాంతిక దర్శనం | సుత్తపిటకము ఆధారంగా |
| 4.వైభాషిక దర్శనం | అభిధమ్మపిటకము ఆధారంగా |
| 5.యోగాచార దర్శనం | వినయపిటకము ఆధారంగా |
| 6.మాధ్యమిక దర్శనం | మధ్యేమార్గం |

ఆస్తిక దర్శనాలు - వేదాన్ని నమ్ముతారు

| | | |
| --- | --- | --- |
| 7.సాంఖ్యదర్శనం | కపిలముని | సాంఖ్యసూత్రాణి |
| 8.యోగదర్శనం | పతంజలిఋషి | పతంజలియోగసూత్రాణి |
| 9.న్యాయదర్శనం | గౌతమఋషి | న్యాయసూత్రాణి |
| 10.వైశేషికదర్శనం | కణాదఋషి | వైశేషికసూత్రాణి |

(తర్కప్రధానం, వేద - అప్రధానం)

11.పూర్వమీమాంసాదర్శనం జైమినిఋషి పూర్వమీమాంసాసూత్రాణి

(సాంఖ్య, వైశేషిక, పూర్వమీమాంసా- నిరీశ్వరవాదం)

12.ఉత్తరమీమాంసాదర్శనం వ్యాసాచార్యులు ఉత్తరమీమాంసాసూత్రాణి

(పై రెండూ వేదప్రధానం, తర్క-అప్రధానం)

బ్రహ్మసూత్రముల పర్యాయ పదాలు

| | |
| --- | --- |
| బ్రహ్మసూత్రాణి | - బ్రహ్మ గురించి చెప్పే సూత్రములు |
| వేదాంతసూత్రాణి | - వేద అంతభాగం గురించి చెప్పే సూత్రములు |
| శారీరకసూత్రాణి | - శరీరంలో ఉండే ఆత్మ గురించి చెప్పే సూత్రములు |

వ్యాససూత్రాణి – వ్యాసమహర్షి రచించిన సూత్రములు
బాదరాయణసూత్రాణి – బదరీవనంలో ఉన్న వ్యాసమహర్షి రచించిన సూత్రములు.

బ్రహ్మసూత్రములు – బాష్యాలు

అద్వైతం – శారీరక మీమాంసాభాష్యం – శ్రీశంకరభగవత్పాదులు
(నిర్విశేష అద్వైతం)
విశిష్టాద్వైతం – శ్రీభాష్యం – శ్రీమద్రామానుజాచార్యులు
ద్వైతం – అనుభాష్యం – శ్రీమధ్వాచార్యులు

మనం నేర్చుకునేది శారీరక మీమాంసాభాష్యం.

***

# దశశాంతి మంత్రములు

బ్రహ్మసూత్రములలోకి వెళ్ళేముందు కొన్ని శాంతిమంత్రాలను, దక్షిణామూర్తి శ్లోకాలను, మరికొన్ని శ్లోకాలను పఠిస్తారు. అందువల్ల వాటి అర్థాలను మనం ఇక్కడ టూకీగా చూద్దాము.

ఈ శాంతిపాఠాలను సాధారణంగా గురుశిష్యులు ఉపనిషత్తులు నేర్చుకునే ముందు పఠిస్తారు. అందులో ముఖ్యంగా కోరేవి ఆరోగ్యం, మేధాశక్తి, దైవానుగ్రహం, ఆటంక నివృత్తి.

**1. మం॥ ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇన్ద్రో బృహస్పతిః । శం నో విష్ణురురుక్రమః । నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥**

ఈ శాంతిపాఠం తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లీలో వస్తుంది.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు కోరుతున్నవి –

ఎ) మాంగళ్యం. అంటే శుభప్రదం చెయ్యమంటున్నాడు.
బి) హిరణ్యగర్భకు నమస్కారం చేస్తున్నాడు. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచానికి అధిష్ఠానదేవత.
సి) హిరణ్యగర్భ స్తుతి చేస్తున్నాడు.
డి) విలువలను పెంపొందించుకోవాలంటున్నాడు. సత్యం పలకాలి అంటున్నాడు.
ఇ) గురుశిష్యులను రక్షించమని వేడుకుంటున్నాడు.

**2. మం॥ ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు, మా విద్విషావహై ॥ ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

ఇది తైత్తిరీయోపనిషత్తులోని బ్రహ్మానందవల్లీలో వస్తుంది.

ఎ) గురుశిష్య రక్షణ
బి) గురుశిష్య ప్రయత్న రక్షణ

గురువు బాగా బోధ చెయ్యటానికి, తద్వారా శిష్యునికి అర్థమయ్యేలా చెప్పటానికి కృషి చేయాలి. అలాగే శిష్యుడు కూడా శ్రద్ధగా వినాలి. శిష్యుడు కేవలం స్తబ్ధుగా వినకూడదు. తను కూడా గురువు చెప్పింది తిరిగి చెప్పగలిగివుండాలి.

గురుశిష్యులు దీనికోసం ప్రయత్నం చెయ్యాలి. అది క్లాసులోనే కాదు, ముందు కూడా చాలా కృషి చేయాలి. గురువుకు తను చెప్పబోయేది సరియైన అవగాహన లేకపోతే సరిగ్గా చెప్పలేడు. శిష్యుడు గురువు ముందురోజు చెప్పింది గుర్తు తెచ్చుకోకపోతే, గురువు చెప్పినదాన్ని పూర్తిగా గ్రహించలేడు. అసలు అర్థంకాదని చెప్పటం లేదు, కాని ఆ బోధకు పూర్తి న్యాయం జరగదు.

సి) గురుశిష్యుల సౌహార్దం – గురుశిష్యుల మధ్య మంచి అనుబంధం ఉండాలి. ఎక్కడైనా ఇద్దరి మధ్య అనుబంధం చెక్కుచెదరకుండా ఉండాలంటే, వారి మధ్య సరియైన అవగాహన ఉండాలి. గురుశిష్యుల మధ్య చక్కని అనుబంధం నెలకొనాలంటే గురువుకు తన శిష్యునిమీద అభిమానం, ప్రేమ ఉండాలి; శిష్యునికి గురువుమీద శ్రద్ధ, నమ్మకం ఉండాలి. కుటుంబంలో ఈ అవగాహన లేకపోతే కుటుంబం నిలబడదు; గురు–శిష్యుల మధ్య ఈ అవగాహన లేకపోతే విద్య నిలబడదు.

**3. మం॥ ఓం యశ్ఛన్దసామృషభో విశ్వరూపః। ఛన్దోభ్యో౽ధ్యమృతాత్సంబభూవ। స మేన్ద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవ ధారణో భూయాసమ్ । శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశో౽సి మేధయా పిహితః । శ్రుతం మే గోపాయ॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

ఇది కూడా తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లిలో వస్తుంది. ఇది మేధాశక్తి కోసం చేసే గొప్ప ప్రార్థన. శిష్యుడు ఈ క్రింది విషయాలకోసం ప్రార్థిస్తాడు –

| | |
|---|---|
| ఎ) గ్రహణశక్తి | – గురువు చెప్పినది అర్థం చేసుకునే శక్తి |
| బి) జ్ఞానం | – జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం |
| సి) శరీర యోగ్యత | – ఈ బృహత్కార్యంలో శరీరం, మనస్సులు సహకరించు గాక |
| డి) శ్రవణం | – నిరాటంకంగా శాస్త్రాన్ని వినగలిగే శక్తి |
| ఇ) ధారణశక్తి | – విన్న జ్ఞానాన్ని మనస్సులో నిలుపుకునే శక్తి. |

మేధాశక్తి = గ్రహణశక్తి + ధారణశక్తి

శిష్యుడు గురువు చెప్పింది శ్రద్ధగా వినాలి. అర్థమైనదాన్ని నిలుపుకోవాలి. అంటే గురువు కన్నా శిష్యుని బాధ్యత ఎక్కువ ఉంటుంది. గురువు బాగా చెప్పగలగాలి. కాని శిష్యునికి నాలుగు బాధ్యతలున్నాయి. శిష్యుడు క్రమం తప్పకుండా వెళ్ళాలి, శ్రద్ధగా నేర్చుకోవాలి, పొందిన జ్ఞానాన్ని మనస్సులో నిలబెట్టుకోగలగాలి, నిలబడిన దాన్ని మళ్ళీ తిరిగి చెప్పగలగాలి.

4. **మం। ఓమ్ అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశఙ్కోర్వేదానువచనమ్ ॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

ఇది కూడా తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లీలో వస్తుంది. ఇది కూడా చాలా ప్రసిద్ధి చెందిన మంత్రం. ఆత్మజ్ఞానసిద్ధికోసం చేసే గొప్ప జపం. ముందు మంత్రం మేధాశక్తిసిద్ధికోసం చేస్తే, దీన్ని జ్ఞానసిద్ధికోసం చేస్తారు.

త్రిశంకోర్వేదాను వచనం – త్రిశంకు అనే ఋషి చెప్పిన మాటలను మనం తిరిగి చెపుతున్నాము. ఆ ఋషి జ్ఞానం పొందాక, ఆనందంతో పలికిన మాటలివి.

ఎ) **ఈశ్వరశక్తి** – ఈశ్వరునితో సమానం. నాకు ఈశ్వరునికి ఉన్నంత శక్తి ఉంది అంటున్నాడు.

బి) **ఈశ్వరవిభూతి** – నేను ఈశ్వరుడంత గొప్పవాణ్ణి. ఈశ్వరునికి ఉన్న విభూతులన్నీ నాకూ ఉన్నాయి.

సి) **ఈశ్వరజ్ఞానం** – నేను సర్వజ్ఞుణ్ణి. నాకు గొప్ప జ్ఞానం అయిన బ్రహ్మజ్ఞానం ఉంది.

ఇప్పుడిప్పుడే ఉపనిషత్తుల్లోకి అడుగుపెడుతున్న శిష్యునికి ఈ మంత్రం యొక్క గొప్పతనం అర్థం కాకపోవచ్చు, కాని అదే శ్రద్ధతో అతను నేర్చుకుంటే, తను కూడా ఒక శుభోదయాన త్రిశంకునిలా తన ఆనందాన్ని చాటి చెప్పవచ్చు.

5. **మం॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥**

ఇది చాలా ప్రఖ్యాతి చెందిన శాంతిమంత్రం. ఇది శుక్లయజుర్వేదములోని బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది. దీనిలో వేదాంతసారం అంతా మూడు వాక్యాల్లో వచ్చేస్తుంది.

ఎ) **జీవాత్మ పరమాత్మ ఐక్యం** – పూర్ణమదః పూర్ణమిదం – అది పూర్ణం, ఇది పూర్ణం అంటే జీవాత్మ, పరమాత్మలు రెండూ పూర్ణం. రెండు పూర్ణాలు ఉండవు కాబట్టి జీవాత్మ = పరమాత్మ. ఇది పారమార్థిక స్థాయికి చెందిన సత్యం.

బి) **కార్యకారణ సంబంధం** – పూర్ణాత్ పూర్ణముదచ్యతే – పూర్ణమైన బ్రహ్మనుంచి పూర్ణమైన జగత్తు వచ్చింది. అంటే బ్రహ్మ సృష్టికర్త; జగత్తు, జీవుడు కార్యం. అందువల్ల కార్యకారణ సంబంధం ఉంది. ఇది వ్యావహారికస్థాయికి చెందిన సత్యం.

సి) **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** – పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే. పూర్ణం లోంచి పూర్ణం తీసేస్తే పూర్ణమే మిగులుతుంది. జగత్తంతా బ్రహ్మ ఉన్నాడు. జగత్తులోంచి బ్రహ్మను తీసేస్తే ఏమవుతుంది? జగత్తు ఉంది అనకూడదు, జగత్తు ఉన్నా లేనట్టే. బ్రహ్మ లేకుండా జగత్తుకు ఉనికి లేదు. అందువల్ల బ్రహ్మలోంచి జగత్తును తీసేస్తే బ్రహ్మ మాత్రమే ఉంది, జగత్తు లేదని అర్థం. ఇందులో వేదాంతసారం రెండు ముక్కల్లో వస్తుంది–
**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

6. **మం॥ ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని। వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం । మాహం బ్రహ్మ నిరాకుర్యామ్। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥**

ఇది సామవేదానికి చెందిన శాంతి మంత్రం. దీన్ని ఛాందోగ్యోపనిషత్తులోనూ, కేనోపనిషత్తులోనూ చూస్తాము. ఈ క్రింది విషయాలను కోరుకుంటున్నాడు శిష్యుడు.

ఎ) శరీర యోగ్యత – శరీర ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటున్నాడు. శరీరం అంటే మనస్సు కూడా వస్తుంది. అంటే స్థూల, సూక్ష్మ శరీరాలు

వస్తాయి. ఉపనిషత్తుల్లో మనం శరీరం అనాత్మ అని నేర్చుకున్నా, శరీరాన్ని నిర్లక్ష్యం చెయ్యమని చెప్పదు శాస్త్రం. శరీరం సహకరించకపోతే ఆత్మజ్ఞానం పొందలేము; మనస్సు సహకరించకపోతే ఆత్మజ్ఞానాన్ని అర్థం చేసుకోలేము.

బి) శ్రద్ధ – బ్రహ్మమీద శ్రద్ధ ఉండాలి. ఉపనిషత్తులకు రాగానే నేర్చుకునే మొట్టమొదటి అంశం బ్రహ్మ జ్ఞానేంద్రియాలకు అందదు, కర్మేంద్రియాలకు అందదు, మనస్సు పోలేదు, వాక్కు వర్ణించలేదు, ప్రమాణాలకు అందదు, వ్యవహారానికి అందదు అని. ఇవన్నీ వినేసరికి, నీరుగారిపోయి అసలు అటువంటి బ్రహ్మ ఉన్నాడా అని సందేహం కలుగుతుంది. మనం నిర్గుణబ్రహ్మ గురించి చెబుతామని చూశాము కదా.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్। – ఛాందోగ్యమ్**

సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. కాని ఎన్నో దర్శనాల్లో ప్రస్థానత్రయాన్ని అధ్యయనం చేసినా కూడా, నిర్గుణబ్రహ్మ లేనే లేదనేస్తారు. అందువల్ల నిర్గుణబ్రహ్మ లేదని శిష్యుడు తేలికగా అనేసే ప్రమాదముంది. అందువల్ల మాహం బ్రహ్మ నిరాకుర్యాత్ అంటున్నాడు శిష్యుడు. నేను బ్రహ్మను నిరాకరించకుండుగాక. నాకు ఇప్పుడు అర్థం కాకపోవచ్చు, కాని ఎప్పుడో ఒకప్పుడు అర్థం అవచ్చు. బ్రహ్మ ఎవరో కాదు, నేనే అని నేను అర్థం చేసుకోవటానికి నాకు కొంత సమయం పట్టవచ్చు, అంతవరకూ నాకు నేను నేర్చుకున్న జ్ఞానంమీద శ్రద్ధ ఉండుగాక.

సి) ఈశ్వర అనుగ్రహం – మా మా బ్రహ్మ నిరాకుర్యాత్ – బ్రహ్మ నన్ను నిరాకరించకుండుగాక. నాకు శ్రద్ధ ఏర్పడేటట్టు ఈశ్వరుడు నన్ను అనుగ్రహించు గాక.

డి) దైవీసంపత్తి – జ్ఞానం పొందటానికి అవసరమైన విలువలను నేను పెంపొందించుకొందును గాక – **ధర్మాః తే మయి సంతు**

**7. మం॥ ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్। ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః। శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహో రాత్రాన్సందధామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతుమామ్। అవతువక్తారమ్। అవతువక్తారమ్॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥**

ఇది ఋగ్వేదానికి చెందిన శాంతిమంత్రం. దీన్ని ఐతరేయోపనిషత్తులో చూస్తాము. ఈ క్రింది విషయాలను కోరుకుంటున్నాడు శిష్యుడు.

ఎ) ఆర్జవం – మనస్సులో వాక్కు, వాక్కులో మనస్సు నిలబడేలా చేయి. మనసా వాచా కర్మణా ఒక త్రాటిమీద నిలబడేలా చెయ్యి.

బి) గ్రహణం – బోధను నేను వినేలా చెయ్యి. నా అంతట నేను బోధకు వెళ్ళకపోయినా, అది నా చెవిలో ఏదో విధంగా (ఎవరో పెట్టిన క్యాసెట్ ద్వారా అయినా) పడేలా చెయ్యి.

సి) ధారణం – నేను నేర్చుకున్నదాన్ని నా మనస్సులో నిలబడేలా చెయ్యి.

డి) అనుసరణం – నేను నేర్చుకున్న అంశం నేను ఆచరించేలా చెయ్యి. నేను నేర్చుకునేది ఒకటి, ఆచరించేది ఇంకొకటిగా ఉండకూడదు.

ఇ) గురుశిష్య రక్షణం – ఈ జ్ఞానయజ్ఞం నిరాటంకంగా సాగేటందుకు వీలుగా గురుశిష్యులిద్దరికీ మంచి ఆరోగ్యం ఉండేలా చెయ్యి.

8. **మం॥ ఓం భద్రం నో అపివాతయ మనః ॥ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

ఇది చాలా చిన్న ఋగ్వేదమంత్రం కాని దీన్ని రెండు రకాలుగా విశ్లేషించవచ్చు. రెండూ చూద్దాము.

ఎ) **వాతయ నః మనః** – ఓ వాయుదేవా, నువ్వు నా మనస్సును సుతారంగా, భద్రం – బ్రహ్మ వైపుకు మళ్ళించు. అంటే ఓ దేవా, నా మనస్సును బ్రహ్మజ్ఞానం వైపుకు మళ్ళించు అని అర్థం.

బి) **మనః అభివాతయ నః** – ఓ మనసా, నన్ను బ్రహ్మజ్ఞానం వైపుకు మళ్ళించు.

ఎటువైపు చూసినా అంటే వాయువును కోరినా, మనస్సును కోరినా అడిగేది ఒక్కటే. నన్ను బ్రహ్మజ్ఞానం వైపు మళ్ళించు.

9. **మం॥ ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రంపశ్యేమాక్షభిర్యజత్రాః। స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః। స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః ।**

**స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

ఇది అథర్వణ వేదానికి చెందిన మంత్రం. దీన్ని ముండక, మాండూక్య, ప్రశ్న, కైవల్య ఉపనిషత్తుల్లో చూస్తాము. ఈ క్రింది విషయాలను కోరుకుంటున్నాడు శిష్యుడు.

ఎ) మాంగళ్య ప్రార్థన – భద్రం అంటే మంగళం. స్వస్తి అన్నా మంగళమే. నా జీవితం మంగళప్రదమగుగాక.

బి) శరీర యోగ్యత – ముందు చూసినట్టుగా వేదాంతం నేర్చుకోవాలంటే శరీరం, మనస్సు బాగుండాలి. ఇది చాలా మంత్రాల్లో వస్తుంది.

10. **మం॥ ఓం యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై। తగ్ం హ దేవమాత్మబుద్ధిప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః**

ఇది కృష్ణయజుర్వేదానికి చెందిన మంత్రం. దీన్ని శ్వేతాశ్వతర ఉపనిషత్తులో చూస్తాము. ఇది ఒక అద్భుతమైన మంత్రం. ఇందులో శిష్యుడు శరణాగతి కోరుతున్నాడు.

ఓ దేవా నన్ను సంసారంనుంచి రక్షించాల్సిన బాధ్యత నీదే. దానికి అవసరమైన అర్హతలన్నీ నాకు ఇవ్వు. నాకు గురువు అవసరమైతే గురువును ఇవ్వు; గురువు సమర్థవంతుడు కాకపోతే, అతన్ని నువ్వే సమర్థవంతుణ్ణి చెయ్యి; నాకు నేర్చుకునే అర్హత లేకపోతే, నాకు కావాల్సిన అర్హతను ఇవ్వు. అంతా నీదే భారం. అద్భుతమైన శరణాగతి మంత్రం ఇది.

మామూలుగా ఒక అపోహ ఉంది. జ్ఞానయోగానికి వస్తే భక్తిభావన, శరణాగతి భావన ఉండవనుకుంటారు. కాని జ్ఞానయోగం శరణాగతితో మొదలై, శరణాగతితో ముగుస్తుంది. దానికి ఈ మంత్రమే ఉదాహరణ.

ఇక్కడ ప్రార్థిస్తున్నది ఏ దేవుణ్ణి? సృష్టి మొదట్లో సాక్షాత్తూ ఆ బ్రహ్మదేవుణ్ణే సృష్టించిన భగవంతుణ్ణి వేడుకుంటున్నాము – బ్రహ్మ అంటే హిరణ్యగర్భ. హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మ ప్రపంచ అధిష్ఠానదేవత అని చూశాము. ఈశ్వరుడు సమష్టి కారణ ప్రపంచ అధిష్ఠానదేవత. అంటే ఈశ్వరుడు హిరణ్యగర్భయొక్క తండ్రి లేదా సృష్టికర్త. ఆ ఈశ్వరుణ్ణి నేను శరణు వేడుతున్నాను.

ఆ ఈశ్వరుడే బ్రహ్మకు వేదాలను నేర్పించాడు. కాకపోతే, బ్రహ్మ మనలాగా ఒక క్రమపద్ధతిలో నేర్చుకోనవసరం లేదు. సంకల్పమాత్రంచేతనే విద్య

అందుకుంటాడు. ఆ గురుశిష్యులది మౌనవ్యాఖ్యానం. హిరణ్యగర్భకు గురువు, ఆయనకు వేదాలను ఇచ్చిన మాయాసహిత బ్రహ్మను నేను శరణు వేడుతున్నాను.

**ఆత్మబుద్ధి ప్రకాశః** – ఆ ఈశ్వరుని పేరు ఇక్కడ ఆత్మబుద్ధి ప్రకాశః అని వస్తున్నది. ఆత్మబుద్ధి అంటే ఆత్మజ్ఞానం. ప్రకాశకుడు అంటే ఆ జ్ఞానాన్ని బోధించే వ్యక్తి. అందువల్ల ఆత్మజ్ఞానాన్ని బోధించే ఈశ్వరుణ్ణి శరణు వేడుతున్నాను.

**ముముక్షుః వై అహం శరణం ప్రపద్యే** – ఓ దేవా నువ్వు ఎలాగైతే బ్రహ్మదేవునికి ఆత్మజ్ఞానాన్ని బోధించావో, నాకు కూడా అలాగే బోధించు. నాకు ఎందుకు ఆత్మజ్ఞానం? నేను ముముక్షువును; మోక్షప్రాప్తికోసం ప్రార్థిస్తున్నాను. అందువల్ల నిన్ను శరణు వేడుతున్నాను.

**మం॥ ఓం నమో బ్రహ్మాదిభ్యో, బ్రహ్మవిద్యాసమ్ప్రదాయకర్తృభ్యో, వంశఋషిభ్యో, మహద్భ్యో నమో గురుభ్యః ॥ సర్వోపప్లవరహితః ప్రజ్ఞానఘనః ।ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి। బ్రహ్మైవాహమస్మి । ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

**ఓం నమో బ్రహ్మాదిభ్యః** – ఆదిగురువైన బ్రహ్మదేవునికి, తక్కిన గురువులకు నమస్కారములు.

**బ్రహ్మవిద్యా సమ్ప్రదాయకర్తృభ్యః** – బ్రహ్మవిద్యను సంప్రదాయ పద్ధతిలో బోధించిన గురువులకు నమస్కారములు.

**వంశఋషిభ్యః** – గురు పరంపరకు నా నమస్కారములు.

**ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి** – ఈ గురు పరంపర ద్వారా, వారితో నాకున్న పరోక్ష, ప్రత్యక్ష అనుబంధం ద్వారా నేనొక అద్భుతమైన విషయాన్ని ఆకళింపు చేసుకున్నాను. నేను ఆ బ్రహ్మను అని.

**సర్వ ఉపప్లవరహితః** – ఎటువంటి నేను? ఉపప్లవం అంటే దోషం. ఉపప్లవరహితః అంటే దోషాలు లేని శుద్ధచైతన్యాన్ని నేను.

**ప్రజ్ఞానఘనః** – నేను ఆ బ్రహ్మను.

ఇంత అద్భుతమైన జ్ఞానాన్ని, నా ఆత్మస్వరూపాన్ని నేను తెలుసుకోగలిగానంటే అది కేవలం ఈ గురు పరంపరవల్లనే సాధ్యం.

దక్షిణామూర్తి శ్లోకాల అర్థం చూడటం లేదు. తక్కిన శ్లోకాలకు వెళదాము. వీటిని ధ్యానశ్లోకాలు అంటారు.

1. **శ్లో॥ నారాయణం పద్మభువం వసిష్ఠం, శక్తిం చ తత్పుత్రపరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాన్తం, గోవిన్దయోగీంద్రమథాస్య శిష్యమ్ ॥**
**శ్రీ శఙ్కరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్ ।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సన్తత మానతోఽస్మి ॥**

గురువులందరకూ నేను నమస్కరిస్తున్నాను. ఎప్పుడు? సన్తతం – ఎప్పుడూ. గురు పరంపర ఇలా సాగుతుంది–

ఎ) **నారాయణమ్** – విష్ణుమూర్తి ఆదిగురువు.

యో బ్రహ్మాణాం విదధాతి పూర్వమ్

అని శాంతిమంత్రాల్లో కూడా చూశాము. విష్ణుమూర్తి బ్రహ్మను సృష్టించాడు. ఆయనకు గురువు కూడా.

ఆ శాంతి మంత్రం నేర్చుకున్నప్పుడు బ్రహ్మను ఈశ్వరుడు సృష్టించాడు అన్నాము. ఇక్కడ విష్ణుమూర్తి అంటున్నాము. శాస్త్రం ప్రకారం ఈశ్వరునికి, విష్ణుమూర్తికి భేదం లేదు. మనం బోధ నేర్చుకునేముందు–

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్**

అని మొదలుపెడతాము. అందులో ఆయనని ఆదిగురువుగా చెపితే, ఇక్కడ నారాయణుణ్ణి చెబుతున్నాము.

బి) **పద్మభువమ్** – పద్మంలో పుట్టిన బ్రహ్మదేవుడు లేదా హిరణ్యగర్భుడు. బ్రహ్మ రెండవ గురువు. గురు పరంపర అంటే రెండవ గురువు మొదటి గురువుయొక్క శిష్యుడు అని అర్థం చేసుకోవాలి. కాకపోతే ఆయన మనలాగా కూర్చుని నేర్చుకోలేదని గుర్తుపెట్టుకోవాలి. విష్ణువు అశరీరంగా గురువు అయితే, ఈయన సంకల్ప మాత్రంగా నేర్చుకున్నాడు.

సి) **వశిష్ఠమ్** – వశిష్ఠుడు బ్రహ్మయొక్క పుత్రుడు, శిష్యుడు. కొంతవరకూ పుత్రులే శిష్యులు.

డి) **శక్తిమ్** – వశిష్ఠుని పుత్రుడు, శిష్యుడు.

ఇ) **పరాశరమ్** – శక్తియొక్క పుత్రుడు, శిష్యుడు.

ఎఫ్) **వ్యాసమ్** – పరాశరునియొక్క పుత్రుడు, శిష్యుడు. పరాశరుని పుత్రుడు కాబట్టి ఈయనను పారాశర్యుడు అని కూడా అంటారు.

జి) **శుకమ్** – వ్యాసాచార్యుని పుత్రుడు, శిష్యుడు.

**వ్యాసం వశిష్ఠ నప్తారమ్**
**శక్తేః పౌత్రమ్ అకల్మషమ్**
**పరాశరాత్మజం వందే**
**శుకతాతం తపోనిధిమ్॥**

ఇందులో వ్యాసమహర్షి వంశ పరంపర అంతా వచ్చేస్తుంది. వ్యాసుడు వశిష్ఠఋషియొక్క మునిమనవడు, శక్తియొక్క మనవడు, పరాశరునియొక్క పుత్రుడు, శుకమహర్షియొక్క తండ్రి. సంస్కృతంలో తాత అంటే తండ్రి. అంటే ఐదు తరాలను చూశాము.

హెచ్) **గౌడపాదమ్** – ఇక్కడనుంచి శిష్యపరంపర మాత్రమే వస్తుంది. పుత్ర పరంపర కాదు. గౌడపాదాచార్యులు మాండూక్య కారికలను రచించిన గొప్ప గురువు. వాటిని గౌడపాద కారికలు అంటారు.

ఐ) **గోవింద యోగీంద్ర మథాస్య శిష్యమ్** – గోవింద భగవత్పాదులు. ఈయన గౌడపాదుల శిష్యులు.

జె) **శ్రీ శఙ్కరాచార్యమ్** – శంకరులవారు గోవింద భగవత్పాదుల శిష్యులు. శంకరులవారికి నలుగురు శిష్యులు ఉన్నారు.

**అథాస్య పద్మపాదం చ, హస్తామలకం చ శిష్యమ్ తం తోటకం వార్తికకారమ్–** ఆ నలుగురు శిష్యులు – పద్మపాదులు, హస్తామలకుడు, తోటకుడు, వార్తికకారుడు.

శంకరులవారికి ఈ నలుగురు మాత్రమే శిష్యులు అనకూడదు. ఎందరో ఉన్నారు కాని ఈ నలుగురూ ప్రసిద్ధి చెందారు. వారు కొన్ని వేదాంత గ్రంథాలను రచించటంవల్ల ప్రసిద్ధి పొందారు. గౌడపాదులవారు, వ్యాసాచార్యులు కూడా అలా వారి గ్రంథాలవల్ల పేరుప్రఖ్యాతులు పొందారు. ఈ నలుగురు శిష్యుల గురించీ మనకు కథలు ఉన్నాయి.

**పద్మపాదులు**– ఈ శిష్యుడు ఒకసారి నదికి ఆవలి ఒడ్డున ఉండగా, శంకరుల వారు అతనిని రమ్మని పిలిచారు. గురువు పిలిచిందే తడవుగా, నదిలో నడుస్తున్నానని చూడకుండా ముందుకు సాగాడు. నదిలో ఆయన నడుస్తుంటే, ఆయన కాలు కింద పద్మాలు విరబూసాయి. పద్మాలమీద నడుచుకు వచ్చాడు కాబట్టి పద్మపాదులు అనే పేరు వచ్చింది ఆ శిష్యునికి.

**హస్తామలకుడు** – చేతిలో ఉన్న ఆమలకం ఎంత స్పష్టంగా కనపడుతుందో, ఈ శిష్యునికి బ్రహ్మజ్ఞానం అంత స్పష్టంగా బోధపడింది. ఆమలకం అంటే ఉసిరికాయ. చేతిలో ఉన్న ఉసిరికాయను చూడలేని పరిస్థితి ఉండదు కదా. అలా బ్రహ్మను అర్థం చేసుకోలేని పరిస్థితి లేదు ఆయనకు. అందువల్ల హస్తామలకుడు అయ్యాడు.

**తోటకుడు** – తోటకం అంటే ఒక ఛందస్సు. ఆ ఛందస్సులో ఆయన ఒక అష్టకాన్ని రాశారు. దీన్ని తోటకాష్టకం అంటారు. అంతే కాకుండా ఆయన ఇంకొక గ్రంథం కూడా రాశారు. దాన్ని **శ్రుతిసార సముద్ధరణం** అంటారు. అందులో 170 శ్లోకాలు ఉన్నాయి. అవి కూడా తోటకం ఛందస్సులోనే ఉన్నాయి. అందువల్ల ఆయనకు తోటకాచార్యులనే పేరు వచ్చింది. అంతేకాదు, మనం విష్ణుసహస్రనామంలో పఠించే ధ్యానశ్లోకాలు ఇందులోంచే వచ్చాయి.

**వార్తికకారుడు** – ఈయన అసలు పేరు సురేశ్వరాచార్యులు. ఆయన వార్తికలు రాయటంవల్ల ఆయనకు వార్తికకారుడు అనే పేరు వచ్చింది. వార్తికల రూపంలో రాసిన భాష్యం. ఆయన తన గురువు అయిన శంకరాచార్యులు రాసిన భాష్యాలకు వార్తికలు రాశారు. శంకరాచార్యులు రాసిన తైత్తిరీయ భాష్యానికి వార్తికలు రాశారు. ఇది తైత్తిరీయ వార్తికము కాదు, తైత్తిరీయ భాష్యవార్తికము.

ఆయనకు బాగా పేరు తెచ్చిన ఇంకొక వార్తికము – బృహదారణ్యక భాష్యవార్తికము. మళ్ళీ గుర్తు పెట్టుకోండి ఇది బృహదారణ్యకంమీద భాష్యం కాదు, దాని భాష్యంమీద భాష్యం. అందులో 12,000 మంత్రాలు పైనే ఉంటాయి. ఇంకా చాలా రాసినా, దీనికి బాగా పేరు వచ్చింది.

వార్తికలలో వార్తికకారుడు మూడు అంశాలను పాటించాలి. వాటిని ఉక్తం, దురుక్తం, నిరుక్తం అంటారు. ఉక్తం అంటే భాష్యకారుడు చెప్పింది చెప్పినట్టు చెప్పాలి. దురుక్తం అంటే భాష్యకారుడు చెప్పింది అందరికీ అర్థమయ్యేటంత

స్పష్టంగా లేకపోయినా, తప్పు అర్థం తీసుకునే ప్రమాదం అనిపించినా అది విశ్లేషించాలి. నిరుక్తం అంటే గురువు ఒకవేళ ఏదైనా చెప్పకుండా వదిలేస్తే, దాన్ని చెప్పాలి. ఆ చెప్పటంలో గురువు సామర్థ్యాన్ని కించపరచకూడదు. అందువల్ల గురువు చెప్పిన భాష్యానికి భాష్యం రాయటమంటే ఆషామాషీ వ్యవహారం కాదు.

**అస్మద్గురూన్** – మధ్యలో ఇంకెందరో గురువులు ఉండి, నా గురువు వరకూ వచ్చింది. ఇంకా గురుపరంపర సాగుతోందని ఎలా తెలుసు మనకు? మన గురువు దాకా వచ్చింది కాబట్టి, మనం శిష్యులుగా నేర్చుకోగలుగుతున్నాము కాబట్టి. అందువల్ల ఈ నారాయణ పరంపర అవిచ్ఛిన్నం.

**అన్యాన్** – ఆ గురుపరంపరను చెప్పుకుంటూపోతే బ్రహ్మసూత్రములలోకి వెళ్ళలేము. అందువల్ల తేలికగా ఒక్క మాటలో వచ్చేస్తుంది అన్యగురువులు అని. అంటే వార్తికకారునినుంచి నా గురువు దాకా మధ్యలో ఉన్న గురువులు అందరినీ.

**ఆనతోఽస్మి** – నేను ప్రార్థిస్తున్నాను. వారందరూ కూడా నా విద్యకు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో తోడ్పడ్డారు.

2. **శ్లో॥ శ్రుతిస్మృతిపురాణానామ్ ఆలయం కరుణాలయమ్ ।**
**నమామి భగవత్పాదం శఙ్కరం లోకశఙ్కరమ్ ॥**

**శ్రుతి స్మృతి పురాణానామ్** – మన ప్రాథమిక గ్రంథాలను ప్రస్థానత్రయం అంటారని చూశాము. ఆ మూడింటికీ శంకరులవారు భాష్యం రాశారు. అంటే స్మృతి గ్రంథాలకు రాశారు, శ్రుతి గ్రంథాలైన ఉపనిషత్తులకు రాశారు; న్యాయగ్రంథమైన బ్రహ్మసూత్రములకు రాశారు.

**శ్రుతి** – ఆయనకు మన ప్రధాన శాస్త్రమైన వేదం అంతా తెలుసు. ఊరికే తెలియటం కాదు, దాని అర్థం తెలుసు, అవి కంఠతా వచ్చు. దీన్ని శ్రుతి అంటారు.

**స్మృతి** అంటే శ్రుతినుంచి వచ్చిన గ్రంథాలు. ఉదాహరణకు మనుస్మృతి. శంకరులవారు మనుస్మృతినుంచి తరచు ఉటంకిస్తుంటారు. అంటే అది కూడా బాగా తెలుసన్నమాట.

**పురాణానామ్** – పురాణజ్ఞానం కూడా బాగా ఉంది. 18 పురాణాలు తెలుసు. ఆయన రాసిన విష్ణుసహస్రనామభాష్యంలో, శంకరులవారు విష్ణుపురాణంలోంచి

ఎన్నో విషయాలను ఉటంకించేవారు. అంటే అవి కూడా ఆయనకు బాగా తెలుసని చెప్పకనే చెప్పినట్టయింది.

కాని తమాషా ఏమిటంటే ఆయన భాగవత పురాణంలోంచి ఏమీ చెప్పలేదు. అందువల్ల కొంతమంది వేదాంతులు భాగవతపురాణం శంకరాచార్యులవారి కాలానికి లేదేమో అంటారు. ఎందుకంటే ఒకవేళ ఆయన సమయంలో అందుబాటులో ఉంటే తప్పకుండా అందులోంచి ఒక్కసారైనా ఏదైనా విశేషాన్ని చెప్పి ఉండేవారు.

పురాణాలతో బాటు ఇతిహాసాలైన రామాయణ, భారతాలు కూడా తెలుసునని కలుపుకోవాలి. ఎందుకంటే శంకరాచార్యులు రామాయణంనుంచి ఒకసారో, రెండుసార్లో చెపితే, మహాభారతంనుంచి ఎన్నో అంశాలను పేర్కొన్నారు. మహాభారతంలో లక్ష శ్లోకాలు ఉన్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవటమే కష్టం. అలాంటి దాంట్లోంచి ఎన్నో శ్లోకాలను ఆశువుగా చెప్పేసేవారు. ఎంత కంప్యూటర్ మెమరీ ఉండేదో చూడండి.

**ఆలయమ్** – ఆలయంలో భగవంతుడు ఉంటే శంకరాచార్యులు అనే ఆలయంలో శాస్త్రాలు ఉన్నాయి.

**కరుణాలయమ్** – అంతేకాదు ఆయన కరుణాలయం కూడా. అంటే కరుణకు మారుపేరు. ఆయనకు మానవాళిమీద కరుణ లేకపోతే ఈ తరానికి చెందిన మనం కూడా నేర్చుకునేందుకు వీలుగా అద్వైత వేదాంతాన్ని మలిచి ఉండేవారు కాదు. కేవలం బోధచేసి ఉంటే, కొంతమందే బాగుపడి ఉండేవారు. ఆయన ఎన్నో భాష్యాలు రాయటంవల్ల, ఎన్నో గ్రంథాలను రాయటంవల్ల ఈరోజు అద్వైత వేదాంతం అంటే ఏమిటో తెలుసుకోగలుగుతున్నాము.

**భగవత్పాదమ్** – ఆయన మనను భగవంతుని దగ్గరకు చేరుస్తాడు. **భగవంతం పాదయతి ప్రాపయతి నయతి ఇతి భగవత్పాదః.** ఈశ్వరుడు ఎక్కడో లేదు, నాకు భిన్నంగా లేడు, నేనే ఈశ్వరుడు అని అర్థం చేసుకునేలా చేస్తాడు.

**లోకశంకరమ్ – శం కరోతి ఇతి శంకరః** – శం అంటే మంగళం; కరః అంటే ఇచ్చేవాడు. మంగళాన్ని ఇచ్చేవాడు. మంగళం అంటే బ్రహ్మానందం.

**బ్రహ్మానందరూప మంగళం కరోతి ఇతి శంకరః**

ఎవరికి మంగళ ప్రదాత? లోక శంకరం. లోకానికి అంతటికీ. ఆయన తన శిష్యులకు మాత్రమే చెప్పి ఊరుకోకుండా, రాబోయే తరాల వారందరూ నేర్చుకునేందుకు వీలుగా గ్రంథాలను సమకూర్చారు. మన దేశప్రజలే కాదు, విదేశీయులు కూడా వీరి సిద్ధాంతాన్ని నేర్చుకోవటమే కాక, దానిమీద పరిశోధనలు కూడా జరుపుతున్నారు. అలా జగద్గురువు అయ్యాడు.

**నమామి** – అటువంటి శంకరులవారికి నా నమస్కారములు.

**3 శ్లో॥ శఙ్కరం శఙ్కరాచార్యం కేశవం బాదరాయణమ్ ।**
**సూత్రభాష్యకృతౌ వన్దే భగవన్తౌ పునః పునః ॥**

ఈ శ్లోకంలో శిష్యుడు శంకరాచార్యులకు, వ్యాసాచార్యులకు నమస్కారాలు చేస్తున్నాడు. వీళ్ళిద్దరూ మామూలు గురువులు కాదు, సాక్షాత్తూ భగవంతుని అవతారాలు.

**శంకరం శంకరాచార్యమ్** – మొదటి శంకరం పదం శివునికి వర్తిస్తుంది. సాక్షాత్తూ శివుడే ఆదిశంకరులవారిగా అవతారాన్ని ఎత్తాడు.

**కేశవం బాదరాయణమ్** – బాదరాయణం వ్యాసాచార్యులకు ఇంకొక పేరు. బదరీవనంలో తపస్సు చెయ్యటంవల్ల బాదరాయణుడు అయ్యాడు. కేశవం అంటే విష్ణుమూర్తి. ఈ వ్యాసాచార్యులు సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం. వ్యాసాచార్యులు బ్రహ్మసూత్రములు రాస్తే, శంకరాచార్యులు బ్రహ్మసూత్రభాష్యం రాశారు. అంటే విష్ణుమూర్తి బ్రహ్మసూత్రములను రచిస్తే, విష్ణుమూర్తి రచించిన బ్రహ్మసూత్రములకు శివుడు భాష్యం రాశాడు. విష్ణు శివుల మధ్య భేదం లేదు. కాని వారి భక్తులుగా మనం పోట్లాడుకుంటున్నాము.

**వన్దే భగవన్తౌ పునః పునః** – ఈ భగవంతులిద్దరికీ నేను పదేపదే నమస్కారాలు చేస్తున్నాను.

**సూత్రభాష్యకృతౌ** – ఈ వాక్యానికి రెండు అర్థాలున్నాయి.

ఎ) **ప్రసిద్ధి చెందిన అర్థం** – కృతౌ అంటే రాసిన వ్యక్తి. నేను సూత్రకర్తకు, భాష్యకర్తకు నమస్కారాలు చేస్తున్నాను. సూత్రకర్త వ్యాసాచార్యులు. ఆయన బ్రహ్మసూత్రములు వ్రాశారు. భాష్యకర్త శంకరాచార్యులు. ఆయన బ్రహ్మసూత్రభాష్యం వ్రాశారు.

బి) **రెండవ అర్థం** – దీన్ని ప్రసిద్ధి చెందిన కల్యాణసుందర శాస్త్రిగారు చెప్పారు. ఇది కూడా అర్థవంతంగా ఉంది. భాష్యం అంటే ఒక్క బ్రహ్మసూత్రముల భాష్యమే కాదు, ఉపనిషత్తుల భాష్యం కూడా తీసుకోవాలి. శంకరాచార్యులు దశఉపనిషత్తులకు భాష్యం రాశారని చూశాము. అంటే ఉపనిషత్తుల్లో ఉన్న బోధను విస్తారంగా విశ్లేషించారు శంకరులవారు.

అదే ఉపనిషత్తుల్లో ఉన్న బోధను సంగ్రహంగా సూత్రముల రూపంలో చెప్పారు వ్యాసాచార్యులు.

**ఉపనిషదాం సంగ్రహకర్తా వ్యాసః ఉపనిషదాం విస్తారకర్తా శంకరః॥**

ఒకరు ఉపనిషత్తులను సూక్ష్మంగా చెపితే, ఇంకొకరు చాలా విస్తారంగా చెప్పారు. రెండూ ముఖ్యమే. రెండూ కష్టమే. అలా చెప్పిన ఇద్దరికీ నేను పదేపదే నమస్కారాలు చేస్తున్నాను.

ఈ రెండవ అర్థం మనకు కలిగే ఒక అపోహను కూడా తొలగిస్తుంది. మొదట్లో మనం ఆరు ఆస్తిక దర్శనాలు చూసినప్పుడు ఆ దర్శనాలను దర్శించినవారిని దార్శనికులు అన్నాము. పైగా వారు వారి మతాన్ని సూత్రరూపంలో రచించారని చూశాము.

ఆ విధంగా సాంఖ్యదర్శనాన్ని స్థాపించింది కపిల ముని, యోగదర్శనాన్ని స్థాపించింది పతంజలి ఋషి, న్యాయదర్శనాన్ని స్థాపించింది గౌతమ ముని, వైశేషికదర్శనాన్ని దర్శించింది కణాద ముని అని చూశాము. అలాగే ఉత్తర మీమాంసాదర్శనాన్ని దర్శించింది వ్యాసాచార్యులని మనం పొరబడే అవకాశం ఉంది. ఆయన బ్రహ్మసూత్రాలు రాశారు, తక్కినవారిలాగా అని కూడా చూశాము.

అందువల్ల వేదాంతదర్శనం వ్యాసాచార్యుని బుద్ధిలోంచి పుట్టింది అనుకునే ప్రమాదముంది. అలా అనుకుంటే ఈ దర్శనం పౌరుషేయదర్శనం అవుతుంది. పౌరుషేయదర్శనంలో లోపాలు చాలా ఉంటాయి. ఎందుకంటే మానవబుద్ధి అనంతం కాదు. పురుషబుద్ధిదోషంవల్ల ఇది కూడా దోషభూయిష్టమవుతుంది. వ్యాసాచార్యులు ప్రత్యేకంగా బ్రహ్మసూత్రములను వ్రాశారు నిజమే కాని, అది ప్రత్యేకంగా ఆయన బుద్ధిలోంచి పుట్టిన దర్శనం కాదు. అది ఉపనిషత్తులలో చెప్పిన బోధనుంచి వచ్చింది.

ఉపనిషత్తులు పురుషబుద్ధినుంచి రాలేదు. అవి అపౌరుషేయం అని మనకు తెలుసు. ఉపనిషత్తు అపౌరుషేయం కాబట్టి, ఆ ఉపనిషత్తులను ఆధారం చేసుకుని వచ్చిన ఉత్తరమీమాంసా కూడా అపౌరుషేయం. తక్కినవి పౌరుషేయాలు.

అయితే వ్యాసాచార్యుణ్ణి దార్శనికుడు అని ఎందుకు అంటాము? ఆయన దార్శనికుడు కాదు. ఆయన బ్రహ్మసూత్రముల రచయిత. ఉపనిషత్తులను సూత్రాల రూపంలో పెట్టి, అవసరమైతే దానికి తర్కం జోడించి, పెట్టారు వ్యాసాచార్యులు.

ఇంకొక విషయం కూడా గమనించాలి. కపిలముని రాకముందు సాంఖ్యదర్శనం లేదు. అలాగే పతంజలి రాకముందు యోగదర్శనం లేదు. కాని వ్యాసాచార్యులు రాకముందు కూడా వేదాంతదర్శనం ఉంది. ఎలా తెలుసు?

ఇందాకే ఒక శ్లోకాన్ని చూశాము – నారాయణం పద్మభువం. గురుపరంపరను సూచించే ఆ గురువుల్లో వ్యాసాచార్యుడు ఆరవ గురువు. తక్కిన దార్శనికులు సూత్రములు రాసినట్టుగా, ఆయన కూడా వేదాంతంమీద సూత్రాలు రాసినందుకు, ఆయనను వారితో పాటు పేర్కొంటాము.

ఆ విధంగా వ్యాసాచార్యులు ఉపనిషత్తులను టూకీగా చెపితే, శంకరాచార్యులు ఉపనిషత్తులను విస్తారంగా చెబుతారు. అందువల్లనే అద్వైత వేదాంతం శంకరాచార్యుల స్వంత ప్రతిపాదన కాదు. అది శాస్త్రంలో ఉందని సమయం వచ్చినప్పుడల్లా చూస్తాము. అటువంటి గొప్ప గురువులకు నా నమస్కారాలు.

4. శ్లో॥ **ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే ।**
**వ్యోమవద్వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః ॥**

ఇక్కడ శివునికి నమస్కారములు పెడుతున్నాడు శిష్యుడు. పరమశివుణ్ణి ఆదిగురువుగా కొలిచినప్పుడు దక్షిణామూర్తిగా కొలుస్తాము. అందువల్లనే మొదటిరోజు బ్రహ్మసూత్రములు ప్రారంభించేముందు, చివర్లో దక్షిణామూర్తి శ్లోకాలు పఠిస్తూ సాష్టాంగ నమస్కారాలు చేస్తాము. మనం రోజూ చేసే ప్రార్థన చూడండి–

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్**
**అస్మదాచార్యపర్యంతాం వందేగురుపరంపరామ్**

అంతకుముందు శ్లోకంలో నారాయణం పద్మభువం అని మొదలుపెట్టి, విష్ణుమూర్తి ఆదిగురువు అన్నాము. సదాశివ సమారంభాంలో పరమశివుడు ఆదిగురువు అంటున్నాము. అసలు ఆదిగురువు ఎవరో ముందు మీరు తేల్చుకోండి, తర్వాత బ్రహ్మసూత్రములు నేర్చుకుందాం అనకూడదు.

**శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః॥**

అందువల్ల శివవిష్ణుల మధ్య భేదం లేదు. ఏదైనా భేదం ఉంటే మనమే సృష్టిస్తున్నాము. శివుణ్ణి దక్షిణామూర్తిగా కొలుస్తారు. దక్షిణామూర్తి అంటే దక్షిణం వైపు చూస్తున్నవాడని అర్థం. శాస్త్రంలో దక్షిణదిశకు అధిపతి యమధర్మరాజు. అందువల్ల మనుష్యులకు దక్షిణంవైపు తిరగాలంటే భయం. దక్షిణంవైపు తిరిగి మందులు వేసుకోవటానికి కూడా ఇష్టపడరు కొందరు. మృత్యుభయం అంతగా ఉంది వారికి.

దక్షిణామూర్తి మృత్యుంజయుడు. ఆయనకు మృత్యువంటే భయం లేదు. నన్ను చూడండి, నాకు మృత్యువంటే భయంలేదు అన్నట్టుగా ఉంటాడు. అంతేకాదు, ఆయనను చంద్రశేఖరుడు అని కూడా అంటారు. చంద్రుణ్ణి శిరస్సుమీద ధరించినవాడు. చంద్రుడు కాలతత్త్వానికి ప్రతీక. అటువంటి కాలతత్త్వాన్ని తన శిరస్సులో ధరించాడంటే ఆయన కాలాతీతుడు. అందువల్ల దక్షిణామూర్తిని పూజిస్తే ఆయన యమభయాన్ని పోగొట్టి అమృతత్వం ఇస్తాడు. అమృతత్వాన్ని ఎలా ఇస్తాడు?

**ఈశ్వరో గురురాత్మేతి** – బ్రహ్మవిద్యను గురువుగా బోధించటం ద్వారా ఇస్తాడు. మృత్యుంజయుడు, కాలకాలుడు, చంద్రశేఖరుడు అయిన దక్షిణామూర్తిని నేను కొలుస్తున్నాను. మూడు రూపాల్లో కొలుస్తున్నాను. ఈశ్వరుడు, గురువు, ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే శిష్యుడు లేదా జీవుడు.

**మూర్తిభేద విభాగినే** – జీవుడు ప్రమాత; గురువు ప్రమాణం; ఈశ్వరుడు ప్రమేయం. మామూలుగా జీవుడు అనే శిష్యుడు గురువు ద్వారా ప్రమేయం గురించి నేర్చుకుంటాడు. కాని ఇక్కడ ఆ మూడు నువ్వే అంటున్నాడు. దక్షిణామూర్తి తనను తాను మూడుగా విభజించుకున్నాడు. అలాగంటే ఆయనకు భాగాలు ఉన్నట్టా? ఆ భాగాలను సగుణబ్రహ్మకు చూస్తాము.

**వ్యోమవత్ వ్యాప్తదేహాయ** – ఆయన అసలు స్వరూపం సర్వవ్యాపకమైన చైతన్యం. ఆయన ఆకాశంలాగా సర్వవ్యాపకం.

**దక్షిణామూర్తయే నమః** – అలాంటి సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ అయిన దక్షిణామూర్తికి నా నమస్కారములు.

5. శ్లో॥ **అశుభాని నిరాచష్టే తనోతి శుభసన్తతిమ్ ।**
**స్మృతిమాత్రేణ యత్పుంసాం బ్రహ్మ తన్మఙ్గళం పరమ్ ॥**

బ్రహ్మ లేదా ఈశ్వరుడు ప్రపంచంలో అన్నింటిలోకీ అత్యంత మంగళప్రదం. పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం. బ్రహ్మ సంబంధంవల్లనే తక్కినవన్నీ కూడా మంగళాన్ని ఆపాదించుకుంటాయి.

**అశుభాని నిరాచష్టే** – బ్రహ్మజ్ఞానాన్ని పొంది, ఆనందం పొందే ప్రయత్నంలో అడ్డు వచ్చే అశుభాలన్నిటినీ తొలగిస్తాడు.

**తనోతి శుభసన్తతిమ్** – అన్నీ మంగళకరమైన వాటిని ప్రసాదిస్తాడు. ఎలా?

**స్మృతి మాత్రేణ యత్పుంసాం బ్రహ్మతన్మఙ్గళం పరమ్** – కేవలం తలచుకుంటేనే చాలు మంగళాలను కలుగజేస్తాడు.

6. శ్లో॥ **అతికల్యాణరూపత్వాన్నిత్యకళ్యాణసంశ్రయాత్ ।**
**స్మర్తౄణాం వరదత్వాచ్చ బ్రహ్మ తన్మఙ్గళం విదుః ॥**

**అతికళ్యాణ రూపత్వాత్** – ఇంచుమించు అదే భావన ఇందులో కూడా. బ్రహ్మమంగళ రూపం.

**నిత్యకళ్యాణ సంశ్రయాత్** – నిత్యమూ మంగళకరమైన వస్తువులనే ఆశ్రయించి ఉంటాడు.

**స్మర్తౄణాం వరదత్వాచ్చ బ్రహ్మ తన్మఙ్గళం విదుః** – వరాలను ఇచ్చే దేవుణ్ణి వరదమూర్తి అంటారు. తనను స్మరించేవారికి మంగళాన్ని సమకూరుస్తాడు.

**7 శ్లో॥ యైరిమే గురుభిః పూర్వం పదవాక్యప్రమాణతః ।**
**వ్యాఖ్యాతాః సర్వవేదాన్తాస్తాన్నిత్యం ప్రణతోఽస్మ్యహమ్ ॥**

ఈ శ్లోకాన్ని శంకరాచార్యులు తన తైత్తిరీయ భాష్యంలో వ్రాశారు. తన భాష్యం రాసేముందు, ఈ ప్రార్థన చేశారు.

**యైరిమే గురుభిః పూర్వం వ్యాఖ్యాతా సర్వవేదాన్తాః–** నేను ఈ భాష్యం రాస్తున్నానంటే, ఆ గొప్పతనం నాది కానేకాదు. నా ముందు వచ్చిన ఆచార్యులు చెప్పిన విషయాలనే నేను మళ్ళీ చెపుతున్నాను. నేను స్వంతంగా చెప్పినది ఏదీ లేదు. ఎంత వినమ్రతో చూడండి. శంకరాచార్యుల ముందు గోవింద భగవత్పాదులు, గౌడపాదులువంటి గురువులు ఉపనిషత్తులకు భాష్యాలను చెప్పటమో, రాయటమో చేశారు. అది కూడా వారికి ఇష్టం వచ్చినట్టు రాయలేదు.

**పదవాక్య ప్రమాణతః** – భాష్యాన్ని మూడు అంశాలలో చేస్తారు. అవి పదం, వాక్యం, ప్రమాణం.

ఎ) పదం – వ్యాకరణశాస్త్రంలో ఒక్కొక్క పదంయొక్క అర్థం దాని ధాతువు నుంచి చూడాలి. ఆ ధాతువుకు వేరే పదాలు వచ్చి కలిస్తే వాటి అర్థం మారుతుంది.

బి) వాక్యం – దీన్ని మీమాంసా శాస్త్రం అంటారు. వేదాన్ని అర్థం చేసుకోవటానికి ఉపయోగపడే శాస్త్రం. పదశాస్త్రం పదాలను విశ్లేషిస్తే, వాక్యశాస్త్రం వాక్యాన్ని విశ్లేషిస్తుంది. ఒక వాక్యాన్ని అర్థం చేసుకోవటానికి దాని ముందు వాక్యాన్ని, తర్వాత వచ్చే వాక్యాన్ని అంటే సందర్భాన్ని కూడా చూడాలి.

సి) ప్రమాణశాస్త్రం – తర్కశాస్త్రం. భాష్యం రాసేటప్పుడు తర్కశాస్త్రాన్ని కూడా ఉపయోగించాలి.

తన ముందు వచ్చిన గురువులు పదవాక్య ప్రమాణాలను ఉపయోగించి భాష్యాలు రాశారని వినయంగా చెప్పుకుంటున్నారు.

**తాన్నిత్యం ప్రణతోఽస్మ్యహమ్** – అందువల్ల వారికి నేను నిత్యం నమస్కారం చేస్తున్నాను అంటున్నారు.

**శ్లో॥ 8 ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా ।**
**కణ్ఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గళికావుభౌ ।**

ఓమ్, అథ శబ్దాల గొప్పతనం చూపిస్తున్నది ఈ శ్లోకం. ఈ రెండు శబ్దాలు చాలా మంగళకరమైనవి. ఎందుకంటే వాటిని సృష్టికి ముందు, సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ఉచ్చరించాడు.

శ్లో. **ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥** – గీత 17.23

**ఓం కారశ్చాథ శబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా** – ఓం శబ్దమూ, అథ శబ్దమూ బ్రహ్మ సృష్టికి ముందు ఉచ్చరించాడు.

**కంఠం భిత్త్వా వినిర్యాతౌ** – బ్రహ్మ కంఠంనుంచి వచ్చాయి ఈ శబ్దాలు. కొంతమంది భిత్త్వా పదానికి ఇంకొక అర్థం చెబుతారు. భిత్త్వా అంటే గొంతులోంచి రాలేదు, సరాసరి కంఠం చీల్చుకుని వచ్చాయి అంటారు. ఎలా చూసినా వీటిని బ్రహ్మదేవుడు మొట్టమొదలు పలికాడు. ఎందుకు పలికాడు సృష్టికి ముందు?

సృష్టి బాగా జరగాలనీ, చక్కగా ఉండాలనీను. అందువల్ల బ్రహ్మ తన పనిలో విజయం పొందాడు. ఎంత అద్భుతమైనదీ విశ్వం! అందువల్ల మన ప్రయత్నాలు కూడా అంత చక్కగా విజయవంతం అవాలంటే మనం కూడా ఓమ్ అథ అని మొదలుపెట్టాలి. అందువల్లనే భగవద్గీత అథ శబ్దంతో మొదలవుతుంది. ఓం అథ ప్రథమోఽధ్యాయః. అదే విధంగా మన బ్రహ్మసూత్రముల అధ్యయనాన్ని కూడా విజయవంతంగా ముగించుకోవాలని మనం కూడా

**ఓమ్ అథ ఓమ్ అథ ఓమ్ అథ**

అని మూడుసార్లు పలకాలి.

కొందరు విద్వాంసులు **'ఓంకారం వేదేషు,' 'అథకారం భాష్యేషు,'** అని అంటారు. వేదమంత్రాల ప్రారంభంలో ఓంకారాన్ని, అలాగే తక్కిన శాస్త్రాల ప్రారంభంలో అథకారాన్ని మంగళవాచకముగా వినియోగిస్తారు.

***

# బ్రహ్మసూత్రముల విహంగవీక్షణము

బ్రహ్మసూత్రములు ఈ విధంగా ఉంటాయి.

అధ్యాయాలు - 4
పాదాలు - 16
అధికరణాలు - 191 లేదా 192
సూత్రములు - 555

బ్రహ్మసూత్రములలో 4 అధ్యాయాలు ఉన్నాయి. వీటిని చాప్టర్స్ అంటారు. ఒక్కొక్క అధ్యాయంలో మళ్ళీ 4 పాదాలు ఉన్నాయి. వీటిని సెక్షన్స్ అంటారు. అంటే వెరసి 16 పాదాలు ఉన్నాయి. ఒక్కొక్క పాదంలోనూ అనేక అధికరణాలు ఉన్నాయి. అధికరణాలను టాపిక్స్ అంటారు. అవి అన్ని పాదాలలోనూ సమానంగా ఉండవు. ఒకదాంట్లో ఎక్కువ ఉండవచ్చు; ఒకదాంట్లో తక్కువ ఉండవచ్చు; అలా మొత్తం అధికరణాలను చూస్తే అవి 191 ఉన్నాయి. కొంతమంది 192 ఉన్నాయంటారు. అంటే ఒక ప్రత్యేకమైన అధికరణాన్ని రెండుగా తీసుకుంటారు వారు. అది ఏ అధికరణమో ఇప్పుడు మనకు అప్రస్తుతం. వీటికి అంశాలు ఎక్కువగా ఉపనిషత్తులోని వాక్యాలై ఉంటాయి. అవి కూడా ఎక్కువగా దశఉపనిషత్తులనుంచి ఉంటాయి. వాటిలోని ముఖ్యమైన మంత్రాలను తీసుకుని వాటిని విశ్లేషిస్తారు.

భారతీతీర్థులు అనే ఒక గొప్ప ఆచార్యులు అధికరణ న్యాయమాల అని రచించారు. ఒక్కొక్క అధికరణాన్ని బ్రహ్మసూత్రముల భాష్యంలో విపులంగా చూస్తే, ఈయన రెండు శ్లోకాల్లో ఒక్కొక్క అధికరణంయొక్క సారాన్ని ఇచ్చారు. దీన్ని **వైయాసికన్యాయమాల** అని కూడా అంటారు. బ్రహ్మసూత్రములను న్యాయప్రస్థానం అని కూడా అంటారని చూశాము. వ్యాసాచార్యులు ఆ అధికరణంలో వాడిన తర్కాన్ని అందులో చూస్తాము.

ఒక్కొక్క అధికరణంలోనూ కొన్ని సూత్రములు ఉంటాయి. అవి కూడా అన్ని అధికరణాలలోనూ సమానంగా ఉండవు. ఒక అధికరణంలో ఒకటే సూత్రం ఉంటే ఇంకో అధికరణంలో 7, 11, 13 సూత్రములు ఉండవచ్చు. అలా వెరసి 555 సూత్రములు ఉన్నాయి.

నాలుగు అధ్యాయాలకూ నాలుగు పేర్లు ఉన్నాయి. అవి – సమన్వయ అధ్యాయము, అవిరోధ అధ్యాయము, సాధన అధ్యాయము, ఫల అధ్యాయము.

**సమన్వయ అధ్యాయము** – ఈ పదం మీమాంస శాస్త్రంలో వచ్చే ఒక సాంకేతిక పదం. ఉపనిషత్తుల సారం బ్రహ్మవిద్య అని నిరూపించటమే ఈ అధ్యాయం ఉద్దేశ్యం. సమన్వయం అంటే ఏమిటో, అది వేదాంతసారంగా ఉందని ఎలా నిరూపిస్తామో వాటి వివరాలు తర్వాత చూద్దాము.

వ్యాసాచార్యులవారు బ్రహ్మవిద్య వేదాంతసారం అని ఎందుకు నిరూపిస్తున్నారంటే, తక్కిన దార్శనికులు ముఖ్యంగా సాంఖ్య దార్శనికులు, పూర్వమీమాంసకులు వేదాంతసారం కర్మయోగం అంటారు. తర్వాత వీరిద్దరి వాదననూ ఖండించి బ్రహ్మజ్ఞానమే వేదాంతసారం అని నిరూపిస్తారు.

తత్తు సమన్వయాత్ – బ్రహ్మసూత్రములు 4

ఈ సూత్రమునుంచి ఈ అధ్యాయానికి సమన్వయ అధ్యాయము అని పేరు వచ్చింది. అంతేకాక ఈ అధ్యాయంలో దీని తర్వాత వచ్చిన సూత్రములన్నీ ఈ సమన్వయ అంశాన్నే చర్చిస్తాయి. అందువల్ల ఈ నాలుగవ సూత్రం చాలా ముఖ్యమైన సూత్రం.

**అవిరోధ అధ్యాయము** – అవిరోధ అధ్యాయము అంటే విరోధం లేనిది అని అర్థం. మొదటి అధ్యాయంలో బ్రహ్మవిద్య ఉపనిషత్తులలో చర్చించిన ముఖ్యాంశం అని నిరూపిస్తే, రెండవ అధ్యాయంలో బ్రహ్మవిద్య విషయంలో ఏ విరుద్ధ భావనలూ లేవని నిరూపిస్తారు. అలా పరస్పర విరుద్ధమైన భావనలు ఎందులోనైనా వస్తే, ఆ బోధ లోపభూయిష్టమైనదని అంటారు. కాని ఉపనిషత్తుల్లో అలాంటి లోపం లేదని వాదించి నిరూపిస్తారు.

ఆ సందర్భంలో మూడు రకాల విరుద్ధాలను ఖండిస్తారు. అవి –

ఎ) **పరస్పర విరోధః నాస్తి** – శ్రుతికీ, శ్రుతికీ మధ్య విరోధం లేదని నిరూపిస్తారు. అంటే రెండు శ్రుతులలో ఉన్న వేదాంత వాక్యాలలో భిన్నవాక్యాలు లేవు.

బి) **స్మృతి విరోధః నాస్తి** – స్మృతికీ, శ్రుతికీ మధ్య విరోధం లేదని నిరూపిస్తారు. మనుస్మృతి, మహాభారతం స్మృతి కిందకు వస్తాయి.

సి) **శ్రుతి యుక్తి విరోధః నాస్తి** – శ్రుతికీ, యుక్తికీ మధ్య విరోధం లేదని నిరూపిస్తారు.

ఈ అధ్యాయంలోనే నాస్తికదార్శనికులైన జైనులు, బౌద్ధమతస్థులను ఖండిస్తారు. అంతేకాదు ఆస్తికులైనా కూడా తర్కాన్ని ప్రధానంగా భావించే సాంఖ్య, న్యాయ, వైశేషికలను కూడా ఖండిస్తారు. మళ్ళీ ఇక్కడ రెండు రకాలుగా వాదించాలి. బ్రహ్మవిద్య తర్కవిరోధం కాదని నిరూపించాలి; తక్కిన దర్శనాలు తర్కవిరోధంగా ఉన్నాయని నిరూపించాలి. అంటే అద్వైతాన్ని నిరూపించి, తక్కిన మతాల లొసుగులను చూపాలి. అందువల్ల ఈ రెండవ అధ్యాయం తర్కప్రధానంగా ఉంటుంది.

**సాధన అధ్యాయము** – బ్రహ్మవిద్య పొందటానికి కావలిసిన సాధనలను వివరిస్తారు ఇందులో. అందువల్ల దీనిని సాధన అధ్యాయము అంటారు. ఈ సాధనలు రెండు రకాలు – సాక్షాత్ సాధన, సహకారీ సాధన. జ్ఞానమార్గం సాక్షాత్ సాధన అయితే కర్మ, ఉపాసన మార్గాలు సహకారీ సాధనలు. కర్మవల్ల చిత్తశుద్ధి పొంది, ఉపాసనవల్ల ఏకాగ్రత పొందుతారు. వీటివల్ల జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొందుతారు. అందువల్ల ఈ సాధనల్లో జ్ఞానయోగం, కర్మయోగం, ఉపాసన యోగాల గురించే కాక, విలువల విలువ గురించి కూడా వస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మతంలో పాటించే ప్రతి అంశమూ కూడా ఒక సాధనే.

**ఫల అధ్యాయము** – జ్ఞానయోగాన్ని పాటిస్తే కలిగే ఫలం మోక్షం. ఆ మోక్షాన్ని మూడు రకాలుగా నిర్వచిస్తారు.

ఎ) **జీవన్ముక్తి** – జ్ఞానయోగాన్ని పాటిస్తే సంసారబంధంనుంచి విడివడతారు. అందువల్ల ఇక్కడే, ఇప్పుడే మోక్షాన్ని పొందుతారు. దీన్ని జీవన్ముక్తి లేదా సద్యోముక్తి అంటారు.

బి) **విదేహముక్తి** – జ్ఞానం పొందిన జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తిని అనుభవించాక, మరణించాక విదేహముక్తిని పొందుతాడు. అంటే అతనికి పునర్జన్మ ఉండదు. జనన, మరణ వృత్తంనుంచి బయట పడతాడు.

సి) **క్రమముక్తి** – జ్ఞానమార్గానికి రాకుండా, జీవితకాలమంతా ఉపాసన చేసిన వ్యక్తి, ఉపాసనఫలంగా బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ సాక్షాత్తూ బ్రహ్మదేవుని దగ్గర జ్ఞానం పొంది, మోక్షాన్ని పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు.

ఇవీ అధ్యాయాల వివరాలు. ఈ అధ్యాయాలే 16 పాదాలుగా, 191 అధికరణాలుగా, 555 సూత్రములుగా విభజించబడ్డాయి.

## మూడు ముఖ్యపదాల నిర్వచనాలు

1. **సూత్రం**

**అల్పాక్షరమసందిగ్ధం సారవత్ విశ్వతోముఖమ్।**

**అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః॥**

ఎ) **అల్పాక్షరమ్** – చాలా తక్కువ అక్షరాలు ఉండాలి. పెద్దపెద్ద వాక్యాలు ఉండకూడదు. సూత్రం రూపంలో పొందుపరిచే ఉద్దేశ్యం దాన్ని గుర్తుంచుకోవటానికి వీలుగా ఉంటుందని.

బి) **అసందిగ్ధమ్** – అర్థం చాలా స్పష్టంగా ఉండాలి. అయోమయంగా ఉండకూడదు. కొన్ని సూత్రాలను అర్థం చేసుకోవటం కష్టమైనా, కనీసం భాష్యం చదివాక అయినా ఆ సూత్రంయొక్క ఉద్దేశ్యం కొట్టొచ్చినట్టు తెలియాలి.

సి) **సారవత్** – ముఖ్యమైన అంశాల గురించే చెప్పాలి. అంటే సారవంతంగా ఉండాలి తప్ప, అనవసరమైన విషయాల జోలికి పోకూడదు.

డి) **విశ్వతోముఖమ్** – అవసరమైతే ఒకదానికన్నా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. అన్నీ అలా ఉండితీరాలనే నియమం లేదు కాని రెండు అర్థాలుంటే టూ ఇన్ వన్‌లాగా ఉంటుంది. అంటే ఆ సూత్రాన్ని విడదీయటంలోనే, సంయుక్త పదాలను విడదీయటంలోనే రెండు అర్థాలు రావచ్చు. అంటే కొన్ని పదాలను షష్ఠీ తత్పురుష సమాసంగా విడదీయవచ్చు లేదా బహువ్రీహి సమాసంగా విడదీయవచ్చు.

అలా కొన్ని త్రీడి ఫోటోలుంటాయి. ఒక కోణంలోంచి చూస్తే ఒక రూపం కనిపిస్తే, దాన్ని లోతుగా, ఇంకో కోణంలోంచి చూస్తే ఇంకొక రూపం కనిపిస్తుంది. అలా ఒకే సూత్రంలో రెండు అర్థాలు వస్తే రచయితకు కొన్ని పదాలు కలిసివస్తాయి.

ఇ) **అస్తోభమ్** – స్తోభ అంటే స్తుతించటం. దీనికి ఇంకొక అర్థం కూడా వస్తుంది. సామవేదంలో కొన్ని అక్షరాలను స్తోభ అంటారు. ఉదాహరణకు హ.ఉ. అలాంటి అక్షరాలమీద ఉపాసన కూడా వస్తుంది అందులో.

ఆ అక్షరాలు ఉండటంవల్ల ఏమీ ప్రయోజనం లేదు. బ్రహ్మసూత్రములు పూర్తిగా తర్కశాస్త్రం. దానిలో ఇలాంటి అలంకరణలకు చోటులేదు.

కొన్ని పద్యభాగాలలో ఛందస్సు సరిపోవటంకోసం చ, వై, అక్షరాలను కలుపుతారు. ఒక అక్షరం తగ్గితే 'చ' కలుపుతారు. నిజానికి వ్యాసాచార్యులవారిని **చకుక్షిః** అంటారు. అంటే ఆయన కడుపులో 'చ'కారాలు చాలా ఉన్నాయనీ, పురాణాలు రాసేటప్పుడు ఎక్కడైనా ఛందస్సుకు అవసరమైతే ఆయన 'చ'కారం వాడతారనీ అంటారు.

కాని బ్రహ్మసూత్రముల్లో అలా అనవసరంగా 'చ'కారం వాడకూడదు. బ్రహ్మసూత్రాల్లో ఒక్క అక్షరం తగ్గినా తగ్గినట్టే. వ్యాకరణ సూత్రంలో ఒక నియమం భాష్యకారుడు ఒక అక్షరం తగ్గించగలిగినా తగ్గించాలని వస్తుంది. అందువల్ల సూత్రకారుడు వారం రోజులు ఆలోచించి ఒక్క అక్షరాన్ని తగ్గించగలిగితే దాన్ని పుత్రోత్సాహంగా భావిస్తారు.

**అర్ధమాత్రా లాఘవేన పుత్రోత్సవః మన్యంతే వైయాకరణాః॥**

పుత్రుడు కలిగితే తండ్రికెంత ఆనందం కలుగుతుందో, అర్ధమాత్రను లేదా ఒక్క అక్షరాన్ని తగ్గించగలిగితే, సూత్రాకారునికి అంత ఆనందం కలుగుతుందట. దీన్నిబట్టి సూత్రం చిన్నగా ఉండటానికి వారు ఎంత తాపత్రయపడతారో అర్థమవుతోంది.

ఎఫ్) **అనవద్యమ్** – అనవద్యం అంటే నిర్దోషం. దోషాలు ఉండకూడదు. ఈ దోషాలు రెండు రకాలు. శబ్దదోషం, అర్థదోషం.

**శబ్దదోషమ్** – వ్యాకరణపరంగా దోషం ఉండకూడదు.

ఉదా – మనుష్యులు వస్తున్నాడు.

మనిషి వస్తున్నాడు అనాలి లేదా మనుష్యులు వస్తున్నారు అనాలి. ఆ విధంగా ఈ వాక్యంలో శబ్దదోషం ఉంది.

**అర్థదోషమ్** – అర్థపరంగా దోషం ఉండకూడదు.

ఉదా – అగ్ని చల్లగా ఉంటుంది

ఈ వాక్యం వ్యాకరణపరంగా సరిగ్గానే ఉంది. కాని అర్థం తప్పు. ఏ కాలంలోనూ, ఎక్కడా అగ్ని చల్లగా ఉండదు.

ఈ ఆరు నియమాలనూ పాటిస్తేనే దాన్ని సూత్రం అంటారు. సూత్రానికి ఇంకొక అర్థం ఉంది. అది దారం. బ్రహ్మసూత్రములకు రెండవ అర్థం కూడా సరిపోతుంది. వేదాల్లో అక్కడక్కడా వెదజల్లిన వేదాంతవాక్యాలను ఏర్చి, ఒక దారంలో గుచ్చినట్టుగా చేశారు వ్యాసాచార్యులవారు. అంటే 191 ముత్యాలను (అంశాలను) ఒక క్రమపద్ధతిలో అమర్చారు.

**వేదాంతవాక్యకుసుమ గ్రహణార్థత్వాత్ సూత్రమ్** అన్నారు శంకరులవారు. వేదాంతవాక్యాలు పువ్వులలాంటివి. వాటిని ఏర్చి, ఒక దారంలో అందంగా దండలాగా అమర్చారుట వ్యాసాచార్యులవారు. అందువల్ల సూత్రం అంటే దారం అని కూడా తీసుకోవచ్చు.

2. **భాష్యం**

**సూత్రార్థో వర్ణ్యతే యత్ర వాక్యైః సూత్రానుసారిభిః।**
**స్వపదాని చ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః॥**

భాష్యంలో సూత్రంలో ఉన్న ప్రతి ఒక్క పదాన్ని వివరించాలి. అందులోనూ ఆ పదాలు ఏ వరుసక్రమంలో ఉంటే ఆ వరుసక్రమంలోనే వివరించాలి. తనకు తోచినట్టుగా ఆ వరుసను మార్చకూడదు.

ఒకవేళ తను ఏవైనా స్వంతంగా కొన్ని సాంకేతిక పదాలను వాడితే, వాటిని కూడా భాష్యకారులు వివరించాలి.

3. **అధికరణం**

**విషయో సంశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**
**సంగతి శ్చేతి పంచకం శాస్త్రేఽధికరణం స్మృతమ్**

**పంచకమ్** – అధికరణంలో ఐదు అంశాలు ఉండాలి.

ఎ) **విషయః** – విషయం. ఏ విషయం గురించి ఈ అధికరణం చర్చిస్తున్నది? సమన్వయం, అవిరోధం, సాధన, ఫలాలలో దేని గురించి చర్చిస్తోంది? సాధారణంగా ఈ అధికరణల్లోని విషయాలను ప్రముఖమైన దశ ఉపనిషత్తులలోంచి తీసుకుంటారు.

బి) **సంశయః** – సంశయం. ఈ ఉపనిషత్తు వాక్యంలో ఉన్న సంశయం ఏమిటి? ఆ వాక్యం స్పష్టంగా ఉంటే, దాని గురించి చర్చించాల్సిన

అవసరం లేదు. నిజానికి విచారణ చెయ్యటానికి ఉండాల్సిన ముఖ్యమైన అంశం– అది సంశయాన్ని కలుగజేయాలి.

ఉదాహరణకు బ్రహ్మ అనే పదానికి అనేక అర్థాలున్నాయి. అవి బ్రాహ్మణుడు, ఓంకారం, వేదం, సత్యం, బ్రహ్మ. ఏ అర్థం ఈ సందర్భంలో సరిపోతుంది? పూర్వమీమాంసకులు ఒక అర్థం చెబుతారు. వాటిని చర్చించాలి.

సి) **పూర్వపక్షః** – పూర్వపక్షుల వాదన. అద్వైత వేదాంతానికి ముందు ఉన్న దార్శనికులందరినీ కలిపి పూర్వపక్ష దార్శనికులు అంటారు. ఇచ్చిన వాక్యాన్ని ఈ పూర్వపక్ష దార్శనికులు ఒకలా చూస్తారు. వారి వాదన ఏమిటో ఇందులో చూడాలి. దానికి వారు వారి తర్కాన్ని కూడా జోడిస్తారు.

డి) **ఉత్తరమ్** – అద్వైతసిద్ధాంతి జవాబు. అద్వైత వేదాంతం పూర్వపక్షపు వాదనను ఖండించి నిరూపించాలి, అది కూడా తార్కికంగా నిరూపించాలి. అంతేకాదు, పూర్వపక్ష వాదనలో ఐదు వాదనలు ఉంటే, ఐదింటినీ ఖండించాలి. ఒకటో, రెండో మాత్రమే ఖండిస్తే చాలదు. అన్నీ ఖండించటంలోని ఉద్దేశ్యం మన సిద్ధాంతంలో తర్కం దోషరహితం అని చూపించటం. అందువల్లనే దీనిని న్యాయశాస్త్రం అంటారు. న్యాయం అంటే తర్కం. అందువల్ల బ్రహ్మసూత్రములను న్యాయప్రస్థానం అంటారు.

ఇ) **సంగతిః** – సంబంధం. ముందు అంశానికీ, ఈ అంశానికీ మధ్య ఉన్న సంబంధాన్ని చూపించాలి. అధికరణానికి ఈ ఐదు అంశాలు ఉండితీరాలి. శంకరులవారు ప్రతి అధికరణమూ ముగిశాక, ఈ ఐదు అంశాలూ ఎలా సరిపోతాయో చాలా అద్భుతంగా చర్చిస్తారు.

## రెండు రకాల అనుమానప్రమాణాలు

ఉపనిషత్తుల్లో ఉన్న బోధను నిరూపించటానికి బ్రహ్మసూత్రాల్లో న్యాయశాస్త్రాన్ని వాడతారు వ్యాసాచార్యులవారు. న్యాయం పదాన్ని కొన్నిసార్లు యుక్తి అనీ, కొన్నిసార్లు తర్కం అనీ అంటారు. ఈ న్యాయం పదానికి సాంకేతిక పదం అనుమానం. దీన్ని ఇంగ్లీషులో ఇన్ఫరెన్స్ అంటారు.బ్రహ్మసూత్రములు ఈ అనుమాన ప్రమాణాన్ని వాడుతుంది.

అనుమాన ప్రమాణం ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక శాస్త్రజ్ఞుడు చంద్రుడు ఎప్పుడు వెలుగులోకి వచ్చాడో తెలుసుకోవాలనుకున్నాడు అనుకుందాము. అతనికి అది ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలియదు. కాబట్టి తను తన తర్కాన్ని జోడించాలి. అలాగని తనకిష్టం వచ్చినట్టు ఊహించకూడదు. చంద్రుని దగ్గర్నుంచి కొన్ని రాళ్ళను సేకరించి, వాటిని అధ్యయనం చేసి, దానికి తన తర్కం జోడించాలి. అది కోటి సంవత్సరాల ముందు పుట్టింది అనేస్తే అది ఊహాగానం అవుతుంది.

తన తర్కం సరిపోవాలంటే, అది ప్రత్యక్ష ప్రమాణంమీద ఆధారపడివుండాలి. శాస్త్రంలో అనుమానప్రమాణానికి నాలుగు అంశాలున్నాయి. తర్కశాస్త్రాన్ని పాటించే నైయాయికులు ప్రతిపాదించారు ఈ అనుమాన ప్రమాణాన్ని. మనం వారి నుంచి దీన్ని అరువు తెచ్చుకున్నాము. కాకపోతే వారి పద్ధతిని కొంచెంగా మార్చుకున్నాము మనం. వారు ఇందులో ఐదు అంశాల గురించి చెపితే మనం నాలుగు అంశాలే తీసుకుంటాము. అవి పక్షం, సాధ్యం, హేతువు, దృష్టాంతం. వీటిని ఒక ఉదాహరణ ద్వారా చూద్దాము. శాస్త్రం ఇచ్చే దృష్టాంతం ఇది. దీన్ని అనుమాన వాక్యం అంటారు. ఈ అనుమాన వాక్యాన్ని బ్రహ్మసూత్రములు నేర్చుకుంటున్నన్నాళ్ళూ గుర్తుంచుకోవాలి.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

| | | |
|---|---|---|
| **పక్షం** | **పర్వతః** | **కొండ** |
| **సాధ్యం** | **అగ్నిమాన్** | **అగ్ని ఉంది** |
| **హేతువు** | **ధూమవత్వాత్** | **పొగ** |
| **దృష్టాంతం** | **యథా మహానసే** | **వంటింట్లో ఉన్నట్టు** |

1. **పక్షం** – పర్వతః పక్షం అవుతుంది. ఎందుకంటే చర్చ పర్వతం గురించి జరుగుతున్నది. అగ్ని గురించి కాదు.

చర్చ ఎందుకు జరుగుతున్నది? ఎందుకంటే కొండ దగ్గర అగ్ని ఉందా లేదా అనే విషయంలో సందేహం ఉంది. అందువల్ల చర్చ జరుగుతున్న స్థానం కొండ. అందువల్ల పక్షం అంటే ఒక ప్రదేశం, ఒక స్థానం. చర్చనీయాంశం ఏమిటి? అక్కడ పొగ ఉందా, లేదా?

ఈ పక్షం ప్రత్యక్షం. కొండే అసలు కనపడకపోతే, కొండ దగ్గర అగ్ని ఉందా లేదా అనే చర్చకు ఆస్కారమే లేదు. అగ్ని ప్రత్యక్షం కాదు. అగ్ని కూడా ప్రత్యక్షం అయితే చర్చ అవసరం లేదు. కొండ కనపడకపోతే చర్చించలేము, అగ్ని కనపడితే చర్చ అవసరం లేదు. అగ్ని అప్రత్యక్షం కాబట్టి, మన తర్కాన్ని జోడిస్తున్నాము. కొండ కొంత కనబడుతోంది, కొంత కనబడటం లేదు. కనబడుతున్న భాగాన్ని మనం నిరూపించబోవటం లేదు. కనబడని అగ్నిని నిరూపించబోతున్నాము. అంటే ధర్మీ ప్రత్యక్షం, దాని ధర్మం అప్రత్యక్షం.

2. **సాధ్యం** – అగ్నిమాన్. సాధ్యం అంటే మనం చూపించే తర్కం. తద్వారా చేసే నిర్ణయం. మన తర్కం కంటికి కనబడదు. అగ్ని కనపడితే మనం తర్కం జోడించనవసరం లేదని చూశాము. అందువల్ల సాధ్యం ఎప్పుడూ అప్రత్యక్షం.

3. **హేతువు** – ధూమవత్వాత్. కారణం కొండమీద పొగ కనిపిస్తోంది. తర్కం ఉపయోగించేటప్పుడు కొన్ని సూక్ష్మభేదాలను గమనించాలి. ఇందులో రెండు అంశాలను గమనించాలి.

   ఎ) పొగ ఎక్కడ ఉంటే అగ్ని అక్కడే ఉండాలని చెప్పాలి. అంటే పొగ కొండమీద ఉంటే, అందువల్ల నా ఇంట్లో అగ్ని ఉంది అనకూడదు. పొగ ఎక్కడ ఉంటే అక్కడే అగ్ని ఉంటుంది. ఈ అంశాన్ని గుర్తుంచుకుంటే, తర్వాత దీనివల్ల వచ్చే ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవచ్చు.

   బి) పొగ ఉంటే అగ్ని ఉంటుంది కాని అగ్ని ఉంటే పొగ ఉండితీరాలనే నియమం లేదు. పొగ ఉన్న చోట అగ్ని ఉంటుందనే దానికి పాతకాలపు వంటిల్లు ఉదాహరణ అయితే, అగ్ని ఉంటే పొగ ఉండితీరాలని లేదు అనటానికి మన కొత్త వంటిల్లు ఉదాహరణ.

అందువల్ల కొండ దగ్గర పొగ చూస్తే, కొండ దగ్గర అగ్ని ఉందని నిరూపిస్తాము. ఈ హేతువు ప్రత్యక్షమా, అప్రత్యక్షమా? హేతువు అప్రత్యక్షమైతే, మళ్ళీ దాన్ని నిరూపించటానికి ఇంకొక తర్కం ఉపయోగించాలి. హేతువు ప్రత్యక్షం.

4. **దృష్టాంతం** – యథా మహానసే. పూర్వకాలం వంటిల్లు లేదా యజ్ఞశాలలు దీనికి ఉదాహరణ. దృష్టాంతం అంటే ఉదాహరణ. పొగ ఉంటే అగ్ని

ఉండి తీరుతుందని ఉదాహరణ మనకు చూపిస్తున్నది. ఇప్పుడు ఈ విషయాలన్నింటినీ మళ్ళీ పట్టికలో చూద్దాము.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

| | | | | |
|---|---|---|---|---|
| పక్షం | పర్వతః | కొండ | వస్తువు | ప్రత్యక్షం |
| సాధ్యం | అగ్నిమాన్ | అగ్ని ఉంది | నిర్ణయం | అప్రత్యక్షం |
| హేతువు | ధూమవత్వాత్ | పొగ | కారణం | ప్రత్యక్షం |
| దృష్టాంతం | యథా మహానసే | వంటింట్లో ఉన్నట్టు | ఉదాహరణ | అంతకుముందు ప్రత్యక్షం |

కొండ దగ్గర పొగను చూసి అగ్ని ఉందని ఊహిస్తాము, పూర్వకాలపు వంటిల్లును దృష్టిలో పెట్టుకుని. ఈ నిర్ణయానికి మూడు దశల్లో వస్తాము.

1. పొగ వస్తోందనే జ్ఞానం – కొండమీద పొగను చూస్తాము
2. పొగకూ అగ్నికీ ఉన్న సంబంధం – పొగను చూడగానే, పూర్వకాలపు వంటింట్లో పొగ, అగ్ని కలిసి ఉండటం గుర్తు వస్తుంది.
3. అగ్ని ఉండి ఉంటుందనే తర్కం – ఆ అగ్నిని ఇప్పుడు పొగ దగ్గర ఊహించుకుంటాము.

అంటే పొగను చూసి, పొగతో పాటు అగ్నిని గుర్తు తెచ్చుకుని, అగ్ని ఉందని నిర్ణయిస్తాము.

ఇప్పుడు పొగను చూడగానే అగ్ని గుర్తుకు వచ్చిందంటే దాని అర్థం పొగ–అగ్ని కలిసి ఉంటాయనే ప్రాథమిక జ్ఞానం ఉందన్నమాట మనకు. అంటే రెండు విషయాలు కలిసివుంటాయనే జ్ఞానం. దాన్ని వ్యాప్తి జ్ఞానం అంటారు. పొగ–అగ్ని విషయం తీసుకుంటే **వ్యాప్తిజ్ఞానం –**

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః** – ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది.

ఇంతకు ముందు జోడించిన తర్కాన్ని గుర్తుంచుకోవాలి. ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది కాని ఎక్కడ అగ్ని ఉంటే అక్కడ పొగ ఉండితీరాలని

లేదు. మన శరీరమే దీనికి ఉదాహరణ. మన శరీరంలో అగ్ని ఉంది కాని మనం పొగలు కక్కము.

ఈ వ్యాప్తి జ్ఞానంలో రెండు అంశాలుంటాయి. అవి వ్యాప్యం, వ్యాపకం. యత్ర యత్ర ధూమః – వ్యాప్యం; తత్ర తత్ర అగ్నిః – వ్యాపకం. ఇప్పుడు ధూమః స్థానంలో వ్యాప్యం, అగ్నిః స్థానంలో వ్యాపకం చెప్పి ఈ వ్యాప్తి వాక్యాన్ని చూద్దాము.

**యత్ర యత్ర వ్యాప్యం తత్ర తత్ర వ్యాపకం – వ్యాప్తి వాక్యం.**

అనుమానవాక్యంలో ధూమః హేతుః అనీ, అగ్నిః సాధ్యం అనీ చూశాము. అంటే వ్యాప్యం హేతుః అవుతుంది, అగ్నిః వ్యాపకం అవుతుంది. ఈ పదాలలో వ్యాప్తి వాక్యం చూద్దాము.

**యత్ర యత్ర హేతుః తత్ర తత్ర సాధ్యమ్॥**

అంటే ఎక్కడ కారణం ఉంటే, అక్కడ నిర్ణయం తీసుకోవటం కుదురుతుంది.

ఇప్పుడు ఈ వాక్యాలన్నీ కలిపి ఒకచోట చూద్దాము.

| | | |
|---|---|---|
| **అనుమాన వాక్యం** | – | **పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే** |
| **వ్యాప్తివాక్యం** | – | **యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః** |
| **సాంకేతిక పదాలు** | – | **యత్ర యత్ర వ్యాప్యం తత్ర తత్ర వ్యాపకమ్** |
| **తార్కిక పదాలు** | – | **యత్ర యత్ర హేతుః తత్ర తత్ర సాధ్యమ్** |

అలా వ్యాప్తివాక్యం ద్వారా అనుమాన వాక్యాన్ని నిరూపిస్తాము. వ్యాప్తి వాక్యం తప్పని నిరూపిస్తే, అనుమాన వాక్యం కూడా తప్పవుతుంది. వైజ్ఞానిక శాస్త్రం కూడా అనుమానప్రమాణాన్నే వాడుతుంది – పక్షం, హేతువు, సాధ్యం, దృష్టాంతం పదాలను ప్రత్యేకించి వాడకపోయినా, ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనం ప్రత్యక్ష ప్రమాణంద్వారా సమాచారాన్ని సేకరించి, దాన్నిబట్టి తర్కం ఉపయోగించి, ఒక నిర్ణయానికి వస్తున్నాము. అందువల్ల దేని గురించిన సమాచారం సేకరిస్తున్నామో, దాని గురించిన నిర్ణయమే చేయాలి.

దీనికి ముందు ఒక ఉదాహరణ చూద్దాము. ఒకవేళ మనం చంద్రునినుంచి సమాచారాన్ని సేకరిస్తే, మనం చెప్పే నిర్ణయం చంద్రుని గురించే ఉండాలి కాని మార్స్ గురించో, జూపిటర్ గురించో ఉండకూడదు. అంటే దీన్ని సాంకేతికపరంగా చెప్పాలంటే హేతువు, సాధ్యం ఒకే పక్షానికి చెందివుండాలి. నా రక్తాన్ని రక్షపరీక్షకు

ఇచ్చి, అందులో ఏమీ అనారోగ్యం లేకపోతే, అందువల్ల మా అమ్మ ఆరోగ్యం బాగుంది అనకూడదు. నా రక్తపరీక్ష నా ఆరోగ్యాన్ని గురించి మాట్లాడుతుంది. కొండమీద పొగ, కొండ దగ్గర అగ్ని ఉందని సూచిస్తుంది కాని మా ఇంట్లో అగ్ని ఉందని చెప్పదు.

ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే దీన్నించి మరో ముఖ్యమైన సిద్ధాంతాన్ని చూపించబోతున్నాము.

వైజ్ఞానిక శాస్త్రం సమాచారాన్ని బాహ్యంగా కనబడే విశ్వంనుంచి సేకరిస్తున్నది. అది ఒక చిన్న అణువు గురించి కావచ్చు, ఒక పెద్ద నక్షత్రం గురించి కావచ్చు– దాన్ని మైక్రోస్కోప్‌లో చూడవచ్చు, టెలిస్కోప్‌లో చూడవచ్చు. ఇప్పుడు బాహ్యప్రపంచం ఆత్మనా, అనాత్మనా?

అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం అని ఆత్మ గురించి నేర్చుకుంటాము.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1–3

అంటే ఆత్మ జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు అందదు. అంటే ఆత్మ ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. అంటే వైజ్ఞానిక శాస్త్రానికి అందదు. వైజ్ఞానిక శాస్త్రం సేకరించేదంతా అనాత్మనుంచి. అంతకుముందు సూత్రమేమన్నాం? దేని గురించి సమాచారాన్ని సేకరిస్తే, దాని గురించే నిర్ణయాన్ని చెప్పాలి. అంటే ఏ పక్షం గురించి హేతువును ఉపయోగిస్తే సాధ్యం ఆ పక్షం గురించే ఉండాలి. కొండ దగ్గర పొగను చూస్తే, కొండ దగ్గరే అగ్ని ఉండాలి. ఇది నియమం ఒకటి.

ఆత్మ గురించి ప్రత్యక్షంగా సమాచారం సేకరించలేము. ఇది నియమం రెండు. అందువల్ల వైజ్ఞానిక అనుమానాన్ని **లౌకిక అనుమానం** అంటారు. అది ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడివుంది. ప్రత్యక్షప్రమాణం అనాత్మకు చెందింది. ముండకోపనిషత్తు భాషలో చెప్పాలంటే అపరావిద్యకు చెందింది. లౌకిక అనుమానం ఆత్మ విద్యను బోధించలేదు –

**నైషా తర్కేణ మతిరాపనేయా**

ఆత్మజ్ఞానాన్ని తర్కంద్వారా పొందటానికి ఎన్నడూ ప్రయత్నించకూడదు. అది ఎలా ఉంటుందంటే, కంటిద్వారా వినటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. అది

ఎంత అర్థం లేని పని! ఏ ప్రమాణం పరిధి దానికి ఉంటుంది. కన్ను రూపాన్ని చూడగలదు, చెవి శబ్దాన్ని వినగలదు. కన్ను శబ్దాన్ని వినలేదు, చెవి రూపాన్ని చూడలేదు. ఇది వివరించటానికి బ్రహ్మసూత్రముల్లోనే ఒక సూత్రం ఉంది. దాని అర్థం తర్కం ఆత్మను నిరూపించలేదు. అలాగైతే శాస్త్రంలో తర్కం ఎందుకు వాడతారు? బ్రహ్మసూత్రముల్లో వాడే తర్కం ఏమిటి? ఇది ఖచ్చితంగా లౌకిక అనుమానానికి భిన్నంగా ఉండాలి. ఎందుకంటే లౌకిక అనుమానంద్వారా ఆత్మను తెలుసుకోలేము.

కాని ఏ అనుమాన ప్రమాణానికైనా ముందు ఒక సమాచారాన్ని సేకరించాలి. కాని ఆత్మజ్ఞానానికి బాహ్యప్రపంచంనుంచి సమాచారాన్ని సేకరించలేము అని చూశాము. అయితే మరి ఎలా? ఆత్మజ్ఞానానికి సమాచారాన్ని శాస్త్రంనుంచి సేకరించాలి. బ్రహ్మసూత్రముల్లో వాడిన అనుమాన ప్రమాణం శాస్త్రప్రమాణం నుంచి సేకరించిన సమాచారంమీద ఆధారపడి చేసినది.

ఈ విషయాన్ని చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. బ్రహ్మసూత్రముల్లో వాడిన అనుమాన ప్రమాణం శాస్త్రప్రమాణంనుంచి సేకరించిన సమాచారంమీద ఆధారపడివుంది. ఎందుకు? మనం ఆస్తికులము, శాస్త్రప్రమాణం అస్తి అంటాము. అందువల్ల శాస్త్రప్రమాణం ప్రత్యక్షప్రమాణం అంత గొప్పది.

విజ్ఞానశాస్త్రజ్ఞుడు ప్రత్యక్ష ప్రమాణాన్ని అంటే కంటితో చూసినదాన్ని ప్రశ్నిస్తాడా? లేదు. ఎందుకంటే ప్రత్యక్ష ప్రమాణానికి అంత విలువ ఉంది. అందువల్ల ఏ శాస్త్రజ్ఞుడు కూడా ప్రత్యక్ష ప్రమాణాన్ని ప్రశ్నించడు, దాన్నించి చేసిన నిర్ణయాన్ని ప్రశ్నిస్తాడు.

అలాగే శాస్త్రం విషయానికొచ్చేసరికి శాస్త్రం తిరుగులేని ప్రమాణం. శాస్త్రాన్ని ఎవరూ ప్రశ్నించరు. కాని వచ్చిన చిక్కల్లా శాస్త్రాన్ని అర్థం చేసుకునే తీరులో వస్తున్నది. ఒకే శాస్త్రాన్ని అధ్యయనం చేసి మూడు సిద్ధాంతాలను ఏర్పరచారు ముగ్గురు ఆచార్యులు. ఈ శాస్త్రంనుంచి వచ్చిందే ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం. లౌకిక అనుమానంలో ప్రత్యక్ష ప్రమాణానికి ఎంత విలువ ఉందో, శాస్త్ర అనుమానంలో శాస్త్రప్రమాణానికి అంత విలువ ఉంది. అంటే లౌకిక అనుమానంలో హేతువు బాహ్యప్రపంచంమీద ఆధారపడితే, శాస్త్ర అనుమానంలో హేతువు శాస్త్రంమీద ఆధారపడివుంది.

శాస్త్ర అనుమానం ఆస్తికులే పాటిస్తారు. నాస్తికులు శాస్త్రాన్ని నమ్మరు కాబట్టి, వారికి బ్రహ్మసూత్రములుమీద శ్రద్ధ ఉండదు. బ్రహ్మసూత్రములు నేర్చుకుంటే నాస్తికులతో వాదించవచ్చని ఆశ పడకండి! వారు శాస్త్రమే నమ్మనప్పుడు, శాస్త్ర ఆధారంగా వచ్చిన బ్రహ్మసూత్రములను ఎలా నమ్ముతారు? కాబట్టి బ్రహ్మసూత్రములు పనికి వచ్చేది ఆస్తికులకే, నాస్తికులకు కాదు.

అంటే బ్రహ్మసూత్రముల్లో అసలు లౌకిక అనుమానం లేదా? ఉంది, కాని ఆ లౌకిక అనుమానాన్ని వేదాంతాన్ని నిరూపించటానికి వాడలేదు. ఎందుకు? జవాబు చాలా తేలిక. లౌకిక అనుమానం అనాత్మ గురించి చెపితే వేదాంతం ఆత్మ గురించి చెబుతుంది. అమావాస్యకూ, అబ్దుల్ కలామ్‌కూ మధ్య పోలిక ఉందా అంటే ఏం చెబుతాము? అందువల్ల లౌకిక అనుమానం ఆత్మ ఉందని చెప్పలేదు. అంతేకాదు, ఆత్మ లేదనీ చెప్పలేదు. ఎందుకు?

ఎవరైనా 'నా కన్ను సరిగ్గా పనిచెయ్యటం లేదు. కాస్త సరిగ్గా చూసి ఇది 8 అంకెనా, 3 అంకెనా చెప్పండి' అని అడిగారనుకోండి. మీరు దేనితో చూస్తారు? మీ కన్నుతోనా, చెవితోనా? కన్నుతోనే అది 8 అని నిరూపించాలి, లేదా కన్నుతోనే 3 కాదని నిరూపించాలి. అంటే ఒక వస్తువును అవునని నిరూపించాలన్నా, కాదని వాదించాలన్నా కూడా కన్నే వాడాలి. ఇది ఈ రంగు కాదని చెవితో కొట్టివేయలేము.

ఈ నియమం ప్రకారం లౌకిక అనుమానం వేదాంతబోధను అవుననీ నిరూపించలేదు, కాదనీ కొట్టి వేయలేదు.

కాని నాస్తికులు ఏం చేస్తారంటే లౌకిక అనుమానం వాడతారు. వారు శాస్త్రాన్ని నమ్మరు కాబట్టి లౌకిక అనుమానంద్వారా వేదాంతబోధ తప్పని వాదిస్తారు. అసలు వేదాంతాన్ని లౌకిక అనుమానం పట్టుకోలేదని మనకు తెలుసు. అందువల్ల మనమేం చేస్తాం? వారి లౌకిక అనుమానమే వాడి వేదాంతబోధ తప్పని చెప్పే వారి వాదన తప్పని నిరూపిస్తాము. అది రెండు రకాలుగా చేస్తాము.

1. అంటే మనం తర్కాన్ని వాడేది వేదాంతం తార్కికంగా ఉందని నిరూపించటానికి కాదు, కాని వేదాంతం తార్కికంగా లేదు అనటానికి లేదని నిరూపించటానికి.

2. ఈ నాస్తికులు శాస్త్రాన్ని నమ్మరు కాబట్టి, వారు ఆత్మస్వరూపాన్ని లౌకిక అనుమానం ఉపయోగించి అర్థం చేసుకుంటారు. అదే లౌకిక అనుమానాన్ని

మనం ఉపయోగించి, వారి సిద్ధాంతం తప్పని నిరూపిస్తాము. వారికి శాస్త్రఅనుమానం వాడలేము. అందువల్ల లౌకిక అనుమానంతోనే వాదించి వారి సిద్ధాంతం తప్పని చెబుతాము. లౌకిక అనుమానంద్వారా వేదాంతాన్ని నిరూపించము; లౌకిక అనుమానం నిరూపించిన దాన్ని తప్పని చూపిస్తాము.

వైజ్ఞానశాస్త్రంలో ఒక శాస్త్రజ్ఞుడు చెప్పినదాన్ని తర్వాత వచ్చిన శాస్త్రజ్ఞుడు మారుస్తూనే ఉంటాడు. అందువల్ల ఏ శాస్త్రజ్ఞుడు కూడా ఇది తిరుగులేని సత్యం అని చెప్పడు. ఇది నా సిద్ధాంతం అంటాడు. మనం సైన్సును కించపరచటం లేదు. సైన్సువల్ల మన జీవనవిధానం ఎంతో మెరుగుపడింది. ఎన్నో అద్భుతాలను అనుభవించ గలుగుతున్నాము. కాని సైన్సు పరిధి వేరు అంటున్నాము అంతే.

**అచింత్యా ఖలు యే భావాః న తాం తర్కేణ యోజయేత్॥**

సైన్సుకు అందని అంశాలు ఉన్నాయని ఒప్పుకుని తీరాలి.

ఆ విధంగా వ్యాసాచార్యులు లౌకిక అనుమానంద్వారా ఐదు నాస్తిక దర్శనాలను (చార్వాకదర్శనాన్ని పట్టించుకోరని చూశాము) ఖండిస్తారు ఈ బ్రహ్మసూత్రములలో. శాస్త్ర అనుమానంద్వారా తక్కిన ఆస్తికులను ఖండిస్తారు. అలా మనకు రెండు రకాల అనుమానప్రమాణాలు ఉన్నాయి. అవి లౌకిక అనుమానం, శాస్త్ర అనుమానం.

రెండింటిలో సమానంగా ఉన్న అంశాలు –

ఎ) రెండూ ఇంకొక ప్రమాణంద్వారా సేకరించిన సమాచారంమీద ఆధారపడతాయి.

బి) రెండూ సేకరించిన సమాచారాన్ని ప్రశ్నించవు. ప్రత్యక్ష ప్రమాణం ఎంత సత్యమో, ఆస్తికునికి శాస్త్రప్రమాణం అంత సత్యం. ఎందులోనైనా ప్రశ్నించేది వారు దానిద్వారా చెప్పే సిద్ధాంతాన్ని.

**రెండింటి మధ్య ఉన్న భేదాలు**

| | లౌకిక అనుమానం | శాస్త్ర అనుమానం |
|---|---|---|
| ఎ) | అనాత్మ గురించి చెబుతుంది | ఆత్మ గురించి చెబుతుంది |
| బి) | ప్రత్యక్షప్రమాణం ఆధారం | శాస్త్రప్రమాణం ఆధారం |

| | | |
|---|---|---|
| సి) | వేదాంతాన్ని నిరూపించలేదు, ఖండించలేదు | వేదాంతాన్ని నిరూపిస్తుంది |
| డి) | దీన్ని దుష్తర్కం అంటారు | దీన్ని శ్రుతిసమ్మత తర్కం అంటారు |

లౌకిక అనుమానంయొక్క ప్రయోజనాలు –

ఎ) వేదాంతం తార్కికంగా లేదు అనటానికి లేదని నిరూపించటానికి

బి) నాస్తికదర్శనాలు తార్కికంగా లేవని నిరూపించటానికి.

***

# విహంగవీక్షణము - ముఖ్యమైన అంశములు

| | | |
|---|---|---|
| అధ్యాయాలు | – | 4 |
| పాదాలు (అధ్యాయానికి 4 పాదాలు) | – | 16 |
| అధికరణాలు | – | 191/192 |

(ఒక పాదంలో అధికరణాలు సమాన సంఖ్యలో ఉండవు)

| | | |
|---|---|---|
| సూత్రములు | – | 555 |

(ఒక అధికరణంలో సూత్రములు సమానసంఖ్యలో ఉండవు)

అంశాలు – దశ ఉపనిషత్తులలో ముఖ్యమైన మంత్రాలు

భారతీతీర్థుల విరచిత అధికరణ న్యాయమాల లేదా వైయాసిక న్యాయమాల

| అధ్యాయాల పేర్లు | –అంశం | – వివరణ |
|---|---|---|
| 1. సమన్వయ అధ్యాయము | – సమన్వయము | – వేదాంత సారం బ్రహ్మ విద్య, కర్మవిద్యకాదు |
| 2. అవిరోధ అధ్యాయము | –అవిరోధము | –శ్రుతికీ, శ్రుతికీ మధ్య విరోధం లేదు<br>–శ్రుతికీ, స్మృతికీ మధ్య విరోధం లేదు<br>–శ్రుతికీ, యుక్తికీ మధ్య విరోధం లేదు<br>(తక్కిన పది దర్శనముల ఖండన) |
| 3. సాధన అధ్యాయము | – సాధన | –సాక్షాత్ సాధన – జ్ఞానము<br>–సహకారీ సాధనలు –కర్మ, ఉపాసన, విలువలు |
| 4. ఫల అధ్యాయము | –ఫలము | –మోక్షము జీవన్ముక్తి, విదేహముక్తి క్రమముక్తి |

**మూడు ముఖ్యపదాల నిర్వచనాలు**

**1. సూత్రమ్ – అల్పాక్షరమసందిగ్ధం సారవత్ విశ్వతోముఖమ్**
**అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః**

| | |
|---|---|
| అ) అల్పాక్షరమ్ | – చాలా తక్కువ అక్షరాలు ఉండాలి |
| ఆ) అసందిగ్ధమ్ | – అర్థం చాలా స్పష్టంగా ఉండాలి, భాష్యం |

| | |
|---|---|
| | చదివాక అయినా |
| ఇ) సారవత్ | – ముఖ్యమైన అంశాల గురించే చెప్పాలి. |
| ఈ) విశ్వతోముఖమ్ | – అవసరమైతే ఒక దానికన్నా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. |
| ఉ) అస్తోభమ్ | – హ, ఉ, చ, వై అక్షరాలు ఉండకూడదు. |
| ఎఫ్) అనవద్యమ్ | – నిర్దోషం అంటే శబ్దదోషం, అర్థదోషాలు ఉండకూడదు. |

వేదాంతవాక్యకుసుమ గ్రహణార్థత్వాత్ సూత్రమ్ – శంకర భగవత్పాదులు వేదాంతవాక్యాలు దారంలో దండలాగా గుచ్చబడ్డాయి, సూత్రములలో.

**2. భాష్యమ్**

**సూత్రార్థో వర్ణ్యతే యత్ర వాక్యైః సూత్రానుసారిభిః।**
**స్వపదాని చ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః॥**

భాష్యంలో, సూత్రంలో ఉన్న ప్రతి ఒక్క పదాన్ని వివరించాలి; వాక్యంలో ఉన్న వరుసక్రమంలోనే వివరించాలి. స్వంతంగా పదాలు వాడితే వాటిని కూడా వివరించాలి.

**3. అధికరణమ్**

**విషయో సంశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**
**సంగతి శ్చేతి పంచకం శాస్త్రేఽధికరణం స్మృతమ్**

పంచకమ్ – ఐదు అంశాలు ఉండాలి అధికరణంలో

1. విషయః – విషయం
2. సంశయః – సంశయం
3. పూర్వపక్షః – పూర్వపక్షుల వాదన
4. ఉత్తరమ్ – అద్వైతసిద్ధాంతి జవాబు
5. సంగతిః – సంబంధం

రెండు రకాల అనుమాన ప్రమాణాలు

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్త్వాత్ యథా మహానసే॥**

| | | | | |
|---|---|---|---|---|
| పక్షం | పర్వతః | కొండ | వస్తువు | ప్రత్యక్షం |
| సాధ్యం | అగ్నిమాన్ | అగ్ని ఉంది | నిర్ణయం | అప్రత్యక్షం |
| హేతువు | ధూమవత్త్వాత్ | పొగ | కారణం | ప్రత్యక్షం |
| దృష్టాంతం | యథా మహానసే | వంటింట్లో ఉన్నట్టు | ఉదాహరణ | అంతకుముందు ప్రత్యక్షం |

**3 దశలు**

| | |
|---|---|
| 1. పొగ వస్తోందనే జ్ఞానం | - కొండమీద పొగను చూస్తాము |
| 2. పొగకూ అగ్నికీ ఉన్న సంబంధం | - పొగను చూడగానే, పూర్వకాలపు వంటింట్లో పొగ, అగ్ని కలిసి ఉండటం గుర్తు వస్తుంది. |
| 3. అగ్ని ఉండి ఉంటుందనే తర్కం | - ఆ అగ్నిని ఇప్పుడు పొగ దగ్గర ఊహించుకుంటాము. |

వ్యాప్తి జ్ఞానం = వ్యాప్యం (ధూమః) + వ్యాపకం (అగ్నిః)
రెండు వస్తువులు కలిసి ఉంటాయనే జ్ఞానం వ్యాప్తి జ్ఞానం
యత్ర యత్ర వ్యాప్యం తత్ర తత్ర వ్యాపకం
పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే
ఇప్పుడు ఈ వాక్యాలన్నీ కలిపి ఒకచోట చూద్దాము.

**అనుమాన వాక్యం - పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**
**వ్యాప్తివాక్యం - యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**
**సాంకేతిక పదాలు - యత్ర యత్ర వ్యాప్యం తత్ర తత్ర వ్యాపకమ్**
**తార్కిక పదాలు - యత్ర యత్ర హేతుః తత్ర తత్ర సాధ్యమ్**

వ్యాప్తివాక్యాన్ని నిరూపిస్తేనే - అనుమావాక్యం నిరూపించబడుతుంది.
వ్యాప్తివాక్యానికి ఆధారం - ప్రత్యక్షప్రమాణం

| **లౌకిక అనుమానం** | **శాస్త్ర అనుమానం** |
|---|---|
| ఎ) అనాత్మ గురించి చెబుతుంది | ఆత్మ గురించి చెపుతుంది |
| బి) ప్రత్యక్షప్రమాణం ఆధారం | శాస్త్రప్రమాణం ఆధారం |
| సి) వేదాంతాన్ని నిరూపించలేదు, ఖండించలేదు | వేదాంతాన్ని నిరూపిస్తుంది |
| డి) దీన్ని దుష్టర్కం అంటారు | దీన్ని శ్రుతిసమ్మత తర్కం అంటారు |

లౌకిక అనుమానంయొక్క ప్రయోజనాలు -
ఎ) వేదాంతం తార్కికంగా లేదు అనటానికి లేదని నిరూపించటానికి
బి) నాస్తికదర్శనాలు తార్కికంగా లేవని నిరూపించటానికి.

***

# అధ్యాస భాష్యమ్

బ్రహ్మసూత్రముల భాష్యం రాసేముందు ఉపోద్ఘాతంగా శంకరులవారు అధ్యాసభాష్యం రాశారు. ఇది చాలా ప్రసిద్ధి చెందింది. అధ్యాస అంటే పొరపాటు.

ఈ భాష్యంలో శంకరులవారు నిరూపించిన అంశం మనం ఈ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. కాని ఆ సంసారమే ఒక పెద్ద పొరపాటు. లేని సంసారం గురించి అంత బాధ పడుతున్నామంటే, నిజంగా ఎంత బాధాకరమైన విషయం అది!

ఇది అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. ఎందుకంటే సంసారం అధ్యాసవల్ల ఏర్పడిందని అర్థం చేసుకుంటే, సంసారనివృత్తి అధ్యాసనివృత్తివల్ల కలుగుతుందని తెలుసుకోవచ్చు. ఎందుకంటే పొరపాటు తొలిగితే, పొరపాటువల్ల కలిగిన సమస్య కూడా తొలుగుతుంది.

ఈ పొరపాటు ఎందుకు కలిగింది? దీనికి జవాబు చాలా తేలిక. ఏ పొరపాటైనా సరే దానికి సంబంధించిన జ్ఞానంవల్ల పోతుంది. అజ్ఞానంవల్ల అధ్యాస ఏర్పడుతుంది. అధ్యాసవల్ల సంసారం ఏర్పడుతుంది. అందువల్ల సంసారం పోవాలంటే అధ్యాస పోవాలి; అధ్యాస పోవాలంటే అజ్ఞానం పోవాలి; అజ్ఞానం పోవాలంటే జ్ఞానం కలగాలి.

**జ్ఞానేన ఏవ మోక్షః**

కర్మవల్ల మోక్షం రాదు, భక్తివల్ల మోక్షం రాదు, ఉపాసనవల్ల మోక్షం రాదు, యోగాసనం వెయ్యటంవల్ల మోక్షం రాదు.

**బ్రహ్మాత్మైకృత్వ బోధేన వినా మోక్షో న సిద్ధ్యతి॥**
**నాన్యః పంథా అయనాయ విద్యతే॥**

**జ్ఞానాత్ ఏవ కైవల్యమ్॥**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః॥**

ఇక్కడ ఒక విషయం గమనించాలి. మనం కర్మ, ఉపాసన, భక్తి – ఇవి పనికిరావని కొట్టివేయటం లేదు. అవి జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తాయి;

కాని సాక్షాత్తూ సాధనలు కావు. మోక్షాన్ని ఇవ్వలేవు. సంసారం అనే బంధం అజ్ఞానంవల్ల ఏర్పడితే, ఆ అజ్ఞానం తొలిగితే కాని బంధం పోదు.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

కర్మకాండను వదిలి జ్ఞానకాండకు ఎందుకు వచ్చాము? జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇవ్వగలదు కాబట్టి. ఇదీ ఈ అధ్యాసభాష్యంయొక్క సారాంశం. ఇప్పుడు వివరాలలోకి వెళదాము.

ఈ అధ్యాస అంశాన్ని అర్థం చేసుకోవటానికి వేదాంతం ఎప్పుడూ ఒక ఉదాహరణను చెబుతుంది. దాన్ని రజ్జుసర్పభ్రాంతి అంటారు. ఈ ఉదాహరణను మాండూక్యకారికల్లో గౌడపాదులవారు పేర్కొన్నారు.

**రజ్జౌ సర్ప బుద్ధిః**

తాడును చూసి పాముగా పొరపడటాన్ని రజ్జుసర్ప భ్రాంతి అంటారు. కంబరామాయణంలో కూడా దీన్ని చూస్తారు. అంటే ఈ ఉదాహరణ ఎప్పటినుంచో వస్తున్నది. రజ్జుసర్ప భ్రాంతి గురించి ఎన్నోసార్లు విన్నాము కాని ఇప్పుడు మరింత లోతుగా విశ్లేషించబోతున్నాము.

ఎప్పుడు తాడుని చూసి పాముగా పొరపడతాము? అక్కడ పూర్తిగా చీకటిగా ఉండి, తాడు కూడా కనపడకపోతే, తాడుని చూసి పాముగా పొరపడే అవకాశం లేదు. అంటే పూర్తి చీకటిలో సమస్య లేదు. అందువల్ల ఇగ్నొరెన్స్ ఈజ్ బ్లిస్ అంటారు. సుషుప్తి అవస్థలో ఉన్నప్పుడు మనకు ఏమీ తెలియదు. అందువల్ల ఆనందంగా నిద్రపోతాము.

అక్కడ కాంతి స్పష్టంగా ఉండి, తాడు పూర్తిగా కనపించినా సమస్య లేదు. తాడుని తాడుగానే చూస్తాము. అంటే నాలెడ్జి ఆల్సో ఈజ్ బ్లిస్. జ్ఞానికి ఏ దుఃఖమూ లేదు.

మరయితే సమస్య ఎప్పుడు వస్తుంది?

అక్కడ ఒక వస్తువు కనబడేటంత వెలుతురు ఉండి, అదేమిటో తెలియనంత చీకటి ఉంటే పొరపాటు వస్తుంది. అంతకుముందు ఎక్కడో పాముని చూశాము. అందువల్ల పాములా మెలికలు తిరిగివున్న తాడుని చూసి పాము అని

భ్రమపడతాము. అంటే మంద అంధకారం లేదా మందప్రకాశం ఉండాలి. సంధ్యాసమయం అలా ఉంటుంది. అలాంటప్పుడు మనకు సగం జ్ఞానమే కలుగుతుంది.

ఏం తెలిసింది? అక్కడేదో ఉందని తెలిసింది. ఏం తెలియలేదు? అదేమిటో తెలియలేదు.

అక్కడేదో ఉంది – సామాన్య జ్ఞానం

అక్కడేదో ఉంది అనేది సామాన్య అంశం. అది కప్పబడలేదు. కంటికి కనిపిస్తోంది. అంటే అనావృత అంశం. అది అక్కడ నిజంగా ఉంది, మన భ్రమ కాదు. అంటే అది సత్య అంశం.

అంటే ఇప్పుడు మూడు కొత్త పదాలను నేర్చుకున్నాము. అవి – సామాన్య అంశం, అనావృత అంశం, సత్య అంశం.

అక్కడ ఉన్నది తాడు.

కాని అక్కడ చీకటిగా ఉండటంవల్ల అది తాడు అని తెలియటం లేదు. తాడుని విశేష అంశం అంటారు. అది చీకటిలో ఉండి, కనబడటం లేదు కాబట్టి దాన్ని ఆవృత అంశం అంటారు. ఇప్పుడు ఇంకో రెండు కొత్త పదాలను చూశాము. అవి విశేష అంశం, ఆవృత అంశం.

| | |
|---|---|
| అక్కడ ఉన్నది తాడు | – వాక్యం |
| అక్కడ ఉన్నది | – సామాన్య, అనావృత, సత్య అంశం |
| తాడు | – విశేష, ఆవృత అంశం. |

విశేష అంశం కప్పబడివుంటే, మనమేం చేస్తున్నాము? పోనీలే అని ఊరుకుంటున్నామా? మన మనస్సు నిండా ఆలోచనలే. వెంటనే తాడుని పోలిన పామును గుర్తు తెచ్చుకుంటున్నాము. అంటే ఆవృత విశేషఅంశాన్ని ఇంకొక విశేష అంశంతో మారుస్తున్నాము. అంటే విశేషఅంశం అయిన తాడుని తీసి, ఇంకొక విశేషఅంశం అయిన పాముని పెడుతున్నాము.

గుర్తుంచుకోండి, మనం సామాన్య అంశాన్ని ఏమీ మార్చటం లేదు. అక్కడ ఉన్నది – అలాగే ఉంది. అది సామాన్య, అనావృత, సత్య అంశం అని చూశాము

కదా. దానికి వేరే లేని విశేష అంశాన్ని కలుపుతున్నాము కాబట్టి పాము మిథ్య లేదా అనృత అంశం అయింది. ఇప్పుడు ఈ వాక్యాన్ని చూడండి. ఇందులో రెండు భాగాలున్నాయి.

అక్కడ ఉన్నది పాము

| | |
|---|---|
| అక్కడ ఉన్నది | – సామాన్య, అనావృత, సత్య అంశం |
| పాము | – విశేష, ఆవృత, మిథ్యా అంశం |

అందువల్ల ప్రతి అధ్యాసలోనూ రెండు అంశాలుంటాయి. అవి సత్యసామాన్య అంశం; మిథ్యా విశేష అంశం. ఎందుకు మిథ్యావిశేష అంశం వచ్చింది? ఎందుకంటే అసలు విశేష అంశం కప్పబడివుంది కాబట్టి.

ముందు అక్కడ ఉన్నది పాము అనుకున్నాము. ఎవరో టార్చ్‌లైట్ వేసి చూపించారు. అది పొరపాటు అని తెలిసింది. అప్పుడా వాక్యాన్ని సరిదిద్దుకుని అక్కడ ఉన్నది తాడు అన్నాము.

అక్కడ ఉన్నది పాము – అక్కడ ఉన్నది తాడు. ఈ రెండు వాక్యాల్లోనూ పొరపాటు ఎక్కడ దిద్దబడింది? సామాన్య అంశంలోనా, విశేష అంశంలోనా? రెండు వాక్యాల్లోనూ సమానంగా ఉన్నది – అక్కడ ఉన్నది. అది సామాన్య అంశం. అది మారదు. ఎందుకంటే అది సత్యం; అనావృతం. పొరపాటు దిద్దుకున్నది విశేషఅంశంలో. పాముని తీసి, తాడుని పెట్టాము.

ఎప్పుడైతే ఈ పొరపాటుని దిద్దుకుంటామో, అప్పుడే పాముని చూసి కలిగిన భయం మటుమాయమవుతుంది. దీన్నే సంసారనివృత్తి అంటారు. ఇప్పుడు కొత్తగా తాడు భయం వచ్చింది అనకూడదు. పాపం తాడు మనను భయపెట్టదు. అది మనకు పనికివచ్చే వస్తువే కాని హాని కలుగజేసేది కాదు.

ఇప్పుడు ఈ సూత్రాన్ని నేను ఉన్నాను ఆనంద స్వరూపునిగా వాక్యానికి అన్వయిద్దాము. ఇక్కడ కూడా రెండు అంశాలు, వాటి వివరాలు వస్తాయి.

| | |
|---|---|
| నేను ఉన్నాను ఆనందస్వరూపునిగా | – వాక్యం |
| నేను ఉన్నాను | – సామాన్య, అనావృత, సత్య అంశం |
| ఆనంద స్వరూపునిగా | – విశేష, ఆవృత అంశం |

నేను ఎవరు? సత్, చిత్, ఆనందాన్ని. నేను అనే పదం నా చిత్ స్వరూపాన్ని అంటే చైతన్యస్వరూపాన్ని తెలియజేస్తుంది. ఉన్నాను అనే పదం నా సత్ స్వరూపాన్ని

అంటే నా ఉనికిని తెలియజేస్తుంది. నేను ఉన్నాను అంటే నాకు ఉనికి లేనిదే నేను లేను; నాలో చైతన్యం లేనిదే నేను మాట్లాడలేను. అందువల్ల సత్, చిత్ అంశాలలో సమస్యలేదు. అవి సామాన్య, అనావృత, సత్య అంశాలు. మరి సమస్య ఎక్కడ ఉంది?

విశేష అంశంలో. విశేష అంశం కప్పబడివుంటే, మనమేం చేస్తున్నాము? ఆవృత విశేష అంశాన్ని ఇంకొక విశేష అంశంతో మారుస్తున్నాము. అంటే విశేష అంశం అయిన ఆనందస్వరూపుణ్ణి తీసి, ఇంకొక విశేష అంశం అయిన సంసారి పదాన్ని పెడుతున్నాము.

ఇక్కడ కూడా మనం సామాన్య అంశాన్ని మార్చటం లేదు. అది అలాగే ఉంది. నేను సత్, చిత్ అంశాలలో సందేహం లేదు. వాటిని ఇంగ్లీషులో existence , consciousness అంటారు. లేని ఇంకో విశేష అంశాన్ని కలుపుతున్నాము కాబట్టి సంసారి మిథ్యా అంశం అయింది. ఇందులో కూడా రెండు అంశాలు ఉన్నాయి.

| | |
|---|---|
| నేను ఉన్నాను సంసారిగా | – వాక్యం |
| నేను ఉన్నాను | – సామాన్య, అనావృత, సత్య అంశం |
| సంసారిగా | – విశేష, ఆవృత, మిథ్యా అంశం |

ఇక్కడ కూడా సత్యసామాన్య అంశం, మిథ్యా విశేష అంశాలు ఉన్నాయి. ఎందుకు మిథ్యావిశేష అంశం వచ్చింది? ఎందుకంటే అసలు విశేషఅంశం కప్పబడివుంది కాబట్టి. కప్పబడివున్న విశేష అంశం ఏమిటి? అసంసారి బ్రహ్మ, ఆనంద స్వరూపుణ్ణి, అనంతత్వాన్ని, పూర్ణత్వాన్ని, బ్రహ్మను. ఇవి తీసేసి సంసారి జీవిని, దుఃఖస్వరూపుణ్ణి, పరిచ్ఛిన్నుణ్ణి, అపూర్ణుణ్ణి అనుకుంటున్నాము.

| | |
|---|---|
| నేను ఉన్నాను బ్రహ్మగా | – నేను ఉన్నాను జీవిగా |
| I am Brahma | – I am Jiva |

ఈ రెండు వాక్యాల్లోనూ పొరపాటుని ఎక్కడ దిద్దాలి? సామాన్య అంశాన్ని దిద్దనవసరం లేదు. 'జీవిగా' అనే విశేష అంశాన్ని తొలగించాలి. గురువు వేదాంత ఉపదేశం అనే టార్చిలైటు పట్టుకుని, 'తత్ త్వం అసి' అనే బటనును నొక్కితే, శిష్యునికి 'అహం బ్రహ్మ అస్మి' జ్ఞానం కలుగుతుంది. పూర్ణత్వం కలుగుతుంది. అది అహం సంసారీ అస్మి అనే అపోహను తొలగిస్తుంది.

**అహం సంసారీ అస్మి** అపోహ పోయి **అహం ముక్తః అస్మి** జ్ఞానం వస్తుంది (ఇప్పుడు అపోహ అనకూడదు). ప్రస్థానత్రయం సారాంశం ఇదే. శంకరాచార్యులు అధ్యాసభాష్యం రాశారు. జాగ్రత్తగా చూడండి, భాష్యం అధ్యాస కాదు. అధ్యాసమీద భాష్యం. ఈ అధ్యాసమీదనే పుంఖానుపుంఖాలుగా భాష్యాలు వచ్చాయి. అన్ని దర్శనాల అపోహలను చర్చించారు అందులో. చివరికి అద్వైత సిద్ధాంతం బోధించే అధ్యాస భాష్యం సరియైనది అని నిరూపించబడుతుంది.

ఇప్పుడు ఈ అధ్యాసను మనం చూసే కోణంనుంచి మూడుగా నిర్వచించవచ్చు. అవి అన్యథాగ్రహణం, అధ్యాస, సత్యానృత మిథునీకరణం.

1. **అన్యథాగ్రహణమ్** – ఈ అపోహ తాడువైపునుంచి చూస్తే, వస్తుంది. తాడును తాడుగా చూడకుండా, వేరే దానిని చూస్తున్నాము. తాడును చూసి పాము అనుకుంటాము. దీన్ని అన్యథాగ్రహణం అంటారు. మనం చేస్తున్న పొరపాటు ఏమిటి? పొరపాటు పదంలోనే ఎంతో లోతైన అర్థం ఉంది. మన కళ్ళకు పొరలు కప్పబడటంవల్ల మనం పాట్లు పడుతున్నాము. తాడుని తాడుగా చూడకపోగా, దాన్ని వేరే అంశంగా చూస్తున్నాము.

2. **అధ్యాస** – ఇదే పొరపాటును పామువైపు నుంచి చూస్తే, వేరే నిర్వచనం వస్తుంది. లేని పామును ఉన్న వస్తువుమీద (తాడు అని తెలియదు) ఆరోపిస్తున్నాము. దీన్ని అధ్యాస లేదా అధ్యారోపం అంటారు.

3. **సత్యానృత మిథునీకరణమ్** – సత్య అంశం, అసత్య అంశాల కలయిక ఇది.

    అక్కడ ఉన్నది పాము

    అక్కడ ఉన్నది – సామాన్య, సత్య అంశం

    పాము – విశేష, అనృత (అసత్య) అంశం

సత్యాన్ని, అనృతాన్ని కలుపుతున్నాము కాబట్టి దీన్ని సత్యానృత మిథునీకరణం అంటారు. మిథునీకరణం అంటే కలపటం. అనృత అంశాన్ని మనం మిథ్య అంటూ వచ్చాము. అందువల్ల దీన్ని సత్యమిథ్య మిథునీకరణం అని కూడా అనవచ్చు కాని శంకరాచార్యులవారు సత్యానృత మిథునీకరణం పదం వాడారు కాబట్టి మనం కూడా అదే వాడుతున్నాము.

ఎలా ఈ మిథునీకరణం జరుగుతున్నది? 'అక్కడ ఉన్నది పాము' అనే వ్యక్తికి అక్కడ రెండు వస్తువులు ఉన్నాయని తెలియదు. తాడు లక్షణాలు, పాము లక్షణాలు కలుపుతున్నాడు. మనం చెబుతున్నాము తాడుని చూసి పాము అంటున్నాడని. అతని ఉద్దేశంలో అక్కడ ఉన్నది ఒకటే. అది పాము. కాని దాన్ని విశ్లేషించి చూస్తే ఉన్న ఏక వస్తువులో సత్యఅంశం, అనృత అంశం కూడా ఉన్నదని తెలుస్తుంది. అదెలా?

అక్కడ ఉన్నది పాము

అక్కడ ఉన్నది – సత్య అంశం; పాము – అనృత అంశం

ఈ క్రింది వాక్యాలను గమనించండి

ఆ పాము బుసలు కొడుతున్నది – అనృత అంశం – పాముకు చెందుతుంది

ఆ పాము పొడుగ్గా ఉంది – సత్య అంశం – తాడుకు చెందుతుంది

ఆ పాము విషం కక్కుతున్నది – అనృత అంశం – పాముకు చెందుతుంది

ఆ పాము మెలికలు తిరిగివుంది – సత్య అంశం – తాడుకు చెందుతుంది

అంటే అక్కడ పొడుగ్గా, మెలికలు తిరిగివున్నది తాడు. అదంతా సత్యఅంశం. దానిమీద పాముని ఊహించుకున్నాడు. అదే ఒక ఊహ. దానికి ఇంకా కొన్ని ఊహలు జతచేశాడు. అదుగో అది బుసలు కొడుతున్నది, విషం కక్కుతున్నది అంటాడు. రెండు అంశాలను కలుపుతున్నాడని అతనికి తెలియదు.

ఇప్పుడు దీన్ని మనకు అన్వయిద్దాము. అందులో కూడా మనం సత్య అంశను, మిథ్యా అంశను కలుపుతున్నాము.

| | |
|---|---|
| నేను చైతన్యస్వరూపాన్ని | – సత్య అంశం |
| నేను ఉన్నాను | – సత్య అంశం |
| నేను లావుగా ఉన్నాను | – అనృత అంశం |
| నాకు చిరాకుగా ఉంది | – అనృత అంశం |
| నేను సంసారిని | – అనృత అంశం |

ఆ విధంగా జీవుడు సత్య, అనృత అంశాల మేలుకలయిక. ఈ సత్యానృత అంశాల కలయిక అయిన జీవుడు మోక్షంకోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ కలయికను అధ్యాస అంటారు.

ఈ విధంగా మూడు అధ్యాసలు ఉన్నాయి. అవి అన్యథాగ్రహణం, అధ్యాస, సత్యానృత మిథునీకరణం. మనం నేను సంసారిని అని పొరబడి అనేక ముడులు వేసుకున్నాము. ఆ ముడులు విప్పితే, సంసారంనుంచి బయటపడతాము. దానికోసమే బ్రహ్మసూత్రములు పాటుపడుతున్నాయి. అధ్యాసభాష్యం సారాంశమిది.

శంకరాచార్యులు అధ్యాసభాష్యంలో చర్చించిన అంశాలను ఆరు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. అధ్యాస శంక – తక్కిన దార్శనికులు ఈ అధ్యాసమీద చేసిన విమర్శలు
2. అధ్యాస శంకా సమాధానం – వారి విమర్శలకు సమాధానం
3. అధ్యాస లక్షణం – అధ్యాస నిర్వచనం
4. అధ్యాస సంభావనం – పొరపాటు పడే అవకాశం
5. అధ్యాస ప్రమాణం – అధ్యాసకు నిదర్శనం
6. అధ్యాస ఉపసంహారం – అధ్యాస అంశాన్ని ముగించటం

ముందు లక్షణం చూసి, తక్కిన అంశాలకు వెళితే బాగా అర్థమవుతుంది. అందువల్ల ఈ అంశాల వరుస క్రమాన్ని కొంచెంగా మార్చుకుని అధ్యాస లక్షణాన్ని ముందు చూద్దాము. తక్కిన అంశాలు అవే వరుసక్రమంలో వస్తాయి.

1. **అధ్యాస లక్షణం** – అధ్యాసకు శంకరాచార్యులు ప్రత్యక్షంగా రెండు నిర్వచనాలను, పరోక్షంగా ఒక నిర్వచనాన్ని ఇచ్చారు. మూడింటినీ చూద్దాము. పరోక్షంగా ఇచ్చినా, శంకరాచార్యులు ఇచ్చారు కాబట్టి అది కూడా ముఖ్యమైన నిర్వచనమే.

   ఎ) **పరత్ర పూర్వదృష్ట అవభాసః అధ్యాసః** – ఉన్న వస్తువుమీద మనకు అనుభవంలోకి వచ్చిన ఇంకొక వస్తువును ఆరోపిస్తున్నాము. దీని ముందు ఇంకో రెండు పదాలను కలుపుకోవాలి. అవి స్మృతి రూపః. ఇప్పుడు–

   **స్మృతి రూపః పరత్రపూర్వదృష్టి అవభాసః అధ్యాసః**

ఈ రెండు పదాలు లేకపోయినా ఫర్వాలేదు. ఈ నిర్వచనాన్ని తాడు–పాము ఉదాహరణకు అన్వయిస్తే అంతకుముందు అనుభవించిన పామును చూస్తున్నాడు.

అసలు పాము ఎలా ఉంటుందో తెలియకపోతే, అక్కడ పాము ఉందని అనలేడు. అంటే అతని స్మృతిలోంచి వచ్చింది అది. అవభాస అన్నా కూడా అధ్యాసే.

బి) **అతస్మిన్ తత్ బుద్ధిః** – లేని వస్తువును ఉన్న వస్తువుమీద ఆరోపిస్తున్నాడు. చూస్తున్న వస్తువు ఏమిటి? పాము. దేనిమీద చూస్తున్నాడు? తాడుమీద. లేని పాముని ఉన్న తాడుమీద ఆరోపిస్తున్నాడు.

ఇది చాలా ప్రసిద్ధి చెందిన తేలికైన నిర్వచనం.

సి) **సత్యానృత మిథునీకరణమ్** – ఇది పరోక్ష నిర్వచనం. సత్యాన్ని, అసత్యాన్ని కలిపి చెప్పటం. ఇది వివరంగా ఇంతకుముందే చూశాము. అక్కడ పొడుగ్గా, మెలికలు తిరిగివుంది తాడు. అది సత్యం. అది బుసలు కొడుతోంది, విషం కక్కుతోంది అసత్యం. ఈ రెండూ కలుపుతున్నాము.

అలాగే మన దగ్గరికి వచ్చేసరికి నేను చైతన్య స్వరూపాన్ని. నేను సత్ అంశాన్ని. ఇది సత్యం. నేను బ్రహ్మను, నేను అసంసారిని – విశేష అంశం. అది తీసేసి నేను జీవిని, సంసారిని అనుకుంటాము. ఇది సత్యానృత మిథునీకరణం.

ఇది అధ్యాస లక్షణం.

2. **అధ్యాస శంక** – అధ్యాసను విమర్శించటం. తక్కిన దార్శనికులైన సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషికులు అధ్యాస భాష్యం ఉపోద్ఘాతంగా రాయటం సరియైనది కాదు అంటారు. ఆత్మ అనాత్మ అధ్యాస అసంభవం అంటారు. తక్కిన దార్శనికులందరిదీ పూర్వపక్ష వాదన అవుతుంది. అందుకని వారిని పూర్వపక్షులుగా వ్యవహరిస్తారు. అంతేకాని వారు పక్షులు కాదు. పూర్వపక్షాన్ని తీసుకుని వాదించేవారు.

తాడు–పాము అధ్యాస సాధ్యమే, అది ఒప్పుకుంటాము కాని ఆత్మ–అనాత్మల అధ్యాస సాధ్యం కాదు అంటాడు పూర్వపక్షి. తన సిద్ధాంతాన్ని బలపరచుకోవటానికి అతను తన వాదనలను చేస్తాడు. ఏ అధ్యాస చేయాలన్నా కూడా దానికి నాలుగు నియమాలు ఉంటాయి. ఆ నియమాలు సరిపోతేనే ఈ సత్యానృత మిథునీకరణం సాధ్యమవుతుంది. అవి లేకపోతే అధ్యాస కుదరదు. ఆత్మ–అనాత్మల విషయంలో అవి లేవు. అందువల్ల మీ అధ్యాస ఒక అధ్యాస అనేస్తాడు అతను. ముందు ఆ నాలుగు అంశాలేమిటో, తాడు–పాము అధ్యాసతో చూద్దాము.

## అధ్యాసకు నాలుగు అంశాలు

ఎ) **ప్రత్యక్షమ్** – తాడు ప్రత్యక్ష విషయం. కంటికి ఎదురుగా కనిపిస్తుంది. అంటే కనబడే దూరంలో ఉండాలి.

బి) **అజ్ఞానమ్** – తాడు గురించి పూర్తిగా తెలియకూడదు. అంటే దాన్ని చూసిన వ్యక్తికి అది తాడు అని తెలియకూడదు. ఒకవేళ అక్కడ వెలుతురు బాగా ఉండి, తాడు తెలిస్తే, అధ్యాసకు ఆస్కారం లేదు.

సి) **సాదృశ్యమ్** – కనపడే వస్తువుకీ, ఆరోపించిన వస్తువుకీ మధ్య పోలిక ఉండాలి. తాడును చూసి పాముగా పొరపాటు పడుతున్నాము అంటే, ఆ రెండింటికీ మధ్య పోలిక ఉంది. అంతేకాని తాడుని చూసి దోసకాయలా ఉంది అనలేము కదా. తాడుని చూసి పాము అనీ, ఆలిచిప్పని చూసి వెండి అనీ అంటాము కాని తాడుని చూసి వెండి అనీ, ఆలిచిప్పను చూసి పాము అనీ అనము.

డి) **సంస్కారమ్** – సంస్కారం అంటే పూర్వ అనుభవ వాసన. అంతకుముందు పామును చూసివుంటేనే తాడుని చూసి పాముగా పొరపడే అవకాశం ఉంది. అసలు పాము ఎలా ఉంటుందో తెలియకపోతే, తాడుని చూసి పాముగా పొరపడే ఆస్కారమే లేదు.

ఇవీ నియమాలు. ఇందులో ఏ ఒక్కటి కూడా ఆత్మ–అనాత్మల అధ్యాసకు వర్తించవు అంటాడు పూర్వపక్షి. మమ్మల్ని తక్కువ అంచనా వెయ్యవద్దు, మేమేమీ తెలివితక్కువ వారము కాదు. ఏదో చెప్పేసి తప్పించుకోలేవు అని చెపుతున్నాడు. తన వాదనను నిరూపించుకోవటానికి ఈ విషయాలను ఒక్కొక్కటిగా చర్చిస్తున్నాడు. వాటిని ఆత్మ–అనాత్మల అధ్యాసకు అన్వయించేముందు, మళ్ళీ వాటిని చూద్దాము.

ఎ) ప్రత్యక్షమ్ – తాడు ఎదురుగా ఉండాలి

బి) అజ్ఞానమ్ – తాడు తాడుగా కనపడకూడదు

సి) సాదృశ్యమ్ – తాడుకూ, పాముకూ పోలిక ఉంది

డి) సంస్కారమ్ – పాము గురించిన వాసన ఉండాలి

## ఆత్మ–అనాత్మల అధ్యాసకు అన్వయం

1. **ప్రత్యక్షమ్** – తాడు–పాముల అధ్యాస విషయంలో తాడు ప్రత్యక్షంగా, కంటికి ఎదురుగా కనిపిస్తుంది. కాని ఆత్మ–అనాత్మల విషయంలో ఆత్మ కంటికి

ఎదురుగా కనిపిస్తోందా? మీ అద్వైత సిద్ధాంతులు ఆత్మ కనపడదు అంటారు కదా.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్-** కఠ 1-3-15

ఆత్మ కనపడదు కాబట్టి అది ప్రత్యక్ష విషయం కాదు. అందువల్ల ఇది కుదరదు.

2. **అజ్ఞానమ్** - తాడు తాడుగా కనబడదు కాబట్టి, దాన్ని చూసి పాముగా పొరపాటు పడే అవకాశం ఉంది. కాని ఆత్మ విషయంలో మీ అద్వైత సిద్ధాంతులే ఆత్మ స్వయంప్రకాశకం అంటారు.

ఆత్మ స్వయం ప్రకాశకం, నిత్య చైతన్య స్వరూపం.

**స నిత్యోపలబ్ధ స్వరూపోఽ హమాత్మా**

స్వయం ప్రకాశక ఆత్మ విషయంలో అజ్ఞానం లేదు. అందువల్ల ఇది కుదరదు.

సి) **సాదృశ్యమ్** - తాడుని చూసి వెండిగానూ, ఆలిచిప్పను చూసి పాముగానూ ఎన్నడూ పొరబడము. కాని ఆత్మను చూసి అనాత్మగా పొరపాటు పడటానికి వాటి మధ్య అసలు ఏం పోలిక ఉంది? అన్నీ విభిన్నలక్షణాలే. ఇంకా మాట్లాడితే కనీసం తాడుకు, దోసకాయకు మధ్య అన్నా కొన్ని పోలికలు ఉన్నాయి. రెండూ జడం, రెండూ వస్తువులు. కాని ఇక్కడ అలా కాదు.

ఆత్మ సబ్జెక్టు-అనాత్మ ఆబ్జెక్టు; ఆత్మ చేతనం-అనాత్మ జడం; ఆత్మ సర్వగతం-అనాత్మ అల్పగతం; ఆత్మ నిర్గుణం-అనాత్మ సగుణం.

**యుష్మదస్మత్ప్రత్యయ గోచరయోః విషయ విషయిణోః**
**తమః ప్రకాశవత్। విరుద్ధ స్వభావయోః॥**

అని అద్వైత సిద్ధాంతంలో శంకరాచార్యులవారే ఉపోద్ఘాతంలో వ్రాశారు. అంటే ఆత్మకూ, అనాత్మకూ మధ్య భేదం వెలుతురుకూ, చీకటికీ మధ్య ఉన్నంత భేదం ఉంది అన్నారు. అలాంటప్పుడు ఆత్మ-అనాత్మల మధ్య సాదృశ్యం లేదు. అందువల్ల ఇది కుదరదు.

డి) **సంస్కారమ్** - ఉన్న తాడుమీద లేని పాముని ఆరోపించాలంటే, పాము అనుభవం ఉండాలి. అలా సత్య పాము దర్శనం అవటంవల్ల మిథ్యా పాముని

ఆరోపించగలిగాము; సత్య వెండి దర్శనం అవటంవల్ల ఆలిచిప్పమీద మిథ్యా వెండిని ఆరోపించగలిగాము. అలా సత్యజాగ్రత్ ప్రపంచాన్ని అనుభవించటంవల్ల మిథ్యా స్వప్నప్రపంచాన్ని ఆరోపించగలిగాము. అదే సూత్రం ప్రకారం సత్య అనాత్మను అనుభవించగలిగితే, మిథ్యా అనాత్మను ఆరోపించగలము.

కాని అద్వైత సిద్ధాంతం సత్య అనాత్మ లేదు అంటుంది. ఆత్మ ఒక్కటే సత్యం, అనాత్మ మిథ్య అంటుంది. అనాత్మ మిథ్య అయితే, మిథ్యావస్తువుయొక్క సంస్కారం అంటే పూర్వవాసన ఎలా ఏర్పడుతుంది? వాసన లేకపోతే మిథ్యా అనాత్మను ఆరోపించలేము.

అనాత్మ విషయంలో సంస్కారం లేదు. అందువల్ల ఇది కుదరదు.

ఆత్మ–అనాత్మల అధ్యాస కుదరదు అని పూర్వపక్షి అద్వైత సిద్ధాంతాన్నే తీసుకుని అధ్యాసకు అవసరమైన నాలుగు అంశాలను ఖండిస్తాడు. అద్వైత సిద్ధాంతంలోని నాలుగు ముఖ్యాంశాలు ఆత్మ అప్రత్యక్షం; ఆత్మ స్వయం ప్రకాశకం, ఆత్మ అనాత్మలు భిన్నం; అనాత్మ మిథ్య.

ఇవన్నీ చెప్పి పూర్వపక్షి మీ మొత్తం బ్రహ్మసూత్రభాష్యం ఈ అధ్యాస భాష్యం మీద ఆధారపడివుంది. కాని మీ అధ్యాసభాష్యమే వీగిపోతున్నది. అదే సరియైనదని మీరు నిరూపించలేకపోతే దానిమీద ఆధారపడి చేసే బోధను ఎలా నిరూపిస్తారు? పునాది గట్టిగా ఉంటేనే కదా, ఎన్నో అంతస్తుల భవనం గట్టిగా నిలబడగలిగేది?

ఇప్పుడు ఈ పూర్వపక్షి చేసిన అధ్యాస శంకను మళ్ళీ టూకీగా చూద్దాము.

| **నియమం** | **వివరణ** | **పూర్వపక్షి వాదన** | **సిద్ధాంతం ఆధారంగా** |
|---|---|---|---|
| ఎ) ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ ఎదురుగా లేదు | ఆత్మ అప్రత్యక్షం |
| బి) అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మజ్ఞానం ఉంది | ఆత్మ స్వయం ప్రకాశకం |
| సి) సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ, అనాత్మలు భిన్నం | తమః ప్రకాశవత్ విరుద్ధ స్వభావయోః |

| | | |
|---|---|---|
| డి) సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ గురించిన అనాత్మ మిథ్య వాసన ఉండాలి |

3. **అధ్యాస శంకా సమాధానం/ 4. అధ్యాస సంభావనం** – అసలు మూడవ అంశం అధ్యాస లక్షణం. దాన్ని ముందే చూశాము. దాని తర్వాత అంశం అధ్యాస సంభావనం. రెండూ ఇంచుమించు ఒకటే అంశాలు. అధ్యాస శంకా సమాధానం శంకకు సమాధానం చెపితే, అధ్యాస సంభావనం అధ్యాస ఎలా కుదురుతుందో చెబుతుంది. అందువల్ల మనం రెండూ కలిపి చూద్దాము. శంకరాచార్యులు ఒక్కొక్క ప్రశ్ననూ ఖండించుకుంటూ వస్తారు.

ఎ) **ప్రత్యక్షమ్** – తాడు ఎదురుగా ఉండాలి. దీనికి శంకరాచార్యులు ఈ నియమాన్ని అక్షరాలా పాటించనవసరం లేదు, దాన్ని కొంచెం మార్చి చెప్పవచ్చు అంటున్నారు. ఇంకా మాట్లాడితే, పూర్వపక్షానికి చెందిన అతను నియమాన్ని తప్పు చెప్పాడు.

ఒక పొరపాటు జరగటానికి, వస్తువు తెలిసినదై ఉండాలి. వస్తువు తెలియకపోతే పొరపాటు పడే ఆస్కారమే లేదు. అందువల్ల అది తెలిసిన వస్తువై ఉండాలే తప్ప, మన ముందే ఉండాలని లేదు. మన ముందు ఉండాలని ఎందుకు అన్నాము? అది తెలిసిన వస్తువై ఉండాలి అనే నియమంకోసం.

ఇప్పుడు ఆత్మ విషయానికి వస్తే, ఆత్మ కంటికి ఎదురుగా కనపడే ఆబ్జెక్టు కాదు, అది సబ్జెక్టు. కాని సబ్జెక్టు ఆత్మ మనకు తెలుసు. ఆ సబ్జెక్టు తెలుసు కాబట్టి దాని విషయంలో పొరపాటు పడే అవకాశం ఉంది. ఈ విధంగా మొదటి నియమాన్ని కొంచెం సడలించితే సరిపోతుంది. మనం పొరపాటు పడేది సబ్జెక్టు విషయంలోనైనా, ఆబ్జెక్టు విషయంలోనైనా, అది తెలిసిన విషయమై ఉండాలి. ఎందుకు? తెలిసిన విషయంలోనే పొరపాటు చెయ్యగలము. ఆ విధంగా మలిచిన నియమం సరిపోతుంది.

అందువల్ల ప్రత్యక్ష విషయత్వం – ప్రకాశమానత్వం అవుతుంది.

బి) **అజ్ఞానమ్** – తాడు తాడుగా కనబడకూడదు. అక్కడ ఏదో ఉందని తెలియాలి, అదేమిటో తెలియకూడదు.

అక్కడ ఉన్నది తాడు – వాక్యం
అక్కడ ఉన్నది – సామాన్య, అనావృత, సత్య అంశం
తాడు – విశేష, ఆవృత అంశం

అది మార్చి అక్కడ ఉన్నది పాము అన్నాము.

అక్కడ ఉన్నది – సామాన్య, అనావృత, సత్య అంశం
పాము – విశేష, ఆవృత అంశం

అంటే అక్కడ ఒకటి ఉందని తెలిసింది కాని ఆ తెలియని తాడుమీద తెలిసిన పామును ఆరోపించాము. ఈ లక్షణం ఆత్మ–అనాత్మల అధ్యాసకు కూడా చక్కగా సరిపోతుంది. ఇది ఇంతకుముందే వివరంగా చూశాము.

అహం బ్రహ్మ అస్మి / అహమ్ ఆనందః అస్మి – వాక్యం
అహమ్ అస్మి – సామాన్య, అనావృత, సత్య అంశం
బ్రహ్మ / ఆనందః – విశేష, ఆవృత అంశం

అహం అస్మి వరకూ తెలుసు. అహం చైతన్యాన్ని, అస్మి ఉనికిని సూచిస్తుంది. నేను సత్‌చిత్ ఆనంద స్వరూపాన్ని. సత్, చిత్ తెలుసు కాని ఆనంద స్వరూపాన్ని అని తెలియదు. అంటే ఆత్మజ్ఞానం పూర్తిగా లేదు. అంశిక అజ్ఞాతత్వం (సగం అజ్ఞానం) ఉంది. అది తెలియకపోయినా ఫర్వాలేదు, నేను ఆనంద స్వరూపాన్ని, అసంసారిని అని తెలియకపోగా నేను దుఃఖభూయిష్టాన్ని, సంసారిని అని వాపోతాము. దీన్నిబట్టి ఆత్మ అజ్ఞానం ఉందని స్పష్టంగా తెలుస్తున్నది. ఒకవేళ మనకు అజ్ఞానం లేకపోతే ఉపనిషత్తు పనిగట్టుకుని బోధించనవసరం లేదు.

తరతి శోకమాత్మవిత్ – ఛాందోగ్యమ్

ఆత్మజ్ఞానం పొందినవాడు శోకానికి ఆవలితీరం చేరతాడు. దీన్నిబట్టి సంసారులకు ఆత్మజ్ఞానం లేదని అర్థమవుతున్నది. ఆత్మజ్ఞానం లేకపోతే ఏం ఉంది? ఆత్మ అజ్ఞానం ఉంది. దానికి మన అనుభవమే నిదర్శనం. ఆ విధంగా రెండవ నియమం కూడా సరిపోతుంది.

అహమ్ అస్మి – తెలుసు
బ్రహ్మ – తెలియదు

సి) **సాదృశ్యమ్** – తాడుకూ, పాముకూ పోలిక ఉండాలి. అధిష్ఠానానికీ, దాని మీద ఆరోపించిన వస్తువుకూ పోలిక ఉండాలి. కాని ఆత్మకూ అనాత్మకూ పోలిక లేదు అన్నాడు పూర్వపక్షి.

కాని దానికి శంకరులవారు చెప్పిన జవాబు – సాధారణంగా పోలిక ఉండాలి కాని ఈ నియమాన్ని ఉల్లంఘించవచ్చు. ప్రతి నియమానికీ ఒక ఉల్లంఘున ఉంటుంది. ప్రతి ఉత్సర్గకూ ఒక అపవాద ఉంటుంది. సాధారణంగా నిమిత్తకారణం వేరు, ఉపాదానకారణం వేరు. కుండ విషయమే తీసుకుంటే, కుమ్మరి నిమిత్త కారణం, మట్టి ఉపాదానకారణం. కాని జగత్కారణ బ్రహ్మ విషయం తీసుకుంటే బ్రహ్మే నిమిత్త కారణం, ఉపాదానకారణం కూడా. అలాగే పోలిక లేకపోయినా పొరపాటు పడగలిగే అవకాశం ఉంది.

**అప్రత్యక్షేఽపి హి ఆకాశే బాలాః తలమలినతాది అధ్యస్యన్తి**

ఆకాశాన్ని నీలాకాశం అంటాము. అది జ్ఞానమా, పొరపాటా? ఆకాశం రూపరహితం అని మనకు తెలుసు. అయినా నీలాకాశం అంటున్నామంటే ఆకాశంమీద నీలం రంగుని ఆపాదిస్తున్నాము. అంతేకాదు, ఆకాశం బోర్లించిన గిన్నెలా ఉంది అంటాము. అంతేకాదు, ఆకాశానికి మలినత్వం కూడా అంటగడతాము. అంటే ఆకాశానికి మూడు గుణాలను ఆపాదిస్తున్నాము. అవి తత్త్వం (ఆకాశం), నీలత్వం (రంగు), మలినత్వం (అశుద్ధం).

**గగనం గగనాకారం సాగరః సాగరోపమః।**

**రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ॥**

అన్నాడు ఆంజనేయస్వామి. ఆంజనేయులవారిని నువ్వు రామరావణ యుద్ధమూ చూశావు, కురుక్షేత్ర యుద్ధమూ చూశావు కదా. ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠం అని అడిగితే, దానికి ఆయన చెప్పిన జవాబు ఇది. ఆకాశం ఆకాశమే, సముద్రం సముద్రమే. రెండింటికీ పోలిక లేదు. అలాగే రామరావణ యుద్ధం రామరావణ యుద్ధమే. దానికి దేనితోనూ పోలిక లేదు.

ఇక్కడ మనం తీసుకోవాల్సిన అంశం ఆకాశానికి దేనితోనూ పోలిక లేదు. అలాంటప్పుడు ఆకాశానికి నీలం రంగుని ఎలా ఆపాదిస్తాము? సాదృశ్యం

లేకపోయినా ఆకాశవిషయంలో అధ్యాస జరగగా లేనిది, ఆత్మ–అనాత్మల విషయంలో సాదృశ్యం లేకపోయినా ఎందుకు అధ్యాస జరగకూడదు?

ఈ విధంగా మూడవ నియమం పాటించితీరాల్సిన నియమం లేదు.

డి) **సంస్కారమ్**– పాము గురించిన వాసన ఉండాలి. సత్య పాము దర్శనం అవటంవల్ల మిథ్యా పామును ఆరోపించగలిగాము; కాని అద్వైత సిద్ధాంతం ప్రకారం అనాత్మ మిథ్య అయినప్పుడు సత్య అనాత్మ అనుభవం ఉండదు. సత్య అనాత్మ అనుభవం లేకపోతే, అనాత్మ గురించిన సంస్కారం లేదు. సంస్కారం లేకపోతే అనాత్మను ఆత్మమీద ఎలా ఆరోపిస్తాము? ఇదీ పూర్వపక్షి వాదన.

దానికి శంకరులవారు చెప్పిన జవాబు – పాము అనుభవం నిజం పాము అనుభవమే ఉండి తీరాలని లేదు.

నేటి ఉదాహరణతో చూస్తే పాము గురించిన అనుభవం ఏ సినిమాలో ఉన్నా చాలు. అప్పుడది మిథ్యా పాము అనుభవమే అవుతుంది. మిథ్యా పాము అనుభవం, సంస్కారాన్ని ఏర్పరచి, ఇంకొక మిథ్యా పామును నిజం తాడుమీద ఆరోపించగలిగే అవకాశం ఉంది.

అంటే శంకరులవారు చెబుతున్నారు, సంస్కారం ఉండాలి నిజమే. సంస్కారం పూర్వ అనుభవంనుంచి వస్తున్నదన్నదీ నిజమే. కాని ఆ పూర్వ అనుభవం నిజం పాము అనుభవమే ఉండితీరాలని లేదు. ఇదే సూత్రాన్ని అనాత్మకు కూడా అన్వయించవచ్చు. అనాత్మ అధ్యాస ఎలా వచ్చింది? పూర్వ అనాత్మ అధ్యాస వల్ల. పూర్వ అనాత్మ అధ్యాస ఎలా వచ్చింది? అంతకుముందు అధ్యాసవల్ల. అంటే అనాత్మ గురించిన అధ్యాస అనాది అధ్యాస.

అందువల్ల సత్య అనాత్మ అనుభవం లేదు నిజమే, కాని మిథ్యా అనాత్మ అనుభవం ఉంది. అది అధ్యాసకు కారణం అవుతుంది. అలా అధ్యాస సంభవమే.

ఈ విధంగా పూర్వపక్షి చెప్పిన నాలుగు నియమాలూ సరిపోతాయి. ప్రత్యక్షాన్ని ప్రకాశత్వంగా తీసుకోవాలి, అజ్ఞానం ఉంది, సాదృశ్యం ఉండితీరాలని లేదు, సంస్కారం మిథ్యా అనాత్మ సంస్కారం కూడా ఉండవచ్చు.

ఈ విషయాలను టూకీగా కింద ఒక పట్టికలో చూద్దాము.

## 3. అధ్యాస శంకా సమాధానం / 4. అధ్యాస సంభావన

| నియమం | వివరణ | పూర్వపక్షి వాదన | సిద్ధాంతి జవాబు |
|---|---|---|---|
| 1. ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ అప్రత్యక్షం | ఎదురుగా కాదు. తెలిసిన విషయమైతే చాలు |
| 2. అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మ స్వయం ప్రకాశకం | అహం బ్రహ్మ అస్మిలో అహం అస్మి తెలుసు; బ్రహ్మ తెలియదు |
| సి) సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ,అనాత్మలు భిన్నం | ఈ నియమం తీరక పోయినా ఫర్వాలేదు. ఆకాశం నీలంగా, బోర్లించిన గిన్నెలా ఉంది. |
| 4. సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ మిథ్య | నిజం పాము అనుభవమే ఉండాలని లేదు. మిథ్యా అనాత్మ అనుభవం ఉంది. |

పూర్వపక్షి వాదనకు ఇది ఒక సమాధానం. ఇది తాత్కాలిక సమాధానం మాత్రమే. నిజమైన సమాధానం శాస్త్రపరంగా వస్తుంది. ఇది చాలా ముఖ్యం.

**రెండవ జవాబు**

1. **ప్రత్యక్షమ్** – తాడు ఎదురుగా ఉండాలి. ఇది పూర్వపక్షి వాదన. కాని ఆత్మ–అనాత్మల అధ్యాస ప్రాథమికంగా వేద ప్రమాణంమీద ఆధారపడి ఉన్నది. రజ్జుసర్ప భ్రాంతి గురించి చెప్పేది అధ్యాసను నిరూపించటానికి కాదు. దీని ద్వారా అధ్యాస గురించిన కొన్ని అంశాలు చర్చించటంకోసం ఇవ్వబడింది. అందువల్ల తాడు–పాము అధ్యాసమీద ఎక్కువగా దృష్టి పెట్టకూడదు. ఈ విషయం అర్థం కాక, చాలామంది పూర్వపక్షులు ఈ ఉదాహరణమీద పూర్తిగా దృష్టి పెట్టి, అద్వైత వేదాంతాన్ని ఖండిస్తూ ఉంటారు.

కాని తాడు–పాము అధ్యాస అనుభవ ప్రమాణం; ఆత్మ–అనాత్మల అధ్యాస వేద ప్రమాణం. అందువల్ల తాడు పాముల అధ్యాస కుదిరినా కుదరకపోయినా, ఆత్మ–అనాత్మల అధ్యాస చెక్కుచెదరదు. మీకు తాడు–పాము ఉదాహరణ నచ్చకపోతే, వేరే ఏదైనా ఉదాహరణ తీసుకోండి అంటుంది అద్వైతం.

ఆత్మ–అనాత్మల అధ్యాసం వేదప్రమాణం అన్నాము కదా. తక్కిన పూర్వపక్షులు వేద ప్రమాణాన్ని అంగీకరిస్తారు. అందుకే వారిని ఆస్తికులు అంటారు. వారు సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంసకులు. ఇక్కడ మనం నాస్తికుల గురించి మాట్లాడటం లేదు. ఆస్తికులు వేదప్రమాణాన్ని అంగీకరిస్తారు కాబట్టి, ఆత్మ ప్రత్యక్షం కాదని వారు కూడా అంగీకరించాలి.

నియమం ఒకటి ప్రత్యక్షం కుదరదు. ఆత్మ అప్రత్యక్షం.

2. **అజ్ఞానమ్** – తాడు తాడుగా కనబడకూడదు. పూర్వపక్షులు కూడా ఆత్మ–అనాత్మల అధ్యాసను ఒప్పుకుంటారు. కాకపోతే వారికి ఆ విషయం తెలియదు. వారు వేద ప్రమాణాన్ని ఒప్పుకునే ఆస్తికులని చూశాము. వారు వేదప్రమాణాన్ని, కర్మకాండను, పుణ్యపాపాలను, పునర్జన్మను, పుణ్యలోకాలను నమ్ముతారు. అంటే మరణం తర్వాత కూడా ఆత్మ ఉందని నమ్ముతారు. అంటే ఆత్మ నిత్యం అని ఒప్పుకుంటారు. ఆత్మ అంటే నేను. అందువల్ల పూర్వపక్షులు అందరూ నేను నిత్యం అని ఒప్పుకుంటారు.

అందరికీ నేను నిత్యం అని తెలిసినా నేను మనిషిని, నేను మగవాడిని, నేను తండ్రిని అనుకుంటారు. నేను మనిషిని అంటే ఆ నేను ఎవరు? ఆత్మా, శరీరమా? శరీరమే అనుకుంటారు. ఇదంతా పూర్వపక్షుల పరంగానే చెబుతున్నాము. ఇంకా అద్వైతానికి రాలేదు. నిజానికి ఆత్మ అసంగం. ఆత్మ మనిషి కాదు, భర్త కాదు, తండ్రి కాదు.

పూర్వపక్షుల సిద్ధాంతం ప్రకారమే, నేను మనిషిని అనేది అధ్యాస. అలాగే నేను తండ్రిని అనేది అధ్యాస. అంటే పూర్వపక్షులకు **స్థూలశరీర అధ్యాస ఉంది**. ఆ మాట వారు ఒప్పుకుని తీరాలి. ఎందుకంటే వారు స్థూలశరీర అధ్యాసను ఒప్పుకోకపోతే, వారు కూడా చార్వాక దార్శనికులు అయిపోతారు. చార్వాకులకు దేహాత్మబుద్ధి సత్యం, అధ్యాస కాదు. అందువల్ల పూర్వపక్షులకు చార్వాకులంటే పడదు. కాబట్టి వారిని చార్వాకులతో పోల్చకూడదంటే వారు స్థూలశరీర అధ్యాసను ఒప్పుకుని తీరాలి.

నియమం రెండు–అజ్ఞానం. అజ్ఞానం పూర్వపక్షులకూ ఉంది, అద్వైత వేదాంతులకూ ఉంది.

3. **సాదృశ్యమ్** – తాడుకూ, పాముకూ పోలిక ఉండాలి. పూర్వపక్షులకు స్థూలశరీర అధ్యాస ఉంది. అలాంటప్పుడు అద్వైత వేదాంతుల అధ్యాసను ప్రశ్నించే హక్కు వారికెక్కడ ఉంది? వారికి ప్రశ్నించే హక్కు లేదు, దానికి వివరణ అడిగే అధికారం అసలే లేదు.

స్థూలశరీర అధ్యాస విషయం తీసుకుంటే, ఆత్మకు–అనాత్మకు ఏం పోలిక ఉంది? వారు కూడా ఆత్మ సర్వవ్యాపకం అనీ, ఆత్మ నిరవయవం అనీ ఒప్పుకుంటారు. వారికి కూడా అనాత్మ పరిచ్ఛిన్నం అనీ, అనాత్మ సావయవం అనీ తెలుసు.

ఆత్మ స్థూలశరీరం కాదు అని వారికి ఎలా తెలుసు? ఎందుకంటే శ్రుతి ఆత్మ నిత్యం అని చెబుతున్నది; శ్రుతి ప్రమాణం వారికి. అనుభవం శరీరం అనిత్యం అని చెబుతుంది. అందువల్ల ఆత్మ, శరీరానికి భిన్నంగా ఉంది. అయినా శ్రుతి ప్రమాణంవల్ల అధ్యాస జరుగుతున్నది.

వారు ఆత్మ–అనాత్మల మధ్య సాదృశ్యం లేకపోయినా స్థూలశరీర అధ్యాసను ఒప్పుకోగా లేనిది, మనం కూడా సాదృశ్యం లేకపోయినా అధ్యాసను చూడవచ్చు.

నియమం మూడు సాదృశ్యం. సాదృశ్యం లేకపోయినా స్థూలశరీర అధ్యాసను పూర్వపక్షులు ఒప్పుకుంటారు. అందువల్ల లౌకిక ప్రమాణం ఇక్కడ చెల్లదు.

4. **సంస్కారమ్** – పాము గురించిన వాసన ఉండాలి. తాడుమీద పామును ఆరోపిస్తున్నాము అంటే నిజం పాము అనుభవం ఉంది. కాని అద్వైత సిద్ధాంతం ప్రకారం అనాత్మ మిథ్య అయినప్పుడు సత్య అనాత్మ అనుభవం ఉండదు. సత్య అనాత్మ అనుభవం లేకపోతే అనాత్మ గురించిన సంస్కారం లేదు. సంస్కారం లేకపోతే అనాత్మను ఆత్మమీద ఎలా ఆరోపిస్తాము? ఇదీ పూర్వపక్షి వాదన అని చూశాము.

తాడు–పాముల అధ్యాసను ప్రశ్నించలేము. అది అనుభవ ప్రమాణంమీద ఆధారపడివుంటుంది. ఇది తర్కంమీద ఆధారపడిలేదు. కాకపోతే ఈ అనుభవ స్థాయిని బట్టి అధ్యాస స్థాయి మారుతూ వస్తుంది. ఈ అనుభవ భేదాలను ఖ్యాతి వాదః అంటారు.

ఆత్మఖ్యాతి – యోగాచార్యుల వాదన; అసత్ ఖ్యాతి – చార్వాక వాదన; అఖ్యాతి – ప్రభాకర మీమాంస వాదన; అన్యథాఖ్యాతి – నైయాయిక వాదన; అనిర్వచనీయ ఖ్యాతి – అద్వైత సిద్ధాంతం.

శంకరులవారు వీటి వివరాలలోకి వెళ్ళరు. వారి ఖ్యాతి వాదన ఏదైనా అందరూ అధ్యాసను ఒప్పుకుంటారు. అధ్యాస స్థాయిలో భేదాలుండవచ్చు కాని అధ్యాసలోపం లేదు. ఎందుకంటే ఇది అనుభవంమీద ఆధారపడి చేసినది.

అలాగే ఆత్మ–అనాత్మల అధ్యాసను కూడా ప్రశ్నించలేరు. ఎందుకంటే ఇది శ్రుతి ప్రమాణంమీద ఆధారపడి చేసినది. పూర్వపక్షులు అనుభవ ప్రమాణాన్నీ ఒప్పుకుంటారు, శ్రుతి ప్రమాణాన్నీ ఒప్పుకుంటారు. అందువల్ల అధ్యాస సంభవం విషయంలో సందేహం ఎంతమేరకు అధ్యాస ఉందనేది ప్రశ్నార్థకం.

ఉదాహరణకు ఆత్మ గురించి మూడు అంశాలు తీసుకుందాము. అవి నిత్యత్వం, కర్తృత్వం, భోక్తృత్వం. అంటే నేను నిత్యం, నేను కర్తను, నేను భోక్తను అనే అంశాలలో భిన్నదార్శనికులకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

ఎ) **న్యాయ–వైశేషిక వాదన** – ఆత్మ నిత్యం, కాని ఆత్మ కర్తా, భోక్తా.

బి) **సాంఖ్య–యోగ వాదన** – ఆత్మ నిత్యం, ఆత్మ అకర్తా, కాని ఆత్మ భోక్త.

సి) **అద్వైత సిద్ధాంతం** – ఆత్మ నిత్యం, ఆత్మ అకర్తా, ఆత్మ అభోక్తా.

**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ గీత 2–19**

నియమం నాలుగు – సంస్కారం విషయంలో అధ్యాస ఉండటం సమస్య కాదు. కాకపోతే దానిలో స్థాయీభేదాలు ఉన్నాయి. అందువల్ల సమస్య అధ్యాస ఉండటం గురించి కాదు, ఎంతమేరకు అధ్యాస ఉంది అనేదాని గురించి. అంటే అధ్యాస ఉంది, అధ్యాసభాష్యం కూడా సరియైనదే.

ఇప్పుడు ఈ నాలుగు నియమాలను శ్రుతిపరంగా చూస్తే –శాస్త్రం ప్రకారం ఆత్మ ప్రత్యక్షం కాదు, పూర్వపక్షులకు కూడా స్థూలశరీర అధ్యాస ఉంది, స్థూలశరీరానికీ, ఆత్మకూ ఏం పోలిక ఉంది? ఖ్యాతి వాదం అధ్యాస ఉంది కాని స్థాయీభేదాలు ఉన్నాయని చూపిస్తుంది. దీన్నే మళ్ళీ పట్టికలో చూద్దాము.

| నియమం | వివరణ | పూర్వపక్షి వాదన | సిద్ధాంతి జవాబు |
|---|---|---|---|
| 1. ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ అప్రత్యక్షం | శాస్త్రం ప్రకారం ఆత్మ ప్రత్యక్షం కాదు |
| 2. అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మ స్వయం ప్రకాశకం | పూర్వపక్షులకు కూడా స్థూలశరీర అధ్యాస ఉంది |
| 3. సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ, అనాత్మలు భిన్నం | స్థూలశరీరానికీ, ఆత్మకూ ఏం పోలిక ఉంది? |
| 4. సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ మిథ్య | ఖ్యాతి వాదం అధ్యాస ఉంది కాని స్థాయీభేదాలు ఉన్నాయని చూపిస్తుంది |

ఆ విధంగా అధ్యాసభాష్యమే తప్పు, దాని ఆధారంగా చేసే బ్రహ్మసూత్ర భాష్యం చెల్లదు అని వాదించిన పూర్వపక్షులకు లౌకికపరంగానూ, శాస్త్రపరంగానూ జవాబు చెప్పటమే కాక, వారికి కూడా శాస్త్రపరంగా అధ్యాస ఉంది, కాకపోతే వాటిల్లో స్థాయీభేదం ఉందని నిరూపించారు శంకరులవారు.

5. **అధ్యాస ప్రమాణం** – అధ్యాసకు నిదర్శనం

ఇంతకుముందే ఆత్మ–అనాత్మల అధ్యాస శ్రుతి ప్రమాణాన్ని ఆధారంగా చేసుకుని ఏర్పడిందనీ, పూర్వపక్షులు కూడా శ్రుతిని నమ్ముతారు కాబట్టి వారు మన అధ్యాసను ప్రశ్నించకూడదని చూశాము. అంతేకాదు, వారికి అధ్యాస లేదా అంటే ఉంది. వారికి స్థూలశరీర అధ్యాస ఉంది.

అందువల్ల ఆత్మ–అనాత్మల అధ్యాసకు నిదర్శనం శ్రుతి ప్రమాణం. శ్రుతి ఆధారంగా రెండు ప్రమాణాలు ఉన్నాయి అధ్యాసకు. అవి అర్థాపత్తి ప్రమాణం, అనుమాన ప్రమాణం. ఉపోద్ఘాతంలో చూశాము ఈ అనుమాన ప్రమాణం లౌకిక ప్రమాణం కాదనీ, శ్రుతి అనుమాన ప్రమాణమనీను. అర్థాపత్తి కూడా అంతే.

ఎ) **అర్థాపత్తి ప్రమాణం –** ముందు దీనిని లౌకికపరంగా చూద్దాము. మనకు తెలిసిన విషయం ఆధారంగా తెలియని విషయాన్ని కల్పన ద్వారా ఊహించుకోవటాన్ని అర్థాపత్తి ప్రమాణం అంటారు. ఇంగ్లీషులో పాశ్చ్యులేషన్ (postulation) అంటారు దీనిని.

ఉదాహరణకు మనం రాత్రి బాగా నిద్రపోయి లేచాము. పొద్దున్న చూస్తే రోడ్లన్నీ నీళ్ళతో నిండివున్నాయి. అంటే రాత్రి వానపడి ఉంటుందని ఊహిస్తాము. వానను మనం చూడలేదు. అప్పుడు చూసి ఉంటే వాన ప్రత్యక్షప్రమాణం అయి ఉండేది. కాని రాత్రి మనం బాగా నిద్రపోయాము. అందువల్ల మన ఊహాశక్తిని జోడించాలి. ఊహాశక్తిని జోడించినా అది ప్రత్యక్ష ప్రమాణంమీద ఆధారపడివుంది కాబట్టి, నిజమే అవుతుంది.

రోడ్లు నీళ్ళతో నిండివుండటం విషయంలో ఏమాత్రం అనుమానం లేదు. కాస్త నీరు ఉంటే అది నీళ్ళ లారీలు వెళ్ళటంవల్ల వచ్చిన నీరు అనుకోవచ్చు. కాని నీళ్ళు బాగా ఉండటంతో రాత్రి వాన కురిసివుంటుంది అని అంటున్నాము. అంటే తెలిసిన విషయంద్వారా వాన కురిసివుండి ఉంటుంది అనుకోవటం అర్థాపత్తి.

ఇప్పుడు ఇదే అర్థాపత్తిని వాడి ఆత్మయొక్క అనిత్యత్వం, కర్తృత్వం, భోక్తృత్వం, ప్రమాతృత్వం, పరిచ్ఛిన్నత్వం, అనేకత్వాలు అధ్యాస అని నిరూపించబోతున్నాము. ఇది శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అన్నాము కాబట్టి ఈ అంశాలను అధ్యాస అని నిరూపించటానికి శ్రుతికి వెళ్ళాలి.

రాత్రి వానను ప్రత్యక్ష అనుభవం అంటే ప్రత్యక్షప్రమాణం ఆధారంగా ఊహిస్తున్నాము. కాని ఇక్కడ ప్రత్యక్ష ప్రమాణం బదులుగా శ్రుతి ప్రమాణం ఆధారంగా ఊహిస్తున్నాము. శ్రుతి అధ్యాస ఉందని ప్రత్యక్షంగా చెప్పదు, కాని అలాగని ఇది శంకరాచార్యులకు తోచినట్టుగా చెప్పినదీ కాదు. ఈ అధ్యాస ఖచ్చితమైన జ్ఞానమే. ఎందుకంటే ఇది శ్రుతి ప్రమాణం ఆధారంగా చెయ్యబడింది.

అంతేకాదు శ్రుతి అర్థాపత్తి అధ్యాసను మనం మాత్రమే వాడటం లేదు; తక్కిన ఆస్తికులు కూడా వాడతారు. అందరూ నేను అనిత్యుడిని అనేది అధ్యాస అని ఒప్పుకుంటారు. ఎందుకు? శ్రుతి నువ్వు నిత్యం అని చెబుతుంది కాబట్టి.

అంటే నేను అనిత్యుడిని అనే భావన అధ్యాస. ఇప్పుడు ఒక్కొక్క విషయంలో శ్రుతి ప్రమాణాలను చూద్దాము.

1. **ఆత్మ అనిత్యమ్ అధ్యాస** – ఆత్మ నిత్యమని భగవద్గీతలో వస్తుంది.

**అజో నిత్యః శాశ్వతో౽ యం పురాణః**

**న హన్యతే హన్యమానే శరీరే** – గీత 2–20

అంటే నిత్యత్వ శ్రుతి వాక్యాన్నిబట్టి ఆత్మ అనిత్యత్వం అధ్యాస అని తెలుస్తున్నది. దీన్ని శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అంటారు. ఇంతవరకూ అందరు ఆస్తికులూ ఒప్పుకుంటారు. తక్కిన ఆస్తికులు శ్రుతి ఆధారంగా ఆత్మ నిత్యం, స్థూలశరీర అభిమానం అధ్యాస అని ఒప్పుకోగా లేనిది, మనమెందుకు మరికొంచెం ముందుకు వెళ్ళి, మనకు మరికొన్ని అధ్యాసలు ఉన్నాయని నిరూపించకూడదు అంటున్నారు శంకరులవారు.

2. **ఆత్మ కర్తా అధ్యాస** – న్యాయ–వైశేషికులు ఆత్మ కర్త అంటారు. కాని శ్రుతి స్పష్టంగా ఆత్మ కర్త కాదు అంటుంది. ఆత్మ అకర్త శ్రుతి ప్రమాణం అయితే, ఆత్మ కర్త అనేది అధ్యాస అవుతుంది.

3. **ఆత్మ భోక్తా అధ్యాస** – సాంఖ్య–యోగదార్శనికులు ఆత్మ కర్తా కాదు ఒప్పుకుంటాము కాని ఆత్మ భోక్తా అంటారు. కాని మనం, అద్వైత సిద్ధాంతులం, ఆత్మ భోక్తా కూడా కాదు అంటాము.

**ఆత్మనః భోక్తృత్వమ్ అపి అధ్యస్తమ్**

ఎలా తెలుసు? శ్రుతి ప్రమాణమే ఆధారం. ఆత్మను అకర్తా అన్న శ్రుతే, ఆత్మ అభోక్తా అని కూడా అంది.

**హంతా చేన్మన్యతే హంతుం హతశ్చేన్మన్యతే హతమ్**

**ఉభౌ తౌ న విజానీతో నా౽ యం హంతి న హన్యతే – కఠ** 1.2.19

గీతలో కూడా ఇంచుమించు ఇదే వాక్యం వస్తుంది

**య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।**

**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ – గీత** 2.19

దీన్నిబట్టి ఆత్మ అకర్తా, అభోక్తా అని తెలుస్తున్నది. ఇది విని పూర్వపక్షి కనుబొమ్మలు ఎగరేయకూడదు. ఎందుకంటే అతను కూడా ఆస్తికుడే కదా.

ఒకవేళ నేను ఆస్తికుణ్ణి కాదంటే, అయితే నీ దగ్గరికి బ్రహ్మసూత్రములు రెండవ అధ్యాయంలో వస్తాము అంటాము.

హంతి అంటే చంపటం. ఆత్మ చంపదు అంటోంది శాస్త్రం. చంపటం అన్ని క్రియలకూ వర్తిస్తుంది. అందువల్ల ఆత్మ కర్త కాదు.

న హన్యతే అంటే ఆత్మ చంపబడదు. అంటే ఆత్మ అనుభవించబడే వస్తువు కాదు, అంటే ఆత్మ భోక్త కూడా కాదు.

**నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః – గీత** 5.15

ఆత్మకు పుణ్య, పాపాలు అంటవు.

**న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః । – గీత** 5.14
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ – గీత 5.14**

ఆత్మకు కర్తృత్వ, భోక్తృత్వాలు లేవు. కర్మఫల సంయోగం లేదు. ఇంకా మేలైన శ్లోకం

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥ – గీత 5.13**

ఆత్మ ఏదీ తనంతటతాను చెయ్యదు. వేరే ఎవరినీ చేసేలాగా కూడా ప్రోత్సహించదు.

ఈ శ్లోకాలద్వారా ఆత్మ కర్తా, భోక్తా – అధ్యాస. శ్రుతి ప్రకారం ఆత్మ అకర్తా, అభోక్తా.

4. **ఆత్మ ప్రమాతా అధ్యాస** – ఆత్మ ప్రమాతా అనుకోవటం కూడా అధ్యాసే. ఆత్మ అంటే నేను అని మర్చి పోకూడదు. నేను చైతన్యస్వరూపుడిని అనుకోవటం అధ్యాస కాదు. అది తెలుసు కాని నేను ప్రమాతను అనుకోవటం అధ్యాస. అది అధ్యాస అని ఎలా నిరూపిస్తాము?

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం**
**న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాఽప్రజ్ఞమ్।** – మాండూక్యమ్ 7

జాగ్రత్ పురుషుడిని విశ్వ అనీ, స్వప్నపురుషుడిని తైజస అనీ, సుప్తపురుషుడిని ప్రాజ్ఞ అనీ అంటారు. ఆత్మ విశ్వజ్ఞాతా కాదు, తైజసజ్ఞాతా కాదు, ప్రజ్ఞానజ్ఞాతా

కూడా కాదు. ఆత్మ అజ్ఞాతా. అజ్ఞాతా అంటే అప్రమాతా. అత్మే చిత్ అంటే చైతన్యం అంటే ఎఱుక. ఆత్మవల్ల వేరే విషయాల జ్ఞానం పొందుతాము కాని, ఆత్మ ప్రమాత కాదు. అందువల్ల నేను ప్రమాతా అనుకోవటం అధ్యాస.

**ఆత్మ నిర్వికారత్వ ప్రమాణమ్**

ఆత్మ అకర్తా, అభోక్తా, అప్రమాతా అనే ఈ మూడు సత్యాలను ఒకేసారి ఇంకొక స్మృతి వాక్యంద్వారా తెలుసుకోవచ్చు.

**అవ్యక్తోఽ యమచింత్యోఽ యమ్ అవికార్యోఽ యముచ్యతే –** గీత 2.25

అవికార్యః అంటే ఆత్మకు వికారాలు లేవు. ఆత్మ నిర్వికారం. ఆత్మ కర్తా, భోక్తా, ప్రమాతాలలో ఏ ఒక్కటి అయినా ఆత్మ మార్పులకు లోనవుతుంది. ఆత్మ కర్త అవ్వాలంటే మార్పు జరుగుతుంది. కర్మ చేస్తే మార్పు జరుగుతుంది. అలాగే భోక్తా అయితే సుఖదుఃఖ అనుభవాలు కలుగుతాయి. అప్పుడు కూడా మార్పు జరుగుతుంది. అలాగే జ్ఞానం పొందాలన్నా కూడా బుద్ధిలో మార్పు కలుగుతుంది.

సంస్కృతంలో 'త' కారం ఉంటే మార్పును సూచిస్తుంది. కర్–తా; భోక్–తా; ప్రమా–తా; జ్ఞా–తా. ఆత్మ అకర్తా, అభోక్తా, అప్రమాతా. ఎందుకు? **నిర్వికారత్వాత్.** ఆత్మ నిర్వికారం కాబట్టి. నిర్వికారం ఒక్క పదమే మూడు అధ్యాసలను కొట్టివేసింది. అవి ఆత్మ కర్తా, భోక్తా, ప్రమాతా అనే అధ్యాసలను.

**ఆత్మనః నిర్వికారత్వాత్ ఆత్మా అకర్తా అభోక్తా అప్రమాతా**

ఇది అధ్యాసను నిరూపించే ఇంకొక విధానం.

**ఆత్మ అసంగత్వ ప్రమాణమ్** – ఇది అధ్యాసను నిరూపించే ఇంకొక పద్ధతి. ఆత్మ కర్తా భోక్తా ప్రమాతా అయితే సంగత్వం ఉంటుంది. కర్తకు కరణం అంటే పరికరంతో సంగత్వం ఉంటుంది. ఉదాహరణకు మనస్సు అంతఃకరణం; ఇంద్రియాలు బాహ్యకరణాలు, కళ్ళజోడు, కలం ఉపకరణాలు.

అలాగే భోక్తకు భోజన కరణంతో సంగత్వం ఉంటుంది. పసందైన పాయసం తినాలంటే కరణం కావాలి.

అలాగే ప్రమాతా అవాలంటే ప్రమాణం కావాలి. ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం అనే త్రిపుటి ఉంటుంది.

ఆ విధంగా కర్తా, భోక్తా, ప్రమాతాగా సంగత్వం ఉంటుంది కాని శ్రుతి ఏమంటుంది?

**అసంగోహ్యయం పురుషః – బృహదారణ్యకమ్**

ఆత్మ అసంగం అని స్పష్టంగా చెబుతున్నది. ఆత్మ అసంగం అయితే ప్రమాతా అవుతుందా? ఇక్కడ తర్కాన్ని చూడండి జాగ్రత్తగా. ఆత్మ అసంగం అయితే ప్రమాతా కాదు. ఆత్మ ప్రమాతా అయితే ప్రమాణం, ప్రమేయాలతో సంబంధం ఉంటుంది. అలాగే కర్తా అయినా, భోక్తా అయినా కరణాలతో సంగత్వం ఉంటుంది.

**ఆత్మనః అసంగత్వాత్ ఆత్మా అకర్తా అభోక్తా అప్రమాతా**
**ఆత్మ అకర్తా అయితే కర్తృత్వం అధ్యాస**
**ఆత్మ అభోక్తా అయితే భోక్తృత్వం అధ్యాస**
ఆత్మ ప్రమాతా అయితే ప్రమాతృత్వం అధ్యాస

అంతకు ముందు చూసినది –

ఆత్మ నిత్యం అయితే అనిత్యత్వం అధ్యాస.

ఆత్మ అంటే నేను అని మర్చిపోకూడదు.

5. **ఆత్మ పరిచ్ఛిన్నం అధ్యాస** – ఆత్మ పరిచ్ఛిన్నం అనుకోవటం ఇంకొక అధ్యాస. నేను పరిమిత జీవిని అనుకుంటే, నేను ఇక్కడ ఉన్నాను అంటే దాని అర్థం నేను ఇంకొక చోట లేనని. కాని శ్రుతి ఆత్మ అపరిచ్ఛిన్నం అంటుంది.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్ అనాద్యనంతమ్** – కఠ 1-3-15

అనంతం అంటే అపరిచ్ఛిన్నం. అపరిచ్ఛిన్నం సత్యం అయితే, పరిచ్ఛిన్నం అధ్యాస. పరిచ్ఛిన్నం అధ్యాస అని ఎలా తెలిసింది? శ్రుతి అర్థాపత్తి ప్రమాణం ద్వారా. అపరిచ్ఛిన్నత్వం బ్రహ్మత్వం అయితే, పరిచ్ఛిన్నత్వం జీవత్వం అవుతుంది. బ్రహ్మత్వం సత్యం, జీవత్వం అధ్యాస.

పరిచ్ఛిన్నత్వం అన్నా జీవత్వం అన్నా ఒకటే. అవి పర్యాయపదాలు.

6. **ఆత్మ అనేకం అధ్యాస** – ఆత్మ బహుత్వం లేదా ఆత్మ అనేకత్వాన్ని తక్కిన ఆస్తికులందరూ స్వీకరిస్తారు. అంటే సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వ

మీమాంసకులు ఆత్మలు అనేకం అంటారు. వారే కాదు, వేదాంతానికి వచ్చాక కూడా విశిష్టాద్వైతులు, ద్వైతులు కూడా ఆత్మలు అనేకం అంటారు.

అందువల్ల అనేకత్వం అధ్యాస అంటున్నారు శంకరులవారు. దేని ఆధారంగా? మళ్ళీ శ్రుతి అర్థాపత్తి ద్వారా. ఆత్మ ఏకత్వాన్ని సూచించే వాక్యాలు ఎన్నో ఉన్నాయి.

**ఏకో దేవః సర్వ భూతేషు గూఢః –** శ్వేతాశ్వతర ఉపనిషత్తు

ఏకో దేవః సాక్షీ చేతా కేవలః; కేవలః అంటే ఆత్మ ఒక్కటే.

**యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవ అభూత్**

ఉన్నదంతా ఆత్మ ఒకటే. ఆత్మ ఏకత్వం సత్యం; ఆత్మ బహుత్వం అధ్యాస.

ఈ విధంగా శ్రుతి అర్థాపత్తి ప్రమాణంద్వారా శంకరాచార్యులు ఆత్మ అనిత్యత్వం, కర్తృత్వం, భోక్తృత్వం, ప్రమాతృత్వం, పరిచ్ఛిన్నత్వం, అనేకత్వం అన్నీ అధ్యాస అని నిరూపించారు.

అంటే ఆత్మ నిత్యం, అకర్తా, అభోక్తా, అప్రమాతా, అపరిచ్ఛిన్నం, ఏకం. ఇది మొదటి ప్రమాణం.

బి) **అనుమాన ప్రమాణమ్** – అనుమాన ప్రమాణం వ్యాప్తిజ్ఞానంమీద ఆధారపడివుందని చూశాము. వ్యాప్తి అంటే రెండు వస్తువులు ఒకచోట ఉండటం.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడెక్కడ పొగ ఉంటే, అక్కడక్కడ అగ్ని ఉంటుంది. ఈ వ్యాప్తి జ్ఞానాన్ని అనుమాన వాక్యానికి అన్వయించాలి. ఏమిటా అనుమాన వాక్యం?

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

మహానసే అంటే వంటిల్లు. కొండమీద అగ్ని ఉందని ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలియటం లేదు. ప్రత్యక్షంగా తెలిస్తే, అనుమాన ప్రమాణం జోడించనవసరం లేదు. అక్కడ పొగ ఉందని చూశాము. మన పూర్వ అనుభవం ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉందని గుర్తు చేస్తున్నది. పొగ–అగ్ని కలిసి ఉంటాయనేది వ్యాప్తి జ్ఞానం.

ఇప్పుడు ఈ వ్యాప్తిజ్ఞానాన్ని ఆత్మ విషయంలో అన్వయిస్తున్నారు శంకరులవారు.

**యత్ర యత్ర వ్యవహారః తత్ర తత్ర అధ్యాసః**

ఎక్కడ వ్యవహారం ఉంటే అక్కడ అధ్యాస ఉండితీరాలి. ఎందుకు? శంకరుల వారు జవాబు చెబుతున్నారు – ఆత్మ శరీరానికి భిన్నంగా ఉంది కాబట్టి, ఆత్మ ఏ వ్యవహారమూ నడుపలేదు. ఆత్మ శరీరానికి భిన్నంగా ఉందని ఆస్తిక దార్శనికులందరూ ఒప్పుకుంటారు. స్థూలశరీర అధ్యాస ఉందని అధ్యాస శంకా సమాధానంలో చూశాము.

దీనికి ఉదాహరణ పశువు లేదా ఆవు. ఆవు, ఆవు శరీరానికి భిన్నంగా ఉంది. ఇది ప్రతి ఒక్క ఆస్తిక దార్శనికుడూ ఒప్పుకుంటాడు. కాని ఆవుకు తాను శరీరానికి భిన్నంగా ఉన్నానని తెలియదు. ఆవు 'దేహమే నేను,' అనుకుంటుంది. అందువల్ల ఎవరైనా పచ్చగడ్డి చూపిస్తే, దానివైపు వెళుతుంది. నేను దేహాన్ని, నాకు ఆకలి వేస్తోంది, పచ్చగడ్డి తినాలి అనుకుంటుంది.

**దేహ అధ్యాసాదేవ పశుః తృణమ్ అభిముఖం కరోతి**

దేహఅభిమానంవల్ల మాత్రమే పశువు గడ్డివైపు వెళుతుంది. ఈ వ్యవహారాన్ని ప్రవృత్తి వ్యవహారం అంటారు. ప్రవృత్తి అంటే ఒక వస్తువు వైపు వెళ్ళటం. ఆవుకు తాను దేహం కాదని తెలిస్తే, అటువైపు వెళ్ళదు.

ఇప్పుడు అదే ఆవుకు గడ్డి చూపించకుండా, ఒక కర్ర తీసుకుని బెదిరిస్తే, ఆ ఆవు కర్ర వైపు వెళ్ళకుండా, అతనికి దూరంగా వెళుతుంది. ఎందుకు? కర్ర తనకు ప్రమాదాన్ని తీసుకువస్తుందనే సహజమైన జ్ఞానం ఉంటుంది. దీన్ని నివృత్తి వ్యవహారం అంటారు. నివృత్తి అంటే ఒక వస్తువుకు దూరంగా వెళ్ళటం.

**స్థూలశరీర అధ్యాసాత్ నివర్తతే**

ఈ ప్రవృత్తి, నివృత్తి వ్యవహారాలు రెండూ దేహాభిమానంవల్ల అవుతాయి. ఇది పశువును గమనించటంవల్ల తెలుసుకున్నాము. ఇప్పుడు ఈ వ్యాప్తి జ్ఞానాన్ని పశువునుంచి మనిషికి అన్వయించి చూద్దాము. పశువుకూ, మనిషికీ ఎక్కువ భేదం లేదు. మనిషి కూడా మంచి రుచికరమైన వంట వాసన వస్తుంటే, అటువైపు వెళతాడు; మురికికాలువనుంచి దుర్గంధం వస్తుంటే దానినుంచి దూరం వెళతాడు.

దీనికి అనుమానవాక్యం ఏమిటి?

**మనుష్యః అధ్యాసవాన్ వ్యవహారత్వాత్ పశువత్**

| | | |
|---|---|---|
| పక్షం | – | మనుష్యః |
| సాధ్యం | – | అధ్యాసవాన్ (ప్రవృత్తి, నివృత్తి) |
| హేతువు | – | వ్యవహారత్వాత్ |
| దృష్టాంతం | – | పశువత్ |

మనిషియొక్క వ్యవహారాలన్నీ అధ్యాసమీద ఆధారపడి చేసేవే. అది ప్రవృత్తి వ్యవహారం అయినా, నివృత్తి వ్యవహారం అయినా సరే. అంటే ఒక వస్తువు వెంటబడినా, ఇంకో వస్తువునుంచి దూరంగా పారిపోయినా, అది అధ్యాసే. దీనికి వ్యాప్తి జ్ఞానం ఏమిటి?

**యత్ర యత్ర వ్యవహారః తత్ర తత్ర అధ్యాసః**

దీనితో అధ్యాస ప్రమాణం ముగిసింది. ఈ అధ్యాస ప్రమాణంవల్ల మనం గ్రహించాల్సిన విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఏమిటది? మనందరికీ అధ్యాస ఉంది. అది –

**ఆత్మ అనాత్మ మిథునీకరణం లేదా సత్యానృత మిథునీకరణమ్**

కాని మనం అధ్యాసలో ఉన్నప్పుడు రెండు అంశాలను కలుపుతున్నామని మనకు తెలియదు. తాడును చూసి పాము అనుకుంటున్న వ్యక్తికి అక్కడ రెండు విషయాలు అంటే నిజం తాడు, మిథ్యా పాము ఉన్నాయని తెలియదు. ఒక్క పామే ఉంది అనుకుంటాడు.

**అహం జానామి – నాకు తెలుసు.**

అహం జానామిలో రెండు అంశాలు ఉన్నాయి.
అవి చేతనతత్త్వం + అచేతనవృత్తి. అంటే చేతన ఆత్మ + జడవృత్తి.
చేతన ఆత్మ నిర్వికారం, అచేతనవృత్తి సవికారం కాని జడం.

**జ్ఞాతా = ఆత్మ చిత్ అంశం + అనాత్మ వృత్తి అంశం**
**ఆత్మ నేర్చుకోదు, అనాత్మ నేర్చుకోలేదు. నేను = ఆత్మ + అనాత్మ**

అందువల్ల ఈ రెండింటినీ కలిపి కొత్త అంశాన్ని స్వీకరిస్తున్నాము. ఆ విధంగా అధ్యాస ప్రమాణం **సత్యానృత మిథునీకరణం** అంశాన్ని నిరూపిస్తుంది.

6. **అధ్యాస ఉపసంహారం** – అధ్యాసభాష్యం ముగింపు.

ఈ ఉపసంహారంలో అధ్యాస మొత్తం మానవజాతికి హానికరం అంటున్నారు శంకరులవారు. ఎందుకంటే ఈ అధ్యాస అనిత్యత్వాన్ని తీసుకువస్తుంది. దాని ఫలితంగా నిత్యం మరణభయానికి లోనవుతారు. ఎక్కడో మరణవార్త విన్నా కూడా, ఇక్కడ గుండె గుభేలుమంటుంది. అందువల్ల అధ్యాసయొక్క మొట్టమొదటి సమస్య భయం, అభద్రతా భావం.

సమృద్ధిగా ధనం ఉంటే ఈ అభద్రతా భావన పోతుందనుకుంటారు మనుష్యులు. అందువల్ల **ధనమూలమిదం జగత్** అయిపోయింది. ఆ ధనంకోసం కోట్లలో కూడా మోసాలు చెయ్యటానికి వెనుకాడటం లేదు. ఇంత ధనదాహం ఎందుకు? భద్రతకోసం, శాశ్వతత్వంకోసం. కాని ఎంత డబ్బు పోగేసినా కూడా ఈ అశాశ్వతత్వం పోదు. ఎందుకు? అది అధ్యాసవల్ల ఏర్పడింది కాబట్టి.

**అధ్యాసః ఏవ సంసారస్య కారణమ్**

ఈ సమస్య ఇప్పటికే పరిమితమవదు. భవిష్యత్తులోకి కూడా తొంగిచూస్తుంది. ఎలా? అధ్యాసవల్లనే మనిషి ప్రవృత్తి వ్యవహారం, నివృత్తి వ్యవహారాలు నడుపుతాడు. అతను చేసే లౌకిక, వైదిక కర్మలన్నీ కూడా అధ్యాసవల్లనే చేస్తాడు.

అధ్యాసవల్ల ఏడు తప్పటడుగులు వేస్తాడు మనిషి. అధ్యాస అంటే ఏమిటి? పొరపాటు పడటం. అంటే తను నిత్యం అయితే అనిత్యం అనుకోవటం. అంటే అధ్యాస మొదటిదశ **అజ్ఞానం**. అజ్ఞానంవల్ల నేను చేస్తున్నాను అనుకుంటాడు మనిషి. అంటే తను **కర్త** అనుకుంటాడు. ఎప్పుడైతే అతను కర్త అనుకుంటాడో అప్పుడే అనేక కోరికలు పుట్టుకువస్తాయి. ఆ కోరికలు తీర్చుకోవటానికి అనేక **కర్మలు** (లౌకిక, వైదిక కర్మలు) చేస్తాడు. ఆ కర్మలు **పుణ్యపాపాలు** కలుగజేస్తాయి. ఆ పుణ్యపాపాలకు తగ్గట్టుగా **సుఖదుఃఖాలను** అనుభవించాలి. ఆ సుఖదుఃఖాలను అనుభవించటానికి ఈ జన్మ చాలదు. అందువల్ల **పునరపి జననం, పునరపి మరణం** తప్పదు.

**అధ్యాస = అజ్ఞానం – కర్తా – కోరికలు – కర్మలు – పుణ్యపాపాలు – సుఖదుఃఖాలు – పునరపి జననం, పునరపి మరణం = సంసారం.**

సంసారం ఎందుకు ఏర్పడిందో వెనుకనుంచి చూస్తే, జన్మవృత్తంలో ఎందుకు పడతాడు? సుఖదుఃఖాలను అనుభవించటానికి. సుఖదుఃఖాలను ఎందుకు

అనుభవించాలి? పుణ్యపాపాలు పొందాడు కాబట్టి. పుణ్యపాపాలు ఎలా పొందాడు? కర్మలు చేసి. కర్మలు ఎందుకు చేశాడు? కోరికలు తీర్చుకోవటానికి. కోరికలు ఎందుకు కలిగాయి? తను కర్త అనుకున్నాడు కాబట్టి. తను కర్త అని ఎందుకనుకున్నాడు? అజ్ఞానంవల్ల. అజ్ఞానం ఎందుకు కలిగింది? అధ్యాసవల్ల. అంటే మొదటిదశని ఆఖరిదశను కలిపితే ఏమయింది? అధ్యాస=సంసారం.

## అధ్యాస ఏవ సంసారస్య కారణమ్

ఇప్పుడు అన్వయ వ్యతిరేక పద్ధతిని అన్వయిస్తే, ఏం చెయ్యాలి?

**అధ్యాస సత్వే సంసారత్వమ్**
**అధ్యాస నివృత్తే సర్వసంసార నివృత్తిః**

సంసార నివృత్తికి ఏకైక మార్గం అధ్యాస నివృత్తి. అధ్యాస నివృత్తి ఎలా జరుగుతుంది? అధ్యాస కారణం పోతే అధ్యాస పోతుంది. అధ్యాస కారణం ఏమిటి? అజ్ఞానం. అజ్ఞానం ఎలా పోతుంది?

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – సూత్రం 1, బ్రహ్మసూత్రములు

అధ్యాస ప్రమాణంలో చూసినట్టుగా ఆత్మ అంటే నేను నిత్యం, అకర్తా, అభోక్తా, అప్రమాతా, అపరిచ్ఛిన్నం, ఏకం. కాని ఇవేవీ తెలియక మనం సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. దానివల్ల మనం జన్మ, మృత్యు, జరా, వ్యాధి దుఃఖాలను అనుభవిస్తున్నాము.

ఈ అధ్యాస అనేక స్థాయిల్లో వ్యాపించింది.

ఎ) మనస్సు స్థాయిలో – నేను ప్రమాతను అనుకుంటున్నాము. ఆత్మ, మనస్సుల మిథునీకరణంవల్ల ఈ అధ్యాస ఏర్పడింది. అంటే అంతఃకరణ అధ్యాస.

బి) ఇంద్రియాల స్థాయిలో – నాకు కళ్ళు సరిగ్గా పనిచెయ్యటం లేదు అనుకుంటున్నాము. ఆత్మ, ఇంద్రియాల మిథునీకరణంవల్ల ఈ అధ్యాస ఏర్పడింది. అంటే ఇంద్రియ అధ్యాస.

సి) శరీరస్థాయిలో – నేను మనిషిని, నేను మరీ లావుగా ఉన్నాను అనుకుంటున్నాము. ఆత్మ, శరీరాల మిథునీకరణంవల్ల ఈ అధ్యాస ఏర్పడింది. అంటే శరీర అధ్యాస.

డి) జగత్తు స్థాయిలో –నా భార్య, నా పిల్లలు, నా ఇల్లు, నా ఆస్తి అని అనుకుంటున్నాము. ఆత్మ, జగత్తుల మిథునీకరణంవల్ల ఈ అధ్యాస ఏర్పడింది. అంటే జగత్తు అధ్యాస.

ఇన్ని స్థాయిల్లో ఉన్న అధ్యాసను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి అహంకార అధ్యాస, మమకార అధ్యాస. వీటినే నేను, నావారు అనవచ్చు. అహం, మమ అని కూడా అంటారు. ఈ అధ్యాస సంసార కారణం కాబట్టి దీన్ని **అనర్థ హేతువు** అనవచ్చు. అనర్థ హేతువు అంటే జీవితంలోని అన్ని సమస్యలకు మూలకారణం.

ఈ అధ్యాసకు మూలకారణం ఏమిటి? అజ్ఞానం. దేని గురించిన అజ్ఞానం ఇది? కొంతమందికి టీకి, కాఫీకి మధ్య భేదం తెలియదు. ఈ అజ్ఞానం అలాంటి అజ్ఞానం కాదు. అలాగే ఇది కెమిస్ట్రీ అజ్ఞానమో, సంగీత అజ్ఞానమో, నృత్య అజ్ఞానమో కాదు. ఎలా తెలుసు? ఎందుకంటే ఈ జ్ఞానాలు ఏవి పొందినా కూడా ఆత్మ అజ్ఞానం తొలగటం లేదు. అందువల్ల అధ్యాసకు కారణం **ఆత్మ అజ్ఞానం**.

ఎన్ని విద్యలు నేర్చినా, సంసారం పోదు. అతను చదువుకున్న అజ్ఞాని అవుతాడు. ఇదే విషయాన్ని ఛాందోగ్యోపనిషత్తులో ఏడవ అధ్యాయంలో చూస్తాము. ఆ అధ్యాయం పేరు భూమావిద్య. అందులో నారదులవారు సనత్కుమారులను బ్రహ్మవిద్య నేర్పమని అడుగుతారు. నువ్వే విద్య నేర్చుకున్నావో చెప్పమని సనత్కుమారులు అడిగితే, నారదులవారు ఇంత పెద్ద పట్టిక చదువుతారు. ఆయన వేదాలు, శాస్త్రవిద్య, నక్షత్రవిద్య, దేవవిద్య – అలా ఎన్నో నేర్చుకున్నారు. కాని శోకం పోలేదు. శోకం పోవటానికి ఒకటే మార్గం ఉంది – **తరతి శోకమాత్మవిత్**

ఆత్మజ్ఞానం పొందితేనే శోకం పోతుంది. అర్జునుడు కూడా అంత గొప్ప విలుకాడు అయినా, సవ్యసాచిగా పేరుపొందినా, ఆత్మజ్ఞానం పొందకపోవటం చేత రాగం–శోకం–మోహంలో పడిపోయాడు.

**తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్ – గీత 2.1**

అతని భవరోగాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న కృష్ణపరమాత్మ ఒక్కముక్కలో చెప్పాడు.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ – గీత 2.11**

**నాను శోచంతి పండితాః** – శోకించని వాటికోసం పండితుడు శోకించడు అని చెప్పటంలో ఉద్దేశ్యం నువ్వు అజ్ఞానివి, నీకు ఆత్మజ్ఞానం లేదు అని.

అందువల్ల ఆత్మ అజ్ఞానం తొలగాలంటే ఆత్మజ్ఞానం కలగటం ఒక్కటే మార్గం. ఆత్మ జ్ఞానం ఒక్కటే సంసారాన్ని తొలగిస్తుంది. ఎందుకంటే సంసారం అధ్యాస వల్ల ఏర్పడుతుంది.

**సర్వాః ఉపనిషదః ఆత్మవిద్యా బోధనేన ఆరభ్యంతే**

అన్ని ఉపనిషత్తులూ ఆత్మజ్ఞానం బోధించటంతో మొదలవుతాయి అంటున్నారు శంకరులవారు.

ఆత్మజ్ఞానం పొందితే, ఆత్మ అజ్ఞానం తొలగుతుంది అన్నప్పుడు ఒక విషయాన్ని మర్చిపోకూడదు. ఆత్మ జ్ఞాన విషయంలో అధ్యాస ఉంది కాని అది ఎటువంటి అధ్యాస? అది పూర్తి అధ్యాస కాదు, పాక్షిక అధ్యాస. ఈ విషయం తాడు–పాముల అధ్యాసలో చూశాము. మళ్ళీ ఒకసారి దాన్ని గుర్తు తెచ్చుకుందాము.

అక్కడ పూర్తిగా చీకటిగా ఉండి, ఏదీ కనపడకపోయినా, అధ్యాస ఉండదు

అక్కడ పూర్తిగా వెలుతురు ఉండి, తాడు తాడుగా కనపడినా, అధ్యాస ఉండదు

అక్కడ సగం వెలుతురు ఉండి, అక్కడేదో ఉందని కనిపించి, అదేమిటో తెలియకపోతే అధ్యాస ఏర్పడుతుంది.

| | |
|---|---|
| అక్కడ ఉన్నది తాడు | – వాక్యం |
| అక్కడ ఉన్నది | – సామాన్య అంశం, సత్య అంశం |
| తాడు | – విశేష అంశం |

ఈ విశేష అంశం సరిగ్గా కనపడక, దీనిలో పొరపాటు పడతాము. అంటే తాడును, పాముగా ఊహించుకుంటాము.

ఇదే సూత్రం ఆత్మ–అనాత్మలకు కూడా వర్తిస్తుంది.

| | |
|---|---|
| అహం బ్రహ్మ అస్మి | – వాక్యం |
| అహమ్ అస్మి | – సామాన్య అంశం, సత్య అంశం |
| బ్రహ్మ | – విశేష అంశం |

నేను బ్రహ్మను అని తెలియక, నేను సంసారిని అని పొరపాటు పడతాము. అంటే నాకు నా బ్రహ్మత్వం హోదా తెలియదు.

**ఆత్మనః బ్రహ్మత్వం అజ్ఞాతమ్**

అందువల్ల బ్రహ్మజ్ఞానం పొందుతాము అంటే బ్రహ్మ అనే కొత్త వస్తువు గురించి తెలుసుకుంటాము అనుకోకూడదు. బ్రహ్మజ్ఞానం అంటే నా బ్రహ్మత్వ హోదాను తెలుసుకోవటం.

**ఆత్మనః బ్రహ్మత్వ జ్ఞానమ్**

బ్రహ్మత్వ హోదా తెలియక మనము జీవత్వ హోదాను ఆపాదించుకుంటున్నాము. అందువల్ల ఇప్పుడు మనం నేర్చుకోవాల్సింది ఏమిటి? నా జీవత్వ హోదాను తీసి, దాని స్థానంలో బ్రహ్మత్వ హోదాను నిలుపుకోవటం.

**అహం న జీవః పరంతు అహం బ్రహ్మాస్మి**

నేను జీవిని కాను, పరమాత్మను. అందువల్ల

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** అంటే **అథాతో ఆత్మనః బ్రహ్మత్వ జిజ్ఞాసా**

నా ఉన్నతమైన స్థాయి గురించి నేను తెలుసుకోవాలి. ఉపనిషత్తుల సారం అదే. అంతేకాదు, అది ఒక్క ఉపనిషత్తుల సారం మాత్రమే. తక్కిన అన్ని శాస్త్రాలూ జీవత్వాన్ని సత్యంగా తీసుకుని, ఆ హోదాను పెంచుకునేందుకు మార్గాలు సూచిస్తాయి. అందులో ఒక మార్గం ధనసంపాదన. ఆర్థికంగా మన హోదా పెరగాలి అనుకుంటాము.

ఒకప్పుడు మారుతి కారు కొంటే గొప్పవాడు; ఇప్పుడు అనేక కొత్త మోడల్స్ వచ్చాయి. అలా మన ఆర్థికస్థాయిని పెంచుకోవటానికి పాటుపడుతున్నాము. వేదంలోని పూర్వభాగం కూడా అదే చెపుతోంది. పూర్వభాగం అంటే కర్మకాండ. అది యజ్ఞాలు చేసి, స్వర్గలోకానికి చేరి, ఇంద్రలోక సుఖాలను పొందమంటుంది.

వేద అంతభాగం అయిన ఉపనిషత్తు ఒక్కటే అసలు నువ్వు హోదాను పెంచుకోవటం ఎందుకని ఎదురు ప్రశ్నిస్తుంది. ఉపనిషత్తు ఆత్మస్వరూపం గురించిన విచారణ మొదలుపెట్టి, నా హోదాను నేను పెంచుకోనవసరం లేదు అంటుంది. ఎందుకు?

నేను నిత్యశుద్ధ ముక్తపురుషుడిని అంటుంది. అంతేకాదు, నాకు వేరే ఎవరూ పోటీ లేదు అంటుంది. ఎందుకంటే ఉన్నదొక్కటే బ్రహ్మ. ఆ బ్రహ్మను నేనే అంటుంది.

నేను = ఆత్మ = బ్రహ్మ

ఆ విధంగా ఉపనిషత్తులు నా హోదాను పెంచవు, నా హోదాను నేను గుర్తించేలా చేస్తాయి.

దీనితో అధ్యాస భాష్యమ్ అయిపోయింది.

***

# అధ్యాస భాష్యమ్ - ముఖ్యమైన అంశములు

అధ్యాస అంటే పొరపాటని అర్థం. దానిమీద రాసిన భాష్యం అధ్యాస భాష్యమ్.

**రజ్జు సర్పభ్రాంతి**

| | |
|---|---|
| అక్కడ ఉన్నది తాడు | - వాక్యం |
| అక్కడ ఉన్నది | - సామాన్య, అనావృత, సత్య అంశం |
| తాడు | - విశేష, ఆవృత అంశం. |
| అక్కడ ఉన్నది పాము | - వాక్యం |
| అక్కడ ఉన్నది | - సామాన్య, అనావృత, సత్య అంశం |
| పాము | - విశేష, ఆవృత, మిథ్యా అంశం |
| నేను ఉన్నాను ఆనందస్వరూపునిగా | - వాక్యం |
| నేను ఉన్నాను | - సామాన్య, అనావృత, సత్య అంశం |
| ఆనందస్వరూపునిగా | - విశేష, ఆవృత అంశం |
| నేను ఉన్నాను సంసారిగా | - వాక్యం |
| నేను ఉన్నాను | - సామాన్య, అనావృత, సత్య అంశం |
| సంసారిగా | - విశేష, ఆవృత, మిథ్యా అంశం |

**మూడు అధ్యాసలు-**

1. అన్యథా గ్రహణమ్ - తాడును చూసి పాము అనుకుంటాము
2. అధ్యాస - లేని పాముని ఉన్నవస్తువుమీద ఆరోపిస్తున్నాము (తాడు అని తెలియదు)
3. సత్యానృతమిధునీకరణమ్- తాడు లక్షణాలు, పాము లక్షణాలు కలుపుతున్నాము.

అధ్యాసను ఆరు అంశాలుగా విభజించవచ్చు. అవి-

1. అధ్యాస శంక - తక్కిన దార్శనికులు ఈ అధ్యాస మీద చేసిన విమర్శలు

| | |
|---|---|
| 2. అధ్యాస శంకాసమాధానం | – వారి విమర్శలకు సమాధానం |
| 3. అధ్యాస లక్షణం | – అధ్యాస నిర్వచనం |
| 4. అధ్యాస సంభావనం | – పొరపాటుపడే అవకాశం |
| 5. అధ్యాస ప్రమాణం | – అధ్యాసకు నిదర్శనం |
| 6. అధ్యాస ఉపసంహారం | – అధ్యాస అంశాన్ని ముగించటం |
| **1. అధ్యాస లక్షణం** | **–** ముందు ఇది చూద్దాము |
| పరత్ర పూర్వదృష్ట అవభాసః | – ఉన్న తాడు మీద అనుభవంలోకి వచ్చిన పాముని ఆరోపించటం |
| అతస్మిన్ తత్ బుద్ధిః | – లేని పాముని ఉన్న తాడు మీద ఆరోపించటం |
| సత్యానృత మిథునీకరణమ్ | – సత్యాన్ని, అసత్యాన్ని కలిపి చెప్పటం |
| **2. అధ్యాస శంక** | – అధ్యాసకు నాలుగు అంశాలు ఉండాలి |
| అ) ప్రత్యక్షమ్ | – తాడు ఎదురుగా ఉండాలి |
| ఆ) అజ్ఞానమ్ | – తాడు తాడుగా కనపడకూడదు |
| ఇ) సాదృశ్యమ్ | – తాడుకూ, పాముకూ పోలిక ఉండాలి |
| ఈ) సంస్కారమ్ | – పాము గురించిన వాసన ఉండాలి. |

పూర్వపక్షి వాదన

| **నియమం** | **వివరణ** | **పూర్వపక్షి వాదన** | **సిద్ధాంతం ఆధారంగా** |
|---|---|---|---|
| ఎ) ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ ఎదురుగా లేదు | ఆత్మ అప్రత్యక్షం |
| బి) అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మజ్ఞానం ఉంది | ఆత్మ స్వయం ప్రకాశకం |
| సి) సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ, అనాత్మలు భిన్నం | తమః ప్రకాశవత్ విరుద్ధ స్వభావయోః |
| డి) సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ గురించిన వాసన ఉండాలి | అనాత్మ మిథ్య |

## 3 అధ్యాస శంకా సమాధానం / 4 అధ్యాస సంభావనం

**మొదటి జవాబు**

| నియమం | వివరణ | పూర్వపక్షి వాదన | సిద్ధాంతి జవాబు |
|---|---|---|---|
| 1. ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ అప్రత్యక్షం | ఎదురుగా కాదు. తెలిసిన విషయమైతే చాలు |
| 2. అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మ స్వయం ప్రకాశకం | అహం బ్రహ్మ అస్మిలో అహం అస్మి తెలుసు; బ్రహ్మ తెలియదు |
| సి) సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ,అనాత్మలు భిన్నం | ఈ నియమం తీరక పోయినా ఫర్వాలేదు. ఆకాశం నీలంగా, బోర్లించిన గిన్నెలా ఉంది. |
| 4. సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ మిథ్య | నిజం పాము అనుభవమే ఉండాలని లేదు. మిథ్యా అనాత్మ అనుభవం ఉంది. |

**రెండవ జవాబు**

| నియమం | వివరణ | పూర్వపక్షి వాదన | సిద్ధాంతి జవాబు |
|---|---|---|---|
| 1. ప్రత్యక్షం | తాడు ఎదురుగా ఉండాలి | ఆత్మ అప్రత్యక్షం | శాస్త్రం ప్రకారం ఆత్మ ప్రత్యక్షం కాదు |
| 2. అజ్ఞానం | తాడు తాడుగా కనపడకూడదు | ఆత్మ స్వయం ప్రకాశకం | పూర్వపక్షులకు కూడా స్థూలశరీర అధ్యాస ఉంది |
| 3. సాదృశ్యం | తాడుకూ, పాముకూ పోలిక ఉంది | ఆత్మ, అనాత్మలు భిన్నం | స్థూలశరీరానికీ, ఆత్మకూ ఏం పోలిక ఉంది? |

| | | | |
|---|---|---|---|
| 4. సంస్కారం | పాము గురించిన వాసన ఉండాలి | అనాత్మ మిథ్య | ఖ్యాతి వాదం అధ్యాస ఉంది కాని స్థాయీభేదాలు ఉన్నాయని చూపిస్తుంది |

ఆత్మఖ్యాతి – యోగాచార్యుడు
అసత్ ఖ్యాతి – చార్వాకుడు
అఖ్యాతి – ప్రభాకర మీమాంస
అన్యథా ఖ్యాతి – నైయాయిక
అనిర్వచనీయఖ్యాతి – అద్వైతం

అధ్యాస ఉండటం సమస్యకాదు, ఎంత మేరకు అధ్యాస ఉంది అనేది సమస్య –
మూడు విషయాల్లో భిన్న దర్శనాలు – నిత్యత్వం, కర్తృత్వం, భోక్తృత్వం
న్యాయ– వైశేషిక – ఆత్మ నిత్యం కాని, కర్తా, భోక్తా
సాంఖ్య– యోగ – ఆత్మ నిత్యం, అకర్తా, కాని భోక్తా
అద్వైతం – ఆత్మ నిత్యం, అకర్తా, అభోక్తా

**అధ్యాస ప్రమాణం –** శ్రుతి అర్థాపత్తి ప్రమాణం, శ్రుతి అనుమాన ప్రమాణం
**శ్రుతి అర్థాపత్తి ప్రమాణం** (Postulation)
రోడ్లన్నీ నీళ్ళతో నిండి ఉన్నాయి – ప్రత్యక్ష ప్రమాణం;
అర్థాపత్తి – రాత్రివాన పడి ఉంటుంది.
శ్రుతి– ప్రత్యక్ష ప్రమాణం; అర్థాపత్తి – ఆత్మనిత్యం, అకర్తా, అభోక్తా.
1) ఆత్మ నిత్యం – **అజో నిత్యః శాశ్వతోఽ యం పురాణః**– గీత 2.20
2) ఆత్మ అకర్తా, 3) అభోక్తా –

**య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥** – గీత 2.19

4) ఆత్మ అప్రమాతా – ఆత్మ – జ్ఞాతా కాదు, జ్ఞానం
**నాంతః ప్రజ్ఞం న బహిఃప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం**
**న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాఽప్రజ్ఞమ్।** – మాండూక్యమ్ 7

ఆత్మ నిర్వికారం – ఆత్మ అకర్తా, అభోక్తా, అప్రమాతా – అన్నీ కలిపి ఒక నిర్వచనం –

**అవ్యక్తోఽ యమచింత్యోఽ యమ్ అవికార్యోఽ యముచ్యతే –** గీత 2.25

వికారములులేనిది.

**ఆత్మనః నిర్వకారత్వాత్ ఆత్మ అకర్తా అభోక్తా అప్రమాతా**

ఆత్మ అసంగం – కర్తా, భోక్తా, ప్రమాతాలకు సంగత్వం ఉంటుంది

అసంగోహ్యం పురుషః –బృహదారణ్యకమ్

**ఆత్మనః అసంగత్వాత్ అకర్తా అభోక్తా అప్రమాతా**

5) ఆత్మ అపరిచ్ఛిన్నం – **అశబ్దమస్పర్శమరూపమవ్యయం**

**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్ అనాద్యనంతమ్**

అనంతం అంటే అపరిచ్ఛిన్నం

అహం బ్రహ్మ అస్మి – సత్యం; అహం జీవః అస్మి – అధ్యాస

6) ఆత్మ ఏకం – **ఏకోదేవశ్చ సర్వ భూతేషు** – శ్వేతాశ్వతర

**యస్మిన్ సర్వాని భూతాని ఆత్మై వా అభూత్**

**శ్రుతి అనుమాన ప్రమాణం** (Inference)

వ్యాప్తి వాక్యం ఆధారంగా

**మనుష్యః అధ్యాసవాన్ వ్యవహారత్వాత్ పశువత్**

పక్షం – మనుష్యః

సాధ్యం – అధ్యాసవాన్ – (ప్రవృత్తి, నివృత్తి)

హేతువు – వ్యవహారత్వాత్

దృష్టాంతం – పశువత్

వ్యాప్తి – యత్ర యత్ర వ్యవహారః తత్ర తత్ర అధ్యాసః

సత్యానృత మిధునీకరణం

అహం జానామి = చేతనతత్త్వం + అచేతనవృత్తి (know+er)

Knower = ఆత్మ చిత్ అంశం + అనాత్మ వృత్తి అంశం

ఆత్మ నేర్చు కోదు, అనాత్మ నేర్చుకోలేదు. నేను = ఆత్మ + అనాత్మ

అధ్యాస ప్రమాణం సత్యానృత మిధునీకరణం అంశాన్ని నిరూపిస్తుంది

**6. అధ్యాస ఉపసంహారం– అధ్యాస భాష్యం ముగింపు**

**అధ్యాస ఏవ సంసారస్య కారణం**

**అధ్యాస సత్వే సంసారత్త్వమ్। అధ్యాస నివృత్తే సర్వసంసార నివృత్తిః**

ఆత్మన్యేవ ఆత్మనః తుష్టః – గీత

అజ్ఞానం పోవాలంటే **అథాతో బ్రహ్మ జిజ్ఞాసా**

అధ్యాస = అజ్ఞానం – కర్తా – కోరికలు – కర్మలు – పుణ్యపాపాలు – సుఖదుఃఖాలు – పునరపి జననం – పునరపి మరణం = సంసారం

అధ్యాస – మనస్సు స్థాయిలో, ఇంద్రియాల స్థాయిలో, శరీర స్థాయిలో – అహంకారం

జగత్ స్థాయిలో – నా భార్య, నాపిల్లలు, నా ఆస్తి – మమకారం

అధ్యాస – అనర్థ హేతువు

అన్వయ వ్యతిరేక పద్ధతి –

అధ్యాస సత్వే సంసారత్త్వమ్, అధ్యాస అభావే సంసార నివృత్తిః

అధ్యాస కారణం – ఆత్మ అజ్ఞానం. ఆత్మజ్ఞానంవల్ల **తరతి శోకమాత్మవిత్**

ఆత్మ జ్ఞానం – ఉపనిషత్తుల సారం

ఆహం బ్రహ్మ అస్మి లో అహం అస్మి తెలుసు, బ్రహ్మ గురించి నేర్చుకోవటం కాదు, బ్రహ్మత్వ హెూదా గురించి తెలుసు కోవటం

**అహం న జీవః పరంతు అహం బ్రహ్మాస్మి.**

***

# సూత్రము 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా

బ్రహ్మసూత్రములు ఈ విధంగా ఉంటాయి

| | | |
|---|---|---|
| అధ్యాయాలు | – | 4 |
| పాదాలు | – | 16 |
| అధికరణాలు | – | 191/192 |
| సూత్రములు | – | 555 |

ఒక్కొక్క అధ్యాయంలో నాలుగేసి పాదాలు ఉన్నాయి కాని ఒక్కొక్క పాదంలో అధికరణాల సంఖ్య సమానంగా ఉండదు. అలాగే ఒక్కొక్క అధికరణంలో సూత్రముల సంఖ్య సమానంగా ఉండదు. ఒక అధికరణంలో ఒకటే సూత్రం ఉండవచ్చు, లేదా పన్నెండు సూత్రములు ఉండవచ్చు.

## బ్రహ్మసూత్రము – 1

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

ఇది మొదటి అధ్యాయంలోని మొదటి పాదంలోని మొదటి అధికరణంలోని మొదటి సూత్రం. మొదటి అధ్యాయాన్ని సమన్వయ అధ్యాయము అంటారు. దీని వివరణ తర్వాత చూద్దాము.

మొదటి పాదాన్ని **స్పష్టబ్రహ్మలింగవాక్యసమన్వయపాదః** అంటారు. దీని వివరణ కూడా తర్వాత చూద్దాము. ఒక్కొక్క అధికరణానికి కూడా ఒక్కొక్కపేరు ఉంటుంది. ఆ అధికరణానికి ఆ పేరు ఆ అధికరణంలో ఉన్న మొదటి సూత్రంనుంచి వస్తుంది.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – జిజ్ఞాస అధికరణం – జిజ్ఞాసాధికరణమ్

ఇక్కడ ఈ జిజ్ఞాస అధికరణంలో ఒక్కటే సూత్రం ఉంది. ఇప్పుడు మనం జిజ్ఞాస అధికరణాన్ని, అందులో ఉన్న సూత్రాన్ని చూస్తున్నాము.

ప్రతి ఒక్క సూత్రాన్ని మూడు దశల్లో విశ్లేషిస్తాము.

ఎ) సామాన్య విచారణ – సూత్రంలో ఉన్న సారాన్ని ముందు చూస్తాము. ఉపనిషత్తుల్లోని ఏ వాక్యం దీనికి ఆధారమో చూస్తాము.

బి) పదవిశ్లేషణ – సూత్రంలో ఉన్న ఒక్కొక్క పదాన్నీ విశ్లేషిస్తాము. ఆ పదాలు ఉన్న వరుసక్రమంలో చూస్తాము.

సి) ఉపసంహారం – ఈ సూత్రంయొక్క ప్రత్యేకత, దాన్నించి వచ్చిన ఉపసిద్ధాంతాలు చూస్తాము.

## సామాన్య విచారణ

ఇందులో ప్రత్యక్ష అర్థం, పరోక్ష అర్థం చూస్తాము.

**పరోక్ష అర్థం –** ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయసూత్రం.

ఈ మొదటి సూత్రం వేదాంతశాస్త్రానికి అంటే బ్రహ్మవిద్యకు ఉపోద్ఘాత సూత్రం. మనం ఏ పుస్తకం తెరిచి చూసినా అందులో ముందుమాట ఉంటుంది. దానినే తొలిపలుకు, మున్నుడి అని కూడా అంటారు. సంస్కృతంలో ఉపోద్ఘాతం లేదా అనుబంధం అంటారు.

ప్రతి ఒక్క శాస్త్రానికీ ఉపోద్ఘాతం ఉండాలి. ఈ ఉపోద్ఘాతం ప్రత్యేకత ఏమిటంటే ఇది శాస్త్రం లోపల ఉంది అనలేము, బయట ఉంది అనలేము. ఇది బయట, లోపల ఉన్న రెండింటినీ కలుపుతుంది. అది ఇంటి ముఖద్వారంవంటిది అనుకోవచ్చు. ముఖద్వారంద్వారా బయటనుంచి లోపలికి అడుగు పెట్టినట్టుగా, ఉపోద్ఘాతం కూడా బయటనుంచి శాస్త్రం లోపలికి అడుగుపెట్టటానికి తోడ్పడుతుంది. అందువల్లనే దీనిని **అనుబంధం** అంటారు. అనుబంధం అంటే శాస్త్రంతో సంబంధం ఉంటుంది కాని అది శాస్త్రంలో ఉండదు.

దీనికి ఉదాహరణ భగవద్గీతయొక్క మొదటి అధ్యాయం. మొదటి అధ్యాయం గీత లోపల ఉందా, బయట ఉందా? బయట ఉందనీ చెప్పలేము, లోపల ఉందనీ చెప్పలేము. నిజానికి ఈ క్రింది శ్లోకంతో గీత మొదలవుతుంది.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ – గీత 2.11**

ఈ శ్లోకం రెండవ అధ్యాయంలో వస్తుంది. అలా అయితే మొదటి అధ్యాయం ఎందుకనే ప్రశ్న కలుగుతుంది. అది శాస్త్రంలో భాగం కాదు, శాస్త్రం ముందు ఉంది; అయినా అది శాస్త్రంలో భాగం కింద అవసరమే.

గీతాశాస్త్రం రెండవ అధ్యాయంలో మొదలయినట్టుగా, బ్రహ్మసూత్రముల శాస్త్రం కూడా రెండవ సూత్రంతోనే మొదలవుతుంది. అందువల్ల మొదటి సూత్రాన్ని ఉపోద్ఘాత సూత్రం అంటారు.

**అనుబంధ చతుష్టయం** – ఈ ఉపోద్ఘాతం దేని గురించి చెబుతుంది? మన సాంప్రదాయం ప్రకారం ఏ శాస్త్రమైనా కూడా నాలుగు అంశాలను వివరించాలి. వాటిని అనుబంధ చతుష్టయం అంటారు. అందువల్ల ఈ సూత్రాన్ని అనుబంధ చతుష్టయ సూత్రం అని కూడా అంటారు. అందులోని నాలుగు అంశాలు ఏమిటి?

1. అధికారి – శిష్యుని అర్హత
2. విషయం – అంశం
3. ప్రయోజనం – జ్ఞానఫలం
4. సంబంధం – అనుబంధం

బ్రహ్మసూత్రముల విషయంలో ఈ అనుబంధ చతుష్టయ లక్షణాలేమిటో చూద్దాము.

1. **అధికారి** – శిష్యుని అర్హత. బ్రహ్మవిద్యకు అధికారి సాధనచతుష్టయ సంపన్నుడై ఉండాలి. తత్త్వబోధ ఈ సాధనచతుష్టయ సంపత్తితో మొదలవుతుంది. అంటే దీన్నిబట్టి తత్త్వబోధ కూడా బ్రహ్మసూత్రములను ఆధారం చేసుకుని వచ్చిందని అర్థమవుతుంది. ఉపనిషత్తుల్లో ఎక్కడా ప్రత్యక్షంగా సాధనచతుష్టయ సంపత్తి అంటే ఇదీ అని రాదు. అయితే తత్త్వబోధలో దీని గురించి రచయిత ఎలా ప్రస్తావించాడు? బ్రహ్మసూత్రములను ఆధారంగా చేసుకున్నాడు. ఆ మాటకొస్తే ప్రకరణ గ్రంథాలన్నిటికీ బ్రహ్మసూత్రములే మూలము.

అధికారి ఎవరు? సమాజంలోకి ఒక కొత్త వస్తువును విడుదల చేస్తున్నప్పుడు, ఆ వస్తువును తయారు చేసేవారు ఒక విభాగానికి చెందిన మనుష్యులను దృష్టిలో పెట్టుకుంటారు. శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటానికి కావాల్సిన అర్హత సాధనచతుష్టయ సంపత్తి అని చూశాము. అవి వివేకం, వైరాగ్యం, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వం.

ఎ) **వివేకం** – నిత్యానిత్య వస్తువివేకం చూపటం. మామూలుగా మనం ధర్మ అర్థ కామాల వెంట పరుగులు తీస్తాం. ప్రాపంచిక సుఖాలు, ప్రాపంచిక

హెూదాలు ముఖ్యమనీ, మరణించాక పరలోక సుఖాలను అనుభవించాలనీ, వాటిని పొందటానికి కర్మకాండ అవసరమనీ భావించి అందులో కూరుకుపోతాము. దీన్ని ప్రేయోమార్గం అంటారు. ఇది మనకు ప్రియమైన మార్గంగా అనిపించటంవల్ల దీనివెంట పడతాము. కాని దీనికి భిన్నంగా శ్రేయోమార్గమని ఒకటి ఉంది. అది మనకు శ్రేయస్కరమైనది.

శ్రేయస్సు, ప్రేయస్సులలో ఏది శ్రేష్ఠమైనదో తెలుసుకోవటమే వివేకం. ప్రియమైన వస్తువులు ప్రియం చేకూరుస్తాయి కాని అవి శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వవు. అవి అనిత్యం. నిత్యమైన వస్తువు వేరే ఏదో ఉందని తెలుసుకోవటమే వివేకం.

బి) **వైరాగ్యం** – ఎప్పుడైతే నిత్యానిత్య వస్తువివేకం కలుగుతుందో, అప్పుడే అనిత్య వస్తువులమీద వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం అంటే మనం ఏదైతే గమ్యమనుకుంటున్నామో అది గమ్యం కాదు, ఇంకో ముఖ్యమైన గమ్యానికి మార్గం అని తెలుసుకోవటం. ధనం సంపాదించటమే అంతిమ లక్ష్యం అని మొదట్లో పొరపడతాము. కాని వివేకం కలిగాక, ధనం శాశ్వతమైన శాంతి, భద్రత, ఆనందాలను ఇవ్వదు; అది శాశ్వతమైన ఆనందానికి మార్గం మాత్రమే అని గ్రహించాలి.

ఇక్కడ వైరాగ్యం పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ధనం శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వదు అనగానే ధనం అసలు అవసరం లేదు అనుకోవటం మూర్ఖత్వం అవుతుంది. ధనమే ముఖ్యం అనుకుంటే అది తెలివితక్కువతనం; ధనం అసలు అవసరం లేదు అనుకుంటే అది మూర్ఖత్వం. ఇదే సూత్రం అన్నిటికీ వర్తిస్తుంది. కుటుంబం అంతిమ లక్ష్యం అనుకుంటే అది తెలివితక్కువతనం, కుటుంబం అవసరం లేదు అనుకుంటే అది మూర్ఖత్వం.

ఒక్కముక్కలో చెప్పాలంటే కుటుంబాన్ని కాని, ధనాన్ని కాని అంతిమలక్ష్యంగా చూస్తే అది రాగం; వాటిని వేరే అంతిమలక్ష్యాలకు మార్గాలుగా చూస్తే అది విరాగం.

సి) **శమాది షట్కసంపత్తి** – ఇవి ఆరు. శమము, దమము, ఉపరమము, తితిక్షా, శ్రద్ధా, సమాధానము.

శమము – మనోనిగ్రహం; దమము – ఇంద్రియ నిగ్రహం; ఉపరమము–

అంతర్ముఖులవటం; తితిక్షా - ఓర్పు; శ్రద్ధా - గురువు, శాస్త్రం, భగవంతునిమీద శ్రద్ధ; సమాధానం - ఏకాగ్రత.

డి) **ముముక్షుత్వం** - మోక్షంమీద తీవ్రమైన ఇచ్ఛ. వివేకంవల్ల అనిత్యవస్తువుల నుంచి వెనుతిరగటం వైరాగ్యం అయితే, మోక్షంవైపు మొగ్గ చూపటం ముముక్షుత్వం.

2. **విషయం** - అంశం. వేదాంతశాస్త్రం లేదా బ్రహ్మసూత్రములలో చర్చిస్తున్న అంశం ఏమిటి? బ్రహ్మసూత్రములు పేరులోనే ఉంది విషయం ఏమిటో. బ్రహ్మసూత్రములు బ్రహ్మ గురించి చర్చిస్తాయి. అందువల్ల దీనిని బ్రహ్మవిద్య అంటారు.

బ్రహ్మవిద్య అంటే వేదాంతం బ్రహ్మ అనే కొత్త విషయం చెప్పటం లేదు; అది నేర్చుకునే శిష్యునియొక్క బ్రహ్మత్వ హోదా గురించి చెబుతున్నది.

**ఆత్మనః బ్రహ్మత్వమ్**

నేను బ్రహ్మను అని తెలుసుకోవటం. దీన్నే ఆత్మ-బ్రహ్మ ఐక్యం అని కూడా అంటారు.

3. **ప్రయోజనం** - జ్ఞానఫలం. వేదాంతశాస్త్రంలో బ్రహ్మవిద్య నేర్చుకుంటే మనం పొందే ఫలమేమిటి? నేను బ్రహ్మను అని తెలుసుకుంటే నేను జీవిని అనే పొరపాటు తొలుగుతుంది. నా బ్రహ్మత్వ హోదా తెలుసుకుంటే అబ్రహ్మత్వ అపోహ తొలుగుతుంది. తాడును చూసి పాముగా పొరపాటు పడినప్పుడు, అది పాము కాదు, తాడు అనే జ్ఞానం కలిగితే కలిగే ప్రయోజనం ఏమిటి?

పాము అనుకోవటంవల్ల కలిగే భయం పోతుంది. అలాగే, నేను బ్రహ్మను అనే జ్ఞానం, నేను జీవిని అని పొరపాటు పడటంవల్ల కలిగే సంసారభయం పోతుంది.

**బ్రహ్మత్వజ్ఞానేన అబ్రహ్మత్వనివృత్తిః ప్రయోజనమ్**

అబ్రహ్మత్వం అంటే జీవత్వం. అంటే

**బ్రహ్మత్వజ్ఞానేన జీవాత్మనివృత్తిః ఫలమ్**

జీవత్వం అంటే సంసారం. అందువల్ల

**బ్రహ్మత్వజ్ఞానేన సంసారనివృత్తిః ఫలమ్**

నివృత్తి అంటే తొలిగిపోవటం. సంసారనివృత్తిని ఇంకోవిధంగా చెప్పాలంటే మోక్షం.

వేదాంతశాస్త్రం నేర్చుకుంటే కలిగే ఫలం మోక్షం. పరిచ్ఛిన్న భావననుంచి, దుఃఖభావననుంచి, కొరతనుంచి, కోరికనుంచి విముక్తి.

4. **సంబంధం** – అనుబంధం. సంబంధం అనగానే దేనితో సంబంధం అనే ప్రశ్న ఉదయిస్తుంది. నీ సంబంధం ఏమిటని ఎవరైనా అడిగితే, మనం ఎదురుప్రశ్న వెయ్యాలి, ఎవరితో అని. ఎందుకంటే ఒక వ్యక్తికి నేను తండ్రిని, ఇంకొక వ్యక్తికి భర్తను. అందువల్ల సంబంధం పదంలో రెండు వస్తువులు ఇమిడివుంటాయి. ఇక్కడ సంబంధం శాస్త్రానికి, విషయానికీ మధ్య. శాస్త్రవిషయక సంబంధం. దీనికి సాంకేతిక పదజాలం ఉంది. **ప్రతిబాధ్య ప్రతిబాధక సంబంధః**. బ్రహ్మకు, బ్రహ్మసూత్రములకు ప్రతిబాధ్య ప్రతిబాధక సంబంధం ఉంది.

ఒక శాస్త్రంలో ముఖ్యమైన సారమేదో, అదే విషయం అవుతుంది. ఇదీ నియమం. ఏదైనా అంశాన్ని మామూలుగా చర్చిస్తే అది విషయం అవదు.

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥** – గీత 6.17

భగవద్గీతలో సారం ఏమిటి అంటే ఈ శ్లోకం ఆధారంగా తీసుకుని ఆహారనియమాలు అని చెప్పకూడదు. ఆహారనియమాల గురించి చర్చించినా కూడా అది గీతాసారం కాదు. అలాగే మరెన్నో అంశాలు చర్చించబడ్డాయి గీతలో. అవేవీ గీతాసారం కాదు. గీతాసారం ఏమిటి? ఆత్మవిద్య. అందువల్ల భగవద్గీతకు, ఆత్మవిద్యకు ప్రతిబాధ్య ప్రతిబాధక సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని ముందుముందు మరింత లోతుగా విశ్లేషిస్తారు బ్రహ్మసూత్రములలో. ప్రతిబాధ్య అంటే నిరూపించబడేది; ప్రతిబాధక అంటే నిరూపించేది.

ఇది వేదాంతశాస్త్రంయొక్క అనుబంధ చతుష్టయం.

మనం ఇంకా మొదటిసూత్రంయొక్క సామాన్య విచారణలోనే ఉన్నాము. మొదటి సూత్రాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే అది –

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

ఈ సూత్రంలో ఈ అనుబంధచతుష్టయం గురించి ఉందని ప్రత్యక్షంగా తెలియదు. అందులో అనుబంధ చతుష్టయానికి సంబంధించిన అధికారి, విషయం, ప్రయోజనం, సంబంధం పదాలను చూడము. అందువల్ల అనుబంధ చతుష్టయం ఈ సూత్రంయొక్క ప్రత్యక్ష అర్థం కాదు. ఇది పరోక్ష అర్థం. దీన్ని ఆర్తిక అర్థము అంటారు.

**పరోక్ష అర్థం –** ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయసూత్రం.

**ప్రత్యక్ష అర్థం –** దాని తర్వాత, అందువలన బ్రహ్మవిచారణ చేయాలి

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి మనం. వ్యాసాచార్యులవారు కొత్తగా ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం లేదు. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక దర్శనాలను వారి దార్శనికులు కొత్తగా ప్రతిపాదించారు. కాని వ్యాసాచార్యుల వారు ఉపనిషత్తుల సారాన్ని క్రోడీకరించారు బ్రహ్మసూత్రములలో. అందువల్ల ప్రతి ఒక్క సూత్రానికీ ఒక **విషయవాక్యం** ఉంటుంది.

**విషయవాక్యం** – విషయవాక్యం అంటే ఉపనిషత్తులోని వాక్యం. ఇక్కడ బ్రహ్మసూత్రములలోని సూత్రానికి ఆధారంగా ఉపనిషత్తుల్లోని ఏదో ఒక వాక్యం ఉంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సూత్రాన్ని వ్రాశారు వ్యాసాచార్యుల వారు. కాని ఆయన దేని ఆధారంగా రాశారో చెప్పరు. అందువల్ల ఒక సూత్రాన్ని అర్థం చేసుకోవటానికి మనం చెయ్యవలసిన మొట్టమొదటి పని ఏ ఉపనిషత్తు వాక్యాన్ని ఆధారంగా తీసుకుని చెప్పారో తెలుసుకోవాలి. అది తెలియకపోతే సూత్రం అంత చిన్న వాక్యంగా ఉంటే దాని అర్థం స్పష్టంగా తెలియక పోవచ్చు మనకు. అది అర్థం చేసుకోవాలంటే భాష్యం చదవాలి. కాని మన అదృష్టవశాత్తూ శంకరాచార్యులు వ్రాసిన భాష్యం చక్కని రాజమార్గంలా పనిచేస్తుంది మనకు.

శంకరులవారిని మీకెలా తెలుసు అంటే నా గురువు చెప్పారు అంటారు. ఆయన గురువుకు ఎలా తెలుసు అంటే ఆయన గురువు చెప్పారు. అలా గురుపరంపర వస్తుంది.

**మొదటి సూత్రానికి విషయవాక్యాలు**

1. **యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ॥ – భృగువల్లీ, తైత్తిరీయమ్**

ఈ మంత్రం మొత్తం అవసరం లేదు. ఇందులో **తద్విజిజ్ఞాసస్వ** భాగం చాలు.

మన మొదటిసూత్రం **అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

అక్కడ తద్విజిజ్ఞాసస్వనుంచి జిజ్ఞాస వచ్చింది.

2. **య ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాస స్సత్యకామస్సత్యసఙ్కల్పస్సోఽన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః – ఛాందోగ్యమ్** 8.7.1

ఇక్కడ కూడా ఈ మంత్రం మొత్తం అవసరం లేదు, **సః విజిజ్ఞాసితవ్యః** భాగం చాలు.

3. **ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్** 2.4.5

ఇక్కడ శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః భాగం చాలు. ఈ మూడూ కలిపి బ్రహ్మజిజ్ఞాసా (కర్తవ్యా) అని అర్థం వస్తుంది. కర్తవ్యా మనం కలుపుకోవాలి.

1. **<u>తైత్తిరీయోపనిషత్తు</u>**

మొదటి ఉపనిషత్తు వాక్యం భృగువల్లీలోనిది అని చూశాము. బ్రహ్మ గురించి చెప్పమని భృగు తండ్రియైన వారుణిని కోరితే, నువ్వే బ్రహ్మ విచారణ చెయ్యమని చెప్పాడు. జీవితంలో శాంతి, భద్రత, ఆనందాలు కావాలంటే బ్రహ్మజ్ఞానం పొందాలి.

దేనినుంచి మొత్తం సృష్టి వచ్చిందో, ఏది స్థితికారణమో, దేనిలో అన్నీ లయమవుతాయో దాని గురించి తెలుసుకోవాలి. **తద్విజిజ్ఞాసస్వ** అన్నాడు.

ఇది మామూలు వాక్యం కాదు. అది ఆజ్ఞాపూర్వక వాక్యం. అంటే తెలుసుకుని తీరాలి, వేరే మార్గం లేదని అర్థం. కొంతమంది కలియుగంలో జ్ఞానం పొందటం కష్టం కాబట్టి, కేవలం నామజపం చేస్తే చాలు అంటారు. మరికొంతమంది కుండలినీ ధ్యానం చేస్తే చాలు, వెంటనే మోక్షం పొందవచ్చు అంటారు. కాని

మొట్టమొదటి సూత్రమే చాలా స్పష్టంగా చెబుతున్నది - మోక్షం కావాలంటే బ్రహ్మజిజ్ఞాస చెయ్యాలి. కలియుగమవనీ, కృతయుగమవనీ, త్రేతాయుగమవనీ, మోక్షం పొందటానికి వేరే మార్గం లేదు. **జ్ఞానాత్ ఏవ కైవల్యమ్**

**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥** –తైత్తిరీయమ్

అందువల్ల జ్ఞానం పొంది తీరాలని అంటున్నది తైత్తిరీయోపనిషత్తు.

2. **ఛాందోగ్యోపనిషత్తు**

ఈ వాక్యం ఛాందోగ్యోపనిషత్తులోని ఎనిమిదవ అధ్యాయంలో వస్తుంది. దాని సందర్భం ఏమిటి? ఒకానొకప్పుడు బ్రహ్మ పెద్ద చాటింపు వేయిస్తాడు. ఒక పరమాత్మ ఉన్నాడు. ఆయన అష్టగుణ విశిష్ట పరమాత్మ. ఆ అష్టగుణాలు– పుణ్యపాపాలకు అతీతుడు, వృద్ధాప్యం లేదు, మరణం లేదు, శోకం లేదు, ఆకలి లేదు, దాహం లేదు, సత్యములైన కోరికలు ఉన్నాయి, సత్యములైన సంకల్పాలు ఉన్నాయి. ఆ పరమాత్మ గురించి అన్వేషించాలి, తెలుసుకోవాలి. **సః విజిజ్ఞాసితవ్యః.**

ఇక్కడ కూడా తవ్యకారం ఉంది. అంటే బ్రహ్మ గురించి తెలుసుకుని తీరాలి. వేరే తేలిక మార్గం ఏదీలేదు. దీనికీ తైత్తిరీయోపనిషత్తులోని మంత్రానికీ ఉన్న సూక్ష్మభేదం ఏమిటంటే **తత్** పదం నపుంసకలింగం, సః పుల్లింగం. తత్ బ్రహ్మను సూచిస్తే, సః పరమాత్మను సూచిస్తుంది. రెండింటి అర్థం ఒక్కటే.

3. **బృహదారణ్యకోపనిషత్తు**

ఈ వాక్యం బృహదారణ్యకోపనిషత్తులోని మైత్రేయీ బ్రాహ్మణంలో వస్తుంది. ముందుగా వైరాగ్యం పుట్టించటానికి యాజ్ఞవల్క్యుడు ప్రేమతత్త్వాన్ని వివరిస్తాడు. అక్కడ పిడుగులాంటి విషయం చెబుతాడు. ఎవరూ ఎవరినీ ప్రేమించరు. ఎవరికి వారు, తమను తామే ప్రేమించుకుంటారు. మనం ఎవరినైనా ఎందుకు ప్రేమిస్తాము? అతను మనకు ఆనందాన్ని కలుగజేస్తాడు కాబట్టి. కాని ఆ ప్రేమ షరతులతో కూడుకున్నది. మనం బేషరతుగా ప్రేమించేది మనని మనమే. మనం ఆనందస్వరూపులం.

మనం మనను మాత్రమే ప్రేమిస్తామని ఎలా చెప్పగలము? ఏదైనా క్లిష్టపరిస్థితి వచ్చినప్పుడు ఒక్కొక్కరినీ వదులుకోవటానికి సిద్ధపడతాము కాని మనను మనం

మాత్రం వదులుకోము. కొడుకు తనకు ఇష్టంలేని పెళ్ళి చేసుకుంటే, 'నువ్వు నా కొడుకువు కాదు,' అంటాడు తండ్రి. ఒక్కోసారి అక్కడితో ఆగక, మతం స్థాయికి వెళ్ళిపోతాడు. అంటే, 'నేను మరణించాక కూడా నా శవాన్ని నువ్వు తాకకూడదు, నాకు శ్రాద్ధకర్మలు కూడా చెయ్యకూడదు,' అంటాడు. అలాగే భార్యాభర్తల మధ్య గొడవలు వస్తే విడాకుల దాకా వెళ్ళిపోతున్నారు.

అమెరికాలో ఎవరో అన్నారు, 'పెళ్ళి ఒక టెన్నిస్ ఆటవంటిది. లవ్‌తో మొదలయి, హోరాహోరీగా పోట్లాట సాగుతుంది.' ఎవరైనా మనకు నచ్చకపోతే, వేడిగా ఉన్న బంగాళాదుంపను చేతిలోంచి వదిలివేసినట్టుగా, వారిని వదిలివేస్తాము. దీని సారం ఏమిటి? మనను మాత్రమే మనం ప్రేమిస్తాము. ఆత్మ ఆనందస్వరూపం. ఆనందస్వరూపం తెలుసుకోవాలంటే, ఆత్మజ్ఞానం పొందాలి. ఈ విషయం వివరంగా చర్చించాక, ఆత్మజ్ఞానం పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి అని చెబుతాడు యాజ్ఞవల్క్యుడు.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**–బృహదారణ్యకమ్

ఈ విధంగా ఈ మూడు ఉపనిషత్తుల భాగాలలోనూ – తైత్తిరీయం, ఛాందోగ్యం, బృహదారణ్యకాలలోనూ బ్రహ్మవిద్య పొందాలని నొక్కి చెప్పబడింది. వీటిని దృష్టిలో పెట్టుకుని వ్యాసాచార్యులవారు వీటన్నిటినీ కుదించి మొదటి సూత్రాన్ని చెప్పారు. అథాతో బ్రహ్మజిజ్ఞాసా. బ్రహ్మవిచారణ చేసితీరాలని చూపటానికి ఈ సూత్రంలో క్రియాపదాన్ని మనం కలుపుకోవాలి. ఈ సూత్రం వ్యాకరణపరంగా అసంపూర్ణంగా ఉంది. అందువల్ల **కర్తవ్యా** అనే క్రియాపదాన్ని కలుపుతాము. ఇప్పుడు పూర్తి సూత్రాన్ని చూద్దాము.

**దశ 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా**

దాని తర్వాత, అందువలన బ్రహ్మవిచారణ చేసితీరాలి. కర్తవ్యా అంటే చేసితీరాలి. మోక్షం కావాలంటే, వేరే మార్గం లేదు. ఇది ప్రత్యక్ష అర్థం. ఈ ప్రత్యక్ష అర్థాన్ని మనం కొంచెంగా మారుస్తాము.

బ్రహ్మవిచారణ చేయాలంటే, దాన్ని స్వతంత్రంగా చేయలేము. ఎందుకంటే బ్రహ్మ మన ఎదురుగా ఉన్న ఆబ్జెక్టు కాదు. ఎలాగైతే ఒక కణాన్ని మైక్రోస్కోప్‌లోనూ,

ఒక నక్షత్రాన్ని టెలిస్కోప్‌లోనూ అధ్యయనం చేస్తామో అలా బ్రహ్మను ఉపనిషత్తుద్వారా అధ్యయనం చేయాలి.

**సర్వం బ్రహ్మౌపనిషదమ్**

బ్రహ్మను ఔపనిషదం బ్రహ్మ అని నిర్వచించారు. అంటే దీని అర్థం బ్రహ్మను వేదాంతంద్వారానే నేర్చుకోగలమని. అందువల్ల బ్రహ్మజిజ్ఞాసా పదాన్ని వేదాంతశాస్త్రవిచారః పదంతో మార్చి చూద్దాము.

**దశ 2 – అథాతో వేదాంతశాస్త్రవిచారః కర్తవ్యా**

దాని తర్వాత, అందువలన బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్రవిచారణ చేసితీరాలి.

ఇక్కడితో ఈ సూత్రంయొక్క సామాన్యవిచారణ ముగియలేదు. బ్రహ్మసూత్రాలను న్యాయప్రస్థానం అంటారని చూశాము. న్యాయప్రస్థానం అంటే ప్రతిదీ తార్కికంగా విశ్లేషించాలి. అంటే ప్రతి సూత్రానికీ ఒక అనుమాన వాక్యం ఉండాలి.

ముందు అనుమాన వాక్యాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

దానికి నాలుగు సాంకేతిక పదాలు ఉంటాయని కూడా చూశాము. అవి – పక్షం, సాధ్యం, హేతువు, దృష్టాంతం.

దానికి వ్యాప్తి వాక్యం – **యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఇప్పుడు ఈ నియమాలన్నిటినీ మొదటి సూత్రానికి అన్వయించి చూద్దాము.

**వేదాంతశాస్త్రమ్ ఆరంభణీయమ్ అనుబంధచతుష్టయత్వాత్ ధర్మశాస్త్రవత్**

| | | |
|---|---|---|
| పక్షం | – వేదాంతశాస్త్రం | – బ్రహ్మసూత్రములు |
| సాధ్యం | – ఆరంభనీయం | – అధ్యయనం చేయాలి |
| హేతువు | – అనుబంధచతుష్టయత్వాత్ | – అనుబంధచతుష్టయం ఉండటంవల్ల |
| దృష్టాంతం | – ధర్మశాస్త్రవత్ | – ధర్మశాస్త్రంలాగా |

దీనికి వ్యాప్తివాక్యం – **యత్ర యత్ర అనుబంధచతుష్టయత్వం, తత్ర తత్ర ఆరంభణీయత్వమ్**

ఎక్కడ అనుబంధ చతుష్టయం ఉంటుందో, అక్కడ ఆ శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యవచ్చు.

ఎందుకు? అనుబంధచతుష్టయంలో ఒక అంశం ప్రయోజనం అని చూశాము. ప్రయోజనం ఉన్న శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యవచ్చు. అందులోనూ వేదాంతశాస్త్రానికి ఉన్న ప్రయోజనం మామూలు ప్రయోజనం కాదు, శాశ్వతఫలం కలుగుతుంది. అంటే మోక్షం వస్తుంది. దీనితో మొదటి సూత్రంయొక్క సామాన్య విశ్లేషణ ముగిసింది. ఈ సామాన్య విశ్లేషణలో పరోక్ష అర్థం, ప్రత్యక్ష అర్థం చూశాము.

**పరోక్ష అర్థం –** ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయసూత్రం.

**ప్రత్యక్ష అర్థం –** దాని తర్వాత, అందువలన బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్ర విచారణ చేసితీరాలి.

## పదవిశ్లేషణ

అథాతో బ్రహ్మజిజ్ఞాసాలో మూడు పదాలు ఉన్నాయి. అవి అథ + అతః + బ్రహ్మజిజ్ఞాసా. బ్రహ్మజిజ్ఞాసా సంయుక్త పదం, అందులో బ్రహ్మ+జిజ్ఞాసా (జిజ్ఞా+సా) ఉన్నాయి.

భాష్యం నిర్వచనం చూసినప్పుడు ఒక శ్లోకం చూశాము. అది –

**సూత్రార్థో వర్ణ్యతే యత్ర వాక్యైః సూత్రానుసారిభిః।**

**స్వపదాని చ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః॥**

భాష్యంలో, సూత్రంలో ఉన్న ప్రతి ఒక్క పదాన్నీ వివరించాలి. అందులోనూ ఆ పదాలు ఏ వరుసక్రమంలో ఉంటే ఆ వరుసక్రమంలోనే వివరించాలి. ఈ శ్లోకంలో చెప్పినట్టే, శంకరులవారు మొదట అథ పదాన్ని వివరిస్తున్నారు. దాని తర్వాత అతః పదాన్ని, దాని తర్వాత బ్రహ్మజిజ్ఞాసాను వివరిస్తారు. ఈ పదాల క్రమాన్ని తప్పరు.

### అథ శబ్దవిచారణ

అథ పదానికి రెండు రకాల పనులు ఉన్నాయి. అవి – శబ్దరూపం, పదరూపం.

**శబ్దరూపవిచారణ–** ఉదాహరణకు మనం వార్తలు వింటున్నామనుకోండి. మొదట, మనం శబ్దాన్ని వింటాము. అంటే వార్తలు ఒక శబ్ద ప్రవాహంలాగా

వస్తాయి. ఈ శబ్దప్రవాహాన్ని చెవులద్వారా వింటాము. అంటే ప్రత్యక్ష ప్రమాణం ద్వారా వింటాము. మన పంచజ్ఞానేంద్రియాలు ప్రత్యక్షప్రమాణం క్రిందికి వస్తాయి. ఇక్కడ శబ్దాన్ని వింటున్నాము అంటే ఇక్కడ ప్రత్యక్షప్రమాణం శ్రోత్ర ఇంద్రియ ప్రమాణం. చెవులు ప్రమాణం, శబ్దం ప్రమేయం అవుతాయి. ప్రమేయం అంటే ప్రమాణంతో వినే లేదా చూసే వస్తువు. ఎవరికైతే చెవులు బాగా పనిచేస్తున్నాయో, వారు వార్తలు వింటే, వారికి ఈ శబ్దం ప్రమేయంగా పనిచేస్తుంది.

తర్వాత, ప్రమేయంగా మనసులోకి వెళ్ళిన శబ్దం ప్రమాణంగా మారుతుంది. ఎలా? ఆ శబ్దాన్ని విన్నవారికి ఆ భాష తెలిస్తే, అదే శబ్దం ప్రమాణంగా మారుతుంది. ఇప్పుడు మీరు విన్న వార్త ఏ జపాను భాషకు చెందినదో అనుకోండి. మీ చెవులు బాగానే పనిచేస్తున్నాయి, శబ్దాన్ని వినగలరు కాబట్టి, ఆ శబ్దం ప్రమేయంగా, మీ చెవులు ప్రమాణంగా పనిచేస్తాయి. కాని ఆ భాష అర్థం మీకు తెలియదు కాబట్టి, ఆ శబ్దం ప్రమాణంగా మారలేదు. ప్రమేయంగానే ఉండిపోతుంది. అర్థం తెలిస్తే, ప్రమాణంగా మారుతుంది.

ప్రతి పదానికీ రెండు హెూదాలు ఉన్నాయి. అవి ప్రమేయం, ప్రమాణం. అదే విధంగా అథ పదానికి కూడా రెండు హెూదాలు ఉన్నాయి.

చెవులు బాగా పనిచేసే వ్యక్తికి – శబ్దరూపంలో వినిపిస్తుంది. అది ప్రమేయం. ఆ భాష తెలిసిన వ్యక్తికి – పదరూపంలో తెలుస్తుంది. అది ప్రమాణం. అంటే ప్రమేయరూపంలో శబ్దం, ప్రమాణరూపంలో పదం.

**శబ్దరూపేణ అర్థ బోధకమ్**

అంటే అథ పదాన్ని రెండు రకాలుగా వాడారు వ్యాసాచార్యులవారు. ఎందుకు? ఏ గ్రంథం రచించినా, ముందు మంగళవాక్యంతో మొదలుపెట్టాలి. లేకపోతే అది అమంగళం అవుతుంది. అటువంటి గ్రంథాన్ని మనం కూడా అధ్యయనం చెయ్యకూడదు. అందువల్ల ఉపనిషత్తు అవనీ, పురాణాలు అవనీ మంగళశ్లోకం ఉంటుంది.

**వాసుదేవేంద్ర యోగీంద్రం నత్వా జ్ఞానప్రదం గురుమ్**

విఘ్నాలు కలగకుండా చెయ్యమని, ఈశ్వరకృప కురిపించమనీ కోరుతాడు రచయిత ఇందులో –

**విఘ్న నివారణార్థమ్ ఈశ్వరప్రసాదసిద్ధ్యర్థమ్**

ఈ గ్రంథం సూత్రముల రూపంలో రచించారు వ్యాసాచార్యులవారు. అందువల్ల ప్రత్యేకించి మంగళశ్లోకం రచించే అవకాశం లేదు. పైగా సూత్రం నిర్వచనం చూసినప్పుడు ఒక నియమం అల్పాక్షరం అని చూశాము. ఎంత తక్కువ అక్షరాలు ఉంటే, అంత గొప్పగా రాసినట్టు. ఒక అక్షరాన్ని తగ్గించటానికి రచయిత ఎంతో కష్టపడి ఆలోచించి, అది సాధించాక పుత్రుడు పుట్టాక తండ్రి ఎంత ఆనందిస్తాడో అంత ఆనందిస్తాడు సూత్రకారుడు.

**పుత్రోత్సాహం మన్యంతే సూత్రకారాః**

అలాంటప్పుడు మంగళశ్లోకంకోసం మొత్తం సూత్రాన్ని ఎలా కేటాయించగలరు? అందువల్ల వ్యాసాచార్యులవారు తెలివిగా అథ పదంలో మంగళశబ్దాన్ని పొందుపరిచారు. అథ పదం మంగళకర పదం అని మనకు ఎలా తెలుసు? బ్రహ్మసూత్రములు నేర్చుకునే ముందు చూసిన ధ్యానశ్లోకాల్లో ఒకటి అథ గురించి చెబుతుంది.

**ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా ।**
**కణ్ఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గళికావుభౌ ।**
**ఓమ్ అథ । ఓమ్ అథ । ఓమ్ అథ ॥**

ఓం పదమూ, అథ పదమూ మంగళకరమైన పదాలు. ఎందుకంటే అవి బ్రహ్మదేవుని కంఠంలోంచి వచ్చాయి. అంటే సాక్షాత్తూ బ్రహ్మదేవుడే వాటిని మొట్టమొదట ఉచ్చరించాడు. అందువల్లనే భగవద్గీతలో కూడా – అథ ప్రథమోఽధ్యాయః, అథ ద్వితీయోఽధ్యాయః అని చూస్తాము.

వ్యాకరణ సూత్రములను రచించిన పాణినీ కూడా ఇదే పద్ధతిని అవతరించారు. ఆయన మొట్టమొదట వ్యాకరణసూత్రం – **వృద్ధిరాదైచ్.**

ఆయన మొదటి సూత్రంలో, మొదటి పదం వృద్ధిః. వృద్ధి అంటే అభివృద్ధి, ఎదుగుదల. అందువల్ల ఇది మంగళకరమైన పదం. అక్కడ కూడా పాణినీ వృద్ధి పదాన్ని రెండు అర్థాలతో వాడారు. ఒకటి మంగళకరమైన పదంగా, ఇంకొకటి వ్యాకరణపదంగా.

అలాగే ఇక్కడ అథ పదం కూడా, శబ్దపరంగా మంగళకరం – శబ్దరూపేణ మంగళం భవతి.

**అర్థరూపవిచారణ**– అథ పదం, పదరూపంలో అర్థాన్ని సూచిస్తుంది. సంస్కృతభాషలో అథ పదానికి మంగళం, ఆరంభం, అధికారం, ప్రయోజనం, అనంతరంవంటి అనేక అర్థాలు ఉన్నాయి. అమరకోశం ఈ అర్థాలను ఇస్తుంది. శంకరులవారు ఒక్కొక్క అర్థాన్నీ తీసుకుని, దాన్ని విశ్లేషించి, ఈ సూత్రానికి ఈ సందర్భంలో ఒక ప్రత్యేకమైన అర్థం సరిపోతుందని నిశ్చయించారు. **అథ=అనంతరం.** అంటే అథ పదం అర్థం అనంతరం అన్నారు. అనంతరం అంటే దాని తర్వాత.

దాని తర్వాత అంటే దాని వెంటనే అని అర్థం. వెంటనే మనకు వచ్చే సందేహం ఏమిటి? దేని తర్వాత? ఏదైనా నేర్చుకోవాలంటే అధికారి ఎవరు అని చూస్తాము అన్నాము కదా. అందువల్ల అధికారిత్వం సంపాదించాక అని సూచిస్తున్నారు వ్యాసాచార్యులవారు. ఏమిటా అధికారిత్వం?

**యోగ్యతా సిద్ధి అనంతరం బ్రహ్మజిజ్ఞాసా**

అంటే బ్రహ్మజ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హత గురించి వస్తున్నది. బ్రహ్మజ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హత ఏమిటి? శంకరులవారు సాధన చతుష్టయ సంపత్తి అంటున్నారు. వ్యాసాచార్యులవారు ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చెప్పలేదు కాని పరోక్షంగా సూచించారు. ఎందుకు? అలా పరోక్షంగా సూచించటం వల్ల రెండు పదాలు తగ్గాయి – సాధన చతుష్టయం అనే పదాలు. అంటే సాధన చతుష్టయ అనంతరం అనకుండా కేవలం అనంతరం అర్థం వచ్చే అథ పదాన్ని వాడారు. సాధన చతుష్టయం అంటే – వివేకం, వైరాగ్యం, శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వం అని చూశాము.

అనంతరం అంటే సాధన చతుష్టయ సంపత్తి అనంతరం. అలా ఎలా చెప్పగలము? దీనికి రెండు ప్రమాణాలు ఉన్నాయి. అవి యుక్తిప్రమాణం, శ్రుతి ప్రమాణం.

**యుక్తిప్రమాణం** – యుక్తి అంటే తర్కం. అన్వయ వ్యతిరేక న్యాయాన్ని ఉపయోగిస్తాము. అన్వయం అంటే ఒక వస్తువు ఉండటం, వ్యతిరేకం అంటే

ఆ వస్తువు లేకపోవటం. ఉదాహరణకు పంచదార వేస్తే పాలు తియ్యగా ఉన్నాయి, పంచదార వెయ్యకపోతే పాలు తియ్యగా లేవు. అంటే పాల తియ్యదనానికి కారణం పంచదార.

ఇదే సూత్రాన్ని అన్వయిస్తే సాధన చతుష్టయ సంపత్తి ఉన్న విద్యార్థి వేదాంత అధ్యయనంవల్ల లాభం పొందుతున్నాడు. లేని విద్యార్థి లాభం పొందటం లేదు.

**సాధన చతుష్టయ సత్వే విచారేణ ఫలప్రాప్తిః**

**సాధన చతుష్టయ అభావే విచారేణ ఫల అప్రాప్తిః**

**తస్మాత్ సాధన చతుష్టయమ్ ఏవ కారణమ్**

సాధన చతుష్టయ సంపత్తి లేకపోతే ఎంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసినా ఆ జ్ఞానఫలం పొందదు. జ్ఞానం పొందితే చాలదు, జ్ఞాననిష్ఠలో ఉండాలి. దానికి సాధన చతుష్టయ సంపత్తి కావాలి.

కఠోపనిషత్తులో నచికేతుడు ఈ నాలుగు అర్హతలూ తనకు ఉన్నాయని చూపించుకున్నాడు. యమధర్మరాజు ఎన్ని ఇహలోక, పరలోక సుఖాలతో ప్రలోభపెట్టాలని చూసినా అవన్నీ అశాశ్వతమైనవి, నాకు వద్దు అన్నాడు. అలా వివేకవైరాగ్యాలు చూపాడు. దేవతలకు కూడా నేర్చుకోవటం కష్టం అంటే, అందుకే అటువంటి విద్యను బోధించు, దానికి నువ్వు సమర్థవంతమైన గురువువు అని తన తీవ్రముముక్షుత్వం చూపాడు.

సాధన చతుష్టయ సంపత్తి లేకపోతే ఈ విద్యవల్ల కలిగే ఫలితాన్ని పొందమని మన నిజజీవితం కూడా చూపిస్తుంది. వివేక వైరాగ్యాలు లేకుండా వేదాంతానికి వస్తే అది కాలక్షేపంకోసం వచ్చినట్టు అవుతుందే తప్ప, ఆశించిన ఫలితాన్ని ఇవ్వదు. అది సమాచారాన్ని ఇస్తుంది కాని, పరివర్తన తీసుకురాదు. ఎందుకు? సాధన చతుష్టయ సంపత్తి లేదు కాబట్టి. అంతేకాదు వివేక, వైరాగ్య, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వాలలో ఏ ఒక్కటి కొరవడినా కూడా ప్రయోజనం కలుగదు. అనుబంధ చతుష్టయంలో అధికారి, ప్రయోజనం, విషయం, సంబంధం అని నాలుగు అంశాలు చూశాము. అంటే అధికారి కాకపోతే ప్రయోజనం పొందలేదు.

అథ శబ్దము అర్థం – సాధన చతుష్టయ సంపత్తి అనంతరం.

**శ్రుతి ప్రమాణం** – చాలా శ్రుతివాక్యాలు ఉన్నాయి ఈ విషయాన్ని నిరూపించటానికి. మనం ఒకటి, రెండు చూద్దాము.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**
- ముండకమ్ 1-2-12

లోకాన్ని పరీక్షించి ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో తెలుసుకోవాలి. అంటే **నిత్యానిత్య వస్తువివేకం** ఉండాలి. **నిర్వేదం** పదం **వైరాగ్యాన్ని** సూచిస్తుంది. అనిత్య వస్తువులతో విసిగిపోయి, దానిమీద వైరాగ్యాన్ని పెంచుకోవాలి. వివేక, వైరాగ్యాలు కలిగిన సాధకుడు, సమిధలు పుచ్చుకుని శ్రోత్రియ బ్రహనిష్ఠుడు అయిన గురువు దగ్గరకు వెళ్ళి బ్రహ్మవిద్య బోధించమని కోరాలి. ఇది ముముక్షుత్వాన్ని సూచిస్తుంది. అంటే సాధనచతుష్టయసంపత్తిలో మూడు అంశాలను చూశాము. అవి వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం.

ఇందాకే చూశాము కఠోపనిషత్తులో నచికేతుడు ఇహ పరలోక సుఖాలతో యమధర్మరాజు ప్రలోభపెట్టినా లొంగలేదని.

**కామానాం త్వా కామభాజం కరోమి** - కఠ 1.1.24

నీకు ఏ కోరికలు ఉంటే, అవన్నీ నువ్వు అనుభవించేటట్టు చేస్తాను అన్నాడు.

**అపి సర్వం జీవితమల్పమేవ తవైవ వాహాస్తవ నృత్యగీతే** - కఠ 1.1.26

అన్నింటికీ కలిపి ఒక్కటే మాట చెప్పాడు నచికేతుడు. జీవితం యావత్తూ అతి స్వల్పం. నువ్వు చెబుతున్న సుఖాలన్నీ నువ్వే ఉంచుకో అన్నాడు. ఇది తెలియక వదులుకోవటం కాదు. నచికేతుడు తొమ్మిది సంవత్సరాల పిల్లవాడే అయినా, గొప్ప వివేక, వైరాగ్యాలను చూపించాడు.

**యోఽయం వరో గూఢమనుప్రవిష్టో**
**నాన్యం తస్మాన్నచికేతా వృణీతే॥** - కఠ 1.1.29

ఆత్మవిద్య బోధించే వరం తప్ప ఏదీ వద్దు అని చెప్పటం ద్వారా తీవ్రముముక్షుత్వం కూడా చూపాడు.

మనం కూడా వేదాంతాన్ని జీర్ణించుకోవాలంటే, నచికేతునికి ఉన్న తీవ్రముముక్షుత్వం ఉండాలి. ధర్మార్థ కామాలను కాకిరెట్టను తుడిచేసుకున్నంత తేలిగ్గా వదులుకోగలగాలి. ఈ భావనను అపరోక్షానుభూతితో చూస్తాము. కాకిరెట్టను సంస్కృతంలో కాకవిష్ట అంటారు. ఈ కాకిరెట్టను వదులుకోవటానికి

పదిసార్లు ఆలోచిస్తామా? లేదు. నేను వదులుకున్నాను అని గొప్పలు చెబుతామా? అదీ లేదు. దాన్ని ఎంత సులువుగా వదులుకుంటామో, అంత సులువుగా ధర్మార్థకామాలను వదులుకోవాలి. దీన్ని తీవ్రవైరాగ్యం అంటారు. ఇహ పరలోకాలను యమధర్మరాజు నచికేతునికి ఆశ చూపితే, ఒక రోజు ఆలోచించి చెబుతాను అనలేదు అతను. కనురెప్ప మూసి తెరిచేలోపు నాకు వద్దు పొమ్మన్నాడు. ఆ విధంగా నచికేతుని కథద్వారా కూడా శ్రేయోమార్గం, ప్రేయోమార్గాల వివేకం, అర్థకామాలమీద వైరాగ్యం, ఆత్మవిద్యమీద ముముక్షుత్వం చూస్తాము.

ఈ విధంగా ఈ రెండు శ్రుతులలోను వివేక, వైరాగ్య, ముముక్షుత్వాలను చూశాము. అయితే, ఇంకొకటి మిగిలింది. శమాదిషట్క సంపత్తి మిగిలింది. దాని మాటేమిటి? దీన్ని బృహదారణ్యకోపనిషత్తులో చూస్తాము.

**శాంతో దాంత ఉపరతః తితిక్షుః సమాహితో భూత్వా**

ఈ మంత్రంలో శమాదిషట్కసంపత్తి గురించి వస్తుంది. కాని ఇక్కడ కూడా పూర్తి కాలేదు. శమాదిషట్క సంపత్తిలో ఆరు అంశాలు ఉన్నాయి. ఇక్కడ ఐదే వచ్చాయి. అవి శమం, దమం, ఉపరమం, తితిక్ష, సమాధానం వచ్చాయి కాని శ్రద్ధ రాలేదు. దాని మాటేమిటి?

బృహదారణ్యకాన్ని రెండు చోట్ల చూస్తాము. అవి కృష్ణ యజుర్వేదానికి చెందిన కాణ్వశాఖలోనూ, శుక్లయజుర్వేదానికి చెందిన మాధ్యందిన శాఖలోనూను. ఒకదాంట్లో సమహితో భూత్వా పదం వస్తే, ఇంకొక దాంట్లో శ్రద్ధా అని వస్తుంది. ఆ విధంగా శ్రద్ధపదం కూడా వచ్చింది. ఈ రెండు శాఖలలోని రెండు బృహదారణ్యకోపనిషత్తులను కలిపితే శమాదిషట్క సంపత్తిలోని ఆరు అంశాలూ వస్తాయి.

ఆ విధంగా వివేకం, వైరాగ్యం, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వం అనే సాధన చతుష్టయ సంపత్తి ఉండాలని అథ శబ్దం అర్థం. సాధన చతుష్టయ అనంతరం అది వస్తుందనీ, శంకరులవారు యుక్తి ప్రమాణం ద్వారా, శ్రుతి ప్రమాణంద్వారా నిరూపించారు.

ఇక్కడితో అథ శబ్దం అర్థం ముగిసిందా? ముగియలేదు. ఈ అర్థాన్ని పూర్వమీమాంసకుడు ఒప్పుకోడు. అతను అథ అంటే **అనంతరం** అర్థం వరకు ఒప్పుకుంటాడు. కాని దేని అనంతరం దగ్గరే వస్తుంది చిక్కంతా.

## అథ పద అర్థంమీద వాదోపవాదాలు

**పూర్వమీమాంసకుని వాదన** – పూర్వమీమాంసకుడు అథ అంటే అనంతరం అని ఒప్పుకుంటాడు. కాని దేని అనంతరం దగ్గరే వాదన మొదలవుతుంది.

పూర్వమీమాంసా అంటే వేదపూర్వభాగంయొక్క విశ్లేషణ. బ్రహ్మసూత్రములు ఉత్తరమీమాంసలోకి వస్తాయి. అంటే అది వేద అంతభాగానికి చెందినది. పూర్వభాగం కర్మ, ఉపాసన గురించి బోధిస్తే, అంతభాగం జ్ఞానం గురించి బోధిస్తుంది.

పూర్వమీమాంసకులు ఈ పదాలను ఆధారంగా చేసుకుని వాదిస్తారు. పూర్వమీమాంస అంటే ముందు, ఉత్తరమీమాంస అంటే తర్వాత. అందువల్ల అథ అంటే ఏమిటి?

### పూర్వమీమాంసా అనంతరం ఉత్తరమీమాంసా

దానికి వారికి యుక్తిప్రమాణం కూడా ఉంది. పూర్వమీమాంసలో కర్మ, ఉపాసనల గురించి వస్తుందని చూశాము. కర్మ చేస్తే చిత్తశుద్ధి వస్తుంది, ఉపాసన చేస్తే చిత్త ఏకాగ్రత కలుగుతుంది; వీటివల్ల సాధన చతుష్టయ సంపత్తి కలుగుతుంది; తద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. అప్పుడు ఉత్తరమీమాంసకు వచ్చి, బ్రహ్మసూత్రములను నేర్చుకోగలుగుతాడు.

బ్రహ్మసూత్రములను నేర్చుకోవటానికి అధికారి ఎవరు అంటే సాధన చతుష్టయ సంపన్నుడు అని చూశాము, కాని ఆ సాధన చతుష్టయ సంపత్తి ఎలా కలుగుతుంది? కర్మ, ఉపాసనలవల్ల కలుగుతుంది. అంటే అధికారం పూర్వమీమాంసవల్ల వస్తుంది. దీన్ని క్రమపద్ధతి అంటారు. కర్మ, ఉపాసన, జ్ఞానం. ఈ వరుసక్రమంలో రావాలి. విద్యార్థికి ఈ విషయం తెలియకపోవచ్చు, కాని గురువు క్రమపద్ధతిలో నేర్పించాలి కదా.

**అథాతో ధర్మజిజ్ఞాసా**– ధర్మసూత్రములు 1

జైమిని ఋషి ధర్మసూత్రములను రచించారు. ఆయన పూర్వమీమాంస దార్శనికుడు. ధర్మసూత్రములు బ్రహ్మసూత్రములకన్నా చాలా పెద్దవి. బ్రహ్మసూత్రములలో 4 అధ్యాయాలు ఉంటే, ధర్మసూత్రములలో 12 అధ్యాయాలు ఉన్నాయి. అలా ధర్మసూత్రములు నేర్చుకుని బ్రహ్మసూత్రములకు రావాలి.

అథ అంటే పూర్వమీమాంస అనంతరం.

**శంకరులవారి జవాబు** – శంకరులవారు దీన్ని యుక్తిప్రమాణంద్వారా, శ్రుతిప్రమాణంద్వారా ఖండిస్తారు. ముందు యుక్తి చూద్దాము.

**యుక్తిప్రమాణం** – ఇందులో నాలుగు కారణాలద్వారా పూర్వమీమాంసకుల వాదనను ఖండిస్తున్నారు.

**1. వ్యభిచారదోషమ్** – సమన్వయదోషం ఉంది. పూర్వమీమాంసకుని వాదనలో రెండు దోషాలు ఉన్నాయి.

ఎ) కర్మకాండ విచారణ చేశాక, వేదాంతవిచారణకు రావాలంటే ఒక సమస్య ఉంది. ఏమిటది? ఒక సాధకుడు పూర్వమీమాంసను చక్కగా ముగిస్తాడు, యజ్ఞయాగాదులు చెయ్యటంలో ప్రజ్ఞ చూపిస్తాడు, శిరోమణి బిరుదు కూడా పొందుతాడు. కాని దానివల్ల అతనిలో వైరాగ్యం ఏర్పడదు. ఇంకా మాట్లాడితే, యజ్ఞాలు చేసీచేసీ స్వర్గఫలంమీద మోజు ఎక్కువ ఉంటుంది. దానివల్ల అతను సాధన చతుష్టయ సంపన్నుడు అవలేడు.

కాని మొదటి సూత్రాన్ని పూర్వమీమాంస అనంతరం వేదాంతవిచారణ చెయ్యాలని అనుకుంటే, ఈ సాధకుడు వేదాంతం నేర్చుకునే అర్హత పొందకుండానే, వేదాంతంలోకి అడుగుపెట్టే ప్రమాదం ఉంది. అలా అర్హత పొందకుండా వస్తే, అతనికి ఫలం కలగదు. అందువల్ల మొదటి సమస్య – అర్హత లేని వ్యక్తి వేదాంతంలోకి అడుగుపెడతాడు.

బి) పుట్టటమే సాధనచతుష్టయ సంపత్తిలో పుట్టే కొందరు అరుదైన వ్యక్తులు ఉంటారు. పూర్తిగా వివేక, వైరాగ్యాలలో నిష్ణాతులు కాకపోయినా కూడా పూర్వజన్మ సుకృతంవల్ల కొంతమేరకు వారికి ఆ లక్షణాలు ఉంటాయి. అలా ముందే సాధన చతుష్టయసంపత్తి ఉన్నవారు మళ్ళీ పనిగట్టుకుని పూర్వమీమాంస భాగానికి వెళ్ళనవసరం లేదు. పూర్వమీమాంస యజ్ఞయాగాదుల గురించి చెబుతుంది, వాటిని చేస్తే సాధనచతుష్టయ సంపత్తి కలుగుతుంది. వారికి యజ్ఞయాగాదులు చెయ్యనవసరం లేకుండానే సాధన చతుష్టయ సంపత్తి కలిగితే, యజ్ఞయాగాదులతో ఎందుకు సమయాన్ని వృథా చేయాలి వారు? వారికి కర్మ, ఉపాసన, గృహస్థాశ్రమం అవసరం లేదు. బ్రహ్మచర్యంనుంచే వేదాంతవిచారణకు వచ్చేయవచ్చు.

కాని మొదటి సూత్రాన్ని పూర్వమీమాంస అనంతరం వేదాంతవిచారణ చేయాలని అనుకుంటే, ఈ సాధకుడు వేదాంతం నేర్చుకునే అర్హత పొంది కూడా, వేదాంతంలోకి అడుగుపెట్టే అవకాశం కోల్పోతాడు. అలా అర్హత పొంది కూడా కాలయాపన చేయాల్సి వస్తుంది. అందువల్ల రెండవ సమస్య – అర్హత ఉన్న వ్యక్తి వేదాంతంలోకి అడుగుపెట్టలేడు.

అందువల్ల శంకరులవారు మొదటి సూత్రాన్ని సాధన చతుష్టయ అనంతరం వేదాంతవిచారణ చేయాలని తీసుకోవాలి అంటున్నారు. ఇక్కడ ముఖ్యాంశం సాధన చతుష్టయ సంపత్తి. అది ఈ జన్మలో పొందాడా, పూర్వజన్మలో పొందాడా అనేది మనకు అనవసరం. అందువల్ల సాధన చతుష్టయ సంపత్తి ఉండితీరాలి కాని పూర్వమీమాంస చేసి తీరనవసరం లేదు అంటున్నారు శంకరులవారు.

ఎవరికి పూర్వమీమాంస అవసరం? సాధన చతుష్టయ సంపత్తి పొందనివారికి అవసరం. అది పొందటానికి కర్మకాండ చేసితీరాలి. అంటే అధికారి కాని వ్యక్తి పూర్వమీమాంసను అధ్యయనం చేసితీరాలి. అధికారి అయిన వ్యక్తి పూర్వమీమాంస అధ్యయనం చెయ్యనవసరం లేదు. అందరికీ సమానంగా ఉండాల్సిన అర్హత ఏమిటి? సాధనచతుష్టయ సంపత్తి.

శంకరులవారు చెప్పిన తక్కిన మూడు జవాబులను అర్థం చేసుకునే ముందు, పూర్వమీమాంసకుల వాదనను తెలుసుకోవాలి. అందువల్ల ముందు అది చూద్దాము.

**పూర్వమీమాంసకుల వాదన** – ఈ పూర్వమీమాంసకుల వాదన, శంకరులవారి కాలంలో బలంగా ఉంది. వారి వాదనను – **జ్ఞానకర్మసముచ్చయ వాదన** అంటారు. అంటే వారు కేవలం జ్ఞానంవల్ల మోక్షం పొందలేరు అంటారు. దానికి ఉదాహరణగా వేదాంత విద్యార్థులను చూపిస్తారు. వేదాంతం ఎంత అధ్యయనం చేసినా కూడా ఆ విద్యార్థుల ప్రవర్తన ఏమీ మారలేదు. ఇంకా మాట్లాడితే, వేదాంతం నేర్చుకోని వారికన్నా, వీరి ప్రవర్తన దారుణంగా ఉంది అంటారు పూర్వమీమాంసకులు. అందువల్ల జ్ఞానాన్ని కర్మతో కలపాలి అంటారు.

**జ్ఞానకర్మసముచ్చయేన మోక్షః**

సముచ్చయం అంటే కలపటం. వారు ఏమంటారంటే, ప్రతి ఒక్కరూ కూడా ముందు పూర్వమీమాంసకు వచ్చి అగ్నిహోత్రం, ఇంద్రయాగం యజ్ఞాల గురించి తెలుసుకోవాలి. తెలుసుకున్నంత మాత్రాన ఆ ఫలాన్ని పొందరు కాబట్టి, వారు

నేర్చుకున్న యజ్ఞయాగాదులను చేయాలి. అలా యజ్ఞాలు చేస్తూండగానే వేదాంతబోధకు వెళ్ళి, వేదాంతవిచారణ కూడా చేయాలి.

అందువల్ల అథ అంటే పూర్వమీమాంస అనంతరం అని అర్థం. బ్రహ్మజ్ఞానం పొందుతున్నా కూడా, సమాంతరంగా యజ్ఞాలు కూడా చేయాలి. అలా జ్ఞాన, కర్మసముచ్చయం చేయాలంటే పూర్వమీమాంస నేర్చుకుని తీరాలి. ఇదీ పూర్వమీమాంసకుని వాదన.

**శంకరులవారి జవాబు** – జ్ఞానకర్మసముచ్చయ వాదనను శంకరులవారు ఒప్పుకోరు. ఎందుకు? దానికి మూడు కారణాలను చెబుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా, శంకరులవారు ఈ జ్ఞానకర్మసముచ్చయవాద ఖండనను చేస్తుంటారు. ఎందుకంటే ఈ వాదన ఆయన కాలంలో చాలా ప్రబలంగా ఉండేది. ఆయన చేసిన ఖండన –

1. కర్మజ్ఞానకాండయోః విషయ భేదాత్
2. కర్మజ్ఞానకాండయోః ప్రయోజన భేదాత్
3. కర్మజ్ఞానకాండయోః ప్రవృత్తి భేదాత్

**1. విషయ భేదాత్** – జ్ఞానకాండ బోధించే విషయం, కర్మకాండ బోధించే విషయం భిన్నధృవాలలాంటివి. ఆ రెండింటినీ కలపలేము. మనం నేర్చుకునే లౌకికవిద్యలో కూడా మూడేసి సబ్జెక్టులు కలిపి చదవాలి. కాని ఆ మూడు పరస్పర సంబంధం ఉన్నవి ఉంటాయి. అంటే మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉంటాయి కాని పరస్పరవిరోధం ఉన్నవి ఉండవు. అంటే కెమిస్ట్రీ, ఎకనామిక్స్ ఉండవు. ఎందుకంటే ఈ రెండు సబ్జెక్టులూ భిన్నధృవాలు కాబట్టి. ఎలా?

దీనికి చాలా కారణాలు ఉన్నాయి కాని శంకరులవారు ఒక చిన్న ఉదాహరణను మాత్రం చెబుతారు. కర్మకాండ సాధ్యవస్తువు గురించి చెపితే, జ్ఞానకాండ సిద్ధవస్తువు గురించి చెబుతుంది. కర్మకాండ భవిష్యత్తు గురించి చెపితే, జ్ఞానకాండ భూతకాలం గురించి చెబుతుంది. కర్మకాండ నువ్వు క్రతువులు చేస్తే, మరణించాక పుణ్యలోకాలకు వెళతావు అంటుంది. జ్ఞానకాండ నువ్వు ఇక్కడే ఇప్పుడే నిత్య, శుద్ధ, ముక్తపురుషుడివి అంటుంది. నువ్వు మోక్షం పొందేశావు అంటుంది.

తక్కిన భేదాలు కూడా కొన్ని చూద్దాము.

| జ్ఞానం | కర్మ |
|---|---|
| ఎ) ఆత్మ గురించి చెబుతుంది | అనాత్మ గురించి చెబుతుంది |
| బి) అంతర్ముఖులుగా అవమంటుంది | బహిర్ముఖులుగా అవమంటుంది |
| సి) నిత్యఫలం ఇస్తుంది | అనిత్యఫలం ఇస్తుంది |
| డి) నేను అకర్తా అంటుంది | నేను కర్తా అంటుంది |
| ఇ) నేను అసంగం అంటుంది | నేను ససంగం అంటుంది |
| ఎఫ్) శ్రేయోమార్గాన్ని సూచిస్తుంది | ప్రేయోమార్గాన్ని సూచిస్తుంది |

రెండూ రెండు భిన్న మార్గాలని ఉపనిషత్తే చెబుతుంది.

**దూరమేతే విపరీతే విషూచీ**

**అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా – కఠ** 1.2.4

ఉపనిషత్తే కర్మకాండను అవిద్య అనీ, జ్ఞానకాండను విద్య అనీ అంటుంది. ఉపనిషత్తే కర్మకాండను ప్రేయోమార్గమనీ, జ్ఞానకాండను శ్రేయోమార్గమనీ అంటుంది. అలా రెండు భిన్నధృవాలను ఎలా సముచ్చయం చేస్తాము?

అందువల్ల పూర్వమీమాంస అనంతరం వేదాంత విచారణ అనలేము.

**2. ప్రయోజన భేదాత్** – ప్రయోజనంలో కూడా భేదం ఉంది. కర్మకాండ అనిత్యఫలాన్ని ఇస్తే, జ్ఞానకాండ నిత్యఫలాన్ని ఇస్తుంది.

**ఆబ్రహ్మభువనార్లోకాః పునరావృత్తినోఽర్జున**

**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే॥ – గీత** 8.16

కర్మకాండ అనాత్మ ఫలాన్నిస్తే, జ్ఞానకాండ ఆత్మఫలాన్నిస్తుంది. ఒకటి దక్షిణం వైపుకి వెళ్ళినట్టు, ఇంకొకటి ఉత్తరం వైపుకి వెళ్ళినట్టు. దక్షిణదిక్కు అధిపతి యమధర్మరాజు అయితే ఉత్తరదిక్కుకి అధిపతి సోమదేవత. యమధర్మరాజు చేతిలో మృత్యుపాశం ఉంటే, సోమదేవత చేతిలో అమృతకలశం ఉంటుంది. అలా రెండు భిన్నదిక్కులుగా ఉన్న కర్మ జ్ఞానాలను కలిపితే, తిరువనంతపురం, ఋషీకేశ్‌కి కలిపి వెళ్ళాలనుకున్నట్టు ఉంటుంది.

**3. ప్రవృత్తి భేదాత్** – ఇది సాంకేతిక భేదం. పనిలో భేదం ఉంది. కర్మకాండ కర్మలు చెయ్యమని ప్రోత్సహిస్తుంది. స్వర్గలోకాన్ని స్తుతించి, స్వర్గలోకానికి వెళ్ళాలంటే, జ్యోతిష్టోమ యజ్ఞం చేయాలి అంటుంది.

**జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత**

అందువల్ల కర్మకాండను **ప్రవర్తకం** అంటారు. ఒక వ్యక్తి కర్మ చేసేలాగా చేస్తుంది. జ్ఞానకాండ అలా అనేక కర్మలు చెయ్యమని చెప్పదు. పైపెచ్చు నువ్వు జీవితంలో ఏం పొందాలనుకుంటున్నావో అది నీ స్వరూపం అంటుంది. నువ్వే బ్రహ్మవు, నువ్వే ఆనందస్వరూపుడవు అంటుంది.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః** – తైత్తిరీయమ్

నీ ఆనందస్వరూపంలో బ్రహ్మలోకంలో పొందే ఆనందం, బృహస్పతి ఆనందం, ఇంద్రలోక ఆనందం, గంధర్వలోక ఆనందం అన్నీ వస్తాయి.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ బ్రహ్మణా విపశ్చితేతి** – తైత్తిరీయమ్

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తికి జీవితంలో అన్ని కోరికలూ తీరతాయి. అన్ని కోరికలు తీరేటప్పుడు, ఇంకేం కోరిక మిగులుతుంది? అందువల్ల జ్ఞానకాండ **అప్రవర్తకం**. అది కేవలం బోధకం నతు చోదకం. అంటే స్వరూపాన్ని చెపుతుంది కాని కర్మను చేయమని చెప్పదు. ఒకవేళ మనకు కర్మ చేయాలని కోరిక కలిగినా, నువ్వు అకర్తవు అంటుంది. ఆ విధంగా సాధకుణ్ణి అప్రవర్తకం లేదా నివర్తకం చేస్తుంది.

**ఆత్మన్యేవ ఆత్మనః తుష్టః**

ఈ విధంగా ప్రవృత్తిభేదం ఉండటంవల్ల కూడా జ్ఞాన కర్మ సముచ్చయం కుదరదు.

ఈ విధంగా వ్యభిచారదోషంవల్ల, విషయభేదంవల్ల, ప్రయోజన భేదంవల్ల, ప్రవృత్తి భేదంవల్ల పూర్వమీమాంస అనంతరం వేదాంత విచారణ చెయ్యాలి అనే వాదన చెల్లదని శంకరులవారు యుక్తి ప్రమాణంద్వారా నిరూపించారు.

**శ్రుతి ప్రమాణం** – శ్రుత్యా పూర్వపక్ష నిరాకరణమ్. ఇప్పుడు శ్రుతి ద్వారా వేదాంత విచారణకు వచ్చే ముందు పూర్వమీమాంస చేసితీరాలనే నియమం లేదని నిరూపించబోతున్నారు శంకరులవారు. ఒకదాని తర్వాత ఒకటి చెయ్యాలనే నియమం లేదు అంటారు.

**కర్మ బ్రహ్మ విచారయోః క్రమః నాస్తి**
**క్రమబోధక వేద ప్రమాణం నాస్తి**

కర్మ జ్ఞానమార్గాలు ఒకదాని తర్వాత ఒకటి, క్రమపద్ధతిలో చేయాలని చెప్పటానికి వేదప్రమాణం లేదు అంటారు. అది నిరూపించటానికి పూర్వమీమాంసకుల భాగంలోకే వెళతారు.

పూర్వమీమాంసలో ఎన్నో యజ్ఞాలను విశ్లేషించాల్సి ఉంటుంది. అందులో ఒక అంశం – ఈ యజ్ఞాలను ఒకేసారి చెయ్యాలా, ఒకదాని తర్వాత ఇంకొకటి చెయ్యాలా? ఎలా చెయ్యాలో చెప్పటానికి ఒక నియమం ఉంది. అది ఇంగితజ్ఞానం మీద ఆధారపడి ఉంది. ఒకేసారి అనేక యజ్ఞాలు చేసితీరాలంటే, అవి అనేకమంది చేయాలని చెప్పకనే చెప్పినట్టు. ఎందుకంటే ఒక వ్యక్తి ఒకసారి ఒక్క యజ్ఞమే చెయ్యగలడు.

కుంభాభిషేకం సమయంలో నాలుగు హోమకుండాలు ఉంటాయి. పూర్ణాహుతి వెయ్యాల్సివచ్చినప్పుడు, నాలుగు హోమకుండాల్లోనూ ఒకేసారి వెయ్యాలి. అలా ఒకేసారి చేయాలంటే, ఒక్క యజమాని చెయ్యలేడు కదా. నలుగురు ఉండాలి.

అందువల్ల క్రమపద్ధతిలో జరగాలంటే నియమం ఏమిటి? **ఏకకర్తృకర్త్వమ్.**

**యత్ర యత్ర ఏకకర్తృకర్త్వం తత్ర తత్ర క్రమత్వమ్**
ఎక్కడ ఒక్కరే కర్మ చేయాలో అక్కడ క్రమత్వం ఉంటుంది.

అనేక యజ్ఞాలు ఉన్నప్పుడు వాటిని ఒక్క వ్యక్తి చేయాలా, భిన్నవ్యక్తులు చేయాలా అని ఎలా తెలుస్తుంది? దానికేదైనా నియమం ఉందా? మూడు నియమాల్లో ఏ ఒక్క నియమం పాటించాల్సిన సందర్భం వచ్చినా అది ఏకకర్తృకర్త్వాన్ని సూచిస్తుంది. అవి – ఏకప్రధాన శేషత్వం, శేష శేషిత్వం, అధికృత అధికారత్వం.

**ఏకప్రధాన శేషత్వమ్** – అనేక యజ్ఞాలు చేయాల్సి ఉండి, వాటిలో ఒకటి ప్రధానయజ్ఞం అయి, తక్కినవి ఆ ప్రధానయజ్ఞానికి సహకారీ యజ్ఞాలు అయితే వాటన్నిటినీ ఒక్కరే చేయాలి. అంటే అతను ప్రధానయజ్ఞం చేయాలనుకుంటే, దానికి అనుబంధిత యజ్ఞాలు కూడా అతనే చేయాలి. అప్పుడే అతని యజ్ఞం పూర్తి అవుతుంది. ఒకరు ప్రధానయజ్ఞం చేసి, ఇంకెవరో సహకారీ యజ్ఞాలు

చేస్తే, ఒకరు భోజనం చేసే ముందు చెయ్యి కడుక్కుని ఇంకెవరో భోజనం చేసినట్టు ఉంటుంది. ఎవరు భోజనం చేస్తారో వారే కదా చెయ్యి కడుక్కోవాలి.

**శేషశేషిత్వమ్** – రెండు యజ్ఞాలు ఉండి, వాటిలో ఒకటి ప్రధానయజ్ఞమూ, ఇంకొకటి సహకారీ యజ్ఞం అయినప్పుడు, దాన్ని శేషశేషిత్వం అంటారు. అప్పుడు కూడా రెండు యజ్ఞాలను ఒక్కరే చేస్తారు.

**అధికృత అధికారత్వమ్** – రెండు యజ్ఞాలూ ప్రధానమైనవే అయినా కూడా ఒక్కోసారి వేదం ఒకవ్యక్తి మొదటి ప్రధానయజ్ఞం చేస్తేనే రెండవ యజ్ఞం చెయ్యటానికి అర్హుడు అంటుంది. రెండూ ముఖ్యమైనవే కాని ఒకటి చేస్తే ఇంకొకటి చెయ్యటానికి అధికారం వస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి పెళ్ళి చేసుకున్నాకే కొన్ని యజ్ఞాలు చెయ్యగలడు. అలాంటప్పుడు పెళ్ళి ప్రధానయజ్ఞం అవుతుంది, తద్వారా రెండవ ప్రధానయజ్ఞం చెయ్యటానికి అధికారత్వం వస్తుంది. దీన్ని అధికృత అధికారత్వం అంటారు.

ఈ నియమాల్లో ఏ నియమం ఉన్నా, ఏకకర్తృకర్త్వ నియమాన్ని పాటించాలి. అంటే అనేక యజ్ఞాలు ఉన్నా, ఒక్క వ్యక్తే అన్నీ చేయాలి. ఒక్కరే అన్నీ చేయాలి కాబట్టి ఒక్కసారే అన్నిటినీ చెయ్యటం సాధ్యం కాదు కాబట్టి, ఒకదాని తర్వాత ఒకటి చేయాలి.

ఆ విధంగా పూర్వమీమాంసలో కొన్ని యజ్ఞాలను కలిపి, ఒక్కరే చేయాలి. అది కూడా క్రమంగా చేయాలి అని వస్తుంది. అలా కూడా సమస్యే. దేని తర్వాత ఏది చేయాలి? దానికి కూడా ఒక క్రమం ఉంటుంది. ఆ వరుసక్రమాన్ని నిరూపించటానికి వేదంలో ఆరు ప్రమాణాలు ఉన్నాయి. అవి మనకు తెలిసిన ఆరు ప్రమాణాలు కావు. వాటి వివరాలలోకి మనం వెళ్ళటం లేదు.

పూర్వమీమాంసలో వరుసక్రమంలో చేయాలని నిరూపించటానికి మూడు నియమాలు ఉన్నాయని చూశాము. కాని పూర్వమీమాంస అనంతరం వేదవిచారణ చేయాలని చెప్పటానికి అలాంటి నియమాలు ఏమైనా ఉన్నాయా? పూర్వమీమాంసకూ, వేదాంతానికీ మధ్య ఏకప్రధాన శేషత్వం సంబంధం లేదు, శేషశేషిత్వం సంబంధం లేదు, అధికృత అధికారత్వం సంబంధం లేదు. అందువల్ల ఏకకర్తృకర్త్వం నియమం లేదు. అందువల్ల అథ అంటే పూర్వమీమాంస అనంతరం అని చెప్పలేము.

అంటే వేదాంత అధ్యయనం చెయ్యటానికి పూర్వమీమాంసా అధ్యయనం చేసితీరాలని ఎక్కడా వేదంలో చెప్పబడలేదు. అంటే ఈ నియమానికి శ్రుతి ప్రమాణం లేదు అంటున్నారు శంకరులవారు.

**పూర్వమీమాంసకుడు చెప్పిన ప్రమాణం**

పూర్వమీమాంసా అనంతరం వేదవిచారణ చేయాలని చూపటానికి శ్రుతి ప్రమాణం ఉందంటున్నారు పూర్వమీమాంసకులు.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసాఽ నాశకేన** – బృహదారణ్యకమ్ 4.4.22

సాధనచతుష్టయ సంపత్తి పొందటానికి మూడు ఆశ్రమ జీవనాలను గడపాలి అంటున్నది బృహదారణ్యకోపనిషత్తు.

**బ్రహ్మచర్యం పరిసమాప్య గృహీ భవేత్ । గృహీ భూత్వా వనీ భవేత్ వనీ భూత్వా ప్రవ్రజేత్** – జాబాలోపనిషత్తు

బ్రహ్మచర్యం పూర్తి చేశాక గృహస్థు అవాలి, గృహస్థాశ్రమం పూర్తి చేశాక వానప్రస్థంలోకి వెళ్ళాలి, అదయ్యాక సన్న్యాసి అవ్వాలని దీని అర్థం. అంటే సాధన చతుష్టయ సంపత్తి పొందాలంటే ఈ మూడు ఆశ్రమాలను అనుభవించాలని అర్థం అంటున్నారు పూర్వమీమాంసకులు.

ఈ మూడు ఆశ్రమధర్మాలను పాటించి తీరాలంటే అర్థం ఏమిటి? పూర్వమీమాంస కూడా అధ్యయనం చేసి తీరాలని. ఎందుకు? ఎందుకంటే గృహస్థాశ్రమంలో కర్మ అనుష్ఠానం చేసితీరాలి; వానప్రస్థంలో ఉపాసన చెయ్యాలి. అంటే మొదటి మూడు ఆశ్రమజీవనాలలోనూ కర్మ, ఉపాసనలను పాటించాలి. కర్మ, ఉపాసనలు వేదపూర్వభాగంలోనే వస్తాయి. అందువల్ల ఈ మూడు ఆశ్రమ జీవనాలనూ పాటించాలంటే, ఆ వ్యక్తికి తప్పకుండా పూర్వమీమాంసా అవగాహన ఉండాలి. ఆ విధంగా పూర్వమీమాంస అనంతరం వేదాధ్యయనం చేయాలని చెప్పటానికి వేదప్రమాణం ఉంది అంటారు పూర్వపక్షులు.

**సిద్ధాంతి జవాబు** – పూర్వపక్షులు చెప్పిన ఈ జవాబును ఇక్కడ ఈ మొదటిసూత్రంలో శంకరులవారు విశ్లేషించరు, వేరేచోట విశ్లేషిస్తారు. ఇక్కడ ఇంకో ఉపభాష్యకారులు దీనికి జవాబు చెబుతారు.

పూర్వపక్షి ఉటంకించిన మంత్రం జాబాల ఉపనిషత్తులోనిది. ఒకవ్యక్తి మూడు ఆశ్రమధర్మాలను పాటించాలని అందులో వస్తుంది నిజమే. కాని అదే ఉపనిషత్తులో ఆ వాక్యం వెంటనే అథవా అని ఇంకా వస్తుంది. అథవా అంటే కాని. మూడు ఆశ్రమజీవనాలు గడపాలి కాని ఇవి గడిపితీరాలని నియమం లేదు. ఒకవేళ అతను తలచుకుంటే బ్రహ్మచర్యం నుంచే సన్న్యాసం స్వీకరించవచ్చు. అలాంటప్పుడు అతను గృహస్థు అవడు కాబట్టి వేదపూర్వభాగం అవసరం లేదు అతనికి. అతను ఒకటే పెద్దగెంతు గెంతుతాడు. అందువల్ల సన్న్యాసం స్వీకరించేముందు మూడు ఆశ్రమధర్మాలను పాటించి తీరాలనుకోవటం పొరపాటు.

పూర్వమీమాంస అధ్యయనం చేసితీరాల్సిన అవసరం లేకపోతే, ఏది చేసి తీరాలి? దీనికి జవాబు ముందే చూశాము. సాధన చతుష్టయ సంపత్తి ఉండితీరాలి. ఈ మాట వినగానే పూర్వపక్షులు మండిపడతారు. పూర్వమీమాంస అధ్యయనం చేసి తీరనవసరం లేదు కాని, సాధన చతుష్టయ సంపత్తి మాత్రం ఉండాలా? అంటే కర్మ, ఉపాసన చేయనవసరం లేదా?

సాధన చతుష్టయ సంపత్తి ఎలా వస్తుంది? కర్మ, ఉపాసన చెయ్యటంవల్ల అంటారు పూర్వపక్షులు. సాధన చతుష్టయ సంపత్తి ఉండితీరాలంటే కర్మ, ఉపాసన చేసితీరాలి. కర్మ, ఉపాసన చేసితీరాలంటే పూర్వమీమాంస నేర్చుకుని తీరాలి అంటారు పూర్వమీమాంసకులు. అంటే ఉదాహరణకు మీరు బ్రహ్మసూత్రముల బోధకు చెన్నైలోని ఆస్తిక సమాజానికి వెళుతున్నారనుకుందాము. మీరు ఆస్తికసమాజంలో ఉండితీరాలి, కాని దానికి మీరు ప్రయాణం చేసితీరనవసరం లేదంటే ఎలా ఉంటుంది?

దానికి సిద్ధాంతి జవాబు – పూర్వమీమాంస అందరికీ అవసరం లేదు. మనం పూర్వమీమాంస అసలు అవసరం లేదు అనటం లేదు. సాధన చతుష్టయ సంపత్తి ముందే ఉన్నవారికి అవసరం లేదు అంటున్నాము అంతే. అంటే వారు దానికి కావాల్సిన కర్మ, ఉపాసనలను ముందు జన్మలోనే చేసుకుని వచ్చారు.

**తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।**
**యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥** – గీత 6.43

**పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।**
**జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥** – గీత 6.44

పూర్వజన్మలో యోగభ్రష్టుడు అయిన వ్యక్తి పరిస్థితి ఏమిటని అర్జునుడు అడిగిన దానికి సమాధానంగా అతను ఏమీ నష్టపోడు. ఆ పూర్వజన్మ సుకృతం ఉంటుందని కృష్ణపరమాత్మ చెప్పాడు.

అందువల్ల ఎవరికైనా చిన్నవయస్సులోనే వివేక వైరాగ్యాలు ఏర్పడితే, భగవంతుడు పక్షపాతం చూపించాడని భగవంతుణ్ణి నిందించనవసరం లేదు. ఈ విషయాన్ని వివరించటానికి పూజ్య దయానంద సరస్వతి స్వామీజీ ఏడు వడల కథ హాస్యంగా చెబుతారు.

ఎన్నడూ హెూటల్ గుమ్మం ఎక్కని ఒక అమాయకుడు ఒకసారి తన స్నేహితునితో కలిసి ఒక హెూటలుకు వెళ్ళాడు. ముందే మేనేజరు దగ్గరకు వెళ్ళి 'ఎంత డబ్బు కట్టాలి,' అని అడిగాడు.

'ఇంకా మీరు ఏమీ తిననేలేదు. హాయిగా లోపల కూర్చుని మీకు ఇష్టమైనది, కడుపు నిండేలాగా తినండి. మీ కడుపు నిండాకనే నాకు డబ్బులు చెల్లిద్దురుగాని,' అన్నాడు. అలాగే లోపలికి వెళ్ళారు. అతను ఒక వడ తిన్నాడు, ఆకలి తీరలేదు. రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు తిన్నా అతని ఆకలి తీరలేదు. చివరికి ఏడో వడ తిన్నాక కడుపు నిండింది. అతని స్నేహితుడు మాత్రం ఒక్కటే తిని 'చాలు నాకు కడుపు నిండింది,' అన్నాడు.

డబ్బులు ఇచ్చేటప్పుడు ఈ అమాయకుడు ఒక్క వడకే ఇచ్చాడు. దూరం నుంచి సర్వరు 'ఏడువడలు,' అని అరుస్తున్నాడు. మేనేజరు ఆశ్చర్యంగా అడిగాడు.

'ఏడువడలు తిని ఒక్క వడకే డబ్బులు ఇస్తున్నావేమిటి?'

'మీరేమన్నారు? కడుపునిండా తిను. దేనివల్ల కడుపు నిండితే దానికి డబ్బులు కట్టు అన్నారు. నాకు ఏడవవడతో కడుపు నిండింది. మొదటి ఆరువడలు కడుపు నింపలేదు. మీ సర్వరుకు బొత్తిగా జ్ఞానం లేదు. నాకు కడుపు నిండే వడ ముందు తీసుకురాలేదు (ఏడవది ముందు తెచ్చి ఉండవచ్చు కదా). ఏడవ వడతో కడుపు నిండింది కాబట్టి, దానికే డబ్బు కడుతున్నాను,' అన్నాడు తెలివిగా.

మేనేజరు నవ్వి, 'బాబూ ఏడవవడ నీ కడుపు నింపింది అంటే, దాని ముందు ఆరువడలు తినటంవల్ల అది జరిగింది,' అన్నాడు.

కాని ఇతను అతితెలివి చూపాడు. మేనేజరుకు తిరుగుటపాలో జవాబు చెప్పాడు, 'మరి నా స్నేహితునికి ఒక్కవడతోనే ఎలా కడుపు నిండింది? అతనికి ఏడవవడను ముందు తెచ్చి ఉంటాడు సర్వరు.'

'నీ స్నేహితునికి ఎలా ఒక్కవడతోనే కడుపు నిండిందో అతన్నే అడుగుదాము.'

అంతవరకూ ఈ తమాషానంతా మౌనంగా గమనిస్తున్న స్నేహితుడు అప్పుడు నోరు విప్పాడు.

'ఇవాళ మా ఆవిడ కూడా వడలే చేసింది. నేను ఇక్కడికి వచ్చేముందు, ఇంట్లో ఆరువడలు తినివచ్చాను. అందువల్ల ఇక్కడ ఒక్కవడ తినగానే నా కడుపు నిండిపోయింది.'

కాని పాపం ఈ స్నేహితుడు ఆ విషయం చూడలేదు. ఆ విధంగా ఆరు వడలు ఇంట్లోనే తిని రావచ్చు, లేదా హొటలుకి వచ్చి అక్కడ తినవచ్చు. అలాగే కర్మయోగం వడలు, ఉపాసన యోగం వడలను పూర్వజన్మ అనే ఇంట్లో తిని, ఈ జన్మ అనే హొటలుకు రావచ్చు లేదా అన్నీ ఈ జన్మలోనే తినవచ్చు. పూర్వజన్మలో హొమ్‌వర్క్ చేసుకుని వచ్చిన వారికి పూర్వమీమాంస అవసరం లేదు. వారు సరాసరి వేదాంతబోధకు వెళ్ళిపోవచ్చు.

అందువల్ల కర్మయోగం, మూడు ఆశ్రమధర్మాలు, పూర్వమీమాంస శాస్త్రం ఎక్కువమందికి అవసరం. కాని కొంతమంది పుణ్యాత్ములకు అవసరం లేదు. కాని సాధనచతుష్టయ సంపత్తి మాత్రం అందరికీ కావాలి.

ఈ సూత్రానికి సాధారణ విచారణ చూసినప్పుడు, అనుబంధ చతుష్టయం పరోక్ష అర్థం అనీ, అందులోని మొదటి అంశం అధికారి అని చూశాము. అందువల్ల అథ పరోక్షంగా అధికారి పదాన్ని సూచిస్తుంది.

**అథ = సాధన చతుష్టయ సంపత్తి అనంతరం – ప్రత్యక్ష అర్థం**

**అథ = అధికారి – పరోక్ష అర్థం**

**అతః** – అతః పదంయొక్క ప్రత్యక్ష అర్థం అందువల్ల. అందువల్ల బ్రహ్మవిచారణ చేసితీరాలి. అందువల్ల అంటే కారణాన్ని సూచిస్తుందని మనకు తెలుసు. నాకు

ఆకలి వేస్తోంది, అందువల్ల నాకు ఆహారం కావాలి. నాకు జ్వరం వచ్చింది, అందువల్ల నేను మందు వేసుకోవాలి.

అందువల్ల బ్రహ్మవిచారణ చేయాలి అంటే ఎందువల్ల? వ్యాసాచార్యుల వారు కారణం చెప్పరు. ఇది సూత్రం కాబట్టి ఆ కారణాన్ని ఊహించుకోవాలి. అటువంటి పని భాష్యకారునిగా శంకరులవారు చేసిపెట్టారు మనకు. శంకరులవారు ఒక కారణం కాదు రెండు కారణాలను చూపించారు.

1. కర్మ మోక్షాన్ని ఇవ్వదు.
2. జ్ఞానం (బ్రహ్మజ్ఞానం) మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది.

అందువల్ల బ్రహ్మవిచారణ చేయాలి. ఈ రెండు వాక్యాలను కలిపి ఒక్క వాక్యంలో చెప్పాలంటే – కర్మ మోక్షాన్ని ఇవ్వదు కాబట్టి జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది కాబట్టి, బ్రహ్మవిచారణ చేసితీరాలి. ఇప్పుడు ఈ రెండు కారణాలనూ విశ్లేషిద్దాము.

**కర్మ మోక్షాన్ని ఇవ్వదు** – ఈ వాక్యాన్ని శ్రుతి ప్రమాణంద్వారా, యుక్తి ప్రమాణంద్వారా, అనుభవ ప్రమాణంద్వారా కూడా నిరూపించవచ్చు.

**ఎ) శ్రుతి ప్రమాణం** – అనేక వాక్యాలు ఉన్నాయి శ్రుతిలో. బాగా ప్రసిద్ధి పొందిన వాక్యం –

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః** – కైవల్యం

కర్మవల్ల మోక్షం రాదు.

**బి) యుక్తి ప్రమాణం** – మోక్షం అంటే సంసారనివృత్తి. సంసారంనుంచి విముక్తి. సంసారనివృత్తి జ్ఞానంవల్లనే జరుగుతుంది. అజ్ఞానం = సంసారం అని అధ్యాసభాష్యంలో చూశాము.

జ్ఞానం పొందితేనే సంసారం పోతుంది. ఎందుకంటే సంసారాన్ని మన అజ్ఞానంవల్ల ఆరోపించుకున్నాము. రజ్జుసర్పభ్రాంతివంటిది సంసారం కూడా.

పామును ఎలా నాశనం చేస్తాము? కర్ర పెట్టి కొడతామా, గరుడ మంత్రం చదువుతామా, పాములు పట్టేవాడిని పిలుస్తామా? ఇవేవీ పనిచెయ్యవు. పామును నాశనం చెయ్యటానికి ఒక్కటే మార్గం ఉంది. అది జ్ఞానంవల్ల మాత్రమే జరుగుతుంది.

సంసారం అధ్యాస అని ఎలా చెప్పగలము? శంకరులవారు ప్రత్యేకించి అధ్యాసభాష్యం రాసింది ఈ అతః శబ్దాన్ని వివరించటానికే. మనకు ఆత్మ, అనాత్మల అవివేకం ఉండటంవల్ల జీవాత్మ బుద్ధిని, పరిచ్ఛిన్న బుద్ధిని ఆత్మమీద ఆరోపిస్తున్నాము. అది సంసారానికి దారితీస్తుంది.

**సి) అనుభవ ప్రమాణమ్** – రజ్జుసర్ప భ్రాంతిలో సర్పభ్రాంతి, అది తాడు అనే జ్ఞానం కలగటంవల్ల పోతుంది.

**రజ్జోః సర్పజన్య భయం కంపాదికం రజ్జు జ్ఞానేన నశ్యతి**

తాడును చూసి పాము అని భయపడ్డ వ్యక్తికి భయం, కంపనం కలుగుతాయి. ఎవరో వచ్చి లైటు వేసి చూపిస్తే, పాము అనే భయం పోయి, అది తాడు అని తెలుస్తుంది. కలలో పులి వెంటాడుతున్నట్టు వస్తే భయం, కంపనం కలుగుతాయి. కాని కలనుంచి లేవగానే అవి పోతాయి. కాని ఈ సూత్రాన్ని నిజం పాముకో, నిజం పులికో అన్వయించకూడదు. అవి హాని చెయ్యవచ్చు.

తాడుమీద ఆరోపించిన పాము పోతుంది కాని, అక్కడ నిజంగా పాము ఉంటే అది పోదు కదా. ఇదే సూత్రాన్నీ సంసారానికి అన్వయించి, జ్ఞానం పొందితే మిథ్యా సంసారం పోతుంది కాని నిజం సంసారం పోదు కదా అని అడగవచ్చు. కాని దానికి మన జవాబు, తాడు–పాము విషయంలో నిజం పాము ఉంది కాని, అదృష్టవశాత్తూ సంసారం విషయంలో ఆరోపించిన సంసారమే ఉంది.

**న నిరోధో న చోత్పత్తిః న బద్ధో న చ సాధకః।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా॥**

**– మాండూక్య కారికలు** 2.32

లయం లేదు, సృష్టి లేదు, బద్ధజీవి లేదు, సాధకుడు లేదు; ముముక్షువు లేదు, ముక్తిపొందిన వాడు లేదు – ఇది పరమసత్యం.

దీన్నిబట్టి నిజంగా సంసారం అనేది వేరే లేదు. ఆ విధంగా శ్రుతి యుక్తి అనుభవ ప్రమాణాలద్వారా జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల రాదని నిరూపించబడింది. అందువల్ల మోక్షంకోసం బ్రహ్మవిచారణ చేసితీరాలి. ఎంత చక్కగా ఆ వాక్యంలోకి సరిపోయిందో చూడండి.

ఈ సూత్రానికి సాధారణ అర్థం చూసినప్పుడు, అనుబంధ చతుష్టయం పరోక్ష అర్థం అనీ, అందులోని రెండవ అంశం ప్రయోజనం అనీ చూశాము. అందువల్ల అతః పరోక్షంగా ప్రయోజనం పదాన్ని సూచిస్తుంది.

**జ్ఞానాదేవ మోక్షః కర్మణా న మోక్షః। అతః మోక్షాయ బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా**

**అతః = జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల మోక్షం రాదు – ప్రత్యక్ష అర్థం.**

**అతః = ప్రయోజనం – పరోక్ష అర్థం.**

**బ్రహ్మజిజ్ఞాసా** – దీని అంతిమ అర్థం బ్రహ్మవిచారణ చేయాలని, కాని అది ఎలా వస్తుందో విశ్లేషణద్వారా తెలుసుకుందాము.

**బ్రహ్మజ్ఞానాయ వేదాంతవిచారః**

**బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంత విచారణ చేయాలి**

అదెలాగో చూద్దాము. ముందు బ్రహ్మజిజ్ఞాసా పదాన్ని చూస్తే అది సంయుక్తపదం. అందులో మూడు పదాలు ఉన్నాయి.

బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మ + జిజ్ఞా + సా

**బ్రహ్మ** – బ్రహ్మ అంటే జగత్ కారణం బ్రహ్మ. శాస్త్రంలో బ్రహ్మ పదానికి అనేక అర్థాలున్నాయి.

i) **కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్** – గీతా 3.15
ఇందులో బ్రహ్మ అంటే వేదం

ii) **మహ ఇతి తద్బ్రహ్మ స ఆత్మా** – తైత్తిరీయమ్
ఇక్కడ తత్ బ్రహ్మ అంటే ఓంకారం.

iii) **యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః –** కఠ 1.2.25
ఇక్కడ బ్రహ్మ అంటే బ్రాహ్మణుడు.

iv) **స బ్రహ్మవిద్యాం సర్వవిద్యాప్రతిష్ఠామ్** – ముండకమ్ 1.1.1
ఇక్కడ బ్రహ్మవిద్య అంటే హిరణ్యగర్భ బోధించిన విద్య.

ఈ విధంగా బ్రహ్మ అంటే వేదం, ఓంకారం, బ్రాహ్మణుడు, హిరణ్యగర్భ.

కాని, ఇక్కడ బ్రహ్మ అంటే సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మ. జగత్ కారణం బ్రహ్మ.

ఏ అర్థం తీసుకోవాలో ఎలా తెలుస్తుంది? సందర్భాన్నిబట్టి చూడాలి. బ్రహ్మసూత్రములలో రెండవ సూత్రములో వ్యాసాచార్యులవారే స్వయంగా బ్రహ్మను జగత్ కారణం బ్రహ్మగా వర్ణించారు. అందువల్ల బ్రహ్మజిజ్ఞాసాలో బ్రహ్మ అంటే జగత్ కారణం బ్రహ్మ; సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ.

బ్రహ్మ = జగత్ కారణబ్రహ్మ

**జిజ్ఞా** – జిజ్ఞా అంటే జ్ఞానం, నిశ్చయజ్ఞానం అని చెబుతున్నారు శంకరులవారు.

అవగతి పర్యంతం జ్ఞానం

అవగతి అంటే దృఢ అపరోక్షజ్ఞానం. అంటే బ్రహ్మ గురించిన దృఢ అపరోక్ష జ్ఞానం.

**సా** – దీన్ని సన్ ప్రత్యయం అంటారు. అక్షరాలా చూస్తే ఇచ్ఛ లేదా కోరిక అని అర్థం. జిజ్ఞాసా అంటే నేర్చుకోవాలనే ఇచ్ఛ, ముముక్ష అంటే మోక్షం పొందాలనే ఇచ్ఛ; వివిదిషా అంటే నేర్చుకోవాలనే ఇచ్ఛ. సా అంటే వాచ్యార్థం ఇచ్ఛ, కాని ఇక్కడ లక్ష్యార్థం తీసుకుంటాము. లక్ష్యార్థం – విచారణ.

ఇచ్ఛకూ, విచారణకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? విచారణ ఎప్పుడు చేయాలనిపిస్తుంది? ఏదైనా నేర్చుకోవాలనే కోరిక పుట్టినప్పుడు.

మనం బ్రహ్మజ్ఞాన ఇచ్ఛను బ్రహ్మజ్ఞాన విచారణగా మారుస్తున్నాము. ఇప్పుడు ఈ సంయుక్త పదంలోని పదాల అర్థాలు చూస్తే –

**బ్రహ్మ = బ్రహ్మజ్ఞానాయ వేదాంతవిచారః**
**జిజ్ఞా = దృఢ అపరోక్ష బ్రహ్మజ్ఞానాయ**
**సా = వేదాంతవిచారః కర్తవ్యా**

బ్రహ్మ పదం అర్థం చెప్పినప్పుడు వేదాంత విచారణ చేయాలి అన్నాము. మనమే ఎందుకు స్వయంగా ఆత్మవిచారణ చెయ్యకూడదు అంటారు కొందరు. వేదాంత విచారణను శంకరాచార్యులవారు పెంపొందించారు, మనం దాని జోలికి పోకుండా, శాస్త్రం జోలికి పోకుండా, గురువు దగ్గరకు పోకుండా 'నేను ఎవరు?' అని స్వయంగా ఆత్మవిచారణ చెయ్యవచ్చు అంటారు కొందరు. అలా ఆత్మవిచారణ చేస్తే, ఏదో ఒకరోజు జవాబు దొరుకుతుందని వారి వాదన.

కాని ఈ వాదనను దయానంద సరస్వతి స్వామీజీ ఒప్పుకోరు. శాస్త్రం అధ్యయనం చెయ్యకుండా, 'నేనెవరు? నేనెవరు?' అని అడుగుతూ పోతే 'నేను ఎందుకూ పనికిరానివాడిని,' అని జవాబు వస్తుంది తప్ప ఆత్మజ్ఞానం కలగదు అంటారు.

ఆత్మవిచారణ అంటే స్వంతంగా చేసే విచారణ అని కాదు అర్థం, ఆత్మ **గురించి** చేసే విచారణ అని అర్థం. అది కూడా మళ్ళీ స్వంతంగా చెయ్యకూడదు. గురువుద్వారా, శాస్త్రంద్వారా చేయాలి. ఎందుకంటే బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతమే ప్రమాణం.

ఏ జ్ఞానం పొందాలన్నా కూడా ప్రమాణంద్వారానే పొందగలము. ప్రమాణజన్య ప్రమా. ఐదు ప్రమాణాల గురించి తెలుసు మనకు. అవి ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, అర్థాపత్తి, అనుపలబ్ధి.

విచారణ అంటే ఈ ఐదు ప్రమాణాల్లో ఏ ఒక్కటీ కాదు. కేవలం ఆలోచన, స్వంతంగా విచారణ చెయ్యటం, ధ్యానంలో కూర్చుని ప్రయత్నించటం – ఇవేవీ పైన చెప్పిన ఐదు ప్రమాణాలలోకి రావు. ప్రమాణం వాడకుండా నేను ఎవరు అని ఎవరైనా ప్రశ్నించుకుంటూ పోతే అనేక కల్పనాత్మకమైన అంశాలు తెలుస్తాయే కాని, నిజమైన జ్ఞానం కలగదు.

అందువల్ల బ్రహ్మజ్ఞానాన్ని కూడా ప్రమాణం ద్వారానే పొందాలి. కాకపోతే బ్రహ్మను పైన చెప్పిన ఏ ప్రమాణాలవల్లనూ పొందలేము. ఇవి కాక ఆరవ ప్రమాణం ఒకటి ఉంది. దాన్ని శబ్దప్రమాణం అంటారు. అంటే ఉపనిషత్తు అనే శబ్దప్రమాణం. అంటే శాస్త్రంద్వారానే బ్రహ్మ గురించి తెలుసుకోగలము. అందువల్ల వ్యాసాచార్యులవారు వేదాంతవిచారః కర్తవ్యా అని ప్రత్యేకించి చెప్పకపోయినా మనం కలుపుకోవాలి.

ఇక్కడ చెప్పకపోయినా ఆయనే స్వయంగా మూడవసూత్రంలో బ్రహ్మ గురించి నేర్చుకోవటానికి వేదాంతం ఒక్కటే ప్రమాణం అని చెప్పారు. ఆయనే స్వయంగా వేదాంత వాక్యాలను విశ్లేషించారు. అందువల్ల –

**బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మజ్ఞానాయ వేదాంత విచారః**

ఇంకా బ్రహ్మజిజ్ఞాసా పదవిశ్లేషణ ముగియలేదు. ఇక్కడ పూర్వపక్షి మళ్ళీ ఒక వాదన చేస్తాడు.

**పూర్వపక్షి వాదన** – పూర్వపక్షి వాదన చూసేముందు సందర్భాన్ని అర్థం చేసుకుందాము. ఎందుకు మనం బ్రహ్మవిచారణ చేస్తున్నాము? బ్రహ్మజ్ఞానం పొందటానికి. బ్రహ్మజ్ఞానం పొందటం ఎందుకు? సంసారనివృత్తి కలగటానికి. సంసారనివృత్తి కలిగితే ఏమవుతుంది? మోక్షం కలుగుతుంది.

అతః పదంయొక్క అర్థం చూసినప్పుడు, జ్ఞానంవల్ల మాత్రమే సంసారం తొలుగుతుంది, ఎందుకంటే సంసారాన్ని ఆరోపించాము కాబట్టి అన్నాము. ఇక్కడ ఒక సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఏమిటది? దేన్ని ఆరోపించినా కూడా దాని అధిష్ఠానజ్ఞానం కలిగితే, ఆ అధ్యాస పోతుంది. తాడుమీద పామును ఆరోపించాము. తాడు దాని అధిష్ఠానం. ఇప్పుడు ఆరోపించిన పాము ఎలా పోతుంది? కెమిస్ట్రీ గురించి నేర్చుకుంటే పోతుందా, బంగారం గురించి నేర్చుకుంటే పోతుందా, రైలు గురించి నేర్చుకుంటే పోతుందా? పామును అధ్యారోపం చెయ్యటానికి కారణమైన అధిష్ఠానం అయిన తాడు గురించి తెలుసుకుంటే పోతుంది.

దీన్నించి ఒక సూత్రాన్ని తయారు చెయ్యవచ్చు. ఏ వస్తువును ఆరోపిస్తే, దాని అధిష్ఠానజ్ఞానం పొందితే, ఆ వస్తువు పోతుంది.

ఈ తర్కాన్ని ఉపయోగించి, సంసారం ఆరోపించబడింది కాబట్టి, దానికి అధిష్ఠాన వస్తుజ్ఞానం కలిగితే, ఆ అధ్యాస పోతుంది అని చెప్పవచ్చు. దీనికి ఉదాహరణగా తాడు–పాము ఉదాహరణ తీసుకుంటాము.

ఇప్పుడు పూర్వపక్షి వాదనను చూద్దాము. శంకరాచార్యులవారు అధ్యాసభాష్యంలో ఏమన్నారు? సంసారంయొక్క **అధిష్ఠానం ఆత్మ** అన్నారు. అధ్యాస పోవాలి అంటే దాని అధిష్ఠాన జ్ఞానం పొందాలి అన్నది నియమం. సంసారం అధ్యాస అయితే, దాని అధిష్ఠానం ఆత్మ. అలాంటప్పుడు సంసారం పోవాలంటే ఏం చేయాలి? దాని అధిష్ఠానమైన ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందాలంటే ఆత్మవిచారణ చేయాలి. కాని వ్యాసాచార్యులవారు ఏమంటున్నారు?

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

పైన చెప్పిన సూత్రం ప్రకారం అసలు ఏమని ఉండాలి?

**అథాతో ఆత్మజిజ్ఞాసా**

ఇదెలా ఉందంటే తాడు–పాముల అధ్యాస పోవటంకోసం ఆలిచిప్ప విచారణ చేసినట్టుంది అంటాడు పూర్వపక్షి.

**వేదాంతి జవాబు** – దీనికి రెండు జవాబులు చెబుతాడు వేదాంతి. ఇంచుమించు రెండింటి అర్థం ఒకటే.

1. బ్రహ్మ = ఆత్మ. బ్రహ్మ అన్నా ఆత్మ అన్నా ఒక్కటే. అందువల్ల వ్యాసాచార్యులవారు బ్రహ్మవిచారణ చెయ్యమని అంటే ఆత్మవిచారణ చెయ్యమని చెప్పినట్టు అర్థం.

**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి।।** –తైత్తిరీయమ్

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**

–బృహదారణ్యకమ్ 2.4.5

ఈ రెండు వాక్యాలనూ ఈ సూత్రానికి విషయవాక్యాలుగా కూడా చూశాము. తైత్తిరీయంలో బ్రహ్మ పదం వాడితే, బృహదారణ్యకంలో ఆత్మ పదం వాడింది ఉపనిషత్తు. దీన్నిబట్టి బ్రహ్మ, ఆత్మ ఒక్కటే అని తెలుస్తున్నది. ఉపనిషత్తు ఈ పదాలను రెండు అర్థాలతోనూ వాడుతూ ఉంటుంది. అందువల్ల మొదటి సూత్రంలోనే జీవాత్మ, పరమాత్మ ఐక్యం కూడా చెప్పకనే చెప్పినట్టయింది.

2. శాస్త్రం బ్రహ్మ అనే పదాన్ని పరిచయం చేసినప్పుడు, బ్రహ్మ ఎవరో కొత్త వ్యక్తి అనుకుంటాము. అందువల్ల శాస్త్రాన్ని సంవత్సరాల తరబడీ అధ్యయనం చేసినా కూడా బ్రహ్మదర్శనం కలగాలని కోరుకుంటాము. బ్రహ్మదర్శనం అవ్వాలని గంటల తరబడీ ధ్యానం చేస్తాము. పైగా, 'నాకు బ్రహ్మ గురించి చక్కగా అర్థమయింది, కాని ఆ బ్రహ్మ సాక్షాత్కారం ఎప్పుడవుతుందో!' అని బాధపడతాము.

అందువల్ల ఒక విషయం బాగా గుర్తు పెట్టుకోవాలి. బ్రహ్మ అంటే కొత్తగా తెలుసుకునే వస్తువు కాదు. బ్రహ్మ అంటే అందుబాటులో ఉన్న నేను (ఆత్మ) యొక్క కొత్త హోదా. అందువల్ల బ్రహ్మజ్ఞానం అంటే నాయొక్క బ్రహ్మత్వ హోదా లేదా నాయొక్క పరాప్రకృతి. ఇప్పుడు మనం అపరాప్రకృతితో మమేకం చెందుతున్నాము. బ్రహ్మజ్ఞానం పొందితే మన బ్రహ్మత్వహోదా తెలుసుకుంటాము.

**బ్రహ్మవిచారః = ఆత్మనః బ్రహ్మత్వ విచారః**

బ్రహ్మత్వహోదా కొత్త హోదా అయితే, విచారణ చెయ్యకముందు పాతహోదా ఏమిటి? **జీవత్వహోదా.** బ్రహ్మత్వహోదా తెలుసుకోవటంవల్ల, జీవత్వభ్రమను తొలగిస్తాము. తాడు హోదా తెలుసుకుంటే పాము భ్రమను తొలగించినట్టుగా, బ్రహ్మత్వహోదా తెలుసుకుంటే జీవత్వభ్రమను తొలగిస్తాము. అందువల్ల వ్యాసాచార్యులవారు ఏమీ పొరపాటు చెయ్యలేదు.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా = అథాతో ఆత్మజిజ్ఞాసా = అథాతో ఆత్మనః బ్రహ్మజిజ్ఞాసా**

ఆత్మనః బ్రహ్మత్వం అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యం.

ఈ సూత్రానికి సాధారణ విచారణ చూసినప్పుడు, అనుబంధ చతుష్టయం పరోక్ష అర్థం అనీ, అందులోని మూడవ అంశం విషయం అనీ చూశాము. అందువల్ల బ్రహ్మజిజ్ఞాసా పదం పరోక్షంగా విషయం పదాన్ని సూచిస్తుంది.

**బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మజ్ఞానంకోసం వేదాంత విచారణ – ప్రత్యక్ష అర్థం.**
**బ్రహ్మజిజ్ఞాసా= విషయం – పరోక్ష అర్థం.**

ఇప్పటివరకూ సూత్రంలో ఉన్న మూడు పదాలనూ చూసేశాము. వీటిలో మొదటి పదమైన అథ పరోక్షంగా అధికారిని, రెండవ పదమైన అతః ప్రయోజనాన్నీ, మూడవ పదమైన బ్రహ్మజిజ్ఞాసా విషయాన్ని సూచిస్తాయి. కాని దానికి కర్తవ్యా కలుపుకున్నాము.

అథాతో బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా

ఇప్పుడు దాని అర్థం కూడా చూద్దాము.

**కర్తవ్యా** – కర్తవ్యాఅంటే చేసితీరాలని అర్థం. కర్తవ్యా పదం ఎందుకు వాడాలి? దీన్ని **విధిలింగ్** అంటారు. దీన్ని ఆజ్ఞావాక్యం అంటారు. చేసితీరాలనే అర్థం వచ్చే చోట ఉపనిషత్తు తవ్యకారాన్ని ఉపయోగిస్తుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః –**
బృహదారణ్యకమ్ 2.4.5

ఇవన్నీ తవ్యకారంతో ముగుస్తున్నాయి. వీటన్నిటినీ కలిపి ఒక్కపదంలో వాడాము కర్–తవ్య. దీన్నిబట్టి కర్తవ్య అంటే శ్రోతవ్య, మంతవ్య, నిదిధ్యాసితవ్య

అని అర్థం చేసుకోవాలి. వీటి అర్థాలు వరుసగా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అని చూశాము.

కర్తవ్యా = శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

ఇక్కడితో నాలుగు పదాల విశ్లేషణ అయిపోయింది. ఇప్పుడా పదాలకు వచ్చిన అర్థాలన్నింటినీ క్రోడీకరిస్తే సంస్కృతంలో ఆ వాక్యం వస్తుంది.

అథాతో బ్రహ్మజిజ్ఞాసా (కర్తవ్యా) – పూర్తి అర్థం

**సాధన చతుష్టయ సంపత్తి అనంతరం, బ్రహ్మజ్ఞానాయ వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనాని కర్తవ్యాని, యస్మాత్ బ్రహ్మజ్ఞానాత్ ఏవ మోక్షః న తు కర్మణ**

**సాధన చతుష్టయ సంపత్తి పొందాక, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని, కర్మవల్ల రాదు కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటంకోసం వేదాంతశాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసితీరాలి.**

ఉపసంహారంలోకి వెళ్ళేముందు ఎవరికైనా కలిగే రెండు సందేహాలను కూడా చూద్దాము.

**1. నేనేం చేయాలి?** ఎవరికైనా ఇదంతా విన్నాక, వ్యాసాచార్యులవారిని నేనేం చేయాలని అడిగితే, ఆయన దానికి జవాబు చెప్పకుండా, వారిని తిరిగి ప్రశ్నిస్తారు, 'పూర్వజన్మలో నువ్వు సాధన చతుష్టయ సంపత్తిని పొందావా?'

'ఆ, నేను పొందాను.'

'అయితే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యి.'

ఒకవేళ సాధన చతుష్టయ సంపత్తి పొందలేదు అంటే, పూర్వమీమాంసద్వారా సాధనచతుష్టయ సంపత్తి పొంది, వేదాంత విచారణ చెయ్యి అంటారు. అంటే అందరికీ ఒకటే జవాబు కాదు. వారి స్థాయీభేదాలనుబట్టి సలహా ఉంటుంది.

మళ్ళీ పూర్వమీమాంస చెయ్యాలంటే దాన్ని అక్షరాలా తీసుకోకూడదు. నిజంగా పూర్వమీమాంస అధ్యయనం చెయ్యనవసరం లేదు. కర్మయోగం, ఉపాసనయోగం పాటిస్తే చాలు. వాటి గురించి పూర్వమీమాంసలో చూడటమో, లేదా అది తెలిసినవారిని అడిగి తెలుసుకోవటమో చేస్తే చాలు. ఉదాహరణకు

శ్రాద్ధకర్మలు ఎలా పెట్టాలో, సంధ్యావందనం ఎలా చేయాలో ఏ బ్రాహ్మణుని అయినా అడిగి తెలుసుకుంటే చాలు. వీటన్నిటి సారాంశం ఒక్కటే. పూర్వమీమాంసలో నిర్దేశించిన జీవన విధానాన్ని పాటించాలి. అంటే కర్మయోగం, ఉపాసన యోగాలను పాటించాలి. వాటిని పాటించి జ్ఞానం పొందాలి.

2. **వేదాంతవిచారణ మానేయాలా?** అంటే ఇప్పుడు నేను వేదాంతవిచారణ మానేయాలా? సాధన చతుష్టయ సంపత్తి పొందకుండా, కర్మ, ఉపాసనలు పాటించకుండా, వేదాంత విచారణ చెయ్యకూడదు అంటున్నారు కదా. అయితే నేను బ్రహ్మసూత్రములను వదిలేసి ధర్మసూత్రాలకు వెళ్ళాలా?

అథాతో ధర్మజిజ్ఞాసా

సూత్రంతో మొదలుపెట్టాలా? **అవసరం లేదు.** వేదాంత విచారణ చేస్తూ, సాధనచతుష్టయ సంపత్తిని పెంచుకునే ప్రయత్నాన్ని తీవ్రతరం చెయ్యవచ్చు. సాధనచతుష్టయ సంపత్తి పెరిగినకొద్దీ, వేదాంతవిచారణ అంతకంతకూ అర్థవంతంగా, ప్రయోజనకరంగా, ముఖ్యవిషయంగా తెలుస్తుంది. ఆ సంపద రానంతవరకూ అది కేవలం కొత్త జ్ఞానాన్ని పొందటానికి తోడ్పడుతుంది అంతే. అలాగని మానేయవద్దు. దీన్ని కేవలం కొత్త విద్యలాగా నేర్చుకుంటున్నా కూడా, సాధన చతుష్టయ సంపత్తి పెరిగినకొద్దీ, ఈ విద్య మన జీవితంలో రోజురోజుకూ ఉపయోగపడుతుంది. ఏదో కాలక్షేపానికని మొదలుపెట్టిన విద్య అర్థవంతంగా మారుతుంది.

దీనికొక ఉదాహరణ చూద్దాము. ఒక చీకటిగదిలో ఒక బల్బు పెడదామనుకున్నారనుకోండి. బల్బును హోల్డర్‌లో పెట్టి, వైరుతో దాన్ని ఒక స్విచ్‌కు కలపాలి. దీన్ని రెండు రకాలుగా చెయ్యవచ్చు. ముందే వైరును స్విచ్‌కు కలిపి, తర్వాత బల్బు పెట్టవచ్చు. ఈ పద్ధతిలో చేస్తే బల్బు పెట్టిన మరుక్షణం చీకటిగది దేదీప్యమానంగా వెలిగి, అంతవరకూ అలుముకున్న చీకట్లను పారద్రోలుతుంది.

దాని బదులు ముందు బల్బును పెట్టారనుకోండి. బల్బు వెలగదు. బల్బు అక్కడే ఉంటుంది కాని, దాన్ని ఎందుకు పెట్టారో ఆ ఉద్దేశం నెరవేరదు. అంటే చీకటి అలాగే రాజ్యమేలుతుంది. ఆ బల్బుకున్న వైరును తీసుకెళ్ళి స్విచ్‌తో కలిపితేనే అది వెలుగుతుంది.

ఇప్పుడు సాధన చతుష్టయ సంపత్తి, ఈ ఉదాహరణలో చూసిన స్విచ్, వైరు. వేదాంతజ్ఞానం బల్బు. వైరును స్విచ్‌తో కలిపాక బల్బు వేస్తే బల్బు వెలుగుతుందని చూశాము కదా. అంటే సాధన చతుష్టయ సంపత్తి అనే స్విచ్ వేశాక, వేదాంతజ్ఞానం అనే బల్బు పెడితే, అది టక్కున వెలుగుతుంది. అంటే మనలో జ్ఞానం వెంటనే కలుగుతుంది.

కాని ఇప్పుడు కలియుగంలో మనకు అన్నీ క్షణాలమీద జరిగిపోవాలి. అందువల్ల ముందు వేదాంత బల్బును వెలిగిస్తున్నాము. దాన్ని సాధన చతుష్టయ సంపత్తి అనే స్విచ్‌తో కలిపితే, మన జీవితంలో ఉన్న చీకటి పారిపోతుంది. అంటే మన అజ్ఞానం తొలగిపోతుంది.

ఉదాహరణకూ, వేదాంతవిచారణకూ మధ్య చిన్న భేదం ఉంది. అక్కడ స్విచ్ వెయ్యగానే బల్బు వెలుగుతుంది. కాని జీవితంలో మన జీవన విధానంలో మార్పు వచ్చినకొద్దీ, వేదాంత బల్బు కాంతి పెరుగుతూ వస్తుంది. దీనికి సమయం పడుతుంది.

జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా, ప్రజ్ఞను స్థితప్రజ్ఞగా, పరోక్షజ్ఞానాన్ని అపరోక్షజ్ఞానంగా, ప్రతిబంధకాలను అప్రతిబంధకాలుగా మలుచుకునేందుకు ప్రయత్నించాలి. అందువల్ల వేదాంత విచారణను మానేయనవసరం లేదు. అది చేస్తూ, ఆశ్రమధర్మాలను పాటిస్తే, సాధనచతుష్టయ సంపత్తి కలుగుతుంది.

దీనితో మొదటి సూత్రంయొక్క పదవిశ్లేషణ ముగిసింది.

## ఉపసంహారం

ఉపసంహారంలో బ్రహ్మసూత్రాన్ని సాంకేతిక పద్ధతిలో వివరిస్తాము.

ఉపోద్ఘాతంలో ప్రతి అంశాన్ని అధికరణం అంటారనీ, ఒక్కొక్క అధికరణంలోనూ ఒకటి కాని, అంతకన్నా ఎక్కువ కాని సూత్రములు ఉండవచ్చని కూడా చూశాము. మొదటి అధికరణంలో ఒక్కటే సూత్రం ఉంది. అందువల్ల మొదటి సూత్రమే మొదటి అంశం కూడా అవుతుంది. అధికరణం పేరు అందులో ఉన్న మొదటి సూత్రమునుంచి వస్తుంది.

సూత్రము – **అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – అధికరణం – **జిజ్ఞాసాధికరణమ్**

అధికరణానికి ఒక ప్రత్యేక పద్ధతి ఉంటుంది. ఉదాహరణకు ఉత్తరాలు రాసేటప్పుడు కొన్ని నియమాలు ఉంటాయి. ఫ్రమ్ అడ్రసు, టు అడ్రసు, సంబోధన, ముగింపు, సంతకంవంటి వాటికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది, ప్రత్యేకమైన పద్ధతి కూడా ఉంటుంది. అలా అధికరణానికి కూడా ఒక పద్ధతి ఉందని, దాన్ని సూచించే శ్లోకం కూడా ఉందనీ చూశాము.

**విషయో సంశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**

**సంగతి శ్చేతి పంచకం శాస్త్రేఽధికరణం స్మృతమ్**

ప్రతి అధికరణంలోనూ 5 అంశాలు ఉంటాయి.

1. విషయః – విషయం
2. సంశయః – సంశయం
3. పూర్వపక్షః – పూర్వపక్షుల వాదన
4. ఉత్తరమ్ – అద్వైతసిద్ధాంతి జవాబు
5. సంగతిః – సంబంధం.

శంకరులవారు దీన్ని అద్భుతంగా చేస్తారు. దీన్ని అధికరణ నిర్ణయః అంటారు.

## జిజ్ఞాసాధికరణానికి అధికరణ నిర్ణయము

**1. విషయః** – విషయం. విషయం మొత్తం వేదాంత శాస్త్రం.

**2. సంశయః** – సంశయం. వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేయాలా, వద్దా? **విచారణీయం వా? న విచారణీయం వా?**

**3. పూర్వపక్షః** – పూర్వపక్షుల వాదన. పూర్వపక్షి ఊరికే సందేహం చూపి ఊరుకోకూడదు. తన వాదనను సమర్థించుకోవటానికి యుక్తిప్రమాణాన్ని ఉపయోగించాలి. అందువల్ల అతని వాదనకు ఎప్పుడూ ఒక అనుమానవాక్యం ఉంటుంది. ఇక్కడ కూడా అనుమానవాక్యం ఉంది. అది –

**వేదాంతశాస్త్రం న విచారణీయమ్ అనుబంధ చతుష్టయ అభావాత్ వ్యతిరేకేణ ధర్మశాస్త్రవత్**

వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యకూడదు, ఎందుకంటే దానికి అనుబంధ చతుష్టయం లేదు. ధర్మశాస్త్రానికి ఉన్నట్టుగా వేదాంతశాస్త్రానికి లేదు అంటాడు పూర్వపక్షి.

అనుబంధ చతుష్టయం లేదని అతను ఏ విధంగా వాదిస్తున్నాడో చూద్దాము. అనుబంధ చతుష్టయంలో నాలుగు అంశాలు ఉండాలని చూశాము. అవి అధికారి, విషయం, ప్రయోజనం, సంబంధం.

**ఎ) అధికారి** – అసలు ఎవరూ అధికారి కాలేరు. ఎవరికీ వివేకం లేదు; వైరాగ్యం అసలే కలగదు; శమాది షట్కసంపత్తి అంత తేలికగా అబ్బదు. ముముక్షుత్వం ఉండటం కలలోని మాట. అలాంటి అధికారిని కఠోపనిషత్తులోనే చూస్తాము. అందువల్ల **అధికారి నాస్తి** అంటాడు.

**బి) విషయం** – బ్రహ్మ అనే వస్తువు లేనేలేదు. ఎక్కడైనా నిర్గుణబ్రహ్మ ఉంటుందా?

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్** – కఠ 1-3-15

ఆత్మ ఇంద్రియాలకు అందదు. దానికి రంగు, రుచి, రూపులు లేవు అంటారు. అదేపనిగా మెదడుని తినటం తప్ప వేరే ఏమీ కాదు. నిర్గుణబ్రహ్మ ఉన్నాడనుకోవటం గురువు భ్రమ. గురువు తను అంధకారంలో ఉండి, ఆ అంధకారాన్ని శిష్యునికి అందజేస్తున్నాడు.

నిర్గుణబ్రహ్మను పక్కనపెట్టండి, ఆత్మ ఉంది అన్నా కూడా ఒప్పుకోము అంటున్నాడు పూర్వపక్షి. ఆత్మ అంటూ ఏదీ లేదు. చైతన్యం ఉన్నట్టు ఎవరూ ఇంతవరకూ నిరూపించలేకపోయారు. అందువల్ల **విషయం నాస్తిః** అంటాడు.

**సి) ప్రయోజనం** – బ్రహ్మ అనేదే లేనప్పుడు, ప్రయోజనం ప్రశ్న ఎక్కడ ఉదయిస్తుంది? అది దేవతావస్త్రాలలాంటివి. మన చిన్నప్పుడు ఈ దేవతావస్త్రాలు కథ వచ్చింది. ఒక రాజుకు దేవతా వస్త్రాలు ప్రత్యేకంగా నేయించామని, వాటిని స్వచ్ఛమైన మనస్సు ఉన్న వ్యక్తి మాత్రమే చూడగలరనీ ఆయనను నమ్మించారు. పాపం ఆ రాజును దిగంబరంగా ఊరంతా ఊరేగిస్తున్నారు కాని ఎవరికీ ఆయనమీద వస్త్రాలు లేవని చెప్పే ధైర్యం లేదు. ఎందుకు? అప్పుడు వారికి స్వచ్ఛమైన మనస్సు లేదని ఒప్పుకున్నట్టు అవుతుంది. కాని ఇదేమీ తెలియని ఒక చిన్నపిల్లవాడు ఆశ్చర్యంగా అరిచాడు, 'అదేమిటి రాజు బట్టలు లేకుండా వెళుతున్నాడు?'

ఆ రాజుయొక్క దేవతావస్త్రాల వ్యవహారంలాగా ఉంది ఈ నిర్గుణబ్రహ్మ వ్యవహారం. సాధన చతుష్టయ సంపత్తి ఉన్న వ్యక్తి మాత్రమే చూడగలడని బుకాయిస్తున్నారు మీరు. సంసారాన్ని ఈ దేవతావస్త్రాలతో కప్పుదామని చూస్తున్నారు. అందువల్ల ప్రయోజనం నాస్తి.

**డి) సంబంధం** – పై మూడు విషయాలే లేనప్పుడు, విషయానికి, గ్రంథానికి మధ్య సంబంధం ఎక్కడ ఉంటుంది? బ్రహ్మే లేనప్పుడు బ్రహ్మకూ, బ్రహ్మసూత్రములకూ మధ్య సంబంధం ఎలా ఉంటుంది? అందువల్ల– వేదాంత శాస్త్రం న విచారణీయమ్.

**4. ఉత్తరమ్** – అద్వైతసిద్ధాంతి జవాబు . దీన్ని సిద్ధాంత అనుమానవాక్యం అంటారు. అంటే అద్వైత సిద్ధాంతం ప్రకారం దాన్ని ఖండిస్తూ ఇంకొక అనుమానవాక్యాన్ని చూపించాలి.

**వేదాంతశాస్త్రం విచారణీయమ్ అనుబంధ చతుష్టయ వర్తత్వాత్ ధర్మశాస్త్రవత్**

అధికారి ఉన్నాడు; నిర్గుణబ్రహ్మ ఉంది; ప్రయోజనం ఉంది; సంబంధం ఉంది, ధర్మశాస్త్రానికి ఉన్నట్టుగా.

**అధికారి** – అధికారి అయిన శిష్యులు తక్కువ ఉన్నంత మాత్రాన అసలు లేరు అనేయకూడదు. భగవద్గీతలో కృష్ణపరమాత్మే ఒప్పుకుంటాడు –

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**

**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥** – గీత 7–3

అందువల్ల అధికారులు లేకపోలేదు, కాకపోతే తక్కువ ఉన్నారు అంతే.

**విషయం** – బ్రహ్మ ఉన్నాడు. ఎందుకంటే అది నువ్వే. బ్రహ్మ లేడంటే, నిన్ను నువ్వే కాదన్నట్టు అవుతుంది.

**ప్రయోజనం** – బ్రహ్మజ్ఞానంయొక్క ప్రయోజనం మోక్షం. ఎందరో మోక్షాన్ని పొందారు. నీకేదైనా అనుమానముంటే నువ్వు కూడా నేర్చుకుని చూడు, నీకూ ప్రయోజనం కలుగుతుంది.

**సంబంధం** – బ్రహ్మ ఉన్నాడు కాబట్టి బ్రహ్మకూ, బ్రహ్మసూత్రములకు మధ్య సంబంధం ఉంది. దీన్ని ప్రతిబాధ్య ప్రతిబాధక సంబంధం అంటారు.

అందువల్ల-

**అనుబంధ చతుష్టయమ్ అస్తి అతః వేదాంతశాస్త్రం విచారణీయమ్.**

**5. సంగతి** - సంబంధం. ముందు అధికరణంతో సంబంధం ఉండాలి. ఈ అధికరణమే మొదటి అధికరణమైతే దానికి దేనితో సంబంధం ఉంటుంది? రెండవ దానికి మొదటిదానితో ఉంటుంది, మూడవదానికి రెండవదానితో ఉంటుంది కాని మొదటిదానికి దేనితోనూ ఉండలేదు. అందువల్ల మొదటి అధ్యయనానికి సంగతి నియమాన్ని పాటించలేము.

**అధికరణ ఆద్యత్వాత్ సంగతిః నాస్తి**

అందువల్ల అనుబంధ చతుష్టయం చక్కగా సరిపోతుంది, అనుబంధ చతుష్టయం ఉంది కాబట్టి, వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యవచ్చు.

ఇక్కడితో మొదటి సూత్రం ముగిసింది. దీన్ని ఉపోద్ఘాత సూత్రం అంటారు. అది పరోక్షంగా అనుబంధ చతుష్టయాన్ని సూచిస్తుంది.

***

# సూత్రము 1 - ముఖ్యమైన అంశములు

## అథాతో బ్రహ్మజిజ్ఞాసా

| | | |
|---|---|---|
| అధ్యాయం | 1 పేరు | - సమన్వయ అధ్యాయము |
| పాదం | 1 పేరు | - స్పష్టబ్రహ్మలింగవాక్యవిచారణపాదః |
| అధికరణం | 1 పేరు | - జిజ్ఞాసాధికరణమ్ |
| సూత్రం | 1 | - అథాతో బ్రహ్మజిజ్ఞాసా |

**విశ్లేషణ మూడు దశల్లో**

ఎ) సామాన్య విచారణ - సూత్రంలో ఉన్న సారాన్ని ముందు చూస్తాము. ఉపనిషత్తుల్లోని ఏ వాక్యం దీనికి ఆధారమో చూస్తాము.

బి) పదవిశ్లేషణ - సూత్రంలో ఉన్న ఒక్కొక్క పదాన్నీ విశ్లేషిస్తాము. ఆ పదాలు ఉన్న వరుసక్రమంలో చూస్తాము.

సి) ఉపసంహారం - ఈ సూత్రంయొక్క ప్రత్యేకత, దాన్నించి వచ్చిన ఉపసిద్ధాంతాలు చూస్తాము.

### సామాన్య విచారణ

ఇందులో ప్రత్యక్ష అర్థం, పరోక్ష అర్థం చూస్తాము.-

**పరోక్ష అర్థం** - ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయసూత్రం అనుబంధ చతుష్టయం అంటే అధికారి, విషయం, ప్రయోజనం, సంబంధం.

అధికారి -శిష్యునిఅర్హత - సాధనచతుష్టయ సంపత్తి
- వివేకం, వైరాగ్యం, శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వం.

విషయం - అంశం - బ్రహ్మవిద్య

ప్రయోజనం - జ్ఞానఫలం - సంసార నివృత్తి అంటే మోక్షం

సంబంధం - అనుబంధం- ప్రతిబాధ్య ప్రతిబాధక సంబంధం ఉంది బ్రహ్మకు, బ్రహ్మసూత్రములకు.

**ప్రత్యక్ష అర్థం** - దాని తర్వాత, అందువలన బ్రహ్మవిచారణ చేయాలి. దీనికి అనుబంధిత ఉపనిషత్తు వాక్యాలను విషయ వాక్యం అంటారు. అవి -

**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥** -తైత్తిరీయమ్

సః విజిజ్ఞాసతవ్యః – ఛాందోగ్యమ్
శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్

ఈ మూడూ కలిపి – బ్రహ్మజిజ్ఞాసా (కర్తవ్యా)
కర్తవ్యా మనం కలుపుకోవాలి.

దశ 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా
దాని తరువాత, అందువలన బ్రహ్మవిచారణ చేసి తీరాలి.
దశ 2 – అథాతో వేదాంతశాస్త్ర విచారః కర్తవ్యా
దాని తరువాత, అందువలన బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్ర విచారణ చేసి తీరాలి.

దీనికి అనుమానవాక్యం
వేదాంతశాస్త్రమ్ ఆరంభనీయమ్ అనుబంధ చతుష్టయత్వాత్ ధర్మశాస్త్రవత్

పక్షం – వేదాంత శాస్త్రం – బ్రహ్మసూత్రములు
సాధ్యం – ఆరంభనీయం – అధ్యయనం చేయాలి
హేతువు – అనుబంధ చతుష్టయత్వాత్ – అనుబంధ చతుష్టయం ఉండటంవల్ల
దృష్టాంతం– ధర్మశాస్త్రవత్ – ధర్మశాస్త్రంలాగా
వ్యాప్తి వాక్యం– యత్ర యత్ర అనుబంధ చతుష్టయత్వం తత్ర తత్ర ఆరంభనీయత్వమ్

**సామాన్య విచారణలో**

**పరోక్ష అర్థం –** ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయసూత్రం.
**ప్రత్యక్ష అర్థం –** దాని తర్వాత, అందువలన బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్ర విచారణ చేసితీరాలి.

## పద విశ్లేషణ

అథాతో బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా – అథ + అతః + బ్రహ్మజిజ్ఞాసా + కర్తవ్యా

**అథ** – శబ్దరూప విచారణ, పదరూప విచారణ
శబ్దరూప విచారణ – మంగళకరం. ఓం, అథ పదాలను బ్రహ్మ ఉచ్ఛరించాడు.
అర్థరూప విచారణ – అనంతరం – సాధన చతుష్టయ సంపత్తి అనంతరం.

**యుక్తి ప్రమాణం** – అన్వయవ్యతిరేక న్యాయంద్వారా

**శ్రుతి ప్రమాణం** – ముండకమ్, కఠ, బృహదారణ్యకమ్.

పరీక్ష లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన
తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ – ముండకమ్ 1.2.12

ఇందులో వివేక, వైరాగ్య, ముముక్షుత్వాలను చూస్తాము.

అపి సర్వం జీవిత మల్పమేవ
తవైవ వాహాస్తవ నృత్యగీతే – కఠ 1.1.26
నువ్వే ఉంచుకో – వైరాగ్యం

న విత్తేన తర్పణీయో మనుష్యః – కఠ 1.1.27
మనుష్యులు తృప్తి చెందరు – వివేకం

యోஉయం వరో గూఢ మనుప్రవిష్టో
నాన్యం తస్మాన్నచికేతా వృణీతే – 1.1.29
గూఢంగా ఉన్న విద్యను తప్ప నచికేతుకు ఏదీ కోరడు – ముముక్షుత్వం

శాంతోదాంత ఉపరతతితీక్షు సమాహితో భూత్వా – బృహదారణ్యకమ్
శమం, దమం, ఉపరమం, తితీక్ష, సమాధానం – వచ్చాయి

శ్రద్ధా – బృహదారణ్యకమ్(ఇంకో శాఖ) – శ్రద్ధ వచ్చింది

**శంకరులవారి విచారణ** – అథ = సాధన చతుష్టయ సంపత్తి అనంతరం.

**పూర్వమీమాంసకుని వాదన**

1. పూర్వమీమాంసా, ఉత్తరమీమాంసా పదాలే వేద పూర్వభాగాన్ని అధ్యయనం చేశాక, ఉత్తరమీమాంసను అధ్యయనం చేయాలి అంటున్నాయి.

2. జ్ఞానకర్మ సముచ్చయం చేయాలి.
   అథ = పూర్వమీమాంసా అనంతరం
   **శంకరుల వారి జవాబు** – యుక్తి ప్రమాణం

1. వ్యభిచార దోషం – సమన్వయ దోషం ఉంది.
   ఎ) పూర్వమీమాంసా అనంతరం అంటే అర్హత లేని వ్యక్తి వేదాంతంలోకి వచ్చే ప్రమాదముంది.
   బి) పూర్వమీమాంసా అనంతరం అంటే అర్హత ఉన్న వ్యక్తి వేదాంతానికి రాలేని దుస్థితి ఉంది.
2. జ్ఞానకర్మ సముచ్చయానికి మూడు భేదాలు ఉన్నాయి.

| **భేదం** | **కర్మ** | **జ్ఞానం** |
|---|---|---|
| విషయభేదం | సాధ్యవస్తువు | సిద్ధవస్తువు |
| ప్రయోజనభేదం | అనిత్యఫలం | నిత్యఫలం |
| ప్రవృత్తిభేదం | ప్రవర్తకం | అప్రవర్తకం |

**శ్రుతి ప్రమాణం** – కర్మజ్ఞానం ఒకదాని తర్వాత ఒకటి చేయాలని శ్రుతి ప్రమాణం లేదు.

పూర్వమీమాంసలో ఏకకర్తృ కర్తృత్వానికి మూడు నియమాలు ఉన్నాయి.

**యత్ర యత్ర ఏకకర్తృకర్త్వం తత్ర తత్ర క్రమత్వమ్**

ఎక్కడ ఒక్కరే కర్మ చెయ్యాలో అక్కడ క్రమత్వం ఉంటుంది.

| | | |
|---|---|---|
| ఏక ప్రధాన శేషత్వం | – | ఒక ప్రధాన యజ్ఞం, కొన్ని సహకారీ యజ్ఞాలు ఉంటే ఒక్కరే చేయాలి. |
| శేష శేషిత్వం | – | ఒక ప్రధాన యజ్ఞం, ఒక సహకారీ యజ్ఞం ఉన్నా ఒక్కరే చేయాలి. |
| అధికృత అధికారత్వం | – | రెండు ప్రధాన యజ్ఞాలు ఉన్నా, ఒకటి చేస్తేనే రెండవదానికి అర్హుడు అయినప్పుడు ఒక్కరే చేయాలి. |

కాని అలా పూర్వమీమాంస అయ్యాక ఉత్తర మీమాంసకు రావాలని లేదు.

**పూర్వపక్షి వాదన**

బ్రహ్మచర్యం పరిసమాప్య గృహీ భవేత్। గృహీభూత్వా వనీభవేత్, వనీభూత్వా ప్రవ్రజేత్ – జాబాలోపనిషత్తు

బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం అయ్యాక సన్న్యాసి అవ్వాలి. అంటే కర్మ, ఉపాసన చేయాలి – అంటే పూర్వమీమాంస అధ్యయనం చేయాలి.

**సిద్ధాంతి జవాబు**

అదే జాబాలోపనిషత్తులో అథవా అని దాని వెంటనే ఉంది. అంటే కాని – బ్రహ్మచర్యంనుంచి సన్న్యాసానికి (జ్ఞానానికి) రావచ్చు. పూర్వమీమాంస చేసి తీరనవసరం లేదు. కాని సాధన చతుష్టయ సంపత్తి ఉండితీరాలి.

అథ = సాధన చతుష్టయ సంపత్తి అనంతం – ప్రత్యక్ష అర్థం.

అథ = అధికారి – పరోక్ష అర్థం.

**అతః** – అతః అంటే అందువల్ల.

అతః = కర్మ మోక్షాన్ని ఇవ్వదు, జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది కాబట్టి.

**శ్రుతి ప్రమాణం**

న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః – కైవల్యమ్
కర్మవల్ల మోక్షం రాదు.

**యుక్తి ప్రమాణం**

జ్ఞానం పొందితేనే సంసారం పోతుంది. అజ్ఞానం = సంసారం.
మోక్షం అంటే సంసారనివృత్తి

**అనుభవ ప్రమాణం**

తాడును చూసి పాము అనుకుంటే కలిగే భయం అది తాడు అని తెలిస్తే పోతుంది. అలాగే నిజంగా లేని సంసారాన్ని ఆత్మ–అనాత్మల గురించిన అజ్ఞానంవల్ల ఏర్పరచుకున్నాము. ఆత్మ అజ్ఞానం పోతే, దానివల్ల జనించిన సంసారం పోతుంది.

అతః = జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల మోక్షం రాదు
– ప్రత్యక్ష అర్థం.

అతః = ప్రయోజనం – పరోక్ష అర్థం.

**బ్రహ్మజిజ్ఞాసా – బ్రహ్మ + జిజ్ఞా + సా**

**బ్రహ్మ = బ్రహ్మజ్ఞానాయ వేదాంతవిచారః**

**జిజ్ఞా = దృఢ అపరోక్ష బ్రహ్మజ్ఞానాయ**

**సా = వేదాంతవిచారః కర్తవ్యా**

బ్రహ్మజిజ్ఞాస = బ్రహ్మజ్ఞానాయ వేదాంతవిచారః

**పూర్వపక్షి వాదన** – అనుమానవాక్యం ఆధారంగా

సంసారం ఆరోపించబడింది, అధిష్ఠానం ఆత్మ. అందువల్ల ఆత్మజ్ఞానం పొందితే, సంసారం పోవాలి, బ్రహ్మజ్ఞానం పొందితే కాదు.

**సిద్ధాంతి జవాబు**

బ్రహ్మ = ఆత్మ

తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి॥ –తైత్తిరీయమ్

ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్

ఒకటి బ్రహ్మ అంటే, ఇంకొకటి ఆత్మ అంది.

బ్రహ్మ విచారః = ఆత్మనః బ్రహ్మత్వ విచారః – నా బ్రహ్మత్వ హోదా గురించిన విచారణ

బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మజ్ఞానంకోసం వేదాంత విచారణ – ప్రత్యక్ష అర్థం.

బ్రహ్మజిజ్ఞాసా = విషయం – పరోక్ష అర్థం.

**కర్తవ్యా** – చేసితీరాలి. విధిలింగ్ లేదా ఆజ్ఞావాక్యం

ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్

వీటన్నిటినీ కలిపి కర్–తవ్య.

కర్తవ్యా – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

అథాతో బ్రహ్మజిజ్ఞాసా కర్తవ్యా – పూర్తి అర్థం.

**సాధన చతుష్టయ సంపత్తి అనంతరం బ్రహ్మజ్ఞానాయ వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనాని కర్తవ్యాని యస్మాత్ బ్రహ్మజ్ఞానాత్ ఏవ మోక్షః నతు కర్మణా**

సాధన చతుష్టయ సంపత్తి పొందాక, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల రాదు కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటంకోసం వేదాంతశాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి తీరాలి.

## ఉపసంహారం – అధికరణ నిర్ణయం

1. విషయః – విషయం
2. సంశయః – సంశయం
3. పూర్వపక్షః – పూర్వపక్షుల వాదన
4. ఉత్తరమ్ – అద్వైతసిద్ధాంతి జవాబు
5. సంగతిః – సంబంధం.

| | **పూర్వపక్షి వాదన** | **సిద్ధాంతి జవాబు** |
|---|---|---|
| **అంశం** | ఎవరూ అధికారి కాలేరు | ఉన్నారు కాని చాలా తక్కువ మంది |
| **విషయం** | బ్రహ్మ అనే వస్తువు లేనేలేదు | బ్రహ్మ ఉన్నాడు, అది నువ్వే |
| **ప్రయోజనం** | బ్రహ్మే లేకపోతే ప్రయోజనం ఎక్కడ? | మోక్షం ప్రయోజనం, ఎందరో మోక్షాన్ని పొందారు. |
| **సంబంధం** | బ్రహ్మే లేనప్పుడు బ్రహ్మకూ బ్రహ్మసూత్రములకూ, మధ్య సంబంధం ఎక్కడ? | బ్రహ్మ ఉన్నాడు కాబట్టి బ్రహ్మకూ, బ్రహ్మసూత్రములకూ, మధ్య సంబంధముంది |
| | వేదాంతశాస్త్రం న విచారణీయమ్ అనుబంధ చతుష్టయ అభావాత్ వ్యతేరేకేణ ధర్మశాస్త్రవత్ | వేదాంతశాస్త్రం విచారణీయమ్ అనుబంధ చతుష్టయ వర్తత్వాత్ ధర్మశాస్త్రవత్ |

**సంగతి** – మొదటి సూత్రం కాబట్టి ఇంకొక సూత్రంతో సంబంధం ఉండదు. అధికరణ ఆద్యత్వాత్ సంగతిః నాస్తి దీనితో మొదటి సూత్రం ముగిసింది. దీన్ని ఉపోద్ఘాత సూత్రం, అనుబంధ చతుష్టయ సూత్రం అంటారు.

**రెండు సందేహాలకు సమాధానాలు**

1. **నేనేం చేయాలి?**

సాధనచతుష్టయ సంపత్తి ఉంటే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

లేకపోతే పూర్వమీమాంసలోని కర్మ + ఉపాసనల గురించి తెలుసుకుని కర్మయోగం, ఉపాసనయోగాలను పాటించాలి.

2. **వేదాంత విచారణ మానేయాలా?**

అవసరం లేదు. వేదాంతవిచారణ చేస్తూ సాధన చతుష్టయ సంపత్తిని పెంచుకోవచ్చు.

బల్బు పెట్టి స్విచ్‌కు వైరుని కనెక్టు చెయ్యవచ్చు.
స్విచ్‌కు వైరుని కనెక్టు చేశాక బల్బు పెట్టవచ్చు.

ఎలా చేసినా జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవాలి; పరోక్షజ్ఞానాన్ని అపరోక్ష జ్ఞానంగా మలుచుకోవాలి.

నేను = ఆత్మ = బ్రహ్మ అని జీర్ణించుకోవాలి.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా = అథాతో ఆత్మజిజ్ఞాసా =**
**అథాతో ఆత్మనః బ్రహ్మజిజ్ఞాసా = ఐక్యం.**

***

# సూత్రము 2 – జన్మాద్యస్య యతః

**రెండవ సూత్రానికి ఉపోద్ఘాతం**

బ్రహ్మసూత్రములకు ఉపోద్ఘాతం చెప్పాక, వ్యాసాచార్యులవారు రెండవ సూత్రం నుంచి అసలు విషయంలోకి అడుగుపెట్టబోతున్నారు. ఎలాగైతే భగవద్గీతలోని రెండవ అధ్యాయం ఆ శాస్త్రానికి ఆరంభ అధ్యాయమో, అలాగే బ్రహ్మసూత్రములలో రెండవసూత్రం ఈ న్యాయశాస్త్రానికి ఆరంభసూత్రం.

రెండవసూత్రం, రెండవ అధికరణంలోకి వస్తుంది. ఈ అధికరణంలో కూడా ఒక్కటే సూత్రం ఉంది. ఒక అధికరణంలో ఒక్క సూత్రమే ఉండవచ్చు లేదా అంతకన్నా ఎక్కువ సూత్రాలు ఉండవచ్చని చూశాము. అధికరణం పేరు దానిలోని సూత్రంనుంచి వస్తుందని కూడా చూశాము.

| సూత్రం | అధికరణం | |
|---|---|---|
| 1. అథాతో బ్రహ్మజిజ్ఞాసా | జిజ్ఞాస అధికరణం | జిజ్ఞాసాధికరణమ్ |
| 2. జన్మాద్యస్య యతః | జన్మాది అధికరణం | జన్మాద్యధికరణమ్ |

ఈ సూత్రం జన్మాదస్య యతః కాబట్టి మొదటిభాగంనుంచి జన్మాది అధికరణం అని పేరు వచ్చింది. ఈ సూత్రంలో విషయం లేదా అంశం – బ్రహ్మలక్షణం. బ్రహ్మలక్షణం అంటే బ్రహ్మ నిర్వచనం. అందువల్ల ఈ సూత్రాన్ని **బ్రహ్మలక్షణ సూత్రం** అని కూడా అంటారు. మొదటి సూత్రం ఉపోద్ఘాతం కాబట్టి దాన్ని ఉపోద్ఘాతసూత్రం అంటారని చూశాము. లక్షణం అంటే నిర్వచనం. నిర్వచనాన్ని నిర్వచించే నిర్వచనం ఉంది శాస్త్రంలో.

**లక్షణ ప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః**

అంటే ఏదైనా వస్తువును రెండు అంశాలద్వారా నిరూపిస్తాము. అవి లక్షణం; ప్రమాణం. లక్షణం అంటే నిర్వచనం అయితే ప్రమాణం అంటే జ్ఞానం పొందటానికి వాడే పరికరం. ఒక వస్తువు ఉందని నిరూపిస్తేనే, ఆ వస్తువు గురించి విచారణ చేసే అవకాశం ఉంది.

ఉదాహరణకు 'పినాకపాణిగారు సోఫాలో కూర్చున్నారా, కుర్చీలో కూర్చున్నారా?' ఎవరైనా మిమ్మల్ని ఆ ప్రశ్న అడిగితే, ముందు మీరు తిరిగి ఇంకొక ప్రశ్న వేస్తారు, 'అసలీ పినాకపాణి ఎవరు?' పినాకపాణే ఎవరో

తెలియనప్పుడు, ఆయన సోఫాలో కూర్చున్నారో, కుర్చీలో కూర్చున్నారో ఎలా తెలుస్తుంది మీకు. అందువల్ల ఆయన గురించి ఎక్కడ కూర్చున్నారో విచారణ చెయ్యాలంటే, ముందు మీకు ఆయన గురించి తెలిసివుండాలి. అంటే విచారణ చెయ్యటానికి లక్షణం తెలిసివుండాలి.

కాని అక్కడితో సమస్య తీరలేదు. ఆ విచారణ చెయ్యటానికి సరియైన ప్రమాణం కూడా ఉండాలి. అంటే మీ కన్ను పనిచేయాలి. ఇప్పుడు మీకు పినాకపాణి ఎవరో తెలుసు. ఆయన ఎక్కడ కూర్చున్నారో చూడాలంటే, మీ కన్ను అనే ప్రమాణం మీకు బాగా పనిచేస్తేనే, ఆయనను పట్టుకోగలరు.

దీనికి ఇంకొక ఉదాహరణ కూడా చూద్దాము. మీరు ఒక బాలుణ్ణి, 'ఆకాశంలో చందమామ ఉన్నాడా?' అని అడిగారు. ఆ బాలునికి కళ్ళు సూదంటురాయిలా బాగా పనిచేస్తున్నాయి. కాని చందమామ ఎవరో తెలియదు. పైకి చూస్తే ఆకాశం, నక్షత్రాలు, చంద్రుడు కూడా కనిపిస్తాయి కాని వాటిలో చంద్రుడెవరో తెలియదు. అంటే అతని ప్రమాణం బాగా పనిచేస్తోంది కాని అతనికి చంద్రుని లక్షణం తెలియదు. ఇంకొక బాలుడు చంద్రుని గురించి నేర్చుకున్నాడు. 'ఆకాశంలో అన్నిటికన్నా పెద్దగా ఉండి, బాగా మెరిసేది చంద్రుడు.' కాని అది కళ్ళారా చూడటానికి అతనికి కళ్ళు లేవు. అంటే ఈ బాలునికి చంద్రుని లక్షణం తెలుసు కాని, ప్రమాణం లేదు. అంటే ఒకరికి లక్షణం తెలియదు, ప్రమాణం ఉంది. ఇంకొకరికి లక్షణం తెలుసు, ప్రమాణం లేదు. అందువల్ల ఇద్దరూ చంద్రుడిని చూడలేరు.

**లక్షణ సత్వే అపి ప్రమాణం వినా న వస్తుసిద్ధిః।**
**ప్రమాణ సత్వే అపి లక్షణం వినా న వస్తుసిద్ధిః।**
**యత్ర లక్షణం వర్తతే। ప్రమాణం చ వర్తతే। తత్ర ఏవ వస్తునః సిద్ధిః॥**

లక్షణం తెలిసి ప్రమాణం లేకపోయినా, వస్తువు తెలియదు. ప్రమాణం ఉండి, లక్షణం తెలియకపోయినా, వస్తువు తెలియదు. లక్షణం, ప్రమాణం రెండూ ఉంటేనే వస్తువు లభిస్తుంది. చంద్రుడు ఉన్నాడని లక్షణం, ప్రమాణంద్వారా తెలిశాకే చంద్రుని గురించిన వివరాలను జీవితకాలం వెచ్చించి తెలుసుకోవటానికి వీలుంటుంది.

**లక్షణం + ప్రమాణం = వస్తుసిద్ధి**

ఇప్పుడు మనం చేస్తున్నది బ్రహ్మవిచారణ – అథాతో బ్రహ్మజిజ్ఞాసా అని మొదటి సూత్రంలో చూశాము. బ్రహ్మవిచారణ ఎప్పుడు చెయ్యగలము? బ్రహ్మ అనే ఒక వస్తువు ఉందని తెలిస్తేనే! కుందేటి కొమ్ములాగా బ్రహ్మ లేకపోతే, ఆ లేని బ్రహ్మ గురించి ఎలా విచారణ చేస్తాము? అందువల్ల మనకు బ్రహ్మసిద్ధి ఉండాలి. బ్రహ్మసిద్ధి ఉండాలంటే బ్రహ్మలక్షణం తెలియాలి, బ్రహ్మ ప్రమాణం ఉండాలి.

వ్యాసాచార్యులవారు రెండవసూత్రంలో బ్రహ్మలక్షణాన్ని తెలిపితే, మూడవ సూత్రంలో బ్రహ్మ ప్రమాణాన్ని తెలుపుతారు.

ఈ సందర్భంలో శంకరాచార్యులు మొదటిసూత్రం చివర్లో చెప్పిన భాష్యాన్ని ఇక్కడ చూద్దాము. ఎందుకంటే ఇక్కడ అది బాగా అతికినట్టు సరిపోతుంది. ఆయన భాష్యం చెప్పారంటే పూర్వపక్షి వాదనను ఖండించారు అని అర్థం. అందువల్ల ముందు పూర్వపక్షి వాదన ఏమిటో తెలుసుకోవాలి.

**పూర్వపక్షి వాదన** – బ్రహ్మజిజ్ఞాసా చేయాలని వ్యాసాచార్యులవారు చెప్పారు, బాగానే ఉంది. 'కాని మీరు చేసే బ్రహ్మవిచారణ తెలిసిన బ్రహ్మ గురించా, తెలియని బ్రహ్మ గురించా?'

**జ్ఞాతబ్రహ్మ విచార్య వా। అజ్ఞాతబ్రహ్మ విచార్య వా।**

ఎటు చూసినా బ్రహ్మ విచారణ అవసరం లేదు. తెలిసిన బ్రహ్మ గురించి కొత్తగా తెలుసుకునేదేముంది? అందువల్ల అప్పుడు అవసరం లేదు. తెలియని బ్రహ్మ అయితే, బ్రహ్మ ఎవరో తెలియకపోతే, ఆ తెలియని విషయంమీద ఇంకా ఏం విచారణ చేస్తారు? ఆ విధంగా ఎలాచూసినా, బ్రహ్మవిచారణ అవసరం లేదు.

**శంకరులవారి జవాబు** – బ్రహ్మ తెలియని విషయం కాదు. వేదప్రమాణం ద్వారా బ్రహ్మ తెలుసు. అందువల్ల వేదంగురించి తెలిసినవారికే బ్రహ్మ అనే వస్తువు ఉందని తెలుస్తుంది.

**బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి** – ముండకమ్

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** – తైత్తిరీయమ్

బ్రహ్మపదం చాలా పెద్ద వస్తువుయొక్క ఉనికిని సూచిస్తుంది. బృహ్ ధాతునుంచి వచ్చింది బ్రహ్మ పదం.

**బృహతీ ఇతి బ్రహ్మ**

బృహత్ అంటే పెద్దది. అంటే ఒక పెద్ద వస్తువు ఉంది. అంతేకాదు ఈ పెద్ద అనే పదం మామూలుగా ఒక సాపేక్షిక పదం. దాన్ని వాడే సందర్భాన్నిబట్టి దాని అర్థం మారుతూ వస్తుంది. ఉదాహరణకు, పెద్ద పర్వతం అన్నారనుకోండి. పర్వతం చాలా పెద్దది, ఎంతో ఎత్తు ఉంటుంది, ఎన్నో మైళ్ళకు విస్తరించి ఉంటుంది. అదే పెద్దదోమ అన్నారనుకోండి. ఖచ్చితంగా అది పర్వతమంత పెద్దది కాదు కదా! అలాగే పెద్ద రక్తకణాలు అంటే, ఆ పెద్దవి కంటికి కనిపించవు, మైక్రోస్కోప్‌లో చూడాలి వాటిని. అందువల్ల 'పెద్ద' అనే ఆ విశేషణం, అది వర్ణించే నామవాచకంమీద ఆధారపడివుంటుంది.

మామూలుగా విశేషణం నిర్వచనం చూస్తే, నామవాచకంయొక్క గుణాన్ని తెలిపేది. ఉదా. – **మంచి** బాలుడు. బాలుడుయొక్క గుణాన్ని వివరిస్తున్నది కాని ఇక్కడ ఏమంటున్నాము? పెద్ద అనే విశేషణం అది నిర్వచించే నామవాచకం మీద ఆధారపడివుంది అంటున్నాము. అంటే పూర్తిగా దానికి భిన్నంగా చెబుతున్నాము.

ఇప్పుడు ఉపనిషత్తు బ్రహ్మ గురించి వివరిస్తున్నప్పుడు, ఈ పెద్ద అనే పదాన్ని విశేషణంగా కాదు, నామవాచకంగా వాడుతున్నది. అంటే అది సాపేక్షిక పదం కాదు. అదే పెద్దది. అంటే బ్రహ్మ పెద్ద x కాని, పెద్ద y కాని కాదు. అది ఎంత పెద్దదో దాన్ని పరిమితి చేసే నామవాచకం లేదు దాని తర్వాత. అంటే హద్దులు లేని పెద్దది బ్రహ్మ. ఉనికిని కూడా అలాగే వాడతాము. ఉనికి కూడా సాపేక్షిక పదం కాదు, నామవాచకము. చైతన్యం కూడా అంతే. అలా ఉనికి, చైతన్యం, బ్రహ్మ పదాలను నామవాచకాలుగా వాడుతుంది ఉపనిషత్తు.

అందువల్ల శంకరాచార్యులవారు మొదటి సూత్రానికి భాష్యం చెప్పినప్పుడు, ఒక అత్యంత పెద్ద బ్రహ్మ ఉందని మనకు తెలుసు అంటున్నారు. కాకపోతే అసలు అటువంటి పెద్ద వస్తువు ఉందా అని మనకు అనుమానం కలుగుతుంది. ఎందుకంటే అంత పెద్ద వస్తువు ఎన్నడూ మన అనుభవంలోకి రాలేదు. మనకు తెలిసిన వస్తువులు అన్నిటికీ దేశకాలవస్తు పరిమితులు ఉన్నాయి. అందువల్ల ఆ పెద్ద బ్రహ్మ ఎవరో కాదు ఆత్మే, అంటే నువ్వే అంటుంది ఉపనిషత్తు.

అంత అనంతమైన బ్రహ్మ, నేను అంటే బ్రహ్మ ఉన్నాడా లేదా అనే సందేహం నాకు కలుగకూడదు. ఎందుకు? బ్రహ్మ=నేను అయితే, బ్రహ్మ ఉన్నాడా లేడా అంటే నేను ఉన్నానా లేనా అని నన్ను నేను సందేహించుకున్నట్టు అవుతుంది. నాకు మేధస్సు ఉందా లేదా అని సందేహించవచ్చేమో కాని, నేను ఉన్నానా లేదా అనే సందేహానికి చోటే లేదు. నేను ఉన్నానా లేదా అనే సందేహమే నేను ఉన్నానని నిరూపిస్తోంది. సందేహించే వ్యక్తిని ఎన్నడూ సందేహించలేము, ఎందుకంటే సందేహించే వ్యక్తి లేకుండా సందేహానికి ఉనికి లేదు.

ఎవరికీ తన అస్తిత్వంమీద సందేహం ఉండదు కాబట్టి, బ్రహ్మ అస్తిత్వంమీద కూడా సందేహం ఉండదు. బ్రహ్మ ఉన్నాడని మనకు చెప్పింది వేదప్రమాణం. అందువల్ల ఈ విచారణ తెలిసిన బ్రహ్మ గురించే.

పూర్వపక్షి ప్రశ్నను ఇక్కడ మళ్ళీ గుర్తు తెచ్చుకుంటే – 'బ్రహ్మ గురించి వేదాలద్వారా తెలిస్తే, బ్రహ్మ విచారణ చెయ్యటం ఎందుకు?' అన్నాడు. పైగా మీకు బ్రహ్మ చాలా పెద్దది అనీ, బ్రహ్మే ఆత్మ అనీ, ఇలా ఎన్నో విషయాలు తెలుసు అంటాడు.

బ్రహ్మ గురించి తెలుసు నిజమే కాని, బ్రహ్మను ఆత్మ అంటుంది ఉపనిషత్తు. కాని ఈ ఆత్మ అంటే ఏమిటి? ఇక్కడే అనేక దర్శనాలు ఉన్నాయి. ఆత్మ గురించి స్పష్టంగా తెలిస్తేనే, బ్రహ్మ గురించి స్పష్టంగా తెలుస్తుంది. కాని ఆత్మ గురించి అనేక రకాల వాదనలు ఉన్నాయి అంటున్నారు శంకరులవారు.

## ఆత్మ గురించిన అనేక వాదనలు

**ఎ) చార్వాక దర్శనం** – చార్వాకులు శరీరమే ఆత్మ అంటారు. సూక్ష్మశరీరం ఉందని ఎవరికి తెలుసు? దేవతావస్త్రంవంటిది అది. అనవసరంగా, ఉందో లేదో తెలియని సూక్ష్మశరీరాన్ని తీసుకువస్తున్నారు. అంతేకాదు, దానికి ప్రయాణం ఉందంటున్నారు. సూక్ష్మశరీరం ఉందో లేదో తెలియనప్పుడు, దాని ప్రయాణం ఎవరు చూడవచ్చారు? పైగా ఇంకొక శరీరం తీసుకుంటుంది అంటున్నారు. అదీ ఎవరికీ తెలియదు. ఉన్నది ఈ శరీరం మాత్రమే. ఈ శరీరం గడియారంవంటిది. ఎప్పుడైతే ఇది పనిచెయ్యటం మానేస్తుందో, అప్పుడే ఈ జీవితం అయిపోతుంది.

బి) **బౌద్ధమతం** – మనస్సే ఆత్మ.

సి) **నైయాయిక దర్శనం** – శరీరం, మనస్సు ఆత్మ కాదు. వీటికి భిన్నంగా ఇంకొకటి ఉంది. అది ఆత్మ. కాని ఒక్కటే ఆత్మ లేదు, అనేక ఆత్మలు ఉన్నాయి.

ఫుట్‌బాల్ ఆట చూస్తున్న ఒక అమాయకుడు అడిగాడుట, 'ఎందుకు ఇరవై మంది ఒక్క బంతికోసం తన్నుకుంటున్నారు? ఎవరికి వారికి ఒక బంతి ఇస్తే మీ సొమ్మేం పోయింది?'

మీ అద్వైతులు ఉన్నది ఒకటే ఆత్మ అంటున్నారు. అది నిజం కాదు. ఎంతమంది ఉంటే అన్ని ఆత్మలు ఉన్నాయి. ప్రతిఒక్కరి ఆత్మా సర్వవ్యాపకం. నా ఆత్మ సర్వవ్యాపకం, నీ ఆత్మ సర్వవ్యాపకం. అలా అన్ని ఆత్మలూ సర్వవ్యాపకం. అంతేకాదు, ఈ ఆత్మ కర్తా, భోక్తా.

డి) **సాంఖ్య, యోగదర్శనాలు** – అనేక ఆత్మలు ఉన్నాయి నిజమే, అన్ని ఆత్మలూ సర్వవ్యాపకం నిజమే. ఆత్మ భోక్త నిజమే కాని ఆత్మ కర్త కాదు. శరీరం, మనస్సులు కర్త. అవి పనిచేస్తాయి కాని ఆత్మ హాయిగా కూర్చుని అనుభవిస్తుంది.

వీరి వాదనను పూర్వకాలపు భార్యాభర్తల అనుబంధంతో పోల్చవచ్చు. భార్య ఇంటెడు చాకిరీ చేస్తే, భర్త హాయిగా కూర్చుని పేపరు చదువుకుంటాడు. అన్నీ వేళకి భార్య కమ్మగా వండిపెడితే, చక్కగా తిని కూర్చోక, వంద వంకలు పెడతాడు. పైపెచ్చు, 'మా అమ్మ చేతివంటలా లేదు,' అంటాడు. అలా పని చెయ్యకపోగా, అత్తా–కోడళ్ళ మధ్య చిచ్చు పెడతాడు. అందువల్ల అలా పని చెయ్యకుండా సుఖపడే భర్తను సాంఖ్య ఆత్మ అనవచ్చు. అతను తన పక్కనే ఉన్న ఫోనును కూడా ఎత్తడు. ఎక్కడో దూరంగా వంటలో మునిగితేలుతున్న భార్య పరుగులు పెడుతూ వచ్చి ఫోను ఎత్తాలి.

అలా సాంఖ్య దార్శనికులు ఆత్మ అకర్తా, కాని ఆత్మ భోక్తా అంటారు.

ఇ) **వేదాంత దర్శనం** – ఆత్మ ఏకం, సర్వగతం, అకర్తా, అభోక్తా, వగైరా.

ఇలా చూస్తే ఆత్మ గురించి అనేక అపోహలు ఉన్నాయి. ఈ అపోహలు తొలగటానికి బ్రహ్మవిచారణ చేయాలి.

మళ్ళీ పూర్వపక్షి ప్రశ్నను గుర్తు తెచ్చుకుంటే, 'బ్రహ్మవిచారణ తెలిసిన బ్రహ్మ గురించా, తెలియని బ్రహ్మ గురించా?' తెలిసిన బ్రహ్మ గురించి కొత్తగా తెలిసేది లేదు, తెలియని బ్రహ్మ గురించి విచారణ చెయ్యలేము.

**శంకరులవారి జవాబు** – బ్రహ్మ పూర్తిగా తెలియదు, పూర్తిగా తెలియకుండానూ లేదు. దీన్ని పరోక్షజ్ఞానం అంటారు. అంటే బ్రహ్మ ఉందని తెలుసు, ఆ బ్రహ్మ నేనే అంటే ఆత్మ అన్నప్పుడు, ఆ నేను ఎవరో తెలియదు. అందువల్ల అంశిక అజ్ఞానం ఉంది. ఈ అంశిక అజ్ఞానాన్ని సృష్టజ్ఞానంగా మలుచుకోవాలి.

దేని గురించైనా తెలుసుకోవటానికి రెండు వస్తువులు కావాలని చూశాము. అవి ప్రమాణం, లక్షణం అని కూడా చూశాము. అందువల్ల బ్రహ్మగురించి తెలుసుకోవటానికి లక్షణం ఉందని రెండవ సూత్రంలోనూ,వేదప్రమాణం ఉందని మూడవసూత్రంలోనూ చూస్తాము.

ఈ సూత్రంలో బ్రహ్మలక్షణాన్ని చూడబోతున్నాము.

**బ్రహ్మలక్షణం** – లక్షణం రెండురకాలు. అవి – స్వరూపలక్షణం, తటస్థలక్షణం.

1. **స్వరూపలక్షణం** – ఒక వస్తువును దాని స్వాభావిక గుణాన్నిబట్టి వర్ణిస్తే దాన్ని స్వరూపలక్షణం అంటారు. ఇది ప్రత్యక్షలక్షణం.

2. **తటస్థలక్షణం** – ఒక వస్తువును దాని ఆగంతుక గుణంద్వారా వర్ణిస్తే దాన్ని తటస్థలక్షణం అంటారు. ఇది పరోక్షలక్షణం. తటస్థంలో రెండు పదాలు ఉన్నాయి, తట+స్థః. తటః అంటే నది ఒడ్డు. స్థః అంటే ఉండే వస్తువు. అందువల్ల తటస్థః అంటే నది ఒడ్డున ఉండే వస్తువు. అంటే అది నదిలో ఒక భాగమూ కాదు, నది లోపలా లేదు. నదికి దూరంగా ఉంది.

**స్వరూపలక్షణం ఉదాహరణ**

**ప్రకృష్ట ప్రకాశః చంద్రః**

రాత్రి ఆకాశంలో దేదీప్యమానంగా వెలిగిపోతున్న వస్తువు చందమామ. రాత్రి ఆకాశంలో అనేక నక్షత్రాలు కూడా మెరుస్తూ ఉంటాయి. కాని అన్నింటికన్నా అత్యంత ప్రకాశవంతంగా ఉన్నది చంద్రుడు అంటాము.

ఇది స్వరూపలక్షణమా, తటస్థలక్షణమా? ఇక్కడ మీరు విజ్ఞానశాస్త్ర జ్ఞానాన్ని తీసుకురాకూడదు. చంద్రుడు స్వతహాగా ప్రకాశించలేదు, సూర్యునివల్లనే ప్రకాశిస్తున్నాడు అనకూడదు. మనం ఇక్కడ పున్నమిరాత్రి చంద్రుడు పుచ్చపువ్వులా విరగకాసే నిండు వెన్నెల చంద్రుని స్వాభావిక లక్షణమే అంటాము. ఎందుకంటే చంద్రుడనగానే, మనకు గుర్తుకొచ్చేది పున్నమిరాత్రినాటి నిండు వెన్నెల.

శాస్త్రంలో బ్రహ్మను సత్ చిత్ ఆనందంగా వర్ణిస్తే అది స్వరూపలక్షణం అవుతుంది.

**తటస్థలక్షణం ఉదాహరణ** – దేవదత్తుని ఇల్లు ఎక్కడ ఉందని అడిగితే, మనం రెండు సమాధానాలు చెప్పవచ్చు. అదిగో ఎఱ్ఱరంగుతో మెరిసిపోతోంది, వీధిలోకి తొంగిచూడటానికి వీలుగా రెండు కిటికీలు ఉన్నాయి అదే ఇల్లు అని చెపితే అది స్వరూపలక్షణం అవుతుంది. కాని ఆ వీధిలో అన్ని ఇళ్ళూ ఎఱ్ఱరంగుతో ఉండి, రెండేసి కిటికీలు వీధివైపుకు ఉంటే, దేవదత్తుని ఇంటిని మిగతా ఇళ్ళకు భిన్నంగా వర్ణించాలి. అప్పుడేం చెయ్యాలి? తటస్థలక్షణం చెప్పాలి. అదుగో కాకి వాలిందే, ఈ ఇల్లే దేవదత్తుని ఇల్లు అని వర్ణిస్తాము.

**కాకవత్ గృహం దేవదత్త గృహమ్**

కాకి వాలిన ఇల్లు అనే నిర్వచనం తటస్థ లక్షణమా, స్వరూప లక్షణమా? తటస్థ లక్షణమే. కాకి ఆ ఇంటిమీద ఎంతోసేపు ఉండదు. అది వెళ్ళి ఇంకో ఇంటిమీద వాలితే, ఆప్పుడా ఇల్లు దేవదత్తుని ఇల్లు అవుతుంది. తటస్థలక్షణం నిర్వచనం – తాత్కాలికంగా ఒక వస్తువును నిర్వచించేది.

లౌకిక ఉదాహరణ – **కాకవత్ గృహం దేవదత్త గృహమ్**
శాస్త్రీయ ఉదాహరణ – **జగత్కారణం బ్రహ్మ**

బ్రహ్మ జగత్తు సృష్టికి కారణం. ఇప్పుడు ఈ నిర్వచనం తటస్థలక్షణమా, స్వరూపలక్షణమా తెలుసుకోవాలి. అది తెలుసుకోవటానికి మనం జగత్తు, బ్రహ్మయొక్క స్వాభావిక గుణమా, ఆగంతుక గుణమా తెలుసుకోవాలి. మనకు జగత్తు ఆగంతుక గుణమని తెలుసు. ఎలా?

**సృష్టేః పూర్వం జగత్ నాస్తి**
**ప్రళయస్య అనంతరం జగత్ నాస్తి**
**విదేహముక్తి అనంతరం జగత్ సర్వదా నాస్తి**

జగత్తు సృష్టికి ముందూ లేదు, ప్రళయం తర్వాతా లేదు. విదేహముక్తి పొందిన జ్ఞానికి జగత్తు ఎన్నటికీ లేదు. అందువల్ల దాన్ని తటస్థలక్షణం అంటారు.

రెండవసూత్రం బ్రహ్మయొక్క తటస్థలక్షణాన్ని నిర్వచిస్తున్నది. అందువల్ల ఈ సూత్రాన్ని **బ్రహ్మ తటస్థలక్షణ సూత్రం** అని కూడా అంటారు.

**రెండవసూత్రంయొక్క సామాన్య విచారణ**

**జన్మాద్యస్య యతః**

ఈ సూత్రం వ్యాకరణపరంగా అసంపూర్ణంగా ఉంది. అందువల్ల మనం రెండు పదాలను కలుపుకోవాలి. మనం కలుపుకోవటం ఎందుకు, వ్యాసాచార్యుల వారే కలిపి ఉండవచ్చు కదా? ఎందుకంటే సూత్రంయొక్క నిర్వచనం తీసుకుంటే, అందులో మొట్టమొదటి పదం అల్పాక్షరం. ఎంత తక్కువ అక్షరాలు ఉంటే, అంత గొప్పది సూత్రం. ఏ పదాలైతే సందర్భాన్నిబట్టి అర్థమవుతాయో, వాటిని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

దీన్ని సంస్కృతంలో అధ్యాహారః అంటారు. అంటే సూత్రాన్ని పూర్తి చెయ్యటానికి అవసరమైన పదాలను కలుపుకోవటం. ఏ సూత్రాల్లో చూసినా, ఈ అధ్యాహారః అవసరం ఉంటుంది.

అంతదాకా ఎందుకు? మన నిత్యజీవనంలో కూడా కొన్ని పదాలను వదిలేసి మాట్లాడతాము. సందర్భాన్నిబట్టి ఎదుటివ్యక్తి అర్థం చేసుకుంటాడు. 'చూడూ, అతనికి ఒక కప్పు కాఫీ ఇవ్వు. నాక్కూడా ఒకటి ఇవ్వు,' అని ఎవరైనా అంటే దానర్థం అతనికి కాఫీ ఇవ్వు, నాకు ఒక దెబ్బ ఇవ్వమని కాదు. నాకు కూడా కాఫీ ఇవ్వమని అర్థం.

అలా ఈ సూత్రంలో మనం తత్ బ్రహ్మ కలుపుకోవాలి. అప్పుడు మొత్తం సూత్రం –

**జన్మాద్యస్య యతః తత్ బ్రహ్మ**

ఇంకా కావాలంటే 'భవతి' కూడా కలుపుకోవాలి. సంస్కృతంలో ఎన్నో సందర్భాలలో దాన్ని వదిలేస్తారు. కాని స్పష్టత కావాలంటే మనం ఆ పదాన్ని కూడా కలపవచ్చు. అప్పుడు పూర్తి సూత్రం –

**జన్మాద్యస్య యతః తత్ బ్రహ్మ భవతి**

ఈ సూత్రం అర్థం బ్రహ్మ అంటే సృష్టి వగైరా దేనినుంచి జరిగిందో అది బ్రహ్మ.

తేలిగ్గా చెప్పాలంటే – సృష్ట్యాదికారణం బ్రహ్మ. జన్మ అంటే సృష్టి. ఆది అంటే స్థితి, లయలు. జగత్తు పదాన్ని మనం కలుపుకోవాలి.

ఇప్పుడు పూర్తి వాక్యం చూడండి –

**జగతః సృష్టి స్థితి లయకారణం బ్రహ్మ**

బ్రహ్మ కారణం. ఆ కారణంనుంచే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయలు వచ్చాయి.

**జన్మాది** అంటే సృష్టిస్థితిలయ లేదా శంకరులవారి మాటల్లో చెప్పాలంటే సృష్టిస్థితిభంగము. భంగము అంటే లయ.

**అస్య** అంటే **దీనియొక్క**. ఇక్కడ వ్యాసాచార్యులవారు సర్వనామాన్ని వాడారు. మనం దీనిని **అస్య జగతః** అని తీసుకోవాలి. అస్య జగతః అంటే ఈ జగత్తుయొక్క.

**యతః** అంటే యస్మాత్ కారణాత్. ఏ కారణంనుంచి వచ్చిందో,

**తత్ బ్రహ్మ** – ఈ పదాలు మనం కలుపుకోవాలి. అది బ్రహ్మ.

ఇప్పుడు ఈ పదాలన్నింటి అర్థాలూ కలుపుకుని ఈ సూత్రం అర్థం చూస్తే – ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయలకు ఏది కారణమో, అది బ్రహ్మ. ఇంకా టూకీగా చెప్పాలంటే **జగత్ సృష్టిస్థితిలయకారణం బ్రహ్మ**. పదాల అర్థం చూసినప్పుడు ఇంకా లోతుగా వెళతాము. ఇప్పటికి ఈ అర్థం తెలుసుకుంటే చాలు.

పదాల అర్థం తెలుసుకునేముందు ఇంకో రెండు అంశాలు చూడాలి.

**న్యాయవాక్యం** – బ్రహ్మసూత్రాలను న్యాయప్రస్థానం అని అంటారని చూశాము. న్యాయం అంటే తర్కం. అందువల్ల ప్రతి సూత్రానికి ఒక న్యాయవాక్యం లేదా అనుమానవాక్యం ఉండాలి. ఈ సూత్రానికి న్యాయవాక్యం ఇది –

**బ్రహ్మ అస్తి లక్షణత్వాత్ ఘటవత్**

| | | |
|---|---|---|
| **పక్షం** | **–** బ్రహ్మ | – బ్రహ్మ గురించి చెబుతుంది |
| **సాధ్యం** | **–** అస్తి | – ఉన్నాడు అని మనం చెబుతాము. |
| **హేతువు** | **–** లక్షణత్వాత్ | – ఉన్నాడు అని చెప్పటానికి లక్షణముంది. |
| **దృష్టాంతం–** | ఘటవత్ | – కుండకు కర్త ఉన్నట్టుగా |

కుండకు కర్త ఉన్నట్టుగా, బ్రహ్మ లక్షణంద్వారా బ్రహ్మ ఉన్నాడు అని చెప్పవచ్చు.

లక్షణం – జగత్కారణం

**వ్యాప్తివాక్యం – యత్ర యత్ర లక్షణత్వం, తత్ర తత్ర వస్తు సిద్ధిః**

**లక్షణ ప్రమాణాభ్యాం వస్తు సిద్ధిః ఇతి న్యాయేన యత్ర యత్ర లక్షణత్వం తత్ర తత్ర వస్తు సత్వమ్. తస్మాత్ బ్రహ్మ అస్తి లక్షణత్వాత్ ఘటవత్**

లక్షణం, ప్రమాణం ఉంటే ఒక వస్తువు గురించి తెలుస్తుంది. ఈ నియమం ప్రకారం, ఎక్కడ లక్షణం ఉంటే అక్కడ వస్తువు ఉంటుంది. అందువల్ల బ్రహ్మకు లక్షణం ఉండటంవల్ల, బ్రహ్మ ఉన్నాడు. మొదటిసూత్రం బ్రహ్మవిచారణ గురించి సూచిస్తే, రెండవసూత్రం బ్రహ్మసిద్ధిగురించి చెబుతున్నది.

**విషయవాక్యం** – బ్రహ్మసూత్రములు వ్యాసాచార్యులవారు స్వంతంగా రాసినది కాదనీ, వేదాంత వాక్యాలమీద ఆధారపడి చెప్పినదనీ చూశాము. అందువల్ల ఆయన ఏ సూత్రాన్ని రాసినా కూడా, ఆయన మనస్సులో ఏదో వేదాంతవాక్యం ఉండివుంటుంది. ఆయన దాన్ని ప్రత్యేకించి చెప్పరు. అందువల్ల ఒక్కోసారి సమస్య కూడా ఎదురవుతుంది. ఒక్కో సందర్భంలో ఒక్కో భాష్యకారుడు ఒక్కో వేదాంతవాక్యాన్ని సూచించే ప్రమాదం ఉంది. మనకు మన అదృష్టవశాత్తూ, శంకరాచార్యులవారు ఈ విషయవాక్యాన్ని సూచిస్తూ వస్తున్నారు.

ఈ సూత్రానికి విషయవాక్యం తైత్తిరీయోపనిషత్తులోని, భృగవల్లీలోని మొదటి సూత్రం.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి॥ – భృగువల్లీ, తైత్తిరీయమ్**

ఈ వాక్యం బ్రహ్మ తటస్థలక్షణ వాక్యం.

| | |
|---|---|
| యతో వా ఇమాని భూతాని జాయన్తే | – బ్రహ్మ సృష్టి కారణం |
| యేన జాతాని జీవన్తి | – బ్రహ్మ స్థితి కారణం |
| యత్ప్రయన్త్యభిసంవిశన్తి | – బ్రహ్మ లయకారణం |
| తద్బ్రహ్మ | – జగత్ సృష్టి స్థితి లయకారణం బ్రహ్మ. |

## పద విశ్లేషణ

**జన్మాద్యస్య యతః (తత్ బ్రహ్మ)**

ఇందులో పదాలను విడదీస్తే అవి -

జన్మాది + అస్య + యతః + (తత్ బ్రహ్మ)

1. **జన్మాది** - ఈ జన్మాది పదం సంయుక్తపదం. ఇందులో రెండు పదాలు ఉన్నాయి. అవి జన్మ+ఆది. ఆది అంటే వగైరా. శంకరులవారు ఆదిలో సృష్టి ప్రక్రియకు సంబంధించిన ఇంకో రెండు పదాలు ఉన్నాయని సూచించారు. అవి స్థితి, లయ. లయను భంగం అన్నారు శంకరులవారు.

**జన్మాది = సృష్టి, స్థితి, లయ**

**పూర్వపక్షి వాదన** - యాస్కముని రాసిన నిరుక్తం అని ఒక గ్రంథం ఉంది. అందులో ఆయన ప్రతి వస్తువు ఆరు వికారాలకు లోనవుతుందని చెప్పారు - జాయతే, అస్తి, విపరిణమతే, వర్ధతే, అపక్షీయతే, వినశ్యతీతి (నిరుక్తం 1-1-3). ఈ వికారాలను షడ్భావ వికారాలు అన్నారు. భావ అంటే పదార్థం. వికారం అంటే మార్పు. ప్రతి పదార్థానికీ ఆరు మార్పులు ఉంటాయన్నారు. ఇక్కడ అస్తితో కాకుండా జాయతేతో మొదలుపెట్టారు. జాయతే అంటే జన్మ. ఈ ఆరు వికారాలూ చూస్తే - పుడుతుంది, ఉంటుంది, పరిణామం చెందుతుంది, పెరుగుతుంది, క్షీణిస్తుంది, నశిస్తుంది.

ఈ విధంగా ప్రతి వస్తువులోనూ ఈ ఆరు వికారాలు ఉంటాయి. ఈ జన్మాది సూత్రంలో ఈ భావ వికారషట్కం నిర్దేశించబడిందని చెప్పవచ్చు కదా. జన్మస్థితిలయ అనే మూడు మాత్రమే ఎందుకు గ్రహించాలి అని పూర్వపక్షి వాదన.

**జన్మాది షట్కారణం న తు జన్మాదిత్రయకారణమ్**

**శంకరులవారి జవాబు** - నిరుక్తం వేద నిఘంటువు. ఇది వైదిక పదాలకు ధాతువును సూచిస్తుంది. యాస్కముని రచించారు కాబట్టి పౌరుషేయం. అది సృష్టిలో ఉన్న వస్తువుల గురించి చెబుతుంది. జన్మాది షట్కం భౌతిక ఉత్పత్తికి సంబంధించినది. అంటే భౌతిక ప్రపంచానికి సంబంధించినది. కాని వేదాంతం భౌతిక ప్రపంచం గురించి, భూత ఉత్పత్తి గురించి కూడా మాట్లాడుతుంది. అందువల్ల నిరుక్తంలో చెప్పిన సందర్భం ఇక్కడ సరిపోదు.

**పూర్వపక్షి వాదన** – అది స్మృతి గ్రంథమే అయినా శ్రుతిమీద ఆధారపడి వచ్చినది కాబట్టి దీన్ని కూడా ప్రమాణంగా తీసుకోవచ్చు అంటాడు పూర్వపక్షి. భగవద్గీత ఒక స్మృతిగ్రంథం. భగవద్గీత లాగా ఏ స్మృతిగ్రంథం అయినా పౌరుషేయ గ్రంథమే అయినా కూడా, శ్రుతిమీద ఆధారపడింది కాబట్టి దానికి కూడా ఎందుకు శ్రుతికున్న అపౌరుషేయ హోదాని ఇవ్వకూడదు?

ఆ విధంగా యాస్కముని కూడా శ్రుతిని ఆధారంగా చేసుకుని సృష్టి ప్రక్రియ గురించి చెప్పివుండవచ్చు. అలా చెపితే అది జన్మాది షట్కం అవుతుంది కదా అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు 1** – యాస్క నిరుక్తం ప్రమాణమే, ఎందుకంటే అది శ్రుతిమీద ఆధారపడివచ్చింది అని మీరు అంటున్నారు. కాని మా భాష్యం ఏకంగా, ప్రత్యక్షంగా, శ్రుతి వాక్యంమీదే ఆధారపడివచ్చింది. దానికి ప్రత్యక్ష విలువ, స్వాభావిక విలువ ఉంటుంది. ప్రత్యక్షంగా చెప్పినది ముఖ్యమా, ప్రత్యక్షాన్ని ఆధారం చేసుకుని పరోక్షంగా చెప్పినది ముఖ్యమా అంటున్నారు శంకరులవారు.

శ్రుతి వాక్యాన్ని ఇంతకు ముందే చూశాము. ఏమిటది?

| | |
|---|---|
| యతో వా ఇమాని భూతాని జాయన్తే | – సృష్టి కారణం |
| యేన జాతాని జీవన్తి | – స్థితి కారణం |
| యత్ప్రయన్త్యభిసంవిశన్తి | – లయ కారణం |
| తద్బ్రహ్మ | – జగత్ సృష్టి స్థితి లయకారణం బ్రహ్మ. |

ఇంత స్పష్టంగా బ్రహ్మ సృష్టిస్థితిలయ కారణాలు అని చెబుతుంటే ఇంక దేనికో వెళ్ళటం ఎందుకు?

2. శంకరులవారు ఇంకొక కారణం కూడా చెబుతున్నారు. అది ఇంకా తేలిక జవాబు. అసలు వ్యాసాచార్యులవారు బ్రహ్మసూత్రములు రాసిందే వేదాంత వాక్యాలను విశ్లేషించటానికి. ఈ విషయాన్ని బ్రహ్మసూత్రములలో ప్రత్యేకించి పేర్కొన్నారు. అందువల్లనే బ్రహ్మసూత్రములను వేదాంతసూత్రములు అని, ఉత్తరమీమాంసా సూత్రములు అని కూడా అంటారు. వేదాంతసూత్రములు, ఉత్తరమీమాంసా సూత్రములు పేర్లు చెప్పకనే చెబుతున్నాయి – ఈ సూత్రములు

వేదాంతవాక్యాలని విశ్లేషిస్తాయని. అందువల్ల జన్మాది పదానికి వేదాంతవాక్యాలను తీసుకోవాలి కాని, స్మృతి వాక్యాలను తీసుకోకూడదు.

జన్మాది = సృష్టి స్థితి లయ.

మరి షడ్వికారాల మాటేమిటి? షడ్వికారాలను కూడా తీసుకుంటాము కాని అవి కూడా సృష్టి, స్థితి, లయల్లో వచ్చేస్తాయి. అందువల్ల జన్మాదియొక్క ప్రాథమిక అర్థం సృష్టిస్థితిలయ. దీనితో ఈ పూర్వపక్షి ఖండన ముగిసింది కాని, ఇంకొక పూర్వపక్షి ఇంకొక అభ్యంతరం పెడతాడు.

**పూర్వపక్షి వాదన** – మీ సిద్ధాంతులే సృష్టి, స్థితి, లయ ఒక వృత్తాకారంలో జరుగుతుంది అంటారు. అది ఒక సరళరేఖలా జరగలేదని కదా అర్థం? ఇప్పుడు సృష్టిస్థితిలయ వృత్తాకారంలో జరుగుతుంటే, వృత్తానికి ఆది ఏమిటో ఎలా చెప్పగలరు? దానికి ప్రమాణం –

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥** – గీత 2.28

ఇది సృష్టియొక్క వృత్తాకారాన్ని సూచిస్తుంది. ఇటువంటి సందర్భాన్ని ఉటంకించి సృష్టి వృత్తాకారంలో జరుగుతుంటే, ఏది మొదలో ఎలా చెప్పగలరు అంటున్నాడు పూర్వపక్షి. అందువల్ల జన్మాది అంటే సృష్ట్యాది అనే ఎందుకు చెప్పాలి? స్థితాది అనో, లయాది అనో చెప్పవచ్చు కదా అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు** – దీనికి కూడా శంకరులవారు రెండు జవాబులు ఇస్తారు.

1. **అనుభవ ప్రమాణం** – నిజమే, సృష్టి ప్రకరణం ఒక వృత్తంలా జరుగుతుంది, ఆ వృత్తానికి ఆది ఏదో, అంతం ఏదో చెప్పలేము. అదీ నిజమే. కాని మనం సాధారణంగా ఈ విషయాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో అర్థం చేసుకుంటాము. అంటే సృష్టిప్రకరణ జరిగే విషయంలో ఒక క్రమపద్ధతి లేదు కాని, మనం అర్థం చేసుకునే తీరులో ఒక క్రమపద్ధతి ఉంది. అదెలా?

ఒక వస్తువుయొక్క నాశనం గురించి మాట్లాడాలంటే, ఆ వస్తువు ఉండి ఉండాలనే కనీస జ్ఞానాన్ని సూచిస్తుంది. అంటే లయ జరగాలంటే దాని స్థితి ఉండివుండాలి. ఉనికి ఉన్న వస్తువే కదా లయ చెందగలదు. ఇప్పుడు స్థితి కారణం తీసుకుందాము. అదే విధంగా ఒక వస్తువు ఉందని చెప్పాలంటే, దాని ఉనికికి ముందు దాని పుట్టుక ఉండాలి కదా. అంటే స్థితి ఉండాలంటే దాని

సృష్టి జరిగివుండాలి. అంటే లయ జరిగేముందు ఒక వస్తువుయొక్క స్థితి ఉండి వుండాలి; స్థితి ఉండాలి అంటే దాని సృష్టి జరిగివుండాలి.

అంతెందుకు, మన మామూలు పరిభాషలో కూడా ముందు ఒక శిశువు పుట్టాకే, ఆ శిశువుయొక్క ఉనికి గురించి మాట్లాడతాము. కొన్నాళ్ళయ్యాక అంటే ఆ శిశువు పెరిగి మరణించాక లయ గురించి మాట్లాడతాము. అందువల్ల ఈ వృత్తాకారంలో జరిగే సృష్టిప్రకరణాన్ని ఈ తర్కం ఉపయోగించి ఈ క్రమపద్ధతిలో వివరిస్తాము. అది సృష్టి, స్థితి, లయ.

పూజ్య స్వామీజీ దీన్ని అద్భుతంగా మూడు ముక్కల్లో చెబుతారు – **బార్న్ ఈజ్ గాన్.** బార్న్–సృష్టి, ఈజ్–స్థితి, గాన్–లయ. మన పెద్దలు కూడా పుట్టుట గిట్టుట కొరకే అంటారు. అంటే మొదట ఏం వచ్చింది? పుట్టటం. అందువల్ల జన్మాది అంటే సృష్ట్యాది సరిపోయింది.

2. **శ్రుతిప్రమాణం** – నిజానికి, వ్యాసాచార్యులవారు ఒక సూత్రాన్ని శ్రుతి వాక్యాన్ని మనస్సులో పెట్టుకుని రాస్తున్నారు. అలాంటప్పుడు శ్రుతి ఏం చెపితే ఆయన అది చెబుతారు. అంతేకాని ఆయన స్వంతంగా ఏదీ చెప్పరు కదా. అలాంటప్పుడు ఆయనను నిందించి లాభం లేదు. శ్రుతి ఏ క్రమపద్ధతిలో చెపితే ఆ పద్ధతిలో చెప్పారు వ్యాసాచార్యులవారు. అంటే ఇప్పుడు సృష్ట్యాది అని చెప్పింది ఎవరు? వ్యాసాచార్యులవారా, శ్రుతా? ఖచ్చితంగా శ్రుతే. కాబట్టి మీరేదైనా అడగాలంటే శ్రుతిని అడగండి; పాపం ఆయన శ్రుతి చెప్పినదాన్ని అక్షరాలా పాటిస్తున్నారు అంతే.

ఇందాకే చూశాము – యతో వా ఇమాని భూతాని జాయన్తే – శ్రుతి వాక్యంలో సృష్టి, స్థితి, లయ క్రమమే వచ్చింది. వ్యాసాచార్యులవారే కాదు, సృష్టి ప్రక్రియ గురించి ఎక్కడ వచ్చినా, ఇదే వరుసక్రమం చెప్పబడింది.

**భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా** – గీత 11.2

**జన్మాద్యస్య యతోఽన్వయాత్ ఇతరతశ్చార్థేషు అభిజ్ఞస్స్వరాట్** – భాగవతం, ధ్యానశ్లోకాలు

కంబరామాయణంలో కూడా ఇదే వరుసక్రమం. అంటే శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస గ్రంథాలన్నీ కూడా జన్మ గురించే అంటే సృష్టి గురించే ముందు చెబుతున్నాయి.

అందువల్ల **జన్మాది = సృష్టి స్థితి లయ.**

**అస్య** - అస్య అంటే సర్వవ్యాపకం. ఇది అని అర్థం. వ్యాసాచార్యులవారు ఈ ఇది అంటే ఏమిటో చెప్పలేదు. మనం **సమస్త జగతస్య** అని అర్థం తీసుకోవాలి. ఎందుకు? వ్యాసాచార్యులవారు ఇది అన్నారు కాని అది అనలేదు. ఇది అంటే మనకళ్ళ ముందు ఉన్నది. మనకు ఎదురుగా లేకపోతే, అది అని ఉండేవారు. అందువల్ల అస్య అంటే ప్రత్యక్ష గోచరస్య. అందువల్ల అస్య అంటే ప్రత్యక్షంగా కనిపించే ఈ ప్రపంచంయొక్క.

**అస్య = ప్రత్యక్ష ప్రపంచస్య**

రెండూ కలిపినప్పుడు అస్య, అన్వయంకోసం ముందుకు తెస్తాము.

**అస్య జన్మాది = ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితిలయ -**

**యతః- యస్మాత్ కారణాత్.** అంటే ఏ కారణంనుంచి ఈ ప్రత్యక్ష ప్రపంచయొక్క సృష్టి స్థితి లయకారణం జరుగుతుందో అది బ్రహ్మ.

బ్రహ్మ సృష్టికారణం అంటే బ్రహ్మ నిమిత్తకారణమా, ఉపాదానకారణమా? ఏ వస్తువును సృష్టించాలన్నా కూడా రెండూ కావాలి. అంటే కుండ విషయం తీసుకుంటే కుమ్మరి నిమిత్తకారణం, మట్టి ఉపాదానకారణం. నిమిత్తకారణాన్ని సృష్టిమాత్రకారణం అంటారు. అంటే నిమిత్తకారణం సృష్టి చేస్తాడు కాని స్థితి, లయలతో సంబంధం లేదు. కుమ్మరి కుండ చేస్తాడు కాని అతనికి కుండ యొక్క స్థితి, లయలతో సంబంధం లేదు.

**కులాలః ఘటసృష్టి మాత్రకారణం భవతి**

**కులాలః ఘటస్య స్థితి కారణం న భవతి**

ఉపాదాన కారణం అంటే మట్టి అని చూశాము కదా. అది సృష్టి, స్థితి, లయ కారణం. ఎందుకంటే కుండ మట్టిలోంచే వస్తుంది, మట్టిలోనే స్థితి పొందుతుంది, మట్టిలోనే లయమవుతుంది.

ఇప్పుడు మన ప్రశ్నకు వెనక్కి వెళితే బ్రహ్మ సృష్టిమాత్ర కారణమా, సృష్టి స్థితి లయకారణమా? జన్మాది అంటే సృష్టిస్థితిలయ కారణం కాబట్టి బ్రహ్మ సృష్టిస్థితిలయ కారణమే. అంటే యతః ప్రాథమిక అర్థం ఉపాదానకారణం.

**యస్మాత్ ఉపాదాన కారణాత్ ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితిలయ సంభవతి తదుపాదానకారణం బ్రహ్మ**

ఏ ఉపాదాన కారణంనుంచి ప్రత్యక్ష ప్రపంచంయొక్క సృష్టిస్థితిలయలు సంభవమవుతాయో ఆ ఉపాదానకారణం బ్రహ్మ.

**యతః – దశ 1 – ఉపాదాన కారణం.**

తర్వాత, ఇంకా లోతుగా విశ్లేషిస్తే జగత్కారణం ఒకటే ఉంటుంది, ఉండాలి కూడా. జగత్తుకు రెండు కారణాలు ఉండలేవు. లౌకికవస్తువుల సృష్టిలో ఉపాదాన కారణం వేరు, నిమిత్తకారణం వేరు. కుండ విషయంలో మట్టి వేరు, కుమ్మరి వేరు. కాని మనం మాట్లాడే జగత్కారణం దేశకాలాలకు కూడా అతీతం. ఆ దేశకాలాలకు కూడా కారణమెవ్వరో, ఆ కారణం గురించి మాట్లాడుతున్నాము. అంటే అవి కూడా తర్వాత పుట్టాయి.

**ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్

అటువంటి కారణం ఒక్కటే ఉండితీరాలి. ఆ బ్రహ్మే ఉపాదాన కారణమూ, నిమిత్త కారణమూ కూడా అవాలి. యతః అంటే కారణం అనీ, సృష్టిస్థితిలయ కారణం కాబట్టి ఉపాదానకారణం అనీ చూశాము. కాని బ్రహ్మకు భిన్నంగా ఏదీ లేదు కాబట్టి నిమిత్తకారణం కూడా బ్రహ్మే అవాలి.

అభిన్న అంటే ఇంకొకటి లేదు. ఇప్పుడు దీన్ని సంస్కృతంలో చూస్తే

**యస్మాత్ అభిన్న నిమిత్త ఉపాదానకారణాత్ అస్య ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితిలయ సంభవతి తదు అభిన్న నిమిత్త ఉపాదానకారణం బ్రహ్మ**

ఏ అభిన్న నిమిత్త ఉపాదానకారణంనుంచి ఈ ప్రత్యక్ష ప్రపంచంయొక్క సృష్టి స్థితి లయలు సంభవమవుతాయో, ఆ అభిన్న నిమిత్త ఉపాదానకారణం బ్రహ్మ.

**యతః – దశ 2 – అభిన్న నిమిత్త ఉపాదానకారణం**

ఇప్పుడు ఇంకొక అడుగు ముందుకు వెళ్ళాలి. ఒక అడుగు ముందుకు వేసేముందు రెండడుగులు వెనక్కి వెళదాము. ఈ సూత్రం యొక్క విషయవాక్యాన్ని, దాని సందర్భాన్ని గుర్తు తెచ్చుకుందాము.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే।**
**యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి।**
**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి, స తపోఽ తప్యత – తైత్తిరీయమ్**

భృగువు, తండ్రియైన వరుణుణ్ణి బ్రహ్మ గురించి చెప్పమని అడిగితే, తండ్రి అతనికి వెంటనే బోధ చెయ్యకుండా అతనికి ఒక వాక్యం ఇచ్చి, దాన్ని విశ్లేషించి తెలుసుకోమన్నాడు. ఏమిటది? ఏ 'x' నుంచి అయితే జగత్తుయొక్క సృష్టి స్థితి లయలు సంభవమవుతాయో, ఆ 'x' బ్రహ్మ అన్నాడు. ఆ 'x' ఎవరో నువ్వే కనుక్కో అన్నాడు.

అంటే వరుణుడు తటస్థలక్షణం చెప్పాడు కాని, స్వరూపలక్షణం చెప్పలేదు. అది తెలివైన విద్యార్థి తెలుసుకోవాలి. భృగుమహర్షి తెలివైన విద్యార్థి. అతను పంచకోశవివేకం చేసి, ఆ 'x' పంచకోశ అతీత బ్రహ్మ అని తెలుసుకున్నాడు.

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్, ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయన్త్యభిసంవిశన్తీతి। సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా॥ – తైత్తిరీయమ్**

అంటే తండ్రి చెప్పిన మాటలే తీసుకుని, ఆనందంనుంచి సృష్టి వచ్చింది, ఆనందం స్థితి కారణం, ఆనందం లయ కారణం, కాబట్టి ఆనందమే బ్రహ్మ అన్నాడు. అంటే తండ్రి ఆశించినట్టుగా భృగువు బ్రహ్మయొక్క స్వరూపలక్షణం తెలుసుకున్నాడు. బ్రహ్మ స్వరూపలక్షణం ఆనందం. బ్రహ్మ తటస్థలక్షణం జగత్కారణం. అందులో నిమిత్త, ఉపాదాన కారణాలను చూశాము.

**విజ్ఞానమానందం బ్రహ్మేతి** – బృహదారణ్యకోపనిషత్తు

ఇప్పుడు మళ్ళీ సూత్రాన్ని సంస్కృతంలో చూద్దాము.

**యస్మాత్ అభిన్న నిమిత్త ఉపాదానకారణాత్ ఆనంద స్వరూపాత్ ప్రపంచస్య సృష్టిస్థితిలయ సంభవతి తదు అభిన్న నిమిత్త ఉపాదానకారణం ఆనందస్వరూపం బ్రహ్మ**

ఏ అభిన్న నిమిత్త ఉపాదానకారణం, ఆనందస్వరూపంనుంచి ప్రపంచం యొక్క సృష్టిస్థితిలయ సంభవిస్తుందో ఆ అభిన్న నిమిత్త ఉపాదానకారణం ఆనందం స్వరూపం బ్రహ్మ.

**యతః – దశ 03 – అభిన్న నిమిత్త ఉపాదానకారణం, ఆనందస్వరూపం**

అందువల్ల యతః అంటే తటస్థలక్షణం+స్వరూపలక్షణం.

తటస్థలక్షణం – అభిన్న నిమిత్త ఉపాదానకారణం;

స్వరూపలక్షణం – ఆనందస్వరూపం.

ఈ సూత్రం ప్రాథమికంగా తటస్థలక్షణాన్ని సూచించినా, పరోక్షంగా బ్రహ్మ స్వరూపలక్షణాన్ని కూడా సూచిస్తుంది. అందువల్ల ఈ సూత్రాన్ని బ్రహ్మలక్షణసూత్రం అంటారు.

అందువల్ల దీనిని తటస్థస్వరూపలక్షణద్వయ సూత్రం అంటారు.

**తత్ బ్రహ్మ –** ఇక్కడితో సూత్రంలో ఉన్న పదాలు అయిపోయాయి. **తత్ బ్రహ్మ** పదాలను మనం కలుపుకున్నాము. తత్ బ్రహ్మ అంటే ఆ బ్రహ్మ. ఇందులో శంకరులవారు బ్రహ్మయొక్క ఇంకొక అంశాన్ని కలుపుతారు. ఇప్పటికే మనం బ్రహ్మ గురించి మూడు అంశాలను చూశాము. అవి ఉపాదానకారణం, నిమిత్తకారణం, ఆనందస్వరూపం. ఇప్పుడు రెండు అంశాలను కలుపుతారు. అవి సర్వజ్ఞః, సర్వశక్తిమాన్.

ఒక వస్తువుయొక్క నిమిత్తకారణం ఎవరో తెలిస్తే, ఆ సృష్టికర్త ఎంత మేధావో అతను సృష్టించిన వస్తువుని చూసి చెప్పవచ్చు. ఆ వస్తువు ఎంత ఎక్కువ అద్భుతంగా ఉంటే, అంత ఎక్కువ మేధావి దాని సృష్టికర్త అయివుండాలి. అందువల్లనే ఒక కొత్తవస్తువు సృష్టించబడితే, దాన్ని సృష్టించిన వ్యక్తిని మెచ్చుకుంటాము.

పిల్లల తెలివితేటలు చూసి తల్లిదండ్రులను మెచ్చుకుంటారు. అలాగే శిష్యుల తెలివితేటలు చూసి గురువులను మెచ్చుకుంటారు. కార్యం ఎంత గొప్పగా ఉంటే, కారణం అంత గొప్పగా ఉంటుంది. అందువల్ల జగత్తుయొక్క అద్భుతాలు, దాని విశేషాలు, దాని వింతలు, దాని విభూతులు చూస్తే దాన్ని సృష్టించిన ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయివుండాలి అని ఖచ్చితంగా చెప్పగలము అంటున్నారు శంకరులవారు. ఈశ్వరుడు అంటే బ్రహ్మ.

**తత్ బ్రహ్మ = సర్వజ్ఞః సర్వశక్తిమాన్**

ఈ బ్రహ్మను కారణబ్రహ్మగా వర్ణించినప్పుడు ఈశ్వరుడు అంటాము.

**బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు**

మాయాసహిత బ్రహ్మను ఈశ్వరుడు అంటారు. బ్రహ్మయొక్క కారణత్వాన్ని వివరించేటప్పుడు బ్రహ్మ, ఈశ్వరుడు పదాల్లో ఏదైనా వాడతాము. అందువల్ల బ్రహ్మ, ఈశ్వరుడూ ఒకటే. బ్రహ్మయొక్క సర్వజ్ఞత్వం, సర్వేశ్వరత్వం గురించి

నిర్వచించటానికి శంకరులవారు తన భాష్యంలో జగత్తుయొక్క మహిమను నాలుగు విశేషణాలద్వారా స్తుతిస్తున్నారు.

**అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య అనేకకర్తృభోక్తృ సంయుక్తస్య ప్రతినియత దేశకాల నిమిత్త క్రియాఫలాశ్రయస్య, మనసాప్యచిన్త్యరచనారూపస్య జన్మస్థితిభఙ్గం యతః సర్వజ్ఞాత్ సర్వశక్తేః కారణాద్భవతి తద్బ్రహ్మేతి**

1. **అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య** – ఇంత గొప్పగా సృష్టింపబడిన, నామరూపాలతో కూడిన ఈ జగత్తు అనుకోకుండా వచ్చింది అనలేము. అంటే జగత్తు దానంతట అదే పరిణామం చెంది వచ్చింది అనలేము. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ఒప్పుకోలేము. ఒక్క చిన్నగడియారాన్ని సృష్టించాలంటేనే, దానికెంతో మేధస్సు అవసరం. అలాంటిది దానంతట అది సృష్టించబడిందని ఎలా చెప్పగలము?

ఎవరికైనా షేక్స్‌పియర్ నాటకాలు చూపించారనుకోండి. ఇప్పటి తరానికి షేక్స్‌పియర్ అనే గొప్ప నాటకరచయిత ఉన్నాడనే తెలియదు. 'ఎవరు రాశారు?' అని వారుఅడుగుతారు. 'ఎవరూ రాయలేదు. వాటంతట అవే పుట్టుకొచ్చాయి. ఒక ముద్రణాలయంలో ఒక బిగ్‌బ్యాంగ్ ఎక్స్‌ప్లోషన్ జరిగి, అక్షరాలన్నీ గాలిలో ఎగిరి, వాటంతట అవే ఒక కూర్పుగా ఏర్పడి, ఇదిగో ఈ పుస్తకం రూపంలో వచ్చాయి,' అంటే ఎవరూ మనను నమ్మరు.

ఒక మామూలు వ్యక్తి రచించిన, ఒక మామూలు పుస్తకం విషయంలోనే దానంతట అది వచ్చిందని నమ్మలేకపోతే, ఈ మొత్తం విశ్వం, ప్రకృతి సూత్రములు వాటంతట అవే వచ్చాయని ఎలా నమ్మగలరు? అందువల్ల ఈ నామరూపాత్మక జగత్తు అద్భుతంగా సృష్టించబడింది. అది సృష్టించాలంటే దానికొక **చేతనకర్తా** ఉండాలి. అంటే ఒక **సృష్టికర్త** ఉండాలి.

2. **అనేకకర్తృభోక్తృ సంయుక్తస్య** – ఈ జగత్తులో అనేక ప్రాణులు ఉన్నారు. వారు కర్తా, భోక్తాలు. కార్యం కారణానికి భిన్నంగా ఉంటుంది. ఇది నియమం. జీవులందరూ కార్యం అయితే, ఈ జీవులను సృష్టించిన కారణం, జీవులకు భిన్నంగా ఉండాలి. అంటే సృష్టికర్త జీవుడు కాకూడదు. అందువల్ల సృష్టికర్త **జీవభిన్నుడై** ఉండాలి.

3. **ప్రతినియత దేశకాల నిమిత్త క్రియాఫలాశ్రయస్య** – జగత్తులో ఏదీ అనుకోకుండా జరగలేదని చూశాము కదా. అంతేకాదు, జగత్తులో జరిగే ప్రతిదీ ఒక దేశంలో, ఒక కాలంలో, ఒక ప్రత్యేక కారణంకోసం జరుగుతుంది. అందువల్ల ఈ ప్రపంచం ఒక అయోమయకూటమి కాదు. ఇది విశ్వం. ఇందులో ప్రతి ఒక్క వస్తువుకూ ప్రత్యేకమైన దేశ, కాల, నిమిత్తకారణాలు ఉన్నాయి. అందువల్ల ఏదీ ఏక్సిడెంట్ కాదు, కావాలని జరిగినదే.

అంటే ఈ సృష్టిలో ఉన్న అనేక జీవులకు అనేక అనుభవాలు అవుతాయి, ప్రతి ఒక్క అనుభవమూ దేశకాల నిమిత్తాలమీద ఆధారపడివుంది. ప్రతి ఒక్క అనుభవమూ అంటే రెండో అనుభవం, మూడో అనుభవం కూడా వీటివల్ల అవుతాయి. అలాంటప్పుడు అనేక జీవులకు అనేక అనుభవాలు జరుగుతూ ఉంటాయి. ఇన్నిరకాల అనుభవాలు ఇంతమందికి ఇలా దేశకాల నిమిత్తాల మీద ఆధారపడి అవ్వాలంటే వాటిని నియంత్రించే సృష్టికర్తకు ఎన్ని తెలివితేటలు ఉండివుండాలి? అంటే సర్వజ్ఞుడు అవ్వాలి.

అంతేకాదు, కొంతమంది జీవులు ఒకచోట ఉన్నప్పుడు, వారిలో కొంతమందికి పుణ్యఫలం ఇవ్వాలి, మరికొంతమందికి పాపఫలం ఇవ్వాలి. అంటే సంఘటన ఒకటే, కాని దాని ఫలం భిన్న వ్యక్తులకు భిన్నం.

ఒక కుటుంబంలో అంగవైకల్యం ఉన్న వ్యక్తి ఉన్నాడనుకోండి. ఆ సంఘటన ఒకటే. కాని అంగవైకల్యం ఉన్న వ్యక్తికి తనను అపురూపంగా, ఆప్యాయంగా చూసుకునే తల్లిదండ్రులు దొరకటం అతని అదృష్టం. కాని అటువంటి పుత్రుడు తమకు పుట్టటం వారికి బాధాకరమైన విషయం. ఆ అబ్బాయి అలా పుట్టటం అతనికి దురదృష్టం అయినా అతను కొంత పుణ్యం కూడా చేసుకున్నాడు కాబట్టి మంచి ఇంట్లో పుట్టాడు. అందువల్ల ఆ సన్నివేశం పుణ్యమా, పాపమా అంటే ఒకవైపునుంచి చూస్తే పుణ్యం, ఇంకో వైపునుంచి చూస్తే పాపం. పుణ్యంలో కూడా హెచ్చుతగ్గులు ఉంటాయి. ఒక యూనిట్ పుణ్యం, రెండు యూనిట్ల పుణ్యం వగైరా.

ఎంత అద్భుతమైన అల్లిక! ప్రతి ఒక్క సన్నివేశం కూడా ఒక్కరి కర్మఫలంవల్ల జరిగేది కాదు, లెక్కలేనన్ని జీవులవల్ల జరుగుతుంది. గుర్తుంచుకోండి, ఇక్కడ మనం మనుష్యుల కర్మఫలాల గురించే మాట్లాడుతున్నాము, తక్కిన జీవరాశుల

సంగతి మాట్లాడటం లేదు. కాని భగవంతుడు వాటినన్నిటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. భగవంతుడు దోమకు కూడా పుణ్యపాపాలు ఇవ్వాలి. ఒక చిన్న దోమ మిమ్మల్ని కుడితే, మీకు మీ పాపక్షయం అవుతుంది కాని దోమకు అది పుణ్యం. మీ రక్తం పీల్చి జీవితం కొనసాగించుకునే ప్రారబ్ధకర్మ దానికి ఉంది.

అంటే ప్రతినియత దేశకాల నిమిత్త క్రియాఫలాశ్రయస్య అంటే ఇంత అద్భుతమైన జగత్తును సర్వజ్ఞుడు మాత్రమే సృష్టించగలడు. అందువల్ల సృష్టికర్త **సర్వజ్ఞుడు**.

**మనసాప్యచిన్త్యరచనా రూపస్య** – ఒక శాస్త్రజ్ఞుడు ఒక మెదడు ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోగలడు కాని మెదడును సృష్టించలేడు. అలాగే జగత్తులో ఉన్న అనేక వస్తువులు ఎలా పనిచేస్తాయో మనకు తెలుసు కాని, వాటిని మనం సృష్టించలేము. అందువల్లనే మన శరీరంలో లివర్ కాని, పాంక్రియాస్ కాని పాడయితే వాటిని మనం సృష్టించలేము. ఒక దోమను నాశనం చెయ్యగలము కాని దోమను సృష్టించలేము.

అలా భగవంతుడు సృష్టించిన ఎన్నో వస్తువులను మనం సృష్టించలేము. ఇక్కడ మనం విజ్ఞానశాస్త్రాన్ని కించపరచటం లేదు. విజ్ఞానశాస్త్రం ఎన్నో అద్భుతాలను కనుగొన్నది, ఎన్నో అద్భుతాలను సృష్టించింది కూడా. విజ్ఞానశాస్త్రాన్ని మెచ్చుకోవాల్సిన సందర్భంలో దాన్ని మెచ్చుకుంటాము, ఇక్కడ విజ్ఞానశాస్త్రంయొక్క పరిమితిని చూస్తున్నాము. దేవుడు సృష్టించిన ప్రతిదీ సైన్సు సృష్టించలేదు. అంటే దేవుడు సర్వజ్ఞుడే కాదు, సర్వశక్తిమంతుడు కూడా.

**ఈశ్వరః సర్వశక్తిమాన్ సర్వకారణత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఇది అనుమానవాక్యం. దీన్ని పూజ్యస్వామీజీ అద్భుతంగా నిర్వచించారు –

**ఘటస్య కర్తా ఘటజ్ఞః। పటస్య కర్తా పటజ్ఞః। సర్వస్య కర్తా సర్వజ్ఞః॥**

కుండను సృష్టించిన వానికి కుండ జ్ఞానం ఉంటుంది. సర్వాన్ని సృష్టించిన వానికి సర్వవిషయాల జ్ఞానం ఉంటుంది. ఈయన సర్వజ్ఞుడే కాదు, సర్వశక్తిమంతుడు కూడా. అందువల్ల దేవుడు **సర్వశక్తిమంతుడు**.

ఇప్పుడు ఈ నాలుగు నిర్వచననాలను మళ్ళీ చూస్తే భగవంతుడు – చేతనకర్త, జీవభిన్నుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. వీటిలో చివరి రెండు పదాలను కలిపి ఈ సూత్రాన్ని మళ్ళీ చూద్దాము.

జన్మాద్యస్య యతః – పూర్తి అర్థం

**యస్మాత్ అభిన్న నిమిత్త ఉపాదాన కారణాత్ ఆనంద స్వరూపాత్ సర్వజ్ఞాత్, సర్వశక్తేః ప్రపంచస్య సృష్టి స్థితి లయ సంభవతి తద్‌బ్రహ్మ.**

ఏ అభిన్న నిమిత్త ఉపాదానకారణంనుంచి, ఆనంద స్వరూపంనుంచి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునుంచి ఈ ప్రపంచంయొక్క సృష్టి స్థితి లయ జరిగిందో, ఆయన బ్రహ్మ.

దీనితో పదవిశ్లేషణ ముగిసింది. ఉపసంహారంలోకి వెళ్ళేముందు శంకరుల వారు, నైయాయికల వాదనను ఖండిస్తున్నారు.

## నైయాయిక – సిద్ధాంతుల వాదోపవాదాలు

**సిద్ధాంతి మాట** – మొదటిసూత్రంలో ఏమన్నాం? **అథాతో బ్రహ్మజిజ్ఞాసా**– బ్రహ్మవిచారణ చెయ్యండి అన్నాము. బ్రహ్మ గురించి విచారణ ఎప్పుడు చెయ్యగలము? బ్రహ్మ అనే ఒక వస్తువు ఉన్నాదని తెలిస్తేనే చెయ్యగలము.

**లక్షణప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః**

ఒక వస్తువుయొక్క లక్షణాన్ని, దానియొక్క ప్రమాణాన్ని తెలుసుకుంటే ఆ వస్తువును పొందగలము అని కూడా చూశాము. లక్షణం అంటే నిర్వచనం; ప్రమాణం అంటే దాన్ని చూసే పరికరం. ఆ సందర్భంలో రెండవసూత్రం లక్షణాన్ని సూచిస్తే, మూడవసూత్రం ప్రమాణాన్ని సూచిస్తుంది.

లక్షణం – జగత్కారణం బ్రహ్మ
ప్రమాణం – జగత్కారణం బ్రహ్మ గురించి తెలుసుకోవటానికి ప్రమాణం శాస్త్రం.

దీనిమీద నైయాయికుల వాదన ఏమిటో చూద్దాము.

**నైయాయికుల వాదన** – రెండవసూత్రం లక్షణసూత్రం, మూడవసూత్రం ప్రమాణ సూత్రం అంటున్నారు సిద్ధాంతులు. కాని రెండవసూత్రాన్నే ప్రమాణసూత్రంగా కూడా తీసుకోవచ్చు కదా అంటున్నాడు నైయాయికుడు. అదెలా? దానికి అతను జవాబు చెబుతున్నాడు. ఏమని?

రెండవసూత్రం బ్రహ్మను జగత్కారణం బ్రహ్మగా నిర్వచిస్తున్నది. అది మేమూ ఒప్పుకుంటాము అంటున్నాడు నైయాయికుడు. కాకపోతే అతను బ్రహ్మను ఈశ్వరుడు అంటాడు. వేదాంతంలో కూడా బ్రహ్మ+మాయ=ఈశ్వరుడు అనీ, సృష్టి గురించి వచ్చినప్పుడు ఈశ్వరుని గురించి చెప్పాలనీ చూస్తాము. అందువల్ల ఇక్కడి నుంచీ, ఈ నైయాయికులతో వాదన ముగిసేవరకు బ్రహ్మ బదులు ఈశ్వరుడు అనే పదాన్ని వాడదాము.

ఇప్పుడు నైయాయికుడు ఏమంటాడంటే, కారణం గురించి తెలుసుకోవటానికి ప్రత్యేకించి వేరే ప్రమాణం అవసరం లేదు, కార్యాన్ని చూసి కారణాన్ని ఊహించవచ్చు అని.

దశరథుడు రాముని తండ్రి అంటే, రాముడు దశరథుని పుత్రుడు అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. దానికి ప్రత్యేకించి వేరే ప్రమాణం ఎందుకు? అలాగే బ్రహ్మ జగత్తుయొక్క కారణం అంటే అర్థం ఏమిటి? జగత్తు బ్రహ్మయొక్క కార్యం. నైయాయికుడు ఈశ్వరుడు అంటాడని చూశాము కదా. అంటే ఈశ్వరుడు జగత్తుయొక్క కారణం అంటే జగత్తు ఈశ్వరునియొక్క కార్యం.

ఈశ్వరుడు కారణం, జగత్తు కార్యం. కనబడే జగత్తునుంచి కనబడని ఈశ్వరుడు ఉన్నాడని ఊహించవచ్చు. కంటికి ఎదురుగా ఉన్న కొడుకుని చూసి, ఎక్కడో అమెరికాలో ఉన్న అతని తండ్రిని గురించి ఊహించవచ్చు; కంటికి కనబడే చెట్టును చూసి, కనబడని వేళ్ళను ఊహించవచ్చు; కనిపించే పొగను చూసి, కనబడని అగ్నిని ఊహించవచ్చు.

ఈశ్వరుని గురించి తెలుసుకోవటానికి శాస్త్రప్రమాణమే అవసరంలేదు. అనుమాన ప్రమాణం చాలు అంటున్నాడు నైయాయికుడు. ఇటువంటి అనుమాన ప్రమాణాన్ని తర్కశాస్త్రంలో **కార్యలింగక అనుమానం** అంటారు. అంటే ఏమిటి? కార్యంనుంచి కారణాన్ని ఊహించటం. నైయాయికుడు శాస్త్రాన్ని నమ్మినా, తర్కానికి పెద్దపీట వేస్తాడని చూశాము.

అంటే నైయాయికుని వాదన ఒక్కముక్కలో చెప్పాలంటే ఈశ్వరుణ్ణి గురించి తెలుసుకోవటానికి శాస్త్రప్రమాణం అవసరం లేదు, అనుమానప్రమాణంద్వారా తెలుసుకోవచ్చు.

**వేదాంతి జవాబు** – కేవలతర్కంవల్ల ఈశ్వరుణ్ణి తెలుసుకోలేము అంటున్నాడు వేదాంతి. నైయాయికునికి, సిద్ధాంతికి చాలా భేదం ఉంది. నైయాయికుడు తర్కానికి పెద్దపీట వేస్తే, సిద్ధాంతి శాస్త్రానికి ప్రాముఖ్యతను ఇస్తాడు. అతనికి తర్కం ప్రధానం, శాస్త్రం అప్రధానం; సిద్ధాంతికి శాస్త్రం ప్రధానం, తర్కం అప్రధానం. అందువల్ల రెండవసూత్రాన్ని ఈశ్వరసిద్ధికి అనుమానప్రమాణంగా తీసుకోకూడదు అంటాడు సిద్ధాంతి. దాన్ని నిరూపించటానికి శంకరులవారు చాలా తేలికైన కారణం చూపించి వదిలేస్తారు కాని ఉపభాష్యకారులు ఇంకా కొన్ని కారణాలు చూపిస్తారు. ముందు శంకరాచార్యులవారి జవాబు చూద్దాము.

**శంకరులవారి జవాబు** – బ్రహ్మసూత్రములకు ఇంకొక పేరు వేదాంతసూత్రములు. అలాంటప్పుడు వేదాంతశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని రాయకుండా, కేవలం తర్కాన్ని ఉపయోగిస్తే, బ్రహ్మసూత్రములను వేదాంతసూత్రములు అనలేము.

తక్కిన దర్శనాలు వాటిని దర్శించిన దార్శనికులనుంచి వచ్చాయి. ఉదాహరణకు సాంఖ్యదర్శనాన్ని కపిలముని దర్శించారు. కాని ఉత్తరమీమాంస దర్శనం అలాకాదు. దీన్ని వ్యాసాచార్యులవారు స్వంతంగా దర్శించలేదు. వేదాంతవాక్యాలను అందంగా ఒకచోట ఏర్చికూర్చారు. కాబట్టి బ్రహ్మసూత్రములు శాస్త్రప్రధానమైనవి, తక్కిన దర్శనాలు తర్కప్రధానమైనవి.

ఆరు నాస్తికదర్శనాలు అసలు శాస్త్రాన్నే నమ్మవు. అవి పూర్తిగా తర్కప్రధానమైనవి. శంకరులవారు వారిని **నాస్తిక తార్కికులు** అంటారు. తక్కిన ఆస్తికులలో మొదటి నలుగురూ అంటే సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషికులు తర్కానికి పెద్దపీట వేసి, శాస్త్రానికి ఆట్టే ప్రాముఖ్యతనివ్వరు. శంకరులవారు వారిని **ఆస్తిక తార్కికులు** అంటారు.

బ్రహ్మసూత్రముల ప్రత్యేకత ఏమిటి? తర్కంద్వారా ఒక సిద్ధాంతాన్ని ఏర్పరచలేదు వ్యాసాచార్యులవారు. అలాగని తర్కాన్ని పూర్తిగా వదలనూ లేదు. తర్కం ద్వారా వేదాంతశాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో, అర్థమయ్యేలా చక్కగా తీర్చిదిద్దారు. అంతేకాని స్వంతంగా తర్కాన్ని ఉపయోగించలేదు. అందువల్ల ప్రతి సూత్రానికి ఆధారంగా ఒక వేదాంతవాక్యం ఉంటుంది. ఆ వేదాంతవాక్యాన్ని విషయవాక్యం అంటారని చూశాము.

అలా బ్రహ్మసూత్రములు వేదాంతవాక్యాలమీద ఆధారపడివచ్చినప్పుడు, రెండవ సూత్రమే ఈశ్వరుని గురించి చెప్పే అనుమాన ప్రమాణం అని అంటే, అప్పుడు ప్రాముఖ్యత అనుమానప్రమాణానికి పోతుంది. అప్పుడు దీని ప్రాథమిక నియమం దెబ్బతింటుంది. ఏమిటది? బ్రహ్మసూత్రములు శాస్త్రాన్ని ఆధారం చేసుకుని వచ్చాయి. దాన్ని కాదని అనుమానప్రమాణానికే ప్రాముఖ్యతనిస్తే, వ్యాసాచార్యుల వారి ఉద్దేశాన్ని పట్టించుకోనట్టు అవుతుంది.

**వేదాంతవాక్యకుసుమ గ్రథనార్థత్వాత్ సూత్రాణి**

బ్రహ్మసూత్రములను ఈ అద్భుతమైన వాక్యంతో వివరించారు. ప్రతిసూత్రానికీ ఒక అనుమానవాక్యం ఉంటుంది నిజమే కాని, ఆ అనుమానవాక్యం కేవలతర్కం కాదు. ఇది వేదాంతబోధను ఒక క్రమపద్ధతిలో వివరించటానికి ఉపయోగపడుతుంది. అది చెప్పటానికి ఒక ఉదాహరణను కూడా చెప్పారు. ఎలాగైతే పువ్వులను ఒకదారంలో గుచ్చుతామో అలా ఈ బ్రహ్మసూత్రములలో, వేదాంతవాక్యాలనే కుసుమాలను (పువ్వులను) అనుమానప్రమాణం అనే దారంలో గుచ్చి, వేదాంతదర్శనమనే దండను ఏర్పరచారు. అంటే అనుమానం లేదా తర్కం పూలమాలలోని దారం. దానికి విడిగా ఉనికి లేదు. ఎవరైనా మాలను తలలో పెట్టుకుంటారు కాని ఉత్తదారాన్ని పెట్టుకోరు కదా.

ఇక్కడ దండ వేదాంతదర్శనం, పువ్వులు వేదాంతవాక్యాలు. తర్కం పువ్వుల వెనుక దాగివుంది. ఇది కనబడని దారం. వేదాంతవాక్యాలు ఒకచోట గుచ్చటానికి తోడ్పడుతుంది అంతే. అందువల్ల రెండవసూత్రాన్ని అనుమానప్రమాణంగా వాడటానికి వీలులేదు. ఇది కేవలం వేదాంతవాక్యాన్ని విశ్లేషించటానికి వాడినది. ఏమిటా వేదాంతవాక్యం? దాన్ని ముందే చూశాము.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి**

**యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి– భృగువల్లీ, తైత్తిరీయమ్**

ఇది బ్రహ్మలక్షణాన్ని మాత్రమే చెపుతుంది. ఏమిటది? బ్రహ్మ జగత్కారణం అని చెబుతుంది. కాని ప్రమాణం చెప్పటం లేదు.

ఈ ఒక్కటే చాలు వారిని ఖండించటానికి. శంకరులవారు ఇది ఒక్కటే చెప్పారు. కాని ఉపభాష్యకారులు ఇంకా కొన్ని వాదనలను చెప్పారు. వాటిని కూడా చూద్దాము.

**సిద్ధాంత దర్శనం** – వీరి జవాబు చూసేముందు మళ్ళీ ఒకసారి నైయాయికులు ఏమన్నారో చూద్దాము. నైయాయికులు ఏమన్నారు? ఈశ్వరుణ్ణి తర్కంద్వారానే అంటే అనుమానవాక్యం ద్వారానే నిరూపించవచ్చు. దానికి ప్రత్యేకించి శాస్త్రం అవసరంలేదు అన్నారు. కాని మన వేదాంతులు ఈ వాదనను ససేమిరా ఒప్పుకోరు.

ఈశ్వరుణ్ణి తర్కంతో నిరూపించలేము అంటారు సిద్ధాంతులు. ఈశ్వరుణ్ణి శాస్త్రం ద్వారానే నిరూపించగలము. శాస్త్రం నిరూపించిన ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవటానికి తర్కం వాడవచ్చు. అంటే శాస్త్రం అనే సీసాలో ఈశ్వరుడు అనే ద్రవపదార్థం ఉందనుకుందాము. శాస్త్రమనే ఆ సీసాలోంచి మన చిన్ని మెదడు అనే పాత్రలోకి ఈశ్వరుడు అనే ద్రవాన్ని పోయటానికి తర్కమనే గరాటును వాడతాము. గుర్తుంచుకోండి, గరాటు స్వయంగా ద్రవాన్ని ఇవ్వలేదు. అది కేవలం ద్రవాన్ని అందుకోవటానికి తోడ్పడుతుంది. అలాగే తర్కం స్వయంగా ఈశ్వరుణ్ణి వర్ణించలేదు. అది శాస్త్రం చెప్పినదాన్ని అందుకోవటానికి తోడ్పడుతుంది అంతే.

నైయాయికుడేమో ఈశ్వరుణ్ణి తర్కంద్వారా నిరూపించవచ్చు అంటే వేదాంతి ఈశ్వరుణ్ణి తర్కంద్వారా నిరూపించలేము అంటాడు.

తర్కం ద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించలేము వాక్యంలో ఈశ్వరుడు లేడు అనే అర్థం వచ్చి, సిద్ధాంతి ఈశ్వరుణ్ణి నమ్మటం లేదా అనే శంక కలిగే ప్రమాదం ఉంది. అంటే సిద్ధాంతి కూడా నాస్తికులలో కలిసిపోయాడా? అటువంటి సందేహం అవసరం లేదు. తర్కంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించలేము అంటే, ఈశ్వరుణ్ణి తర్కంద్వారా కాదు, శాస్త్రంద్వారా నిరూపించాలని అర్థం. అంటే మూడు దశల్లో ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు.

1. కేవలతర్కంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించలేము.
2. శాస్త్రంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించాలి.
3. శ్రుతిసమ్మత తర్కం వాడాలి.అంటే శాస్త్రంద్వారా నేర్చుకున్న ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవటానికి తర్కం వాడాలి.

ఇది నైయాయికుల దర్శనం, సిద్ధాంత దర్శనాల గురించిన నేపథ్యం. ఈ నేపథ్యంతో ఇరుపక్షాల వాదనలూ చూద్దాము.

**నైయాయిక వాదన** – నైయాయికుడు మూడు అనుమానవాక్యాలద్వారా ఈశ్వరుణ్ణి నిరూపిస్తాడు.

**1. జగత్ సకర్తృకం కార్యవత్వాత్ ఘటవత్**

నిజానికి నైయాయికుడు జగత్ పదం వాడడు. కాని మనం మన వీలుకోసం ఆ పదాన్నే వాడదాము. ఈ వాక్యం అర్థం ఏమిటి? జగత్తు కర్త కాదు. ఎందుకు? అది కార్యం కాబట్టి. ఎలా చెప్పగలము? కుండ ఉదాహరణ ద్వారా. ఇంకో విధంగా చెప్పాలంటే జగత్తు కార్యం కాబట్టి అది కారణం కాలేదు.

ప్రతి అనుమాన వాక్యానికి ఒక వ్యాప్తి వాక్యం ఉండాలని చూశాము కదా. దీనికి వ్యాప్తివాక్యం –

**యత్ యత్ కార్యం తత్ తత్ సకర్తృకమ్**

అంటే ఏదైతే కార్యమో, దానికొక కర్త ఉండితీరాలి. ఈ నియమం ప్రకారం జగత్తు కార్యం కాబట్టి, జగత్తనే కార్యానికి ఒక కర్త ఉండితీరాలి. కర్త అంటే సృష్టికర్త లేదా కారణం.

ఈ అనుమానవాక్యం ప్రకారం – ఒక సృష్టికర్త ఉన్నాడు.

**2. జగత్కర్తా ఈశ్వరః జీవ భిన్నత్వే సతి చేతనత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఇది రెండవ అనుమానవాక్యం. మొదటి అనుమానవాక్యంలో ఒక సృష్టికర్త ఉండాలని నిరూపించాడు. ఇప్పుడు ఈ వాక్యంద్వారా ఆ సృష్టికర్త ఈశ్వరుడే అయివుండాలి అంటాడు. అదెలా?

ఒక సృష్టికర్త ఉన్నాడని తెలుసు. ఆ సృష్టికర్త జీవి కాదని తెలుసు. అంటే మానవమాత్రుడెవరూ జగత్తును సృష్టించలేడు. మనిషి చంద్రుణ్ణి కాని, సూర్యుణ్ణి కాని సృష్టించలేడు. కాబట్టి మనిషి కాదు. అంతేకాదు, ఆ సృష్టికర్తకు తెలివితేటలు ఉండాలి. మనకు అందుబాటులో ఉన్నవి మూడు – జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. జీవుడు సృష్టించలేడు, జగత్తు జడం అందువల్ల తెలివితేటలు లేవు.

ఒక సృష్టికర్త ఉన్నాడు, అతనికి తెలివితేటలు ఉన్నాయి కాని, జీవికున్న తెలివితేటలు చాలవు, జడమైన జగత్తుకు తెలివితేటలే ఉండవు అంటే ఇంక మిగిలింది ఏమిటి? ఈశ్వరుడు. దీన్ని పారిశేష్యన్యాయం అంటారు. జీవజగత్తు

ఈశ్వరులలో సృష్టికర్త జీవుడు కాదు, జగత్తు కాదు అని కొట్టివేస్తే మిగిలిన ఈశ్వరుడే సృష్టికర్త అవ్వాలి.

అనుమానవాక్యానికి దృష్టాంతం ఇచ్చితీరాలి. ఉన్నది ఒకటే ఈశ్వరుడు కాబట్టి దానికి పోలిన ఉదాహరణను ఇవ్వలేరు. అప్పుడు దానికి భిన్నంగా ఉన్న ఉదాహరణను ఇస్తారు. కుమ్మరిలాగా కాదు అంటారు. ఈ అనుమానవాక్యం అర్థం ఏమిటి?

జగత్కర్త ఈశ్వరుడు. ఎలా చెప్పగలము? జీవుడు కాదు, కాని చేతనతత్త్వం ఉండాలి. కాని కుమ్మరిలాగా జీవుడు కాదు. అలాంటిది ఈశ్వరుడు మాత్రమే.

దీనికి వ్యాప్తివాక్యం –

**యత్ జీవభిన్నత్వే సతి చేతనం తత్ ఈశ్వరః**

ఏదైతే జీవునికి భిన్నంగా ఉన్న చేతనమో అది ఈశ్వరుడు.

ఈ అనుమాన వాక్యం ప్రకారం ఆ సృష్టికర్త ఈశ్వరుడు.

**3. ఈశ్వరః సర్వజ్ఞః సర్వకర్తృత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఇది మూడవ అనుమానవాక్యం. దీని అర్థం ఈశ్వరుడు సర్వజ్ఞుడు అయివుండాలి. ఎందువల్ల? అన్నిటినీ సృష్టించినది ఈశ్వరుడే కాబట్టి. దీనికి మళ్ళీ ఉదాహరణ భిన్నంగా ఉన్న ఉదాహరణ. కుమ్మరి కుండను మాత్రమే (అంటే మట్టి ప్రపంచాన్ని మాత్రమే) సృష్టించగలడు. ఈశ్వరుడు సర్వప్రపంచాన్నీ సృష్టించగలడు. అంటే కుమ్మరి అల్పజ్ఞుడు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు. దీనికి వ్యాప్తివాక్యం.

**యత్ర సర్వ కర్తృత్వం తత్ర సర్వజ్ఞత్వమ్**

ఎవరైతే అన్నిటినీ సృష్టిస్తాడో, అతను సర్వజ్ఞుడు. ఈ అనుమానవాక్యం ప్రకారం– ఆ సృష్టికర్త అయిన ఈశ్వరుడు సర్వజ్ఞుడు.

ఈ అనుమానవాక్యాలద్వారా సృష్టికర్త ఉన్నాడనీ, అతను ఈశ్వరుడనీ, అతను సర్వజ్ఞుడనీ కూడా తెలిశాక, ఇంక ప్రత్యేకించి ఈశ్వరుని గురించి తెలిపే వేదప్రమాణం ఎందుకు? ఇది నైయాయికుని వాదన.

**సిద్ధాంతి జవాబు** – సిద్ధాంతి అసలు ఈ మూడు అనుమానవాక్యాల్లోనూ దోషం ఉంది అంటాడు. అసలు నిజానికి మొదటి అనుమానవాక్యాన్ని కొట్టివేస్తేనే, తక్కిన రెండూ వీగిపోతాయి. ఎందుకంటే అవి మొదటి అనుమాన వాక్యాన్ని ఆధారంగా చేసుకుని వచ్చినవి. ఈ మూడు అనుమాన వాక్యాలూ తప్పే. ఇలాంటి వాదనలతో తార్కికంగా ఆలోచించలేని వారిని గెలవవచ్చేమో కాని, మా సిద్ధాంతులను కాదు అంటారు ఉపభాష్యకారులు. నైయాయికుల తర్కంకన్నా తార్కికంగా ఉంటుంది మన అద్వైతవేదాంతం. అది ఎలాగో చూద్దాము.

1. **వ్యాప్తి అసిద్ధిః** – పూర్వపక్షి చెప్పిన మొదటి అనుమాన వాక్యం చూద్దాము ముందు. అది – **జగత్ సకర్తృకం కార్యవత్త్వాత్ ఘటవత్**

జగత్తు కార్యం కాబట్టి అది కారణం కాలేదు, కుండలాగా.

ఈ అనుమాన వాక్యానికి ఇచ్చిన ఉదాహరణ కుండ. కుండ కార్యం, దానికొక కర్త ఉన్నాడు; ఈ గది ఒక కార్యం, దానికొక కర్త ఉన్నాడు. గడియారం ఒక కార్యం, దానికొక కర్త ఉన్నాడు. కర్త అంటే సృష్టికర్త లేదా కారణం. ఈ జగత్తు ఒక కార్యం, దానికొక కర్త ఉన్నాడు. అంతా వినటానికి బాగుంది.

ఇప్పుడు ప్రతి అనుమాన వాక్యానికీ ఒక వ్యాప్తివాక్యం ఉండాలి. ఆ వ్యాప్తివాక్యం ప్రత్యక్షప్రమాణంమీద మాత్రమే ఆధారపడివుండాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఒకవేళ ఈ వ్యాప్తి ఇంకొక అనుమానంమీద ఆధారపడితే, ఆ అనుమానాన్ని నిరూపించటానికి ఇంకొక వ్యాప్తి, ఆ వ్యాప్తికి ఆధారంగా ఇంకొక అనుమానం – ఇలా కొనసాగుతూ పోతుంది. దీన్ని ఇన్‌ఫినిట్ రిగ్రెస్ అంటారు.

నిజానికి బ్రహ్మ గురించి అనుమాన వాక్యానికి వ్యాప్తివాక్యం శాస్త్రంనుంచి చెబుతాము. అందువల్ల దీన్ని శాస్త్రఅనుమాన ప్రమాణం అంటాము. కాని ఇక్కడ నైయాయికుడు ఏమంటున్నాడు? బ్రహ్మకు ప్రమాణం చూపించటానికి శాస్త్రం దాకా పోనవసరం లేదు, అనుమాన ప్రమాణమే చాలు అంటున్నాడు. కేవల తర్కేణ ఈశ్వరసిద్ధిః అన్నాడు. అందువల్ల అతను వ్యాప్తికి శాస్త్రానికి పోలేదు. అంటే అతని వ్యాప్తివాక్యం ఇంకొక అనుమానంనుంచి చెప్పలేదు, శాస్త్రంనుంచి చెప్పలేదు, **ప్రత్యక్షప్రమాణంనుంచే చెప్పాలి.**

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్త్వాత్ యథా మహానసే**

కొండమీద అగ్ని ఉంది, పొగ కనిపిస్తోంది కాబట్టి, పూర్వకాలపు వంటింట్లోలాగా. ఇది మనం ఉదాహరణగా ఇచ్చే అనుమానవాక్యం. దీనికి వ్యాప్తివాక్యం ఏమిటి?

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది. ప్రత్యక్షప్రమాణంద్వారా తెలుసు.

అలా ఇక్కడ బ్రహ్మ సృష్టికర్త అని నిరూపించటానికి నైయాయికులు వాడిన వ్యాప్తివాక్యం ఏమిటి?

**యత్ యత్ కార్యం తత్ తత్ కర్తృకమ్**

ఏదైతే కార్యమో, దానికొక కర్త ఉండాలి. వ్యాప్తివాక్యం గురించిన ఒక నియమం ఉంది. వ్యాప్తివాక్యం నిజమైతేనే, అనుమాన వాక్యాన్ని నిరూపించగలము. అందువల్ల వ్యాప్తివాక్యం అన్నివేళలా నిజమవ్వాలి. దానికి ఎక్సెప్షన్ ఉండకూడదు. అంటే వ్యభిచారదోషం ఉండకూడదు. అలా ఉంటే, వ్యాప్తివాక్యం వీగిపోతుంది.

మనం ఉదాహరణలో చూసిన వ్యాప్తివాక్యాన్నే మళ్ళీ చూద్దాము.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది. దీన్ని ఒప్పుకుంటాము, ఎందుకంటే దీనిలో వ్యభిచారదోషం లేదు. కాని ఆ ఉదాహరణకు ఈ వ్యాప్తి కాకుండా, ఇంకొక వ్యాప్తివాక్యం ఇచ్చారనుకోండి, అది చెల్లదు. ఏమిటది?

**యత్ర యత్ర అగ్నిః తత్ర తత్ర ధూమః**

ఈ వాక్యం అన్నివేళలా చెల్లదు. ఈ వాక్యం అర్థం – ఎక్కడ అగ్ని ఉంటే అక్కడ పొగ ఉంటుంది. ఈ నియమం అన్ని వేళలా చెల్లదు. మన ఈ కాలపు వంటిల్లు తీసుకుంటే, గ్యాస్‌స్టవ్‌కు అగ్ని ఉంటుంది కాని పొగ రాదు. అందువల్ల ఈ వాక్యం చెల్లదు.

అందువల్ల వ్యాప్తివాక్యం గురించి రెండు నియమాలు గుర్తుంచుకోవాలి. అవి–

1. వ్యాప్తివాక్యాన్ని ప్రత్యక్షప్రమాణంద్వారా నిరూపించాలి.
2. వ్యాప్తివాక్యానికి వ్యభిచారదోషం ఉండకూడదు.

వీటిని ఆధారంగా చేసుకుని సిద్ధాంతి ఇచ్చిన జవాబు - మనిషి సృష్టించిన వస్తువులకు, సృష్టికర్త ఉన్నాడని ప్రత్యక్షప్రమాణం ద్వారా నిరూపించవచ్చు. కాని ప్రకృతికి సృష్టికర్తను ప్రత్యక్షం ద్వారా నిరూపించలేము. ఉదాహరణకు మనుష్యులు దూరని చిట్టడవులలో చెట్లను ఎవరు సృష్టించారు? ఆ సృష్టికర్త ప్రత్యక్షప్రమాణానికి అందదు కాబట్టి ఈ వ్యాప్తికి వ్యభిచారదోషం ఉంది.

నైయాయికుల మొదటి అనుమానవాక్యంయొక్క వ్యాప్తివాక్యానికి వ్యభిచారదోషం ఉంది. **వ్యాప్తి అసిద్ధిః.**

2. **పారిశేష్య న్యాయ అభావాత్** - పూర్వపక్షి చెప్పిన రెండవ అనుమానవాక్యం చూద్దాము ఇప్పుడు.

**జగత్ కర్తా ఈశ్వరః జీవభిన్నత్వే సతి చేతనత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఈ అనుమానవాక్యం ప్రకారం జగత్‌యొక్క సృష్టికర్త ఈశ్వరుడే అయివుండాలి. ఎందుకంటే అతను జీవభిన్నుడు+చేతనతత్త్వం కాబట్టి. కుమ్మరికి భిన్నంగా ఉన్నాడు.

దీనికి వ్యాప్తివాక్యం - **యత్ జీవభిన్నత్వే సతి చేతనం తత్ ఈశ్వరః**

చేతనతత్త్వం అయి, జీవుడు కాకపోతే అది ఈశ్వరుడు.

కాని మన జవాబు మళ్ళీ అదే. ముందే చూశాము, మొదటి అనుమాన వాక్యాన్ని తప్పని నిరూపిస్తే, సహజంగానే తక్కిన రెండూ వీగిపోతాయని. మన జవాబు - **వ్యాప్తివాక్యం ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడివుండాలి**. జీవుడు కాని ఇంకొక చేతనతత్త్వం అని ఎలా చెబుతారు? జీవుడు ప్రత్యక్షం కాని, జీవుడు కాకుండా ఇంకొక చేతనతత్త్వం ప్రత్యక్షప్రమాణానికి అందదు.

ఒక హాలులో మీరు కాక ఇంకొక ఇద్దరు కూర్చున్నారనుకుందాము. అక్కడ ఒక కాఫీ కప్పు పెట్టివుంది. మీరు కొంచెం తల ఇటుతిప్పి, మళ్ళీ వెనక్కి తిరిగి చూసేసరికి కాఫీ ఎవరో తాగేశారు. అందులో కాఫీ మాయమయింది. ఎవరు తాగివుంటారు? మీ ముగ్గురిలో ఎవరో ఒకరు తాగివుండాలి. మీరు త్రాగలేదని మీకు తెలుసు. ఆ ఇద్దరిలో ఒకరికి కాఫీ పొడే గిట్టదు. అప్పుడు పారిశేష్య న్యాయం ప్రకారం మూడవవ్యక్తి తాగివుండాలి అని ఊహిస్తారు. అది ఎప్పుడు ఊహించగలరు? ఆ ఇద్దరు మనుష్యులూ మీ కంటికి ఎదురుగా ఉన్నప్పుడు.

కాని నైయాయికులు ఏమంటున్నారు? జీవ, జగత్తు, ఈశ్వరులలో జీవుడు సృష్టికర్త కాదు, కాని సృష్టికర్తకు చేతనతత్త్వం ఉండాలి. జగత్తుకు చేతనతత్త్వం లేదు, కాబట్టి పారిశేష్య న్యాయంద్వారా ఈశ్వరుడు సృష్టికర్త అయివుండాలి అంటున్నారు. కాని ఈ పారిశేష్య న్యాయం ఇక్కడ చెల్లదు. ఈశ్వరుడు కంటికి కనపడదు. ఇంద్రియ అగోచరం. అంటే ప్రత్యక్షప్రమాణానికి అందదు. అంటే ఇక్కడ వ్యాప్తివాక్యం చెల్లదు. పారిశేష్య న్యాయం కుదరదు.

నైయాయికుల రెండవ అనుమానవాక్యానికి వ్యాప్తివాక్యం చెల్లదు. **పారిశేష్య న్యాయ అభావాత్.**

3. **స్వ అభ్యుపగమ విరోధ దోషః** – పూర్వపక్షి చెప్పిన మూడవ అనుమానవాక్యం చూద్దాము ఇప్పుడు.

**ఈశ్వరః సర్వజ్ఞః। సర్వకర్తృత్వాత్। వ్యతిరేకేణ కులాలవత్॥**

ఈశ్వరుడు సర్వజ్ఞుడు అయివుండాలి, అన్నింటినీ సృష్టించింది ఈశ్వరుడే కాబట్టి; కుమ్మరిలాగా కాకుండా.

ఈ అనుమానవాక్యాన్ని నిషేధించేముందు మనకు నైయాయికుల సిద్ధాంతాలు కొన్ని తెలియాలి. అవేమిటో చూద్దాము ముందు.

ఎ) **యత్ జ్ఞానం, తత్ మనోజన్యం** – నైయాయికుడు ఎక్కువగా తర్కం మీద ఆధారపడతాడు అని చూశాము కదా. అతను అనుమానం, అర్థాపత్తి ఎక్కువగా వాడతాడు. ఇక్కడ ఒక తార్కికవాదన చేశాడు. ఒక ప్రాథమిక సూత్రాన్ని చెప్పాడు. ఎక్కడ జ్ఞానం ఉందో, అక్కడ మనస్సు ఉంటుంది. అంతవరకూ బాగానే ఉంది, కాని ముందు వెనుకలు ఆలోచించకుండా ఇంకొక సిద్ధాంతం చెప్పాడు.

బి) **ఈశ్వరః అశరీరః** – ఈశ్వరునికి శరీరం లేదు. శరీరం లేదు అంటే అర్థం ఏమిటి? మనస్సు కూడా లేదు. ఈశ్వరునికి మనస్సు లేదన్నాడు. ఎందుకు? ఎక్కడ మనస్సు ఉంటుందో, అక్కడ సంసారం వస్తుంది. అందువల్ల ఈశ్వరుణ్ణి అసంసారి చేయాలంటే మనస్సును తీసేయాలి. మనస్సును తీసేస్తే జ్ఞానం రాదు, వారి వాక్యం ప్రకారమే.

కేవలం తర్కంమీద ఆధారపడి చేసిన వాక్యాలు నిలువలేవు. ఒక వాదన చెప్పేటప్పుడు, వారు చేసిన ఇంకొక వాదనను మర్చిపోతారు వారు. అందువల్ల వాటికి ఆధారంగా శాస్త్రం లేకపోతే, ఇలాంటి వ్యతిరేక వాక్యాలు వస్తాయి.

**సిద్ధాంతి జవాబు** – సిద్ధాంతి నైయాయికుని ఈ రెండూ వాక్యాలూ కలిపాడు. ఈశ్వరునికి మనస్సు లేదు, మనస్సువల్లనే జ్ఞానం పొందగలము. అతని మూడవ అనుమానవాక్యంద్వారా అతను నిరూపించదలుచుకున్నది ఏమిటి? ఈశ్వరుడు సర్వజ్ఞుడు. కాని అతని సిద్ధాంతాలద్వారా తేలినది ఏమిటి? సర్వజ్ఞుడు అవటం మాట దేవుడెరుగు. ఆయన అల్పజ్ఞుడు కూడా కాలేదు. మనసే లేదుకదా. అటువంటి అతనికి మీరు సర్వజ్ఞుడు అనే ఉన్నతహోదా ఇద్దామనుకుంటున్నారు. అది సాధ్యం కాదు. మీ వాక్యాలే పరస్పరవిరుద్ధంగా ఉన్నాయి కాబట్టి మీ వాదనలో స్వ అభ్యుపగమ విరోధదోషం ఉంది అంటున్నాడు సిద్ధాంతి.

నైయాయికుల రెండవ అనుమానవాక్యానికి ఆధారం లేదు. **స్వ అభ్యుపగమ విరోధ దోషః.**

ఈ దోషాలు ఎందుకు వచ్చాయి? వారు శాస్త్రంమీద ఆధారపడకుండా కేవలం తర్కంమీద ఆధారపడ్డారు కాబట్టి. అందువల్ల కేవలం తర్కంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించలేమని నిరూపించారు సిద్ధాంతులు.

**ఉపభాష్యకారులు** – ఈ వాదనల్లోకి శంకరులవారు దిగలేదు. ఉపభాష్యకారులు చేశారు ఈ వాదనలు. శంకరాచార్యులవారి భాష్యానికి ఎందరో ఉపభాష్యకారులు మళ్ళీ భాష్యం రాశారు. అందులో ప్రముఖమైనది భాష్యరత్నప్రభ. దీన్ని గోవిందానంద సరస్వతిగారు రచించారు. ఆయన భాష్యం బ్రహ్మసూత్రములమీద కాదు, బ్రహ్మసూత్రములమీద శంకరులవారు రాసిన శంకరభాష్యంమీద. ఈ భాష్యరత్నప్రభను రత్నప్రభ అని కూడా అంటారు.

ఈ రత్నప్రభమీద మళ్ళీ ఇంకొక భాష్యం వచ్చింది. అందులో కేవలం మొదటి నాలుగు సూత్రములమీద అద్భుతమైన వ్యాఖ్యానం వస్తుంది. దాన్ని **చతుర్ రత్నప్రభ వ్యాఖ్యానం** అంటారు. దాని రచనకర్త పూర్ణానంద సరస్వతి. పూర్ణానంద సరస్వతి రాశారు కాబట్టి దాన్ని **పూర్ణానందీయం** అంటారు. ఇప్పుడు మనం చూసిన వాదనలు అందులోనివి.

కేవలతర్కం చెల్లదు అని వాదించారు ఆయన. ఈశ్వరుణ్ణి తర్కంద్వారా నిరూపిద్దామని నైయాయికులు ప్రయత్నిస్తే కేవలతర్కంద్వారా ఈశ్వరుణ్ణి చూపించలేము అన్నారు. తీరా అన్నాక, ఆ వాదనను చూస్తే, ఈశ్వరుడు లేడని అర్థం వచ్చే ప్రమాదం ఉంది. అప్పుడు ఆయన కూడా నాస్తికులలో చేరినట్టు అవుతుంది. అందువల్ల వాదన అంతా అయ్యాక చివర్లో ఒక మంగళశ్లోకం రాస్తారు. అందులో తన ఇష్టదైవమైన కృష్ణపరమాత్మను స్తుతిస్తారు.

**కృష్ణాయ మంగళమ్.**

'ఓ భగవాన్! నన్ను క్షమించు. నా ఉద్దేశం నువ్వు లేవని కాదు. నేను నువ్వు లేవని నైయాయికులతో వాదించింది కేవలతర్కం చెల్లదని నిరూపించటానికి.'

శంకరాచార్యులవారు తన భాష్యంలో ఇంకొక విషయాన్ని కూడా స్పష్టం చేశారు. ఏమిటది ఈశ్వరుణ్ణి తర్కంద్వారా నిరూపించలేము అంటే తర్కం అసలు వాడకూడదా అనే సందేహం రావచ్చు. దానికి **శ్రుతిసమ్మత తర్కం** వాడాలి అని నిరూపించారు.

పూర్వపక్షులతో వాదించేటప్పుడు, వారి తర్కంలో లొసుగులను ఎత్తి చూపుతారు. ఉపనిషత్తే చెబుతుంది –

**నైషా తర్కేణ మతిరాపనేయా**

బ్రహ్మ గురించి తెలుసుకునేటప్పుడు తర్కంమీద ఆధారపడవద్దు అంటుంది. అంటే తర్కం అసలు అవసరం లేదా? తర్కం చాలా అవసరం వేదాంతంలో. అసలు అవసరం లేదు అనుకోవటం పొరపాటు. ఉపనిషత్తే చెబుతుంది –

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్**

మంతవ్యః అంటే మననం. మననం చెయ్యటానికి తర్కం అవసరం. అంతదాకా ఎందుకు? బ్రహ్మసూత్రములను న్యాయప్రస్థానం అంటారని చూశాము. అంటే బ్రహ్మసూత్రములు మొత్తం ఉపనిషత్తులను తర్కపరంగా విశ్లేషిస్తుంది. అందువల్ల తర్కం చెల్లదు అనటానికి వీలులేదు. అయితే ఏం చేయాలి?

తర్కాన్ని వేదాంతాన్ని అర్థం చేసుకునేటందుకు వాడాలి. అంటే వేదాంతబోధను మనసన్న మెదడులో పోసేందుకు వీలుగా వాడే గరాటలాగా వాడాలి తర్కాన్ని. అంటే శ్రుతిసమ్మత తర్కం వాడాలి.

తైత్తిరీయోపనిషత్తులో, బ్రహ్మానందవల్లీలో ఒక శిష్యుడు బ్రహ్మ ఉన్నాడా లేదా అని ప్రశ్న వేస్తాడు.

**బ్రహ్మ అస్తి వా న వా?**

బ్రహ్మ ఉన్నాడని నిరూపిస్తూ గురువు ఏడు కారణాలు చూపిస్తాడు. బ్రహ్మ అస్తి -

1. నిమిత్త కారణత్వాత్ - నిమిత్తకారణంగా
2. జీవరూపేణ వర్తమానత్వాత్ - జీవాత్మగా
3. ఉపాదాన కారణత్వాత్ - ఉపాదాన కారణంగా
4. సుకృతే ప్రసిద్ధే - జగత్తుగా
5. రసప్రసిద్ధే - ఆనందహేతువుగా
6. జడశరీరే చేష్టాదర్శనత్వాత్ - చైతన్యస్వరూపంగా
7. భయ అభయ హేతుత్వాత్ - అజ్ఞానికి భయంగా, జ్ఞానికి అభయంగా

ఈ తార్కిక జవాబులు కేవలం తర్కంమీద ఆధారపడి ఇచ్చినవి కావు. ఇవన్నీ శాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని ఇచ్చిన జవాబులు.

అలా రెండు రకాల తర్కాలు ఉన్నాయి - శ్రుతిసమ్మత తర్కం, కేవలతర్కం. వేదాంతం శ్రుతిసమ్మత తర్కాన్ని స్వీకరిస్తే, తార్కికుడు కేవలతర్కాన్ని తీసుకుంటాడు. అందుకని వారిని విమర్శిస్తాడు సిద్ధాంతి.

**వాక్యార్థశ్చ విచార్యతాం శ్రుతిశిరః పక్షః సమాశ్రీయతాం**
**దుస్తర్కాత్సువిరమ్యతాం శ్రుతిమతస్తర్కోఽనుసంధీయతామ్ - సాధనపంచకమ్**

దుష్తర్క అంటే కేవలతర్కం. అంటే శ్రుతి ప్రమేయం లేకుండా చేసే తర్కం. అలా ఎన్నడూ చెయ్యవద్దంటున్నారు శంకరులవారు. ఎప్పుడూ శ్రుతిసమ్మత తర్కం తీసుకోవాలి. అదీ నైయాయికులకూ, సిద్ధాంతులకూ మధ్య ఉన్న భేదం. నైయాయికులు కేవలతర్కం వాడితే, సిద్ధాంతులు శ్రుతిసమ్మతి తర్కం వాడతారు.

నైయాయికులది ఒక విపరీతధోరణి అయితే, పూర్వమీమాంసకులది ఇంకొక విపరీతధోరణి. పూర్వమీమాంసకులు అంటే వేదపూర్వభాగాన్ని ఆధారం చేసుకుని విశ్లేషించే దార్శనికులు. వేదపూర్వభాగంలో కర్మ, ఉపాసనలు ఎక్కువగా వస్తాయి. అందువల్ల వారు అసలు తర్కం అవసరం లేదంటారు. వారు అలా ఎందుకు

అంటారో చూపిస్తూ, ఉత్తరమీమాంసకూ, పూర్వమీమాంసకూ మధ్య ఉన్న మరికొన్ని భేదాలను చర్చించారు శంకరులవారు.

## కర్మకాండ, జ్ఞానకాండల మధ్య ఉన్న భేదాలు

### 1. కర్మకాండలో ప్రశ్నలు అడగకూడదు

కర్మకాండలో తర్కం పెద్దగా అవసరం లేదు. ఎందుకంటే కర్మకాండలో అనేక యజ్ఞాలు చేయాలి. ఆ యజ్ఞాలు ఎలా చేయాలో తెలిస్తే చాలు; దానికి పెద్దగా తర్కం ఉపయోగించాల్సిన పనిలేదు. ఒక యజ్ఞంలో నెయ్యి వెయ్యాలా, పాలు పొయ్యాలా తెలుసుకుంటే చాలు; ఎందుకు నెయ్యే వెయ్యాలి, లేదా ఎందుకు నెయ్యి వెయ్యకూడదు వాదనలకు చోటులేదు. దేని తర్వాత ఏది చేయాలి అనే చిన్న అంశాలలో తర్కం వస్తుంది తప్పితే, మిగతావాటిల్లో అవసరం లేదు.

ఉదాహరణకు మీరు కారు డ్రైవింగ్ నేర్చుకోవాలంటే, కారు ఎలా పనిచేస్తుందో నేర్చుకోనవసరం లేదు. గేరు ఎలా మార్చాలో, క్లచ్ ఎలా నొక్కాలో తెలుసుకుంటే చాలు. అంటే కారు ఎలా డ్రైవ్ చేయాలో తెలుసుకుంటే చాలు, దానికి కారుని ఎలా రిపేర్ చేయాలో తెలుసుకోనవసరం లేదు. అలాగే ఒక యజ్ఞం ఎలా చెయ్యాలో తెలుసుకుంటే చాలు. అలాగే ఎందుకు చేయాలో తెలుసుకోనవసరం లేదు.

అంటే కర్మకాండ కర్మ ప్రధానంగానూ, తర్కం అప్రధానంగానూ ఉంటుంది.

**జ్ఞానకాండలో పరిప్రశ్నలు వేయాలి–** జ్ఞానమార్గంలో తర్కం కావాలి. దాన్ని మననం అంటారు వేదాంతంలో. వేదాంతబోధను అర్థం చేసుకునే తతంగంలో సంశయం కలుగుతుంది. అంటే అనేక సందేహాలు కలుగుతాయి. వాటిని పారద్రోలటానికి శ్రుతిసమ్మత తర్కం కావాలి. అంటే తర్కం చీపురులా పనిచేస్తుంది. వేదాంతబోధ మెదడులో ప్రవేశించేటప్పుడు, అందులో ఏమైనా సందేహాలు ఉంటే, తర్కమనే చీపురుతో వాటిని తుడిచివేస్తే వేదాంతానికి చక్కటి రాచబాటను వేసినవారమవుతాము.

ఆ విధంగా కర్మకాండలో తర్కం అప్రస్తుతం, జ్ఞానకాండలో మననంలో తర్కం ఉంటుంది.

**2. కర్మకాండ – కర్మ ప్రధానం**

కర్మ ఎప్పుడు చెయ్యాలి? ఏదైనా భవిష్యత్తులో సాధించాలనుకుంటే చెయ్యాలి. ప్రాణాయామం చేస్తే ఆస్తమా నయమవుతుందని వింటే చాలదు. దాని గురించి నాలుగు రోజులు నేర్చుకున్నా చాలదు. దాన్ని ఆచరణలో పెట్టాలి. అంటే రోజూ పొద్దున్నే లేచి, కర్మ చేయాలి. ప్రాణాయామం చేయాలి. అందువల్ల కర్మకాండలో– జ్ఞానం+కర్మ=ఫలం.

**జ్ఞానకాండ – జ్ఞానప్రధానం** – జ్ఞానకాండలో జ్ఞానం=ఫలం.

**న తు సాధ్యః పరంతు సిద్ధః**

మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు.

ఎవరైనా శిష్యుడు, గురువు దగ్గరికి వెళ్ళి, 'నాకు మీ దయవల్ల వేదాంతం బాగా అర్థమయింది. నేను నిత్య, ముక్త, శుద్ధబ్రహ్మను అని స్పష్టంగా తెలిసింది. కాని ఆ బ్రహ్మను అవటానికి ఏ సాధన చేయాలో తెలియటం లేదు. మీ దగ్గర నాలుగు ఉపనిషత్తులు విన్నాను. చాలా బాగా చెప్పారు. కాని నేను ఎప్పటికన్నా ఆ బ్రహ్మను అవుతానా? కనీసం ఈ జన్మలో కాకపోయినా, వచ్చే జన్మలో అయినా అవుతానా?' అంటే, ఆ గురువుకు తన బోధమీద ఇంకా వైరాగ్యం రాలేదంటే, గురువు ప్రారబ్ధం ఇంకా పూర్తికాలేదన్నమాట.

వేదాంతంలో అర్థం చేసుకోవటం=ఫలం. అర్థం చేసుకోవటంలో ఏమైనా ఆటంకాలుంటే, వాటిని పారద్రోలాలి కాని, కొత్తగా ఆచరణలో పెట్టేది ఏమీలేదు. జ్ఞానమార్గంలో కర్మకు చోటులేదు.

**3. కర్మకాండలో ఫలం భవిష్యత్తులో వస్తుంది**

కర్మకాండలో ఫలితం వెంటనే రాదు. కర్మకాండలో జ్యోతిష్టోమ యజ్ఞం చేస్తే స్వర్గలోకం పొందుతారని వస్తుంది. స్వర్గలోక అనుభవాన్ని ఇక్కడే ఇప్పుడే పొందలేము. అంటే ఆ యజ్ఞం చేసి, ఎదురుచూస్తూ ఉంటే, మన ప్రారబ్ధకర్మ ముగిసి, మనం మరణించాక స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది. అంటే స్వర్గలోకానికి మొదటి అర్హత మరణం.

**జ్ఞానకాండలో ఫలం ఇక్కడే ఇప్పుడే వస్తుంది –** కర్మకాండలాగానే, జ్ఞానకాండకు కూడా కర్మ చేయాలి అనుకుంటారు చాలామంది. జ్ఞానకాండ మోక్షం గురించి

చెబుతుంది, అది విన్నాక, ఏ ధ్యానమో చేస్తే, భవిష్యత్తులో ఎప్పుడో మోక్షం పొందుతాము అనుకుంటారు. అది పెద్ద పొరపాటు అంటున్నారు శంకరులవారు.

వేదాంతం సాధ్యవస్తువు గురించి మాట్లాడటం లేదు. ఎప్పుడో భవిష్యత్తులో జరగబోయే అంశం గురించి చెప్పటం లేదు. మనం జ్ఞానకాండలో ఒక ధ్యానపద్ధతో, మరేదో నేర్చుకోవటం లేదు. జ్ఞానం పొందాక, కొత్తగా చేసేదేమీలేదు.

అయితే వేదాంతం దేని గురించి బోధిస్తున్నది? వేదాంతం మోక్షం గురించి చెబుతున్నది. అది నువ్వు పొందేశావు అంటున్నది. అంటే మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో పొందే సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అంటున్నది. దానికోసం వేరే కర్మ చెయ్యనవసరం లేదు. ఫలం ఇక్కడే ఇప్పుడే వస్తుంది.

### 4. **కర్మకాండలో ఛాయిస్ ఉంది**

కర్మకాండలో ఒక యజ్ఞం చేయాలంటే, అలాగే ఎందుకు చేయాలని అడగకూడదు అన్నాము. అంటే తర్కం ఉపయోగించకూడదు అన్నాము. కాని ఆ యజ్ఞం చేయాలో, వద్దో నిర్ణయించుకునే హక్కు మీకు ఉంది. అంతేకాదు కర్మకాండలో అనేక మార్గాలు ఉంటాయి – కర్మ, ఉపాసన, ధ్యానం, నామజపం, పారాయణం. అందువల్ల వాటిల్లో మీకు ఏది కావాలో అది ఎన్నుకునే మార్గం ఉంది. అంటే ఛాయిస్ ఉంది.

**జ్ఞానకాండలో ఛాయిస్ లేదు** – జ్ఞానకాండలో ఛాయిస్ లేదు. జ్ఞానకాండకు రావాలా, వద్దా ఎన్నుకునే అధికారం ఉంది కాని వచ్చాక ఏం చేయాలో మీకు ఛాయిస్ లేదు. మోక్షం కావాలంటే ఒక్కటే మార్గం ఉంది. అది వేదాంతబోధ వినాలి. అది కూడా గురువుద్వారా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

జ్ఞానకాండలో గురువు బోధ విన్నప్పుడు రెండు అవకాశాలు ఉన్నాయి. మీకు గురువు చెప్పింది అర్థమవుతుంది, గురువు చెప్పింది అర్థం కాదు. గురువు చెప్పింది అర్థం కాకపోతే ఏం చేయాలి? అర్థం అయ్యేదాకా శ్రవణం చేస్తూనే ఉండాలి. అర్థమయితే ఏం చేయాలి? అప్పుడూ చేసేది ఏంలేదు. మోక్షం పొందటానికి ఏమీ చెయ్యనవసరం లేదు, నేను ముక్తపురుషుణ్ణి అని అర్థం చేసుకుంటే చాలు. అంటే పారడైమ్ షిఫ్ట్ అంటారు. మీ బుద్ధిలో, మీ జ్ఞానంలో మార్పు రావాలి. అంతేకాని కర్మ చెయ్యనవసరం లేదు. **జ్ఞానం = ఫలం.**

ఆ విధంగా కర్మకూ, జ్ఞానానికీ మధ్య కొన్ని భేదాలను విశ్లేషించారు శంకరాచార్యులవారు. దానిద్వారా పూర్వమీమాంసకులను కూడా పరోక్షంగా ఖండించినట్టయింది.

నైయాయికులతో వాదన ద్వారా కేవలతర్కం కుదరదనీ, శ్రుతిసమ్మత తర్కం ఉండాలనీ నిరూపించారు. కర్మకాండకూ, జ్ఞానకాండకూ మధ్య భేదాలను చూపించటంద్వారా తర్కాన్ని పూర్తిగా కొట్టివేయకూడదనీ, శ్రుతి చెప్పినదాన్ని అర్థం చేసుకోవటానికి తర్కం అవసరమనీ నిరూపించారు. అంటే ఈ రెండు భిన్నవాదాలూ సరియైనవి కావని తెలుస్తున్నది. అటు పూర్తిగా తర్కంమీదనే ఆధారపడకూడదు, ఇటు పూర్తిగా తర్కాన్ని కొట్టిపారేయకూడదు. శ్రుతిసమ్మత తర్కం ఉండాలి. అంటే శ్రుతి+యుక్తి ఉండాలి.

శంకరాచార్యులవారు ఏ వాదన చేసినా శ్రుతి, యుక్తి, అనుభవాలను ఆధారం చేసుకుని చేస్తారు. ఇంతవరకూ శ్రుతి, యుక్తి ఎలా ముఖ్యమో చూశాము. ఇప్పుడు అనుభవ ప్రమాణాన్ని గురించి శంకరులవారు ఏం చెప్పారో చూద్దాము.

**అనుభవ ప్రమాణం** – అనుభవ ప్రమాణం ఎందుకు అవసరం? ఎందుకంటే మన అనుభవం మనం సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నామని చెబుతోంది. మన అనుభవం మనం పరిమితి ఉన్న జీవులమని చెబుతుంది.

సంసారం అంటే రాగద్వేషాలు, అహంకారమమకారాలు, అశాంతి, నిస్సహాయత, పరిచ్ఛిన్నత్వం, అభద్రతా భావన, దుఃఖం. మోక్షం అంటే వీటన్నిటినుంచీ విముక్తి అంటుంది శాస్త్రం.

సంసారం అనుభవం అయితే మోక్షం కూడా అనుభవమే. శాంతి, భద్రత, ఆనందాలను కలుగజేస్తుంది. పూర్ణత్వం ఏర్పడుతుంది; సమత్వం అలవడుతుంది. ఈ అనుభవం ఏదో లీల కాదు. ఇది పరిచ్ఛిన్నభావననుంచి, దుఃఖంనుంచి, అశాంతినుంచి విడుదల చేస్తుంది.

**సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్ ।**
**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ॥** – **గీత** 6.21

జీవితం ఎలా ఉందని ఎవరైనా అడిగితే మామూలుగా అయితే, 'ఏముంది ఈ జీవితంలో?' అంటారు. కాని వేదాంతబోధ సరిగ్గా అర్థమయితే ఈ సంసార

భావన పోతుంది. దీన్ని విపరీతభావన అంటారు. ఈ విపరీతభావన పోయి, ఇక్కడే, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. దానిని జీవన్ముక్తి అంటారు.

కర్మకాండలో అలా ఫలితం వెంటనే రాదు. మరణించాక స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది. అంటే స్వర్గలోకానికి మొదటి అర్హత మరణం. అందువల్ల కర్మకాండలో ఫలం మరణించాక వస్తుంది, జ్ఞానకాండలో ఫలం ఇక్కడే, ఇప్పుడే వస్తుంది.

జ్ఞానకాండలో ఫలం ఇక్కడే, ఇప్పుడే వస్తుందని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు? జ్ఞానకాండకు వచ్చిన శిష్యుల అనుభవాలను వినటంవల్ల. 'మోక్షం ఉందో లేదో నాకు తెలియదు కాని, నేను వేదాంతబోధ వినటం మొదలుపెట్టాక, ఇంట్లో ఘర్షణ చాలామటుకు తగ్గింది,' అంటారు ఒకరు. ఇదేమిటి? అనుభవం. 'అంతకుముందు ఐదుగంటలు అరిచేవాడిని, ఇప్పుడు గంటే అరుస్తున్నాను,' అంటారు ఇంకొకరు. 'అంతకుముందు ఎవరేమన్నా ఏడిచేదాన్ని, ఇప్పుడు అంతగా ఏడుపు రావటం లేదు,' అంటారు ఇంకొకరు.

అలా అనుభవప్రమాణం మన అనుభవంలో మార్పులు చూపిస్తుంది. అందువల్ల అనుభవప్రమాణం కూడా ముఖ్యమే.

ఈ విధంగా శంకరాచార్యులవారు తన భాష్యంలో శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ప్రాముఖ్యతను నిరూపించారు.

దీనితో రెండవసూత్రం పదవిశ్లేషణ ముగిసింది.

## ఉపసంహారం – అధికరణ నిర్ణయం

ఈ అధికరణంలో ఒకటే సూత్రం ఉంది కాబట్టి ఉపసంహారంలో ఈ అధికరణ నిర్ణయం చేస్తాము. అధికరణ నిర్వచనం చూద్దాము ముందు –

**విషయో సంశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**

**సంగతి శ్చేతి పంచకం శాస్త్రేఽధికరణం స్మృతమ్**

ఒక అధికరణంలో ఐదు అంశాలు ఉండాలి. అవి – విషయః, విశయః, పూర్వపక్షః, ఉత్తరం, సంగతి.

1. **విషయః** – విషయం. అంటే చర్చిస్తున్న అంశం. ఈ అధికరణంలో చర్చించిన అంశం – బ్రహ్మలక్షణం. అంటే బ్రహ్మ నిర్వచనం.

2. **సంశయః** – సంశయం. అస్తి వా న వా? బ్రహ్మకు లక్షణం ఉందా, లేదా?

3. **పూర్వపక్షః** – పూర్వపక్షుల వాదన. పూర్వపక్షం అంటే పూర్వపక్షి వాదన. అతను ఎప్పుడూ తప్పుగానే ఆలోచిస్తాడు. అతను సరిగ్గా ఆలోచిస్తే, అతను కూడా సిద్ధాంతి అయివుండేవాడు. బ్రహ్మకు లక్షణం లేదు అంటాడు. అలా అనేస్తే చాలదు, దాన్ని నిరూపించాలి అని చూశాము.

లక్షణం అంటే ఏమిటి? అసాధారణ ధర్మలక్షణం. అంటే ఒక ప్రత్యేక గుణం ఉండాలి. ఒక గుంపులో ఉన్న వ్యక్తిని పిలవమని చెప్పాలంటే, ఆ వ్యక్తి మిగతావారికన్నా భిన్నంగా ఉండాలి కదా. తిరుపతిలో నిలుచుని, ఆ గుండుని పిలవండి అంటే ఏ గుండుని పిలుస్తారు?

పూర్వపక్షి ఈ నిర్వచనం తీసుకుని – బ్రహ్మకు అసాధారణ ధర్మలక్షణం ఏముందని చెబుతారని ప్రశ్నిస్తున్నాడు. ఎందుకంటే సిద్ధాంతి బ్రహ్మను ఏమని వర్ణిస్తాడు? నిర్గుణబ్రహ్మ అని. అందువల్ల గుణాలే లేని బ్రహ్మను ఏ గుణంతో వివరిస్తారు అంటాడు. అంతేకాదు, దానికి ఉపనిషత్తు వాక్యాన్ని కూడా చూపిస్తాడు–

**యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ**
**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి।**
**నో మనో న విద్మో న విజానీమో యథైతదనుశిష్యాత్॥** – కేన 1–3

అంటే బ్రహ్మను నిర్వచించలేమని చెబుతున్నది మీ ఉపనిషత్తే. కాబట్టి బ్రహ్మ లక్షణం నాస్తి.

4. **ఉత్తరమ్**– అద్వైతసిద్ధాంతి జవాబు. బ్రహ్మలక్షణం అస్తి అంటాడు సిద్ధాంతి. బ్రహ్మకు నిజంగా గుణాలు లేకపోయినా బ్రహ్మమీద ఆరోపించిన జగత్తునుంచి బ్రహ్మలక్షణాలు చెప్పవచ్చు.

తాడు–పాము ఉదాహరణ తీసుకుంటే, తాడుమీద పామును ఆరోపిస్తున్నాము. తాడు పాముకు అధిష్ఠానం. పామునుంచి తాడును తెలుసుకున్నాము అక్కడ. ఇక్కడ బ్రహ్మమీద జగత్తును ఆరోపిస్తున్నాము. బ్రహ్మ అధిష్ఠానం, జగత్తు అధ్యారోపం. అధ్యారోప జగత్తునుంచి బ్రహ్మలక్షణం చెప్పవచ్చు. బ్రహ్మను ఆ విధంగా జగత్ కారణంగా వర్ణించవచ్చు. అందువల్ల లక్షణం ఉంది. బ్రహ్మ లక్షణం అస్తి.

5. **సంగతి** – సంబంధం. ఈ అధికరణానికీ, ముందు అధికరణానికీ మధ్యనున్న సంబంధాన్ని సంగతి అంటారు. మొదటి అధికరణంలో – **బ్రహ్మ విచారః కర్తవ్యా.** ఈ అధికరణంలో – బ్రహ్మలక్షణం జగత్ కారణం. ఇవీ వీటిల్లో అంశాలు. ఈ రెండింటినీ ఎలా కలుపుతాము? ఈ సంగతిని సాంకేతికపరంగా ఆక్షేప సంగతి అంటారు. అంటే మొదటి అధికరణంలో పూర్వపక్షి ఒక అభ్యంతరం చెపితే, దానికి ఇందులో జవాబు వస్తుంది.

మొదటి సూత్రంలోని అభ్యంతరం ఏమిటి? మొదటిసూత్రంలో బ్రహ్మవిచారణ చేసితీరాలి అన్నారు వ్యాసాచార్యులవారు. దానికి పూర్వపక్షి – బ్రహ్మనాస్తి – అన్నాడు. బ్రహ్మ లేదు, మీరు బ్రహ్మ ఉన్నాడని నిరూపించలేరు అన్నాడు.

**లక్షణ ప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః**

లక్షణం+ప్రమాణం తెలిస్తే ఒక వస్తువు గురించి తెలుస్తుందని చూశాము. ఈ విషయాన్ని మర్చిపోకూడదు. అందువల్ల ఈ సూత్రంలో బ్రహ్మలక్షణాన్ని వివరించారు వ్యాసాచార్యులవారు. బ్రహ్మ ఉన్నాడు, లక్షణం ఉంది కాబట్టి, బ్రహ్మవిచారణ చేసితీరాలి. దీన్ని ఆక్షేపసంగతి అంటారు.

ఇక్కడితో అధికరణ నిర్ణయం ముగిసింది. ఇక్కడితో రెండవసూత్రంయొక్క విశ్లేషణ కూడా ముగిసింది. కాని ఇది చాలా ముఖ్యమైన సూత్రం. ఎందుకు ముఖ్యమైన సూత్రమో వివరంగా చూద్దాము.

## రెండవసూత్రం ప్రత్యేకత

మొత్తం బ్రహ్మసూత్రములలోనే రెండవసూత్రం చాలా ముఖ్యమైన సూత్రం. ఇది వేదాంతశాస్త్రానికి పునాదిలాంటిది. అందువల్ల ఈ సూత్రంలోని కొన్ని ప్రత్యేక అంశాలు చూద్దాము.

1. ఈ సూత్రాన్ని బ్రహ్మలక్షణ సూత్రం అంటారు.
2. ఈ సూత్రాన్ని తటస్థలక్షణ సూత్రం అంటారు.

ఈ సూత్రంలో స్వరూపలక్షణం రాలేదు. స్వరూపలక్షణం, తటస్థలక్షణం నిర్వచనాలు మళ్ళీ చూద్దాము. దేవదత్తుని ఇంటిని ఆ ఇంటి లక్షణాలతో వివరిస్తే అది స్వరూపలక్షణం. ఒకవేళ అన్ని ఇళ్ళూ అలాగే ఉంటే, దాన్ని తటస్థలక్షణంతో నిర్వచిస్తారు. శాస్త్రం ఎప్పుడూ ఇచ్చే ఉదాహరణ –

**కాకవత్ గృహం దేవదత్తగృహమ్**

కాకి వాలిన ఇల్లు దేవదత్తుని ఇల్లు. కాకి వాలిన ఇల్లు స్వాభావిక లక్షణమా, ఆగంతుక లక్షణమా? స్వాభావిక లక్షణమంటే కాకి ఎప్పుడూ దానిమీదే ఉండాలి. మీరు రెండోసారి వెళ్ళేసరికి కాకి దానిమీద ఉండకపోవచ్చు. అప్పుడు దేవదత్తుని ఇల్లు ఏదో మర్చిపోతారు.

అలా స్వాభావిక లక్షణాన్ని స్వరూపలక్షణమనీ, ఆగంతుకలక్షణాన్ని తటస్థ లక్షణమనీ అంటారు.

**బ్రహ్మ స్వరూపలక్షణం** – బ్రహ్మకు కూడా స్వరూపలక్షణం, తటస్థలక్షణం రెండూ ఉన్నాయి. స్వరూపలక్షణానికి ముఖ్య ఉదాహరణ –

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** – తైత్తిరీయమ్

**బ్రహ్మ తటస్థలక్షణం** – బ్రహ్మ తటస్థలక్షణాన్ని ఈ సూత్రంలో చూశాము.

**జన్మాద్యస్య యతః** – జగత్కారణం బ్రహ్మ.

జగదధిష్ఠానం బ్రహ్మ అని నిర్వచించవచ్చు అని చూశాము. అంటే బ్రహ్మను నిర్వచించటానికి మనం జగత్తును తీసుకున్నాము. జగత్తు బ్రహ్మయొక్క స్వాభావిక లక్షణం కాదు. కాకి వాలిన ఇల్లు దేవదత్తుని ఇల్లు ఉదాహరణను ఇక్కడ అన్వయిస్తే, బ్రహ్మ–దేవదత్తుని ఇల్లు; జగత్తు–కాకి. ఎందుకు జగత్తును కాకితో పోలుస్తున్నాము? కాకి ఎప్పుడో మాయమయిపోయినట్టుగా, జగత్తు ప్రళయంలో కూడా మాయమయిపోతుంది – ప్రళయకాలేనశ్యతి. నిజానికి ప్రళయకాలం దాకా వెళ్ళనవసరం లేదు, సుషుప్తికాలంలో కూడా మాయమవుతుంది. అందువల్ల జగత్తు స్వాభావిక లక్షణం కాదు.

అందువల్ల జగత్కారణం బ్రహ్మ తటస్థలక్షణం. దానికి ఆధారంగా విషయ వాక్యాన్ని తైత్తిరీయంలోంచి చూశాము –

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి।**
**యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి॥ – తైత్తిరీయం**

**తటస్థలక్షణాన్ని వాడిన ఉద్దేశం** – బ్రహ్మకు తటస్థలక్షణం, స్వరూపలక్షణం రెండూ ఉంటే, వ్యాసాచార్యులవారు తటస్థలక్షణాన్నే ఎందుకు ఎన్నుకున్నారు?

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – తైత్తిరీయమ్**

ఈ నిర్వచనాన్ని చెప్పవచ్చు కదా? దానికొక కారణం ఉంది. బ్రహ్మ గురించి అర్థం చేసుకోవాలంటే, ముఖ్యంగా వేదాంతానికి వచ్చిన మొదట్లో, తటస్థలక్షణాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఎందుకు? కారణం చాలా తేలిక. తటస్థలక్షణంలో మన కంటికి కనబడే, స్పష్టంగా తెలిసే, అందుబాటులో ఉండే, వ్యవహారం నడపగలిగే జగత్తుద్వారా బ్రహ్మను తెలుసుకుంటాము. అంటే తెలిసిన విషయంనుంచి తెలియని విషయానికి వెళతాము. తెలిసిన జగత్తునుంచి తెలియని బ్రహ్మకు వెళ్ళటం తేలిక. తెలిసిన కాకినుంచి తెలియని దేవదత్తుని ఇంటిని తెలుసుకున్నంత తేలిక.

అదే స్వరూపలక్షణం వాడి సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అని చెపితే అది అంత తేలిగ్గా అర్థం కాదు. ఎందుకు? జ్ఞానం అంటే మనకు తెలిసిన జ్ఞానం కాదు. అది శుద్ధచైతన్యం, నిర్విశేష చైతన్యం. అంటే గుణాలు లేని చైతన్యం. శుద్ధ ఉనికే అర్థం కావటంలేదు, ఇంక శుద్ధ చైతన్యాన్ని ఎలా తెలుసుకుంటాము?

ఒక్కోసారి ఇలాంటి చిక్కు సమస్యను ఏదైనా పదానికి అర్థం చూసినప్పుడు ఎదుర్కొంటాము. మనకు తెలియని పదంయొక్క అర్థం అడిగితే, అది ఇంకొక క్లిష్టపదాన్ని ఇస్తుంది. అలా గారులస్ అర్థం అడిగితే లొకేషియస్ అంటుంది; లొకేషియస్ అంటే వాల్యుబుల్ అంటుంది; వాల్యుబుల్ అంటే గారులస్ అంటుంది. మళ్ళీ మొదటికి వస్తాము. దాని అసలు అర్థం ఎక్కువ మాట్లాడే వ్యక్తి అని.

అలాగే ఉంటుంది బ్రహ్మ యొక్క స్వరూపలక్షణం చెపితే. మళ్ళీ స్వరూపలక్షణాన్ని నిర్వచించటానికి తటస్థలక్షణం చెప్పాల్సివుంటుంది. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మలో సత్యం కంటికి కనబడదు, జ్ఞానం అనుభవంలోకి రాదు, అనంతం నాకు తెలియదు. అందువల్ల సత్యం జ్ఞానం అనంతం అర్థమవాలంటే ముందు తటస్థలక్షణం అర్థమవ్వాలి. అందువల్ల ఈ రెండింటిలో ఏది మేలు అంటే తటస్థలక్షణమే మేలు.

దేవదత్తుని ఇంటి విషయంలో స్వరూపలక్షణం చెప్పినా మనమేమీ కష్టపడము. ఎఱ్ఱరంగులో ఉంటుంది, రెండంతస్తుల భవంతి, ముందువైపు చాలా విశాలమైన ఖాళీప్రదేశం ఉంది అనే వర్ణనలు చెప్పినా, అవన్నీ కంటికి కనబడతాయి. తేలిగ్గా

తెలుసుకోవచ్చు. కాని శుద్ధ సత్, శుద్ధ చిత్, శుద్ధ ఆనందాలేమిటో తెలియవు. అంత తేలిగ్గా అర్థం కాదు. అందువల్ల తటస్థలక్షణం సరిగ్గా సరిపోతుంది.

3. ఈ సూత్రంలో బ్రహ్మను ఉపాదానకారణంగా చూస్తాము. తటస్థలక్షణంలో మళ్ళీ రెండు లక్షణాలు ఉన్నాయని తెలుసు మనకు. అవి నిమిత్తకారణం, ఉపాదానకారణం. ఇక్కడ ఉపాదానకారణంగా చూస్తున్నాము.

ఉపనిషత్తుల్లో జగత్కారణంగా అభివర్ణించినప్పుడు, ఎక్కువగా బ్రహ్మను పేర్కొంటాయి.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। – తైత్తిరీయమ్**

కాని అప్పుడప్పుడు మాయ లేదా ప్రకృతిని కూడా ఉపాదానకారణంగా అభివర్ణిస్తుంది ఉపనిషత్తు.

ఎ) **మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్ – శ్వేతాశ్వతరోపనిషత్తు**

బి) **అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః।**
**అజో హ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః॥**
**– శ్వేతాశ్వతరోపనిషత్తు 4-5**

ఉపనిషత్తులోని ఈ వాక్యం చాలా ప్రసిద్ధి చెందిన వాక్యం. దీని విశ్లేషణ బ్రహ్మసూత్రములలో ముందుముందు చూస్తాము. ఇందులో మనకు కావాల్సిన పదం – అజామ్ ఏకామ్. ఇది ప్రకృతిని సూచిస్తుంది.

సి) **ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥** – గీత 13.20

ప్రకృతి, పురుషుడు – రెండూ అనాది. జగత్తు ప్రకృతినుంచి వచ్చింది.

డి) **బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమోగుణాత్మికా మాయా అస్తి।** – తత్త్వబోధ

మాయా అంటే ప్రకృతి. ఆ విధంగా కొన్నిచోట్ల ప్రకృతిని సృష్టికారణంగా వర్ణిస్తే, కొన్నిచోట్ల బ్రహ్మను సృష్టికారణంగా వర్ణించాయి ఉపనిషత్తులు. ఇప్పుడు అసలు జగత్కారణం ఏది? బ్రహ్మనా, ప్రకృతా? పురుషుడా, ప్రకృతా?

ప్రకృతి అచేతనం, బ్రహ్మ చేతనం. ప్రకృతి జగత్కారణం అంటే జగత్కారణం అచేతనకర్తా అవుతుంది; అదే బ్రహ్మ అంటే చేతనకర్తా అవుతాడు. ఇప్పుడు

జగత్కారణం చేతనకర్తా, అచేతనకర్తా? వ్యాసాచార్యులవారు బ్రహ్మను జగత్కారణంగా వర్ణించారు. అంటే జగత్కారణం చేతనకర్త.

**చేతనం బ్రహ్మ కారణత్వమ్**

ఆ విధంగా ఉపాదాన కారణంద్వారా జగత్కారణం చేతనకర్త బ్రహ్మ అని చూపించారు.

4) చేతనకర్త బ్రహ్మ అని చూపించటంద్వారా సాంఖ్య దార్శనికులను ఖండించారు.

బ్రహ్మసూత్రాల్లో సాంఖ్యదర్శన ఖండన ఎక్కువగా ఉంటుంది. బహుశ ఆయన సమయంలో సాంఖ్యదర్శనం ప్రబలంగా ఉండివుంటుంది. దీన్ని ప్రథమ మల్లన్న న్యాయం అంటారు. కుస్తీ పోటీల్లో ఆ ఊరికి ఎవరైనా కొత్తగా వస్తే తను గొప్ప యోధుడని నిరూపించకోవటానికి అందరితో కుస్తీ పట్టనవసరం లేదు. ఆ ఊరిలో ఎవరైతే ప్రథమ మల్లన్నగా పేరు పొందాడో, అతన్ని ఓడిస్తే చాలు. అలా సాంఖ్యులు అందరికన్నా ప్రథమస్థానంలో ఉండివుంటారు.

అంతేకాదు, సాంఖ్యదర్శనానికీ, మన దర్శనానికీ చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. ముందు వీటి రెండింటి మధ్యనున్న పోలికలు చూద్దాము.

ఎ) **ప్రకృతి, పురుషుడు** – రెండు దర్శనాల్లోనూ ప్రకృతి, పురుషుడు పదాలు రెండింటినీ చూస్తాము.

**ప్రకృతిం పురుషం చైవ – గీత**

**అవ్యక్తాత్ పురుషః పరః – కఠ**

ఆ విధంగా రెండింటిలోనూ ప్రకృతి, పురుషుడు పదాలను చూస్తాము.

బి) **ప్రకృతి అచేతనం** – రెండు దర్శనాల్లోనూ ప్రకృతిని అచేతనంగా వర్ణిస్తారు. ప్రకృతికి త్రిగుణాత్మక సత్త్వరజస్తమో గుణాలు ఉన్నట్టుగా చూస్తాము. రెండింటిలోనూ ప్రకృతి సవికారం. అంటే మార్పు చెందుతుంది. సాంఖ్య పదాన్ని వేదాంతబోధకు వాడతాము మనము. గీత రెండవ అధ్యాయం పేరు సాంఖ్యయోగం. భాగవతంలో సాంఖ్యదర్శనాన్ని కపిలఋషి చూపిస్తారు. అందులో కపిలదేవహూతి సంవాదం వస్తుంది.

అలా కొన్ని సమాన అంశాలు సాంఖ్యకూ, అద్వైతవేదాంతానికీ ఉన్నా, కొన్ని విభేదాలు కూడా ఉన్నాయి. వ్యాసాచార్యులవారు బ్రహ్మ జగత్కారణం అని చెప్పటంద్వారా, సాంఖ్యదర్శనానికీ, మనకూ ఉన్న ఐదు ముఖ్య భేదాలను ఎత్తిచూపినట్టయింది. అవేమిటో చూద్దాము.

1. **ప్రకృతి–పురుషుడు:** జగత్కారణం ఎవరు దగ్గరే సాంఖ్య, అద్వైతం విభేదిస్తాయి. సాంఖ్య ప్రకృతినుంచి జగత్తు వచ్చిందని చెపితే, అద్వైతం పురుషుడినుంచి వచ్చింది అంటుంది. పురుషుడు అంటే బ్రహ్మ.

2. **అచేతనవాదం–చేతనవాదం:** సాంఖ్య ప్రకృతినుంచి జగత్తు వచ్చింది అంటుందని చూశాము కదా. ప్రకృతి అచేతనం. అందువల్ల వీరిది అచేతనవాదం. అద్వైతం బ్రహ్మనుంచి వచ్చింది అంటుంది కాబట్టి, అద్వైతానిది చేతనవాదం.

సాంఖ్యదర్శనంలోనే కాదు, చాలా దర్శనాల్లో ఆఖరికి విజ్ఞానశాస్త్రంలో కూడా ఈ అచేతనవాదమే చూస్తాము. ప్రతిదర్శనంలో కూడా జగత్తుకు మూలకారణమేమిటో అన్వేషిస్తారు. అందరూ ఏదో ఒక మూలకారణాన్ని పట్టుకున్నారు కాని, అందరిదీ అచేతనవాదమే.

ఉదాహరణకు సాంఖ్య, యోగదర్శనాల్లో ఉపాదానకారణం అచేతన ప్రకృతి అంటారు. అందువల్ల వారి వాదనను అచేతనవాదం అనవచ్చు.

న్యాయవైశేషికులు జగత్తుయొక్క మూలకారణం పరమాణువు అంటారు. వారిది **పరమాణువాదం**. ఇది మన విజ్ఞానశాస్త్రానికి దగ్గరగా ఉంటుంది. ప్రళయంలో కేవలం పరమాణువులే ఉన్నాయనీ అవన్నీ కలిసి అణువులుగా, తర్వాత వస్తువులుగా ఏర్పడ్డాయనీ అంటారు. పరమాణువు అచేతనం కాబట్టి, వారి వాదనను కూడా **అచేతనవాదం** అనవచ్చు. ఇదంతా ఆస్తికదర్శనాల గురించి.

ఇప్పుడు నాస్తిక దర్శనాలకు వెళితే అవి కూడా ఎక్కువగా అచేతనకారణ వాదాన్నే సూచిస్తాయి. కాకపోతే వాటిపేర్లు భిన్నంగా ఉంటాయి. ఇవి చాలా వివరంగా రెండవ అధ్యాయంలో వస్తాయి.

విజ్ఞానశాస్త్రానిది కూడా అచేతనవాదమే. వారు బిగ్‌బ్యాంగ్ థియరీ చెబుతారు. దాని ప్రకారం జీవం తర్వాత వచ్చింది. జీవంతోపాటు చేతనం వచ్చింది. అంటే చైతన్యం తర్వాతెప్పుడో వచ్చింది. దేన్నించి? వస్తువునుంచి (మ్యాటర్ నుంచి).

ఆ విధంగా ఇంచుమించు అన్ని దర్శనాల్లోనూ వస్తువును సృష్టికర్త అంటారు, చైతన్యాన్ని వస్తువుతో పాటు ఉందనో లేదా వస్తువునుంచి వచ్చిందనో అంటారు. అంటే చైతన్యానికి వస్తువుతో పాటు సమానమైన హెూదా కాని, తక్కువ హెూదా కాని ఇస్తారు.

తమాషా ఏమిటంటే న్యాయవైశేషిక దర్శనాల్లో ఆత్మను కూడా ఒక విధమైన వస్తువుగా చూస్తారు. వారు తొమ్మిది రకాల వస్తువులను పేర్కొంటారు. వాటిలో ఒకటి ఆత్మ. ఆత్మ చేతనమా, అచేతనమా? ఆత్మ కూడా వస్తువు కాబట్టి అది కూడా అచేతనమే అవాలి. అయితే చైతన్యం మాటేమిటి? చైతన్యం ఆత్మలో వచ్చిపోతుంది. చైతన్యం వస్తే ఆత్మ చేతనమవుతుంది, వెళ్ళిపోతే అచేతనమవుతుంది. కాబట్టి వీరిది కూడా అచేతనవాదమే.

ఒక్కముక్కలో చెప్పాలంటే అద్వైతం తప్ప తక్కిన అన్ని దర్శనాలు అచేతన కారణవాదాన్ని సూచిస్తే, వేదాంతం ఒక్కటే ప్రత్యేకంగా నిలిచి చేతనవాదాన్ని నిరూపిస్తోంది. అద్వైతంలో చైతన్యం, వస్తువు కన్నా కింద స్థాయిలో లేదు; వస్తువుతో సమానం కాదు; వస్తువుకన్నా హెచ్చు స్థాయిలో ఉంది, నిజానికి వస్తువే దాన్నించి వచ్చింది. అందువల్ల చైతన్యమే ప్రాథమిక తత్త్వం లేదా మూలకారణం. అందువల్ల అద్వైత వేదాంతాన్ని **చేతనకారణవాదం** అంటారు.

ఒక విషయం గుర్తుంచుకోండి. ఎప్పుడైతే చైతన్యం మూలకారణం అన్నామో, అదే జగత్తు అంతటా ఉంటుంది. ఉదాహరణకు మట్టి కుండకు మూలకారణం అంటే, మట్టి కుండ అంతటా ఉంటుంది; అలాగే బంగారం ఆభరణాలకు మూలకారణం అంటే బంగారం ఆభరణాలలో అంతటా ఉంటుంది. ఆ విధంగా బ్రహ్మ మూలకారణం అంటే జగత్తు అంతటా చైతన్యం ఉంటుంది.

జగత్తులోని కొన్ని వస్తువులు – మైకు, టేప్‌రికార్డరు, రాయి, కొండ, సినిమా– అన్నీ తీసుకుని వాటిని పిండి చేస్తే, వాటి సారం ఏముంటుంది? తక్కిన దార్శనికులను అడిగితే వాటి సారం వస్తువు (మాటర్) అంటారు. అద్వైతం వాటి సారం చైతన్యం అంటుంది. చైతన్యం లేకుండా వస్తువు లేదు.

వస్తువును పిండి చేస్తే చైతన్యం
చైతన్యాన్ని పలచన చేస్తే వస్తువు

ఆ విధంగా చేతనకర్త బ్రహ్మ ఉపాదానకారణం అని చూపించటంద్వారా వ్యాసాచార్యులవారు ఒక్కముక్కలో అద్వైతవేదాంతాన్ని తక్కిన అన్ని దర్శనాల కన్నా పైన కూర్చోబెట్టారు. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, జైన, బౌద్ధ మతాలు, విజ్ఞానశాస్త్రం కూడా అచేతనకారణవాదం అంటే అద్వైతవేదాంతం ఒక్కటే చేతనకారణవాదం అంటుంది. అందువల్ల అద్వైతవేదాంతసారం ఏమిటి అని ఎవరైనా అడిగితే **చేతనకారణవాదం** అని చెప్పవచ్చు.

3. **ప్రకృతి, పురుషుడు భిన్నం – ఏకం:** – సాంఖ్యవాదనలో ప్రకృతి వేరు, పురుషుడు వేరు. కాని అద్వైత వేదాంతంలో ప్రకృతి, పురుషుడు ఒకటే.

ఇంతకుముందే చూశాము. ఉపనిషత్తుల్లోనే కొన్నిచోట్ల బ్రహ్మను ఉపాదాన కారణంగా చూపిస్తే, కొన్నిచోట్ల ప్రకృతిని ఉపాదాన కారణంగా చూపించాయి. అలా ఉపనిషత్తులు పరస్పర విరోధ వాక్యాలను ఎలా చెప్పగలవు? ప్రకృతి ఉపాదాన కారణం అయితే బ్రహ్మ ఉపాదాన కారణం అవటానికి వీలులేదు; బ్రహ్మ ఉపాదాన కారణం అయితే, ప్రకృతి ఉపాదానకారణం అవటానికి వీలులేదు. అయితే చేతనకారణమో, లేదా అచేతనకారణమో సృష్టికి కారణం కావాలి. అలా కాకుండా ఉపనిషత్తులు రెండూ చెబుతున్నాయి అంటే ఉపనిషత్తులు ఒకదాన్నొకటి విరోధించుకుంటున్నాయా, మనను తప్పుదోవ పట్టిస్తున్నాయా, అవే అయోమయంలో పడ్డాయా? ఏది కారణం?

ఏదీ కాదు. ఈ ప్రశ్నలకు జవాబు సరిగ్గా అర్థం చేసుకోవాలి. దీన్నించి అనేక సందేహాలు తీరతాయి.

ఈ ప్రశ్నలకు జవాబు – రెండు వాక్యాలూ సత్యమే. అంటే బ్రహ్మ ఉపాదాన కారణమన్నా, ప్రకృతి ఉపాదాన కారణమన్నా రెండూ సత్యమే. అదెలా?

ఎలాగంటే ఉపనిషత్తుల ప్రకారం బ్రహ్మ వేరు, ప్రకృతి వేరు కాదు. ప్రకృతిని మాయ అంటారు. మాయ బ్రహ్మకు భిన్నంగా లేదు కాబట్టి, మాయకు ఆపాదించినదాన్ని బ్రహ్మకు కూడా ఆపాదించవచ్చు. అలా ప్రకృతి, పురుషుడు ఒకటే కాబట్టి, మనది చేతనకారణవాదమే. కాని సాంఖ్యులు ప్రకృతి వేరు, పురుషుడు వేరు అంటారు కాబట్టి వాళ్ళది అచేతనవాదమే.

4. **స్వతంత్రం–అస్వతంత్రం:** సాంఖ్యదర్శనంలో ప్రకృతి వేరు, పురుషుడు వేరు కాబట్టి అందులో ప్రకృతి స్వతంత్రం కాని అద్వైత వేదాంతంలో బ్రహ్మ, మాయ ఒక్కటే కాబట్టి మాయ అస్వతంత్రం.

ఉపనిషత్తు ప్రకారం ప్రకృతికి విడిగా ఉనికి లేదు. మాయ అస్వతంత్రం అంటే పరతంత్రం. అందువల్ల ప్రకృతి లేదా మాయ కారణం అన్నా కూడా, అది బ్రహ్మకే చెందుతుంది. ప్రకృతికి ఉనికి కూడా బ్రహ్మనుంచే వస్తుంది. అందువల్ల ప్రకృతిని పరిణామి ఉపాదానకారణం అంటే బ్రహ్మను వివర్త ఉపాదానకారణం అంటారు. వివర్త ఉపాదానకారణం, పరిణామి ఉపాదానకారణానికి ఉనికిని అరువు ఇస్తుంది.

**పరిణామి ఉపాదానకారణ అధిష్ఠానం వివర్త ఉపాదానమ్**

అందువల్ల ఉపనిషత్తులు ఒకదాన్ని ఒకటి విరోధించుకోవటం లేదు. ప్రకృతికి విడిగా ఉనికి లేదు.

సాంఖ్యలో ప్రకృతికి విడిగా ఉనికి ఉంది. ఇది సాంఖ్యకూ, వేదాంతానికీ ముఖ్య భేదం. రెండింటిలోనూ ప్రకృతి పురుషుల గురించి మాట్లాడతారు కాని సాంఖ్యలో ఈ రెండూ భిన్నం.

అందువల్ల వారికి ప్రకృతి స్వతంత్రం. వారు ప్రకృతిని ఉపాదానకారణం అంటే వారి ఉద్దేశం ప్రకృతే ఉపాదానకారణం, పురుషుడు కాదు.

**ప్రకృతి ఏవ ఉపాదానకారణం। న తు పురుషః॥**

వేదాంతంలో ప్రకృతికి విడిగా ఉనికి లేదు. అర్ధనారీశ్వరునిగా వర్ణిస్తుంది మన సాంప్రదాయం. ప్రకృతికి విడిగా ఉనికి లేదు కాబట్టి అది అస్వతంత్రం. అందువల్ల ప్రకృతినుంచి సృష్టి వచ్చిందని చెప్పినా, పరోక్షంగా బ్రహ్మనుంచి వచ్చిందని చెప్పినట్టే అర్థం. అందువల్ల జన్మాదస్య యతః. ప్రకృతినుంచి జగత్తు వచ్చింది కాని ప్రకృతికి అధిష్ఠానం బ్రహ్మ. అందువల్ల మాయ అస్వతంత్రం.

5. **కార్య విజ్ఞానం–కారణ విజ్ఞానం:** సాంఖ్య దర్శనంలో ప్రకృతి, పురుషుడు భిన్నం కాబట్టి ప్రకృతి గురించి తెలుసుకుంటే జగత్తు గురించే తెలుస్తుంది; బ్రహ్మ గురించి తెలియదు. అద్వైతంలో బ్రహ్మ గురించి తెలిస్తే, అంతా తెలుస్తుంది. ఇది చాలా ముఖ్యమైన సాంకేతిక కారణం.

**ఏకవిజ్ఞానేన సర్వః విజ్ఞాతం భవతి॥**

ఛాందోగ్యంలో కూడా గురువు నిరూపిస్తాడు -

**ఏకకారణ విజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి॥**

ఈ విషయం వేదాంతంలో చాలా ముఖ్యమైన అంశం. ఒక్కటి తెలుసుకుంటే అంతా తెలుస్తుందిట. అదెలా సాధ్యం?

**ఉపాదానకారణవిజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి**

ఒక ఉపాదానకారణం తెలుసుకుంటే, దానికి సంబంధించిన కార్యప్రపంచం తెలుస్తుంది. మట్టి గురించి తెలిస్తే కుండ ప్రపంచం గురించి తెలుస్తుంది.

ఈ సూత్రాన్ని అన్వయిస్తే -

**ఏకకారణ విజ్ఞానేన, అనేక కార్యవిజ్ఞానం భవతి**

కాని ఈ సూత్రం సాంఖ్యదర్శనంలో చెల్లదు. ఎందుకు? సాంఖ్యదర్శనంలో ప్రకృతి సృష్టికారణం అంటున్నారు; ప్రకృతి, పురుషుడు భిన్నం అంటున్నారు; ప్రకృతి స్వతంత్రం అంటున్నారు. అప్పుడు -

**ఏకకారణ ప్రకృతి విజ్ఞానేన కార్య ప్రపంచవిజ్ఞానం భవతి।**
**బ్రహ్మవిజ్ఞానం నైవ భవతి॥**

ఎందుకంటే బ్రహ్మ కారణమూ కాదు, కార్యమూ కాదు.

సాంఖ్యదర్శనానికీ, అద్వైతవేదాంతానికీ ఉన్న భేదాలు ఇవి. బ్రహ్మ జగత్కారణం అని చెప్పటంద్వారా అద్వైతవేదాంతం చేతనకారణవాదం అని నిరూపించారు వ్యాసాచార్యులవారు. ఇది వేదాంతశాస్త్రంయొక్క ప్రత్యేకత. ఈ చేతనకారణవాదం తక్కిన పదకొండు దర్శనాల్లో లేదు, విజ్ఞానశాస్త్రంలోనూ లేదు. అందువల్ల రెండవసూత్రం అంత ప్రత్యేకమైన సూత్రం అయింది.

**బ్రహ్మవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి**

***

# సూత్రము 2 - ముఖ్యమైన అంశములు
## జన్మాద్యస్య యతః

**ఉపోద్ఘాతం-**

**జన్మాద్యస్య యతః** సూత్రం 2 జన్మాద్యధికరణమ్
ఇది బ్రహ్మ లక్షణసూత్రం
లక్షణం + ప్రమాణం = వస్తుసిద్ధిః
చంద్రుని రూపవర్ణన - లక్షణం; కన్ను - ప్రమాణం
పూర్వపక్షి వాదన - తెలిసిన బ్రహ్మ గురించా? తెలియని బ్రహ్మగురించా?
**జ్ఞాతబ్రహ్మ విచార్య వా। అజ్ఞాతబ్రహ్మ విచార్య వా**
శంకరులవారి జవాబు - తెలిసింది - బ్రహ్మ పెద్దవస్తువు; బ్రహ్మ = ఆత్మ
తెలియంది - ఆత్మ నిర్వచనం. దీని గురించి అనేక అపోహలున్నాయి.
అంశిక అజ్ఞానాన్ని, స్పష్ట దృఢ అపరోక్ష జ్ఞానంగా మలుచుకోవాలి.
రెండవ సూత్రంలో బ్రహ్మలక్షణాన్ని, మూడవ సూత్రంలో బ్రహ్మప్రమాణాన్ని చూస్తాము.
**జన్మాద్యస్య యతః -** జగత్ కారణం బ్రహ్మ; **శాస్త్రయోనిత్వాత్ -** బ్రహ్మకు శాస్త్రం ప్రమాణం
**లక్షణాలు రెండు -** తటస్థ లక్షణం, స్వరూప లక్షణం
**తటస్థలక్షణం -** కాకి వాలిన ఇల్లు దేవదత్త గృహం; జగత్ కారణం బ్రహ్మ
**స్వరూప లక్షణం -** దేవదత్తుని ఇంటి వర్ణన; సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ
సూత్రాన్ని మూడు దశల్లో చూస్తాము -సామాన్యవిచారణ, పదవిశ్లేషణ, ఉపసంహారం.

### సామాన్య విచారణ

**జన్మాద్యస్య యతః**కు **తత్ బ్రహ్మ** కలుపుకోవాలి.-
టూకీగా - జగత్ సృష్టిస్థితిలయకారణం బ్రహ్మ
**న్యాయవాక్యం - బ్రహ్మ అస్తి లక్షణత్వాత్ ఘటవత్**

| | | |
|---|---|---|
| **పక్షం** | - బ్రహ్మ | - బ్రహ్మ గురించి చెబుతుంది |
| **సాధ్యం** | - అస్తి | - ఉన్నాడు అని మనం చెబుతాము. |
| **హేతువు** | - లక్షణత్వాత్ | - ఉన్నాడు అని చెప్పటానికి లక్షణముంది. |

**దృష్టాంతం-** ఘటవత్ - కుండకు కర్త ఉన్నట్టుగా
కుండకు కర్త ఉన్నట్టుగా, బ్రహ్మలక్షణంద్వారా బ్రహ్మ ఉన్నాడు అని చెప్పవచ్చు.
లక్షణం - జగత్కారణం
**వ్యాప్తివాక్యం - యత్ర యత్ర లక్షణత్త్వం, తత్ర తత్ర వస్తు సిద్ధిః**
ఎక్కడ లక్షణం ఉంటే, అక్కడ వస్తుజ్ఞానం కలుగుతుంది.
**విషయవాక్యం- యతో వా ఇమాని భుతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి యత్ర్పయన్త్యభి సంవిశన్తి. తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి - భృగువల్లీ, తైత్తిరీయోపనిషత్**
బ్రహ్మ సృష్టి స్థితి లయ కారణం

**పదవిశ్లేషణ**

**జన్మాద్యస్య యతః(తత్ బ్రహ్మ)**
జన్మాది + అస్య + యతః + తత్ బ్రహ్మ
జన్మాది - సృష్టి స్థితి లయ
పూర్వపక్షి వాదన - యాస్కనిరుక్తంలో జన్మాది షట్కారణం వస్తుంది. అవి **జాయతే, అస్తి, విపరిణమతే, వర్ధతే, అపక్షీయతే, వినశ్యతీతి**(నిరుక్తం 1-1-3)
శంకరులవారి జవాబు - నిరుక్తంలో భౌతిక ప్రపంచం గురించి మాత్రమే వస్తుంది.శ్రుతి భూత ఉత్పత్తి గురించి కూడా చెబుతుంది.
పూర్వపక్షి వాదన - శ్రుతిని ఆధారం చేసుకుని వచ్చినదే స్మృతి కూడా
శంకరులవారి జవాబులు -
1 - శ్రుతి, స్మృతి కన్నా ఎక్కువ. సాక్షాత్తూ శ్రుతివాక్యం ఉండగా, స్మృతి ఎందుకు? శ్రుతి వాక్యం సృష్టి, స్థితి, లయల గురించి స్పష్టంగా చెప్పింది.
2 - బ్రహ్మసూత్రములకు ఆధారం శ్రుతి. దీన్ని వేదాంతసూత్రములు అంటారు.
అందువల్ల జన్మాది = సృష్టి, స్థితి, లయలు
పూర్వపక్షి వాదన - మీ సిద్ధాంతులే సృష్టి స్థితి లయ ఒక వృత్తాకారంలో జరుగుతుంది అంటారు. అప్పుడు జన్మాది ఎందుకు?స్థితాది అనవచ్చు కదా?
శంకరులవారి జవాబులు - 1 - అనుభవ ప్రమాణం ప్రకారం లయ-స్థితి ఉన్నదానికి, స్థితి-సృష్టి ఉన్నదానికి జరుగుతుంది. సృష్టి ప్రకరణంలో ఒక క్రమ పద్ధతి లేకపోయినా, మన అర్థం చేసుకునే తీరులో ఒక క్రమపద్ధతి ఉంది.

born is gone - born - సృష్టి; is - స్థితి gone - లయ –పూజ్యస్వామీజీ.
2. శ్రుతి ప్రమాణం – వ్యాసాచార్యులవారు శ్రుతినుంచి చెప్పారు. శ్రుతే సృష్టి, స్థితి లయ వరుస క్రమంలో చెప్పింది.

**యతోవా ఇమాని భూతాని జాయన్తె – సృష్టి కారణం**
**యేన జాతాని జీవంతి – స్థితి కారణం**
**యత్ప్రయన్త్యభిసంవిశన్తి – లయ కారణం**

స్మృతి, పురాణం, ఇతిహాసాల్లో కూడా ఈ వరుస వస్తుంది
అందువల్ల జన్మాది = సృష్టి, స్థితి, లయ. శంకరులు లయను భంగం అంటారు.
**అస్య –** ప్రత్యక్ష ప్రపంచస్య – ప్రత్యక్షంగా కనిపించే ఈ ప్రపంచంయొక్క – అస్యను అన్వయంకోసం జన్మాది ముందు వేసుకోవాలి
**అస్య జన్మాది – ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టి స్థితి లయ**
**యతః – యస్మాత్ కారణాత్ –** ఏ కారణంనుంచి ఈ ప్రత్యక్ష ప్రపంచం వచ్చిందో (అది బ్రహ్మ).
బ్రహ్మ నిమిత్త కారణమా? ఉపాదాన కారణమా?
నిమిత్త కారణం – సృష్టి మాత్ర కారణం;
ఉపాదాన కారణం – సృష్టి, స్థితి, లయ కారణం
జన్మాది అంటే సృష్టి స్థితి లయ కారణం రావాలి కాబట్టి బ్రహ్మ ఉపాదాన కారణం
**యస్మాత్ ఉపాదాన కారణాత్ ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితిలయ సంభవతి తదుపాదానకారణం బ్రహ్మ**
యతః – దశ 1 – ఉపాదాన కారణం
సృష్టికి ముందు బ్రహ్మ మాత్రమే ఉన్నాడు. అంటే నిమిత్తకారణం, ఉపాదాన కారణం కూడా బ్రహ్మే.
**యస్మాత్ అభిన్న నిమిత్త ఉపాదాన కారణాత్ ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితిలయ సంభవతి తదు అభిన్న నిమిత్త ఉపాదాన కారణం బ్రహ్మ**
**యతః** – దశ 2 – **అభిన్న నిమిత్త ఉపాదాన కారణం**
**యతోవా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభి సంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి ॥ స తపో తప్యత ॥**
భృగువు తపస్సు చేసి కనుక్కున్నాడు –

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే ఆనందేన జాతాని జీవన్తి ఆనందం ప్రయన్త్యభిసంవిశన్తీతి॥**

బ్రహ్మ = ఆనందం

**యస్మాత్ అభిన్ననిమిత్త ఉపాదాన కారణాత్ ఆనంద స్వరూపాత్ ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టిస్థితి లయ సంభవతి। తదు అభిన్ననిమిత్త ఉపాదానకారణం ఆనందస్వరూపం బ్రహ్మ॥**

**యతః –** దశ 3 – **అభిన్ననిమిత్త ఉపాదానకారణం, ఆనందస్వరూపం**

యతః అంటే తటస్థలక్షణం + స్వరూపలక్షణం

తటస్థలక్షణం – అభిన్ననిమిత్త ఉపాదానకారణం

స్వరూపలక్షణం – ఆనందస్వరూపం

**ఈ సూత్రం తటస్థస్వరూప లక్షణద్వయ సూత్రం**

**తత్ బ్రహ్మ –** ఆ బ్రహ్మ. జగత్తునుంచి బ్రహ్మయొక్క 4 లక్షణాలు చూస్తాము.

**ఎ) అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య –** నామ రూపాలున్న జగత్తుకు ఒక చేతనకర్త ఉండాలి

**బి) అనేక కృర్తృభోక్తృ సంయుక్తస్య –** కార్యం కారణానికి భిన్నంగా ఉంటుంది. అందువల్ల సృష్టికర్త జీవభిన్నుడై ఉండాలి

**సి) ప్రతినియత దేశకాల నిమిత్త క్రియాఫలాశ్రయస్య –** దేశకాల నిమిత్తాలకు అతీతంగా ఉండాలి. **సర్వస్య కర్తా సర్వజ్ఞః.** అందువల్ల సృష్టికర్త సర్వజ్ఞుడు.

**డి) మనసాప్యచిన్త్యరచనా రూపస్య –** దేవుడు చేసిన సృష్టిని పూర్తిగా ప్రతిసృష్టి చెయ్యలేదు మనిషి. అందువల్ల బ్రహ్మ సర్వశక్తిమంతుడు.

అనుమాన వాక్యం – **ఈశ్వరః సర్వశక్తిమాన్ సర్వకారణత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

బ్రహ్మ = చేతనకర్త, జీవభిన్నుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు వీటిలో చివరి రెండూ తీసుకుంటాము.

జన్మాదస్య యతః – పూర్తి అర్థం

**యస్మాత్ అభిన్ననిమిత్త ఉపాదానకారణాత్ ఆనందస్వరూపాత్ సర్వజ్ఞాత్ సర్వశక్తేః ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టి స్థితి లయ సంభవతి తత్ బ్రహ్మ**

ఏ అభిన్న నిమిత్త ఉపాదానకారణంనుంచి, ఆనందస్వరూపంనుంచి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునుంచి ఈ ప్రపంచంయొక్క సృష్టి స్థితి లయ జరిగిందో, ఆయన బ్రహ్మ.

**నైయాయిక – సిద్ధాంతుల వాదోపవాదాలు**

**వాదనలకు ఉపోద్ఘాతం**

తక్కిన దర్శనాలు – దార్శనికులనుంచి వచ్చాయి.
నాస్తికులు తర్కాన్ని వాడతారు – నాస్తిక తార్కికులు.
ఆస్తికుల్లో సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషికులు – ఆస్తిక తార్కికులు
నైయాయికులు అంటే న్యాయదార్శనికులు – గౌతమఋషి
నైయాయికులకు తర్కం ప్రధానం; సిద్ధాంతులకు వేదాంత శాస్త్రం ప్రధానం
నైయాయికులు బ్రహ్మను ఈశ్వరుడు అంటారు; జగత్తుకు వేరే పేరు వాడతారు.
**సిద్ధాంతి వాదన –** బ్రహ్మసూత్రములు వేదాంతశాస్త్రంనుంచి వచ్చింది.

మొదటి సూత్రం – బ్రహ్మ పరిచయం;
రెండవ సూత్రం – లక్షణం;
మూడవ సూత్రం – ప్రమాణం

లక్షణం + ప్రమాణం = వస్తుసిద్ధి
నైయాయికుని వాదన – మూడవ సూత్రం అవసరం లేదు
అనుమాన ప్రమాణం చాలు, శాస్త్రప్రమాణం అవసరం లేదు
కార్యలింగక అనుమానం చాలు – కార్యంనుంచి కారణాన్ని ఊహించ వచ్చు.
శంకరులవారి వాదన –
బ్రహ్మసూత్రములు వేదాంతవాక్యాలను ఆధారంగా చేసుకుని వచ్చాయి.

**వేదాంతవాక్యకుసుమ గ్రథనార్థత్వాత్ సూత్రాణి**

యతోవా ఇమాని – కేవలం లక్షణం సూచిస్తుంది, ప్రమాణాన్ని కాదు
తక్కిన భాష్యకారులు – మూడు విషయాలు స్పష్టం చేశారు.

1. కేవలతర్కంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించలేము
2. శాస్త్రంద్వారా ఈశ్వరుణ్ణి నిరూపించాలి
3. శ్రుతిసమ్మత తర్కం వాడాలి

ఇంకా లోతుగా వాదనలు

1. నైయాయికుని వాదన –**జగత్ సకర్తృకం కార్యత్వాత్ ఘటవత్** – జగత్తు కార్యం కాబట్టి దానికొక కర్త ఉండాలి కుండలాగా.

వ్యాప్తి వాక్యం – **యత్ యత్ కార్యం తత్ తత్ సకర్తృకమ్.** ఏదైతే కార్యమో, దానికొక కర్త ఉండి తీరాలి. అందువల్ల ఒక సృష్టి కర్త ఉన్నాడు.

సిద్ధాంతి జవాబు - అనుమాన వాక్యానికి వ్యాప్తి వాక్యం ప్రత్యక్షప్రమాణాన్ని ఆధారం చేసుకుని ఉండాలి. వ్యాప్తి వాక్యంలో వ్యభిచారదోషం ఉండకూడదు. కాని ఇక్కడ వ్యభిచారదోషం ఉంది. బ్రహ్మ ప్రత్యక్షానికి అందదు. శ్రుతి ప్రమాణానికి అందుతాడు, కాని నైయాయికుడు, శ్రుతి అవసరం లేదు అంటున్నాడు. అందువల్ల వ్యాప్తి అసిద్ధిః

2. నైయాయికుని వాదన - **జగత్ కర్తా ఈశ్వరః జీవ భిన్నత్వే సతి చేతనత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్.** సృష్టి కర్త జీవుడు కాదు, జడమైన జగత్తూ కాదు. అంటే జీవ, జగత్తులు కాకపోతే పారిశేష్య న్యాయంద్వారా ఈశ్వరుడు సృష్టి కర్త. ఏదైతే కారణమో, అది ఒక చేతనకర్త అయి ఉండాలి. అందువల్ల ఆ సృష్టి కర్త ఈశ్వరుడు.

సిద్ధాంతి జవాబు - ఇక్కడ కూడా వ్యాప్తి వాక్యం కుదరదు. బ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. అందువల్ల పారిశేష్య న్యాయం కుదరదు. పారిశేష్య న్యాయ అభావాత్.

3. నైయాయికుని వాదన -**ఈశ్వరః సర్వజ్ఞః సర్వకర్తృత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్.** ఈశ్వరుడు సర్వాన్ని సృష్టించాడు కాబట్టి సర్వజ్ఞుడు అవాలి. **యత్ర సర్వ కర్తృత్వం తత్ర సర్వజ్ఞత్వమ్.** అందువల్ల సృష్టికర్త అయిన ఈశ్వరుడు సర్వజ్ఞుడు.

సిద్ధాంతి జవాబు - మీ సిద్ధాంతాలలో వ్యభిచార దోషాలున్నాయి.

ఎ) **యత్ జ్ఞానం తత్ మనోజన్యం**

బి) **ఈశ్వరః అశరీరః**

జ్ఞానం మనస్సులో ఏర్పడుతుంది అంటూనే, ఈశ్వరునికి మనస్సు లేదంటే - సర్వజ్ఞుడు ఎలా అవుతాడు. **స్వ అభ్యుపగమ విరోధదోషః**

**ఈ వాదనల ఉపసంహారం**

ఈశ్వరుడు లేదు అని కాదు అర్థం. శ్రుతిసమ్మతతర్కం ఉండాలి. ఉపభాష్యకారులు, పూర్ణానందసరస్వతి - కృష్ణాయ మంగళం రాశారు. నైయాయికులది కేవలతర్కం, సిద్ధాంతులది శ్రుతిసమ్మత తర్కం

## కర్మకాండ, జ్ఞానకాండల మధ్య భేదాలు

| కర్మకాండ | జ్ఞానకాండ |
|---|---|
| 1 ప్రశ్నలు అడగ కూడదు | పరిప్రశ్నలు వేయాలి |
| తర్కం అప్రస్తుతం | మననంలో తర్కం ఉంటుంది |
| 2. కర్మ ప్రధానం - జ్ఞానం+కర్మ = ఫలం | జ్ఞాన ప్రధానం - జ్ఞానం=ఫలం |

| | |
|---|---|
| 3. ఫలంభవిష్యత్తులో వస్తుంది | ఫలం ఇక్కడే ఇప్పుడే వస్తుంది |
| 4. కర్మకాండలో ఛాయిస్ ఉంది | జ్ఞానకాండలో ఛాయిస్ లేదు |

**అనుభవ ప్రమాణం**

సంసారం = రాగద్వేషాలు, అహంకారమమకారాలు, పరిచ్ఛిన్న భావన

మోక్షం = వీటినుంచి విముక్తి, పరిపూర్ణ భావన

రెండూ అనుభవంలోకి వస్తాయి

జ్ఞానఫలం తెలుస్తుంది= కోపం తగ్గుతుంది, బాధ తగ్గుతుంది

**ఉపసంహారం – అధికరణ నిర్ణయం**

1. విషయః – విషయం – బ్రహ్మలక్షణం
2. సంశయః – సంశయం – బ్రహ్మలక్షణం అస్తి వా న వా?
3. పూర్వపక్షః – పూర్వపక్షుల వాదన
4. ఉత్తరమ్ – అద్వైతసిద్ధాంతి జవాబు

| **పూర్వ పక్షి వాదన** | **సిద్ధాంతి జవాబు** |
|---|---|
| నిర్వచనానికి ప్రత్యేకలక్షణం ఉండాలి | బ్రహ్మమీద జగత్తును ఆరోపిస్తున్నాము. |
| అసాధారణ ధర్మః లక్షణం | బ్రహ్మ అధిష్ఠానం, జగత్తు అధ్యారోపం. |
| యతోవాచో నివర్తంతే | బ్రహ్మమీద ఆరోపించిన జగత్తునుంచి |
| అప్రాప్య మనసా సః | బ్రహ్మ లక్షణం చెప్పవచ్చు |
| న తత్ర చక్షుర్గచ్ఛతి న | |
| వాగచ్ఛతి నోమనః | |
| బ్రహ్మ లక్షణం నాస్తి | బ్రహ్మ లక్షణం అస్తి |

**5. సంగతి – సంబంధం – ఆక్షేపసంగతి**

బ్రహ్మ జిజ్ఞాసా చేయాలంటే బ్రహ్మ ఉన్నాడా, లేడా?

బ్రహ్మ ఉన్నాడు, లక్షణం ఉంది కాబట్టి, బ్రహ్మవిచారణ చేసితీరాలి.

***

# సూత్రము 3 - శాస్త్రయోనిత్వాత్

మూడవసూత్రం - శాస్త్రయోనిత్వాత్. ఈ మూడవసూత్రం, మూడవ అధికరణంలోకి వస్తుంది. ఒక అధికరణంలో ఒక్కటే సూత్రం ఉండవచ్చు, లేదా అనేక సూత్రాలు ఉండవచ్చని చూశాము. కాని ఇక్కడ మూడవ అధికరణంలో ఒక్కటే సూత్రం ఉంది. అధికరణం పేరు ఆ అధికరణంలో ఉన్న సూత్రంనుంచి వస్తుందని కూడా చూశాము.

| సూత్రం | అధికరణం | |
|---|---|---|
| 1. అథాతో బ్రహ్మజిజ్ఞాసా | జిజ్ఞాసా అధికరణం | జిజ్ఞాసాధికరణమ్ |
| 2. జన్మాద్యస్య యతః | జన్మాది అధికరణం | జన్మాద్యధికరణమ్ |
| 3. శాస్త్రయోనిత్వాత్ | శాస్త్రయోని అధికరణం | శాస్త్రయోనిత్వాధికరణమ్ |

సూత్రం నిర్వచనం - **అల్పాక్షరమసందిగ్ధం సారవత్ విశ్వతోముఖమ్ అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః**

ఈ సూత్రంలో రెండు అంశాలను ప్రత్యేకించి చూడవచ్చు. సూత్రంలో అల్పాక్షరాలు ఉండాలి. అంటే వీలైనన్ని తక్కువ పదాలు ఉండాలి. అథాతో బ్రహ్మజిజ్ఞాస లోనూ, జన్మాద్యస్య యతః లోనూ మూడు, మూడు పదాలున్నాయి. ఈ శాస్త్రయోనిత్వాత్ సూత్రంలో ఒక్కటే పదం ఉంది.

రెండవ అంశం విశ్వతోముఖం. విశ్వతోముఖం అంటే లోతైన అర్థం ఉండాలి, కుదిరితే ఒకటికన్నా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. ఈ సూత్రాన్ని రెండురకాలుగా విశ్లేషించవచ్చు. అలా ఒక్క సూత్రంలోనే రెండు అర్థాలను చొప్పించగలిగితే, ఆ సూత్రం ఎంతో గొప్పదని అర్థం. అందువల్ల విశ్వతోముఖం నిర్వచనానికి ఈ సూత్రాన్ని ఉదాహరణగా చూపించవచ్చు.

ప్రతి సూత్రాన్ని మూడు దశల్లో విశ్లేషణ చేస్తామని చూశాము. అవి సామాన్య విచారణ, పద విశ్లేషణ, ఉపసంహారం. ఈ సూత్రానికి రెండు అర్థాలున్నాయి కాబట్టి ఈ మూడూ రెండుసార్లు చూద్దాము.

## మొదటి విశ్లేషణ

## సామాన్య విచారణ

రెండవ సూత్రంలో బ్రహ్మను సర్వజ్ఞుడు అని నిరూపించటం జరిగింది. ఈ సూత్రం ఆ సర్వజ్ఞత్వాన్ని పరోక్షంగా నిరూపిస్తుంది.

**బ్రహ్మ సర్వజ్ఞత్వం దృఢయతి**

ఇక్కడ ఎలా దృఢపరుస్తుందో చూసేముందు రెండవ సూత్రంలో ఎలా నిరూపించిందో మళ్ళీ ఒకసారి చూద్దాము.

**జన్మాద్యస్య యతః** – జగత్తుయొక్క కారణం.

ఒక నియమం ఉంది. ఎవరు, దేన్ని సృష్టిస్తే అతనికి దాని గురించిన జ్ఞానం ఉంటుంది. ఆ నియమం ప్రకారం –

**ఘటస్య కర్తా ఘటజ్ఞః। పటస్య కర్తా పటజ్ఞః। సర్వస్య కర్తా సర్వజ్ఞః॥**

కుండను సృష్టించిన వ్యక్తికి దాని గురించిన జ్ఞానం ఉన్నట్టే, వస్త్రాన్ని నేసిన వ్యక్తికి దాని గురించిన జ్ఞానం ఉన్నట్టే, ఈ సర్వాన్నీ సృష్టించిన వ్యక్తికి సర్వం తెలుసు.

**బ్రహ్మ సర్వజ్ఞః సర్వకారణత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

కుమ్మరికి కుండ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానమే ఉంటుంది, కాని సర్వాన్నీ సృష్టించిన బ్రహ్మ సర్వజ్ఞుడు. బ్రహ్మను సర్వజ్ఞునిగా చూపించేటప్పుడు బ్రహ్మను నిమిత్తకారణంగా చూపిస్తాము. ఎందుకంటే, జ్ఞానం నిమిత్తకారణానికి చెందుతుంది.

**బ్రహ్మ సర్వజ్ఞః సర్వేషాం నిమిత్త కారణత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

బ్రహ్మ నిమిత్తకారణం అవటంవల్ల సర్వజ్ఞుడు. ఈ సర్వజ్ఞత్వాన్ని ప్రత్యక్షంగా చెప్పలేదు, పరోక్షంగా చూపించారు రెండవసూత్రంలో.

ఇక్కడ, ఈ మూడవసూత్రంలో బ్రహ్మయొక్క సర్వజ్ఞత్వాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. అదెలా? బ్రహ్మ జగత్తుయొక్క సృష్టికర్త అని ముందు సూత్రంలో చెప్పి, ఇప్పుడు బ్రహ్మ వేదాలయొక్క సృష్టికర్త అని చెబుతున్నారు.

శాస్త్రయోని అంటే వేదకర్తా, వేదాలను సృష్టించినవాడు. అంటే నిమిత్తకారణం అని చూశాము. ముందు సూత్రంలో ప్రత్యక్ష ప్రపంచంయొక్క సృష్టికర్త అని చూశాము. ఇప్పుడు వేదాలయొక్క సృష్టికర్త అని చూస్తున్నాము. ప్రత్యక్ష ప్రపంచాన్ని అర్థప్రపంచం అంటే, వేదాలను శబ్దప్రపంచం అంటారు.

బ్రహ్మను వేదాలయొక్క సృష్టికర్త అని చెపితే, బ్రహ్మయొక్క సర్వజ్ఞత్వం దీని ద్వారా ఎలా దృఢమవుతుంది? దీనికి శంకరులవారు సమాధానం ఇస్తారు. ఏమని?

వేదాలలో లేని విద్య అంటూ లేదు. వేదాలలో అపరావిద్య, పరావిద్య – రెండూ ఉన్నాయి. అందువల్ల వేదాలనే సర్వజ్ఞః అంటారు. ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నది వేదాలలో చాలా తక్కువభాగం. ఉపనిషత్తులలో చాలా పెద్దవీ, ముఖ్యమైనవీ అయిన ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు అధ్యయనం చేస్తే చాలు, ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు వాటిల్లో. అదే వేదాలనే తీసుకుంటే ఋగ్వేదంలో పదివేల పైచిలుకు మంత్రాలు ఉన్నాయి; యజుర్వేదంలో రెండువేల పైచిలుకు మంత్రాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా చాలా తక్కువ. ఎందుకంటే వేదాల్లోని చాలా భాగాలు అందుబాటులోకి రాక, మాయమయిపోయాయి అంటారు.

సామవేదంలోనే వెయ్యి శాఖలు ఉన్నాయిట. ఇప్పుడు వాటిల్లో రెండో, మూడో శాఖలు మాత్రమే అందుబాటులో ఉన్నాయంటేనే పరిస్థితిని ఊహించుకోండి. ఎలాగైతే కొన్ని జంతువులు ఇప్పుడు లేకుండా మటుమాయిమై పోయాయో, అలా వేదాల్లో కొన్ని శాఖలు ఇప్పుడు లేకుండా మాయమైపోయాయి. అంతదాకా ఎందుకూ శంకరాచార్యులవారి కాలానికీ, ఇప్పటికీ మధ్య పన్నెండు వందల సంవత్సరాల కాలమే గడిచివుంటుంది. కాని ఆయన కాలంలో ఉన్న కొన్ని శాఖలు ఇప్పుడు లేవు. శంకరాచార్యుల వారు ఉటంకించిన ఎన్నో మంత్రాలు ఇప్పుడు మనకు అందుబాటులో లేవంటే, ఆ భాగాలు కూడా మటుమాయమైపోయాయని అర్థం.

అంత తక్కువ భాగం అందుబాటులో ఉన్నా కూడా, అదేమీ తక్కువ కాదు. వేదాలలో సర్వజ్ఞానమూ నిండి నిబిడీకృతమై ఉంది. అందువల్ల వేదాలకర్త సర్వజ్ఞుడై ఉండాలని ఒక అనుమానవాక్యాన్ని చెబుతున్నారు శంకరులవారు. దానికొక అద్భుతమైన వ్యాప్తివాక్యాన్ని కూడా చెబుతున్నారు. ఏమిటది?

**యః యస్య గ్రంథస్య కర్తా సః తతః అపి అధికజ్ఞానవాన్ యథా పాణినిః**

ఎవరైతే ఒక గ్రంథాన్ని రచిస్తారో, అతనికి తను రచించిన గ్రంథానికన్నా ఎక్కువ జ్ఞానం ఉంటుంది. ఎంత అద్భుతమైన వాదనో చూడండి! ఎందుకంటే మన మనస్సులో ఉన్న భావాలన్నిటికీ పూర్తిగా అక్షరరూపాన్నివ్వలేము. చాలాసార్లు అంటాము, 'నా భావాలను మాటలతో వ్యక్తం చెయ్యలేను,' అని.

శంకరాచార్యులవారు తన అనుమాన వాక్యాన్ని దృఢపరచటానికి దృష్టాంతాన్ని ఇవ్వాలి. అంటే ఇంకొక రచయిత పేరు చెప్పాలి. అందువల్ల **యథా పాణినిః** అంటారు.

పాణిని గొప్ప వ్యాకరణకర్త. ఆయన రచించిన వ్యాకరణసూత్రములు చాలా ప్రసిద్ధి చెందాయి. వాటిని **పాణినీసూత్రములు** అంటారు. పాణిని, శంకరాచార్యులకన్నా ఎన్నో వందల సంవత్సరాల ముందు కాలానికి చెందినవారు.

ఈ పాణినీ సూత్రములు ఎంత గొప్పవంటే వాటికి పతంజలి భాష్యం రాశారు. ఈ భాష్యంమీద ఉపభాష్యం, ఆ ఉపభాష్యానికి ఇంకా ఉపభాష్యాలు వచ్చాయి. ఇవన్నీ దాదాపు 4000 సూత్రములు ఉన్న పాణినీవ్యాకరణంమీద వచ్చాయి. కేవలం సూత్రములే తీసుకుంటే అతి చిన్నపుస్తకంలో వచ్చేస్తాయి. కాని ఆ సూత్రముల లోతులు కొలిచినకొద్దీ, మెదడుకు మేత ఎక్కువవుతుంది.

పాణిని అంత అద్భుతమైన రచన చేశారంటే, ఆయన జ్ఞానం ఇంకెంత ఎక్కువ ఉండివుండాలి! అది ఖచ్చితంగా పాణినీసూత్రముల్లో పొందుపరిచిన జ్ఞానం కన్నా ఎక్కువే అయివుండాలి. ఈ నియమం ప్రకారం, బ్రహ్మ మొత్తం వేదాలకే సృష్టికర్త అయితే బ్రహ్మయొక్క జ్ఞానం ఇంకెంత ఉండాలి?

**వేద జ్ఞానాదపి అధిక జ్ఞానవాన్**

ఆ విధంగా బ్రహ్మ సర్వజ్ఞుడు.

**ముందు సూత్రంలో ఏమన్నాం? బ్రహ్మ సర్వజ్ఞః**
**జగత్ కర్తృత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

**ఇప్పుడు ఏమంటున్నాము? బ్రహ్మ సర్వజః**
**వేద కర్తృత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఆ విధంగా బ్రహ్మ వేదాల సృష్టికర్త.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. వేదాలను అనాది అనీ, అపౌరుషేయం అనీ, వాటిని ఎవరూ సృష్టించలేదనీ అంటాము. వాటిని ఎవరూ సృష్టించలేదని ఒకపక్క అంటూ, ఇప్పుడు బ్రహ్మ వేదాలను సృష్టించాడని ఇంకోపక్క చెప్పటం పరస్పర భిన్న వ్యాఖ్యానాలుగా లేవా?

దానికి జవాబు – బ్రహ్మ వేదాలను సృష్టించాడని అంటే, వాల్మీకి రామాయణం రాసినట్టో, వేదవ్యాసులవారు మహాభారతం రాసినట్టో, బ్రహ్మ నిజంగా కూర్చుని వాటిని లిఖించలేదు. అవి ముందే అవ్యక్తరూపంలో ఉన్నాయి. సృష్టికి ముందు జగత్తు ఎలాగైతే అవ్యక్తరూపంలో ఉందో, అలా వేదాలు కూడా అవ్యక్త రూపంలో ఉన్నాయి. బ్రహ్మ జగత్తునూ, వేదాలనూ అవ్యక్తంలోంచి వ్యక్తరూపంలోకి తెచ్చాడు.

బ్రహ్మ జగత్తును సృష్టించాడు అంటే, లేని జగత్తును కొత్తగా సృష్టించాడని కాదు అర్థం. లేని జగత్తును కొత్తగా సృష్టించాడంటే అది అసత్కార్యవాదం అవుతుంది. బ్రహ్మ జగత్తును సృష్టించాడంటే అవ్యక్తంలో ఉన్న జగత్తును వ్యక్తపరిచాడు.

**అవ్యాకృత ప్రపంచస్య వ్యాకరణం సృష్టిః**

అదే నియమం ప్రకారం, బ్రహ్మ వేదాలను సృష్టించలేదు. అవి అనాదిగా ఉన్నాయి. ఎక్కడ ఉన్నాయి? బ్రహ్మలో. ఎలా ఉన్నాయి? అవ్యక్తరూపంలో. బ్రహ్మ వాటిని అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి తెచ్చాడు.

అందువల్ల వేదాలు ఎవరివల్లా, ఆఖరికి భగవాన్‌వల్ల కూడా సృష్టించబడలేదు. భగవంతుడు వ్యక్తపరిచాడు అంతే. ఈ విషయం గుర్తు పెట్టుకోవాలి. ఎందుకంటే న్యాయదార్శనికులు, భగవంతుడు వేదాలను సృష్టించాడు అంటారు. ఆ విధంగా వేదాంతం నైయాయికుల వాదానికి భిన్నంగా ఉంది. ఇది గుర్తుంచుకుంటే, వేరే సందర్భంలో మనం చర్చించబోయే అనేక సాంకేతిక ప్రశ్నలకు అది ఆధారమవుతుంది.

**విషయవాక్యం** – ప్రతి సూత్రానికీ, దానికి అనుబంధిత వేదాంతవాక్యం ఉంటుందనీ, దాన్ని విషయవాక్యం అంటారనీ చూశాము. అందువల్లనే బ్రహ్మసూత్రములను వేదాంతసూత్రములు అనీ, ఉత్తరమీమాంసా సూత్రములు

అనీ అంటారు. ఈ సూత్రానికి విషయవాక్యం బృహదారణ్యకోపనిషత్తులోని ప్రఖ్యాతిగాంచిన మైత్రేయీ బ్రాహ్మణంలోనిది.

ఈ బ్రాహ్మణంలో సృష్టి, స్థితి, లయలను తార్కికంగా మూడు ఉదాహరణలు ఇవ్వటంద్వారా వెల్లడించాడు యాజ్ఞవల్క్యుడు.

**సృష్టి** – అగ్ని ఉదాహరణ. అగ్నినుంచి పొగ వచ్చినట్టుగా సృష్టి జరిగింది. మామూలుగా నిప్పురవ్వలు చెబుతుంది ఉపనిషత్తు. కాని ఇక్కడ పొగ అంది.

**స్థితి** – దుందుభి, శంఖము, వీణ. ఈ మూడింటినుంచి శబ్దాలు వస్తాయి. వాటి సామాన్యశబ్దం వాటినుంచి వచ్చే అనేక రకాల శబ్దాలకు స్థితికారణం. అలా బ్రహ్మ అనేకంగా ఉన్న జగత్తుకు స్థితికారణం.

**లయ** – సముద్రం. ఎలాగైతే నదులన్నీ సముద్రంలో కలుస్తాయో, అలా జగత్తు మొత్తం భగవంతునిలో కలుస్తుంది.

ఇప్పుడు మనం తీసుకునే మంత్రం పదవ మంత్రం.

**స యథాఽఽర్ద్రైధాగ్నేరభ్యాహితాత్పృథగ్ధూమా వినిశ్చరన్త్యేవం వా అరేఽస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాసూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానాన్యస్యైవైతాని నిశ్వసితాని ॥ – బృహదారణ్యకమ్** 2.4.10

ఈ మంత్రంలో బ్రహ్మను సృష్టికారణంగా చూస్తాము. బ్రహ్మను అనేక ఉపనిషత్తుల్లో సృష్టికారణంగా చూస్తాము. అయితే ఇదే ఎందుకు చెప్పాలి అంటే, ఈ మంత్రానికొక ప్రత్యేకత ఉంది. మిగతా అన్ని మంత్రాల్లోనూ బ్రహ్మను సృష్టికర్త అన్నప్పుడు, జగత్తుయొక్క కర్తగానే చూస్తాము, కాని ఈ మంత్రంలో సృష్టికర్త అంటే ఒక్క జగత్తే కాదు, వేదాలయొక్క సృష్టికర్త అని కూడా వస్తుంది. బ్రహ్మ వేదాల సృష్టికర్త అని బ్రహ్మసూత్రాల్లోని ఈ సూత్రం అర్థం అని చూశాము. దానికి ఆధారం ఈ మంత్రం.

తడి కట్టెలు ఇంధనంగా కలిగి, అన్నివైపులా మండుతున్న అగ్నినుంచి అనేక రకాల పొగలు వెలువడతాయి. అదేవిధంగా, ఓ మైత్రేయీ, వేదాలు ఈ బ్రహ్మయొక్క నిశ్వాసయే అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఎందుకు నిశ్వాస ఉదాహరణ చెప్పాడు? మన ప్రయత్నం లేకుండానే, మనం గాలి పీల్చి,

వదులుతుంటాము. దీన్ని **లీలన్యాయం** అంటారు. అంటే ఏమాత్రం ప్రయత్నం లేకుండా, అప్రయత్నంగా జరిగేది. మనం ఊపిరి పీలుస్తున్నామనే విషయం మనకు తెలియకుండానే జరిగిపోతుంది. అదే విధంగా భగవంతుడు శ్రమపడకుండా జగత్తును, వేదాలను సృష్టించాడు.

**ఋగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరస** – నాలుగు వేదాలు పుట్టాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. అథర్వణవేదాన్ని అథర్వణుడు, అంగిరసుడు అనే ఇద్దరు మహర్షులు దర్శించారు. అందువల్ల అథర్వణవేదాన్ని అథర్వాంగిరసవేదం అని కూడా అంటారు.

**ఇతిహాసం** – ఇతిహాసం అంటే మహాభారతం కాదు; వేదాలలో వచ్చే బ్రాహ్మణ భాగం. ఉదాహరణకు ఊర్వశీపురూరవుల సంవాదము.

**పురాణం** – మనకు తెలిసిన రామాయణం కాదు; సృష్టివాక్యాలు.

**విద్య** – దేవతలు నేర్చుకునే నృత్యగీతాలు.

**ఉపనిషత్తులు** – ఈ సందర్భంలో ఉపాసనలు.

**శ్లోకాః** – వేరే వేదాలనుంచి ఉటంకించే మంత్రాలు. **ఇత్యేష శ్లోకో భవతి** అని తరచు తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది.

**సూత్రాణి** – బ్రహ్మసూత్రములు కావు. వేదాలలో సూత్రరూపంలో వచ్చే సంక్షిప్త వాక్యాలు.

**ఆత్మేత్యేవోపాసీత – బృహదారణ్యకోపనిషత్తు 1.4.7**

**అనువ్యాఖ్యానాని** – మంత్రాలను వివరించే భాగాన్ని అనువ్యాఖ్యానాని అంటారు.

**వ్యాఖ్యానాని** – విషయ వస్తువును సంక్షిప్తంగా చెప్పి, తర్వాత దానిని వివరించే వాక్యాలను వ్యాఖ్యానాని అంటారు. అంటే ఇందాక సూత్రంగా చెప్పిన వాక్యాన్ని విశ్లేషించటం.

**అస్యైవైతాని నిశ్వసితాని** – ఇవన్నీ బ్రహ్మయొక్క నిశ్వాసాలు మాత్రమే.

ఈ మంత్రం ఆధారంగా వచ్చిందే శాస్త్రయోనిత్వాత్.

**బ్రహ్మ సర్వజ్ఞః వేదస్య నిమిత్తకారణత్వాత్**

## పదవిశ్లేషణ

శాస్త్రయోనిత్వాత్ అనే ఈ సూత్రంలో ఒకటే సంయుక్తపదం ఉంది. దాన్ని శాస్త్రం+యోనిగా విడదీస్తాము. శాస్త్రయోనిత్వాత్ అంటే శాస్త్రంయొక్క యోని కాబట్టి.

**శాస్త్రమ్** – శాస్త్రం అంటే వేదం. వేదంలో రెండుభాగాలు ఉంటాయి. వేద పూర్వభాగం, వేద అంతభాగం. వేద పూర్వభాగంలో కర్మ, ఉపాసనల గురించి వస్తే, వేద అంతభాగంలో జ్ఞానం గురించి వస్తుంది. అందువల్ల వేద పూర్వభాగాన్ని కర్మకాండ (ఉపాసనలను అందులో కలుపుకోవాలి) అనీ, వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు. శాస్త్రానికి ఆ పేరు ఎందుకు వచ్చింది?

**శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్**

శాసనం అంటే శాసించి చెప్పేది. వేద పూర్వభాగంలో విధినిషేధ వాక్యాలు వస్తాయి.

సత్యం వద, ధర్మం చర

సత్యం పలుకు, ధర్మాన్ని ఆచరించు. వీటిని పాటించకపోతే, శిక్ష కూడా ఉంటుంది. శాసనం అంటే విధినిషేధ వాక్యాలు అనవచ్చు. అంటే ఏవి చేసితీరాలో, ఏవి చెయ్యకూడదో మనను నిర్దేశిస్తుంది.

కాని వేద అంతభాగంలో ఇలాంటి విధినిషేధ వాక్యాలు ఉండవు. అందువల్ల అక్కడ శాసనం అంటే ఒక సత్యాన్ని వెల్లడించటం. ఏమిటా సత్యం? నువ్వు ముందే బ్రహ్మవు.

జీవితంలో ఏదైనా పొందటానికి కష్టపడనవసరం లేనిది ఏదైనా ఉంటే అది బ్రహ్మత్వహోదాకోసం. అదే తమాషా! జీవితమంతా మనం అష్టకష్టాలు పడి, మోక్షం పొందటంకోసం నానాతిప్పలు పడితే, చివర్లో శాస్త్రం వచ్చి, నువ్వు దేనికోసమైనా కష్టపడనవసరం లేదంటే అది మోక్షంకోసం మాత్రమే, నువ్వు ముక్తపురుషుడవు అని చెప్పటంలో ఏదైనా శాసనం ఉందా? లేదు. అందువల్ల శాసనం అంటే రెండు అర్థాలున్నాయి.

ఎ) కర్మకాండలో శాసనం అంటే విధినిషేధవాక్యాలు.

బి) జ్ఞానకాండలో శాసనం అంటే సత్యాన్ని వెల్లడించటం.

త్రాయతే అంటే రక్షించటం. వేదం విధినిషేధవాక్యాలద్వారా, సత్యవాక్యాలను వెల్లడించటంద్వారా మనుష్యులను సంసారంనుంచి రక్షిస్తుంది.

**త్రాయతే మహతో భయాత్ ఇతి శాస్త్రమ్**

**యోని** - యోనికి అనేక అర్థాలున్నాయి. ఈ సందర్భంలో యోని అంటే నిమిత్త కారణం. శాస్త్రంయొక్క కర్త, రచయిత. శాస్త్రయోని అంటే శాస్త్రంయొక్క సృష్టికర్త. శాస్త్రానికి కారణం అవటంచేత బ్రహ్మ సర్వజ్ఞుడు అని సూత్రానికి అర్థం.
శాస్త్రయోనిత్వాత్ - శాస్త్రంయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు.
ఇక్కడ శాస్త్రయోనిని ఇలా విడదీస్తాము.
శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ - తత్పురుష సమాసం. బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త.

శాస్త్రయోనిత్వాత్ - పూర్తి అర్థం - 1

బ్రహ్మ సర్వజ్ఞః వేదకర్తృత్వాత్
శాస్త్రంయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు.
శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ - తత్పురుష సమాసం
బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త

## ఉపసంహారం - అధికరణ నిర్ణయం

ఈ సూత్రంతో ఈ అధికరణం ముగిసింది కాబట్టి, ఇప్పుడు అధికరణ నిర్ణయం చేయాలి. ఈ అధికరణం పేరు శాస్త్రయోనిత్వాధికరణమ్.

అధికరణ నిర్వచనం చూద్దాము ముందు -

**విషయో సంశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**
**సంగతి శ్చేతి పంచకం శాస్త్రేఽధికరణం స్మృతమ్**

ఒక అధికరణంలో ఐదు అంశాలు ఉండాలి. అవి విషయః, సంశయః, పూర్వపక్షః, ఉత్తరమ్, సంగతి.

1. **విషయః** - విషయం. విషయం అంటే చర్చిస్తున్న అంశం. ఈ అధికరణంలో చర్చించిన అంశం - బ్రహ్మ వేదాల సృష్టికర్త.

2. **సంశయః** – సంశయం. అస్తివా, నవా? బ్రహ్మ వేదాల సృష్టికర్త అవునా, కాదా?

**బ్రహ్మ వేదస్య కర్తా వా న వా?**

ముందు సూత్రంలో బ్రహ్మ సర్వస్యకర్త అన్నాము. సర్వస్యలో వేదాలు కూడా వస్తాయా, రావా?

3. **పూర్వపక్షః**– పూర్వపక్షి వాదన. అతను ఎప్పుడూ తప్పుగానే ఆలోచిస్తాడు. అతను సరిగ్గా ఆలోచిస్తే, అతను కూడా సిద్ధాంతి అయివుండేవాడు. బ్రహ్మ వేదాల కర్త కాదు అంటాడు.

**న వేదస్య కర్తా వేదస్య అనాదిత్వాత్**

వేదాలు అనాదిగా ఉన్నాయి కాబట్టి, వేదాలను బ్రహ్మ సృష్టించనవసరం లేదు. సృష్టించబడిన ప్రతిదానికీ ఒక ఆది, ఒక అంతం ఉంటుంది.

**జాతస్య హి ధృవో మృత్యుః – గీత** 2.27

వేదాన్ని అనాది, అనంతం అంటారు. వేదం నిత్యం అయితే, దాన్ని బ్రహ్మ సృష్టించాడని ఎలా చెప్పగలరు?

4. **ఉత్తరమ్** – అద్వైతసిద్ధాంతి జవాబు. వేదం అనాది అని మేమూ ఒప్పుకుంటాము. కాని దాని సృష్టి గురించి ఎందుకు చెబుతామంటే, అది కూడా సృష్టిలా అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వస్తుంది. అందువల్లనే వేదాలను అవ్యక్తరూపంలో ఉన్నప్పుడు ఓంకారంగా భావిస్తారు. ఓంకారాన్ని వేదాల సారాంశంగా అభివర్ణిస్తారు.

**ఓం యశ్ఛందసామృషభో విశ్వరూపః**

**ఛందోభ్యోఽ ధ్యమృతాత్సంబభూవ – తైత్తిరీయమ్**

బ్రహ్మ నాలుగు వేదాలను చిలికితే వాటి సారంగా ఓంకారం వచ్చింది. వేదాల సారం అయిన ఓంకారం అమృతంవంటిది. ఎక్కడైనా నలుగురు చేరినప్పుడు, గోలగోలగా మాట్లాడుతూ, ఏదీ వినిపించకుండా ఉంటే, ఓ గోలగా ఉంది అంటాము. అంటే అవ్యక్తశబ్దం **ఓం**. ఓంకారశబ్దం ఆకాశంలో అవ్యక్తంగా ఉంది. ఆకాశంలో పంచేంద్రియగుణాలలో శబ్దగుణం మాత్రమే ఉంటుందని చూశాము.

ఆ విధంగా వేదం ఓంకార రూపంలో, ఆకాశంలో ఉంది; ఆ ఆకాశం బ్రహ్మలో ఉంది. ఆకాశంతో పాటు ఓంకారం కూడా పుట్టింది. ఓంకారం నుంచి మొత్తం ప్రపంచం వచ్చింది. అందువల్ల వేదం నిత్యం; ఆ నిత్యమైన వేదానికి బ్రహ్మ సృష్టికర్త; అంటే వేదాలను కొత్తగా రచించలేదు. అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి తీసుకువచ్చాడు.

5. **సంగతి** – సంబంధం. ఈ అధికరణానికీ, ముందు అధికరణానికీ మధ్య ఉన్న సంబంధాన్ని సంగతి అంటారు. ఇక్కడ సంబంధాన్ని ఆక్షేపసంగతి అంటారు. అంటే ముందు అధికరణంలో పూర్వపక్షి ఒక అభ్యంతరం చెపితే, దానికి జవాబు ఇందులో వస్తుంది.

ముందు సూత్రంలో బ్రహ్మను సర్వకారణంగా వర్ణించింది. దానికి పూర్వపక్షి చెప్పిన అభ్యంతరం, బ్రహ్మను సర్వకారణంగా ఒప్పుకుంటాము కాని, వేద కారణంగా ఒప్పుకోము అని. దానికి వారు చెప్పిన కారణం వేదం అనాది. ఈ సూత్రంలో బ్రహ్మ జగత్కారణం మాత్రమే కాదు, వేద కారణం కూడా. కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు. పూర్వపక్షియొక్క అభ్యంతరాన్ని ఖండించటంద్వారా బ్రహ్మయొక్క సర్వజ్ఞత్వాన్ని దృఢీకరించటం జరిగింది.

ఈ సూత్రంయొక్క సారం – బ్రహ్మ సర్వజ్ఞుడు, వేదకర్త కూడా కావటంవల్ల. ఈ విషయంలో పూర్వపక్షి చూపిన అభ్యంతరాన్ని ఖండించటంద్వారా సర్వజ్ఞత్వాన్ని దృఢీకరించింది.

## రెండవ విశ్లేషణ

### మూడవసూత్రం – శాస్త్రయోనిత్వాత్

ఈ సూత్రాన్ని రెండు రకాలుగా విశ్లేషించవచ్చని చూశాము. ఇప్పుడు రెండవ విశ్లేషణ చూద్దాము. అంటే మళ్ళీ ఈ సూత్రాన్ని కొత్తగా చూస్తున్నట్టే అర్థం. అందువల్ల మళ్ళీ ఈ మూడు దశల్లో సూత్రాన్ని విశ్లేషిస్తాము.

## సామాన్య విచారణ

రెండవ సూత్రాన్ని బ్రహ్మలక్షణ సూత్రమనీ, మూడవ సూత్రాన్ని బ్రహ్మప్రమాణ సూత్రమనీ చూశాము. కాని రెండవ సూత్రాన్ని విశ్లేషిస్తున్నప్పుడు ఈ విషయం మీద చిన్న విశ్లేషణను చూశాము. అది ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

నైయాయికుడు రెండవ సూత్రాన్ని లక్షణసూత్రంగానే కాక, ప్రమాణ సూత్రంగా కూడా తీసుకోవచ్చని వాదించాడు. బ్రహ్మకు ప్రమాణంగా అనుమాన ప్రమాణం చాలు, శాస్త్రం దాకా వెళ్ళనవసరం లేదు అంటాడు.

కుండ అనే కార్యానికి ఒక కర్త ఉన్నట్టుగా, జగత్తు అనే కార్యానికి ఒక కర్త ఉన్నాడని ఊహించవచ్చు అంటాడు. దాన్ని **కార్యలింగక అనుమానం** అంటారు. అంటే కార్యాన్ని చూసి, కారణాన్ని ఊహించవచ్చు. అందువల్ల అనుమాన ప్రమాణమే చాలు అంటాడు. ప్రమాణం అంటే జ్ఞానం పొందే మార్గం.

కాని వ్యాసాచార్యులవారు అలాంటి వాదనను ఇష్టపడరు. ఆయన వైదికుడు. అంటే వేదాన్ని పాటిస్తారు. వేదం చాలా స్పష్టంగా చెబుతుంది –

**నైషా తర్కేణ మతిరాపనేయా –** కఠ

తర్కంవల్ల బ్రహ్మను ఎన్నడూ తెలుసుకోలేము అంటుంది ఉపనిషత్తు. అందువల్ల ఎవరైనా అనుమాన ప్రమాణాన్ని ప్రమాణంగా తీసుకుంటే, ఆ భావనను ఆయన ఖండిస్తారు. ఆ భావనను ఖండిస్తూ, బ్రహ్మకు శాస్త్రం మాత్రమే ప్రమాణం, అనుమాన ప్రమాణం కాదని నిరూపించాలి వ్యాసాచార్యుల వారు. శాస్త్రం అంటే వేదం లేదా వేద అంతభాగం.

బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము. శాస్త్రంద్వారానే తెలుసుకోగలము. ఈ అర్థాన్ని మూడవ సూత్రంద్వారా వెలిబుచ్చారు.

ఈ సూత్రంయొక్క సామాన్యవిచారణ, శాస్త్రయోనిత్వాత్ అంటే శాస్త్రవిషయత్వాత్. అంటే బ్రహ్మ శాస్త్రంయొక్క విషయం మాత్రమే, అది అనుమాన ప్రమాణంయొక్క విషయం కాదు. ప్రతి సూత్రానికి ఒక అనుమానవాక్యం ఉండాలని చూశాము. అది –

**బ్రహ్మ న అనుమాన విషయః శాస్త్రవిషయత్వాత్ ధర్మవత్**

శాస్త్రయోనిత్వాత్ అంటే శాస్త్రవిషయత్వాత్ అని చూశాము. ఈ అనుమాన వాక్యం అర్థం బ్రహ్మ అనుమానవాక్యంయొక్క విషయం కాదు, ఎందుకంటే బ్రహ్మ వేదంయొక్క విషయం మాత్రమే కాబట్టి. అది ధర్మంలాగా అపౌరుషేయం.

ధర్మం అంటే పుణ్యం. పుణ్యాన్ని కూడా తర్కంద్వారా తెలుసుకోలేము. పుణ్యం కూడా శాస్త్రంయొక్క విషయం మాత్రమే. అందువల్లనే పుణ్యాన్ని అదృష్టవిషయం

అనీ, అపౌరుషేయ విషయం అనీ, అపూర్వవిషయం అనీ అంటారు. ధర్మం తర్కానికి అందదు.

మొదటి విశ్లేషణకూ, ఈ విశ్లేషణకూ మధ్య భేదాన్ని చూస్తే –

1. బ్రహ్మ సర్వజ్ఞః వేదకర్తృత్వాత్
2. బ్రహ్మ న అనుమానవిషయః శాస్త్రవిషయత్వాత్

అంటే మొదటి విశ్లేషణలో శాస్త్రయోని అంటే శాస్త్రకర్త అన్నాము; ఈ విశ్లేషణలో శాస్త్రయోని అంటే శాస్త్రంయొక్క విషయం అన్నాము.

**విషయవాక్యం** – విశేషణ మారుతుంది కాబట్టి విషయవాక్యం కూడా మారుతుంది. మొదటి విశ్లేషణకు –

**అరేஉస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోஉథర్వాంగిరసః। – బృహదారణ్యకమ్** – 2.4.10

బ్రహ్మనుంచి వేదాలు వచ్చాయని చూశాము. ఇక్కడ బ్రహ్మ శాస్త్రవిషయం అని చూపటానికి కూడా బృహదారణ్యకంలోకే వెళతాము.

**తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి తం చేన్మే న వివక్ష్యసి మూర్ధా తే విపతిష్యతీతి। – బృహదారణ్యకమ్** 3.9.26

ఈ బ్రాహ్మణాన్ని శాకల్య బ్రాహ్మణం అంటారు. ఒకసారి జనకమహారాజు ఒక వేదపండితుల సభను ఏర్పాటుచేశాడు. అందులో ఏ పండితుడైతే అందరిలోకి శ్రేష్ఠుడో, అతనికి వెయ్యి ఆవులను ఇస్తానని ప్రకటించాడు.ఆ వెయ్యి ఆవులలో ప్రతి ఒక్క ఆవుకు పదేసి పాదాల బంగారం రెండుకొమ్ములకు కట్టబడివున్నాయి. ఎవరితో వాదన చెయ్యకుండానే యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణి పిలిచి ఆ గోవులను తన ఆశ్రమానికి తీసుకుని పొమ్మన్నాడు. తను బ్రహ్మిష్ఠునిగా ఎలా భావించగలడని తక్కిన పండితులు కోపగించారు. దానితో ఒకరొకరుగా అతనితో వాదోపవాదాలకు దిగి, ఓడిపోయి వెనుదిరిగారు.

అలా ఎనిమిదిమంది బ్రాహ్మణులతో వాదించి, వారిని ఓడించాడు. అందులో గార్గి అనే స్త్రీ రెండుసార్లు వాదనకు దిగి, రెండవసారి కూడా వాదించి, ఓడిపోయాక, ఇతను బ్రహ్మవేత్త, ఇంక మీరెవరూ ఇతనితో వాదించనవసరం లేదని చెప్పినా వినకుండా శాకల్యుడు రంగంలోకి దిగాడు.

యాజ్ఞవల్క్యునిమీద ప్రశ్నల వర్షం కురిపించాడు. యాజ్ఞవల్క్యుడు ఒకసారి హెచ్చరించాడు కూడా.

**శాకల్యేతి హోవాచ యాజ్ఞవల్క్యస్త్వాం స్విదిమే బ్రాహ్మణా**
**అఙ్గారావక్షయణమక్రతా ౩ ఇతి॥ – బృహదారణ్యకమ్** 3.9.18

తక్కిన బ్రాహ్మణులు నిన్ను నిప్పును నొక్కితీసే పటకారుగా వాడుతున్నారు అనిపిస్తున్నది అన్నాడు. అంటే పరోక్షంగా నువ్వు నిప్పుతో చెలగాటమాడుతున్నావు సుమా అని హెచ్చరించాడు. అయినా వినలేదు. ఇంకా ప్రశ్నల తూటాలు వదులుతూనే ఉన్నాడు. అతను అడిగినవన్నీ సగుణ ఈశ్వరుడు లేదా హిరణ్యగర్భ గురించే. అతనికి నిర్గుణబ్రహ్మ గురించి తెలియదు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు అతన్ని, 'నేను అడిగే ప్రశ్నకు నువ్వు జవాబు చెప్పు. ఔపనిషదం బ్రహ్మ గురించి తెలుసా?' అన్నాడు. పైగా నువ్వు చెప్పలేకపోతే నీ తల ఊడిపడగలదు అన్నాడు. శాకల్యునికి జవాబు తెలియకపోవటంవల్ల అతని తల ఊడిపడింది. అంతేకాక, దొంగలు ఇతని ఎముకలను ధనమని భావించి ఎత్తుకుపోయారు. దీన్ని కథగానే తీసుకోవాలి. అతని గర్వం అణిగింది అనుకోవాలి. ఆ బ్రహ్మ గురించి నేతినేతి పద్ధతిద్వారానే తెలుసుకోవాలి. ఇక్కడ బ్రహ్మకు పదం పురుషం పదం వేశాడు.

ఈ సందర్భం మొత్తంలో మనకు ముఖ్యమైన పదం **ఔపనిషదం పురుషమ్**. పురుషం అంటే నిర్గుణబ్రహ్మ. ఆ నిర్గుణబ్రహ్మకు ఒక విశేషణం వాడాడు. ఏమిటది? ఔపనిషదం. అంటే **ఉపనిషద్ ఏకవేద్యమ్**; అంటే ఉపనిషత్తుద్వారానే తెలుసుకోగలము కాని ప్రత్యక్షంద్వారానో, అనుమానప్రమాణంద్వారానో, అర్థాపత్తిద్వారానో, ధ్యానంద్వారానో తెలుసుకోలేము.

ఔపనిషదం పురుషం = శాస్త్రయోనిబ్రహ్మ.

## పదవిశ్లేషణ

ఈ సూత్రంలో ఒకటే పదం ఉందని చూశాము. అది శాస్త్రయోనిత్వాత్. ఈ పదంలో రెండు భాగాలు ఉన్నాయి. శాస్త్రం + యోని.

**శాస్త్రం** – అంటే మొదటి విశ్లేషణలో చూసిన అర్థమే వస్తుంది. అంటే వేదం, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే **వేదాంతం**.

**యోని** – యోని పదానికి ఇక్కడ వేరే అర్థం ఇస్తాము. అది ప్రమాణం. ముందు విశ్లేషణలో వేదకర్తా అన్నాము; ఇప్పుడు ప్రమాణం అంటున్నాము.

మొదటి విశ్లేషణకూ, దీనికీ మధ్య వ్యాకరణపరంగా భేదం చూపిస్తాము. అంటే శాస్త్రయోనిత్వాత్ అనే సమాసాన్ని రెండు రకాలుగా వివరించవచ్చు.

1. శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ – తత్పురుష సమాసం
   బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త
2. శాస్త్రం యోనిః ప్రమాణం యస్య – బహువ్రీహి సమాసం
   శాస్త్రమును ప్రమాణంగా కలవాడు బ్రహ్మ

తత్పురుష సమాసానికీ, బహువ్రీహి సమాసానికీ మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోవటానికి మన సాంప్రదాయంలో ఒక కథ చెబుతారు. అదేమిటో సరదాగా చూద్దాము.

ఒకసారి ఒక పండితుడు ఒక గొప్ప రాజు దగ్గరికి వెళ్ళాడు. ఆ రోజుల్లో పండితులు రాజ్యసభలో వారి పాండిత్యాన్ని ప్రదర్శించి, రాజుయొక్క మెప్పు సంపాదించి, దానికి తగ్గ పారితోషికాలను పొందేవారు. ఈ పండితుడు అష్టదరిద్రంలో మునిగిపోయివున్నాడు. అతను ఈ క్రింది శ్లోకం చెప్పాడు –

**అహం చ త్వం చ రాజేంద్ర లోకనాథౌ ఉభావపి**
**బహువ్రీహి సమాసోఽహం షష్ఠీ తత్పురుషో భవాన్**

**అహంచ త్వం చ రాజేంద్ర** – ఓ రాజేంద్రా, నేనూ, మీరు

**లోకనాథౌ ఉభౌవతి** – ఇద్దరం కూడా లోకనాథులమే అన్నాడు. అంటే ఇద్దరమూ లోకాన్ని పాలించేవారమే అని అర్థం వస్తుంది. కాని ఈ దరిద్రనారాయణునికీ, నాకూ సాపత్యమా అని రాజు ఆగ్రహించేలోపు తర్వాత పాదాలను వదులుతాడు.

**బహువ్రీహి సమాసోఽహమ్** – నేను బహువ్రీహి సమాసాన్ని అంటాడు.

**షష్ఠీ తత్పురుషో భవాన్** – మీరు షష్ఠీ తత్పురుష సమాసం అంటాడు.

అంటే లోకనాథుడు అనే పదాన్ని రెండురకాలుగా విడదీయాలి.

| | |
|---|---|
| లోకాన్ని నాథుడుగా గలవాడు | – బహువ్రీహి సమాసం |
| లోకంయొక్క నాథుడు | – షష్ఠీతత్పురుష సమాసం |

సంస్కృతంలో చెప్పాలంటే లోకనాథః బహుబ్రీహి సమాసం లోకః నాథః యస్య. లోకాన్ని నాథుడుగా గలవాడు. అంటే లోకంమీద డబ్బులకోసం తను ఆధారపడ్డాడు. రాజు లోకస్య నాథః – లోకానికి రాజు. ఓ రాజా, నువ్వు లోకాన్ని ఆడిస్తే, నన్ను లోకం ఆడిస్తోంది అన్నాడు. ఈ సమాసాల సూత్రముల ప్రకారం శాస్త్రయోనిత్వాత్ అంటే –

1. శాస్త్రస్య కర్తా – శాస్త్రంయొక్క కర్తా
2. శాస్త్రం ప్రమాణం యస్య – శాస్త్రాన్ని ప్రమాణంగా కలవాడు

ఇప్పుడు మనం చూడాల్సింది రెండవ అర్థం. శాస్త్రాన్ని ప్రమాణంగా కలవాడు అంటే శాస్త్రం విషయం లేదా శాస్త్రవేద్యం. అంటే **శాస్త్రంయొక్క విషయం బ్రహ్మ.** అంటే శాస్త్రం బోధించేది బ్రహ్మ గురించి. బ్రహ్మ శాస్త్రంయొక్క విషయం అని వ్యాసాచార్యులు చెప్పటంవల్ల బ్రహ్మ అనుమాన ప్రమాణానికి దొరకదని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది.

శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 2

బ్రహ్మ న అనుమానవిషయః శాస్త్రవిషయత్వాత్
బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము.
శాస్త్రంద్వారానే తెలుసుకోగలము.
శాస్త్రం యోనిః ప్రమాణం యస్య – బహుబ్రీహి సమాసం
శాస్త్రమును ప్రమాణంగా కలవాడు బ్రహ్మ

## ఉపసంహారం – అధికరణ నిర్ణయం

ఈ సూత్రంతో ఈ అధికరణం ముగిసింది. కాబట్టి, ఇప్పుడు అధికరణ నిర్ణయం చెయ్యాలి. ఈ అధికరణం పేరు శాస్త్రయోని అధికరణం. అధికరణంలో ఉండాల్సిన ఐదు అంశాలను వరుసగా చూద్దాము.

1. **విషయః** – విషయం. విషయం అంటే చర్చిస్తున్న అంశం. ఈ అధికరణంలో చర్చించిన అంశం – జగత్కారణ బ్రహ్మకు ప్రమాణం శాస్త్రం.

2. **సంశయః** – సంశయం. మీ ఇంటికి ఒకటే దారి ఉంటే, సంశయం ఉండదు.

**ఏకస్యైవ విషయస్య సంశయః న భవతి**

మీకు అనేక యూనివర్శిటీలలో చదువుకునే అవకాశం వస్తే, వాటిలో ఏది ఎన్నుకోవాలా అని సందేహం కలుగుతుంది. అలాగే తల్లిదండ్రులకు తమ పుత్రుని జాతకంతో అనేకమంది అమ్మాయిల జాతకాలు కుదిరితే, ఏ అమ్మాయితో పెళ్ళి చేయాలా అని సందేహం కలుగుతుంది.

రెండు అవకాశాలు ఉంటే చాలు సంశయం కలగటానికి. ఇప్పుడు బ్రహ్మ విషయానికి వస్తే, ఏమిటి సందేహం?

బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోవచ్చా, లేదా?

3. **పూర్వపక్షః** – పూర్వపక్షి వాదన. పక్షి అంటే అతనిని మనం పక్షిగా తిట్టటం లేదు. వేదపూర్వపక్షాన్ని ఆధారం చేసుకుని వాదించే వారిని పూర్వపక్షి అంటారు.

**బ్రహ్మ అనుమాన విషయః జగత్ కారణత్వాత్ ఘటవత్**

జగత్తుయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మను అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు అంటాడు అతను. కార్యం అయిన కుండను చూసి ఎలా కారణం అయిన కుమ్మరిని తెలుసుకుంటామో, అలా కార్యం అయిన జగత్తు నుంచి కారణం అయిన బ్రహ్మ గురించి తెలుసుకోవచ్చు అంటున్నాడు. పైగా రెండవ సూత్రంలో, మీరే బ్రహ్మను జగత్కారణంగా అభివర్ణించారు. అలాంటప్పుడు బ్రహ్మ గురించి అనుమానం ద్వారా ఎందుకు తెలుసుకోకూడదు, మళ్ళీ శాస్త్రప్రమాణం ఎందుకు అంటాడు.

4. **ఉత్తరమ్** – అద్వైతసిద్ధాంతి జవాబు.

**బ్రహ్మ న అనుమాన విషయః శాస్త్రవిషయత్వాత్ ధర్మవత్**

బ్రహ్మను అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోలేము, ఎందుకంటే బ్రహ్మను శాస్త్రంద్వారానే తెలుసుకోగలము కాబట్టి. దానికి ఉదాహరణ ధర్మవత్. ధర్మాన్ని ఎలా అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేమో, అలా బ్రహ్మ గురించి కూడా అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము. వేదభాష్యంలో వేదం గురించి శయనాచార్యులవారు ఒక నిర్వచనం చెప్పారు. దాని అర్థం వేదం అంటే వేదం బోధించే విషయంయొక్క జ్ఞానం వేరే ఏ ప్రమాణానికీ అందనిది అని.

5. **సంగతి** – సంబంధం. ఈ అధికరణానికీ, ముందు అధికరణానికీ మధ్య ఉన్న సంబంధాన్ని సంగతి అంటారు. రెండు రకాల విశ్లేషణలకూ మధ్య ఉన్న సంబంధం కాదు. ఇక్కడ సంగతిని **ఏకఫలకత్వ సంగతి** అంటారు. అంటే రెండు అధికరణాలకూ ఒకటే ఫలం ఉంది. ఏమిటా ఫలం? బ్రహ్మ సిద్ధి.

**లక్షణ ప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః**

రెండవసూత్రం ఆరంభంలో ఈ విషయం చూశాము. మొదటిసూత్రం బ్రహ్మవిచారణ చెయ్యి అంది.

**గలడందురన్ని దిశలను**
**గలడు కలండనెడివాడు గలడో లేడో**

బ్రహ్మ ఉన్నాడని మీరు చెబుతున్నారు కాని బ్రహ్మ ఉన్నాడో లేదో అనే సందేహం రావచ్చు. బ్రహ్మ ఉన్నాడని తెలిస్తేనే, బ్రహ్మ గురించిన విచారణ చెయ్యగలము. అందువల్ల వ్యాసాచార్యులవారు బ్రహ్మవిచారణ చెయ్యమని చెప్పాక, ఆ బ్రహ్మ ఉన్నాడని నిరూపించాలి.

ఒక వస్తువు ఉందని నిరూపించాలంటే దానికి రెండు అంశాలు ఉండాలని చూశాము. అవి లక్షణం, ప్రమాణం. లక్షణం అంటే ఆ వస్తువు యొక్క నిర్వచనం, ప్రమాణం అంటే దాన్ని తెలుసుకునే పరికరం. చంద్రుడి ఉదాహరణ చూశాము ఆ సందర్భంలో. ఎవరికైనా చంద్రుడు ఎలా ఉంటాడో తెలియకపోతే, రాత్రి ఆకాశంలో నక్షత్రాలను, చందమామనూ చూసినా కూడా చంద్రుణ్ణి తెలుసుకోలేడు. అతనికి కన్ను బాగా పనిచేస్తోంది. అంటే ప్రమాణం బాగుంది కాని లక్షణం తెలియదు.

ఇంకొక వ్యక్తికి చంద్రుని లక్షణం తెలుసు. అంటే ఆకాశంలో అన్నింటికన్నా బాగా మెరుస్తున్నది, వెన్నెలను కురిపిస్తున్నది చంద్రుడు అని తెలుసు. కాని చంద్రుణ్ణి కళ్ళారా చూడలేడు. ఎందుకు? అతనికి కన్ను అనే ప్రమాణం పనిచెయ్యటం లేదు. అంటే లక్షణం తెలియకుండా, ప్రమాణం ఉన్నా చూడలేరు. లక్షణం తెలిసి, ప్రమాణం లేకపోయినా చూడలేరు.

లక్షణం + ప్రమాణం = వస్తుసిద్ధి. రెండూ ఉండాలి.

ఈ నియమం ప్రకారం బ్రహ్మ అస్తి అని నిరూపించటానికి బ్రహ్మ లక్షణం, బ్రహ్మ ప్రమాణం రెండూ తెలియాలి. రెండవసూత్రంలో లక్షణంద్వారా బ్రహ్మగురించి తెలిస్తే, ఈ సూత్రంలో ప్రమాణంద్వారా బ్రహ్మ గురించి తెలుస్తుంది. అంటే ఈ రెండు అధికరణాలూ ఒకటే పనిని చేస్తున్నాయి. బ్రహ్మసిద్ధిని కలుగజేస్తున్నాయి.

**బ్రహ్మసిద్ధి రూప ఏక ఫలకత్వం సంగతిః**

రెండూ ఒకే ఫలాన్ని సూచిస్తున్నాయి.

బ్రహ్మకు శాస్త్రమే ప్రమాణం అని ఒక శాంతిపాఠంలో కూడా చూస్తాము.

**సర్వం బ్రహ్మోపనిషదం । మాహం బ్రహ్మ నిరాకుర్యామ్। మా మా బ్రహ్మ నిరాకరోత్** – శాంతిపాఠం

ఈ శాంతిపాఠాన్ని కూడా విషయవాక్యంగా తీసుకోవచ్చు. బ్రహ్మను ఉపనిషత్తు ద్వారానే తెలుసుకోవచ్చు. అంటే బ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. బ్రహ్మ ప్రత్యక్షప్రమాణానికి అందకపోతే నేను బ్రహ్మను నిరాకరించకుండుగాక అని వస్తుంది. అంటే మొదట్లో వేదాంతం చెప్పేదాన్ని తేలికగా అంగీకరించలేము. అలాగని నేర్చుకోవటం మానేయకుండా, శాస్త్రంమీదా, గురువుమీదా శ్రద్ధ ఉంచి నేర్చుకోవాలి. అంతేకాదు, మామా బ్రహ్మ నిరాకరోత్ – నన్ను బ్రహ్మ నిరాకరించకుండుగాక! అంటే బ్రహ్మ గురించి నేను నేర్చుకునే ప్రయత్నాన్ని భగవంతుడు ఆపకూడదు. నా ప్రయత్నంలో తోడ్పడాలి.

మూడు సూత్రములూ కలిపి, ఇంతవరకూ మనం నేర్చుకున్నది – బ్రహ్మవిచారణ చేయాలి; ఆ బ్రహ్మ జగత్తుయొక్క కారణం; ఆ బ్రహ్మ గురించి వేదాంతప్రమాణంద్వారానే తెలుసుకోగలము.

**జగతః కారణరూపే బ్రహ్మణః జ్ఞానార్థం వేదాంతవిచారః కర్తవ్యా**

***

# సూత్రము 3 – ముఖ్యమైన అంశములు
## శాస్త్రయోనిత్వాత్

**అధికరణం** – **శాస్త్రయోనిత్వాధికరణం**

**అల్పాక్షరమసందిగ్ధం సారవత్ విశ్వతో ముఖమ్, అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః**

**అల్పాక్షరం** – ఒక్క పదమే ఉంది.

**విశ్వతోముఖం** – రెండు రకాలుగా విశ్లేషణ చేయవచ్చు.

**మొదటివిశ్లేషణ**

**సామాన్య విచారణ**

**బ్రహ్మ సర్వజ్ఞత్వం దృఢయతి** – బ్రహ్మ సర్వజ్ఞత్వాన్ని దృఢపరుస్తుంది

**బ్రహ్మ సర్వజ్ఞః సర్వకారణత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

ఇక్కడ బ్రహ్మ వేదాల సృష్టికర్తకూడా

జగత్తు – అర్ధ ప్రపంచం, వేదాలు – శబ్ద ప్రపంచం

**అనుమాన వాక్యం – బ్రహ్మ సర్వజ్ఞః వేద కర్తృత్వాత్ వ్యతిరేకేణ కులాలవత్**

**వ్యాప్తివాక్యం – యః యస్య గ్రంథస్య కర్తా సః తతః అపి అధికజ్ఞానవాన్ యథా పాణినిః**

వేదాలు సర్వజ్ఞం; అందువల్ల వేదకర్త వాటికన్నా సర్వజ్ఞుడు

బ్రహ్మ వేదాలను రాయలేదు, వ్యక్తపరిచాడు అంతే

**అవ్యాకృత వేదం వ్యాకృతవాన్**

**విషయవాక్యం**– బృహదారణ్యకమ్ 2-4-10 మైత్రేయీ బ్రాహ్మణం – సృష్టి, స్థితి లయ కారణం

**స యథాఽఽర్ద్రైధాగ్నేరభ్యాహితాత్పృథగ్ధూమా వినిశ్చరన్త్యేవం వా అరేఽస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానాన్యస్యైవైతాని నిశ్వసితాని ॥** – బృహదారణ్యకమ్ 2.4.10

**లీల న్యాయః** సునాయాసంగా సృష్టించాడు. ఆ పట్టికలో వేదాలు కూడా వస్తాయి.

**శాస్త్రయోనిత్వాత్ – బ్రహ్మ సర్వజ్ఞః, వేదస్య నిమిత్త కారణత్వాత్**

## పదవిశ్లేషణ

**శాస్త్రయోనిత్వాత్** సంయుక్తపదం

శాస్త్రం+యోని శాస్త్రంయొక్క యోని అవటంవల్ల శాస్త్రయోనిత్వాత్

శాస్త్రం = వేదాలు. **శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రం**

కర్మకాండలో శాసనం అంటే విధివాక్యం

జ్ఞానకాండలో శాసనం అంటే సత్యాన్ని వెల్లడించటం

త్రాయతే – రక్షించటం

యోని – నిమిత్తకారణం – శాస్త్రంయొక్క సృష్టికర్తా – సర్వజ్ఞుడు.

ఇక్కడ శాస్త్రయోనిని ఇలా విడదీస్తాము.

శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ – తత్పురుష సమాసం. బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త.

శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 1

బ్రహ్మ సర్వజ్ఞః వేదకర్తృత్వాత్

శాస్త్రంయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు.

శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ – తత్పురుష సమాసం

బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త

## ఉపసంహారం – అధికరణ నిర్ణయం

విషయః – విషయం– బ్రహ్మ వేదాల సృష్టికర్త

సంశయః– సంశయం –బ్రహ్మవేదస్య కర్తా వా న వా?

పూర్వపక్షః– పూర్వపక్షుల వాదన–వేదాలు అనాది కాబట్టి వాటి సృష్టి జరగలేదు.

న వేదస్యకర్తా వేదస్య అనాదిత్వాత్

ఉత్తరమ్ – అద్వైతసిద్ధాంతి జవాబు – అనాది అయినా, జగత్తుతో పాటు వచ్చింది

ఓంకారం వేదాల సారం, అది ఆకాశంతో వచ్చింది

వేదాలు రచింపబడలేదు, అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చాయి.

సంగతి – సంబంధం – ఆక్షేపసంగతి – వేదాలు అనాది అందువల్ల బ్రహ్మ వేదకర్తకాదు. బ్రహ్మ జగత్కారణం మాత్రమే కాదు, వేద కారణం కూడా.

**రెండవ విశ్లేషణ**

**సామాన్య విచారణ**

శాస్త్రయోనిత్వాత్ = శాస్త్ర విషయత్వాత్

**అనుమాన వాక్యం – బ్రహ్మ న అనుమాన విషయః శాస్త్రవిషయత్వాత్ ధర్మవత్**

బ్రహ్మ అనుమాన ప్రమాణంయొక్క విషయంకాదు. శాస్త్రంయొక్క విషయం కాబట్టి ధర్మంలాగా అపౌరుషేయం

ధర్మం – అదృష్ట విషయం

విషయవాక్యం

**తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి। –** బృహదారణ్యకమ్ 3–9–26

**పురుషః–** నిర్గుణ బ్రహ్మ; **ఔపనిషదం –** ఉపనిషత్తు ద్వారానే తెలుసుకోగలము

**శాంతి పాఠం – సర్వం బ్రహ్మౌపనిషదమ్ మాహం బ్రహ్మ నిరాకుర్యామ్**

**శాస్త్రయోని బ్రహ్మ** – ఔపనిషదం పురుషమ్ అంటే **ఉపనిషద్ ఏకవేద్యమ్**; అంటే ఉపనిషత్తుద్వారానే తెలుసుకోగలము కాని ప్రత్యక్షం ద్వారానో, అనుమానప్రమాణం ద్వారానో, అర్థాపత్తిద్వారానో, ధ్యానంద్వారానో తెలుసుకోలేము.

**పదవిశ్లేషణ**

**శాస్త్రయోనిత్వాత్** – సంయుక్త పదం – శాస్త్ర + యోని

**శాస్త్రం** – వేదం లేదా వేదాంతం

**యోని** – ప్రమాణం

**శాస్త్రం యోనిః ప్రమాణం యస్య –** బహువ్రీహి సమాసం

శాస్త్రాన్ని ప్రమాణంగా కలవాడు బ్రహ్మ .

**ఇంతకు ముందు** యోని – **శాస్త్రస్య యోనిః బ్రహ్మ** – తత్పురుష సమాసం

బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త.

శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 2

బ్రహ్మ న అనుమానవిషయః శాస్త్రవిషయత్వాత్

బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము.

శాస్త్రంద్వారానే తెలుసుకోగలము.

శాస్త్రం యోనిః ప్రమాణం యస్య – బహువ్రీహి సమాసం

శాస్త్రమును ప్రమాణంగా కలవాడు బ్రహ్మ

**ఉపసంహారం - అధికరణనిర్ణయం**

1. విషయః - విషయం- జగత్కారణ బ్రహ్మ
2. సంశయః - సంశయం- అనుమాన వేద్యం వా న వా?
3. పూర్వపక్షః - పూర్వపక్షుల వాదన- బ్రహ్మ అనుమాన విషయః జగత్ కారణత్వాత్ ఘటవత్
4. ఉత్తరమ్ - అద్వైతసిద్ధాంతి జవాబు- బ్రహ్మ న అనుమాన విషయః శాస్త్రవిషయత్వాత్ ధర్మవత్
5. సంగతిః - సంబంధం-ఏకఫలకత్వ సంగతి- ఒకటే ఫలం - బ్రహ్మసిద్ధిః

**బ్రహ్మసిద్ధి రూప ఏక ఫలకత్వం సంగతిః**

**మూడు సూత్రములు కలిపి - జగతః కారణరూపే బ్రహ్మణః జ్ఞానార్థం వేదాంతవిచారః కర్తవ్యా**

***

# సూత్రము 4 - తత్తు సమన్వయాత్

నాలుగవసూత్రము - తత్తు సమన్వయాత్. నాలుగవ సూత్రం నాలుగవ అధికరణంలోకి వస్తుంది. ఒక అధికరణంలో ఒకటే సూత్రం ఉండవచ్చు, లేదా అనేక సూత్రములు ఉండవచ్చని చూశాము. కాని ఇక్కడ నాలుగవ అధికరణంలో కూడా ఒక్కటే సూత్రం ఉంది. అధికరణం పేరు ఆ అధికరణంలో ఉన్న సూత్రంనుంచి వస్తుందని కూడా చూశాము.

| సూత్రం | అధికరణం | |
|---|---|---|
| 1. అథాతో బ్రహ్మజిజ్ఞాసా | జిజ్ఞాసా అధికరణం | జిజ్ఞాసాధికరణమ్ |
| 2. జన్మాద్యస్య యతః | జన్మాది అధికరణం | జన్మాద్యధికరణమ్ |
| 3. శాస్త్రయోనిత్వాత్ | శాస్త్రయోని అధికరణం | శాస్త్రయోనిత్వాధికరణమ్ |
| 4. తత్తు సమన్వయాత్ | సమన్వయ అధికరణం | సమన్వయాధికరణమ్ |

అథాతో బ్రహ్మజిజ్ఞాసాలో సాధన చతుష్టయ సంపత్తి ఉన్న సాధకుడు, జ్ఞానం వల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల రాదు కాబట్టి, ఆ బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్ర విచారణ చేయాలి అని చూశాము.

జన్మాద్యస్య యతఃలో ప్రత్యక్ష ప్రపంచంయొక్క అభిన్న నిమిత్త ఉపాదాన కారణం బ్రహ్మ అని చూశాము. అంటే బ్రహ్మలక్షణం చూశాము.

శాస్త్రయోనిత్వాత్‌లో బ్రహ్మ శాస్త్రవిషయం అని చూశాము. అంటే బ్రహ్మకు ప్రమాణం చూశాము. బ్రహ్మను వేదాంతశాస్త్రంవల్లనే తెలుసుకోగలము, వేరే ఏ ప్రమాణంద్వారా తెలుసుకోలేమని తెలుసుకున్నాము. ఈ నేపథ్యంతో నాలుగవ సూత్రాన్ని చూద్దాము. ఈ సూత్రం ఒకటే నాలుగవ అధికరణంలో ఉందని చూశాము.

## సామాన్య విచారణ

ఈ సూత్రము చాలా ముఖ్యమైన సూత్రము. ఎందుకంటే బ్రహ్మసూత్రములలో మొదటి అధ్యాయము మొత్తం దీనిమీదే ఆధారపడివచ్చింది. మొదటి అధ్యాయంలో 134 సూత్రములు ఉంటే, అందులో ఇది నాలుగవ సూత్రము. తక్కిన 130 సూత్రములూ ఈ సూత్రంయొక్క వివరణే.

సూత్రం – సమన్వయ సూత్రం
అధికరణం – సమన్వయ అధికరణం
అధ్యాయం – సమన్వయ అధ్యాయం

దీన్నిబట్టే ఈ సూత్రం ఎంత ముఖ్యమైనదో అర్థమవుతుంది. రెండవసూత్రం మొత్తం బ్రహ్మసూత్రములకే పునాదిరాయిలాంటిది. **జన్మాద్యస్య యతః.** బ్రహ్మ నిర్వచనాన్ని ఇస్తుందని చూశాము. అంటే బ్రహ్మను జగత్కారణంగా అభివర్ణించింది. నాలుగు అధ్యాయాలకూ ఆధారం – రెండవసూత్రం. నాలుగవ సూత్రం మొదటి అధ్యాయానికి ఆధారం.

ఈ రెండు సూత్రములలో ఏది ఎక్కువ ముఖ్యమైన సూత్రం? జవాబు చాలా తేలిక. రెండవసూత్రం నాలుగు అధ్యాయాలకూ ఆధారమయితే, నాలుగవ సూత్రం మొదటి అధ్యాయానికి ఆధారం. అందువల్ల రెండవది ఇంకా ఎక్కువ కాని, నాలుగవ సూత్రం కూడా చాలా ముఖ్యమైన సూత్రం.

ఆ విధంగా మొదటి నాలుగు సూత్రముల్లో, ఈ రెండు సూత్రములు చాలా ముఖ్యమైనవి. అందువల్ల మన సాంప్రదాయంలో అన్ని సూత్రములూ నేర్చుకోలేనివారు మొదటి నాలుగు సూత్రములనే నేర్చుకున్నా చాలు అంటారు. మొదటి నాలుగు సూత్రములను **చతుస్సూత్రీ** అంటారు.

నాలుగవ సూత్రం సారాంశం ఏమిటి? ముందు మూడవసూత్రం సారాంశం ఒకసారి మళ్ళీ చూద్దాము. మూడవ సూత్రం – **శాస్త్రయోనిత్వాత్**. శాస్త్రయోనికి రెండు అర్థాలను చూశాము. శాస్త్రకారణత్వాత్, శాస్త్రవిషయత్వాత్. ఇప్పుడు ఈ నాలుగవ సూత్రాన్ని విశ్లేషించటానికి మనం రెండవ అర్థాన్ని తీసుకుంటాము.

రెండవ అర్థాన్ని శాస్త్రవిషయం అన్నాము. దీనికి బహువ్రీహి సమాసం వాడాము. అంటే శాస్త్రం ప్రమాణంగా కలది అన్నాము. అంటే శాస్త్రం చర్చించిన విషయం బ్రహ్మ అని అర్థం. ఇంకో విధంగా చెప్పాలంటే **వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యసారం బ్రహ్మ.**

## వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యసారం బ్రహ్మకు నిదర్శనం

శాస్త్రం అనేక అంశాలను చర్చిస్తుంది. అలాంటప్పుడు శాస్త్రం ముఖ్యంగా ఏ అంశం గురించి చర్చిస్తోందని ఎలా తెలుస్తుంది? కొన్ని గ్రంథాలలో సారం ఏమిటో తేలిగ్గా తెలుస్తుంది, కొన్నింటిలో తెలియదు. ఉదాహరణకు భగవద్గీతను తీసుకుంటే, భగవద్గీతలో అనేక అంశాలు చర్చించబడ్డాయి. అవి కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం. భక్తియోగం గురించి చెప్పేటప్పుడు కృష్ణపరమాత్మ భక్తి మాత్రమే చాలా ముఖ్యం అంటాడు. అయితే భగవద్గీతలో తాత్పర్యం ఏమిటి? ఒకటి తాత్పర్యం అంటే తక్కినవి సహకారీ విషయాలే అవుతాయి. ఎందుకంటే ప్రాథమిక విషయం ఒకటే ఉంటుంది.

పూజ్య స్వామీజీ హాస్యంగా చెప్పారు ఒకసారి. ఒక అబ్బాయి ఒక గ్రీటింగ్ కార్డు కొనటానికి వెళ్ళాడుట. అతను ప్రత్యేకమైన కార్డుకోసం వెతుకుతుంటే షాపు అతను కూడా సహాయం చేస్తున్నాడుట. చివరికి అతనికి ఒకటి నచ్చి, ఇది ఒక డజను కార్డులు ఇవ్వండి అన్నాడుట. అతనికి అంతగా నచ్చినది ఏమిటా అని షాపతను కుతూహలం కొద్దీ చూస్తే, 'నేను నిన్ను మాత్రమే ప్రేమిస్తున్నాను!' అని ఉందిట.

నేను నిన్ను మాత్రమే ప్రేమిస్తున్నాను అనే కార్డు ఒక్కరికి మాత్రమే పంపించగలము, డజను మందికి కాదు. అలాగే శాస్త్రంలో ప్రాథమిక అంశం లేదా తాత్పర్యం ఒక్కటే ఉండాలి. దీన్ని సెంట్రల్‌థీమ్ అంటారు ఇంగ్లీషులో. ఒకదానికన్నా ఎక్కువ అంశాలు ప్రాథమికంగా ఉంటే, దాన్ని దోషంగా పరిగణిస్తారు. దాన్ని మీమాంసశాస్త్రంలో **వాక్యభేదదోషః** అంటారు.

భగవద్గీతలో తాత్పర్యం ఏమిటని అనేక పండితులు విశ్లేషించి అనేక అంశాలను పేర్కొన్నారు. కొంతమంది కర్మ ప్రాథమిక విషయం; భక్తి, జ్ఞానం సహకారీ విషయాలు అంటే, మరికొంతమంది భక్తి ప్రాథమిక విషయం అంటే, ఇంకా కొంతమంది జ్ఞానం ప్రాథమిక విషయం అన్నారు.

ఇలా రకరకాల వ్యాఖ్యానాలు వస్తే, ఎలా సమస్య పరిష్కారం అవుతుంది? ఆ గ్రంథకర్త అందుబాటులో ఉంటేనో, జీవించి ఉంటేనో, వెళ్ళి ఆయన్ని స్వయంగా అడగవచ్చు. అలా కృష్ణపరమాత్మ ఎదురుగావుంటే, 'ఓ కృష్ణా, నువ్వు ఏం చెప్పదలుచుకున్నావు? అర్జునునికి బోధ చేసినప్పుడు నీ మనస్సులో ఏ విషయం ప్రధానంగా ఉంది?' అని అడగవచ్చు.

ఒక్కోసారి ఇలా భిన్న అభిప్రాయాలు వస్తాయనిపించినప్పుడు రచయితే తన గ్రంథంమీద భాష్యం కూడా రాస్తాడు. సిద్ధాంత ముక్తావళి, కారికావళి అని రెండు తర్కశాస్త్రగ్రంథాలు ఉన్నాయి. వాటిలో కొన్ని శ్లోకాలు సరిగ్గా అర్థంకావు. వాటికి సాక్షాత్తూ ఆ గ్రంథకర్తే భాష్యం రాశాడు. అలాంటప్పుడు మనకే సమస్యా లేదు.

కాని రచయిత అందుబాటులో లేకపోతేనూ, అతని భాష్యం లేకపోతేనూ, ఆ గ్రంథంలోని ప్రాథమిక విషయాన్ని ఎలా విశ్లేషిస్తాము? శాస్త్రానికి రచయిత మనకు అందుబాటులో లేడు. శాస్త్రయోనిత్వాత్ – భగవంతుడే శాస్త్రకర్త. భగవంతుణ్ణి అడగలేము కాబట్టి ఇంకోమార్గంద్వారా తాత్పర్యనిర్ణయం చెయ్యాలి. ఈ సమస్యను మన ప్రాచీన ఆచార్యులు పరిశీలించి, ఒక పరిష్కారమార్గం చూపించారు. ఏమిటది? **సమన్వయం**.

సమన్వయం చాలా ముఖ్యమైన నియమం. అది ఒక సాంకేతిక పదం. దాన్ని వివరంగా పదవిశ్లేషణ చేసినప్పుడు చూద్దాము. ప్రస్తుతానికి దాని అర్థం **తాత్పర్య విషయత్వమ్** అని తెలుసుకుంటే చాలు. విషయం అంటే సబ్జెక్టు మాటర్. తాత్పర్యం అంటే కంసిస్టెన్సీ. ఏ సబ్జెక్టు మాటర్ అయితే ఆ గ్రంథంలో కంసిస్టెన్ట్‌గా ఉందో, అది సబ్జెక్టు మాటర్ అవుతుంది. ఏ విషయం తాత్పర్యంగా ఉందో ఎలా తెలుస్తుంది? దానికి మన ఆచార్యులు ఒక పరీక్ష పెట్టారు. ఏ విషయం అయితే ఈ పరీక్షను తట్టుకుని నిలబడుతుందో, దాన్ని తాత్పర్యం అంటారు. ఈ పరీక్షను **షడ్లింగాని** అంటారు. షడ్లింగాని అంటే ఆరు నియమాలు. బ్రహ్మ ఈ ఆరు ముఖ్యమైన నియమాలనూ పాటిస్తుంది కాబట్టి **బ్రహ్మ తాత్పర్యవిషయం.** ఈ షడ్లింగవిచారణ పదవిశ్లేషణలో చూద్దాము. ఇప్పుడు ఈ సూత్రంయొక్క సామాన్య అర్థం చూద్దాము.

బ్రహ్మ తాత్పర్య విషయత్వాన్ని పాటిస్తుంది కాబట్టి, వేదాంతశాస్త్రంయొక్క ప్రాథమిక విషయం బ్రహ్మ. తాత్పర్య విషయత్వాన్ని సమన్వయం అని కూడా అంటారు.

**అనుమానవాక్యం** – ఇది న్యాయప్రస్థానం కాబట్టి దీనికొక అనుమానవాక్యం ఉండాలి.

**బ్రహ్మ వేదాంతశాస్త్రవిషయః సమన్వయాత్ ధర్మవత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రానికి చెందిన జ్ఞానభాగంయొక్క విషయవస్తువు అని సమన్వయంవల్ల చెప్పగలము. దానికి దృష్టాంతం ధర్మం.

**విషయవాక్యం** – బ్రహ్మసూత్రములను వేదాంతసూత్రములు అని కూడా అంటారు కాబట్టి, ప్రతి సూత్రానికి ఏదైనా ఉపనిషత్తులోంచి ఒక విషయవాక్యం ఉండాలి.

ఇక్కడ ఒక్క విషయవాక్యాన్ని చెప్పలేము. అన్ని వేదాంతవాక్యాలూ విషయవాక్యాలే. ఎందుకంటే మనం మొత్తం వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్య నిర్ణయం చేస్తున్నాము కాబట్టి. ఉదాహరణకు కొన్ని చూద్దాము.

| | | |
|---|---|---|
| **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్** | **– ఛాందోగ్యమ్** | **– సామవేదమ్** |
| **అయమాత్మా బ్రహ్మ సర్వాను భూః** | **– బృహదారణ్యకమ్** | **– యజుర్వేదమ్** |
| **బ్రహ్మైవేదమమృతం పురస్తాత్** | **– ముండకమ్** | **– అథర్వణవేదమ్** |
| **ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్** | **– ఐతరేయమ్** | **– ఋగ్వేదమ్** |

## పదవిశ్లేషణ

నాలుగవ సూత్రం – తత్తు సమన్వయాత్. ఇందులో మూడు పదాలు ఉన్నాయి. అవి తత్ + తు + సమన్వయాత్.

**తత్** – తత్ అంటే అది. అది ఒక సర్వనామం. నామవాచకాన్ని సూచిస్తుంది. ఏ నామవాచకాన్ని? దానిముందు చెప్పబడిన నామవాచకాన్ని. ఇక్కడ ముందు మూడు సూత్రములలో చర్చించబడిన నామవాచకాన్ని తీసుకురావాలి. ముందు మూడు సూత్రములూ బ్రహ్మ గురించి చర్చించాయి అని చూశాము.

| సూత్రం సంఖ్య | సూత్రం | విశ్లేషణ |
|---|---|---|
| 1. | అథాతో బ్రహ్మజిజ్ఞాసా | బ్రహ్మ విచారణ చేయాలి |
| 2. | జన్మాద్యస్య యతః | బ్రహ్మ జగత్కారణం |
| 3. | శాస్త్రయోనిత్వాత్ | బ్రహ్మ వేదకర్తా, బ్రహ్మ వేదవిషయం |

ఇది కాక బ్రహ్మ గురించిన విశేషణాలు బ్రహ్మ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అని చూశాము.

ఇప్పుడు వీటన్నిటినీ కలిపి చూస్తే – జగత్కారణం, వేదకర్త, వేదవిషయం, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన బ్రహ్మ గురించిన విచారణ చేయాలి. శాస్త్రయోనికి వేదకర్తా, వేదవిషయం అని తీసుకున్నాము. ఇక్కడ వేదవిషయంగా తీసుకుంటాము.

**తత్ (బ్రహ్మ) = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్యవిషయం**

ఇది సూత్రంలో లేదు. మనం ముందు సూత్రంనుంచి కలుపుకుంటాము. తత్ అంటే తత్ శాస్త్రయోని అంటాము. సూత్రసాహిత్యంలో దీన్ని **అనువృత్తి** అంటారు . ఇలా ముందు సూత్రంనుంచి కలుపుకోవటంవల్ల కొన్ని పదాలను తగ్గించవచ్చు.

**రాముడు ఆలయానికి వెళ్ళాడు, కృష్ణుడు కూడా**

ఈ వాక్యం అసంపూర్ణంగా ఉంది. మొదటివాక్యంలో రాముడు ఆలయానికి వెళ్ళాడు అన్నాము; రెండవ వాక్యంలో కృష్ణుడు కూడా అని చెప్పి వదిలేశాము. మొదటి వాక్యంనుంచి ఆలయానికి వెళ్ళాడు పదాలు కలుపుకుని ఈ వాక్యాన్ని పూరించాలి. అంటే రాముడు ఆలయానికి వెళ్ళాడు, కృష్ణుడు కూడా ఆలయానికి వెళ్ళాడు. దీన్ని అనువృత్తి అంటారని చూశాము. దానివల్ల పదాలు తగ్గుతాయి. ఇప్పుడు ఈ వివరణతో మొదటి మూడు సూత్రములనూ మళ్ళీ చూద్దాము.

1. అథాతో బ్రహ్మజిజ్ఞాసా
2. జన్మాద్యస్య యతః (తత్ బ్రహ్మ)
3. శాస్త్రయోనిత్వాత్ (బ్రహ్మ)
4. తత్ (బ్రహ్మ శాస్త్రయోని)

ఒక్క మొదటిసూత్రంలోనే బ్రహ్మ పదం వచ్చింది. బ్రహ్మ విచారణ చెయ్యాలని అర్థం. రెండవసూత్రంలో తత్ బ్రహ్మ కలుపుకున్నాము. జగత్కారణం బ్రహ్మ అన్నాము. అంటే ఎవరైతే జగత్కారణమో అతను బ్రహ్మ అన్నాము. మూడవ సూత్రంలో ఆ బ్రహ్మ శాస్త్రకర్త, శాస్త్రవిషయం అన్నాము. ఇప్పుడు ఈ సూత్రంలో ఈ బ్రహ్మకు, మూడవసూత్రంలోని శాస్త్రయోని కలుపుకున్నాము. అప్పుడు తత్ బ్రహ్మ శాస్త్రయోని అని వచ్చింది.

తత్ – తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్య విషయం.

**తు** – అసలైతే భాష్యంయొక్క నిర్వచనం ప్రకారం **తు** పదవిశ్లేషణ చేయాలి ఇప్పుడు. కాని మన వీలుకోసం, ఈ పదాన్ని మరింత బాగా అర్థం చేసుకోవటం కోసం ప్రస్తుతానికి ఆ పదవిశ్లేషణను వాయిదా వేద్దాము.

**సమన్వయాత్** – బ్రహ్మ వేదాంతశాస్త్రంలో ప్రధానఅంశంగా, ముఖ్యమైన అంశంగా, తాత్పర్యవిషయంగా వస్తున్నది కాబట్టి. ఎలా చెప్పగలము? షడ్లింగవిచారణద్వారా చెప్పగలము అని చూశాము. మొదటి అధ్యాయంలో 134 సూత్రములు ఉన్నాయి. తత్తు సమన్వయాత్ నాలుగవ సూత్రం. 5 నుంచి 134 వరకూ వ్యాసాచార్యులవారి పని సమన్వయం ఉందని నిరూపించటమే. అంటే వేదాంతశాస్త్రంయొక్క ప్రధానవిషయం బ్రహ్మ తప్ప వేరే ఏదీ కాదని నిరూపించబోతున్నాయి రాబోయే సూత్రములు.

కాని అన్ని సూత్రముల దాకా ఆగే ఓపిక మనకు ఉండదు కాబట్టి, శంకరాచార్యుల వారు, ఉపభాష్యకారులు షడ్లింగవిచారణ చేసి, బ్రహ్మ వేదాంతశాస్త్రానికి తాత్పర్యవిషయం అని నిరూపించారు. వారి భాష్యాన్ని ఆధారంగా చేసుకుని, మనం ఆ విశ్లేషణను చూద్దాము.

## షడ్లింగవిచారణ

లింగం అంటే మనకు తెలిసిన శివలింగమో, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటో కాదు. ఇది ఒక సాంకేతిక పదం. లింగం అంటే నిదర్శనం, ఆధారం, సూచన, సంకేతం.

**ఉపక్రమోఽ పసంహారౌ అభ్యాసోఽ పూర్వతా ఫలమ్।**
**అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్యనిర్ణయే॥**

ఒక గ్రంథం దేని గురించి వివరంగా చెబుతుందో నిర్ణయించటానికి, ఆరు అంశాలను తీసుకుని విశ్లేషిస్తారు. ఇది పూర్వమీమాంసా శాస్త్రంలో ఉన్నా, ఉత్తర మీమాంసాశాస్త్రంలో కూడా ఉపయోగిస్తారు. అవి –

ఎ) **ఉపక్రమ ఉపసంహారం** – ఏ విషయంతో మొదలయిందో, ఆ విషయంతో ముగియాలి.

బి) **అభ్యాసః** – ఒక విషయాన్ని పదేపదే చెప్పాలి.

సి) **అపూర్వతా** – ఆ విషయం కొత్త విషయమై ఉండాలి.

డి) **ఫలమ్** – ఆ విషయాన్ని తెలుసుకుంటే కలిగే ఫలం.

ఇ) **అర్థవాదః** – ఆ విషయాన్ని స్తుతించాలి.

ఎఫ్) **ఉపపత్తిః** – తర్కం ఉపయోగించాలి.

మన సాంప్రదాయంలో ఈ షడ్లింగవిచారణ చెయ్యటానికి, అందరూ ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయాన్ని నమూనాగా తీసుకుంటారు. ఆ అధ్యాయాన్ని తత్త్వమసి ప్రకరణం అంటారు. ఆ అధ్యాయాన్ని ఆధారంగా చేసుకుని, ఈ ఆరు అంశాలను చర్చిస్తారు. వాటిని వివరంగా, ఛాందోగ్యోపనిషత్తు పరంగా చూద్దాము.

ఎ) **ఉపక్రమ ఉపసంహారం** – ఏ విషయంతో మొదలయిందో, ఆ విషయంతో ముగియాలి. ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయం బ్రహ్మతో మొదలై, బ్రహ్మతో ముగుస్తుంది.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్।** (మొదట)

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో –** (చివర)

దీన్నిబట్టి బ్రహ్మ ఆ అధ్యాయంయొక్క తాత్పర్యం అని అర్థమయింది. రేడియో వార్తలు లేదా దూరదర్శన్ వార్తలు దీనికి గొప్ప ఉదాహరణ. ముందు సంక్షిప్తంగా ముఖ్యాంశాలు చెప్పి, వాటిని విస్తారంగా చెప్పి, మళ్ళీ వార్తలు ముగించేముందు ముఖ్యాంశాలు మరోసారి అంటారు.

బి) **అభ్యాస** – ఒక విషయాన్ని పదేపదే చెప్పటం. ఛాందోగ్యోపనిషత్తులో ఇందాక ఉపసంహారంలో చెప్పిన వాక్యం తొమ్మిదిసార్లు వస్తుంది.

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

ఈ వాక్యం అధ్యాయం మొత్తంలో తొమ్మిదిసార్లు వచ్చిందంటే ఏమిటి అర్థం? ఈ విషయం చాలా ముఖ్యమైన విషయమని. తత్త్వమసి అనే మహావాక్యాన్ని పదేపదే చెబుతున్నది. అయినా కొందరు తత్త్వమసి వాక్యాన్ని పెద్దగా పట్టించుకోనవసరం లేదు అంటారు. అన్నిసార్లు చెప్పినా, దానికి ప్రాముఖ్యత లేదు అనేవారితో వాదించటం అనవసరం. వారిమీద జాలితలచి వదిలేయాలి.

సి) **అపూర్వతా** – ఆ విషయం కొత్త విషయమై ఉండాలి. వేదాంతశాస్త్రం కొత్త విషయాన్నే చెబుతున్నది. శాస్త్రంలో కొత్త విషయాన్ని ఎలా నిర్వచిస్తారు?

**ప్రమాణాంతర అవేద్యమ్ అపూర్వత్వమ్**

అవేద్యం అంటే తెలుసుకోలేనిది. ప్రమాణాంతర అంటే తక్కిన ప్రమాణాల ద్వారా తెలుసుకోలేనిది. తక్కిన ప్రమాణాలు ఐదు. అవి – ప్రత్యక్షప్రమాణం,

అనుమానం, అర్థాపత్తి, ఉపమానం, అనుపలబ్ధి. వీటిలో ఏ ప్రమాణానికీ అందదు బ్రహ్మ.

అంటే బ్రహ్మ గురించి శాస్త్రంద్వారానే తెలుసుకోవాలి. అది కూడా వేదాంత శాస్త్రంద్వారానే తెలుసుకోవాలి. వేదపూర్వభాగం కూడా కర్మ గురించి చెబుతుంది కాని బ్రహ్మ గురించి చెప్పదు. కర్మకాండ అనేక యజ్ఞాలు, పుణ్యం, పాపం, పరలోకాల గురించి చెబుతుంది కాని బ్రహ్మ గురించి చెప్పదు. బ్రహ్మ తక్కిన ప్రమాణాలకు అందదు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1–3

అక్కడికి కళ్ళు వెళ్ళవు, వాక్కు వెళ్ళదు, మనస్సు కూడా వెళ్ళదు అంటే అర్థం ప్రత్యక్ష ప్రమాణానికి, తక్కిన ప్రమాణాలకూ కూడా అందదు అని. అంటే వేరే దేనిలోనూ చెప్పని కొత్త విషయాన్ని వివరిస్తోంది. ఆ విధంగా బ్రహ్మ అపూర్వ విషయం. వేదాంతం మనకు ముందే తెలిసిన విషయాన్ని కొత్తగా చెప్పనవసరం లేదు. ఆకలివేస్తే ఆహారం తీసుకోండి అని శాస్త్రం మనకు చెప్పనవసరం లేదు. అది మనకే బాగా తెలుసు. అందువల్ల బ్రహ్మ కొత్తవిషయం.

బ్రహ్మ కొత్తవిషయం అని ఛాందోగ్యోపనిషత్తులోనే, ఈ అధ్యాయంలోనే గురువు నిరూపిస్తాడు. గురువు దాన్ని లవణ దృష్టాంతం (13వ ఖండం)లో నిరూపిస్తాడు. గురువు ఉద్దాలకుడు, శిష్యుడు శ్వేతకేతుణ్ణి ముందురోజు రాత్రి ఉప్పు కణికను నీళ్ళలో వేసి, మర్నాడు పొద్దున్న తన దగ్గరకు తీసుకురమ్మన్నాడు. అలాగే చేశాడు శ్వేతకేతు.

అప్పుడా ఉప్పుకణికను తీసివేయమన్నాడు. అది కంటికి కనపడలేదు; చేతితో తడిమిచూశాడు, స్పర్శకు అందలేదు; అంటే చూపుకూ, స్పర్శకూ అందలేదు. కాని మూడుచోట్లనుంచి తాగి చూడమంటే అన్నిచోట్లలోనూ, నీరు ఉప్పుగా ఉంది. ఒక ప్రమాణానికి అందనంత మాత్రాన ఆ వస్తువు లేదనకూడదు.

పై ఉదాహరణ తీసుకుంటే జగత్తు నీరు, ఉప్పు బ్రహ్మ. నీరంతా ఉప్పు ఉన్నట్టు, జగత్తనే నీరు అంతటా బ్రహ్మ అనే ఉప్పు కరిగి సర్వవ్యాపకమైంది. ఉదాహరణను ఉదాహరణగానే తీసుకోవాలి. బ్రహ్మ ఉప్పా అనకూడదు. ఆ బ్రహ్మ ఎక్కడ ఉన్నాడు?

**అత్ర వావ కిల సత్సౌమ్య న నిభాలయసే౽త్రైవ కిలేతి** – ఛాందోగ్యం 6.13.2

శుద్ధబ్రహ్మ, ఉనికి రూపంలో సృష్టి అంతటా ఉంది. కాని న నిభాలయసే. నువ్వు తెలుసుకోలేకపోతున్నావు. కనబడని ఉప్పు, కనబడే నీరంతటా ఉన్నట్టే, కనబడని బ్రహ్మ, కనపడే సృష్టి అంతా ఉంది. ఉనికిని తెలిపే శాస్త్రప్రమాణాన్ని కాక, వేరే ప్రమాణాలు వాడుతున్నావు. పంచప్రమాణాలు అనాత్మను మాత్రమే తెలుపుతాయి. అంటే బ్రహ్మ ప్రత్యక్ష అగోచరం. అందువల్ల ప్రమాణాంతర అగమ్యం, అందువల్ల అపూర్వం.

దీన్నించి మనం కొన్ని ఉపసిద్ధాంతాలను ఏర్పరచుకుంటున్నాము. ఏమిటవి? బ్రహ్మ వేదాంతశాస్త్రంయొక్క విషయవస్తువు. సంస్కృతంలో విషయవస్తువును విషయః, ప్రమేయః, ప్రతిపాద్యః అంటారు. అంతేకాదు, బ్రహ్మ అపూర్వ విషయం అని కూడా అన్నాము. అంటే బ్రహ్మ వేరే ప్రమాణాలకు అందదు, వేదాంతానికి మాత్రమే అందుతుందని అర్థం. అంటే మూడు దశల్లో చెబుతాము –

ఎ) బ్రహ్మ వేదాంతంయొక్క విషయం

బి) బ్రహ్మ అపూర్వ విషయం

సి) బ్రహ్మను శబ్ద ప్రమాణంద్వారానే తెలుకోగలము కాని తక్కిన ప్రమాణాల ద్వారా తెలుసుకోలేము.

బ్రహ్మ వేదాంతశాస్త్రంయొక్క అపూర్వ విషయం – ఈ వాక్యాన్ని తిరగేసి చెపితే, వేదాంతశాస్త్రం బ్రహ్మకు అపూర్వ ప్రమాణం. అంటే వేదాంతంయొక్క విషయం బ్రహ్మ; బ్రహ్మయొక్క ప్రమాణం వేదాంతం. ఆ విధంగా వేదాంత ప్రమాణం, బ్రహ్మ ప్రమేయాలకు అవినాభావ సంబంధం ఉంది. రెండూ విడరాని, విడిపోని జంట.

బ్రహ్మ అపూర్వ ప్రమేయం – తత్తు సమన్వయాత్

శాస్త్రం అపూర్వ ప్రమాణం – శాస్త్రయోనిత్వాత్

దీనిద్వారా నాలుగవ సూత్రం మూడవ సూత్రాన్ని దృఢపరుస్తున్నదని చెప్పవచ్చు. మూడవసూత్రంలో బ్రహ్మకు ప్రమాణం శాస్త్రం అని చూశాము. ఇప్పుడు ఈ నాలుగవ సూత్రంలో బ్రహ్మ మాత్రమే శాస్త్రంలో చర్చించబడిన విషయమని చూస్తున్నాము. ఆ విధంగా అపూర్వతా లక్షణం సరిపోయింది.

డి) **ఫలం** – ఆ విషయాన్ని తెలుసుకుంటే కలిగే ఫలం. దేనికైతే ఫలం చెప్పబడివుంటుందో, అదే ప్రధాన అంశం అవుతుంది. తక్కినవన్నీ సహకారీ అంశాలు అవుతాయి.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి మోక్షం పొందుతాడు. అంటే బ్రహ్మజ్ఞానానికి ప్రాముఖ్యత ఇవ్వబడింది. అందువల్ల వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ. ఛాందోగ్యోపనిషత్తులో ఇచ్చిన ఫలం –

**తస్య తావవేద చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే**

బ్రహ్మజ్ఞానికి జీవన్ముక్తి కూడా కలుగుతుందని ఈ వాక్యం అర్థం. అంటే బ్రహ్మజ్ఞానికి జీవన్ముక్తి ఫలం, విదేహముక్తి ఫలం కూడా కలుగుతుంది. అందువల్ల కూడా బ్రహ్మ తాత్పర్య విషయం. ఎక్కడా అన్నమయకోశజ్ఞానం కలిగిన వ్యక్తికి అన్నం సమృద్ధిగా దొరుతుందని చెప్పలేదు. శాస్త్రంలో అనేక విషయాలను చర్చించినా కూడా వాటిలో దేనికీ ఫలం చెప్పలేదు. అందువల్ల ఫలం కూడా బ్రహ్మలింగం.

ఇ) **అర్థవాదం** – ఆ విషయాన్ని స్తుతించాలి. ఉపనిషత్తులు అద్వైతజ్ఞానాన్ని ఈ విధంగా స్తుతిస్తాయి –

**ఏకేన విజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి॥**

బ్రహ్మజ్ఞాని సర్వజ్ఞుడు అవుతాడు. సర్వజ్ఞుడు పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. సర్వజ్ఞుడు అవుతాడు అనగానే, అయితే అతనికి ఫ్రెంచ్ భాష వచ్చేస్తుందా, జర్మన్ భాష వచ్చేస్తుందా అని అడగకూడదు. సర్వజ్ఞానం అంటే సర్వ ఆత్మజ్ఞానం. అన్నింటి అధిష్ఠానం గురించి తెలుసుకుంటే, అన్నింటి గురించి తెలుసుకున్నట్టే.

**ఏక కారణ విజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి॥**

బ్రహ్మజ్ఞానిని సర్వజ్ఞుడుగా స్తుతించటంవల్ల, ఛాందోగ్యోపనిషత్తు పరోక్షంగా బ్రహ్మను స్తుతిస్తున్నది. ఎందుకంటే బ్రహ్మజ్ఞానిని స్తుతిస్తే, ఆ స్తుతి బ్రహ్మకే చెందుతుంది.

ఇక్కడ బ్రహ్మజ్ఞానాన్ని స్తుతిస్తే, కఠోపనిషత్తు తక్కిన జ్ఞానాలను నిందిస్తుంది.

**మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి – కఠ** 2.1.10

ఎవరైతే ద్వైతభావనలో ఉంటారో, వారు మృత్యువునుంచి మృత్యువును పొందుతాడు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు. బ్రహ్మజ్ఞానం పొందకుండా మరణించిన వ్యక్తి దురదృష్టవంతుడు.

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తే బ్రాహ్మణుడు అంటాయి ఉపనిషత్తులు. తక్కినవారు బ్రాహ్మణులు కారని కూడా అంటుంది.

**స ఏవ బ్రాహ్మణః** – బృహదారణ్యకమ్

ఆ విధంగా ఉపనిషత్తులు బ్రహ్మజ్ఞానాన్ని స్తుతిస్తాయి, తక్కిన జ్ఞానాలను నిందిస్తాయి. రెండూ – బ్రహ్మస్తుతి, అన్యనింద అర్థవాదంలోకి వస్తాయి.

ఎఫ్) **ఉపపత్తి** – తర్కం ఉపయోగించాలి. ఉపనిషత్తు చెప్పేది తర్కానికి వ్యతిరేకంగా ఉండదు. అది గుడ్డినమ్మకం అసలేకాదు, ఆలోచించే బుద్ధికి అందుతుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

అంటుంది. ఇది ఉపనిషత్తు గుడ్డిగా వేసిన వాక్యం కాదు, దీనిని తార్కికంగా నిరూపిస్తుంది కూడా. దాన్ని అధ్యారోప అపవాదం అంటారు. దాన్ని నాలుగు దశల్లో చూపిస్తుంది.

ఎ) జగత్తు ఒక కార్యం
బి) జగత్తు అనే కార్యానికి, బ్రహ్మ కారణం.
ఇది అధ్యారోపం
సి) కార్యం అంతటా కారణం ఉంటుంది, అంటే కార్యానికి విడిగా ఉనికి లేదు. అంటే జగత్తుకు విడిగా ఉనికి లేదు.
డి) కార్యం లేకపోతే కారణానికి కారణత్వహోదా ఉండదు కాని కారణం ఉంటుంది. అంటే జగత్తు ఉన్నా లేకపోయినా బ్రహ్మ ఉంటుంది.

ఇది అపవాదం. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అనీ, మూడు కాలాల్లోనూ ఉండేదాన్ని సత్యం అనీ అంటారు. ఆ విధంగా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా.

దీనికి అనుమానవాక్యం –

**బ్రహ్మ సత్యం కారణత్వాత్। జగన్మిథ్యా కార్యత్వాత్॥**

ఇది ఇంకా బాగా అర్థం చేసుకోవటానికి ఛాందోగ్యం ఇంకో ఉదాహరణ కూడా ఇస్తుంది.

**వాచాఽఽరంభణం వికారోనామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** – 6.1.4

కుండ–మట్టి తీసుకుంటే కుండ – నామ, రూపాలు మాత్రమే. కుండకు మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు. కుండ ఉన్నా లేకపోయినా మట్టి ఉంటుంది. మృత్తికేత్యేవ సత్యమ్ అంది ఉపనిషత్తు. అంటే మట్టి మాత్రమే సత్యం. మట్టి మాత్రమే సత్యం అంటే కుండ సత్యం కాదని చెబుతున్నది.

ఇద్దరు వ్యక్తులు ఒకచోట ఉంటే, మనం ఇద్దరిలో ఒకరిని చూపించి, 'ఇతను చాలా తెలివైనవాడు,' అంటేనే కొంతమేరకు రెండవవ్యక్తి కాదు అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. అలాంటిది, 'ఇతను మాత్రమే చాలా తెలివైనవాడు,' అని చెపితే, రెండవవ్యక్తికి అసలు తెలివిలేదని చెప్పినట్టు అవుతుంది.

అలాగే కుండకు నామమాత్ర ఉనికి ఉంది, మట్టి మాత్రమే సత్యం అని వాక్యంలో నొక్కిచెప్పింది. 'ఏవ' పదానికి చాలా విలువ ఉంటుంది. కారణం మాత్రమే సత్యం, కార్యం మిథ్య అని ఈ వాక్యం ద్వారా నిరూపిస్తుంది. కారణ సత్యత్వం, కార్య మిథ్యాత్వం చూపిస్తున్నది కాబట్టి దీన్ని ఉపపత్తి అంటారు.

ఈ విధంగా ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయాన్ని ప్రమాణంగా తీసుకుని, ఆరు లింగాలూ వేదాంతంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ అని నిరూపిస్తాయి అని చూపిస్తాము.

**బ్రహ్మ శాస్త్రప్రమేయం సమన్వయాత్**

సమన్వయం అంటే తాత్పర్యం లేదా ప్రధానఅంశం అని చూశాము. బ్రహ్మ శాస్త్రంయొక్క విషయం, సమన్వయంవల్ల . ఈ వాక్యాన్ని తిరగేసి చెపితే, వేదాంతం మాత్రమే బ్రహ్మకు ప్రమాణం అని అర్థం వస్తుంది.

**తు** – ఈ పదాన్ని వదిలి సమన్వయాత్ పదానికి వెళ్ళిపోయాము. 'తు' పదం సంస్కృతంలోని 'తు' పదం. ఉన్నది ఒక్కటే అక్షరమైనా ఇది చాలా ముఖ్యమైన

పదం. నిజానికి ఈ ఏకాక్షర పదానికే శంకరులవారు చాలా లోతుగా విశ్లేషణ చేశారు. 'తు' పదాన్ని అవధారణకోసం వాడారు అంటారు. అవధారణం అంటే నొక్కిచెప్పటానికి. దాని అర్థం – **మాత్రమే.**

ఇంతకు ముందు సమన్వయం అర్థం చూసినప్పుడు ఏమన్నాము? **బ్రహ్మ వేదాంతంయొక్క తాత్పర్యవిషయం** అన్నాము. ఇప్పుడు ఈ **తు** కలిపితే **బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం** అని అర్థం వస్తుంది. బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం అని చెప్పటంద్వారా కర్మ, ఉపాసనలు ఏవీ కావు అని నొక్కి వక్కాణించినట్టు అవుతుంది.

'రాముడు మాత్రమే ఆలయానికి వెళ్ళాడు,' అంటే రాముడు ఒక్కడే వెళ్ళాడు, వేరే ఎవరూ వెళ్ళలేదు అని అర్థం వస్తుంది. ఈ మాత్రమేని ఆలయం పక్కన వేస్తే అర్థం మారిపోతుంది. 'రాముడు ఆలయానికి మాత్రమే వెళ్ళాడు,' అంటే రాముడు ఒక్క ఆలయానికే వెళ్ళాడు, ఇంక వేరే ఎక్కడికీ వెళ్ళలేదని అర్థం వస్తుంది. అలా బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం అంటే కర్మ, ఉపాసన ఏవీకావు అని అర్థం. వేరేవాటిని ఖండించటాన్ని వ్యావృత్తి అంటారు. ప్రతి అవధారణకూ ఒక వ్యావృత్తి ఉంటుంది.

**తు = తుశబ్దః పూర్వపక్ష వ్యావృత్త్యర్థః**

వేదాంతంలో తు అంటే బ్రహ్మ మాత్రమే అని చెప్పటంవల్ల తక్కినవారి వాదనలేవీ కావు అని ఖండించటం జరుగుతుంది. అంటే వేదాంతంయొక్క విషయవస్తువు బ్రహ్మ కాదు, వేరే అంశం అని వాదించేవారి అందరి దర్శనాలనూ ఖండిస్తున్నారు.

తత్తు సమన్వయాత్ – పూర్తి అర్థం

**బ్రహ్మ వేదాంతశాస్త్రవిషయః సమన్వయాత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రానికి చెందిన జ్ఞానభాగంయొక్క విషయవస్తువు
అని సమన్వయంవల్ల చెప్పగలము.

తత్ – తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్య విషయం.

**తు = తుశబ్దః పూర్వపక్ష వ్యావృత్త్యర్థః**

బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం కర్మ, ఉపాసనలు ఏవీకావు.

## పూర్వపక్షుల వాదనలు

పన్నెండు దర్శనాలు ఉన్నాయనీ, వాటిలో ఆరు నాస్తికదర్శనాలు, ఆరు ఆస్తికదర్శనాలు ఉన్నాయనీ చూశాము. నాస్తికులు అంటే వేదాన్ని నమ్మనివారు. వేదాన్నే నమ్మనివారికి వేదంలో బ్రహ్మ గురించి వచ్చిందా, కర్మ, ఉపాసనల గురించి వచ్చిందా అనేది అసందర్భం. అలాంటివారికి ఈ షడ్లింగవిచారణ కూడా అప్రస్తుతం. అందువల్ల ప్రస్తుతం వారి జోలికి పోవటంలేదు మనం. అంటే మిగిలింది ఆరు ఆస్తికదర్శనాలు.

ఆస్తికదర్శనం అంటే వేదప్రమాణాన్ని నమ్మిన దర్శనం. ఆస్తికులు అంటే దైవాన్ని నమ్మేవారు అనుకుంటారు; కాని ఆస్తికులు అంటే వేదాన్ని నమ్మేవారు. ఆ ఆరు ఆస్తికదర్శనాలు ఇవి – సాంఖ్యదర్శనం, యోగదర్శనం, న్యాయదర్శనం, వైశేషికదర్శనం, పూర్వమీమాంసక దర్శనం, ఉత్తరమీమాంసదర్శనం. ఉత్తరమీమాంస దర్శనాన్నే వేదాంత దర్శనం, ఇంకా మాట్లాడితే అద్వైతవేదాంత దర్శనం అంటారు. మనం అద్వైతవేదాంత దర్శనంలోకి వస్తాము.

అయితే ఎంతమంది పూర్వపక్షులు ఉన్నట్టు? ఆరుగురు అనకూడదు. ఆరూ పూర్వపక్షులే అయితే, వేదాంత దర్శనం ఉండదు. వేదాంత దర్శనం చేసే అతనిని సిద్ధాంతి అని కూడా అంటారు. అందువల్ల ఐదు పూర్వపక్ష దర్శనాలు ఉన్నాయి. కాని ఈ ఐదు పూర్వపక్ష దర్శనాలను మనం మూడింటికి తగ్గిస్తాము. సాంఖ్య, యోగుల దర్శనాలు ఇంచుమించుగా ఒకటేలా ఉంటాయి. కపిలముని సాంఖ్య దార్శనికుడు . పతంజలి యోగదార్శనికుడు . కాని వాటి మధ్య చాలా పోలికలు ఉన్నాయి. రెండూ ఒకటే అయితే వేర్వేరు దర్శనాలు ఎందుకు వచ్చాయంటే రెండింటి మధ్యా కొన్ని సూక్ష్మమైన భేదాలు ఉన్నాయి. యోగదర్శనం అష్టాంగయోగానికి ప్రాముఖ్యతనిస్తే, సాంఖ్యదర్శనం థియరీకి ప్రాముఖ్యతనిస్తుంది.

రెండింటికీ పోలికలు చాలా ఉన్నాయి కాబట్టి మనం రెండూ కలిపి తీసుకుంటాము. వాటి మధ్యలో చిన్న గీత పెట్టి **సాంఖ్య–యోగదర్శనం** అంటాము. మొదటి అధ్యాయంలో 134 సూత్రములు ఉంటే, 5–133 సూత్రములలో సాంఖ్యదర్శనాన్ని ఖండించుకుంటూ వస్తారు వ్యాసాచార్యులవారు. చివరి సూత్రం మాత్రం యోగదర్శనాన్ని ఖండిస్తుంది.

**ఏతేన సర్వే వ్యాఖ్యాతాః వ్యాఖ్యాతాః** - 134

ఎందుకు? రెండు దర్శనాల్లోనూ ఒకే అంశాలు ఉన్నాయి కాబట్టి.

అలాగే న్యాయదర్శనానికి, వైశేషిక దర్శనానికి మధ్య కూడా చాలా పోలికలు ఉన్నాయి. వారిలోనూ కొన్ని సూక్ష్మమైన భేదాలు ఉన్నాయి కాని ప్రాథమిక అంశాలు ఒకటే. అందువల్ల ఆ రెండింటి మధ్యా చిన్న గీత పెట్టి **న్యాయ-వైశేషిక దర్శనం** అంటాము. **తర్కసంగ్రహం** అని ఒక గ్రంథం ఉంది. అది న్యాయదర్శనం యొక్క సారాంశమే అయినా, అందులో వైశేషిక దర్శనంలోని ప్రధాన అంశాలు కూడా వస్తాయి. అంటే తర్కసంగ్రహం న్యాయవైశేషిక దర్శనాల సంగ్రహం అవుతుంది.

పూర్వమీమాంసాదర్శనం అంటే వేదపూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వచ్చింది. ఈ విధంగా మూడు పూర్వపక్షదర్శనాలు ఉన్నాయి.

ఎ) సాంఖ్య-యోగదర్శనం
బి) న్యాయ-వైశేషికదర్శనం
సి) పూర్వమీమాంసాదర్శనం

ఈ దర్శనాలన్నిటినీ ఒక్క **తు** పదంతో ఖండిస్తున్నారు వ్యాసాచార్యులవారు. బ్రహ్మసూత్రములలో ఏదైనా వాదనను ఖండిస్తే చాలదు, దానిని నిరూపించాలని చూశాము.

**సాంఖ్య-యోగదర్శనం** - పైన చెప్పిన మూడు దర్శనాలలో సాంఖ్య-యోగ దర్శనాన్ని శక్తివంతమైన దర్శనంగా భావిస్తారు వ్యాసాచార్యులవారు. కనీసం ఆయన రోజుల్లో వీరు శక్తివంతంగా ఉండివుంటారు. అందువల్ల ఈ అధ్యాయంలో ఐదవసూత్రంనుంచీ ఆఖరిసూత్రం వరకూ అంటే 134 వరకూ సాంఖ్య-యోగ దర్శనాన్ని ఖండిస్తూ వస్తారు. అంటే మొదటి అధ్యాయంలో వ్యాసాచార్యులవారికి రెండు ముఖ్యమైన విధులు ఉన్నాయి. అవి -

1. వేదాంతాన్ని నిరూపించటం
2. సాంఖ్య-యోగ పూర్వపక్షులను ఖండించటం

**తు** పదంయొక్క అర్థం అది. అంటే తక్కిన సూత్రములన్నీ కూడా **తు** పదంమీద భాష్యమే. అయినా అక్కడితో తృప్తి చెందక ఈ సాంఖ్యయోగులను రెండవ

అధ్యాయంలో కూడా ఖండిస్తారు. మొదటి అధ్యాయంలో శ్రుతిప్రమాణంద్వారా ఖండిస్తే, రెండవ అధ్యాయంలో అనుమాన ప్రమాణంద్వారా ఖండిస్తారు.

**న్యాయ-వైశేషికదర్శనం** – న్యాయ-వైశేషిక దర్శనాన్ని, సాంఖ్య-యోగదర్శనం అంత శక్తివంతమైనదిగా భావించలేదు వ్యాసాచార్యులవారు. వారిది పరమాణువు సిద్ధాంతం. అది అంతగా ముఖ్యమైనది కాదు, అందువల్ల రెండవ అధ్యాయంలో వారిని ఖండించినా, అంత లోతుగా విశ్లేషించలేదు.

ఈ పూర్వమీమాంసాదర్శనాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. పూర్వమీమాంసా అంటే వేదపూర్వభాగమైన కర్మకాండ, ఉపాసనకాండలను ఆధారంగా చేసుకుని చేసిన దర్శనం. ఈ దర్శనంయొక్క దార్శనికుడు జైమినీ మహర్షి. ఈ జైమినీ మహర్షి స్వయంగా వ్యాసాచార్యులవారి శిష్యులు.

జైమినీ మహర్షి పూర్వమీమాంసా సూత్రములు రచించారు. దాన్ని ధర్మసూత్రములు అని కూడా అంటారు. అది కర్మకాండ, ఉపాసనకాండలను విశ్లేషిస్తుంది. ఎలాగైతే బ్రహ్మసూత్రములకు శంకరాచార్యులవారు శంకరభాష్యం రచించారో, అలాగే ధర్మసూత్రములకు శబరముని భాష్యం రాశారు. దాన్ని శాబరభాష్యం అంటారు. అది చాలా గొప్ప భాష్యం.

నిజం చెప్పాలంటే మనం జైమినీ మహర్షి రచించిన ధర్మసూత్రములను గాని, శబరముని రచించిన శాబరభాష్యాన్ని గాని పూర్వపక్షంగా భావించము. మనం వారిని చాలా గౌరవిస్తాము. ఆ సూత్రములు ధర్మార్థకామాలు పొందటానికి ఉపయోగపడటమే కాక, సాధన చతుష్టయ సంపత్తిని కూడా కలుగజేస్తాయి. ఆ విధంగా పూర్వమీమాంస అటు లౌకిక విజయాన్ని, ఇటు ఆధ్యాత్మిక ఎదుగుదలను కూడా ఇస్తుంది. అందువల్ల, గుర్తుంచుకోండి, పూర్వమీమాంసను నిజానికి పూర్వపక్షంగా భావించము.

ఒక విషయం మాత్రం నొక్కివక్కాణిస్తాము. ఏమిటది? **పూర్వమీమాంస మోక్షాన్ని ఇవ్వలేదు.** పూర్వమీమాంస ధర్మార్థకామాలను ఇస్తుంది, సాధన చతుష్టయ సంపత్తిని ఇస్తుంది. అది జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది కాని జ్ఞానాన్ని, మోక్షాన్ని ఇవ్వదు. ఈ సత్యాన్ని శబరముని కూడా ఒప్పుకుంటారు.

తర్వాత ఈ శాబరభాష్యానికి కొన్ని ఉపభాష్యాలు వచ్చాయి. ఈ ఉపభాష్యకారులు సమస్యలను సృష్టించటం ప్రారంభించారు. వారు

**పూర్వమీమాంస మోక్షాన్ని ఇస్తుంది** అన్నారు. అక్కడితో ఊరుకోకుండా, **పూర్వమీమాంస మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది** అన్నారు. అంతేకాదు, ఉత్తరమీమాంసవల్ల అసలు ప్రయోజనం లేదు అన్నారు. వీరిని 'తు' పదవిచారణతో ఖండిస్తున్నారు శంకరులవారు.

ఇక్కడ మీకొక అనుమానం రావచ్చు. పూర్వపక్షులు అని చెప్పినప్పుడు సాంఖ్య–యోగ; న్యాయ–వైశేషిక పూర్వపక్షులు గురించి చెబుతున్నాము కాని విశిష్టాద్వైతం గాని ద్వైతం గురించి కాని చెప్పటం లేదు ఎందుకు అనుకోవచ్చు. దానికొక కారణం ఉంది. ద్వైతం, విశిష్టాద్వైతం కూడా బ్రహ్మసూత్రములమీద వచ్చిన భాష్యాలు. భాష్యాలు పూర్వపక్షం అవవు.

విశిష్టాద్వైతం, ద్వైతం, అద్వైతం – మూడూ వేదాంతదర్శనంలోకే వస్తాయి. మూడింటికీ ఆధారం బ్రహ్మసూత్రములే. అందువల్ల ఈ మూడింటిని నమ్మేవారిని వేదాంతులు అనే అంటారు. ఎందుకు? బ్రహ్మసూత్రములను వేదాంతసూత్రములు అంటారు కాబట్టి. వారితో విభేదం మనలో మనకు కలిగే విభేదాలవంటివి. వారిని ఇప్పుడు ఖండించము. బ్రహ్మసూత్రములలో వాదన వేదాంతులకూ, వేదాంతులు కానివారికీ మధ్య జరుగుతుంది.

ఈ పూర్వపక్షుల్లో సాంఖ్య–యోగ పూర్వపక్షులను చాలా వివరంగా ఖండిస్తారు వ్యాసాచార్యులవారు. ఈ అధ్యాయంలో 5–134 సూత్రాలవరకు సాంఖ్యులను ఖండిస్తారు. అంతేకాక, సాంఖ్యదర్శన ఖండన రెండవ అధ్యాయంలో కూడా వస్తుంది. అలాగే న్యాయ–వైశేషికులను కూడా ఖండిస్తారు. ఇంత తీవ్రంగా కాదు కాని వారినీ ఖండిస్తారు. పూర్వమీమాంసకులను మాత్రం ఖండించలేదు. అందువల్ల శంకరాచార్యులవారు, పూర్వమీమాంసకులను తీసుకుని ఈ నాలుగవ మంత్రంలో అనేక వాదోపవాదనలద్వారా వారిని ఖండిస్తారు.

ఇంతకుముందే చూసినట్టుగా శంకరాచార్యులవారు శాబరభాష్యాన్ని ఖండించరు. జైమినిమహర్షి అన్నా, శబరముని అన్నా గౌరవం ఉంది. కాని శాబరభాష్యానికి పుట్టుకొచ్చిన ఉపభాష్యాలతో వచ్చింది చిక్కంతా. శాబరభాష్యానికి ఇద్దరు ఉపభాష్యాలు రాశారు. వారు కుమారిలభట్టు, ప్రభాకరుడు.

కుమారిలభట్టు పద్యరూపంలో తన భాష్యాన్ని రచించారు. వాటిని కారికలు అంటారు. భట్టు రాశారు కాబట్టి అవి భాట్టకారికలుగా పేరుపొందాయి. ఆయన

భాష్యాన్ని భాట్టమతం అంటారు. ప్రభాకరుడు రాసిన భాష్యాన్ని బృహతి అంటారు. ఈయన వాదన కొంచెం భిన్నంగా ఉంటుంది. ప్రభాకరుడు రాశారు కాబట్టి దీన్ని ప్రాభాకరమతం అంటారు. ఈ విధంగా మనకు రెండు సిద్ధాంతాలు వచ్చాయి. అవి భాట్టమీమాంస; ప్రాభాకరమీమాంస. వీరు చెప్పిన వాటిని శంకరాచార్యులవారు అంగీకరించరు.

శంకరాచార్యులవారి ఖండనను చూసేముందు వారి వాదన ఏమిటో తెలుసుకోవాలి. పనిగట్టుకుని వారి వాదనను తెలుసుకుని, వారిని ఖండించటం అవసరమా అనిపించవచ్చు మీకు. కాని బ్రహ్మసూత్రములు అంటే న్యాయశాస్త్రం. అందులో వాదోపవాదాలు ఉండితీరతాయి. మెదడుకు మేత ఇవి. అందువల్ల ఈ భాట్టమతం, ప్రాభాకరమతాల మధ్య ఉన్న సమానధర్మాలు ఏమిటి, వైధర్మ్యాలు ఏమిటి అని తెలుసుకోవాలి మనం.

ముందు సమానధర్మాలను చూద్దాము. వారు వేదాంతశాస్త్రాన్ని రెండు భాగాలుగా విభజించారు. అవి **సిద్ధబోధక వాక్యాని, కార్యబోధక వాక్యాని**. సిద్ధబోధక వాక్యాని అంటే సత్యాలు చెప్పే వాక్యాలు. అంటే పదార్థాల గురించిన జ్ఞానాన్ని ఇస్తాయి. కార్యబోధక వాక్యాని అంటే విధినిషేధ వాక్యాలు. ఈ కర్మలు చెయ్యండి, ఈ కర్మలు చెయ్యకండి అని చెబుతాయి. చెయ్యండి అని చెప్పే వాక్యాలకు కుర్యాత్, కర్తవ్యా పదాలు వస్తాయి.

సిద్ధబోధక వాక్యాలు జ్ఞానం ఇస్తాయి కాని ఫలానా పని చెయ్యండి అని ఆజ్ఞాపించవు. అందువల్ల వారు ఏమంటారంటే, సిద్ధబోధక వాక్యాలు జ్ఞానాన్ని మాత్రమే ఇస్తాయి కాని ఏమి ప్రయోజనాన్ని ఇవ్వవు. ఒక విషయం గురించి తెలుసుకున్నంత మాత్రాన దాన్ని ఎలా పొందుతాము? ఇదీ వారి ప్రశ్న.

ఉదాహరణకు స్వర్గలోకం ఉందని తెలుసుకుంటే, మనకు కలిగే ప్రయోజనం ఏముంది? నిజానికి అది తెలుసుకుంటే మరింత దుఃఖంలో మునిగిపోతాము. ఎందుకు? అమెరికా వెళ్ళివచ్చినవారు, ఎంతసేపూ అమెరికానే పొగుడుతారు. ఇక్కడ జీవితం వారికి నచ్చదు. రోడ్లు ఇక్కడ దారుణంగా ఉంటాయి. రోడ్డు మీద వాహనాలు ఇష్టం వచ్చినట్టు వెళతాయి. కాలుష్యం ఎక్కువ ఉంటుంది. ప్రతిక్షణం అక్కడి జీవితాన్నీ, ఇక్కడి జీవితాన్నీ పోల్చుకు చూసుకుని బాధపడతారు.

ఇంకో ఉదాహరణ చూద్దాము. మనకు ఏదో అనారోగ్యం చేసింది. డాక్టరు దగ్గరకు వెళ్ళాము. ఆయన మన తలనెప్పికి ఒక పేరు చెప్పారు. ఆ రోగం పేరు

తెలుసుకుంటే రోగం మటుమాయమవుతుందా? అంటే ఈ జ్ఞానం పొందటంవల్ల మనకు సుఖప్రాప్తికాని, దుఃఖనివృత్తిగాని ఏదీ కలుగదు.

**సిద్ధబోధక వాక్యాని అప్రయోజనాని**
**కార్యబోధక వాక్యాని సప్రయోజనాని**

అందువల్ల సిద్ధబోధక వాక్యాలవల్ల ఏమీ ప్రయోజనం లేదు అంటారు వారు. మీరు **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం పొందటంవల్ల మీకున్న ఏ సమస్య తీరింది అని ఎదురుప్రశ్నిస్తారు వారు. మీ తలనొప్పి పోయిందా, మీ నీళ్ళ సమస్య తీరిందా, మీ అమ్మాయి పెళ్ళి అయ్యిందా, మీరు కొత్త ఇల్లు కొనుక్కోగలిగారా లేక దేశంలోని ఆర్థిక సమస్య తీరిందా? వేదాంతజ్ఞానంతో సహా ఏ జ్ఞానం పొందినా కూడా జ్ఞానం పొందినంతమాత్రాన సమస్య తీరదు.

అదే కార్యబోధక వాక్యాని ద్వారా, అది చెప్పిన కార్యం ఏదైనా చేస్తే, ఏదో ఓ పురుషార్థం లభిస్తుంది. సుఖప్రాప్తి అయినా కలుగుతుంది. దుఃఖనివృత్తి అయినా కలుగుతుంది. అనారోగ్యం గురించిన జ్ఞానం దాన్ని తగ్గించదు; దానికి తగ్గ మందు వేసుకుంటేనో, పథ్యం చేస్తేనో తగ్గుతుంది. అదేవిధంగా స్వర్గలోకం గురించిన జ్ఞానం పొందుతారు.

**స్వర్గే లోకే న భయం కించనాస్తి**
**న తత్ర త్వం న జరయా బిభేతి**
**ఉభే తీర్త్వాఽశనాయాపిపాసే**
**శోకాతిగో మోదతే స్వర్గలోకే** – కఠ 1.1.12

స్వర్గలోకంలో జరామరణ భయాలు లేవు. వారు అమృతత్వాన్ని పొందుతారని నచికేతుడు కఠోపనిషత్తులో చెబుతాడు. ఈ జ్ఞానం పొందితే చాలదు; ఆ లోకానికి వెళ్ళటానికి తోడ్పడే జ్యోతిష్ఠోమయాగం చేయాలి. అప్పుడు స్వర్గలోకానికి వెళ్ళి స్వర్గసుఖాలు అనుభవించవచ్చు. అందువల్ల కార్యబోధక వాక్యాలు మనకు సుఖప్రాప్తినో, దుఃఖనివృత్తినో ఇస్తాయి కాబట్టి అవి ప్రయోజనాన్ని కలిగిస్తాయి కాని, సిద్ధబోధక వాక్యాలు కలిగించవు అంటారు వీరు.

వేదాంతజ్ఞానం పొందాక, శిష్యులు ఎప్పుడూ అడిగే మొదటి ప్రశ్న, 'నాకు అహం బ్రహ్మ అస్మి మహావాక్యం బాగా అర్థమయింది. దాని తర్వాత నేనేం చేయాలి? నాకొక జీవనవిధానాన్ని సూచిస్తే, నేను దాన్ని ఆచరణలో పెడతాను.'

ఈ ప్రశ్న ఎందుకు ఉదయిస్తుంది? వారు ఏదో చేయాలని ఎందుకు అనుకుంటారు? అలా అడిగారంటే ఈ జ్ఞానంవల్ల వారు లాభం పొందినట్టుగా భావించటం లేదని అర్థం. అంటే వారిలో లోతుగా పాతుకుపోయిన అంశం ఒకటి ఉంది. అది కర్మ చేస్తేనే ప్రయోజనం కలుగుతుంది, జ్ఞానంవల్ల ప్రయోజనం కలుగదు అనే భావన.

**కార్యాత్ ఏవ ప్రయోజనం। జ్ఞానాత్ న ప్రయోజనమ్॥**

వారు జ్ఞానంవల్ల లాభం పొందితే, ఇంకా ఏదో చేయాలని అనుకోరు.

పూర్వమీమాంసకులు కూడా వేదాన్ని ప్రమాణంగా భావిస్తారు. అందువల్లనే వారిది ఆస్తికదర్శనం అయింది. నిజానికి నాస్తికదర్శనమైన బౌద్ధమతాన్ని వారు కూడా ఖండించేవారు. ప్రమాణం అంటే ఏమిటి?

**అనధిగత అబాధిత అర్థబోధకం ప్రమాణమ్**

ప్రమాణం ఒకదాని గురించి చెబుతుంది. అర్థ అంటే ప్రమేయం; బోధకమ్ అంటే గురించి చెబుతుంది. అంటే ప్రమేయం గురించి చెబుతుంది. అది చెప్పే విషయానికి రెండు నియమాలు పాటించాలి.

**అనధిగతమ్** – అనధిగతమ్ అంటే వేరే ఏ ప్రమాణం కూడా దీని గురించి చెప్పివుండకూడదు. అంటే ఇప్పుడు వేదప్రమాణం గురించి చూస్తే ఈ ప్రమాణం చెప్పేది కళ్ళు, ముక్కు, చెవులు, నోరు, చర్మం, తర్కం, విజ్ఞానశాస్త్రం లేదా గణితశాస్త్రం ద్వారా చెప్పబడి ఉండకూడదు. వేరే ప్రమాణం చెప్పింది వేదప్రమాణం చెపితే, అప్పుడు వేదం అప్రమాణం అవుతుంది. అందువల్ల సైన్సు కూడా చెప్పని అంశమై ఉండాలి. దాన్ని అనధిగతమ్ అంటారు.

**అబాధితమ్** – అబాధితమ్ అంటే వేదం చెప్పినదాన్ని ఇంకొక ప్రమాణం ఖండించకూడదు.

ఎ) ప్రత్యక్ష ప్రమాణానికి భిన్నంగా ఉండకూడదు. ఒకవేళ వేదం అగ్ని చల్లగా ఉంటుంది అంటే, మనం ఆ వాక్యాన్ని ఒప్పుకోము. అప్పుడది బాధితమవుతుంది.

బి) తర్కానికి కూడా భిన్నంగా ఉండకూడదు. అంటే అది చేసే వాదనలు కుతర్కంగా ఉండకూడదు. వేదప్రమాణం తర్కానికి అతీతంగా ఉండాలి కాని, కుతర్కంగా ఉండకూడదు. వేదంలో వాడే తర్కాన్ని వేదసమ్మత తర్కం అంటారు.

సి) విజ్ఞానశాస్త్రాన్ని ఖండించకూడదు. అలాగని విజ్ఞానశాస్త్రం చెప్పేది అయి ఉండకూడదు. వేదశాస్త్రం దీన్ని ఖండించకూడదు.

ఏ ప్రమాణానికి అందనిది అని అంతకుముందు చూశాము; ఇప్పుడు ఏ ప్రమాణమూ ఖండించలేనిది అని చూస్తాము.

ఈ వివరాలన్నీ క్రోడీకరించి చూస్తే ప్రమాణం అంటే ఒక ప్రమాణం చెప్పే విషయం తక్కిన ప్రమాణాలకు అందనిదై ఉండాలి; తక్కిన ప్రమాణాలు ఖండించలేనిదై ఉండాలి. వేదాంతప్రమాణం ఈ నియమాలకు సరిపోతుంది.

పూర్వపక్షి ఈ నియమాలలో ఇంకొక నియమాన్ని జోడిస్తాడు. ఏమిటది? ఫలవత్. ఇప్పుడు ఆ నిర్వచనాన్ని పూర్తిగా చూస్తే –

**అనాదిగత అబాధిత ఫలవత్ అర్థబోధకం ప్రమాణమ్**

ఫలవత్ అంటే ప్రయోజనం ఉండాలి. ఇప్పుడు ప్రమాణ నిర్వచనాన్ని పూర్తిగా చూస్తే, ప్రమాణం అంటే ఒక ప్రమాణం చెప్పే విషయం తక్కిన ప్రమాణాలకు అందనిదై ఉండాలి; తక్కిన ప్రమాణాలు ఖండించలేనిదై ఉండాలి; దానివల్ల ప్రయోజనం ఉండాలి.

పూర్వమీమాంసకుల ప్రకారం వేదప్రమాణలక్షణాలు ఇవి. అంతకు ముందేమన్నారు?

**సిద్ధబోధక వాక్యాని అప్రయోజనాని**

ఇప్పుడు ఈ నిర్వచనానికి ఈ వాక్యాన్ని జోడిస్తే వేదప్రమాణం ప్రయోజనాన్ని ఇవ్వలేదు కాబట్టి కొత్త వాక్యం చేశారు.

**సిద్ధబోధక వాక్యాని అప్రమాణాని**

ప్రమాణానికి వారు కలిపిన నియమం – ప్రయోజనం ఉండాలి. అది లేదు కాబట్టి వేదప్రమాణం ప్రమాణం కాదు అంటారు వారు.

ఇంతవరకూ చూసిన దశలను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

1. వేదవాక్యాని వివిధాని – వేదవాక్యాలు రెండు రకాలు
   ఎ) సిద్ధబోధక వాక్యాని
   బి) కార్యబోధక వాక్యాని

2. తయోర్మధ్యే – వాటి మధ్యలో
   ఎ) సిద్ధబోధక వాక్యాని అప్రయోజనాని
   బి) కార్యబోధక వాక్యాని సప్రయోజనాని

3. తస్మాత్ – అందువల్ల
   ఎ) సిద్ధబోధక వాక్యాని అప్రయోజనత్వాత్ అప్రమాణాని
   బి) కార్యబోధక వాక్యాని సప్రయోజనత్వాత్ ప్రమాణాని

ఈ నియమాలన్నీ జైమినీ సూత్రములు ఒక్కసూత్రంలో పొందుపరిచారు అంటారు వారు. మనకు బ్రహ్మసూత్రములలో నాలుగవ సూత్రం ముఖ్యం.

**తత్తు సమన్వయాత్.**

వారికి జైమినీ ధర్మసూత్రములలో ఈ సూత్రం చాలా ముఖ్యం.

**ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**

**ఆమ్నాయస్య** – వేదస్య అంటే వేదంయొక్క;

**క్రియార్థత్వాత్** – కార్యబోధకత్వాత్ అంటే క్రియను బోధించే వాక్యాలు మాత్రమే ప్రయోజనకారి వాక్యాలు.

**ఆనర్థక్యమ్** – అప్రమాణం అంటే ప్రమాణం కావు. ఏవి?

**అతదర్థానామ్** – సిద్ధబోధకనామ్ అంటే సిద్ధబోధక వాక్యాలు.

ఈ సూత్రం అర్థం – వేదంలో కార్యబోధక వాక్యాలు మాత్రమే ప్రయోజనకారి వాక్యాలు, తక్కిన సిద్ధబోధక వాక్యాలు అప్రమాణం. ఇంకో విధంగా చెప్పాలంటే కార్యబోధక వాక్యాలు మాత్రమే ప్రమాణం; సిద్ధబోధక వాక్యాలు అప్రమాణం.

పూర్వపక్షి జ్ఞానకాండ మొత్తం సిద్ధబోధక వాక్యాల కిందకు వస్తాయి అంటాడు. ఎందుకంటే అందులో బ్రహ్మ గురించి, సృష్టి గురించి, ఆత్మ గురించి, అనాత్మ గురించి వస్తుంది కాని ఫలానా కర్మ చెయ్యమని రాదు. జ్ఞానకాండ అంటేనే అర్థం అదే కదా. జ్ఞానాన్ని బోధిస్తుంది కాని కర్మను నిర్దేశించదు. పూర్వపక్షి అంటాడు, 'ముందే చెప్పాము కదా కేవలజ్ఞానం అప్రయోజనం. నేను బ్రహ్మ సత్యం జ్ఞానం అనంతం అని తెలుసుకుంటే నాకు ఏంలాభం కలుగుతుంది? నేను పంచభూతాల సృష్టి గురించో, పంచకోశాల గురించో తెలుసుకుంటే నాకేమిటి ప్రయోజనం?'

**సిద్ధబోధక వాక్యాని అప్రయోజనాని**
**అప్రయోజనత్వాత్ అప్రమాణాని**

అందువల్ల జ్ఞానకాండ మొత్తం అప్రయోజనం. అది ఒక సస్యశ్యామల దేశంలో ఎడారి అంటాడు పూర్వపక్షి. వేదమంతా చక్కగా పూలు, పండ్లు, వృక్షాలతో కళకళలాడుతూ ఉంటే, దానికి దిష్టిచుక్కలా వేదాంతం ఎడారిలా బీడుపడి ఉంది అంటాడు అతను.

పూర్వపక్షి కూడా వేదాలను అపౌరుషేయం అని ఒప్పుకుంటాడు. అపౌరుషేయం అంటే మనిషి బుద్ధినుంచి వచ్చినది కాదు. మనిషినుంచి వచ్చింది కాదు కాబట్టి దానిలో దోషాలు ఉండవు. అది నిర్దుష్ట ప్రమాణం. కాని ఇక్కడ కూడా వారికీ, మనకూ చిన్న భేదం ఉంది. మనం వేదాలు సాక్షాత్తూ భగవంతునినుంచే వచ్చాయి అంటాము కాని పూర్వపక్షి వేదాలే భగవంతుడు అంటాడు. 'భగవంతుడు ఇవ్వకపోతే వేదాలు ఎక్కడనుంచి వచ్చాయి?' అని అడిగితే, 'వేదాలు ఎక్కడనుంచీ రాలేదు, అవి అనాది,' అంటాడు.

వేదాన్ని అంత ప్రమాణంగా తీసుకుంటే వేదంలో ఒక భాగమైన జ్ఞానకాండాన్ని అప్రమాణంగా ఎలా కొట్టివేయగలరు? ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని కొట్టివేస్తే దాన్ని **అర్ధ అండన్యాయము** అంటారు. ఒక అండంలో సగం అండాన్ని వండుకుని, ఇంకొక సగం అండాన్ని ఎలా పొదగలేమో అలా వేదాన్ని ప్రమాణంగా స్వీకరిస్తే, ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని కొట్టివేయలేము.

దానికి పూర్వపక్షి జవాబు– సిద్ధబోధక వాక్యాలు అప్రమాణాని అంటే అవి సాక్షాత్తూ ప్రయోజనాన్ని ఇవ్వవు కాని పరోక్షంగా ఇస్తాయి. అన్ని సిద్ధబోధక వాక్యాలు కార్యబోధక వాక్యాలలోని కర్మలను చేయటానికి దోహదకారి అవుతాయి.

ఉదాహరణకు వేదం స్వర్గం గురించి గొప్పగా చెపితే, సహజంగానే స్వర్గలోకానికి వెళ్ళాలనే కోరిక మనకు పుడుతుంది. స్వర్గలోకవాసులు కూడా భూలోకానికి రావాలని ఉబలాటపడేలాగా ఒక పద్యం రాస్తాడు ఒక కాఫీగతప్రాణి.

**సురాం పీత్వా తు స్వర్గస్థాః స్వర్గలోక నివాసినః।**
**భూలోకే జన్మ వాంఛంతి కాఫీపానాయ కేవలమ్॥**

ఎప్పుడూ అమృతం తాగుతూ ఉండే దేవతలు మన కాఫీ రుచి గురించి విని, కేవలం కాఫీ తాగటంకోసం భూలోకంలో జన్మించాలని కోరుకుంటారుట. దానికి భిన్నంగా స్వర్గసుఖాల గురించి గొప్పగా విన్న మన భూలోకవాసులు స్వర్గానికి వెళ్ళాలని కోరుకుంటారు. అంటే స్వర్గం గురించిన సిద్ధబోధక వాక్యాలు వారికి కోరిక పుట్టిస్తాయి.

**జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత**

స్వర్గలోకానికి వెళ్ళాలనుకునేవారు జ్యోతిష్టోమ యాగం చేయాలి. ఇది సిద్ధబోధక వాక్యమా, కార్యబోధక వాక్యమా? కార్యబోధక వాక్యమే. కాని ఇది చెయ్యటానికి దానిమీద శ్రద్ధ ఏర్పడాలి. ఆ విధంగా సిద్ధబోధక వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలిపితే అప్పుడు అవి ప్రమాణవాక్యాలు అవుతాయి. ఇటువంటి వాక్యాలను అర్థవాదవాక్యాలు అంటారు. ఇలాంటి ఉదాహరణలు మరికొన్ని చూద్దాము.

**వాయుర్వై క్షేపిష్ఠా దేవతా**

వాయువు చాలా త్వరగా వెళ్ళే దేవత. ఇది సిద్ధబోధక వాక్యమా, కార్యబోధక వాక్యమా? ఈ వాక్యం ఏ కర్మను విధించటం లేదు. వాయువును స్తుతిస్తున్నది. అందువల్ల ఇది సిద్ధబోధక వాక్యం. దీన్ని కార్యబోధక వాక్యంతో కలుపుకోవాలి.

**వాయువ్యం శ్వేతమాలభేత**

వాయువు అనే దేవతకు ఒక తెల్లని పశువును ఇవ్వాలి అని ఒక వాక్యం ఉంది. ఈ రెండింటినీ కలిపితే వాయువు శీఘ్రగామియైన దేవత కాబట్టి ఫలాన్ని శీఘ్రంగా ఇస్తాడు. అందుచేత తెల్లని పశువును ఆ వాయువుకు ఇవ్వటం మంచిది అని అర్థం చెప్పుకోవాలి.

**బర్హిషి రజతం న దేయమ్**

యజ్ఞంలో వెండి ఇవ్వకూడదని ఒక విధివాక్యం ఉంది. దాని దగ్గరనే ఇంకొక వాక్యం ఉంది –

**సోఽరోదీద్యదరోదీత్తద్రుద్రస్య రుద్రత్వం, యదశ్రు అశీయత్ తద్రజతం హిరణ్యమభవత్తస్మాద్రజతం హిరణ్యమదక్షిణ్యమశ్రుజం హి యో బర్హిషి దదాతి పురాస్య సంవత్సరాద్ గృహే రుదన్తి**

దీని అర్థం – 'దేవతల చేత నిరోధించబడిన అగ్ని ఏడ్చాడు. అతని కన్నీళ్ళు నేలమీద పడగా అక్కడ వెండి పుట్టింది. అందువల్ల యజ్ఞంలో వెండి దక్షిణగా ఇవ్వకూడదు. అలాచేస్తే ఏడాది తిరక్కుండా వారియింట్లో ఏడుస్తారు.' ఈ వాక్యం స్వయంగా ఏ కర్మనూ విధించకపోయినా, యజ్ఞంలో ఎందుకు వెండి ఇవ్వకూడదో వివరిస్తుంది కాబట్టి దీన్ని అర్థవాదవాక్యం అంటారు. అందువల్ల సిద్ధబోధక వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలపాలి అంటారు పూర్వమీమాంసకులు. ఇది ఒక వాదన.

**బ్రహ్మ నాస్తి** – పూర్వమీమాంసలో రెండు మతాలను చూశాము. అవి ప్రాభాకర మతము, భాట్టమతము. ఈ రెండు మతాలవారికీ **బ్రహ్మ లేనే లేదు**. బ్రహ్మనాస్తి అంటారు వీరు. అది మనకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఎందుకంటే మనం ఉన్నది బ్రహ్మ ఒక్కటే అది అద్వితీయం బ్రహ్మ అంటాము. 'బ్రహ్మ లేదు అని ఎలా చెప్పగలరు?' అంటే వారు చెప్పే జవాబు ఒక్కటే. ఇందాకనే అది చూశాము మనం. బ్రహ్మజ్ఞానంవల్ల ప్రయోజనం ఉండాలి.

వారు ఎదురు మనను ప్రశ్నిస్తారు. బ్రహ్మవల్ల కలిగే ఒక్క ప్రయోజనం చెప్పండి అంటారు. వారు మీ ఉపనిషత్తే స్పష్టంగా బ్రహ్మను తెలుసుకోలేము, పొందలేము అని చెప్పేసింది అంటారు.

**యత్ తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణమ్**

**అచక్షుశ్శ్రోత్రం తదపాణిపాదమ్** – ముండకమ్ 1.1.6

అంటే బ్రహ్మను చూడలేము, పట్టుకోలేము, గోత్రనామాలు లేవు, రంగు, రూపు లేదు; బ్రహ్మకు కళ్ళు చెవులు లేవు; కాళ్ళు చేతులు లేవు అని మీరే అంటున్నారు.

పోనీ దానివల్ల ఏమైనా ప్రయోజనం ఉందా? కొన్ని వస్తువులు ప్రత్యక్షంగా ప్రయోజనాన్ని ఇవ్వకపోయినా, పరోక్షంగా ఇస్తాయి. అందువల్ల బ్రహ్మను సాధనగా ఉపయోగించి వేరే సాధ్యవస్తువును దేన్నైనా పొందవచ్చా? లేదు! బ్రహ్మ సాధ్యమూ కాదు, సాధనా కాదు. బ్రహ్మ అవ్యవహార్యం అని మీరే అంటారు.

**అదృశ్యమవ్యవహార్యమ్** – మాండూక్యమ్ 1.7

అవ్యవహార్యం అంటే వ్యవహారాలకు అందదు. బ్రహ్మ సబ్జెక్టు కాదు, ఆబ్జెక్టు కాదు, పరికరం కాదు; బ్రహ్మ కర్త కాదు, భోక్త కాదు.

అది సాధ్యమూ కాదు, సాధనా కాదు. అటువంటి బ్రహ్మను వేదాంతం ఎందుకు బోధించాలి? అందువల్ల అసలు బ్రహ్మ నాస్తి అంటారు ఈ రెండు మతాలవారు కూడా.

ఆత్మజ్ఞానం గురించి ఏం చెబుతారని వారిని అడిగితే, 'ఆత్మ గురించి మనకే తెలుసు. ఆత్మ చాలా సన్నిహితంగా ఉంటుంది. మీరే ఆత్మ స్వయంప్రకాశకం అంటారు. అలాంటప్పుడు స్వతఃసిద్ధమైన ఆత్మ గురించి వేదాంతం కొత్తగా చెప్పేది ఏముంది?'

**స్వతః సిద్ధస్య ఆత్మనః వేద వేద్యత్వం కథం భవతి**

ముందే చూశాము, ఒక ప్రమాణం మనకు వేరే ఏ ప్రమాణాల ద్వారా తెలియని విషయాన్ని బోధించాలి. ఆత్మ గురించి మనకు ముందే తెలుసు కాబట్టి, వేదం కొత్తగా చెప్పేది ఏముంది? మళ్ళీ ఇందాకటి ప్రశ్నే, వేదాన్ని వారు ప్రమాణంగా వాడుతున్నప్పుడు, వేదం ఆత్మ గురించి ఎందుకు పనిగట్టుకుని చెప్పాలి?

దానికి జవాబు కూడా ఇందాక చూసినదే. ఆ వాక్యాలను అర్థవాదవాక్యాలు అంటారు. ఆత్మ గురించి వేదాంతంలో వచ్చిన వాక్యాలను స్తుతివాక్యాలుగా తీసుకోవాలి. యజ్ఞాలు చేసే యజమానిని ప్రోత్సహించటానికి వాడే వాక్యాలు అవి. వాటిని **కర్తృ స్తుతి వాక్యాని** అంటారు. అలాగే బ్రహ్మ గురించి చెప్పిన వాక్యాలను వారు పూజిస్తున్న దేవతలను స్తుతించే వాక్యాలుగా తీసుకోవాలి కాని, బ్రహ్మ నిజంగా ఉన్నట్టు కాదు. ఈ వాక్యాలు **దేవతాస్తుతి పర వాక్యాని**.

ఆ విధంగా అన్ని సిద్ధబోధక వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలుపుకోవాలి. ఏ కార్యబోధక వాక్యాలతో కలుపుకోవాలి? వేటితోనైనా కలపవచ్చా? దానికి కూడా ఏమైనా నియమం ఉందా? ఇంతవరకూ భాట్టమతం వారూ, ప్రాభాకరమతం వారూ కలిసి ప్రయాణం చేశారు. ఇక్కడ వారి అభిప్రాయాల్లో భేదం వస్తోంది.

అంటే సిద్ధబోధక వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలపటంవరకూ ఇద్దరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. కాకపోతే ఏ కార్యబోధక వాక్యాలతో అన్న విషయంలోనే వారు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

**భాట్టమతం**

భాట్టమతం వారు అన్ని జ్ఞానకాండ వాక్యాలను కర్మకాండలోని వాక్యాలతో కలపాలి అంటున్నారు.

**ప్రాభాకరమతం**

అనేక సిద్ధబోధక వాక్యాలు ఉన్నాయి. అలాగే అనేక కార్యబోధక వాక్యాలు కూడా ఉన్నాయి. ఏదో ఒక సిద్ధబోధక వాక్యాన్ని ఏదో ఒక కార్యబోధక వాక్యంతో కలపలేము. అది అడ్డదిడ్డంగా చేసినట్టు అవుతుంది. అందువల్ల దానికి ఒక నియమం పాటించాలి అంటారు ప్రాభాకర మతంవారు. ఏమిటది?

ముందుగా వారు భాట్టమతాన్ని ఖండిస్తున్నారు. భాట్టమతం వారు ఏమన్నారు? జ్ఞానకాండలో ఉన్న సిద్ధబోధక వాక్యాలను తీసుకువెళ్ళి కర్మకాండలో ఉన్న కార్యబోధక వాక్యాలతో కలపాలి అన్నారు. కాని జ్ఞానకాండ వేరు, కర్మకాండ వేరు. అలా కలిపితే అది ప్రకరణభేదం అవుతుంది. దాని బదులుగా వారు ఇంకొక మార్గాన్ని సూచిస్తున్నారు.

సిద్ధబోధక వాక్యాలను వాటికి దగ్గరగా ఉన్న కార్యబోధక వాక్యాలతో కలపాలి అంటారు వీరు. జ్ఞానకాండలోనే అనేక ఉపాసన వాక్యాలు ఉన్నాయి. ఉపాసనా వాక్యాలు కూడా కార్యబోధక వాక్యాలే. కర్మ కాయికకర్మను సూచిస్తే, ఉపాసన మానసికకర్మను సూచిస్తుంది. అందువల్ల ప్రాభాకరమతం వారేమంటారంటే జ్ఞానకాండలోని వాక్యాలను తీసుకువెళ్ళి ఎక్కడో ఉన్న కర్మకాండ వాక్యాలతో కలుపనవసరం లేదు, వాటిని జ్ఞానకాండలోనే ఉన్న ఉపాసనా వాక్యాలతో కలపవచ్చు. ఉదాహరణకు కొన్ని వాక్యాలను చూద్దాము.

ఆత్మా ఇత్యేవ ఉపాసీత – ఆత్మ ఉపాసన చెయ్యి
బ్రహ్మవిదాప్నోతి పరమ్ – బ్రహ్మ ఉపాసన చెయ్యి

అహం బ్రహ్మ అస్మి, అహం నిత్యశుద్ధః, అహం నిత్యబుద్ధః అని ఉపాసన చేయాలి అంటారు ప్రాభాకర మతంవారు.

ఉపాసన అంటే అతస్మిన్ తత్‌బుద్ధి. అంటే నికృష్టవస్తువుమీద ఉత్కృష్ట వస్తువును ఆవాహన చేసి ధ్యానం చేయాలి. జెండామీద దేశాన్ని ఆవాహన చేసినట్టుగా, సాలగ్రామంమీద విష్ణుమూర్తిని ఆవాహన చేసినట్టుగా, జీవునిమీద బ్రహ్మను

ఆవాహన చేయాలి. అప్పుడు అది కార్యబోధక వాక్యం అవుతుంది. ఈ కార్యం చెయ్యటంవల్ల పురుషార్థాన్ని పొందుతాడు సాధకుడు.

ఈ విధంగా పూర్వమీమాంసకులు ఇద్దరూ జ్ఞానంవల్ల ప్రయోజనం లేదని ముక్తకంఠంతో చెబుతారు. కాకపోతే వాటిని ఏ వాక్యాలతో కలపాలి అనే విషయంలో భేదాభిప్రాయాల్లో ఉన్నారు. భాట్టమతం వారు కర్మకాండతో కలపాలి అంటే, ప్రాభాకరమతం వారు ఉపాసనతో కలపాలి అంటారు. వారి ఉద్దేశ్య సారాంశం – కర్మ మాత్రమే (ఉపాసన కూడా కర్మలోకే వస్తుంది) సుఖప్రాప్తిని లేదా దుఃఖనివృత్తిని కలుగజేస్తుంది.

**శంకరాచార్యులవారి జవాబు** – మామూలుగా జ్ఞానం పొందితే చాలదు, దానివల్ల ప్రయోజనం కలుగదు; దానికి సంబంధించిన కర్మ చేయాలి నిజమే. ఉదాహరణకు గంగోత్రి గురించి జ్ఞానం పొందితే చాలదు; అక్కడికి వెళ్ళాలి. అలాగే యోగాసనాల గురించి నేర్చుకుంటే చాలదు; వాటివల్ల ప్రయోజనం పొందాలంటే ఆసనాలు వెయ్యాలి.

**కేవలజ్ఞానం నపురుషార్థ సాధకమ్**
**కర్మ ఏవ పురుషార్థ సాధకమ్**

ఇది సామాన్యసూత్రం. కాని కొన్ని సందర్భాలలో జ్ఞానం పొందితే చాలు, కర్మ చెయ్యనవసరం లేదు, ప్రయోజనం కలుగుతుంది.

**కేవల జ్ఞానమాత్రేన పురుషార్థ విద్ధిః**

ఎక్కడైతే అజ్ఞానం సమస్య అవుతుందో, అక్కడ కేవలజ్ఞానమే సమస్యను పరిష్కరిస్తుంది. ఉదాహరణకు రజ్జుసర్పభ్రాంతి. ఒక వ్యక్తి తాడును చూసి పాము అనుకుని పొరపడ్డాడు. భయంతో కంపించిపోయాడు. ఆ భయం పోవటానికి అతను ఏ కర్మ చేయాలి? జ్యోతిష్టోమ హోమం చేయాలా, ఏదైనా ఉపాసన చేయాలా? అతను ఏ కర్మా చేయనవసరం లేదు, ఏ ఉపాసనా చెయ్యనవసరం లేదు. నిజానికి అవి చేస్తే అతని సమస్య తీరదు కూడా.

**రజ్జు అజ్ఞాన నివృత్త్యాత్ సర్ప అధ్యాస నివృత్తిః**
**సర్ప అధ్యాస నివృత్త్యాత్ భయకంపాది నివృత్తిః**

లైటు వేసి చూస్తే అక్కడ ఉన్నది పాము కాదు, తాడు అని తెలుస్తుంది. తాడు అజ్ఞానం పోతే తాడును చూసి పాము అని భావించిన పొరపాటు పోతుంది. పాము అని భావించిన పొరపాటు పోతే, ఆ పొరపాటువలన కలిగిన భయం, కంపనం కూడా పోతాయి. ఇంక తర్వాత ఏదైనా కర్మ చేయాల్సిన అవసరం ఏముంది?

ఏ సందర్భంలో కర్మ చేయాలి, ఎందులో కేవలం అజ్ఞాన నివృత్తి చాలు అని వివరించటానికి స్వామీజీ ఒక సందర్భాన్ని వివరిస్తారు. స్వామీజీ ఒక క్యాంపుకు తీసుకువెళ్ళారు కొందరు శిష్యులను. ఒక శిష్యుడు స్టేషనులో ఖంగారుగా స్వామీజీ దగ్గరకు పరుగులు పెట్టుకువచ్చాడు, 'స్వామీజీ, వెళ్ళేవారి పేర్లలో నా పేరు లేదు,' అన్నాడు. 'మీ పేరేమిటి?' 'జి.వి.శాస్త్రి.' సమస్య ఏమిటో స్వామీజీకి వెంటనే అర్థమయింది. 'మరేం ఫర్వాలేదు, మీరు నిశ్చింతంగా ట్రైను ఎక్కికూర్చోండి,' అని అతనిని లోపలికి పంపి, ఈ ఏర్పాట్లన్నీ చూస్తున్న ముఖ్య శిష్యుణ్ణి పిలిచి, 'మీ దగ్గరున్న పేర్లలో విశ్వనాథశాస్త్రి పేరు ఉందా చూడండి,' అన్నారు.

సమస్య అర్థమయిందనుకుంటాను. ఆ వచ్చిన వ్యక్తి పూర్తిపేరు జి. విశ్వనాథశాస్త్రి. స్వామీజీతో ఎప్పుడూ ఆ పేరు చెప్పుకునేవారు. కాని ఉద్యోగరీత్యా వాడే పేరు జి.వి.శాస్త్రి. అందువల్లనే ఆ పేరు చెప్పి వెతకమన్నాడు. ముఖ్యశిష్యుడు 'జి' అక్షరాలలో వెతికితే లేదు. స్వామీజీ పూర్తిపేరు చెప్పాక 'వి' అక్షరాలలో వెతికితే విశ్వనాథశాస్త్రిగా దొరికింది.

ఈ సందర్భాన్ని విశ్లేషిస్తే, ముఖ్యశిష్యుడూ తప్పు చెయ్యలేదు, అసలు వ్యక్తీ తప్పు చెయ్యలేదు; కాని చిన్న అజ్ఞానంవల్ల వచ్చిన పొరపాటు అది. జి.వి.శాస్త్రికి తను ఇచ్చిన పేరులో అజ్ఞానం ఉంది; ముఖ్యశిష్యునికి విశ్వనాథశాస్త్రే జి.వి.శాస్త్రి అనే విషయంలో అజ్ఞానం ఉంది; ఈ అజ్ఞానంవల్ల ఇద్దరూ పొరపాటు పడ్డారు; ఈ పొరపాటును తొలగించటానికి జ్ఞానమనే టార్చిలైటు వేస్తే చాలు. విశ్వనాథశాస్త్రే జి.వి.శాస్త్రి అని స్వామీజీ టార్చ్‌లైట్ వెయ్యగానే సమస్య తొలగిపోయింది. కొత్తగా వేరే కర్మ చేయాల్సిన అవసరం లేకపోయింది. అజ్ఞానజనిత ఈ సమస్య జ్ఞానం పొందితేనే నివృత్తి అయింది.

ఇంకొక పొరపాటు కూడా జరిగింది. ఇంకొక శిష్యుడు, స్వామినాథన్ అనే వ్యక్తి టికెట్టు కొనుక్కోకుండా వచ్చారు. స్వామీజీ అన్ని ఏర్పాట్లు చూస్తున్నారని

విని, టికెట్టు కూడా ఆయనే కొంటారనుకుని పొరపాటు పడ్డారు. తీరా స్టేషనుకు వచ్చాక అర్థమయింది, ఎవరి టికెట్టు వారే కొనుక్కోవాలని. అప్పుడు కౌంటరుకు పరుగెత్తుకు వెళ్ళి టికెట్టు కొనుక్కొని వచ్చారు. ఇక్కడ సమస్య కేవలం అజ్ఞానం కాదు. టికెట్టు లేకపోవటం. దానికి పరిష్కారం టికెట్టు కొనటం. అంటే కర్మ చేయాలి.

ఇప్పుడు ఒకే సందర్భంలో రెండు పొరపాట్లనూ బేరీజు వేస్తే మొదటివ్యక్తి విషయంలో కేవలం అజ్ఞానమే ఉంది, ఆ అజ్ఞానం తొలిగితే సమస్య తొలిగింది. ఇక్కడ కర్మ విషయంలో అజ్ఞానం ఉంది; దానికి కర్మ చేస్తేనే ప్రయోజనం కలిగింది.

పూర్వమీమాంసకులు సిద్ధబోధక వాక్యాలు అప్రయోజనం; కాబట్టి వాటిని కార్యబోధక వాక్యాలతో కలపాలని అన్నారు. అలా చెప్పి వారు మనమీద ఒక ఆగ్నేయాస్త్రం వదిలారు. దానికి మనం వరుణాస్త్రం వదులుతాము. సిద్ధబోధక వాక్యాలు వాటంతట అవి ప్రయోజనం ఇవ్వనిచోట కలపాలి నిజమే కాని, అది అన్నివేళలా అవసరం లేదు. ప్రతి ఉత్సర్గకు (సూత్రానికి) ఒక అపవాదం (సడలింపు) ఉంటుంది. రజ్జుసర్పభ్రాంతివంటి సందర్భాలలో ఆ వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలపనవసరం లేదు. విశ్వనాథశాస్త్రి విషయంలో ఏ కార్యం చేశారు ఆయన?

వేదాంత వాక్యాలు మామూలు సూత్రానికి భిన్నంగా ఉంటాయి. అవే ప్రత్యక్షంగా ప్రయోజనం ఇస్తాయి కాబట్టి వాటిని కర్మతో ముడిపెట్టనవసరం లేదు.

**జ్ఞానమాత్రేన ప్రయోజనం భవతి**
**కర్మసంబంధః న అపేక్షితః**

అలా ఎలా చెప్పగలరు? మీకు వీలుగా ఉండేలాగా దాన్ని మలుచుకున్నారా లేక కర్మ చెయ్యటానికి బద్ధకిస్తున్నారా అని ఎవరైనా ప్రశ్నిస్తే, మనకు దానికి శ్రుతిప్రమాణం ఉంది. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది, ఆ వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలపనవసరం లేదని ఒక్క ఉపనిషత్తు కాదు, అన్ని ఉపనిషత్తుల్లో వస్తుంది.

1. **యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవాఽభూద్విజానతః**

**తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః** – ఈశావాస్యోపనిషత్తు 7

ఎవరైతే ఆత్మ అన్ని ప్రాణులకూ అధిష్ఠానం అని తెలుసుకుంటాడో, అతనికి మోహం ఎక్కడ ఉంటుంది, శోకం ఎక్కడ ఉంటుంది? దీనిద్వారా జ్ఞానం పొందితే చాలు శోకనివృత్తి, మోహనివృత్తి, సంసారనివృత్తి జరిగి మోక్షప్రాప్తి పొందుతాడని తెలుస్తున్నది.

2. **ప్రతిబోధవిదితం మతమ్ అమృతత్వం హి విందతే**

**ఆత్మనా విందతే వీర్యం విద్యయా విందతేఽమృతమ్** – కేన 2.4

ఆత్మజ్ఞానం పొందితే అమృతత్వాన్ని పొందుతాడు.

3. **ఏకో వశీ సర్వభూతాన్తరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి।**

**తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరాః తేషాగ్ం సుఖం శాశ్వతం నేతరేషామ్॥**

ఎవరైతే బ్రహ్మను ఆత్మగా తెలుసుకుంటాడో అతను శాశ్వతమైన సుఖాన్ని పొందుతాడు. ఇతరులు పొందరు అంటే కర్మ, ఉపాసన చేసినవారు పొందరు.

4. **యే విదుః తే అమృతం హి విందతే** – ప్రశ్నోపనిషత్తు

బ్రహ్మజ్ఞానం పొందినవారు అమృతత్వాన్ని పొందుతారు.

5. **స యో హ వై తత్పరమం బ్రహ్మ వేద।**
**బ్రహ్మైవ భవతి నాస్య అబ్రహ్మవిత్కులే భవతి।**
**తరతి శోకం తరతి పాప్మానమ్** – ముండకమ్ –3.2.9

ఎవరు నేనే బ్రహ్మను అని తెలుసుకుంటాడో, అతను బ్రహ్మ అవుతాడు.

6. **ఆత్మైవ సంవిశతి ఆత్మనాఽత్మానం య ఏవం వేద।** – మాండూక్యమ్12

ఆత్మ గురించి తెలుసుకున్నవ్యక్తి అంటే కర్మ, ఉపాసన చేసిన వ్యక్తి కాదు; జ్ఞానం పొందిన వ్యక్తి అని అర్థం.

7. **యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ**– తైత్తిరీయమ్ 2.

ఎవరైతే బ్రహ్మజ్ఞానం పొందుతాడో, అతని కోరికలన్నీ ఒక్కసారి తీరుతాయి.

8. **ప్రజ్ఞానం బ్రహ్మ** – ఐతరేయమ్ 3.1.3

మహావాక్యమే వచ్చింది.

9. **తరతి శోకమాత్మవిత్** – ఛాందోగ్యమ్ 7.1.3

ఆత్మజ్ఞానం పొందినవాడు శోకాన్ని దాటుతాడు. అంటే అతను వేరే ఏ కర్మ కూడా చేయనవసరం లేదు.

10. **అభయం వై జనక। ప్రాప్తః అసి** – బృహదారణ్యకమ్ 4.2.4

ఓ జనకా, ఆత్మజ్ఞానం పొందటంవల్ల నువ్వు అభయం పొందుతావు. అభయం పొందుతావు అన్నాక అతనికి ఇంకేం కోరిక ఉంటుంది? ఏ కర్మ చేయాల్సి వుంటుంది?

11. **సర్వభూతస్థమాత్మానం। సర్వభూతాని చాత్మని।**
**సంపశ్యన్ బ్రహ్మ పరమం। యాతి నాన్యేన హేతునా॥** – కైవల్యమ్ 10

బ్రహ్మను స్పష్టంగా అర్థం చేసుకుంటే మోక్షం పొందుతాడు.

ఉపనిషత్తుల్లోనే కాక తక్కిన శాస్త్రాల్లో కూడా ఇదే బోధ వస్తుంది.

**నాన్యః పంథా విద్యతేఽయనాయ** – పురుషసూక్తమ్

బ్రహ్మజ్ఞానం పొందాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గం. వేరే మార్గాలు లేవు.

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః॥** – గీత 5.15
**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః।** – గీత 5.16

అజ్ఞానంవల్ల సమస్యలు ఏర్పడినప్పుడు ఆ సమస్యలు జ్ఞానం కలిగితేనే తొలగుతాయి.

అలా శ్రుతి, స్మృతి, ఇతిహాస, పురాణాలు, ప్రకరణగ్రంథాలు అన్నీ జ్ఞానం పొందితే చాలు, మోక్షం కలుగుతుందని ఘోషిస్తున్నాయి. పైన చూసిన వాక్యాలు ముఖ్యమైన ఉపనిషత్తుల్లోంచి, గీతలోంచి ఉదాహరణగా చూపించటానికి ఏరిన కొన్ని వాక్యాలు మాత్రమే. ఇలాంటి వాక్యాలు ఈ గ్రంథాలన్నింటిలోనూ వేలాదిగా ఉన్నాయి.

దీనివల్ల అర్థం చేసుకోవాల్సింది వేదాంతవాక్యాలు సిద్ధబోధకవాక్యాలు నిజమే, కాని అవి అప్రయోజనమూ కాదు, అందువల్ల అప్రమాణమూ కాదు; వాటిని కార్యబోధక వాక్యాలతో కలుపనవసరమూ లేదు. ఎందుకంటే వేదాంతవాక్యాలు జ్ఞానం కలుగజేస్తాయి. జ్ఞానం పొందితే చాలు మోక్షం కలుగజేస్తాయి.

ఇది విస్తారంగా చూస్తే పూర్వమీమాంసకుల అభిప్రాయాలకు, శంకరాచార్యులవారు ఇచ్చిన జవాబు. ఇప్పుడు వివరంగా వారి మధ్య జరిగిన వాదోపవాదనలను చూద్దాము.

## పూర్వమీమాంసకులతో వాదోపవాదాలు

**పూర్వమీమాంస వాదన 1. వేదాంతం నేర్చుకుంటే చాలదు; దాని తర్వాత కర్మ చెయ్యాలి.** వేదాంతం సిద్ధబోధక వాక్యాలు కాబట్టి వాటిని కార్యబోధక వాక్యాలతో కలపాలని పూర్వమీమాంసకులు అంటారు. కాకపోతే ఏ కార్యబోధక వాక్యాలతో కలపాలో వారిలో వారికి చిన్న భేదాభిప్రాయాలు ఉన్నాయి.

**కర్మ సంబంధం వినా వేదాంతస్య స్వతః ప్రామాణ్యం నాస్తి**

కర్మకాండతో కలపాలి – భాట్టమతం ప్రతిపాదన
జ్ఞానకాండలోని ఉపాసనతో కలపాలి – ప్రాభాకరమతం ప్రతిపాదన

**శంకరులవారి జవాబు** – శంకరులవారికి రెండూ ఒకటే. అంటే వేదాంత వాక్యాలను అటు కర్మకాండతోనూ కలుపనవసరం లేదు, ఉపాసనతోనూ కలుపనవసరం లేదు అంటారు. ఈ విషయాన్ని మూడు కోణాల్లోంచి చెబుతారు.

ఎ) **కర్మ సంబంధం అవసరం లేదు** – వేదాంతమే స్వయంగా ప్రయోజనం ఇస్తుంది కాబట్టి ఆ వాక్యాలను కర్మతో కాని, ఉపాసనతో కాని కలుపనవసరం లేదు. ఇప్పుడు అన్ని ఉపనిషత్తుల్లోంచి దానికి జవాబు చూశాము. వేదాంతమే ముఖ్య పురుషార్థమైన మోక్షాన్ని ఇస్తుంది.

**స్వతః పురుషార్థక ప్రధాన సమర్థః**

ఈ విషయం అనుభవప్రమాణం, శ్రుతిప్రమాణం కూడా నిరూపిస్తున్నాయి.

**అనుభవ ప్రమాణం:** రజ్జుసర్పభ్రాంతి – తాడును చూసి పాము అని కలిగిన భ్రమ, అది తాడు అని తెలియగానే పోతుంది.

జ్ఞానమాత్రేన మోక్షఫలం భవతి

**శ్రుతి ప్రమాణం:**

**జ్ఞానాదేవ కైవల్యం** – జ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది.

**బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి**– బ్రహ్మ జ్ఞాని బ్రహ్మ అవుతాడు.

బి) **కర్మ సంబంధం కుదరదు** – కర్మవల్ల మోక్షం వస్తుందనుకుంటే, వేదాంతం కర్మను నిందించదు –

**న కర్మణా న ప్రజయా ధనేన**
**త్యాగేనైకే అమృతత్వమానశుః** – కైవల్యమ్ 3

**ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపాః**
**అష్టాదశోక్తమవరం ఏషు కర్మ** – ముండకమ్ 1.2.7

ఈ విధంగా కర్మను చేసే వ్యక్తిని మూఢుడు అని నిందించాక, అందువల్ల కర్మ చెయ్యండి అని ఎలా చెప్పగలదు? కాబట్టి కర్మ సంబంధం కుదరదు.

సి) **కర్మ సంబంధం అసాధ్యం** – కర్మ కాని ఉపాసన కాని చెయ్యటానికి అవసరమైన ద్వైతాన్ని నిషేధిస్తుంది వేదాంతం.

**ద్వైతభావన**– కర్మ చేయాలంటే కర్తృకరణాది భేదం ఉండాలి. కాని

**నేహ నానాస్తి కించన**

అంటుంది వేదాంతం. ఉన్నదంతా ఒకటే అయితే ద్వైతం ఎలా వస్తుంది. అలాగే ఉపాసన చేయటానికి కూడా ఉపాస్య, ఉపాసక భేదం ఉండాలి. అద్వైతజ్ఞానం పొందాక, ద్వైతభావనతో ఉపాసన ఎలా చేస్తారు? అలా చేస్తే అంజనం అంటే నాకు తెలియదా, అది పసుపులాగా తెల్లరంగులో ఉంటుంది అని చెప్పినట్టు అవుతుంది.

**కర్తృత్వభావన** – కర్మ చేయాలంటే కర్తృత్వభావన ఉండాలి. వేదాంతం నువ్వు అకర్తా అంటుంది.

**వర్ణాశ్రమ ధర్మాలు** – వర్ణాశ్రమ ధర్మాలు పాటించాలి. గృహస్థు మాత్రమే యజ్ఞాలు చెయ్యగలడు. రాజు మాత్రమే రాజసూయయాగం చెయ్యగలడు. కాని వేదాంతంలో ఈ వర్ణాశ్రమ ధర్మాలు ఉండవు.

అందువల్ల కర్మతో జ్ఞానాన్ని కలపనవసరం లేదు, కుదరదు, అసాధ్యం కూడా. కర్మకాండలోని సిద్ధబోధక వాక్యాలను కార్యబోధక వాక్యాలతో కలపాలి కాని జ్ఞానకాండలో అవసరం లేదు. కర్మకాండలో చూశాము వాయువు వేగంగా వెళుతుంది అనే వాక్యాన్ని. అందువల్ల వాయువుకు తెల్లపశువును ఇవ్వండి వాక్యంతో కలపాలని చూశాము. ఈ నియమం ఇక్కడ అవసరంలేదు.

2. **బ్రహ్మ నాస్తి** – పూర్వమీమాంసకులు అసలు బ్రహ్మ లేనేలేదు అంటారు.

**శంకరులవారి జవాబు** – శంకరాచార్యులవారు దీన్ని తీవ్రంగా ఖండిస్తారు. **కేవలం సాహస మాత్ర** అంటారు. పూర్వమీమాంసా శాస్త్రములో శాస్త్రంయొక్క తాత్పర్య నిర్ణయం చెయ్యటానికి షడ్లింగవిచారణ అని ఒకటి ఉంది. ఆ షడ్లింగవిచారణద్వారా బ్రహ్మ వేదాంతసారం అని నిర్ణయించటం జరిగింది. తత్తుసమన్వయాత్ అనే ఈ సూత్ర వివరణలో ఈ షడ్లింగవిచారణ చూశాము. వారు చెప్పిన మీమాంసాసూత్రము ప్రకారం బ్రహ్మ అస్తి అని నిరూపిస్తే బ్రహ్మ నాస్తి అని ఎలా చెప్పగలరు వారు?

ఒకవేళ వారు వేదాన్ని నమ్మరని అనేటట్టయితే, వారు చెప్పే స్వర్గాన్ని కూడా నమ్మకూడదు. స్వర్గలోకానికి వెళ్ళే జ్యోతిష్ఠోమ యజ్ఞాలు కూడా చెయ్యకూడదు. వేదం చెప్పింది కాబట్టి స్వర్గాన్ని నమ్మితే, వేదం చెప్పింది కాబట్టి బ్రహ్మను కూడా నమ్మితీరాలి. బ్రహ్మ లేదు అని ఎలా చెప్పగలరు? అది సాహసం మాత్రమే!

**బ్రహ్మ అస్తి వేదాంత తాత్పర్యవిషయత్వాత్**

3.ఎ) **బ్రహ్మ సాధ్యం కాదు, సాధనం కాదు** – పూర్వమీమాంసకులు బ్రహ్మనాస్తి అని ఎందుకు చెబుతున్నారంటే బ్రహ్మ ఏదైనా లక్ష్యం పొందటానికి సాధన కాదు; బ్రహ్మే లక్ష్యంగా పొందే సాధ్యం కూడా కాదు.

**సాధ్యసాధన విలక్షణం బ్రహ్మ**

అని వేదాంతమే అంటున్నది. అలాంటి సాధ్యమూ కాని సాధనమూ కాని బ్రహ్మ ఎలా ఉంటాడు?

**శంకరులవారి జవాబు** – బ్రహ్మ సాధనమూ కాదు, సాధ్యమూ కాదు నిజమే. బ్రహ్మ సాధ్యసాధన విలక్షణం అని వేదాంతం చెప్పిందంటే దాని అర్థం ఏమిటి? సాధన,సాధ్యం కాకుండా ఇంకొకటి ఉంది.అది సాధకుడు. ఆ సాధకుడు నువ్వే.

ఇప్పుడు బ్రహ్మ నాస్తి అని పూర్వమీమాంసకుడు అంటే సాధకుడు లేడని చెప్పినట్టు అవుతుంది. సాధకుడు లేడు అంటే నువ్వు లేనట్టు అవుతుంది. నువ్వు లేకపోతే మాట్లాడలేవు కదా. అప్పుడు అది సర్దార్జీ జోక్‌లాగా అవుతుంది.

ఒక టాక్సీడ్రైవర్ ఒక అమాయకుడిని అడిగాడుట, 'నా కుటుంబంలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఒకరు నా భార్య, ఇంకొకరు మా అబ్బాయి, మూడవది ఎవరు?'

ఆ అమాయకుడు రకరకాల సమాధానాలు చెప్పాడుట – నీ తండ్రి, నీ తల్లి అని. ఎన్ని చెప్పినా, ఏదీ సరియైనది కాదు. చివరకి టాక్సీడ్రైవరే చెప్పాడుట, 'నా కుటుంబంలో ముగ్గురిలో ఒకరు నా భార్య, ఇంకొకరు మా అబ్బాయి, మూడవది నేను.' తత్ త్వమ్ అసి. అది నేనే.

ఆ అమాయకుడికి ఇది చాలా నచ్చింది. వెళ్ళి తన తోటి సర్దార్జీని ఇదే ప్రశ్న వేశాడు. అతను కూడా ఇతనిలాగే అనేక జవాబులు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఇంక చివరకి, 'నావల్ల కాదు, నువ్వే చెప్పు,' అన్నాడు. ఆ అమాయకుడు విజయగర్వంతో 'టాక్సీడ్రైవర్ మూడో వ్యక్తి,' అన్నాడు. ఎందుకు? టాక్సీడ్రైవర్ 'నేనే ఆ మూడవవ్యక్తిని,' అన్నాడు కాబట్టి. బుద్ధిపెట్టి ఆలోచించకపోతే ఇలాగే ఉంటుంది.

సృష్టిలో మూడు వస్తువులు ఉన్నాయి. అవి సాధకుడు, సాధ్యం, సాధన. బ్రహ్మ విషయంలో వేదాంతం రెండు కొట్టివేసింది. బ్రహ్మ సాధ్యం కాదు, సాధన కాదు అంది. అనగానే వెంటనే పూర్వమీమాంసకుడు ఆ అమాయకుడిలాగా బ్రహ్మ నాస్తి అనుకున్నాడు. మూడవ వస్తువు ఏదో తెలుసుకోలేపోయాడు. బ్రహ్మ ఆత్మరూపంగా ఉన్నాడు.

**సాధకః అహం బ్రహ్మ అస్మి**

నేతినేతి వాక్యాలద్వారా బ్రహ్మ సాధన కాదు, సాధ్యం కూడా కాదు. బ్రహ్మ సాధన సాధ్యాలకు విలక్షణం; బ్రహ్మ సిద్ధవస్తువు; సాధకుడే బ్రహ్మ అని శాస్త్రం నేర్పిస్తుంది.

అందువల్ల బ్రహ్మను నేనే. బ్రహ్మ నాస్తి అంటే నేను లేను అని చెప్పినట్టు అవుతుంది. అది వ్యతిరేక వాక్యం అవుతుంది. ఎందుకంటే నేను లేను అని

చెప్పటానికి నేను ఉండాలి. అందువల్ల బ్రహ్మ లేదు అని ఎవరూ చెప్పరు. **బ్రహ్మ సాధ్యం కాదు, సాధన కాదు; బ్రహ్మ సాధకుడు.**

3. బి) **బ్రహ్మ సాధ్యం కాదు, సాధన కాదు కాబట్టి బ్రహ్మవల్ల ప్రయోజనం కూడా లేదు.**

**శంకరులవారు జవాబు** - బ్రహ్మ సాధకుడు. సాధకుడు అలా తానే బ్రహ్మ అని నేర్చుకోవటంవల్ల ప్రయోజనం కూడా ఉంది. నా బ్రహ్మత్వ హెూదా తెలుసుకుంటే నా జీవత్వభావన పోతుంది. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం నా అబ్రహ్మత్వాన్ని పోగొడుతుంది. అబ్రహ్మత్వం అంటే జీవత్వం.

రజ్జుసర్పభ్రాంతిలో ఎప్పుడైతే అక్కడ ఉన్నది తాడు అని తెలుస్తుందో, అప్పుడు అది పాము అనే భ్రమ పోతుంది. అంటే సాంకేతికపరంగా చూస్తే, అధిష్ఠానజ్ఞానం కలిగితే అధ్యాసనివృత్తి అవుతుంది. అదేవిధంగా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం కలిగితే అహం జీవ అస్మి అనే భ్రమ పోతుంది. అందువల్ల బ్రహ్మ లేదని స్వప్నంలో కూడా భావించకూడదు. పైగా బ్రహ్మజ్ఞానం అత్యుత్తమమైన పురుషార్థాన్ని ఇస్తుంది. అంటే మోక్షాన్ని ఇస్తుంది.

**బ్రహ్మ అస్తి। ఆత్మరూపేణ అస్తి॥**
**ఆత్మనః బ్రహ్మత్వజ్ఞానేన ఆత్మని అధ్యస్థ జీవభావనివృత్తిః భవతి**
**జీవభావనివృత్తిః ఏవ మోక్షరూప పరమపురుషార్థః**

4. **బ్రహ్మ ఆత్మ అయితే స్వయంప్రకాశక ఆత్మ గురించి శాస్త్రం కొత్తగా చెప్పేది ఏముంది?** నా గురించి నాకు తెలుసు, శాస్త్రం కొత్తగా చెప్పేది ఏం ఉంది? ప్రమాణం అంటే మనకు తెలియని కొత్త విషయాన్ని చెప్పాలి కదా?

**శంకరులవారి జవాబు** - ఆత్మ ప్రసిద్ధమే కాని జీవాత్మరూపంగా ప్రసిద్ధం. అంటే ఆత్మ గురించి జీవాత్మగా తెలుసు, పరమాత్మగా తెలియదు.

**అహంకారరూపేణ ప్రసిద్ధః న తు సాక్షిరూపేణ**
**త్వం పద వాచ్యార్థరూపేణ ప్రసిద్ధాః న తు లక్ష్యార్థ**
**సామాన్యజ్ఞానమేవ వర్తతే పరంతు రూపేణ విశేష జ్ఞానం నాస్తి**
**తస్మాత్ ఏవ అధ్యాసః అభివర్తతే**

నేను ఉన్నానని నాకు తెలుసు. బ్రహ్మ నిర్వచనం సత్ చిత్ ఆనందం. అందులో నాకు నా సద్రూపం తెలుసు, నా చిద్రూపం తెలుసు. కాని అతి ముఖ్యమైన

విషయం తెలియదు. అంటే నా ఆనందస్వరూపం నాకు తెలియదు. అంటే నా సామాన్య అంశం తెలుసు, విశేష అంశం తెలియదు. అధ్యాసభాష్యంలో ఈ పదాలను చూశాము. రజ్జుసర్పభ్రాంతిని చూస్తే –

| | |
|---|---|
| అక్కడ ఉన్నది తాడు | – వాక్యం |
| అక్కడ ఉన్నది | – సామాన్య అంశం, అనావృత అంశం |
| తాడు | – విశేష అంశం, ఆవృత అంశం |

అక్కడ ఏదో ఉందని తెలుసు. అంటే అందులో సామాన్య అంశం తెలుసు. అది అనావృత అంశం అంటే కప్పబడిలేదు. కాని అది తాడు అనే విశేషజ్ఞానం లేదు. ఎందుకంటే అది కప్పబడివుంది. అందువల్ల అది పాము అని పొరపడుతున్నాము. ఇప్పుడు ఈ సూత్రాన్ని అహం బ్రహ్మ అస్మికి అన్వయిద్దాము.

| | |
|---|---|
| అహం బ్రహ్మ అస్మి | – వాక్యం |
| అహమ్ అస్మి | – సామాన్య అంశం, అనావృత అంశం |
| బ్రహ్మ | – విశేష అంశం, ఆవృత అంశం |

అలాగే నేను సత్‌ను, చిత్‌ను అని నాకు తెలుస్తున్నది. అంటే నా సామాన్య అంశం నాకు తెలుస్తున్నది; కాని విశేష అంశం అయిన నా బ్రహ్మత్వం తెలియటం లేదు. బ్రహ్మత్వం హోదా తెలియక నేను జీవత్వం ఆపాదించుకుంటున్నాను. అంటే విశేష అంశంలో పొరపాటు పడుతున్నాను. అంటే సంసారం అనే అధ్యాసలో ఉన్నాను.

**బ్రహ్మత్వ విశేషజ్ఞాన అభావత్వాత్ ఆత్మని సంసారిత్వ అధ్యాసః భవతి**

అందువల్ల వేదాంతం నాకు సామాన్యజ్ఞానం ఇవ్వనవసరం లేదు; విశేషజ్ఞానం ఇవ్వాలి. నేను అహంకారం అనుకుంటున్నాను. **నేను సాక్షి చైతన్యాన్ని అని నాకు వేదాంతం బోధించాలి.**

5. **కర్మకాండ మాత్రమే ప్రమాణం, జ్ఞానకాండ కాదు–** జ్ఞానకాండవల్ల స్వంతంగా ప్రయోజనం లేదు. దాన్ని కర్మకాండలోని వాక్యాలతో కలపాలి. కర్మకాండను పూలతో పోలిస్తే, జ్ఞానకాండను వాటిలో ఉన్న దారంతో పోలుస్తున్నాడు పూర్వమీమాంసకుడు. దారానికి విడిగా విలువ లేదు; ఉత్త దారాన్ని ఎవరూ తలలో పెట్టుకోరు; అది పూలతో కూడితేనే దానికి విలువ ఏర్పడుతుంది.

**శంకరులవారి జవాబు** – ఇంతవరకూ శంకరాచార్యులవారు అద్వైత వేదాంతాన్ని సమర్థించుకుంటూ వస్తున్నారు. దాన్ని **డిఫెన్సివ్ ఆర్గ్యుమెంట్** అంటారు. ఏం చెప్పారు ఇంతవరకూ?

**జ్ఞానకాండ కూడా ప్రమాణమే**

ఇంతవరకూ కర్మకాండ ఒక మెట్టు పైన ఉంది, జ్ఞానకాండ దానికన్నా ఒక మెట్టు కింద ఉంది. ఇప్పుడు శంకరాచార్యులవారు వారి కర్మకాండలోని లోపాలను ఎత్తి చూపుతున్నారు. దాన్ని **అఫెన్సివ్ ఆర్గ్యుమెంట్** అంటారు.

**కర్మకాండ అప్రమాణం**

కర్మకాండ అప్రమాణం అని వారితో ఎదురు వాదిస్తున్నారు శంకరాచార్యులవారు. తన జవాబును నిరూపించటానికి వారు చూపిన ప్రమాణ నిర్వచనాన్నే తీసుకున్నారు.

**అనధిగత అబాధిత ఫలవత్ అర్థబోధకం ప్రమాణమ్**

అర్థబోధకమ్ అంటే ఒకదాని గురించి చెబుతుంది. ఇదీ ప్రమాణం నిర్వచనం. అనధిగత – ప్రమాణం బోధించే విషయం కొత్త విషయమై ఉండాలి. అబాధిత– అది చెప్పినదాన్ని వేరే ప్రమాణం ఖండించకూడదు. ఫలవత్ – దానివల్ల ఫలం కలగాలి.

ఈ మూడు నియమాలూ జ్ఞానకాండకు సరిపోతాయి.

**అనధిగతమ్** – అహం బ్రహ్మ అస్మి అని బోధిస్తుంది. అది వేరే ఏ ప్రమాణమూ బోధించలేదు.

**అబాధితమ్** – దాన్ని వేరే ఏ ప్రమాణమూ ఖండించలేదు కూడా.

**ఫలవత్** – బ్రహ్మత్వజ్ఞానం పొందితే, జీవత్వ అధ్యాస పోతుంది.

ఈ మూడు నియమాలూ సరిపోతాయి కాబట్టి, జ్ఞానకాండ ప్రమాణం. కాని ఇప్పుడు వీటిని కర్మకాండకు అన్వయించి చూద్దాము.

**అనధిగతమ్** – కొన్ని కొత్త విషయాలను బోధిస్తుంది. స్వర్గం–నరకం; పుణ్యం–పాపంవంటివి.

**ఫలవత్** – ధర్మ అర్థకామ పురుషార్థాలను తీరుస్తుంది.

ఈ రెండు నియమాలు సరిపోయాయి, కాని మరొక నియమం మాటేమిటి?

**అబాధితమ్** – దాన్ని వేరే ఏ ప్రమాణమూ ఖండించకూడదు. కాని వేదంలోని జ్ఞానకాండం కర్మకాండను ఖండిస్తుంది. అలా ఎలా చెప్పగలము? ముఖ్య అంశంలోనే ఈ జ్ఞానకాండ, కర్మకాండ విభేదిస్తాయి. జ్ఞానకాండ అద్వైతాన్ని బోధిస్తే, కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తుంది. కర్మకాండలో కర్త, కర్మ, కరణం, ఫలం అని భిన్నంగా ఉంటాయి.

**నేహ నానాస్తి కించన**

నానాత్వం అసలు లేదు అంటుంది జ్ఞానకాండ. ఎందుకంటే బ్రహ్మే అంతటా ఉన్నాడు. బ్రహ్మే తూర్పు, పడమర, దక్షిణం, ఉత్తరం, పైన, కింద, మధ్యలో అంతటా ఉన్నాడు అంటుంది ముండకోపనిషత్తు.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్**

**బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ ।**

**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం**

**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్॥** – ముండకమ్ 2.2.12

అంతటా బ్రహ్మే ఉంటే ద్వైతం ఉండటానికి ఆస్కారం ఎక్కడ ఉంది? దీన్నిబట్టి అజ్ఞానంలో ద్వైతం ఉంది కాని, జ్ఞానం పొందితే పోతుందని అర్థమవుతుంది.

**అజ్ఞానకాలే ద్వైతం। జ్ఞానకాలే అద్వైతమ్॥**

అజ్ఞానకాలంలో ఉన్నది ప్రమాణమా అప్రమాణమా?

**అజ్ఞానకాలే సర్పః జ్ఞానకాలే రజ్జుః**

అజ్ఞానంలో ఉన్నంతసేపూ అది పాము అనుకుని పొరపాటు పడ్డాము; జ్ఞానం పొందగానే అది పాము కాదు, తాడు అని తెలిసింది. ఇప్పుడు చెప్పండి. ఏది అసలైన జ్ఞానం? సర్పజ్ఞానమా? రజ్జుజ్ఞానమా? రజ్జుజ్ఞానమే. అదే విధంగా అజ్ఞానకాలంలో ద్వైతం ఉందనుకుంటాము. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందాక ద్వైతనివృత్తి జరిగి, అద్వైతంలో నెలకొంటాము. అందువల్ల కర్మకాండ అప్రమాణం.

**సః దేవానాం పశుః** – బృహదారణ్యకమ్

ద్వైతభావనలో ఉండి యజ్ఞాలు చేసే వ్యక్తి దేవతల అధీనంలో ఉంటాడు అంటుంది బృహదారణ్యకోపనిషత్తు. అంటే మర్యాదగా తిడుతున్నది.

వీటన్నిటినీబట్టి కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తుందనీ, ద్వైతాన్ని చూసిన వ్యక్తి అజ్ఞాని అనీ, ఆ విధంగా జ్ఞానకాండ కర్మకాండను కొట్టివేస్తోందనీ తెలుస్తున్నది. అంటే ప్రమాణంయొక్క నిర్వచనంలోని రెండవ అంశం కర్మకాండకు చెల్లదు.

**కర్మకాండస్య బాధితత్వాత్ అప్రమాణమ్**

కర్మకాండను జ్ఞానకాండ కాదంటుంది కాబట్టి కర్మకాండ ప్రమాణం కాదు. ఇప్పుడు పూర్వమీమాంసకులు చెప్పిన పువ్వులు, దారం ఉదాహరణలో అర్థాలు మారుతాయి. జ్ఞానకాండ కూడా ఈ ఉదాహరణనే వాడుతుంది కాని అది చెప్పే అర్థం వేరు. కర్మకాండకు విడిగా ఉనికి లేదు. దాన్ని జ్ఞానకాండతో కలిపితేనే దానికి విలువ ఏర్పడుతుంది.

**జ్ఞానకాండ సాధనత్వేన కర్మకాండస్య ప్రామాణికత్వమ్**

కర్మకాండకు విడిగా ఉనికి లేదు కాని, దాన్ని జ్ఞానకాండతో కలిపితే ప్రయోజనం ఉంది. అంటే జ్ఞానకాండ అనే సాధ్యాన్ని పొందటానికి కర్మకాండ అనే సాధనను వాడాలి. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మకాండ జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది.

పైపైన చూస్తే కర్మకాండ పాటిస్తే ధర్మఅర్థకామాలు తీరుతాయని తెలుస్తుంది. కాని వేదాంతం వాటిని అంతగా పట్టించుకోదు. ధర్మఅర్థకామాలను కలిపి ప్రేయోమార్గం అనీ, మోక్షాన్ని శ్రేయోమార్గం అనీ అంటుంది కఠోపనిషత్తు. ప్రేయోమార్గం అంటే మనకు ప్రియమైనది; శ్రేయోమార్గం అంటే మనకు శ్రేయస్కరమైనది అని అర్థం. అంటే మనం ఒక చేదుమాత్ర మింగాలంటే దాన్ని తేనెతో కలిపి తీసుకుంటాము. అదే సూత్రాన్ని శాస్త్రం కూడా పాటిస్తున్నది.

ముందే వైరాగ్యాన్ని బోధిస్తే ఎవరూ శాస్త్రానికి రారు. అందువల్ల మనకు ప్రియమైన ధర్మఅర్థకామాలను తీరుస్తుంది కర్మకాండ, దీనికి రండి అంటుంది. ఇవి మనను సుఖాలలో ముంచెత్తుతాయి నిజమే కాని, ఆ సుఖాలు శాశ్వతం కావు. అవి మనను సంసారం అనే దుఃఖసముద్రంలో పడవేస్తాయి. జైలులో 'ఏ'క్లాసు జైలు ఉందంటారు. ముఖ్యులు ఉండాల్సివస్తే అందులో ఉంచి

రాచమర్యాదలు చేస్తారు. ఎన్ని మర్యాదలు చేసినా జైలు జైలే. సంసారం కూడా అంతే. ఎంత అష్టైశ్వర్యాలలో తులతూగేటట్టు చేసినా, ఎన్ని సుఖాలలో ముంచి తేల్చినా, ఎప్పుడో అప్పుడు అవి శాశ్వతం కాదు, శాశ్వతమైనది ఇంకోటి ఏదో ఉందని మనిషి గ్రహిస్తాడు అంటుంది శాస్త్రం. అంటే వివేక వైరాగ్యాలను పొందుతాడు. అవి సాధన చతుష్టయ సంపత్తిలోని రెండు ముఖ్యాంశాలు అని చూశాము. బ్రహ్మజ్ఞానం పొందాలంటే సాధన చతుష్టయ సంపత్తి ఉండాలని ఓంప్రథమంగా మొదటి సూత్రంలోనే చూశాము.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

మొదటిసూత్రంలోని మొట్టమొదటి పదం అథ. అథ అంటే దాని తర్వాత. దేని తర్వాత? సాధన చతుష్టయ సంపత్తి పొందిన తర్వాత. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మకాండద్వారా వైరాగ్యం పొందిన తర్వాత.

**కర్మకాండ ద్వారా వైరాగ్యసిద్ధి అనంతరమ్**

మనం కర్మకాండలో మునిగితేలుతూ ఉన్నా, ఆ పురుషార్థాల వెంట పరుగులు తీసినా, ఏ రోజైనా మనకు వీటిమీద వైరాగ్యం ఏర్పడితే శాస్త్రంయొక్క ఉద్దేశం నెరవేరినట్టే అని చెప్పవచ్చు. ఎందుకంటే సాధన చతుష్టయ సంపత్తి పొందటానికి మాత్రమే శాస్త్రం కర్మకాండను నిర్దేశించింది. దానివల్ల వైరాగ్యం వస్తే ముముక్షుత్వం వచ్చి బ్రహ్మజిజ్ఞాసా ఏర్పడుతుంది.

కర్మకాండ వైరాగ్యంకోసం చెప్పబడిందని చెప్పటానికి ప్రమాణం ఏమిటి అని ప్రశ్నించవచ్చు మీరు. అనేక ప్రమాణాలు ఉన్నాయి. రెండు చూద్దాము.

ఎ) **పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥** – ముండకమ్ 1.2.12

బి) **తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి।**
**యజ్ఞేన దానేన తపసాఽనాశకేన** – బృహదారణ్యకమ్

ముండకమంత్రం ఒక వ్యక్తి అనేక యజ్ఞయాగాదులు చేశాక, **నాస్త్యకృత కృతేన**, కర్మకాండ శాశ్వతమైన ఫలాన్ని ఇవ్వదని తెలుసుకుంటాడు అంటుంది.

అక్కడితో ఆగడు; అతను సమిధలు చేత పుచ్చుకుని, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు వెళతాడు. అంటే బ్రహ్మజ్ఞానం పొందాలని గ్రహిస్తాడు. దానికి అతనికి ఉన్న అర్హత – ఆత్మానాత్మ వివేకం, వైరాగ్యం.

బృహదారణ్యకం మనిషి దాటాల్సిన దశలను వర్ణిస్తుంది. బ్రహ్మచారి వేదాధ్యయనం చేస్తాడు; గృహస్థు యజ్ఞాలు, దానాలు చేస్తాడు; వానప్రస్థ ఆశ్రమంలో ఉన్నవ్యక్తి భోజనంమీద ఆసక్తి లేకుండా ఉంటాడు అంటే భైక్షచర్యం చేస్తాడు. ఇవన్నీ దాటి సన్న్యాసాశ్రమానికి వస్తాడు. వివిదిషంతి అంటే జ్ఞానయోగంమీద శ్రద్ధ కలుగుతుంది. సన్న్యాసం అంటే అక్షరాలా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. ఆంతరంగ సన్న్యాసం ఉంటే చాలు. అంటే వైరాగ్యం పెంచుకోవాలి. ముముక్షుత్వం అంటే మోక్షంమీద ఇచ్ఛ. ముముక్షుత్వంయొక్క తీవ్రత, వైరాగ్యంయొక్క తీవ్రతమీద ఆధారపడివుంటుంది.

వైరాగ్యం రాకపోతే ఏం చేయాలి? వైరాగ్యం వచ్చేదాకా ఇంకా కర్మకాండలో ప్రయత్నించాలి. వైరాగ్యం రావటానికి మరికొన్ని రోజులు పట్టవచ్చు, నెలలు పట్టవచ్చు, సంవత్సరాలు పట్టవచ్చు, జన్మలే పట్టవచ్చు. కాని వైరాగ్యం వస్తేనే జ్ఞానకాండమీద ఇచ్ఛ ఏర్పడుతుంది.

ఉదాహరణకు ఒక వ్యక్తికి ఏదో అనారోగ్యం వచ్చిందనుకోండి. అతను మందులు తీసుకుంటుంటాడు. ఎవరో గుడికి కూడా వెళ్ళు, దైవసహాయం కూడా ఉండాలంటే కాదనలేక వెళతాడు కాని అంత శ్రద్ధ ఉండదు. నెమ్మదిగా ఆరోగ్యం క్షీణిస్తూ వస్తుంది. అల్లోపతి, హోమియోపతి, నేచురోపతి ఎన్ని ప్రయత్నించినా ఫలితం శూన్యం. అంతకంతకూ ధైర్యం సన్నగిల్లుతుంది. ఇక్కడ ధైర్యం సన్నగిల్లిన కొద్దీ అక్కడ వెంకటాచలపతికి చేసే పూజయొక్క తీవ్రత పెరుగుతూ వస్తుంది.

**నీవే తప్ప ఇతః పరంబెరుగన్**

అనే స్థితికి వస్తాడు. జ్ఞానవిషయంలో కూడా అలాంటి తీవ్రత రావాలి. వైరాగ్యం ఎంత ఎక్కువ ఉంటే, ముముక్షుత్వం అంత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల జ్ఞానకాండకు రావటానికి తోడ్పడుతుంది కర్మకాండ.

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే – గీత 4.33**

కర్మకాండను మనం నిందించటం లేదు. అది కూడా ముఖ్యమే. ముఖ్యం కాబట్టే వేదపూర్వభాగంలో అనేక యజ్ఞయాగాదులు చెప్పబడ్డాయి. కాని వేదపూర్వభాగంతోనే ఆగిపోకూడదు, వేదఅంతభాగానికి కూడా రావాలి. వేదఅంతభాగం అంటే జ్ఞానకాండ.

**జ్ఞానకాండకు రానిదే కర్మకాండ అసంపూర్ణం**
**కర్మకాండ లేనిదే జ్ఞానకాండ అసంభవం**

ఈ సూత్రాన్ని మర్చిపోకూడదు. లేదు నేను జ్ఞానకాండకు రాను, జీవితాంతం కర్మకాండలోనే ఉండిపోతాను అని ఎవరైనా అంటే శాస్త్రం అతన్ని బలవంతపెట్టదు. కాని ముందే చూసినట్లుగా అతని ప్రయాణం అసంపూర్ణం అవుతుంది. అతను శాశ్వతఫలమైన మోక్షాన్ని పొందలేడు. కర్మకాండను జ్ఞానకాండ నిషేధిస్తుంది కాబట్టి అది ప్రమాణం కాదు.

**కర్మకాండస్య బాధితత్వాత్ అప్రమాణమ్**

దీనితో పూర్వమీమాంసకులతో శంకరాచార్యులవారి వాదన అయిపోయింది. పూర్వమీమాంసకులతో భాట్టమతము, ప్రాభాకరమతము వస్తాయని చూశాము.

వీరిద్దరినీ ఖండించాక, శంకరులవారు ఇంకొక పూర్వపక్షితో వాదోపవాదాలు చేస్తున్నారు.

## వృత్తికారమతంతో వాదోపవాదాలు

ఈ వృత్తికారమతం ముందు చూసిన రెండు మతాలకన్నా శక్తివంతమైనది. ఇది కూడా పూర్వమీమాంసకులకు దగ్గరగానే ఉంటుంది. దీన్ని కూడా శంకరుల వారు ఖండించి గెలుస్తారు.

వృత్తికారుడు అంటే సంక్షిప్తంగా వ్యాఖ్యానం చేసేవాడు. ఈ వ్యాఖ్యాత శంకరాచార్యులవారి సమయంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి అయివుంటాడు. అతని పేరు ఎక్కడా చెప్పబడలేదు కాబట్టి మనం కూడా వృత్తికారుడనే వ్యవహరిద్దాము.

వృత్తి అంటే మామూలుగా ఆలోచన అని అర్థం. ఘటవృత్తి, పటవృత్తి అంటాము. వృత్తికి ఇంకో అర్థం కూడా ఉంది. అది వ్యాఖ్యానం. ఇది మామూలు వ్యాఖ్యానానికి, భాష్యానికి భిన్నంగా ఉంటుంది. అందువల్ల దీన్ని లఘువ్యాఖ్యానం

అనవచ్చు. వృత్తికారుడు అంటే లఘువ్యాఖ్యానం చేసేవ్యక్తి. వృత్తికారమతం అంటే బ్రహ్మసూత్రములమీద వ్యాఖ్యానం చేసే మతాలలో ఒకటి. దీన్నిబట్టి ప్రస్థానత్రయంమీద మొట్టమొదట వ్యాఖ్యానం చేసినది శంకరాచార్యులవారు కాదని తెలుస్తున్నది. ఆయన ముందుకూడా కొంతమంది వ్యాఖ్యానం చేశారు.

## వృత్తికారమతం

ఈ వృత్తికారునితో శంకరాచార్యులవారు చేసిన వాదోపవాదనలను చూసేముందు అసలు వృత్తికారమతం అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఆ మతం కొంతమేరకు అద్వైతాన్ని అంగీకరిస్తుంది. కొంతమేరకు పూర్వమీమాంసకుల వాదనలా ఉంటుంది. అదెలా?

పూర్వమీమాంసకుల వాదనసారం – **నిర్గుణబ్రహ్మ నాస్త్యేవ అప్రయోజనత్వాత్**

బ్రహ్మవల్ల ప్రయోజనం లేదు కాబట్టి బ్రహ్మ నాస్తి అన్నారు వారు.

వృత్తికారుడు మనతో ఈ క్రింది విషయాలలో ఏకీభవిస్తాడు.

ఎ) బ్రహ్మ అస్తి – బ్రహ్మ ఉన్నాడు.

బి) బ్రహ్మణా శాస్త్రయోనిత్వం – బ్రహ్మకు శాస్త్రం ప్రమాణం, వేరే ప్రమాణానికి అందదు.

సి) తత్తు సమన్వయాత్ – ఉపనిషత్తుల సారం బ్రహ్మ అని ఉపక్రమాది షడ్లింగవిచారణ నిరూపిస్తుంది.

**బ్రహ్మణః శాస్త్ర ప్రమేయత్వమపి తేన అంగీక్రియతే**

శాస్త్రప్రమాణంద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొందవచ్చు. ఇంతవరకు అద్వైతసిద్ధాంతంతో ఏకీభవిస్తున్నాడు కాని, మళ్ళీ పూర్వమీమాంసకుల వైపుకి వెళ్ళిపోయాడు.

**కేవల జ్ఞానేన మోక్షః న భవేత్। బ్రహ్మ ఉపాసనయా మోక్షః భవతి**

ఇప్పుడు వృత్తికారునితో వాదోపవాదాలు చూద్దాము (మన వీలుకోసం వాదనల సంఖ్య వరుసగా ఇవ్వటం జరిగింది)

**6. బ్రహ్మజ్ఞానం పొందాక బ్రహ్మ ఉపాసన చేయాలి.**

వేదాంతం బ్రహ్మ గురించి బోధించి, ఆ బ్రహ్మమీద ఉపాసన చేయమంటుంది అంటాడు వృత్తికారుడు. ఉపాసన కూడా కర్మ కిందికే వస్తుందని చూశాము. అందువల్ల ఈ ఉపాసనరూప కర్మ చేస్తే ఆ సాధకునికి అసాధారణ పుణ్యం వస్తుంది. ఆ పుణ్యంవల్ల మాత్రమే మోక్షం వస్తుంది. తన ఈ వాదనను

సమర్థించుకోవటానికి అతను కూడా పూర్వమీమాంసకులు ఉటంకించిన సూత్రాన్నే ఉటంకిస్తాడు.

**ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**

వేదాంతం నేర్చుకుంటే చాలదు. నేర్చుకున్నదానికి సంబంధించిన కర్మ చేయాలి. కర్మకాండలో అనేక యజ్ఞాలు చేస్తారు; ఉపాసనకాండలో అనేక దేవతలమీద ఉపాసనలు చేస్తారు; కాని జ్ఞానకాండలో ఈ ఉపాసనలు, భిన్నదేవతలమీద ఉపాసనలుకాదు, బ్రహ్మమీద ఉపాసన అంటాడు అతను. కేవలజ్ఞానం మోక్షాన్ని ఇవ్వదు వరకూ పూర్వమీమాంసకుల వాదనతో అంగీకరిస్తాడు కాని దేనితో కలపాలి అనే అంశంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. భాట్టమతం కర్మకాండతో కలపాలని అంటే, ప్రాభాకరమతం వేదాంతంలోనే ఉన్న ఉపాసనలతో కలపాలి అన్నాయని చూశాము. వాటికి శంకరాచార్యులవారి జవాబులు కూడా చూశాము. ఇప్పుడు వృత్తికారమతం – కర్మతోనూ కాదు, దేవతల ఉపాసనతోనూ కాదు కలపాల్సింది; బ్రహ్మజ్ఞానం పొందాక బ్రహ్మ ఉపాసన చెయ్యాలి అంటుంది. పైగా తన వాదనను బలపరచుకోవటానికి, ఉపనిషత్తు వాక్యాలను ఉటంకిస్తున్నాడు వృత్తికారుడు.

**ఆత్మా ఇత్యేవ ఉపాసీత** – బృహదారణ్యకమ్

ఉపాసీత పదం వాడింది ఉపనిషత్తు. అందువల్ల బ్రహ్మ ఉపాసన చేయాలి. దానిద్వారా పుణ్యం పొంది, ఆ పుణ్యంద్వారా మోక్షం పొందుతాము అనేది వృత్తికారుని వాదన.

**శంకరులవారి జవాబు** – మరి అయితే కేవలజ్ఞానం పొందితే మోక్షం వస్తుందని సూచించే వాక్యాల మాటేమిటి?

**తరతి శోకమాత్మవిత్** – ఛాందోగ్యమ్ 7.1.3

**బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి** – ముండకమ్ 3.2.9

ఇంతకుముందు ఇలాంటి వాక్యాలెన్నో ఉపనిషత్తులనుంచీ, భగవద్గీతనుంచీ చూశాము. కాబట్టి **జ్ఞానం పొందితే చాలు మోక్షం వస్తుంది.**

7. **వేద అంటే ఉపాసన.** ఉపనిషత్తులోని మంత్రాలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. వేద అనే పదం జ్ఞానానికీ వర్తిస్తుంది, ఉపాసనకూ వర్తిస్తుంది. ఇక్కడ ఉపాసన అని తీసుకోవాలి.

**య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద।** – శీక్షావల్లీ
ఇక్కడ వేద అంటే ఉపాసీత అని అర్థం.

**య ఏవం వేద। క్షేమ ఇతి వాచి।** – భృగువల్లీ

ఇక్కడ వేద అంటే ఉపాసన చెయ్యి అని అర్థం.

**బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి।**

బ్రహ్మజ్ఞాని బ్రహ్మ అవడు. ఎందుకంటే కేవలం జ్ఞానం పొందితే మోక్షం రాదు; బ్రహ్మ ఉపాసన చేస్తేనే మోక్షం వస్తుంది అని ఈ వాక్యం అర్థం అంటారు.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్।**

ఇక్కడ కూడా అంతే. బ్రహ్మజ్ఞాని మోక్షం పొందదు. బ్రహ్మవిత్ అంటే బ్రహ్మ ఉపాసకుడు. అందువల్ల

**బ్రహ్మ ఉపాసకః ఆప్నోతి పరమ్**

అని మార్చాలి. అలాగే

తరతి శోకమాత్మవిత్‌ని
ఆత్మ ఉపాసకః శోకం తరతిగా మార్చుకోవాలి.

అందువల్ల ఎక్కడెక్కడ జ్ఞానం అనే అర్థం వస్తుందో, అక్కడంతా దాన్ని ఉపాసనగా మార్చుకోవాలి.

**యస్మిన్సర్వాణి భూతాని। ఆత్మైవాభూద్విజానతః**

విజానతః అన్నాకూడా ఉపాసన చేసిన వ్యక్తి అని అర్థం అంటాడు వృత్తికారుడు. ఆ విధంగా అంతకుముందు మనం అన్ని ఉపనిషత్తుల్లోంచి ఇచ్చిన వాక్యాలను తిరగరాసి జ్ఞానం పొందితే అని అర్థం వచ్చినచోటల్లా ఉపాసన చేస్తే అని మార్చాడు. అందువల్ల అతని వాదన కేవలజ్ఞానంతో మోక్షం రాదు, బ్రహ్మ ఉపాసన చెయ్యాలి.

**బ్రహ్మ ఉపాసనయా మోక్షఫలం లభతి**
**కేవల జ్ఞానేన కిమపి ప్రయోజనం నాస్తి**

**శంకరులవారి జవాబు** – దీనికి జవాబు అంతకుముందు కూడా చూశాము. నిజమే అసలు సూత్రం అయితే కేవలం జ్ఞానంవల్ల ఫలం రాదు.

**కేవల జ్ఞానేన ఫలం నాస్తి**

కాని ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది. ప్రతి ఉత్సర్గకూ ఒక అపవాదం ఉంటుంది. దానికి ఉదాహరణ – రజ్జుసర్పభ్రాంతి. తాడును చూసి పాము అని పొరపడతాము. కాని లైటు వేసి చూస్తే అది పాము కాదు, తాడు అని తెలిసేసరికి పాము భయం, దాని ద్వారా కలిగిన కంపనం కూడా, పోతుంది.

అసాధారణ సందర్భాలలో జ్ఞానంవల్లనే ఫలం పొందవచ్చు.

8. **బ్రహ్మజ్ఞానం అసాధారణ సందర్భంలోకి రాదు**

అసాధారణ సందర్భాలలో జ్ఞానంవల్లనే ఫలం పొందవచ్చని మేమూ ఒప్పుకుంటాము అంటాడు వృత్తికారుడు. రజ్జుసర్పభ్రాంతిని అలాంటి అసాధారణ సందర్భంగా అతను కూడా ఒప్పుకుంటాడు కాని బ్రహ్మజ్ఞానం అందులోకి రాదు. కాబట్టి బ్రహ్మజ్ఞానం పొందాక ఉపాసన చెయ్యాలి. దీనికి అతను అనుభవ ప్రమాణాన్ని, శ్రుతిప్రమాణాన్ని చూపిస్తున్నాడు.

ఎ) **అనుభవప్రమాణం** – తన వాదనను సమర్థించుకోవటానికి అతను వేదాంతం నేర్చుకున్నవారిని చూపిస్తున్నాడు. కొంతమంది తత్త్వబోధను, ఉపనిషత్తులను బాగా నేర్చుకుంటారు. వాటిల్లోంచి ఏం అడిగినా చూడకుండా చెప్పగలరు. కొన్ని కంఠతా కూడా వచ్చు. కాని వారు ముక్తపురుషులా అంటే కాదనే చెప్పాలి. వారు వేదాంతాన్ని అంత బాగా నేర్చుకున్నాకూడా సంసారులుగానే ఉంటున్నారు.

**అహం బ్రహ్మ అస్మి**
**అహం స్థూల సూక్ష్మకారణ శరీర వ్యతిరిక్తః**

ఇలాంటి వాక్యాలను చిలకపలుకులుగా పలుకుతారు. పైగా అవి పలుకుతున్నప్పుడు వారి మొహాల్లో ఆనందం ఏమాత్రం తొణికిసలాడదు. విచారంలోనే ఉంటారు. పైగా రాగద్వేషాలు ఏమాత్రం తగ్గవు. కుటుంబసభ్యులకు కూడా వీరిలో ఏమార్పూ కనబడదు. కాబట్టి కేవలజ్ఞానం ఎవరినీ మార్చదు. అంతకుముందు అతను అజ్ఞానీ సంసారి అయితే, ఇప్పుడు వేదాంతజ్ఞానీ సంసారి అవుతాడు. అంతే!

ఈ వాదన వింటే, నిజమే అనిపిస్తుంది. నెమ్మదిగా వృత్తికారమతం వైపుకి మారిపోయే ప్రమాదం కూడా ఉంది.

**బ్రహ్మజ్ఞాన అనంతరం బ్రహ్మ ఉపాసనా కర్తవ్యమ్**

బి) **శ్రుతిప్రమాణం** – బృహదారణ్యకోపనిషత్తులో బ్రహ్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందాలని వస్తుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకమ్

బ్రహ్మజ్ఞానమే మోక్షాన్ని ఇచ్చేటట్టయితే, శ్రవణ, మననాలే చాలు. కాని ఉపనిషత్తే నిదిధ్యాసితవ్య అని ప్రత్యేకించి చెప్పింది. నిదిధ్యాసనం అంటే దానిమీద ఆలోచించటం. అంటే అది కూడా ధ్యానం కిందికే అంటే ఉపాసన కిందికే వస్తుంది. ఉపాసన చేయాలి అనే కర్తవ్యాన్ని బోధిస్తున్నది.

సంస్కృత వ్యాకరణంలో తవ్యకారం కర్మ చేసితీరాలని సూచిస్తుంది. కర్తవ్యలో కర్–తవ్య ఉంది. అలా శ్రోతవ్యలో శ్రో–తవ్య; మంతవ్యలో మన్–తవ్య; నిదిధ్యాసితవ్యలో నిదిధ్యాసి–తవ్య ఉన్నాయి. వీటిని విధివాక్యాలు అంటారు. కర్మ చేసితీరాలని చెప్పే వాక్యాలను విధివాక్యాలు అంటారు. అందువల్ల బ్రహ్మజ్ఞానం ఫలాన్నివ్వదు, ఉపాసనే ఇస్తుంది.

ధర్మసూత్రములలో అంతకుముందు కూడా చూశాము కార్యబోధక వాక్యాలు మాత్రమే ప్రయోజనాన్ని ఇస్తాయి కాని సిద్ధబోధక వాక్యాలు ఇవ్వవు అని. అందువల్ల వృత్తికారుని వాదన –

**బ్రహ్మ ఉపాసనయా మోక్షః**

**జవాబు** – ఎ) వృత్తికారమతాన్ని చాలా వివరంగా ఖండించుకొస్తారు శంకరాచార్యులవారు. ముందు మోక్షంయొక్క నిర్వచనాన్ని ఇచ్చి, అటువంటి మోక్షం ఉపాసనద్వారా ఎన్నటికీ సాధ్యం కాదని నిరూపిస్తారు.

మాండూక్యోపనిషత్తులో గౌడపాదాచార్యులవారు ఉపాసన చేసేవారిని తీవ్రంగా విమర్శిస్తారు.

**ఉపాసనాశ్రితో ధర్మో జాతే బ్రహ్మణి వర్తతే**
**ప్రాగుత్పత్తేరజం సర్వం తేనాసౌ కృపణః స్మృతః** – 3.1

ఉపాసన చేసే వ్యక్తిని కృపణః అంటున్నారు. అంటే అతను దురదృష్టవంతుడు అంటున్నారు. ఈ వాక్యం చూసేసరికి మనం చాలా ఆందోళన చెందుతాము. వేదమే ఉపాసనను స్తుతిస్తుంది, మనకు ఎందరో దేవీఉపాసకులు, ఆంజనేయ ఉపాసకులు ఉన్నారు. జనులు వారిని కీర్తిస్తారు కూడా. మరి ఎందుకు ఉపాసకులను గౌడపాదాచార్యులవారు నిందించారు?

ఈ సందర్భాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఉపాసనను పూర్తిగా కొట్టివేయటం లేదు. బ్రహ్మజ్ఞానం పొందాక, మోక్షం పొందటానికి ఉపాసన చేయాలనే వాదనను మాత్రమే ఖండిస్తున్నాము. బ్రహ్మజ్ఞానం పొందేముందు చేయాల్సిన ఉపాసనను కీర్తిస్తాము. కీర్తించటమే కాదు, అది అవసరం కూడా.

భగవద్గీతలో ఒక సాధకుడు ప్రయాణించాల్సిన మార్గాన్ని ఈ విధంగా చూస్తాము. అది కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగం పాటించి, చిత్తఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి, శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి; జ్ఞానం పొందితే మోక్షం పొందుతారు. అంటే జ్ఞానానికి రాకముందు జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం ఉపాసన చేసితీరాలి. అందువల్ల వేదాంతం ఉపాసనను పూర్తిగా ఖండించటం లేదు; కాకపోతే ఉపాసన స్థానం ఎక్కడ ఉండాలి అన్నదానిమీద చర్చ వస్తోంది.

**బ్రహ్మజ్ఞాన అనంతరం కర్తవ్యం కిమపి నాస్తి**

జ్ఞాన అనంతరం ఉపాసనను ఖండిస్తాము, జ్ఞానపూర్వ ఉపాసనను స్తుతిస్తాము. దీనికి జవాబులు –

ఎ) **బ్రహ్మ ఉపాసనయా మోక్షః న భవతి**

బి) **మోక్షం నిర్వచనం – అశరీరాతా హి మోక్షః సశరీరతా హి సంసారః**

మోక్షం అంటే శరీర సంబంధం లేకపోవటం, సంసారం అంటే శరీర సంబంధం ఉండటం అంటారు శంకరాచార్యులవారు. ఆయన ఇచ్చిన ఈ నిర్వచనానికి చక్కని రాజమార్గం, వేదాంతమార్గం ఉంది. దానికి ఆధారం ఛాందోగ్యోపనిషత్తు.

**న వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్త్యశరీరం వావ సన్తం**
**న ప్రియాప్రియే స్పృశతః**– ఛాందోగ్యం 8.12.1

శరీరసంబంధం ఉన్నంతవరకు, సుఖదుఃఖాలను తప్పించుకోలేము. ప్రియాప్రియ జ్ఞానాన్ని సంసారం అంటారు. ప్రియమైనది లభించినా కూడా మనం అది పోతుందేమోననే భయంతో పూర్తిగా ఆనందించము. కొంతమందికి అన్నీ ఉన్నా కూడా భయమే. 'నాకు జీవితంలో కావాల్సినవన్నీ ఉన్నాయి. మంచి భార్య, మాటవినే కూతురు, చక్కగా చదువుకునే కొడుకు, ఇల్లు, కారు, కావాల్సినంత డబ్బు – అన్నీ ఉన్నాయి. దేనికీ కొరతలేదు. కాని నాకు దిష్టి తగులుతుందేమోనని భయంగా ఉంది.' ఆ విధంగా శరీరసంబంధం ఉన్నంత వరకూ ప్రియాప్రియాలు బాధించక తప్పదు. మోక్షం అంటే ఏమిటి?

**శరీర సంబంధ అభావః మోక్షః**

శరీరంతో సంబంధం లేకపోవటం మోక్షం. దాన్నే అశరీరతా హి మోక్షః అన్నారు. అశరీరత్వం ఉపాసనవల్ల రాదు.

ఉపాసన కూడా కర్మ కిందికే వస్తుంది. కర్మ కాయికకర్మ అయితే ఉపాసన మానసిక కర్మ. ఈ విషయం పూర్వమీమాంసకులు కూడా ఒప్పుకుంటారు. ఎప్పుడైతే కర్మ వస్తుందో, అప్పుడే అందులో తారతమ్యాలు వస్తాయి. కొన్ని యాగాలు ఒకరోజు చేస్తే, కొన్ని రెండురోజులు చేస్తే, మరికొన్ని ఒక సంవత్సరం పాటు కూడా చేస్తారు. అలాగే చేసే విధానంలో కూడా తారతమ్యాలు ఉంటాయి. ఏదైనా పఠించేటప్పుడు కొందరు రాజధానీ ఎక్స్‌ప్రెస్ వేగంతో పఠిస్తే, మరికొందరు నిదానంగా పఠిస్తారు. అలాగే వారి శ్రద్ధలో, వారి ఏకాగ్రతలో కూడా తారతమ్యాలు ఉంటాయి.

చేసే కర్మలో, చేసే విధానంలో, శ్రద్ధలో, ఏకాగ్రతలో తారతమ్యాలు ఉంటే సహజంగానే ఆ కర్మవల్ల వచ్చే పుణ్యంలో కూడా తారతమ్యాలు ఉంటాయి. ఎప్పుడైతే వచ్చే పుణ్యంలో హెచ్చుతగ్గులు ఉంటాయో, అప్పుడే దానివల్ల వచ్చే శరీరంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఆ మాటకొస్తే జంతుజన్మ ఎత్తినా కూడా, వాటి జీవనంలో కూడా హెచ్చుతగ్గులు ఉంటాయి. ఏనుగుల్లో ఒక ఏనుగు ఆలయంలో పూజలందుకుంటూ ఉంటుంది; ఒక కుక్క ఏ ధనికుని ఇంట్లోనో ఏ.సి. గదుల్లో రాచమర్యాదలు పొందుతూ ఉంటుంది. ఇంకా ఎక్కువ పుణ్యం చేసుకుంటే మనిషి జన్మ పొందుతాడు. మనిషి జన్మలో కూడా హెచ్చుతగ్గులు ఉంటాయి. పుణ్యంయొక్క స్థాయినిబట్టి మంచి ఆరోగ్యం ఉండి, సంప్రదాయ

కుటుంబంలో పుట్టి, వేదాంతబోధకు వస్తాడు. ఇంకా ఎక్కువ పుణ్యం చేసుకుంటే ఊర్ధ్వలోకాల్లో పుట్టవచ్చు.

తైత్తిరీయోపనిషత్తులో ఆనందమీమాంస వస్తుంది. భూలోకంలో మంచి ఆరోగ్యం, డబ్బు, అన్నీ ఉన్న ఒక యువకుని ఆనందాన్ని ఒక కొలతగా తీసుకుంటే, అతనికన్నా మనుష్య గంధర్వ ఆనందం వందరెట్లు ఎక్కువగా ఉంటుంది అంటుంది. అలా ఆనందం కొలతలు పెంచుకుంటూ పోతుంది. దేవగంధర్వ ఆనందం, కర్మదేవతల ఆనందం, ఇంద్రుడు, బృహస్పతి ఇలా చెప్పుకుంటూ చివరికి బ్రహ్మలోకంలో హిరణ్యగర్భ పొందే ఆనందం $10^{20}$ ఉంటుంది అంటుంది. అంటే పది తర్వాత 20 సున్నాలు పెట్టుకోవాలి. అంత ఎక్కువ ఆనందం ఉంటుంది.

ఒక లోకంలోనే మళ్ళీ తారతమ్యాలు ఉంటాయి. ఉదాహరణకు స్వర్గలోకం తీసుకుంటే, ఐరావతంమీద ఇంద్రుడొక్కడే వెళ్ళగలడు; మీరు వెనక కూడా కూర్చోలేరు. అక్కడ కూడా కొందరు దేవునికి దగ్గరగా కూర్చోగలిగితే, కొందరు పక్కగదిలో కూర్చోవాల్సి ఉంటుంది. అప్పుడు వారు దేవుణ్ణి చూడలేరు, వినగలరు మాత్రమే. ఎప్పుడైతే ఇలాంటి తారతమ్యాలు ఉంటాయో, అప్పుడే పోల్చుకోవటం వస్తుంది; ఎప్పుడైతే పక్కవారితో పోల్చుకుంటారో, అప్పుడే ఈర్ష్య చోటు చేసుకుంటుంది.

అందువల్ల కర్మ, ఉపాసనలవల్ల ఎంత గొప్ప పుణ్యఫలం పొందినా కూడా అది సశరీరత్వంలోకే వస్తుంది అంటున్నారు శంకరాచార్యులవారు. ఎప్పుడైతే సశరీరత్వం ఉంటుందో, అప్పుడే తారతమ్యాలను తప్పించుకోలేము; ప్రియాప్రియాలను తప్పించుకోలేము. అందువల్ల సంసారాన్ని తప్పించుకోలేము. ఈ నాలుగు పదాలూ పర్యాయపదాలు. అవి – కర్మ (ఉపాసన), పుణ్యం, సశరీరత్వం, సంసారం. అంటే ఇవన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.

మోక్షాన్ని ఉపాసన ఫలంగా నిర్వచిస్తే ఇవన్నీ మోక్షానికి కూడా తప్పదు. ఏవన్నీ? పుణ్యం, సశరీరత్వం, సంసారం తప్పదు. కొన్ని దర్శనాలు మోక్షం అంటే వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళటంగా అభివర్ణిస్తాయి. కాని అద్వైతం మోక్షం అంటే వేరే లోకాలకు వెళ్ళటం కాదు అంటుంది. ఎందుకు?

వేరే లోకానికి వెళ్ళటం అంటే అక్కడ భగవంతుడు సశరీరం, వెళ్ళిన సాధకుడు సశరీరం, వెళ్ళిన లోకం ఒక ప్రదేశం. వీటన్నిటిలోనూ హెచ్చుతగ్గులు ఉంటాయని ఇప్పుడే చూశాము. మోక్షాన్ని ఉపాసన ఫలంగా చూస్తే, ధర్మాధర్మాలు ఉంటాయి, సశరీరత్వం ఉంటుంది, సంసారం ఉంటుంది. కాకపోతే ఈ సంసారం భూలోకంలో ఉన్నంత దారుణంగా ఉండదు. కాని సంసారం సంసారమే. అందువల్ల ఉపాసన ఫలంగా మోక్షం సాధ్యం కాదు.

**ఉపాసనా ఫలం సశరీరత్వమ్ ఏవ భవతి నైవ అశరీరత్వమ్**

ఉపాసన ఫలంగా సశరీరత్వం వస్తుంది తప్ప అశరీరత్వం రాదు. అందువల్ల మోక్షం జ్ఞానంవల్లనే వస్తుంది, ఉపాసనవల్ల రాదు.

**జ్ఞానమాత్రేణ మోక్షః న తు ఉపాసనయా**

9. **అశరీరత్వ సిద్ధయే బ్రహ్మ ఉపాసన**

వృత్తికారుడు అశరీరత్వం మోక్షం అని నేను కూడా ఒప్పుకుంటాను, మామూలుగా కర్మ, ఉపాసనలవల్ల అశరీరత్వం రాదని కూడా ఒప్పుకుంటాను కాని బ్రహ్మ ఉపాసన అశరీరత్వం ఇవ్వచ్చు కదా అంటాడు. తక్కిన ఉపాసనలు ఊర్ధ్వలోకాలకు తీసుకువెళ్ళి, మంచి శరీరాన్ని ఇస్తే, ప్రత్యేకించి బ్రహ్మ ఉపాసన అశరీరత్వాన్ని ప్రసాదించవచ్చు కదా అని అతని వాదన.

**శంకరులవారి జవాబు** – అశరీరత్వం కర్మ లేదా ఉపాసన ఫలం కాలేదు. ఎందుకంటే అశరీరత్వం ఆత్మయొక్క స్వరూపం. ప్రశ్నకూ, జవాబుకూ మధ్య సంబంధం ఏమిటి?

ఏదైతే ఒక వస్తువుయొక్క స్వరూపమో, అది ఎప్పుడూ ఉంటుంది. స్వస్వరూపం ఎప్పుడూ నిత్యసిద్ధంగా ఉంటుంది. ఉష్ణం అగ్నియొక్క స్వరూపం; అందువల్ల అగ్ని ఎప్పుడూ వేడిగానే ఉంటుంది. అలాగే మంచుయొక్క స్వరూపం చల్లదనం; అందువల్ల మంచు ఎప్పుడూ చల్లగానే ఉంటుంది. ఆ సూత్రం ప్రకారం ఆత్మయొక్క స్వరూపం అశరీరత్వం; అందువల్ల ఆత్మ నిత్యమూ అశరీరమే. అది నిత్యసిద్ధ స్వరూపం.

**అశరీరత్వం తు నిత్యసిద్ధః**

కర్మఫలం కాని, ఉపాసనఫలం కాని ఇప్పుడు సిద్ధంగా లేదు. కర్మ కాని, ఉపాసన కాని చేస్తే దాని ఫలం తర్వాత వస్తుంది. దాన్ని సాధ్యం అంటారు. సాధ్యం అంటే భవిష్యత్తులో వచ్చేది.

కర్మఫలం సాధ్యం అయితే, అశరీరత్వం సిద్ధం అయితే, సాధ్యాన్ని సిద్ధాన్ని ఎలా కలుపుతారు? సాధ్యం అంటే ఎప్పుడో వచ్చేది; సిద్ధం అంటే ముందే ఉన్నది. అలాంటప్పుడు సిద్ధ అశరీరత్వాన్ని సాధ్య ఉపాసన ఫలంతో ఎలా కలుపుతారు?

కాని అశరీరతః ఆత్మస్వరూపం అని ఎలా చెప్పగలరు? శంకరాచార్యులవారు దీనికి ఉపనిషత్తుల్లోంచి కొన్ని మంత్రాలను ఉటంకిస్తున్నారు.

**అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితమ్**

**మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి॥ – కఠ** 1.2.22

ఆత్మ అశరీరం అని ఈ కఠోపనిషత్తు స్పష్టంగా చెప్పింది.

**దివ్యో హ్యమూర్తః పురుషః స బాహ్యాభ్యన్తరో హ్యజః**

**అప్రాణో హ్యమనాః శుభ్రః హ్యక్షరాత్పరతః పరః** – ముండకమ్ 2.1.2

ఆత్మ స్థూల, సూక్ష్మ, కారణ శరీర రహితం. అంటే శరీరత్రయ విలక్షణం.

**యత్ తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణమ్**

**అచక్షుశ్శ్రోత్రం తదపాణిపాదమ్** – ముండకమ్ 1.1.6

ఆత్మకు కళ్ళు, చెవులు లేవు; కాళ్ళు, చేతులు లేవు.

**స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమ్**

**అస్నావిరగ్ంం శుద్ధమపాపవిద్ధమ్** – ఈశావాస్యమ్ 8

అకాయం అంటే శరీరం లేనిది.

అందువల్ల అశరీరత్వం పొందాల్సిన లక్ష్యం కాదు; అది నేర్చుకోవాల్సిన సత్యం. అందువల్ల అది ఫలంలోకి రాదు; సాధ్యం కాదు.

### 10. అశరీరత్వం మోక్షం అయితే జీవన్ముక్తి కుదరదు

ఈ ప్రశ్నను ఇంకొక పూర్వపక్షి వేస్తాడు. ఇతను ముఖ్యాంశంనుంచి మనను కొంచెం పక్కదారి పట్టిస్తున్నాడు. అశరీరత్వాన్ని మోక్షం అని ఎలా అంటారు

అంటున్నాడు ఇతను. అతని వాదన ఏమిటంటే అశరీరత్వం గనుక మోక్షం అయితే అద్వైతం బోధించే ఫలం అతను అనుభవించలేదు. ఏమిటది? జీవన్ముక్తి. జీవన్ముక్తి అంటే ఏమిటి? జీవించి ఉండగానే మోక్షం; అంటే ఈ శరీరంతో ఉండగానే మోక్షం. కాని అద్వైతం ఏమంటోంది? అశరీరతా హి మోక్షః అంటోంది. అంటే అతను ఈ శరీరంతో ఉండగా మోక్షం పొందలేదు. మీ నిర్వచనం ప్రకారం దానికి కావాల్సిన మొదటి అర్హత మరణం అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు** – అశరీరతా హి మోక్షః అన్నప్పుడు జీవన్ముక్తి గురించి ఆలోచించలేదనుకున్నారా అంటున్నారు శంకరాచార్యులవారు. అశరీరత్వం జీవన్ముక్తికి కూడా వర్తిస్తుంది. అదెలా సాధ్యం? ఇంతకుముందు చూసిన నిర్వచనం ఒకసారి గుర్తు తెచ్చుకుందాము. అశరీరత్వం నిర్వచనం ఏమని చూశాము. అశరీరత్వం ఆత్మస్వరూపం, అది సిద్ధవస్తువు అన్నాము. అంటే ఆత్మ నిత్యమూ అశరీరమే. అశరీరత్వం అంటే శరీర సంబంధ వర్జితః – అంటే శరీరంతో సంబంధం లేనిది. శరీరంలో ఉన్న ఆత్మకు శరీరంతో సంగత్వం లేదు. ఆత్మ నిత్య అశరీరత్వం అవటంవల్ల ఆత్మకు ఎన్నడూ, ఏ విధంగానూ శరీరత్వం అంతకుముందు లేదూ, ఇప్పుడూ లేదు, ఇకముందూ ఉండబోదు. ఆత్మ ఎందుకు ఎప్పుడూ అశరీరత్వంగా ఉంటుంది? దానికి మూడు కారణాలు చెప్పవచ్చు.

ఎ) **అది ఆత్మస్వరూపం**

**అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితమ్** – కఠ 1.2.22

**స్వరూపత్వాత్ నిత్యమ్ అశరీరః**

బి) **ఆత్మ అసంగం**

**అసంగోహ్యయం పురుషః**

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ।**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః॥** – గీత 2.24

ఆత్మను నిప్పు కాల్చలేదు, నీరు తడపలేదు అంటే ఆత్మ అసంగం. అసంగం అంటే దేనితోనూ సంబంధం లేదు. ఆకాశం కూడా అంతటా ఉంటుంది కాని ఆకాశానికి దేనితోనూ సంబంధం లేదు.

**అసంగత్వాత్ శరీర సంబంధః నాస్తి నిత్యమ్ అశరీరః**

సి) **ఆత్మ అకర్తా** – శరీర సంబంధం కర్మఫలంవల్ల వస్తుంది. పుణ్యం చేస్తే పుణ్యశరీరం, పాపం చేస్తే హీనజన్మ వస్తుంది. రెండూ సమానంగా చేస్తే మనుష్యజన్మ వస్తుంది. అంటే కర్మఫలంగా శరీరం వస్తుంది.

**పుణ్యేన పుణ్యం లోకం నయతి పాపేన పాపం।**
**ఉభాభ్యామ్ ఏవ మనుష్యలోకమ్॥** – ప్రశ్న 3.7

కర్మఫలం కర్తకు వస్తుంది. ఆత్మ అకర్త కాబట్టి ఆత్మకు కర్మా లేదు, ఆ కర్మ వల్ల వచ్చే ఫలమూ లేదు, ఆ కర్మఫలంగా వచ్చే శరీరమూ లేదు.

**ఆత్మనః నిత్య అకర్తృత్వాత్ శరీర సంబంధః నైవ భవతి**

ఈ పై మూడు కారణాలవల్ల మనిషి జీవించివుండగానే అంటే ఈ శరీరంలో ఉండగానే, ఆత్మకు శరీరంతో సంబంధం లేదు.

**ఆత్మనః అశరీరత్వం నిత్యసిద్ధమ్**

11. **సశరీరత్వం కుదరకపోతే, సశరీరత్వం సంసారం ఎలా అవుతుంది?**

మనిషి జీవించి ఉండగానే అతనికి శరీరంతో సంబంధం లేకపోతే, అంటే సశరీరత్వం అసాధ్యం అయితే, సశరీరత్వం సంసారం ఎలా అవుతుంది?

**శంకరులవారి జవాబు** – ఆత్మ సశరీరం కాదు కాని ఆత్మను సశరీరంగా పొరపాటు పడతారు. దీనికి మనం మర్ఫీ సూత్రం ఉదహరించవచ్చు.

What can go wrong will go wrong
ఏదయితే తప్పు అయ్యే అవకాశం ఉందో, అది తప్పు అయితీరుతుంది

ఆ సూత్రం ప్రకారం ఏది జరగగలదో, అది విజయవంతంగా జరిగింది. ఏమిటది? పొరపాటు పడే అవకాశం ఉంది; పొరపాటు జరిగిపోయింది. సశరీరత్వం అనే పొరపాటు పడే అవకాశం ఉంది, అది జరిగిపోయింది. పొరపాటుని అధ్యాస అంటారు. అందువల్లనే శంకరులవారు ఈ బ్రహ్మసూత్రాలకు ఉపోద్ఘాతంలో అధ్యాసభాష్యం చాలా విపులంగా రాశారు.

సశరీరత్వం పొరపాటువల్ల ఏర్పడితే, అశరీరత్వం ఎలా పొందుతారు? పొరపాటువల్ల తాడు పాముగా మారితే, పామును తాడుగా ఎలా వెనక్కి మారుస్తారు? ప్రశ్నను గమనించారా? పామును తాడుగా వెనక్కి ఎలా మారుస్తారు?

ఈ మార్పు అక్షరాలా జరగదు; ఇది బుద్ధిలో జరిగే మార్పు. అందువల్ల అశరీరత్వం అనేది బుద్ధిలో కలిగిన పొరపాటు. అది అజ్ఞానంవల్ల కలిగింది.

ఆత్మనైన నాకు ఎన్నడూ శరీరసంబంధం లేదు – ఇది జ్ఞానం. ఎలాగైతే కలలో జరిగేది జాగ్రద్‌పురుషుడిని, కల జరుగుతుండగా కూడా ఏమీ చెయ్యలేదో, అలాగే జీవించివుండగా కూడా జ్ఞానికి శరీరంతో సంగత్వం ఉండదు. అందువల్ల జీవన్ముక్తి సాధ్యమే. జీవన్ముక్తి అంటే అశరీరత్వం. నిజానికి అజ్ఞాని కూడా అశరీరుడే కాని అది అతనికి తెలియదు, జ్ఞానికి తెలుసు. అంతే భేదం. అంటే ఆలోచనలో మార్పు రావాలి. అశరీరత్వం జ్ఞానంవల్లనే వస్తుంది కాని ఉపాసన వల్ల రాదు.

**అశరీరతా భవతి** – బృహదారణ్యకమ్

బృహదారణ్యకంలో జ్ఞానిని పాము కుబుసం విడవటంతో పోలుస్తారు. ఎలాగైతే పాము తన కుబుసం విడుస్తుందో, అలా జ్ఞాని తన శరీరఅభిమానాన్ని విడుస్తాడు. ఆ కుబుసానికి ఏం జరిగినా పాము చలించనట్టుగా, తన శరీరానికి ఏంజరిగినా జ్ఞాని చలించడు. శరీరానికి ఏమీ కాదనికాదు దీని అర్థం. శరీరం కర్మలు చెయ్యక తప్పదు; దానివల్ల వచ్చే సుఖదుఃఖాలను అనుభవించక తప్పదు. అంటే జ్ఞానికి కూడా ప్రారబ్ధకర్మ తప్పదు. కాకపోతే ఆ సుఖదుఃఖాలకు అతను చలించడు. 'నాకే ఎందుకు వచ్చింది?' అనే ప్రశ్నరాదు.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**

**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – గీత 2.56

అందువల్ల జ్ఞాని జీవన్ముక్తి పొందుతాడు. అది జ్ఞానంవల్లనే సాధ్యం, ఉపాసనవల్ల కాదు. ఎందుకంటే మోక్షం సిద్ధవస్తువు. దానికి ఉపాసన అవసరం లేదు.

**అశరీరతా జ్ఞానేన ఏవ సిద్ధ్యతి న తు ఉపాసనయా**

12. **మోక్షాన్ని ఉపాసన ఫలంగా పొందగలమా?**

ఇదే ప్రశ్నను తిరగవేస్తే **బ్రహ్మ ఉపాసన ఫలం అవుతాడా?**

**శంకరులవారి జవాబు** – దీనికి జవాబు చెప్పేముందు శంకరాచార్యులవారు మోక్షానికి ఇంకొక నిర్వచనం ఇస్తున్నారు.

**బ్రహ్మభావః హి మోక్షః**

ఆస్తిక దార్శనికులందరూ మోక్షం నిత్యం అని ఒప్పుకుంటారు. మృత్యుభయం నుంచి తప్పించుకోవాలని అందరూ కోరుకుంటారు. నిత్యవస్తువు ఒక్కటే ఉందని చెబుతుంది శాస్త్రం. ఆ ఒక్కటే బ్రహ్మ.

**నిత్యవస్త్వేకం బ్రహ్మ। తద్వ్యతిరిక్తం సర్వమనిత్యమ్** – తత్త్వబోధ

నిత్యవస్తువు ఉన్నది ఒకటే, అది బ్రహ్మ. దానికి భిన్నంగా ఉన్నది ప్రతిదీ అనిత్యం అని తత్త్వబోధలో వస్తుంది. శాస్త్రం మోక్షం నిత్యం అంటుంది. రెండు నిత్యవస్తువులు ఉండవు. బ్రహ్మ నిత్యం కాబట్టి, మోక్షం కూడా నిత్యం కాబట్టి; బ్రహ్మ, మోక్షం ఒకటి కావాలి.

మోక్షప్రాప్తి = బ్రహ్మప్రాప్తి

వేదాల్లో బ్రహ్మగా వ్యవహరిస్తే, పురాణాల్లో ఈశ్వరునిగా వ్యవహరిస్తారు. అక్కడ మోక్షాన్ని, భగవంతుణ్ణి ఒకటిగా చూస్తారు.

ఇప్పుడు ప్రశ్న బ్రహ్మను ఉపాసనఫలంగా పొందవచ్చా? దానికి అనేక సమాధానాలు చెబుతారు శంకరాచార్యులవారు. అవి –

12 ఎ) **చతుర్విధఫల విలక్షణః** – ఏదైనా కర్మ చేస్తే నాలుగు రకాల కర్మఫలాలు వస్తాయి. ఉపాసన కూడా కర్మ కిందికే వస్తుంది.

**నాలుగు రకాల ఫలాలు:**

**ఆప్తి** – చేరటం. పండిన పంటను ఒకచోటినుంచి ఇంకొక చోటికి చేర్చటం.
**ఉత్పత్తి** – కొత్తగా పుట్టించటం. విత్తనాలు వేసి, పంటను పండించటం.
**వికారం** – మార్పు చెందటం. బియ్యాన్ని అన్నంగా వండటం.
**సంస్కారం** – శుద్ధి చెయ్యటం. వడ్లను దంచి పొట్టు తీయటం.

ఇప్పుడు ఈ ఫలాలు బ్రహ్మకు వర్తిస్తాయో లేదో చూద్దాము.

1. **ఆప్తి** – ఒకచోటినుంచి వెళ్ళి బ్రహ్మను ఇంకొక చోట చేరుకోవటం అసాధ్యం.

అక్కడ ఉండే పాండురంగడు ఇక్కడ ఉన్నాడే అని పాడాక, అందువల్ల పండరిపురం పోదాం రారండి అని ఒకవేళ పాడితే అది భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చినట్టుగా ఉంటుంది. అలాగే ఒకపక్క బ్రహ్మ సర్వవ్యాపకం అని చెబుతూ,

మోక్షం అంటే మరణించాక ఉత్తరాయణ మార్గంలో శుక్లగతిద్వారా పుణ్యలోకానికి వెళ్ళి భగవంతునితో ఐక్యం అవాలి అని చెపితే కూడా భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చినట్టు అవుతుంది. సర్వవ్యాపకుని దగ్గరకి ప్రయాణం చేసి వెళ్ళటం ఏమిటి? అందువల్ల బ్రహ్మను చేరలేము, చేరనవసరం లేదు కూడా.

బ్రహ్మ సర్వవ్యాపకం కాబట్టి ఆప్తి కుదరదు.

2. **ఉత్పత్తి** – బ్రహ్మను పుట్టించవచ్చా? బ్రహ్మకు చావు పుట్టుకలు లేవు. బ్రహ్మ నిత్యం.

మనం ఎప్పుడు మోక్షం పొందుతాము? బ్రహ్మను ఎప్పుడు పొందితే అప్పుడు మోక్షం పొందుతాము. బ్రహ్మను ఎప్పుడు పొందుతాము? బ్రహ్మ నిత్యసిద్ధం. అసలు ఈ ప్రశ్నలు అడిగామంటేనే మనకు వేదాంతం సరిగ్గా అర్థంకాలేదని అర్థం. అదెలా ఉంటుందంటే అంజనం అంటే నాకు తెలియదా, పసుపులాగా తెల్లగా ఉంటుంది అన్నట్టు ఉంటుంది.

బ్రహ్మ నిత్యం కాబట్టి ఉత్పత్తి కుదరదు.

3. **వికారం** – జీవాత్మ మార్పు చెంది, పరమాత్మగా మారవచ్చా? కుదరదు. బ్రహ్మకు వికారాలు లేవు.

బ్రహ్మ నిర్వికారం కాబట్టి వికారం కుదరదు.

4. **సంస్కారం** – కర్మయోగం, ఉపాసనయోగం, పూజ, జపం, తపస్సు కర్మలద్వారా జీవాత్మను శుద్ధి చేస్తే, బంగారంలాగా బ్రహ్మకూడా సంస్కరించబడతాడా? బంగారాన్ని కొన్ని కర్మలతో శుద్ధి చేస్తారు కదా. బ్రహ్మకు అశుద్ధం లేదు. ఆయన నిత్యశుద్ధం.

బ్రహ్మ నిత్యశుద్ధం కాబట్టి సంస్కారం కుదరదు.

సంసారాన్ని రెండురకాలుగా నిర్వచిస్తుంది శాస్త్రం.

**దోష అపనయనం** – అశుద్ధాన్ని తొలగించటం. మన శరీరాన్ని శుద్ధి చేయటానికి సబ్బుతో స్నానం చేస్తాము. అది దోష అపనయనం.

**గుణ ఆధానం** – కొత్తగా ఆపాదించటం. స్నానం చేశాక, అద్దం ముందు నిలబడి శరీరానికి పౌదరు రాయటం, సెంటు పులుముకోవటంవంటి కొత్తవి చేస్తాము. అది గుణ ఆధానం.

బ్రహ్మకు ఈ రెండూ అవసరం లేదు.

బ్రహ్మ నిత్యశుద్ధం కాబట్టి దోష అపనయనం కుదరదు.

బ్రహ్మ నిర్గుణం కాబట్టి గుణ ఆధానం కుదరదు.

అందువల్ల బ్రహ్మ ఈ నాలుగు విధాల కర్మఫలాలకు అతీతం; బ్రహ్మే మోక్షం కాబట్టి, మోక్షం కూడా ఈ నాలుగు కర్మఫలాలకు అతీతం. అందువల్ల మోక్షఫలం ఉపాసన ఫలానికి భిన్నంగా ఉంటుంది.

**బ్రహ్మ చతుర్విధ కర్మఫల విలక్షణమ్**

12 బి) **అభ్యుపేద్య వాదః** – అభ్యుపేద్య వాదన అంటే పూర్వపక్షి చెప్పిన వాదనను ఒకపక్క ఒప్పుకుంటూనే, అది ఒప్పుకుంటే అందులో ఉండే లోపమేమిటో ఎత్తిచూపటం.

పూర్వపక్షి మోక్షం ఉపాసనఫలంగా వస్తుంది అంటున్నాడు. అవునా? అద్వైత సిద్ధాంతపరంగా మోక్షం సిద్ధవస్తువు కాబట్టి, ఉపాసన సాధ్యం కాబట్టి ఉపాసన ఫలంగా రాదని తేల్చిచెప్పాము. అది సత్యం. కాని, వాదనకోసం కాసేపు మోక్షం ఉపాసనఫలంగా వస్తుంది అనుకుందాం. అది నిజం కాదని తెలిసినా, వాదనకోసం అనుకుందాము. అప్పుడు మోక్షం అనిత్యఫలం అవుతుంది. కాని అదృష్టం బాగుండి మోక్షం నిత్యం అని పూర్వపక్షి కూడా ఒప్పుకుంటాడు.

మోక్షం అనిత్యం ఎలా అవుతుంది? మోక్షం ఉపాసనఫలంగా వస్తుంది అంటే మోక్షం ఉపాసన చెయ్యకముందు ఉందా? లేదు! పోనీ ఉపాసన చేస్తుండగా ఉందా? లేదు! ఉపాసన చేశాక, పుణ్యం వస్తుంది. పుణ్యం వచ్చాక, మోక్షం వస్తుంది. అంటే దీని అర్థమేమిటి? మోక్షానికి ఒక ఆరంభం ఉంది. ఏ కర్మ చేసినా, ఏ ఉపాసన చేసినా దానికొక ఫలం వస్తుంది; ఆ ఫలానికి ఒక ఆరంభం ఉంటుంది. ఆరంభం ఉన్న దేనికైనా అంతం కూడా ఉంటుంది. ప్రారంభం ఉన్న దేనికైనా ముగింపు కూడా ఉంటుంది.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ । – గీత** 2.27

పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు.

ఒకకాలంలో పుట్టి, ఇంకొక కాలంలో మరణించేది అనిత్యఫలం అవుతుంది. ఉపాసన రూపమోక్షం అనిత్యమోక్షం అవుతుంది.

**అనంతతా చాదిమతో మోక్షస్య న భవిష్యతి**–మాండూక్య కారికలు 4.30

ఉపాసనవల్ల వచ్చిన మోక్షానికి ఆరంభం ఉంటుంది, అప్పుడది అనిత్యం అవుతుంది. మోక్షం నిర్వచనం నిత్యం. అసలు మోక్షశాస్త్రం ఉన్నదే నిత్యఫలం పొందటానికి; శాశ్వతంగా సంసారబంధంనుండి ముక్తి పొందటానికి.

**తద్యథేహ కర్మజితో లోకః క్షీయత**

**ఏవమ్ ఏవ అముత్ర పుణ్యజితో లోకః క్షీయతే** – ఛాందోగ్యమ్ 8.1.6

కర్మవల్ల పొందిన పుణ్యఫలం, పుణ్యలోక ప్రాప్తి కూడా అనిత్యమే. ఎందుకంటే ఆ పుణ్యం తీరగానే ఆ లోకంనుంచి వెనక్కి రావాలి. కర్మఫలం (ఉపాసన ఫలం) అనిత్యం అయితే, మోక్షం కూడా ఉపాసనఫలం అయితే, మోక్షం నిత్యం ఎలా అవుతుంది? ఫలం అంటేనే ఒకకాలంలో పండి రాలిపోయేది అని అర్థం.

12 సి) **ఉపాసన వేదాంతసారం కాదు, కాలేదు** – ఉపాసన వేదాంతసారం కాదని సమన్వయసూత్రంలో చూశాము. అంతేకాదు, షడ్లింగవిచారణద్వారా వేదాంతసారం కర్మ కానీ, ఉపాసన కానీ కాదని; బ్రహ్మ అనీ చూశాము. వేదాంతసారం బ్రహ్మ అని చూసినప్పుడు, వేదాంతం జీవన్ముక్తిని సూచిస్తోందని కూడా చూశాము. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం. ఎప్పుడో భవిష్యత్తులో రాబోయేది కాదు. వేదాంతసారం అయిన మహావాక్యం – తత్త్వమసి – నువ్వు ఆ బ్రహ్మవు అయివున్నావు అంటుంది. అసి అంటే వర్తమానకాలం, భవిష్యత్తుకాలం కాదు. ఇక్కడే ఇప్పుడే మోక్షం అంటే మోక్షం ఉపాసనవల్ల భవిష్యత్తులో వచ్చే ఫలం కాదు.

12 డి) **శ్రుతి ప్రమాణం** – మోక్షం ఉపాసనఫలం కాదని శ్రుతిప్రమాణం కూడా అంది.

**సోఽయం మనుష్యలోకః పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా।**
**కర్మణా పితృలోకో। విద్యయా దేవలోకః॥** – బృహదారణ్యకమ్ 1.5.16

పుత్రులు ఉండి, ఆ పుత్రులు కర్మలు చేస్తే, అతనికి మనుష్యజన్మ మళ్ళీ వస్తుంది. కర్మ చేస్తే స్వర్గలోకానికి వెళతాడు; ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళతాడు. విద్య అంటే ఉపాసన. తర్వాత సన్న్యాసి గురించి వస్తుంది. సన్న్యాసి

ఉపాసనఫలం కూడా వద్దనుకుని, మోక్షం కోరతాడని వస్తుంది. అంటే ఏమిటి? మోక్షం ఉపాసనఫలం కిందికి రాదు. ఈ విషయం పరోక్షంగా చెప్పబడింది.

దీన్నిబట్టి తెలుస్తున్నదేమిటంటే వేదాంతం కర్మఫలం గురించి కాని, ఉపాసనఫలం గురించి కాని బోధించదు. వేదాంతం బోధించే ఫలం మోక్షం. అది అటు కర్మఫలమూ కాదు, ఇటు ఉపాసనఫలమూ కాదు. అలాంటప్పుడు వేదాంతంలోకి కర్మను కాని ఉపాసనను కాని ఎలా తెస్తారు?

వేదాంత తాత్పర్యం ఉపాసన కాదు.

12 ఇ) **ప్రకరణ భేదం** – మొత్తం వేదాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు – వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగంలో కర్మ, ఉపాసనలు వస్తాయి. వేదపూర్వభాగాన్ని విశ్లేషిస్తూ జైమినీ ఋషి ధర్మసూత్రములను రచించారు.

**అథాతో ధర్మజిజ్ఞాసా** – 1

ఈ సూత్రంతో మొదలవుతుంది అది.

వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అంటారు. దాన్ని వ్యాసాచార్యులవారు విశ్లేషిస్తూ బ్రహ్మసూత్రములను రచించారు.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – 1

ఈ సూత్రంతో మొదలవుతుంది ఇది. మనం ఇప్పుడు ఈ బ్రహ్మసూత్రములనే అధ్యయనం చేస్తున్నాము. శంకరాచార్యులవారు, పూర్వమీమాంసకులను ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు చెప్పండి – కర్మ, ఉపాసనలను వేదపూర్వభాగంలో అధ్యయనం చేయాలా, వేదఅంతభాగంలోనా? పూర్వభాగంలోనే నేర్చుకోవాలి. ఎందుకు?

కర్మ, ఉపాసనలు ధర్మాన్ని లేదా పుణ్యాన్ని కలుగజేస్తాయి. ధర్మానికి లేక పుణ్యానికి చెందిన దాన్ని వేదపూర్వభాగంలో విచారణ చేయాలి. ఎందుకంటే, ధర్మశాస్త్రం ఆరంభమవుతున్నదే అథాతో ధర్మజిజ్ఞాసా సూత్రంతో. వేదాంతం మోక్షాన్ని గురించి బోధిస్తున్నదని చూశాము. ఇప్పుడు మోక్షం కూడా ఉపాసన ఫలమే అయితే, విడిగా వేరే వేదఅంతభాగం ఎందుకు? వేదపూర్వభాగం వేరే ప్రకరణం, అంతభాగం వేరే ప్రకరణం. మోక్షం కూడా ఉపాసనఫలం అయితే, జైమినీసూత్రముల చివర్లో **అథ బ్రహ్మ ఉపాసనా** అని వచ్చేసి ఉండవచ్చు.

అప్పుడు వ్యాసాచార్యులవారికి విడిగా వాటిని బ్రహ్మసూత్రముల పేరిట విచారణ చేసే అవస్థ తప్పివుండేది.

వేదాంతం పూర్వభాగంలోకి రాదు. వ్యాసాచార్యులవారు ప్రత్యేకించి ధర్మసూత్రములకు భిన్నంగా బ్రహ్మసూత్రములు ఎందుకు రాశారంటే వేదాంతం ధర్మం గురించి చర్చించదు. ఇంకా నిజం చెప్పాలంటే వేదాంతం ధర్మాధర్మాలకు భిన్నమైన ఆత్మ గురించి బోధిస్తుంది.

**అన్యత్ర ధర్మాత్ అన్యత్రాధర్మాత్** – **కఠ** 1. 2. 14

**యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం**
**కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్**
**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ**
**నిరంజనః పరమం సామ్యముపైతి** – ముండకమ్ 3. 1. 3

పుణ్యపాపాలను రెండూ విదుల్చుకున్న విద్వాన్ గురించి చెపుతుంది వేదాంతం.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** – గీత 18. 66

ఆ విధంగా వేదాంతం ధర్మశాస్త్రం గురించి మాట్లాడదు. అలాంటప్పుడు ధర్మసంబంధిత ఉపాసన ఎలా వేదాంతంలో భాగమవగలదు?

ఉపాసనకు, జ్ఞానానికి మధ్య ప్రకరణభేదం ఉంది.

12 ఎఫ్) **బ్రహ్మ ఆబ్జెక్టు కాదు** – అసలు బ్రహ్మ ఉపాసనే సాధ్యం కాదు. బ్రహ్మ ఉపాసన మోక్షాన్ని ఇస్తుందా, లేదా అనే మీమాంస ఎప్పుడు వస్తుంది? బ్రహ్మ ఉపాసనకు అందుబాటులో ఉంటే. ఉపనిషత్తు చాలా స్పష్టంగా నువ్వే ఆ బ్రహ్మవు అని తేల్చిచెప్పేసింది.

**తత్ త్వమ్ అసి** – ఛాందోగ్యమ్

నువ్వే ఆ బ్రహ్మవు అంటే అర్థం ఏమిటి? బ్రహ్మ బాహ్యవస్తువు కాదు, ఉపాసక స్వరూపం. ఉపాసన చేసే వ్యక్తిని ఉపాసకుడు అనీ, ఉపాసన చెయ్యబడే దేవతను ఉపాస్యం అనీ అంటారు. ఉపాసక బ్రహ్మ ఉపాస్యదేవుడు ఎలా అవుతాడు? అంటే సబ్జెక్టు ఆబ్జెక్టు ఎలా అవుతాడు? ఎప్పటికీ సబ్జెక్టు సబ్జెక్టే, ఆబ్జెక్టు ఆబ్జెక్టే.

అందువల్ల బ్రహ్మమీద ఉపాసన ఎవరూ చెయ్యలేరు. అన్నిటినీ చూసే మన కళ్ళను మనం ఎలా చూసుకోలేమో అలాగే మనమీద మనమే ఉపాసన చెయ్యలేము. ఈ మాటమీద మీకు నమ్మకం లేకపోతే దానికి శ్రుతిప్రమాణం కూడా ఉంది.

**యద్వాచాఽనభ్యుదితం యేన వాగభ్యుద్యతే**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.4

బ్రహ్మ గురించి బోధించమని శిష్యుడు అడిగాడు. నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు అన్నాడు గురువు.

**నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు**
**దేవునికి ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు**

ఈ విషయం పదేపదే వస్తుంది కేనోపనిషత్తులో. సగుణబ్రహ్మ కూడా దృశ్యం కిందకు వస్తుంది. ఆబ్జెక్టుగా చూడబడేదేదీ బ్రహ్మ కాదు. దానికి ఒక వ్యాప్తి వాక్యం కూడా ఉంది.

**యత్ దృశ్యం తత్ మిథ్యా**

ఆబ్జెక్టును ప్రమేయం అంటారు. బ్రహ్మ అప్రమేయం. బ్రహ్మ అప్రమేయం కాబట్టి బ్రహ్మ ఉపాసన కుదరదు. దృగేవ న తు దృశ్యతే.

**బ్రహ్మణః అప్రమేయత్వాత్ బ్రహ్మ ఉపాసనం న సంభవతి**

### 13. బ్రహ్మ అప్రమేయం అంటే బ్రహ్మజ్ఞానం కూడా కుదరదు

శంకరాచార్యులవారు బ్రహ్మ ఉపాసనఫలం కాదని నిరూపించటానికి వివరంగా అనేక వాదనలు చేశారు. చివరగా చెప్పిన వాదనలో బ్రహ్మ ప్రమేయం కాదు. అందువల్ల బ్రహ్మమీద ఉపాసన చెయ్యలేము అన్నారు. ఆ విషయాన్ని పట్టుకుని వృత్తికారుడు అలా చెపితే మీరే ఇబ్బందిలో పడతారు అన్నాడు.

మీరు బ్రహ్మ ప్రమేయం కాదు కాబట్టి బ్రహ్మ ఉపాసన సాధ్యం కాదు అంటున్నారు; అదే నిజమైతే నేను బ్రహ్మజ్ఞానం కూడా సాధ్యం కాదు అంటాను అంటున్నాడు వృత్తికారుడు. ఎందుకు? బ్రహ్మజ్ఞానం పొందాలంటే బ్రహ్మ కూడా ప్రమేయం అవ్వాలి. ఏ జ్ఞానం అయినా పొందేది ప్రమేయం గురించే.

పైగా వృత్తికారుడు చెబుతున్నాడు, మీరు కేనోపనిషత్తునుంచి నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మకాదు అని అంటున్నారు, అదే కేనోపనిషత్తులోంచి నేనూ చూపిస్తాను బ్రహ్మ ఆబ్జెక్టు కాదని,

**అన్యదేవతద్విదితాదథో అవిదితాదధి**

**ఇతి శుశ్రుమ పూర్వేషామ్** – కేన 1.3

బ్రహ్మ ఆబ్జెక్టు కాదని ఖచ్చితంగా ఉపనిషత్తు చెప్పింది. బ్రహ్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి బ్రహ్మజ్ఞానం సాధ్యం కాదు.

**బ్రహ్మజ్ఞానేన మోక్షః**

అని మీరు చెప్పలేరు. ఎందుకంటే బ్రహ్మ అప్రమేయం, అవిషయం, అవిజ్ఞేయం.

నేను తప్పు చెప్పానని ఒప్పుకుంటాను కాని మీదీ తప్పేనని మీరు కూడా ఒప్పుకోవాలి అంటున్నాడు వృత్తికారుడు. ఉపాసనవల్ల మోక్షం వస్తుందని తను చెప్పిన వాదన తప్పే అని ఒప్పుకుంటున్నాడు. కాని, బ్రహ్మ ఆబ్జెక్టు కాకపోతే, బ్రహ్మజ్ఞానం కూడా సాధ్యం కాదని తేల్చి చెబుతున్నాడు.

ఇంకా ఇంకొక అడుగు ముందుకువేస్తున్నాడు. బ్రహ్మజ్ఞానం సాధ్యం కాకపోతే, శాస్త్రం ప్రమాణం అవలేదు. శాస్త్రం ప్రమాణం కాదని మీరు ఒప్పుకుంటే, మీరు చెప్పిన మూడవసూత్రం ప్రమాదంలో పడుతుంది.

**శాస్త్రయోనిత్వాత్** – సూత్రం 3

బ్రహ్మకు ప్రమాణం వేదాంతశాస్త్రం అని ఆ సూత్రం అర్థం. బ్రహ్మజ్ఞానమే కుదరనప్పుడు బ్రహ్మను బోధించే శాస్త్రం ప్రమాణమెలా అవుతుంది? అందువల్ల మీరు నాలుగవ సూత్రం గురించి అద్భుతంగా చేసిన విచారణ, మీ మూడవ సూత్రాన్ని ఖండించి వేస్తున్నది.

**శంకరులవారి జవాబు** – బ్రహ్మజ్ఞానం కుదరదు. నిజానికి బ్రహ్మజ్ఞానం అవసరం లేదు. ఎందుకంటే మేము పదేపదే బోధించే విషయం చైతన్య స్వరూపంగా బ్రహ్మ ఎప్పుడూ ఉన్నాడు.

**స్వయం జ్యోతిః భవతి** – బృహదారణ్యకమ్

**జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే** – గీత 13.17

**న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం**
**నేమా విద్యుతో భాన్తి కుతోఽ యమగ్నిః**
**తమేవభాన్త మనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి॥** – ముండకమ్ 2.2.11

చైతన్యాన్ని ఏదీ ప్రకాశింపజేయనవసరం లేదు, నిజానికి చైతన్యమే అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. శాస్త్రం చైతన్యం (బ్రహ్మ) గురించి చెప్పనవసరం లేదు. నిజానికి చైతన్యమే శాస్త్రాన్ని ప్రకాశింపజేస్తుంది. బ్రహ్మజ్ఞానం గురించి మనం ప్రయత్నించనవసరం లేదు.

**బ్రహ్మజ్ఞానం న సంపాదనీయమ్**

**14. బ్రహ్మజ్ఞానం పొందనవసరం లేకపోతే గురువు, శాస్త్రం ఎందుకు?**

బ్రహ్మ స్వయంప్రకాశకజ్యోతి అయితే, బ్రహ్మజ్ఞానం అవసరం లేకపోతే, బ్రహ్మజ్ఞానం పొందమని మీరు పదేపదే ఎందుకు చెబుతారు అంటాడు వృత్తికారుడు.

**బ్రహ్మజ్ఞానేన మోక్షః**

అంటారు మీరు. పైగా బ్రహ్మకు ప్రమాణం శాస్త్రం అంటారు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు సమిధలు తీసుకుని వెళ్ళాలి అంటారు. బ్రహ్మజ్ఞానం పొందాల్సిన అవసరం లేకపోతే, గురువెందుకు, శాస్త్రమెందుకు?

**శంకరులవారి జవాబు** – బ్రహ్మజ్ఞానం అంటే అధ్యాసనివృత్తి; ఆత్మ అజ్ఞానం తొలగిస్తుంది. మన సమస్య బ్రహ్మ గురించి తెలియకపోవటం కాదు. మన సమస్య బ్రహ్మ గురించి లేదా ఆత్మ గురించి మనకు ఉన్న పొరపాటు. దాన్ని అధ్యాస అంటారు. ఆ అధ్యాసను మనం సరిదిద్దుకోవాలి. నేను ఆత్మ, అనాత్మల మేలుకలయికను. నేను, 'నేను' అని పలికినప్పుడు ఆ 'నేను'లో రెండు నేనులు ఉన్నాయి. స్వయంప్రకాశకమైన ఆత్మ + కార్యకరణసంఘాతమైన అనాత్మ.

ఆత్మ, అనాత్మలు అతి సన్నిహితంగా ఉండటంవల్ల అనాత్మను చూసి ఆత్మగా పొరపాటు పడుతున్నాము. అనాత్మ లక్షణాలను ఆత్మకు ఆరోపిస్తున్నాము. ఆ పొరపాటుకు కారణం ఆత్మ అజ్ఞానం. చక్కగా నీటిలో స్నానం చేసివచ్చిన వెంటనే ఏనుగు తన తొండంతో తనమీద ఇంత మట్టి జల్లుకుంటుంది. మనమూ

అంతే. చక్కగా సుషుప్తిలో ఆనందం అనుభవించి లేచిన వెంటనే అనాత్మ లక్షణాలను మనమీద ఆరోపించుకుంటాము.

అందువల్ల శాస్త్రం కావాల్సింది బ్రహ్మ గురించి బోధించటానికి కాదు, మనం మనమీద వేసుకున్న అపోహలను తొలగించటానికి కావాలి. ఈ అపోహలు వృత్తిలో మార్పువల్ల తొలుగుతాయి. ఆ వృత్తిని అహం బ్రహ్మ అస్మి వృత్తి అంటారు.

అహం బ్రహ్మ అస్మి అనటంవల్ల నేను కొత్తగా ఏమీ నేర్చుకోవటం లేదు; నేను పరిమితి ఉన్న శరీరాన్ని, మనస్సును అనే అపోహను తొలగించు కుంటున్నాను. ఈ జీవాత్మ భావాన్ని తొలగించుకోవటమే ఆత్మజ్ఞానం. అందువల్ల ఆత్మజ్ఞానం అంటే కొత్త అనుభవం పొందటం కాదు; ఆలోచనలో మార్పు పొందటం.

**ప్రమాతృ ప్రమాణ ప్రమేయ రూప త్రిపుటి నివృత్తి**
**పరిచ్ఛేద నివృత్తి ఏవ ఆత్మ జ్ఞానమ్**

ప్రమాత, ప్రమాణం, ప్రమేయం అనే భేదాలు లేవు. ఉన్నది ఒక్కటే ఆత్మ. ఆత్మకు పరిమితులు లేవు. ఇది తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం అన్నారు శంకరాచార్యులవారు. ఇటువంటి ఆత్మజ్ఞానం శాస్త్రంవల్లనే కలుగుతుంది కాని వేరే విధంగా కాదు. అందువల్ల శాస్త్రం ప్రమాణం.

**బ్రహ్మబోధన రూపేణ శాస్త్రం న ప్రమాణమ్**
**పరంతు అధ్యాస నివర్తక రూపేణ శాస్త్రం ప్రమాణమ్**

శాస్త్రం బ్రహ్మను ప్రత్యక్షంగా బోధించదు, బ్రహ్మ గురించి ఉన్న అపోహలను తొలగిస్తుంది. ఈ సత్యాన్ని వెలిబుచ్చే సూత్రం ఒకటి ఉంది బ్రహ్మసూత్రములలోనే.

శాస్త్రం ఆ విధంగా మనం మనమీద మనం ఆపాదించుకున్న అపోహలను తొలగించే విషయంలో ప్రమాణం. ఆ విధంగా ఆత్మజ్ఞానం పొందటం సాధ్యమే. దానికి శాస్త్రం ప్రమాణం. ఆ శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి గురువు కూడా అవసరమే. బ్రహ్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి ఉపాసన కుదరదు; బ్రహ్మ గురించిన అపోహలు తొలగిస్తుంది కాబట్టి బ్రహ్మజ్ఞానం సాధ్యమే. దానికి వేదమే ప్రమాణం. నేతినేతి పద్ధతిద్వారా అంటే ఇదికాదు (న+ఇతి) ఇదికాదు

పద్ధతిద్వారా బ్రహ్మ ఇది కాదని ఖండించుకుంటూ వస్తుంది కాబట్టి, ఇటువంటి ప్రమాణాన్ని **నిషేధరూప ప్రమాణం** అంటారు.

**నిషేధరూప ప్రమాణం ద్వారా బ్రహ్మజ్ఞానం సాధ్యమే**

ఇంతవరకూ శంకరాచార్యులవారు వృత్తికారమతాన్ని ఖండించుకుంటూ వచ్చారు. ఇక్కడనుంచి కొన్ని వాక్యాలను తీసుకుని వాటిని ఖండించుకు వస్తారు.

**కొన్ని వాక్యాలమీద వాదనలు**

15.**క్రియా సంబంధరహితవాక్యం అప్రమాణం– కేవలజ్ఞానేన కిమపి ప్రయోజనం నాస్తి** – బ్రహ్మజ్ఞానం మోక్షం ఇవ్వలేదు. ఎందుకంటే ఏ జ్ఞానం కూడా జ్ఞానం పొందినంత మాత్రాన ఫలాన్ని ఇవ్వలేదు, దానికి సంబంధించిన కర్మను చెయ్యాలి. ఈ విషయంలో వృత్తికారుడు, భాట్టమతం వారితోనూ, ప్రాభాకరమతం వారితోనూ ఏకీభవిస్తున్నాడు. ఈ విషయంలో అంటే కేవలజ్ఞానం మోక్షాన్ని ఇవ్వదు అనే విషయంలో ఏకీభవిస్తున్నాడు. తన వాదాన్ని సమర్థించుకోవటానికి అతను కూడా జైమినీసూత్రాన్నే ఉటంకిస్తున్నాడు

**ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**

వేదంలో ఏదైనా కర్మను చెయ్యమని చెప్పిన వాక్యాలే ప్రమాణవాక్యాలు. కర్మను బోధించని వాక్యాలు అప్రమాణం. క్రియసంబంధరహిత వాక్యాలు అప్రమాణం అంటారు వీరు.

**విధివాక్యాని ఏవ ప్రమాణాని**

విధివాక్యాలు అంటే ఏదైనా కర్మ చెయ్యమని బోధించే వాక్యాలు. కర్మ చెయ్యమని చెప్పని వాక్యాలను అర్థవాదవాక్యాలు అంటారు. అంటే వాటంతట అవి ప్రయోజనకారి వాక్యాలు కావు. అవి దేన్నో స్తుతిస్తాయి; అవి దేన్ని స్తుతిస్తే వాటితో ఈ వాక్యాలను కలుపుకోవాలి. అందువల్ల కేవలజ్ఞానంవల్ల ఏమీ ప్రయోజనం లేదు.

**శంకరులవారి జవాబు** – ఇదే ప్రశ్నకు జవాబు ఇంతకు ముందు కూడా చూశాము (ప్రశ్న 1).

**ప్రశ్న 1** – వేదాంతం నేర్చుకుంటే చాలదు; దాని తర్వాత కర్మ చేయాలి.

**జవాబు** – దీనికి శంకరులవారు మూడు జవాబులు ఇచ్చారు.

ఎ) **కర్మ సంబంధం అవసరం లేదు.** జ్ఞానమాత్రేన మోక్షఫలం భవతి.

బి) **కర్మ సంబంధం కుదరదు.** కర్మను నిందించాక, కర్మతో కలపమని చెప్పదు శాస్త్రం.

సి) **కర్మ సంబంధం అసాధ్యం.** కర్మ చెయ్యటానికి ద్వైతభావన, కర్తృత్వభావన, వర్ణాశ్రమభావన ఉండాలి. జ్ఞానం వీటిని నిషేధిస్తుంది. రెండూ భిన్నంగా ఉంటాయి కాబట్టి కర్మ సంబంధం అసాధ్యం అని అక్కడ నిరూపించారు శంకరులవారు.

అలా అక్కడ జ్ఞానకాండను సమర్థించుకువచ్చారు. అంటే డిఫెన్సివ్ మెథడ్‌ని వాడారు. ఇప్పుడు అఫెన్సివ్ మెథడ్‌ని వాడబోతున్నారు. అంటే వారి కర్మకాండలోని కొన్ని వాక్యాలను ప్రశ్నిస్తున్నారు. అంతకుముందు వారు **అర్థవాద వాక్యాల**ని క్రియాకారక వాక్యాలతో కలపాలని చెప్పారని చూశాము. ఉదాహరణకు వాయువు విషయం కూడా చూశాము.

వాయుర్వై క్షేపిష్ఠాదేవతా – అర్థవాద వాక్యం

వాయవ్యం శ్వేతమాలభేత – క్రియాబోధక వాక్యం

వాయువు చాలా త్వరగా వెళ్ళే దేవత అనే వాక్యం వాయువును స్తుతిస్తుంది. దాన్ని వాయువుకు తెల్లని పశువును ఇవ్వాలి అనే వాక్యంతో కలుపుకోవాలి. దానివల్ల వాయువు శీఘ్రంగా ఫలమిస్తాడని అర్థం వస్తుంది అంటారు పూర్వమీమాంసకులు.

ఇప్పుడు శంకరాచార్యులవారు చేసిన వాదన, 'వేదంలో నిషేధవాక్యాలను మీరు ఒప్పుకుంటారా?' వృత్తికారుడు కూడా వేదంలో విధివాక్యాలు, నిషేధ వాక్యాలు ఉన్నాయని ఒప్పుకుంటాడు. విధివాక్యాలు ఫలానా కర్మను చెయ్యమని ఆజ్ఞాపిస్తే, నిషేధవాక్యాలు ఫలాన కర్మను చెయ్యవద్దని ఆజ్ఞాపిస్తాయి. ఇంగ్లీషులో చెప్పాలంటే డూస్ అండ్ డోంట్స్ (Dos and Don'ts)ను సూచిస్తాయి. నిషేధ వాక్యాలకు కొన్ని ఉదాహరణలను చూద్దాము.

**హింసాన్న కుర్యాత్** – హింస చెయ్యకూడదు

**కరంజం న భక్షయేత్** – మాంసాహారం తీసుకోకూడదు

**సురాం న పిబేత్** – మద్యం సేవించకూడదు

ఇప్పుడు చెప్పండి, 'ఈ నిషేధవాక్యాలు ప్రమాణవాక్యాల్లోకి వస్తాయా, అప్రమాణ వాక్యాల్లోకి వస్తాయా?' అంటారు శంకరులవారు. వృత్తికారుడు, భాట్టమతం వారు, ప్రాభాకరమతం వారు – అందరూ నిషేధవాక్యాలను ప్రమాణ వాక్యాలుగా స్వీకరిస్తారు. వాటిని అర్థవాదవాక్యాలుగా పరిగణించరు.

ఇప్పుడు చెప్పండి, 'ఈ నిషేధవాక్యాలు ప్రమాణవాక్యాలైతే అవి ఏ కర్మను బోధిస్తున్నాయి?' మద్యం సేవించకూడదు వాక్యంలో ఏ కర్మ చెయ్యమని ఉంది? నిజానికి ఒక కర్మ చెయ్యవద్దని చెబుతున్నది. కర్మ వద్దనటం కర్మ అవుతుందా? అవకాశమే లేదు! చెయ్యవద్దు అంటే కర్మ లేదు అక్కడ. అందువల్ల నిషేధవాక్యాలు. వాటిని ఔదాసీనవాక్యాలు అంటారు. అంటే వాటికి ఏమీ కర్మ చెయ్యకూడదు.

ఈ నియమం ప్రకారం, నిషేధవాక్యాలు ఎటువంటి క్రియాసంబంధం లేకపోయినా కూడా ఎలా ప్రమాణవాక్యాలు అయ్యాయో, అదే విధంగా వేదాంత వాక్యాలకు క్రియాసంబంధం లేకపోయినా కూడా, స్వప్రయోజనం ఇస్తాయి కాబట్టి అవి కూడా ప్రమాణవాక్యాలే.

నిషేధవాక్యానికి ఏ కర్మా అవసరం లేదు; వేదాంతవాక్యానికి ఏ కర్మా అవసరం లేదు. నిషేధవాక్యాలు ప్రమాణం అయినట్టే వేదాంతవాక్యాలు కూడా ప్రమాణమే. అందువల్ల ఆమ్నాయస్య సూత్రం అన్నివేళలా పనిచెయ్యదు. విధివాక్యాలే కాదు, నిషేధవాక్యాలు, వేదాంతవాక్యాలు కూడా ప్రమాణాలే.

**వేదాంత వాక్యమ్ అపి ప్రమాణమ్ ఏవ స్వప్రయోజనత్వాత్ నిషేధ వాక్యవత్**

16. **వేదాంత శ్రవణేన మోక్షః నైవ సిద్ధ్యతి** – వేదాంతజ్ఞానం పొందితేనే చాలు, మోక్షం పొందుతారు అంటే, వేదాంతం నేర్చుకునే శిష్యులందరూ ముక్తపురుషులు అవ్వాలి. వారు ఎన్నో సంవత్సరాలుగా జ్ఞానం పొందుతారు కాని వారిని, 'మీరు జీవన్ముక్తులా?' 'మీరు మోక్షం పొందారా?' 'మీకు విదేహముక్తి వస్తుందా?' 'మీరు పునర్జన్మ వృత్తంలోంచి బయటపడ్డారా?' ప్రశ్నలు వేస్తే వాటికి వారినుంచి జవాబు వెంటనే ఖచ్చితంగా 'అవును,' అని రాదు. వారి జవాబులు ఎప్పుడూ, 'కాని...,' 'ఒకవేళ...,' పదాలతో మొదలవుతాయి. గురువును గొప్పగా కీర్తిస్తారు, చిన్న పిల్లవాడు కూడా చక్కగా అర్థం చేసుకోగలడు, అంత స్పష్టంగా ఉంటుంది ఆయన బోధ అంటారు. నిజంగా అంత బాగా అర్థమయితే, శ్రవణంవల్లనే వారికి మోక్షం రావాలి కదా; కానీ, ఒకవేళ జవాబులు ఎందుకు వస్తున్నాయి?

అంటే దీన్నిబట్టి ఏమర్థమవుతున్నది? శ్రవణం ముఖ్యమే కాదనటం లేదు; కాని కేవలం శ్రవణంవల్ల మోక్షం రాదు; దానికి ఉపాసన తోడవ్వాలి. అప్పుడు మోక్షం వస్తుంది.

**శంకరులవారి జవాబు** – వేదాంతబోధ విన్నంతమాత్రాన మోక్షం వచ్చేస్తుంది అని మేమెన్నడూ ప్రకటించలేదు; కాని వేదాంతజ్ఞానాన్ని జీర్ణించుకున్న వ్యక్తికి తప్పకుండా మోక్షం వస్తుంది అంటారు శంకరులవారు. వేదాంతబోధను వినటానికి, జీర్ణించుకోవటానికి మధ్య ఏమిటి భేదం? చాలా ఉంది. అది చూడటానికి ఒక గురుశిష్యుల మధ్య ఈ సంభాషణను ఊహించుకోండి.

శిష్యుడు: ఆచార్యా, నేను బోధను శ్రద్ధగా విన్నాను; నాకు అత్మ, బ్రహ్మ, జగత్తుల గురించి బాగా అర్థమయింది.

గురువు: ఆత్మ నిర్వచనం చెప్పు.

శిష్యుడు: **స్థూలసూక్ష్మకారణ శరీరాత్ వ్యతిరిక్తః పంచకోశాతీతః సన్, అవస్థాత్రయ సాక్షీ సచ్చిదానంద స్వరూపః సన్ యః తిష్ఠతి సఆత్మా**

ఆత్మ మూడు శరీరాలకు భిన్నంగా ఉంది; పంచకోశాలకు అతీతంగా ఉంది; అవస్థాత్రయ సాక్షి, సచ్చిదానంద స్వరూపం.

గురువు: ఆత్మ గురించి నువ్వు నేర్చుకున్న కొన్ని లక్షణాలు చెప్పు.

శిష్యుడు: **న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః**

**అజో నిత్యః శాశ్వతో–యం పురాణో న హన్యతే హన్యమానే శరీరే**

గీత 2.20

ఆత్మకు చావు లేదు, పుట్టుక లేదు, షడ్వికారాలు లేవు, జన్మ లేదు, నిత్యం, శాశ్వతం, పురాతనం. శరీరం చంపబడినా ఆత్మ చావదు.

గురువు: బ్రహ్మ ఎవరు?

శిష్యుడు: బృహత్వమత్వాత్ బ్రహ్మ. బ్రహ్మ అత్యంత చిన్నదాని కంటే చిన్నది; అత్యంత పెద్దదానికంటే పెద్దది.

గురువు: మహావాక్యం అంటే ఏమిటి?

శిష్యుడు: జీవాత్మ, పరమాత్మల ఐక్యం బోధించేది. తత్త్వమసి అంటే నువ్వే ఆ బ్రహ్మావు.

గురువు: నువ్వెవరు?

శిష్యుడు: అహం బ్రహ్మ అస్మి. నేనే ఆ బ్రహ్మను. నేను = ఆత్మ = బ్రహ్మ.

గురువు: ఈ జ్ఞానం పొందిన వ్యక్తికి కలిగే ఫలమేమిటి?

శిష్యుడు: అతను బ్రతికి ఉండగా జీవన్ముక్తి పొందుతాడు; మరణించాక విదేహముక్తి పొందుతాడు. అతనికి పునర్జన్మ ఉండదు.

గురువు: మోక్షం సాధ్యవస్తువా, సిద్ధవస్తువా?

శిష్యుడు: మోక్షం సిద్ధవస్తువు. నేను నిత్యశుద్ధ, ముక్తపురుషుడిని.

గురువు: నిజమే నువ్వు బోధను చాలా బాగా అర్థం చేసుకున్నావు. ఇప్పుడు చెప్పు, నీకు పునర్జన్మ ఉందా, లేదా?

శిష్యుడు: అయ్యో, నేనెలా చెప్పగలను? కాని ఒకటి మాత్రం చెప్పగలను – నాకు ఇంక ఒక్క జన్మ మాత్రమే ఉంది; వచ్చే జన్మలో ఖచ్చితంగా మోక్షం వస్తుంది. అప్పుడు కూడా మీరే నాకు గురువుగా రావాలి.

గురువు: ఇప్పుడే కదా ఆత్మకు చావులేదు, పుట్టుక లేదు అన్నావు; మళ్ళీ నేనెలా చెప్పగలను అంటావేమిటి?

శిష్యుడు: ఆత్మకు చావు పుట్టుకలు లేవని తెలుసు. కాని నాకు చావు పుట్టుకలు ఉన్నాయో లేదో తెలియదు.

ఈ సంభాషణవల్ల మీకేమర్థమయింది? శిష్యునికి బోధ బాగా అర్థమయింది; గురువు చెప్పిన వాక్యాలను చిలకలా వల్లిస్తున్నాడు; ముఖ్యమైన సూత్రములను సంస్కృతంలో నేర్చుకున్నాడు; కాని వాటిని జీర్ణించుకోలేకపోయాడు. అతను ఆత్మ అని తెలుసు, ఆత్మ బ్రహ్మ ఒకటే అని తెలుసు; ఆ జ్ఞానం పొందితే మోక్షం పొందుతాడని తెలుసు; కాని ఆ విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేక పోతున్నాడు. అలాంటి వ్యక్తికి మోక్షం రాదు.

అతనే కాదు, వృత్తికారుడు చెప్పినట్టుగా, చాలామంది ఎన్ని సంవత్సరాలు నేర్చుకున్నా కూడా, ఆ జ్ఞానాన్ని నేర్చుకున్నంత తేలికగా జీర్ణించుకోలేరు. 'నీకు మోక్షం వస్తుందా?' అని అడిగిచూడండి, రకరకాల జవాబులు వస్తాయి –

'ఏమో అప్పుడే చెప్పలేను, బ్రహ్మసూత్రాలు కూడా నేర్చుకున్నాక, వస్తుందేమో!'

'ఇప్పుడే రాదు, కాని గురువు దయ ఉంటే తర్వాతెప్పుడో వస్తుంది.' గురువు బోధతో పాటు గురుకృప కూడా కావాలి అంటారు వీరు. అందువల్ల గురువు దగ్గరికి వెళ్ళినప్పుడు, 'స్వామీజీ, మేము ముక్తపురుషులమని మాకు తెలుసు, కాని మాకు మీ దయ కావాలి. మేము త్వరగా మోక్షం పొందేలా మమ్మల్ని దీవించండి అంటారు.' అంటే కొన్ని పదాలను అర్థం తెలియకుండా వాడేస్తారు. ముక్తపురుషులు అంటే మోక్షం పొందేశారు అని అర్థం, కాని మళ్ళీ మోక్షం పొందాలని దీవించండి అంటారు.

**ఆచార్యః శంకరాచార్యః సంతు మే జన్మజన్మని**

అన్నట్టు ఉంటుంది. ఒకపక్క అద్వైతం నేర్చుకుంటూ, విదేహముక్తి పొందుతామని తెలుసుకుంటూ, జన్మజన్మలకూ శంకరాచార్యులవారే ఆచార్యులుగా రావాలని కోరుకుంటే ఎలా ఉంటుంది?

అందువల్ల 'నీకు విదేహముక్తి ఉందా?' అని ఎవరైనా అడిగితే, ఒక్కక్షణం కూడా తడుముకోకుండా 'నాకు మొదటి జన్మే లేదు, ఇంక వేరే జన్మ వచ్చే ఆస్కారం ఎక్కడ ఉంది. శరీరత్రయానికి జన్మ ఉంది కాని నేను నిత్యముక్తశుద్ధ ఆత్మను. నాకు చావుపుట్టుకలు లేవు,' అనగలగాలి. అలా నమ్మకంగా చెప్పగలిగిన వ్యక్తి, అంటే తను ఆత్మను అని స్వీకరించగలిగిన వ్యక్తికి పునర్జన్మ ఉండదు. అతను కర్మ చేయాల్సిన పనికూడా లేదు.

జ్ఞానం అంటే నిశ్చయజ్ఞానం కలగాలి. నిశ్చయజ్ఞానం ఉన్నచోట సంసారానికి చోటులేదు. మీకు,'నేను ముక్తపురుషుణ్ణి,' అనే నమ్మకం ఏర్పడకపోతే, మీ జ్ఞానం నిశ్చయజ్ఞానం కాదన్నమాట. ఎందుకంటే నిశ్చయజ్ఞానంలో సందేహానికి చోటులేదు.

అందువల్ల వేదాంత శ్రవణం చేస్తే చాలదు; అలాంటివారికి మోక్షం రాదు. జ్ఞాననిష్ఠలో నిలబడినవారు తాము ముక్తపురుషులమని తెలుసుకుంటారు. వీరివురికీ మధ్య భేదం ఎలా తెలుస్తుంది? కేవలం శ్రవణం చేసినవారిని **శ్రుతబ్రహ్మ** అంటారు. నేర్చుకున్న జ్ఞానాన్ని నిష్ఠగా మలుచుకున్నవారిని **అవగతబ్రహ్మ** అంటారు. శ్రుతబ్రహ్మ 'ఉపనిషత్తు నేను ముక్తపురుషుణ్ణి అంటుంది,'

అంటాడు. అవగతబ్రహ్మ 'నేను ముక్తపురుషుణ్ణి. అది సత్యం,' అంటాడు. అవగతబ్రహ్మ జ్ఞాననిష్ఠలో ఉంటాడు కాబట్టి అతనికి సంసారం అంటదు. అటువంటి వ్యక్తికి ఉపాసన అవసరం లేదు.

శ్రుతబ్రహ్మకు మోక్షం రాదు కాని అవగతబ్రహ్మకు మోక్షం వస్తుంది. ఇంకా చెప్పాలంటే అతను ముక్తపురుషుడు.

17. **జ్ఞానానంతరం ఉపాసనం కర్తవ్యమ్** – కేవలం అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితేనే మోక్షం వచ్చేటట్టయితే, శ్రుతి ఎందుకు ఉపాసనను నిర్దేశిస్తుంది?

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**–బృహదారణ్యకమ్

శ్రుతే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలని నిర్దేశిస్తున్నది. నిదిధ్యాసనం అంటే ఏమిటి? ఉపాసనే. మీరు నిదిధ్యాసనం అంటారు. మేము ఉపాసన అంటాము అంటాడు వృత్తికారుడు. అందువల్ల వేదాంతజ్ఞానం పొందితే మోక్షం రాదు, జ్ఞానం పొందాక ఉపాసన చేసితీరాలి.

**శంకరులవారి జవాబు** – జ్ఞానయోగంలో భాగంగా ఈ మూడూ వస్తాయి. శ్రవణ, మనన, నిదిధ్యాసనలను కలిపి జ్ఞానయోగం అంటారు. జ్ఞాననిష్ఠలో నిలబడటానికి మూడూ చేయాలి. అందువల్ల ఇది ఉపాసనలోకి రాదు.

నిదిధ్యాసనం జ్ఞానం పొందాక చేసేది కాదు, అది కూడా జ్ఞానం పొందటంలో ఒక భాగం. అందువల్ల జ్ఞానంకోసం చేయాలి.

18. **శ్రవణ మనన నిదిధ్యాసనలు జ్ఞానం పొందటానికి చెయ్యాలని ఎలా చెప్పగలరు?**

నిదిధ్యాసనం అంటే ఉపాసన కాదు, జ్ఞానం పొందాక చేసేది కాదు, జ్ఞానం పొందటానికి చేసేది అన్నారు కదా శంకరులవారు. అలా ఎలా చెప్పగలరు అంటున్నాడు వృత్తికారుడు. జ్ఞానం పొందటానికి ఈ మూడూ కావాలని ఎలా అంటారు?

**శంకరులవారి జవాబు** – ఈ సందర్భంలో దీనికి శంకరులవారు జవాబు చెప్పలేదు కాని, మనం వేరే సందర్భంలో చెప్పినదానిని ఇక్కడ తెచ్చుకుంటున్నాము. శ్రవణ, మనన, నిదిధ్యాసనల వివరణ చూస్తే ఎందుకు ఈ మూడూ జ్ఞానం పొందటంలో భాగంగా వస్తుందో అర్థమవుతుంది.

ఎ) **శ్రవణం** – అపరోక్షజ్ఞానం. ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గర వేదాంతశాస్త్ర అధ్యయనం చెయ్యటం. శ్రవణం చెయ్యటంవల్ల జ్ఞానం కలుగుతుంది. దాన్ని **అపరోక్షజ్ఞానం** అంటారు. కాని జ్ఞానం పొందినంత మాత్రాన ప్రయోజనం లేదు. ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి కొన్ని ఆటంకాలు కలుగుతాయి. వాటిని ప్రతిబంధకాలు అంటారు. ఆ ప్రతిబంధకాలు ఉన్నంతవరకూ జ్ఞానం అది ఇవ్వాల్సిన ఫలితాన్ని ఇవ్వలేదు. జ్ఞానఫలం ఏమిటి? సంసారనివృత్తి. ప్రతిబంధకాలు ఏమిటి? సంశయం, విపర్యయం. మనన, నిదిధ్యాసనలు వాటిని పోగొడతాయి.

బి) **మననం** – అప్రతిబంధకజ్ఞానం. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతాము నిజమే కాని, నేను బ్రహ్మ అవటం ఏమిటి అనే సందేహం కలుగుతుంది. కొన్ని దర్శనాలు ఇవి ఒప్పుకోవు. వేదాంతంలోనే విశిష్టాద్వైతం నువ్వు ఎన్నటికీ బ్రహ్మవు కాలేవు, అది అసాధ్యం అంటుంది. మహా అయితే బ్రహ్మలో ఒకభాగం కాగలవు అంతే అంటుంది.

నేను బ్రహ్మను అనే వాక్యానికీ, నేను బ్రహ్మలో ఒకభాగం అనే వాక్యానికీ చాలా భేదం ఉంది. ఒకదానికొకటి చుక్కెదురు అవుతాయి. ఒకటి స్వీకరిస్తే, ఇంకొకదాన్ని స్వీకరించలేము. నేను బ్రహ్మలో ఒకభాగం అయితే, నేను పూర్తి బ్రహ్మను అవలేను; అలాగే నేను పూర్తిబ్రహ్మను అయితే నేను బ్రహ్మలో ఒకభాగాన్ని అవలేను. మనకు విశిష్టాద్వైతంమీద గౌరవం ఉంది, కాదనటం లేదు, కాని ఒకటి స్వీకరిస్తే, ఇంకొకటి కాదనక తప్పదు.

నేను వీధిలో ఉన్నాను అంటే నేను ఇంట్లో లేను అని అర్థం. అలాగే నేను ఇంట్లో ఉన్నాను అంటే నేను వీధిలో లేను అని అర్థం. అలాగే నేను బ్రహ్మలో భాగం అంటే నేను బ్రహ్మను కాదు అని అర్థం; నేను బ్రహ్మను అంటే నేను బ్రహ్మలో భాగాన్ని కాదు అని అర్థం. రెండూ ఒప్పుకున్నట్టు కనిపించవచ్చేమో కాని, సత్యం ఒకటే ఉంటుంది. ఈ విషయం తెలియక రెండూ సత్యమే అంటే అంజనం అంటే ఏమిటో నాకు తెలియదా? పసుపులా తెల్లగా ఉంటుంది అన్నట్టే అవుతుంది. అది అన్నవ్యక్తికి మూడురంగులూ తెలియవు. రెండు సిద్ధాంతాలనూ ఒప్పుకున్నవ్యక్తికి రెండూ తెలియవు.

పైగా విశిష్టాద్వైతానికి, అద్వైతానికి మధ్య ఇంకొక పెద్ద భేదం ఉంది. అద్వైతం ఆత్మజ్ఞానం పొందితే జీవన్ముక్తి పొందుతావు అంటుంది. అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతావు అంటుంది. కాని విశిష్టాద్వైతం జీవన్ముక్తిని అంగీకరించదు. ఇక్కడ మోక్షాన్ని ఒప్పుకోదు. మరణించాక శుక్లగతిద్వారా ప్రయాణించి ఊర్ధ్వలోకాలకు వెళ్ళటమే మోక్షం అంటుంది.

అందువల్ల బుద్ధిలో నిశ్చయజ్ఞానం కలగాలి. ఏమాత్రం సందేహం మిగిలినా కూడా అది సప్రతిబంధక జ్ఞానం అవుతుంది. దాన్ని దృఢజ్ఞానం అనలేము.

దృఢజ్ఞానం పొందటానికి, సంశయనివృత్తి చేసుకోవటానికి మననం తోడ్పడుతుంది. మనలో కలిగే సందేహాలను మళ్ళీ వినటంద్వారా తీర్చుకోవచ్చు, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకోవచ్చు; మళ్ళీ గురువునే అడిగి తీర్చుకోవచ్చు.

సి) **నిదిధ్యాసనం** – విపరీతభావనలు పోయి జ్ఞాననిష్ఠ. నాకు నేను ఆత్మను అని అర్థమయింది, కాని నాకు ఇంకా రాగద్వేషాలు పోలేదు; అందువల్ల నేను అప్పుడే జీవన్ముక్తుణ్ణి కాలేను అనుకుంటారు కొంతమంది. దీన్ని విపర్యయం లేదా విపరీతభావన అంటారు. ఒకపక్క నేను ఆత్మను అని ఒప్పుకుంటూనే, అనాత్మస్థాయిలో కలిగే సమస్యల గురించి బాధపడుతున్నారు. ఉదాహరణకు రాగద్వేషాలు మనస్సుకు చెందినవి; మనస్సు అనాత్మలోకి వస్తుంది; నేను రాగద్వేషాలున్న అనాత్మ అయిన మనస్సును సాక్షీభూతంగా చూసే ఆత్మను. ఈ రాగద్వేషాలు నాకు అంటవు. కాని ఈ సత్యంలో నిలబడటానికి నా అలవాట్లు ఆటంకం అవుతాయి. అలవాటును విపరీతభావన అంటారు.

ఆత్మ లక్షణాలు తెలుసు కాని కొన్ని సంవత్సరాలుగా నేను శరీరం, నేను మనస్సు అని మనలో కూరుకుపోయిన భావాలు ఆ నిష్ఠలో నిలబడటానికి అడ్డుపడుతున్నాయి. ఆ అలవాటు పోవటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. అంటే బుద్ధిలో కలిగిన జ్ఞానాన్ని మనస్సు స్థాయిలోకి దింపాలి. అది దింపనంత వరకూ ఆత్మ బాహ్యవస్తువుగా ఉంటుంది కాని నేను ఆత్మను అని అర్థం చేసుకోలేను. అలాంటి జ్ఞానాన్ని సప్రతిబంధక జ్ఞానం అంటారు. సప్రతిబంధక జ్ఞానం ఉన్నా లేనట్టే. అది కూడా అజ్ఞానంలోకి వస్తుంది.

ఆ విధంగా శ్రవణం జ్ఞానాన్ని కలుగజేస్తుంది. మననం, నిదిధ్యాసనలు ప్రత్యక్షంగా జ్ఞానాన్ని కలుగజేయవు కాని ఆటంకాలను తొలగిస్తాయి. మననం

బుద్ధిస్థాయిలో కలిగే సందేహాలను తొలగిస్తే, నిదిధ్యాసనం మనస్సు స్థాయిలో కలిగే రాగద్వేషాలను తొలగిస్తుంది. అంటే జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా తీర్చిదిద్దుతాయి. మనన, నిదిధ్యాసనలు; ప్రజ్ఞ కలిగిన జ్ఞానిని స్థితప్రజ్ఞునిగా నిలబెడతాయి.

నిశ్చయజ్ఞానం కలగాలి అంటే నాలుగు అంశాలు స్పష్టంగా తెలియాలి.

ఎ) సరియైనది ఏమిటో, దాన్ని సరియైనదిగా తెలుసుకోవాలి

బి) తప్పైనది ఏమిటో, దాన్ని తప్పైనదిగా తెలుసుకోవాలి

సి) సరియైనది ఎందుకు సరియైనదో తెలుసుకోవాలి

డి) తప్పైనది ఎందుకు తప్పో తెలుసుకోవాలి.

దీనికి సరిపోలిన ఇంగ్లీషు కొటేషన్ ఒకటి ఉంది. దాన్ని కూడా చూద్దాము.

a) He who knows not and who knows not that he knows not is a fool, shun him.

b) He who knows not but he knows that he knows not he is simple, teach him.

c) He who knows and knows not that he knows, he is asleep, awaken him.

d) He who knows and knows that he knows he is wise, follow him.

ఈ వాక్యాల అర్థాలను చూద్దాము.

ఎ) అతనికి తెలియదు, అతనికి తెలియదని కూడా అతనికి తెలియదు, అటువంటి వ్యక్తి మూర్ఖుడు, అతన్ని పట్టించుకోకండి.

బి) అతనికి తెలియదు, కాని అతనికి తెలియదని అతనికి తెలుసు, అటువంటి వ్యక్తి అమాయకుడు, అతనికి బోధ చెయ్యండి.

సి) అతనికి తెలుసు, కాని అతనికి తెలుసని అతనికి తెలియదు, అటువంటి వ్యక్తి నిద్రపోతున్నాడు, అతన్ని లేపండి.

డి) అతనికి తెలుసు, అతనికి తెలుసని అతనికి తెలుసు, అటువంటి వ్యక్తి జ్ఞాని, అతనిని అనుసరించండి.

నాలుగవరకం వ్యక్తి జ్ఞాని. అతనికి జ్ఞానం ఉంటుంది; తనకు జ్ఞానం ఉందని అతనికి తెలుస్తుంది. కొంతమంది తమకు సరియైనది ఏదో, సరియైనదిగా తెలియకపోయినా, అదే సరియైనది అనుకుంటారు. తప్పైనది ఎందుకు తప్పో వారికి తెలియదు.

బ్రహ్మసూత్రములు రెండవ అధ్యాయంలో తప్పైనది ఏమిటో నిరూపించటమే కాక, తప్పైనది ఎందుకు తప్పో కూడా నిరూపిస్తారు వ్యాసాచార్యులవారు. పైన చూసినట్టుగా సరియైనది ఏమిటో, ఎందుకు సరియైనదో తెలుసుకోవాలి. అలాగే తప్పైనది ఏమిటో, ఎందుకు తప్పో కూడా తెలుసుకోవాలి. తప్పును తప్పుగా ఒప్పుకోగలగాలి. తక్కిన దార్శనికులు అయిన కపిలఋషి, జైమినిఋషి, పతంజలిఋషి వీరంతా గొప్ప ఋషులు. వారిని వ్యక్తులుగా గౌరవిస్తాము కాని మనం అద్వైతవేదాంత సిద్ధాంతాన్ని మాత్రమే స్వీకరించాలి. అన్నింటినీ ఒప్పుకుంటే మనం అయోమయంలో పడిపోయినట్టు అవుతుంది.

నిదిధ్యాసనం ఈ అయోమయాలను పారద్రోలటానికి తోడ్పడుతుంది. ఆత్మ నిత్యం, సర్వగతం, అసంగం అని నేర్చుకున్న పదాలను నిదిధ్యాసనంలో నేను నిత్యం, నేను సర్వగతం, నేను అసంగం అని సాధన చేయాలి. అంటే ఆ పదాల అర్థాల్లో నిలబడగలగాలి. నిదిధ్యాసనంలో స్థితప్రజ్ఞుని లక్షణాలను అనుకరించాలి. పూజ్యస్వామీజీ, 'Fake it and make it,' అంటారు. అంటే స్థితప్రజ్ఞుని లక్షణాలు ఉన్నట్టుగా భావించుకుని అలా ప్రయత్నిస్తే, కొన్ని రోజులయ్యాక, అవి సహజంగా మారుతాయి. నాకు చావు, పుట్టుకలు లేవు; నేను ముక్తపురుషుణ్ణి అనుకోవాలి. ఇలా ఈ భావనల్లో నిలబడటంవల్ల కొత్తగా పుణ్యమూ రాదు; కొత్తగా మోక్షమూ రాదు; కాని అది జ్ఞాననిష్ఠలో నిలబడకుండా అడ్డుపడే ఆటంకాలను తొలగిస్తుంది. దాన్ని విపరీతభావన అంటారని చూశాము.

ఆ విధంగా శ్రవణం అపరోక్ష జ్ఞానాన్ని కలుగజేస్తే, మనన, నిదిధ్యాసనలు అప్రతిబంధక జ్ఞానాన్ని కలుగజేస్తాయి. ఆ విధంగా మూడూ జ్ఞానానికే తోడ్పడతాయి.

ఉదాహరణకు ఒక చీకటిగదిలో ఒక బల్బు ఉందనుకుందాము. దానికి స్విచ్‌తో కనెక్షన్ సరిగ్గానే ఇచ్చారు. అంటే శ్రవణం సరిగ్గానే అయింది. అప్పుడు ఆ గదిలో స్విచ్ వెయ్యగానే చీకటిని పారద్రోలుతూ గది అంతటా కాంతి పరుచుకుంటుంది. అలా మనస్సనే బల్బు శ్రవణంవల్ల వెలగాలి. కాని మళ్ళీ ఆ చీకటిగది విషయం తీసుకుంటే స్విచ్ వేసినా చీకటి తొలగలేదు. స్విచ్ సరిగ్గానే ఉంది, బల్బు కూడా సరిగ్గానే ఉంది, అయినా ఎందుకు చీకటి తొలగలేదు? దానిమీద రెండు నల్లటిగుడ్డలు కప్పబడివున్నాయి. ఆ విషయం తెలిసి, వాటిని తీయగానే చీకటి మటుమాయమై, కాంతి పరుచుకుంది.

ఇప్పుడు చెప్పండి – బల్బు చీకటిని తొలగిస్తుందా అంటే కొన్నిసార్లు తొలగిస్తుంది, కొన్నిసార్లు తొలగించదు అనగలరా మీరు? బల్బుకు కాంతిని ప్రసాదించే శక్తి ఉంది, కాని ఇక్కడ దాని శక్తిని అడ్డుకుంటూ రెండు నల్లగుడ్డలు ఉన్నాయి. అలాంటప్పుడు మనమేం చేయాలి? కేవలం ఆ గుడ్డలను తొలగించాలి అంతే. గుడ్డలు తీస్తే చీకటి పోయింది. ఇప్పుడు చెప్పండి, 'చీకటిని ఏది పారద్రోలింది?' 'గుడ్డలు తీయటంవల్ల చీకటి పోయింది అనగలరా?' గుడ్డలు ఆటంకాన్ని తొలగించగలవు కాని వాటంతట అవి చీకటిని పారద్రోలలేవు. కాంతే చీకటిని పారద్రోలగలదు.

అదే సూత్రాన్ని ఇక్కడ అన్వయిస్తే శ్రవణం జ్ఞానాన్ని పెంపొందిస్తుంది; జ్ఞానం మాత్రమే సంసారాన్ని పారద్రోలుతుంది. మననం, నిదిధ్యాసనం మన మనస్సుకు అడ్డంగా ఉన్న రెండు నల్లగుడ్డలనే ఆటంకాలను పారద్రోలటానికి తోడ్పడతాయి. నిదిధ్యాసనం అంటే జ్ఞానం పొందాక చేసే ఉపాసన కాదు; జ్ఞాననిష్ఠలో నిలబడటానికి, అప్రతిబంధక జ్ఞానం కలగటానికి తోడ్పడుతుంది. ఈ అప్రతిబంధక జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది. దీని తర్వాత ఏమీ కర్మ, ఉపాసన చెయ్యనవసరం లేదు. ఆ విధంగా శ్రవణం అజ్ఞాన నివృత్తి చేస్తే, మననం సంశయ నివృత్తి చేస్తే, నిదిధ్యాసనం విపర్యయ నివృత్తి చేస్తుంది. మూడూ మూడు భిన్నపాత్రలు ధరిస్తాయి కాని మూడూ కలిస్తేనే జ్ఞానంలో నిలబడ గలుగుతాము కాని దాని తర్వాత బ్రహ్మ ఉపాసనను నిర్దేశించలేదు శాస్త్రం.

ఇంతవరకూ శంకరాచార్యులవారు అనేక వాదనలద్వారా వేదాంతంలో ఎక్కడా కర్మను కాని, ఉపాసనను కాని నిర్దేశించలేదని నిరూపించుకుంటూ వచ్చారు. కర్మ కాయికకర్మ అయితే, ఉపాసన మానసికకర్మ అవుతుంది. వేదాంతంలో కర్మకు ఏమాత్రం ఆస్కారం లేదు. అది బ్రహ్మజ్ఞానాన్ని మాత్రమే ఇస్తుంది.

**కర్మణా న మోక్షః। ఉపాసనయా న మోక్షః। జ్ఞానేన ఏవ మోక్షః**

### 19. జ్ఞానం కూడా మానసిక కర్మ కాదా?

కర్మవల్ల మోక్షం రాదు, ఉపాసనవల్ల మోక్షం రాదు, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది అంటుంది అద్వైతం. దానికి వృత్తికారుని వాదన, 'జ్ఞానం కూడా ఒక విధమైన కర్మే కదా!' ఉపాసనను మానసిక కర్మ అంటున్నారు; జ్ఞానం కూడా మనస్సులో కలిగేదే. వృత్తిలో మార్పువల్ల జ్ఞానం వస్తుంది. అలాంటప్పుడు

మానసిక కర్మ అయిన ఉపాసనవల్ల మోక్షం రాదని మీరు అంటే, జ్ఞానంవల్ల కూడా మోక్షం రాదని నేను అంటాను అంటాడు వృత్తికారుడు.

**శంకరులవారి జవాబు** – దీనికి శంకరాచార్యులవారు సాంకేతికమైన, చాలా ముఖ్యమైన జవాబును ఇస్తున్నారు. జ్ఞానం కర్మ కిందికి రాదు. ధ్యానం కర్మలోకి వస్తుంది కాని, నిదిధ్యాసనం కర్మలోకి రాదు. ఎందుకు? దీనికి మూడు కారణాలు చూపిస్తున్నారు శంకరులవారు.

ఎ) **వస్తుతంత్రం–కర్తృతంత్రమ్** – జ్ఞానం వస్తుతంత్రం. అంటే జ్ఞానం మనం జ్ఞానం పొందే వస్తువుమీద ఆధారపడివుంటుంది. కర్మ, కర్తృతంత్రం అంటే కర్మ, ఆ కర్మ చేసే వ్యక్తిమీద ఆధారపడివుంటుంది. ఉదాహరణకు స్వామీజీ బ్రహ్మసూత్రములమీద చేస్తున్న బోధనే తీసుకుందాము. అది మనం వింటున్నాము. ఆ వింటున్నప్పుడు మనం రెండురకాల పనులు చేస్తున్నాము. చెవులతో వింటున్నాము; ఆయన చెప్పిన విషయాలను రాసుకుంటున్నాము. అంటే మనం శ్రోత, కర్త అవుతున్నాము.

ఇప్పుడు మనం చేసే ఈ రెండు కర్మల మధ్య భేదాన్ని గమనిస్తే, శ్రోతగా మనం ఏంవింటామో అది మన చేతిలో లేదు. స్వామీజీ ఏంచెపితే అది వినాలి. అంటే అది ఆబ్జెక్టుమీద లేదా ప్రమేయంమీద ఆధారపడివుంది.

**జ్ఞానం ప్రమేయతంత్రమ్। న తు ప్రమాణతంత్రమ్**

అదే కర్మగా మనం చేసే పని చూస్తే, అది పూర్తిగా మన చేతిలో ఉంది. అంటే స్వామీజీ చెప్పినదాంట్లో ఏం రాసుకోవాలి అనేది మన చేతిలో ఉంది. కావాలనుకుంటే ఆయన చెప్పిన ప్రతిదీ అక్షరం పొల్లుపోకుండా రాసుకోవచ్చు, లేదా ముఖ్యమైన అంశాలను పొడిఅక్షరాలతో రాసుకోవచ్చు, లేదా గుర్తుంచుకోవాల్సిన సంస్కృతపదాలను మాత్రం రాసుకోవచ్చు. ఒక్కోసారి ఇలా పొడిపొడి అక్షరాలతో రాసుకుంటే, తర్వాతెప్పుడో దాన్ని చూసుకుంటే మనకే అర్థం కాకపోవచ్చు కూడా. వ్యావహారిక సత్యానికి వ్యా.స. అనీ, పారమార్థిక సత్యానికి పా.స. అనీ రాసుకుంటే, తర్వాతెప్పుడో చూస్తే వ్యా.స.; పా.స.లు ఏమిటో అర్థం కాకపోవచ్చు. ఏది ఏమైనా ఏం రాసుకోవాలో మన చేతిలో ఉంది కాని ఏం వినాలో మాత్రం మన చేతిలో లేదు.

జ్ఞానం వస్తుతంత్రం, కర్మ కర్తృతంత్రం.

బి) **ప్రమాణతంత్రం-చోదనతంత్రమ్** - ఇంచుమించు ముందు చూసిన భేదం వంటిదే కాకపోతే ఇంకొక కోణంలోంచి చూస్తాము. జ్ఞానం మనం వాడే ప్రమాణంమీద ఆధారపడివుంటుంది. కర్మ శాస్త్రంమీద ఆధారపడివుంటుంది.

మనం అనుభవించే ప్రపంచం మనం వాడే ప్రమాణంమీద ఆధారపడి ఉంటుంది. శ్రోత్రేంద్రియాన్ని వాడితే శబ్దప్రపంచాన్ని అనుభవిస్తాము; చక్షురింద్రియాన్ని వాడితే రూపప్రపంచాన్ని అనుభవిస్తాము. అందువల్ల ప్రమాత అయిన మనం పొందే జ్ఞానం, మనం వాడే ప్రమాణంమీద ఆధారపడివుంటుంది; కాని ప్రమాత అయిన మనం ఏ ప్రమాణాన్ని వాడాలో నిర్ణయించలేము. అందువల్లనే చక్కగా ధ్యానం చేసుకుందామనుకుని ఇలా కూర్చుంటామో లేదో, పొరుగింటి రేడియోలోంచి సినిమా పాటలు దూసుకువచ్చి, మన చెవులను హెూరెత్తిస్తాయి. మనకు ఇష్టమున్నా లేకపోయినా, అవి మన చెవుల్లోకి దూరతాయి. అందువల్ల జ్ఞానం ప్రమాణతంత్రం.

అదే కర్మ విషయానికి వచ్చేసరికి కర్మ చోదనతంత్రం. చోదనతంత్రం అంటే శాస్త్రంమీద ఆధారపడివుంది. మనం ఎటువంటి కర్మను చేయాలి లేదా ఎటువంటి ఉపాసనను చేయాలి అనేది శాస్త్రం నిర్దేశిస్తుంది. దానికి సంబంధించిన విధివాక్యాలు చెబుతుంది. ఉదాహరణకు ఛాందోగ్యోపనిషత్తులో పంచాగ్నివిద్య అనే ఉపాసన వస్తుంది. అందులో పురుషుణ్ణి అగ్నిగా, స్త్రీని అగ్నిగా చూడమని నిర్దేశిస్తుంది శాస్త్రం. దాన్ని చోదనతంత్రం లేదా శాస్త్రవిధి అంటారు.

పురుషుణ్ణి పురుషునిగా చూడటం జ్ఞానం; పురుషుణ్ణి అగ్నిగా భావించటం చోదనతంత్రం. రాయిని రాయిగా చూడటం జ్ఞానం; రాయిని విష్ణువుగా చూడటం ఉపాసన అంటే మానసికకర్మ. రాయిని రాయిగా చూడటంలో మనకు ఛాయిస్ లేదు. ఎందుకు? అది సత్యం కాబట్టి. సత్యాన్ని ఉన్నదున్నట్టుగా చూడాలి. కాని రాయిమీద భగవంతుణ్ణి ఆవాహన చేసి, ఉపాసన చేయటంమీద మనకు ఛాయిస్ ఉంది.

జ్ఞానం ప్రమాణతంత్రం కర్మ చోదనతంత్రం.

సి) **ఆప్త్యాది ఫలం రాదు-వస్తుంది** - ఇంతకుముందు కూడా కర్మ నాలుగు రకాల ఫలాలను ఇస్తుందని చూశాము.

**నాలుగు రకాల ఫలాలు –**

**ఆప్తి** – చేరటం. పండిన పంటను ఒకచోటనుంచి ఇంకొకచోటికి చేర్చటం.

**ఉత్పత్తి** – కొత్తగా పుట్టించటం. విత్తనాలు వేసి పంటను పండించటం.

**వికారం** – మార్పు చెందటం. బియ్యాన్ని అన్నంగా వండటం.

**సంస్కారం** – శుద్ధి చెయ్యటం. వడ్లను దంచి పొట్టు తీయటం.

ఇప్పుడు ఈ ఫలాలు జ్ఞానానికి వర్తిస్తాయో లేదో చూద్దాము.

**ఆప్తి** – గంగోత్రి గురించి ఒక పుస్తకంలో చదివి, దానికి సంబంధించిన జ్ఞానం పొందుతాము. కాని దానివల్ల గంగోత్రికి వెళ్ళము.

**ఉత్పత్తి** – మామిడిచెట్టుని ఎలా పెంచాలనే విషయంమీద మనకు పూర్తి జ్ఞానం ఉంది. కాని దానివల్ల మామిడిచెట్టును ఉత్పత్తి చెయ్యలేము.

**వికారం** – అద్దం ముందు నిల్చుంటే, విపరీతంగా లావెక్కామనే జ్ఞానం కలుగుతుంది. అంతమాత్రాన లావు కరిగిపోయి, నాజూకుగా మారలేము కదా!

**సంస్కారం** – నెలరోజులు ఊరు వెళ్ళి వస్తే, ఇల్లంతా దుమ్ముకొట్టుకుపోయి ఉందనే జ్ఞానం ఇంటిని చూసీచూడగానే కలుగుతుంది. అంతమాత్రాన అశుద్ధంగా ఉన్న ఇల్లు శుద్ధంగా మారిపోదు.

**చిత్తస్య శుద్ధయే కర్మ న తు వస్తూపలబ్ధయే**
**వస్తుసిద్ధిర్విచారేణ న కించిత్కర్మకోటిభిః** – వివేక చూడామణి 11

చిత్తశుద్ధి పొందాలంటే కేవలజ్ఞానం చాలదు; దానికి కర్మ చేయాలి. కాని ఆత్మను శుద్ధి పొందించటానికి కర్మ అవసరం లేదు. ఆత్మ నిత్యశుద్ధం.

జ్ఞానం పొందటంవల్ల ఈ ఫలాలేవీ రావు కాబట్టి జ్ఞానం కర్మలోకి రాదు. ఈ కారణాలను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

| జ్ఞానం | కర్మ |
|---|---|
| ఎ) వస్తుతంత్రం | కర్తృతంత్రం |
| బి) ప్రమాణతంత్రం | చోదనతంత్రం |
| సి) ఆప్త్యాది ఫలం రాదు | ఆప్త్యాదిఫలం వస్తుంది |

### 20. ఆత్మజ్ఞానం ఏఫలాన్నీ ఇవ్వకపోతే, మోక్షాన్ని మాత్రం ఎలా ఇస్తుంది?

జ్ఞానంవల్ల మోక్షం వస్తుందని అద్వైతం చెబుతున్నది. అది ప్రాథమిక అంశం. కాని అద్వైత వేదాంతులు జ్ఞానానికి కర్మకు వచ్చే ఫలమేమీ రాదని నిరూపించారు కదా. కర్మఫలాల్లో ఉత్పత్తి ఒక ఫలం. ఉత్పత్తి చెందనప్పుడు మోక్షం ఎలా వస్తుంది? మోక్షం రాదంటే ప్రాథమిక అంశాన్నే నిషేధిస్తున్నట్టు అవుతుంది అంటున్నాడు వృత్తికారుడు.

**శంకరులవారి జవాబు** – జ్ఞానం మోక్షాన్ని ఉత్పత్తి చేస్తుందని ఎవరు అన్నారు? జ్ఞానం నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ముక్తపురుషుణ్ణే అనే సత్యాన్ని వెల్లడిచేస్తుంది. అంటే జ్ఞానం కర్మఫలాల్లోని నాలుగు ఫలాలలోనూ ఏదీ ఇవ్వదు; అది ఒక సత్యాన్ని వెల్లడి చేస్తుంది అంతే.

వేదాంతశాస్త్రం నేనే బ్రహ్మను అని బోధిస్తుంది. ఆ జ్ఞానం పొందితే నేను ముక్తపురుషుణ్ణి అని అర్థం చేసుకుంటాను. దాని తర్వాత ఇంకేమీ చెయ్యనవసరం లేదు. కాబట్టి జ్ఞానం కర్మకాదు, కర్మ చెయ్యనవసరం లేదు.

జ్ఞానం మోక్షాన్ని ఇవ్వదు. నేను ముక్తపురుషుణ్ణి అనే సత్యాన్ని వెల్లడిచేస్తుంది.

### 21. అయితే శాస్త్రంలో కర్మకాండ ఎందుకు ఉంది?

కర్మతో ప్రమేయం లేనప్పుడు అసలు వేదపూర్వభాగం ఎందుకు ఉంది, శాస్త్రం ఎందుకు కర్మకాండను, అందులోని అనేక యజ్ఞయాగాదులను విధించింది?

**శంకరులవారి జవాబు** – ఒక విషయం బాగా అర్థం చేసుకోవాలి మనం. జ్ఞానం కర్మకాదు, జ్ఞానం పొందాక కర్మ చెయ్యనవసరం లేదు. అలాగే జ్ఞానం ఉపాసన కూడా కాదు, జ్ఞానం పొందాక ఉపాసన చెయ్యనవసరం లేదు. కాని జ్ఞానం పొందేముందు కర్మ చెయ్యాలి. ఉపాసన కూడా చెయ్యాలి. అందువల్ల కర్మకాండ, ఉపాసనకాండ పూర్తిగా నిష్ప్రయోజనం కాదు. కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం పాటించి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానమార్గానికి వచ్చి, శ్రవణ మనన నిదిధ్యాసనలు చేసి, జ్ఞానం పొందితే మనం ముక్తపురుషులమని అర్థం చేసుకుంటాము.

కర్మకాండ సాధన చతుష్టయ సంపత్తి ఇవ్వటానికి; అంటే జ్ఞానయోగ్యతా ప్రాప్తి ఇవ్వటానికి వేదంలో చేర్చబడింది.

**కర్మణా న మోక్షః ఉపాసనయా న మోక్షః జ్ఞానేన మోక్షః॥**

ఇక్కడితో శంకరాచార్యులవారు వృత్తికారమత ఖండన ముగిసింది. దీనితో 'తు' పదవిశ్లేషణ కూడా ముగిసింది. ఈ వాదనల సారాంశం కర్మ, ఉపాసనలు జ్ఞానయోగ్యతకు పనికివస్తాయి కాని జ్ఞానం పొందాక, కర్మ కాని, ఉపాసన కాని అవసరం లేదు. కేవలజ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది. రజ్జుసర్పజ్ఞానం దీనికి ఉదాహరణ.

| వాదనల ముందు పూర్వపక్షి ధోరణి | వాదనల తర్వాత తేలిన నిజం |
|---|---|
| కర్మమోక్షాన్ని ఇస్తుంది | జ్ఞానం మోక్షాన్ని ఇస్తుంది |
| కర్మ మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది | జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది |
| జ్ఞానం అప్రమాణం | కర్మ అప్రమాణం |

## ఉపసంహారం – అధికరణ నిర్ణయం

ఈ సూత్రంతో ఈ అధికరణం ముగిసింది కాబట్టి, ఇప్పుడు అధికరణ నిర్ణయం చేయాలి. ఈ అధికరణం పేరు సమన్వయాధికరణము. ఒక అధికరణంలో ఐదు అంశాలు ఉండాలి. అవి – విషయః, సంశయః, పూర్వపక్షః, ఉత్తరమ్, సంగతి.

1. **విషయః** – విషయం. అంటే చర్చిస్తున్న అంశం. ఈ అధికరణంలో చర్చించిన అంశం మొత్తం వేదాంతశాస్త్రం.

2. **సంశయః** – సంశయం. విషయం కర్మపరమా, బ్రహ్మపరమా? బ్రహ్మజ్ఞానం పొందితే చాలా, దాని తర్వాత ఏదైనా కర్మకాని, ఉపాసన కాని చేయాలా?

3. **పూర్వపక్షః** – పూర్వపక్షి వాదన. వేదాంతశాస్త్రం కర్మపరం అంటాడు పూర్వపక్షి. కర్మను సూచించే వాక్యాలే ప్రమాణం అంటాడు.

**ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**

కేవలజ్ఞానంవల్ల మోక్షం రాదు అంటారు పూర్వమీమాంసకులు. కాకపోతే జ్ఞానానికి కర్మ జోడించాలని భాట్టమతం వారు అంటే, ఉపాసన జోడించాలని ప్రాభాకరమతం వారు అంటారు. కాని ఇద్దరూ ఏకగ్రీవంగా జ్ఞానం ఒక్కటే చాలదు అంటారు.

4. **ఉత్తరమ్** – అద్వైతసిద్ధాంతి జవాబు. జ్ఞానం పొందితేనే చాలు, ఉత్తమ పురుషార్థమైన మోక్షం వస్తుంది. దాని తర్వాత కర్మగాని, ఉపాసన గాని చేయనవసరం లేదు. ఇది బుద్ధిలో పొందే మార్పు. ఆత్మ అజ్ఞానం సంసారానికి కారణం. ఆత్మ అజ్ఞానం తొలిగితే సంసారం పోతుంది. ఆత్మ అజ్ఞానం తొలగాలంటే, ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గం.

5. **సంగతి** – సంబంధం. ఈ అధికరణానికీ, ముందు అధికరణానికీ మధ్య ఉన్న సంబంధాన్ని సంగతి అంటారు. ఇక్కడ సంబంధాన్ని ఆక్షేపసంగతి అంటారు. అంటే మూడవ అధికరణంలో పూర్వపక్షి చెప్పిన అభ్యంతరానికి ఇందులో జవాబు వస్తుంది.

మూడవసూత్రం – శాస్త్రయోనిత్వాత్. వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ అని ఆ సూత్రం అర్థం. దానికి పూర్వపక్షులు అభ్యంతరం చెప్పారు. వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ కాదు, కర్మ అంటారు వారు.

దానికి జవాబు చాలా వివరంగా ఈ అధికరణంలో చూశాము. వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం కర్మ కాదు, బ్రహ్మ మాత్రమే అని చూశాము.

**తత్తు సమన్వయాత్**

దీనితో నాలుగవ సూత్రం అయిపోయింది. దీనితో నాలుగవ అధికరణం అయిన **సమన్వయాధికరణమ్** అయిపోయింది. దీనితో నాలుగవ సూత్రం అయిన **తత్తు సమన్వయాత్** మీద భాష్యం అయిపోయింది. దీనితో **చతుస్సూత్రీ భాష్యమ్** కూడా అయిపోయింది.

***

# సూత్రము 4 - ముఖ్యమైన అంశములు

## తత్తు సమన్వయాత్

సామాన్య విచారణ

అధికరణం పేరు – సమన్వయాధికరణమ్

ఇది చాలా ముఖ్యమైన సూత్రం. మొదట అధ్యాయానికి సమన్వయ అధ్యాయము అనే పేరు దీనివల్లనే వచ్చింది.

ఈ సూత్రం సామాన్య అర్థం – బ్రహ్మతాత్పర్యవిషయం. షడ్లింగవిచారణద్వారా వేదాంతశాస్త్రంలో బ్రహ్మతాత్పర్యవిషయం అని తెలుస్తుంది. దీన్న సమన్వయం అంటారు.

**అనుమాన వాక్యం – బ్రహ్మ వేదాంతశాస్త్రవిషయః సమన్వయాత్ ధర్మవత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రంయొక్క విషయం అని సమన్వయంవల్ల చెప్పగలము. దీనికి దృష్టాంతం ధర్మం

**విషయవాక్యం –** అన్ని వేదాంత వాక్యాలు. ఉదాహరణకు కొన్ని చూద్దాము.

| | | |
|---|---|---|
| **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్** | **– ఛాందోగ్యమ్** | **– సామవేదమ్** |
| **అయమాత్మా బ్రహ్మ సర్వాను భూః** | **– బృహదారణ్యకమ్** | **– యజుర్వేదమ్** |
| **బ్రహ్మైవేదమమృతం పురస్తాత్** | **– ముండకమ్** | **– అథర్వణవేదమ్** |
| **ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్** | **– ఐతరేయమ్** | **– ఋగ్వేదమ్** |

**పదవిశ్లేషణ**

**తత్తు సమన్వయాత్ = తత్+ తు+ సమన్వయాత్**

**తత్ –** అది, ఆ బ్రహ్మ. **బ్రహ్మ శాస్త్రయోని** అని ముందు సూత్రములనుంచి తెచ్చుకుంటాము. దీన్ని అనువృత్తి అంటారు.

తత్ = తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మశాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్యవిషయం

తు – తరువాత చూస్తాము.

**సమన్వయాత్ – తాత్పర్యవిషయత్వాత్.** బ్రహ్మ వేదాంతశాస్త్రంలో తాత్పర్యవిషయం అని షడ్లింగవిచారణద్వారా చెప్పగలము.

**ఉపక్రమోఽపసంహారౌ అభ్యాసోఽపూర్వతాఫలమ్ అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే**

దీనికి నమూనా ఛాందోగ్యపనిషత్ - ఆరవ అధ్యాయం

ఎ) ఉపక్రమ ఉపసంహారం - ఏ విషయంతో మొదలైందో ఆ విషయంతో ముగియాలి

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్। (మొదట)**

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్వమసి శ్వేతకేతో(చివర)**

బ్రహ్మ గురించి మొదలై బ్రహ్మతో ముగుస్తుంది.

బి) అభ్యాసః - ఒక విషయాన్ని పదే పదే చెప్పాలి - 9 సార్లు తత్త్వమసి శ్వేతకేతో అని వస్తుంది

సి) అపూర్వతా - ఆ విషయం కొత్త విషయమై ఉండాలి, ఇంతకు ముందే తెలిసినది కాకూడదు - వేరే ప్రమాణాలకు అందదు.

డి) ఫలమ్ - ఆ విషయాన్ని తెలుసుకుంటే కలిగే ఫలం - జీవన్ముక్తి, విదేహముక్తి

ఇ) అర్థవాదః - ఆ విషయాన్ని స్తుతించాలి - **ఏక కారణవిజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి**

ఎఫ్) ఉపపత్తిః - తర్కం ఉపయోగించాలి - **బ్రహ్మసత్యం కారణత్వాత్ జగన్మిథ్యా కార్యత్వాత్**

**వాచా౽౽రమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్**

ఈ కారణాలవల్ల బ్రహ్మ శాస్త్రవిషయం

**తు -** మాత్రమే - బ్రహ్మ మాత్రమే శాస్త్రవిషయం

తు - దీన్ని అవధారణ అంటారు. వ్యావృత్తి అంటే ఖండన

**తు - తు శబ్దః పూర్వపక్ష వ్యావృత్యర్థః-** తు ద్వారా తక్కిన పూర్వ పక్షులందరినీ ఖండిస్తున్నారు.

**తత్తు సమన్వయాత్** - పూర్తి అర్థం

**బ్రహ్మ వేదాంతశాస్త్రవిషయః సమన్వయాత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రానికి చెందిన జ్ఞానభాగంయొక్క విషయవస్తువు అని సమన్వయంవల్ల చెప్పగలము.

తత్ - తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్య విషయం. బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం కర్మ, ఉపాసన ఏవీకావు.

మొదటి అధ్యాయంలో వ్యాసాచార్యులువారు ముఖ్యంగా సాంఖ్యను ఖండిస్తారు. అందువల్ల ఇప్పుడు శంకరులవారు పూర్వమీమాంసకులను ఖండిస్తున్నారు.

పూర్వమీమాంసా దార్శనికుడు జైమిని – ధర్మసూత్రములు
దీనికి శబరస్వామి భాష్యం రాశారు. శంకరులువారు వీరిని గౌరవిస్తారు. శాబరభాష్యానికి కుమారిలభట్టు – భాట్టమీమాంస;– ప్రభాకరుడు– ప్రాభాకరమీమాంస వ్రాశారు.

**వారి సిద్ధాంతాలలో సమాన అంశాలు**

వేదాలలో రెండు రకాల వాక్యాలు – **సిద్ధబోధక వాక్యాని, కార్యబోధక వాక్యాని**
**సిద్ధ బోధక వాక్యాని అప్రయోజనాని, కార్యబోధక వాక్యాని సప్రయోజనాని**
**సిద్ధబోధక వాక్యాని అప్రయోజనత్వాత్ అప్రమాణాని**
**ప్రమాణం నిర్వచనం – అనధిగత అబాధిత ఫలవత్ అర్థబోధకం ప్రమాణమ్**
**ఆధారం – ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**
కార్యబోధకవాక్యాలు ప్రమాణం, సిద్ధబోధకవాక్యాలు అప్రమాణం.
అందువల్ల సిద్ధబోధక వాక్యాలను, కార్యబోధక వాక్యాలతో కలపాలి.
భాట్టమీమాంస – జ్ఞానకాండ వాక్యాలను కర్మకాండతో కలపాలి.
ప్రాభాకర మతం – జ్ఞానకాండ వాక్యాలను అందులోనే ఉన్న ఉపాసన వాక్యాలతో కలపాలి.

## పూర్వమీమాంసకులతో వాదోపవాదాలు

**1. పూర్వమీమాంస వాదన** – వేదాంతం నేర్చుకుంటే చాలదు; దాని తరువాత కర్మ చేయాలి.

**శంకరులవారి జవాబు** – కర్మసంబంధం కుదరదు

**ఎ)** కర్మ సంబంధం అవసరం లేదు – వేదాంతమే ముఖ్య పురుషార్థమైన మోక్షాన్ని ఇస్తుంది –

**అనుభవ ప్రమాణం – రజ్జుసర్పభ్రాంతి – జ్ఞానమాత్రేన మోక్షఫలం భవతి**
**శ్రుతి ప్రమాణం – జ్ఞానాదేవ కైవల్యం, బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి**

**బి)** కర్మ సంబంధం కుదరదు. వేదాంతం కర్మను నిందిస్తుంది – **కర్మణా నిందితత్వాత్**
**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసు**
**ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపాః**

**సి)** కర్మ సంబంధం అసాధ్యం – **కర్మ సంబంధ అసాధ్యత్వాత్**
ద్వైతభావన – **జ్ఞానం నేహ నానాస్తి కించన** అంటుంది
కర్తృత్వభావన – నువ్వు అకర్తా అంటుంది
వర్ణాశ్రమ ధర్మాలు – నువ్వు అగోత్రం అంటుంది

**2. వాదన –** బ్రహ్మ నాస్తి. అసలు బ్రహ్మ లేనే లేదు.

**జవాబు –** షడ్లింగవిచారణద్వారా బ్రహ్మ ఉన్నాడు –

**బ్రహ్మ అస్తి వేదాంత తాత్పర్య విషయత్వాత్**

బ్రహ్మ లేకపోతే స్వర్గం కూడా లేదు.

**3. వాదన –** ఎ) బ్రహ్మ సాధ్యం కాదు, సాధనం కాదు. అటువంటి బ్రహ్మ ఎలా ఉంటాడు? సాధ్యసాధన విలక్షణం బ్రహ్మ అంటారు మీరే.

**జవాబు –** బ్రహ్మ సాధ్యం కాదు , సాధనం కాదు, బ్రహ్మ సాధకుడు. బ్రహ్మ లేడు అంటే నేను లేనని అన్నట్టు అవుతుంది

**వాదన–** బి) బ్రహ్మ సాధ్యం కాదు, సాధనం కాదు కాబట్టి బ్రహ్మవల్ల ప్రయోజనం కూడా లేదు.

**జవాబు–** బ్రహ్మజ్ఞానం నా జీవత్వభావనను తొలగిస్తుంది.

**జీవభావ నివృత్తి ఏవ మోక్షరూప పరమపురుషార్థః.**

**4. వాదన –** బ్రహ్మ ఆత్మ అయితే, స్వయం ప్రకాశక ఆత్మ గురించి శాస్త్రం కొత్తగా చెప్పేది ఏముంది? ఆత్మ సర్వదా ప్రసిద్ధం, ప్రమాణం తెలియని విషయం గురించి చెప్పాలి.

**జవాబు –** ఆత్మగురించి పూర్తిగా తెలియదు.

**అహంకార రూపేణ ప్రసిద్ధః న తు సాక్షిరూపేణ**

**త్వం పదవాచ్యార్థ రూపేణ ప్రసిద్ధాః న తు లక్ష్యార్థ**

**బ్రహ్మత్వ విశేషజ్ఞానం** తెలియక పోవటంవల్ల సంసారిత్వ అధ్యాస జరుగుతున్నది.

**5. వాదన –** కర్మకాండ మాత్రమే ప్రమాణం, జ్ఞానకాండకాదు – కర్మకాండ పువ్వులు, జ్ఞానకాండ దారం; దారానికి పువ్వులతో కలిస్తేనే విలువ; అలా జ్ఞానకాండకి కర్మకాండతో కలుస్తేనే విలువ.

**జవాబు –** ఎ) జ్ఞానకాండ కూడా ప్రమాణమే (defensive argument)

బి) కర్మకాండ అప్రమాణం (offensive argument)

అబాధితమ్ చెల్లదు. కర్మకాండను జ్ఞానకాండ ఖండిస్తుంది – **నేహ నానాస్తి కించన**

**కర్మకాండస్య బాధితత్వాత్ అప్రమాణమ్**

అందువల్ల కర్మకాండ దారం, జ్ఞానకాండ పువ్వులు, కర్మకాండ జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తుంది

**వృత్తికారమతం**

వృత్తి అంటే లఘువ్యాఖ్యానం. అది చేసిన వ్యక్తి వృత్తికారుడు. అతని పేరు తెలియదు.

**బ్రహ్మ అస్తి; బ్రహ్మ జ్ఞానం అపి అస్తి; పరంతు కేవలజ్ఞానేన మోక్షః న భవేత్। బ్రహ్మ ఉపాసనేన మోక్షః భవతి**

**6. వాదన** – బ్రహ్మజ్ఞానం పొందాక ఉపాసన చేయాలి. చేస్తే పుణ్యం వస్తుంది, పుణ్యంవల్ల మాత్రమే మోక్షం వస్తుంది.

**ఆత్మా ఇత్యేవ ఉపాసీత (విద్యాసూత్రం)** – బృహదారణ్యకమ్

**జవాబు –** జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది అని చెప్పేవాక్యాలు చాలా ఉన్నాయి.

**తరతి శోకమాత్మవిత్** – ఛాందోగ్యమ్

**బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి**

**7. వాదన –** వేద అంటే ఉపాసన. ఇక్కడ వేద అన్నచోట ఉపాసన చెయ్యి అని అర్థం చేసుకోవాలి.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్ = బ్రహ్మ ఉపాసకః ఆప్నోతి పరమ్**

**తరతి శోకమాత్మవిత్ = ఆత్మ ఉపాసకః శోకం తరతిగా** తీసుకోవాలి

**జవాబు –** మామూలుగా జ్ఞానంవల్ల ఫలం రాదు నిజమే, కాని కొన్ని అసాధారణ సందర్భాలలో వస్తుంది. ఉదాహరణకు **రజ్జుసర్పభ్రాంతి.**

**8 వాదన –** బ్రహ్మజ్ఞానం అసాధారణ సందర్భంలోకి రాదు. కొన్ని ప్రత్యేక సందర్భాలు ఉన్నాయి నిజమే. రజ్జుసర్పభ్రాంతి ప్రత్యేక సందర్భమే కాని, బ్రహ్మజ్ఞానం అందులోకి రాదు.

ఎ) అనుభవ ప్రమాణం – బ్రహ్మజ్ఞానం పొందాక కూడా **సుఖదుఃఖాదిత్వభ్రాంతి** కనబడుతూనే ఉంది.

బి) శ్రుతి ప్రమాణం **– ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** అంటే శ్రవణం తర్వాత మనన, నిదిధ్యాసనలు చేయాలి అంటున్నది.

**బ్రహ్మ ఉపాసనయా మోక్షః**

**జవాబు – ఎ) బ్రహ్మ ఉపాసనయా మోక్షః న భవతి**

**బి) మోక్షం నిర్వచనం – అశరీరతా హి మోక్షః స శరీర తా హి సంసారః**

అశరీరత్వం ఉపాసనవల్ల రాదు. ఉపాసన శరీరంలో తారతమ్యాలు తెస్తుంది.

**9. వాదన** – అశరీరత్వ సిద్ధయే బ్రహ్మ ఉపాసన. అశరీరత్వం మోక్షం నిజమే. కాని బ్రహ్మ ఉపాసన అశరీరత్వాన్ని ఇవ్వచ్చు కదా

**జవాబు –** అశరీరత్వాన్ని ఉపాసనవల్ల పొందలేము. ఎందుకంటే ఆత్మస్వరూపం

సిద్ధం, ఉపాసనా ఫలం సాధ్యం. **సిద్ధస్యస్వరూపస్య ఉపాసనా సాధ్యత్వం నాస్తి**
**10 ఇంకొక పూర్వపక్షి వాదన –** అశరీరత్వం మోక్షం అయితే, జీవన్ముక్తి కుదరదు.
**జవాబు –** ఆత్మకు ఎప్పుడూ అశరీరత్వమే ఉంటుంది.
**ఎ) అది ఆత్మస్వరూపం – అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితమ్** – కఠ 1.2.22
**బి) ఆత్మ అసంగం – అసంగోహ్యామ్ పురుషః**
**సి) ఆత్మ అకర్తా – అందువల్ల కర్మఫలం అంటదు.**

**ఆత్మనః అశరీత్వం నిత్యసిద్ధమ్**

**11 వాదన – స శరీరత్వం కుదరక పోతే, స శరీరత్వం సంసారం ఎలా అవుతుంది?**
**జవాబు –** ఆత్మ సశరీరం కాదు, కాని ఆత్మను సశరీరంగా పొరపాటు పడతారు. ఇది అధ్యాస. ఇది అజ్ఞానంవల్ల ఏర్పడింది. కాబట్టి, జ్ఞానం పొందితే చాలు, మోక్షం వస్తుంది, ఉపాసన అవసరం లేదు.

మోక్షం రెండవ నిర్వచనం

**బ్రహ్మ భావః హి మోక్షః – మోక్షం నిత్యం, బ్రహ్మ నిత్యమ్**
**నిత్యవస్త్వేకం బ్రహ్మ। తద్వ్యతిరిక్తం సర్వమనిత్యమ్॥**

**మోక్ష ప్రాప్తి = బ్రహ్మప్రాప్తి**

**12 వాదన –** మోక్షాన్ని ఉపాసన ఫలంగా పొందగలమా?
**జవాబు ఎ) చతుర్విధఫలవిలక్షణః. కర్మ / ఉపాసన నాలుగు రకాల కర్మఫలాలను ఇస్తుంది. కాని అవి బ్రహ్మకు వర్తించవు.**

| | | |
|---|---|---|
| **1. ఆప్తి** | **– చేరటం** | **– బ్రహ్మ సర్వగతం** |
| **2. ఉత్పత్తి** | **– కొత్తగా పుట్టించటం** | **– బ్రహ్మ నిత్యం** |
| **3. వికారం** | **– మార్పు చెందటం** | **– బ్రహ్మ నిర్వికారం** |
| **4. సంస్కారం** | **– శుద్ధి చేయటం** | **– బ్రహ్మ నిత్యశుద్ధం, నిర్గుణం** |

**బి) అభ్యుపేద్య వాదన –** ఒకవేళ మోక్షం ఉపాసన ఫలం అయితే అది అనిత్యం అవుతుంది. మోక్షం నిత్యం అని పూర్వపక్షులు కూడా అంటారు.
సి) ఉపాసన వేదాంతసారం కాదు, కాలేదు **–** అని షడ్లింగ విచారణ చూపిస్తుంది. మోక్షం భవిష్యత్తులో వచ్చేది కాదు. **– తత్త్వమసి –** నువ్వు ఆ బ్రహ్మవై ఉన్నావు
**డి) శ్రుతి ప్రమాణం – సోఽయం మనుష్యలోకః। పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా। కర్మణా పితృలోకో। విద్యయా దేవలోకః॥** – బృహదారణ్యకమ్
కర్మ, ఉపాసనలవల్ల లోకప్రాప్తి. సన్న్యాసి వీటిని త్యజించి మోక్షం కోరుతాడు.
ఇ) **ప్రకరణభేదమ్–** కర్మ, ఉపాసనలు వేదపూర్వభాగంలో, జ్ఞానం వేదఉత్తరభాగంలో వస్తాయి. మోక్షం ఉపాసన ఫలం అయితే జ్ఞానం గురించి విడిగా ఎందుకు?

**బ్రహ్మ= అన్యత్రధర్మాత్ అన్యత్రాధర్మాత్**

**ఎఫ్) బ్రహ్మ ఆబ్జెక్టుకాదు.** బ్రహ్మ ఉపాసన కుదరదు – **దృగేవ న తు దృశ్యతే బ్రహ్మణః అప్రమేయత్వాత్ బ్రహ్మ ఉపాసనా న సంభవతి**

**13. వాదన –** బ్రహ్మ అప్రమేయం కాబట్టి ఉపాసన కుదరదు అంటే, బ్రహ్మజ్ఞానం కూడా కుదరదు. మూడవ సూత్రం చెల్లదు.

**జవాబు –** బ్రహ్మ స్వయంజ్యోతి. నిజానికి చైతన్యమే అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది.

**14. వాదన –**బ్రహ్మజ్ఞానం పొందనవసరం లేకపోతే గురువు, శాస్త్రం ఎందుకు? బ్రహ్మజ్ఞానంవల్ల మోక్షం వస్తుంది, దానికి శాస్త్రం ప్రమాణం, గురువుద్వారా అభ్యసించాలి అని ఎందుకు అంటారు?

**జవాబు –** బ్రహ్మజ్ఞానం అంటే అధ్యాస నివృత్తి; ఆత్మ అజ్ఞానం తొలగిస్తుంది. ప్రమాతృ ప్రమాణ ప్రమేయ రూప త్రిపుటినివృత్తి పరిచ్ఛేదనివృత్తి ఏవ ఆత్మజ్ఞానమ్. ఇది శాస్త్రం, గురువుద్వారానే పొందగలరు. శాస్త్రాన్ని **నిషేధరూప ప్రమాణం అంటారు.**

## కొన్ని వాక్యాలమీద వాదనలు

**15. వాదన – క్రియా సంబంధరహిత వాక్యం అప్రమాణం**

**జవాబు –** అలా అయితే నిషేధవాక్యం కూడా అప్రమాణ అవాలి. **ఉదా – హింసాన్న కుర్యాత్**

**16. వాదన –** వేదాంత శ్రవణేన మోక్షః నైవ సిధ్యతి. బ్రహ్మజ్ఞానం మోక్షం ఇస్తే, అందరూ ముక్తపురుషులు అవాలి.

**జవాబు –** వేదాంతం వింటే చాలదు. జీర్ణించుకోవాలి – శ్రుత బ్రహ్మ కాదు అవగత బ్రహ్మ అవాలి.

**17. వాదన –** జ్ఞానానంతరమ్ ఉపాసనా కర్తవ్యా. వేదాంతం నిదిధ్యాసనాన్ని ఎందుకు చెప్పాలి? **ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**

**జవాబు –** నిదిధ్యాసనం జ్ఞానం పొందాక చేసేదికాదు. అది కూడా జ్ఞానం పొందటంలో ఒక భాగం. అందువల్ల ఇది ఉపాసనలోకి రాదు.

**18. వాదన–** శ్రవణ మనన నిదిధ్యాసనలు జ్ఞానం పొందటానికి చేయాలని ఎలా చెప్పగలరు?

**జవాబు – శ్రవణం – అపరోక్ష జ్ఞానం; మననం – అప్రతిబంధక జ్ఞానం; నిదిధ్యాసనం – విపరీత భావనలు పోయి జ్ఞాననిష్ఠ**

**19. వాదన –** జ్ఞానం కూడా మానసిక కర్మకాదా? ఉపాసన మానసిక కర్మ అయితే, జ్ఞానం కూడా మానసిక కర్మ.

**జవాబు** – జ్ఞానం కర్మ కాదు

| **జ్ఞానం** | **కర్మ** |
| --- | --- |
| **ఎ) వస్తుతంత్రం** | **కర్తృతంత్రం** |
| **బి) ప్రమాణతంత్రం** | **చోదనతంత్రం** |
| **సి) ఆప్త్యాది ఫలం రాదు** | **ఆప్త్యాది ఫలం వస్తుంది** |

**20. వాదన –** ఆత్మజ్ఞానం ఏ ఫలాన్నీ ఇవ్వకపోతే, మోక్షాన్ని మాత్రం ఎలా ఇస్తుంది?

**జవాబు –** జ్ఞానం మోక్షాన్ని ఇవ్వదు, నేను ముక్తపురుషుడిని అనే సత్యాన్ని వెల్లడిజేస్తుంది

**21. వాదన** – అయితే శాస్త్రంలో కర్మకాండ ఎందుకు ఉంది?

**జవాబు** – కర్మకాండ సాధన చతుష్టయ సంపత్తి ఇవ్వటానికి.

**కర్మణా న మోక్షః ఉపాసనయా న మోక్షః జ్ఞానేన మోక్షః**

ఇక్కడితో తు పద విచారణ ముగిసింది

| **వాదనల ముందు పూర్వపక్షి ధోరణి** | **వాదనల తర్వాత తేలిన నిజం** |
| --- | --- |
| **కర్మమోక్షాన్ని ఇస్తుంది** | **జ్ఞానం మోక్షాన్ని ఇస్తుంది** |
| **కర్మ మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది** | **జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది** |
| **జ్ఞానం అప్రమాణం** | **కర్మ అప్రమాణం** |

**ఉపసంహారం – అధికరణ నిర్ణయం**

**1. విషయః** – విషయం – మొత్తం వేదాంత శాస్త్రం

**2. సంశయః** – సంశయం – విషయం కర్మపరమా? బ్రహ్మపరమా?

**3. పూర్వపక్షః** – పూర్వపక్షుల వాదన – కర్మపరం, జ్ఞానం ఒక్కటే చాలదు.

**ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యమ్ అతదర్థానామ్**

**4. ఉత్తరమ్ –** అద్వైతసిద్ధాంతి జవాబు – జ్ఞానం పొందితేనే చాలు; కర్మగానీ, ఉపాసనగానీ అవసరం లేదు.

**5. సంగతి –** సంబంధం –**ఆక్షేపసంగతి**

**మూడవ సూత్రం – శాస్త్రయోనిత్వాత్** – వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ.

**పూర్వపక్షి –** బ్రహ్మకాదు, కర్మ శాస్త్రవిషయం

**జవాబు – తత్తు సమన్వయాత్ –**. వేదాంతశాస్త్రంయొక్క తాత్పర్యవిషయం **బ్రహ్మ మాత్రమే, కర్మ కాదు.**

# చతుస్సూత్రీ సారాంశం

బ్రహ్మసూత్రములలోని మొదటి నాలుగు సూత్రములను చతుస్సూత్రీ అంటారు. వీటిల్లో నాలుగు ముఖ్యమైన అంశాలు చర్చించబడ్డాయి. నాలుగు సూత్రములూ చాలా ముఖ్యమైన సూత్రములు. అందువల్ల ఒక్కొక్క సూత్రం ఒక్కొక్క అధికరణంలో వస్తుంది. అంటే ఒక అధికరణానికి ఒకటే సూత్రం ఉంది. ఆ విధంగా చతుస్సూత్రీకి నాలుగు అధికరణాలు వచ్చాయి.

## అధికరణమ్ 1 – జిజ్ఞాసాధికరణమ్

**సూత్రం 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

**సాధన చతుష్టయ సంపత్తి అనంతరం బ్రహ్మజ్ఞానాయ వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనాని కర్తవ్యాని యస్మాత్ బ్రహ్మజ్ఞానాత్ ఏవ మోక్షః నతు కర్మణా**

సాధన చతుష్టయ సంపత్తి పొందాక, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల రాదు కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటంకోసం వేదాంతశాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి తీరాలి.

## అధికరణమ్ 2 – జన్మాద్యధికరణమ్

**సూత్రం 2 – జన్మాద్యస్య యతః**

**యస్మాత్ అభిన్ననిమిత్త ఉపాదాన కారణాత్ ఆనంద స్వరూపాత్ సర్వజ్ఞాత్ సర్వశక్తేః ప్రత్యక్ష ప్రపంచస్య సృష్టి స్థితి లయ సంభవతి తత్ బ్రహ్మ**

ఏ అభిన్న నిమిత్త ఉపాదాన కారణంనుంచి, ఆనందస్వరూపంనుంచి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునుంచి ఈ ప్రపంచంయొక్క సృష్టి స్థితి లయ జరిగిందో, ఆయన బ్రహ్మ.

## అధికరణమ్ 3 – శాస్త్రయోనిత్వాధికరణమ్

**సూత్రం 3 –** శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 1

బ్రహ్మ సర్వజ్ఞః వేదకర్తృత్వాత్

శాస్త్రంయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు.

శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ – తత్పురుష సమాసం

బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త

శాస్త్రయోనిత్వాత్ - పూర్తి అర్థం - 2
బ్రహ్మ న అనుమానవిషయః శాస్త్రవిషయత్వాత్
బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము.
శాస్త్రంద్వారానే తెలుసుకోగలము.
శాస్త్రం యోనిః ప్రమాణం యస్య - బహువ్రీహి సమాసం
శాస్త్రమును ప్రమాణంగా కలవాడు బ్రహ్మ

## అధికరణమ్ 4 - సమన్వయాధికరణమ్

**సూత్రం 4 - తత్తు సమన్వయాత్**

**బ్రహ్మ వేదాంతశాస్త్రవిషయః సమన్వయాత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రానికి చెందిన జ్ఞానభాగంయొక్క విషయవస్తువు అని సమన్వయంవల్ల చెప్పగలము.

తత్ - తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్య విషయం.

**తు = తుశబ్దః పూర్వపక్ష వ్యావృత్త్యర్థః**

బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం. కర్మ, ఉపాసన ఏవీకావు.

ఇప్పుడు ఈ నాలుగు సూత్రములను కలిపి చూస్తే దాన్ని అర్థం ఇలా వస్తుంది.

కర్మవల్ల కాని, ఉపాసనవల్ల కానీ మోక్షం రాదు. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది. దానికి అర్హత సాధనచతుష్టయ సంపత్తి. ఆ అర్హత పొందాక, బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. ఆ బ్రహ్మ ఈ ప్రత్యక్ష ప్రపంచంయొక్క సృష్టిస్థితిలయకారకుడు. ఆయన అభిన్న నిమిత్త ఉపాదానకారణం, ఆనందస్వరూపం, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. ఆ బ్రహ్మే వేదాల సృష్టికర్త. ఆ బ్రహ్మ గురించి వేదాలు బోధిస్తాయి. అంటే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం బ్రహ్మ మాత్రమే, కర్మ కానీ, ఉపాసన కానీ కాదు. అందువల్ల బ్రహ్మజ్ఞానం పొందితీరాలి.

శంకరభాష్యం ఆధారంగా చేసుకుని చెప్పబడిన ఈ చతుస్సూత్రీ భాష్యం నేర్చుకుంటే మొత్తం వేదాంతసారాన్ని అర్థం చేసుకున్నట్టుగా భావించవచ్చు. వీటిలో టూకీగా వచ్చిన వేదాంతసారం చాలా విస్తారంగా, చాలా విపులంగా తక్కిన సూత్రములలో వస్తుంది.

## బ్రహ్మసూత్రములనుంచి మననం చేయాల్సిన కొన్ని అంశాలు

- బ్రహ్మకు ప్రమాణం శాస్త్రం మాత్రమే, అనుమానం కాదు.
- శాస్త్రంలో ప్రమేయం బ్రహ్మ మాత్రమే; కర్మ, ఉపాసనలు కావు.
- మోక్షం పొందటానికి జ్ఞానమొక్కటే మార్గం; కర్మ, ఉపాసనలు కావు.
- జ్ఞానం పొందితేనే చాలు మోక్షం వస్తుంది; తర్వాత కర్మ, ఉపాసనలు చెయ్యనవసరం లేదు.
- జ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలి; స్వంతంగా ప్రయత్నించకూడదు.
- జ్ఞానాన్ని వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందాలి; వేరేమార్గం లేదు.
- కర్మవల్ల సాధనచతుష్టయ సంపత్తి మాత్రమే వస్తుంది; జ్ఞానం రాదు.
- కర్మ, జ్ఞానసముచ్చయం కుదరదు; అవి రెండూ రెండు భిన్నమార్గాలు.
- బ్రహ్మజ్ఞానం అంటే ఆత్మ అజ్ఞానం తొలగటం;కొత్తగా జ్ఞానం పొందటం కాదు.
- అహం బ్రహ్మ అస్మిలో అహమ్ అస్మి తెలుసు, బ్రహ్మ తెలియదు.
- అశరీరతా హి మోక్షః సశరీరతా హి సంసారః.

**హరిః ఓమ్**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు॥**

***

# శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్

విశ్వం దర్పణదృశ్యమాననగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం।
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ।।

బీజస్యాంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః।
మాయాకల్పితదేశకాలకలనా వైచిత్ర్యచిత్రీకృతమ్ ।
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యస్స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 2

యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ।
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 3

నానాచ్ఛిద్రఘటోదరస్థితమహాదీపప్రభాభాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాదికరణద్వారా బహిస్స్పందతే ।
జానామీతి తమేవ భాంతమనుభాత్యేతత్సమస్తం జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 4

దేహం ప్రాణమపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదుః।
స్త్రీబాలాంధజడోపమాస్త్వహమితి భ్రాంతా భృశం వాదినః ।
మాయాశక్తివిలాసకల్పితమహావ్యామోహసంహారిణో
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 5

రాహుగ్రస్తదివాకరేన్దుసదృశో మాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోపసంహరణతో యో?భూత్సుషుప్తః పుమాన్ ।

ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥6॥

బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమానమహమిత్యన్తః స్ఫురన్తం సదా ।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో ముద్రయా భద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥7॥

విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబన్ధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః ।
స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయాపరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥8॥

భూరమ్భాంస్యనలోఽనిలోఽమ్బరమహర్నాథో హిమాంశుః పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవ మూర్త్యష్టకమ్ ।
నాన్యత్కిఞ్చన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥9॥

సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిన్ స్తవే
తేనాస్య శ్రవణాత్తదర్థమననాద్ధ్యానాచ్చ స్కర్తనాత్ ।
సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిద్ధ్యేత్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్యమవ్యాహతమ్ ॥10॥

***